
ఆబాలగోపాలానికి సరళవ్యావహారికంలో

# భాగవతం



అయలసోమయాజుల నీలకంఠేశ్వర

## జగన్నాథశర్మ

ఆబాలగోపాలానికీ సరళవ్యావహారికంలో

# భాగవతం

అయలసోమయాజుల నీలకంఠేశ్వర

జగన్నాథశర్మ

**అ**యలసోమయాజుల నీలకంఠేశ్వర (ఎ.ఎన్) జగన్నాథశర్మ 13.4.1956లో పార్వతీపురంలో జన్మించారు. చిన్ననాటి నుండి కథలపట్ల మమకారం పెంచుకున్నారు. పదిహేనవ ఏటనే కథలు రాయడం ప్రారంభించారు. ఇప్పటి వరకూ సుమారుగా అయిదువందలకథలు రాశారు. శర్మగారి రాజధానికథలు (యువమాసపత్రిక), మాఊరి కథలు (పల్లకి వార పత్రిక), అగ్రహారంకథలు (ఆదివారం ఆంధ్రజ్యోతి) పాఠకుల ఆదరణ పొందాయి. కథలతోపాటు అగ్రహారం, శౌర్యచక్ర, చార్మినార్, ఛానెల్ 18 నవలలు రాశారు. సినిమా, టి.వి. రచయితగా కూడా జగన్నాథశర్మ ప్రసిద్ధులు.

**అరణి, అనీలజ, వైనతేయ, శివసతీపురంశర్మ, లహరి వీరి కలంపేర్లు.**

పాలపిట్ట, కథాసరిత్సాగరం, పంచతంత్రం, నెమలీక, మహాభారతం, భాగవతం ఆబాలగోపాలానికీ శర్మగారు ప్రత్యేకించి రాశారు. అవి విశేష పాఠకాదరణ పొందాయి. ప్రస్తుతం శర్మగారు ఆంధ్రజ్యోతి ప్రచురణ నవ్యవీక్లీకి సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు.

ఆబాలగోపాలానికీ సరళవ్యావహారికంలో

# భాగవతం




అయలసోమయాజుల నీలకంఠేశ్వర

**జగన్నాథశర్మ**



**అమరావతి పబ్లికేషన్స్**

**సాయిబాబా రోడ్, గుంటూరు - 522 007**

# BHAGAVATAM

*by* **A.N.JAGANNADHA SARMA**

---

**భాగవతం**

**జగన్నాథశర్మ**

ప్రథమ ముద్రణ

**ఆగస్టు 2014**

© **రచయిత**

*ముఖచిత్రం, లోపలిబొమ్మలు :* **పినిశెట్టి**

*లే అవుట్ డిజైన్ :* **కె. రామకృష్ణ**

ప్రచురణ

**అమరావతి పబ్లికేషన్స్**

*4-21-81, చైతన్యపురి, సాయిబాబా రోడ్,*

***గుంటూరు***–*522 007 ఫోన్: 0863-2333363, 92915 30714*

***సోల్ డిస్ట్రిబ్యూటర్స్: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్,*** *హైదరాబాద్*

***ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు***

*హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం,*
*గుంటూరు, తిరుపతి, ఒంగోలు, హనుమకొండ, కాకినాడ, కరీంనగర్, శ్రీకాకుళం*

***ముద్రణ:*** *రెయిన్‌బో ప్రింట్‌ప్యాక్, హైదరాబాద్*

వెల : **రూ. 175/-**

# అంకితం

*నవ్యవీక్లీలో ప్రచురించి ప్రోత్సహించిన*

*ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్*

**శ్రీ వేమూరి రాధాకృష్ణగారికి**

*డైరెక్టర్* **శ్రీమతి కనకదుర్గగారికి**

*ఈ 'భాగవతం'* **అంకితం.**

*–జగన్నాథశర్మ*

మంచిమిత్రులు

భాగవతోత్తములు

సంస్కృతి, సంగీత, సాహిత్య, నృత్య

నాటక సంస్థ వ్యవస్థాపకులు

శ్రీ **ఎస్.బాలచందర్**(గుంటూరు)గారికి

**కృతజ్ఞతలు.**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. వ్యాసుని వ్యధ:భాగవత రచన | ..... | 09 |
| 2. అశ్వత్థామ ఆగ్రహం:బ్రహ్మ శిరోనామకాస్త్రం | ..... | 13 |
| 3. పరీక్షిన్మహారాజు ప్రతాపం : కలి ప్రవేశం | ..... | 18 |
| 4. పరీక్షిత్తు ప్రాయోపవేశం:భాగవత పురాణం | ..... | 22 |
| 5. కాల పరిమాణం:జయవిజయుల శాపకారణం | ..... | 26 |
| 6. హరి హిరణ్యాక్షుల యుద్ధం | ..... | 31 |
| 7. దక్షయజ్ఞం:సతీదేవి పయనం | ..... | 36 |
| 8. దక్షయజ్ఞ ధ్వంసం – వీరభద్ర జననం | ..... | 41 |
| 9. ధ్రువ నక్షత్రం | ..... | 45 |
| 10. పుడమిని వెంటాడిన పృథుచక్రవర్తి | ..... | 50 |
| 11. జడభరతుడు:అజామిళుడు | ..... | 55 |
| 12. ఇంద్ర వృత్తాసురుల యుద్ధం | ..... | 59 |
| 13. ప్రహ్లాద నారాయణ జపం:హిరణ్యకశిపుని కోపం | ..... | 64 |
| 14. నరకేసరిగా ప్రత్యక్షమయిన శ్రీహరి | ..... | 68 |
| 15. గజేంద్ర మోక్షం | ..... | 73 |
| 16. క్షీరసాగరమథనం | ..... | 78 |
| 17. బలి చక్రవర్తి | ..... | 83 |
| 18. మత్స్యావతారం | ..... | 87 |
| 19. భక్త అంబరీష | ..... | 92 |
| 20. త్రిశంకుస్వర్గం | ..... | 96 |
| 21. సగరుల సాగరం | ..... | 101 |
| 22. తారా శశాంకం | ..... | 106 |
| 23. పరశురాముడు | ..... | 110 |
| 24. యయాతి | ..... | 114 |
| 25. శకుంతల | ..... | 119 |

| | | |
|---|---|---|
| 26. కృష్ణావతారం | ..... | 123 |
| 27. శ్రీకృష్ణ జననం | ..... | 128 |
| 28. వ్రేపల్లెవాసుడు శ్రీకృష్ణుడు | ..... | 132 |
| 29. పూతన శకటాసురుల మరణం | ..... | 137 |
| 30. చిన్నికృష్ణుడు:చిలిపి చేష్టలు | ..... | 141 |
| 31. గోవిందుడు అందరివాడు | ..... | 146 |
| 32. బలరాముని శౌర్య ప్రతాపాలు | ..... | 150 |
| 33. శ్రీకృష్ణ తాండవం | ..... | 155 |
| 34. గోపికా వస్త్రాపహరణం | ..... | 159 |
| 35. గోవర్ధన గిరిధారి | ..... | 164 |
| 36. రాక్షసుల అంతు చూసిన రణధీరుడు | ..... | 168 |
| 37. అక్రూరుడు | ..... | 173 |
| 38. కుబ్జ కేళివిలాసం | ..... | 177 |
| 39. కంసవధ | ..... | 182 |
| 40. బలరామకృష్ణుల విద్యాభ్యాసం | ..... | 186 |
| 41. జరాసంధునితో బలరామకృష్ణుల యుద్ధం | ..... | 191 |
| 42. రుక్మిణీకల్యాణం | ..... | 195 |
| 43. రుక్మిణీ శ్రీకృష్ణులు ఒక్కటయిన వేళ... | ..... | 200 |
| 44. సత్యభామ:శ్యమంతకమణి | ..... | 204 |
| 45. ప్రద్యుమ్నుడు–అనిరుద్ధుడు | ..... | 208 |
| 46. శివకేశవుల యుద్ధం | ..... | 213 |
| 47. ఊసరవెల్లి–పౌండ్రక వాసుదేవుడు | ..... | 217 |
| 48. ధర్మరాజు రాజసూయం:శ్రీకృష్ణ సహాయం | ..... | 222 |
| 49. శిశుపాలవధ | ..... | 226 |
| 50. కుచేలోపాఖ్యానం | ..... | 230 |
| 51. సుభద్రార్జునుల పెళ్ళి | ..... | 235 |
| 52. మహోన్నతుడు మాధవుడే | ..... | 240 |
| 53. యాదవకులంలో ముసలం | ..... | 244 |
| 54. మోక్షదాయకం శ్రీమద్భాగవతం | ..... | 249 |

# వ్యాసుని వ్యధ:భాగవత రచన

ద్వాపరయుగం చివరిదశలో కృష్ణద్వైపాయనుడు ఈ భరతభూమిపై అవతరించాడు. ఆయన తల్లి సత్యవతి. తండ్రి పరాశర మునీంద్రుడు. శ్రీమహావిష్ణువు అంశతో జన్మించిన కారణంగా కృష్ణద్వైపాయనుడు పుట్టుకతోనే యోగి అయినాడు. తపస్సు చేసి దైవానుగ్రహం సాధించి, సకల వేదశాస్త్రాలనూ అభ్యసించాడు. బ్రహ్మజ్ఞానాన్ని పొందాడు. త్రికాలవేత్తగా ప్రఖ్యాతి చెందాడు.

ఒకనాడు వేకువనే స్నానానికై కృష్ణద్వైపాయనుడు సరస్వతి నదీతీరానికి చేరుకున్నాడు. స్నానం చేసి, ఏకాంత స్థలంలో కూర్చున్నాడు. ధ్యానం చేయసాగాడు. ఆ ధ్యానంలో జరగబోయేదంతా ఆయనకు తెలియవచ్చింది. త్వరలోనే కలియుగం రానున్నది. ఆ యుగంలో మానవులంతా అవినీతిపరులై, అధర్మపరులై, పాపాలే ప్రాణ వాయువుగా జీవిస్తారు. వారి వల్ల లోకం అనేక ఆపదలకూ, అనర్థాలకూ లోనుకానున్నది.

అంతా తెలుసుకున్న కృష్ణద్వైపాయనుడు మానవకోటికి మేలు చేయ సంకల్పించాడు. వారికి ధర్మ స్వరూపాన్ని తెలియజెప్పాలనుకున్నాడు. అందుకు రాశిలా ఉన్న వేదాన్ని నాలుగు భాగాలు చేశాడు. వాటికి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం అని పేర్లు పెట్టాడు. అంతటితో ఆగిపోక మానవుల క్షేమం కోరి వర్ణాశ్రమ ధర్మాలనూ, పురాణేతిహాసాలనూ రచించాడు. వాటిని పంచమవేదంగా పేర్కొన్నాడు. ఈ పంచమవేదాన్ని సర్వ వ్యాప్తం చేసేందుకు శిష్యులకు బోధించాడు. ఋగ్వేదాన్ని పైలుడికీ, యజుర్వేదాన్ని జైమినికీ, సామవేదాన్ని వైశంపాయనుడికీ, అధర్వణవేదం సుమంతుడికీ సవివరంగా బోధించాడు. పంచమవేదం పురాణేతిహాసాలను రోమహర్షణుడికి చెప్పాడు. వారు, వారి శిష్యులకు చెప్పారు. ఆ విధంగా వేదాలు శాఖోపశాఖలయినాయి. అయితే స్త్రీలూ, శూద్రులూ వేదం చదివే అర్హత లేకపోవడంతో వారిని తరింపజేసేందుకు వేదసారాన్నంతా క్రోడీకరించి, సకల ధర్మాలనూ తెలియజేస్తూ కృష్ణద్వైపాయనుడు 'మహాభారతం' రాశాడు. వేదాలను వేరు చేయడంతో కృష్ణద్వైపాయనుణ్ణి 'వ్యాసుడు' అన్నారు. 'వేదవ్యాసుడు' అని కూడా అతన్ని పేర్కొన్నారు.

## వ్యాసుని మనోవ్యధ

వేదాలను విభజించినా, పురాణేతిహాసాలను విరచించినా వ్యాసునికి మనశ్శాంతి లేకుండా పోయింది. ఏదో తెలియని దిగులూ, చింతా అతన్ని వేధించసాగాయి. ఆ వేదనతోనే సరస్వతినదీ తీరాన కూర్చున్నాడు మళ్ళీ.

ఏమిటిది? ఎందుకీ వ్యధ? ఎలాంటి ఫలితాన్నీ ఆశించక లోకక్షేమం కోసం ఎంతో చేస్తున్నానే, దైవప్రార్థనే ప్రాణంగా జీవిస్తున్నానే, తనకెందుకిలా జరుగుతోంది? ఈ బాధ తీరేదెలా? అని వ్యాసుడు తలపట్టుకున్నాడు. అప్పుడక్కడికి నారదమహర్షి వేంచేశాడు. నారదుణ్ణి చూసి వ్యాసుడు చేతులు జోడించి నమస్కరించాడు. తగిన మర్యాదలు చేశాడు. ఉచితాసనాన్ని కల్పించాడతనికి. దీనంగా దిగులుగా ఉన్న వ్యాసుణ్ణి గమనించాడు నారదుడు. ఇలా అడిగాడు.

''పరబ్రహ్మ ఉపాసకుడివి, నువ్వేమిటి ఇలా ఉన్నావు? ఏమిటి నీ బాధ?''

''ఏం చెప్పమంటావు మహర్షీ! ఎందుకో, ఏమిటో నా మనసంతా అల్లకల్లోలంగా ఉంది. తెలియని బాధ పట్టి పీడిస్తోంది. వేదాలను వేరు చేశాను. పురాణేతిహాసాలు రచించాను. పంచమవేదం మహాభారతం విరచించాను. అయినా ఏదో లోపం. వెలితి. మనశ్శాంతి లేదు. త్రిలోక సంచారివి, నీకు తెలియని రహస్యం లేదు. చెప్పు మహర్షీ, నేను చేసిన తప్పేమయినా ఉందా? ఉంటే చెప్పు, క్షమించమని భగవంతుణ్ణి వేడుకుంటాను. లేదంటే మనశ్శాంతి కోసం నేనేం చెయ్యాలో చెప్పు. కాస్తంత పుణ్యం కట్టుకో.'' ప్రార్థించాడు వ్యాసుడు. సమాధానంగా ముందు సన్నగా నవ్వాడు నారదుడు. తర్వాత ఇలా అన్నాడు.

''ధర్మాలు నువ్వెన్నయినా చెప్పు, శ్రీహరి మహిమను చెప్పనప్పుడు అవన్నీ వ్యర్థాలే! నువ్వు రచించిన పురాణేతిహాసాల్లో భగవంతుడు ఒక పాత్రేగాని, ప్రధానం కాకుండాపోయాడు. అందుకే నీకు మనశ్శాంతి లేకుండాపోయింది.''

''అవునా'' ఆశ్చర్యపోయాడు వ్యాసుడు. తప్పు చేసిన వాడిలా చెంపలు వాయించుకున్నాడు.

''ఇప్పటికయినా మించిపోయింది లేదు, నువ్వు శ్రీమన్నారాయణుని లీలల్ని ప్రధానంగా చేసుకుని, ఓ గ్రంథాన్ని రచించు. అది లోకంలోని భాగవతోత్తములందరికీ శిరోధార్యమై, 'భాగవతం' పేర ప్రసిద్ధి చెందుతుంది. ఫలితంగా నువ్వు కూడా శ్రీమన్నారాయణునికి దగ్గరవుతావు'' అన్నాడు నారదుడు.

భాగవతం రచనకు అది ప్రధానమయింది.

నారదుని ఆదేశానుసారం వ్యాసుడు భాగవతం రచించాడు. సరస్వతినది పశ్చిమతీరాన 'శమ్యాప్రాసం' అని ఓ ఆశ్రమం ఉంది. అది మహా పుణ్యస్థలి. వ్యాసుడు అక్కడ దీక్షలో కూర్చుని, మనస్సంతా శ్రీహరిని నింపుకుని, భగవత్కథలతో నిండిన భాగవత సంహితను రచించాడు. భక్తియోగంలో భగవంతుని లీలలన్నీ గ్రహించాడు వ్యాసుడు. తాను రచించిన భాగవతాన్ని కుమారుడు శుకయోగీంద్రుని చేత పఠింపజేశాడు. ఆ శుకయోగీంద్రుడే గంగానదిలో ప్రాయోపవిష్టుడై ఉన్న పరీక్షిన్మహారాజుకి ఈ భాగవతాన్ని వారం రోజుల పాటు వినిపించాడు. భారతం పద్దెనిమిది పర్వాలుగా చెబితే ఈ భాగవతాన్ని పన్నెండు స్కంధాలుగా చెప్పాడు వ్యాసుడు. ఈ భాగవతాన్ని బమ్మెర పోతన తెనిగించాడు. ఆ మహానుభావుడి తెనుగు పద్యాలు భగవంతుని లీలలుగా తెలుగునాట చిందులేశాయి.

## నైమిశం

నైమిశారణ్యం మహా పుణ్యక్షేత్రం. శ్రీమహావిష్ణువు నివాసస్థలం అది. పుణ్యమూ, పురాణమూ రెండూ అక్కడే పుట్టాయి. ఒకప్పుడు వెయ్యేళ్ళ దీక్ష చేబట్టి, సత్త్రయాగం చేయాలనుకున్నారు మహర్షులు. నైమిశారణ్యంలో అంతా సమావేశమయ్యారు. సూతుడు అక్కడికి వచ్చాడు. అతను రోమహర్షణుడి కుమారుడు. పురాణాలు చెప్పడంలో గొప్ప ప్రసిద్ధుడు. వ్యాసుడు తాను రచించిన పురాణేతిహాసాలన్నీ రోమహర్షణుడికి చెప్పాడు. వాటన్నిటినీ రోమహర్షణుడు, సూతుడికి చెప్పడంతో అతడు మహా పౌరాణికుడయినాడు.

నైమిశానికి విచ్చేసిన సూతుణ్ణి అక్కడి శౌనకాది మునులంతా భక్తితో పూజించి గౌరవించారు. పురాణాలు చెప్పమని ప్రార్థించారు. సూతుడు అందుకు అంగీకరించి, ఆనందంగా తాను నేర్చిన

పురాణాలన్నీ వినిపించాడు. వెయ్యేళ్ళ సత్రయాగంలో కాలాన్ని దుర్వినియోగం చేయక, మునులంతా సూతుడు చెప్పిన పురాణాలు విని తరించారు. ఇప్పుడు పఠించనున్న భాగవత పురాణం కూడా సూతుడు చెప్పినదే! పురాణాలన్నీ ఒక ఎత్తయితే, ఈ భాగవతం ఒక్కటీ ఒక ఎత్తు అన్నాడు సూతుడు. దానికి కారణం భగవంతుని లీలలన్నీ ఇందులో పొందుపరచడమే నన్నాడు. ఎన్ని రాసినా మనశ్శాంతి లభించని వ్యాసునికి, ఈ భాగవత రచన మనశ్శాంతి కలిగించడమే దీని గొప్పతనానికి ఉదాహరణ అన్నాడు. ఇంకో విశేషం కూడా తెలియజేశాడతను. వేదాలనూ, మహాభారతంతో పాటు అనేక ఇతిహాసాలనూ శిష్యులకి బోధించిన వ్యాసుడు, ఈ భాగవతాన్ని మాత్రం శిష్యులకి చెప్పలేదు. కుమారుడయిన శుకుడొక్కడికే చెప్పాడు. శుకుడే భాగవతాన్ని అధ్యయనం చేసేందుకు అర్హుడు అనుకున్నాడతను.

## శుకయోగి

శౌనకాది మునులకు శుకయోగి మహిమల గురించి సూతుడు ఇలా చెప్పాడు.

మేరుపర్వతం మీద వ్యాసుడు ఘోర తపస్సు చేశాడు. శంకరుడు ప్రత్యక్షమయ్యాడప్పుడు. వరం కోరుకోమన్నాడు. బాగా ఆలోచించి పంచభూతాలతో సమానుడయిన పుత్రుణ్ణి కోరుకున్నాడు వ్యాసుడు. కటాక్షించాడు శివుడు.

వ్యాసుడు ఒకనాడు అగ్నికార్యం నిమిత్తం అరణి మథిస్తున్నాడు. అప్పుడతనికి ఓ అప్సరస కనిపించింది. ఆమె పేరు ఘృతాచి. తనని వ్యాసుడు మోహించిన సంగతి ఇట్టే కనుక్కున్నదామె. అయినా సంయమనం పాటించింది. తొందరపడితే మహా తపస్సంపన్నుడు శపిస్తాడని భయపడింది. అయినా వ్యాసుణ్ణి ఆట పట్టించాలని శుకరూపం(చిలుక)ధరించి అక్కడికక్కడే అటూ ఇటూ తిరుగుతూ వయ్యారాలు పోయింది. ఆ వయ్యారాలకు వ్యాసుడు చలించి పోయాడు. ఫలితంగా అతడి శుక్లం జారి, అరణిలో పడింది. వెన్వెంటనే బాలుడు జన్మించాడు. అతనికి చిలుక రూపురేఖలు వచ్చాయి. అందుకే ఆ బాలుణ్ణి 'శుకుడు' అన్నారు. పుట్టుకతోనే శుకుడు మహాయోగి అయినాడు. అతనికి బ్రహ్మ వడుగు చేశాడు. ఆకాశం అతనికి దండ కమండలాలు ప్రసాదించింది. తండ్రి వ్యాసుని దగ్గరే వేదాలూ, శాస్త్రాలూ అభ్యసించాడు శుకుడు. తండ్రి ఆదేశానుసారం జనకమహారాజు దగ్గర బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకున్నాడు. నారదుడు కూడా అతనికి తత్త్వబోధ చేశాడు. వారి బోధలతో శుకుడికి ప్రపంచం సర్వం బ్రహ్మమయంగా కనిపించేది. స్త్రీ పురుష భేదాన్ని పట్టించుకునేవాడు కాదతను. సర్వసంగపరిత్యాగయ్యాడు. వివస్త్రుడై తిరిగేవాడు. అంతు చిక్కని అతని ప్రవర్తన చూసి, చాలా మంది అతనిని పిచ్చివాడనుకునేవారు.

ఒకసారి కైలాసాన్ని సందర్శించాలనుకుని, శుకుడు ఆకాశానికి ఎగిరాడు. వెదుకుతూ తండ్రి వ్యాసుడు వెన్నంటాడతన్ని. ఆ వెదుకులాటలో కొంతమంది దేవతాస్త్రీలు ఒక కొలనులో వివస్త్రులై జలకాలాడడాన్ని చూశాడు వ్యాసుడు. అంతకు ముందు వారిని శుకుడు కూడా చూశాడు. అయితే వారు అతన్ని పట్టించుకోలేదు. ఎగిరిపోతున్న శుకుణ్ణి చూస్తూ స్నానాలు చేయసాగారు. అదే వ్యాసుడు తమని చూసేసరికి, సిగ్గుతో వస్త్రాలు ధరించారు. గుండెల్ని చేతుల్తో కప్పుకున్నారు. అది గమనించి వ్యాసుడు ఆశ్చర్యపోయాడు.

''నా కుమారుడు శుకుడు చిన్నవాడు, యవ్వనంలో ఉన్నవాడు, అతన్ని చూసి మీరు ఏ రకంగానూ స్పందించలేదు. సిగ్గుపడలేదు. నన్ను చూసి ఎందుకు భయపడ్డారు? వస్త్రాలు ధరించారెందుకు?'' దేవతా స్త్రీలను అడిగాడు వ్యాసుడు.

''ఎందుకంటే వృద్ధుడివి అయినప్పటికీ నీకు రాగద్వేషాలు పోలేదు. పైగా స్త్రీ పురుష భేదాలు నీకు తెలుసు. నీ కుమారుడు శుకుడికి ఇవేవీ తెలియవు. అందుకని అతన్ని చూసి మేము సిగ్గుపడలేదు. నగ్నంగా ఉన్నా పట్టించుకోడతను. అందుకనే ధైర్యంగా స్నానాలు చేయగలిగాం'' అన్నారు స్త్రీలంతా. తల వంచుకున్నాడు వ్యాసుడు.

తర్వాత శుకుణ్ణి వెదుకుతూ ప్రయాణించసాగాడు. అయితే శుకుడెక్కడా ఎక్కువ సేపు ఉండడు. ఆవు పాలు పితకడానికి ఎంత సమయం పడుతుందో అంత సమయమే అతను ఎక్కడైనా ఉండేది. అంతకు మించి క్షణం కూడా అక్కడ నిలువడు.

## నారదుని పూర్వజన్మ

భాగవతం రచించమని చెప్పినప్పుడే వ్యాసునికి భక్తితత్త్వం గురించి కూడా చెప్పాడు నారదుడు. అన్నిటి కంటే అది గొప్పదని వివరించాడు. హరి భక్తుడు కర్మానుసారంగా నీచ జన్మ



ఎత్తినప్పటికీ, సంసార బంధంలో చిక్కుకోడనీ, త్వరలోనే అతను ఉత్తమ పదాన్ని అందుకుంటాడన్నాడు. ఉదాహరణగా తన పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలియజేశాడు నారదుడు.

గత జన్మలో నారదుడు ఓ దాసీ పుత్రుడు. అతని తల్లి ఓ బ్రాహ్మణుని ఇంట పనిమనిషిగా ఉండేది. తల్లి పనిమనిషి అయితేనేం? నారదుడు  చిన్నతనం నుంచే సన్యాసుల్ని ఆదరించి, వారికి ఏ లోటూ రాకుండా చూసుకునేవాడు. గురుభక్తి, భగవద్భక్తి, మితభాషణ, సదాచారం సకల సద్గుణాలన్నీ చిన్నతనంలోనే అలవడినాయి అతనికి. మహాత్ములను సేవిస్తూ, వారి ఎంగిలి తిని పెరిగాడు నారదుడు. అలా పెరిగిన కారణంగా అతనికి చిత్తశుద్ధి కలిగింది. మనసులో అనునిత్యం హరిని జపించసాగాడు. విష్ణుకథలు వినసాగాడు. విష్ణువు పట్ల ఎనలేని భక్తిని కనబరిచిన నారదునికి సన్యాసులు పరమేశ్వర తత్త్వాన్ని బోధించారు. ఆనాటి నుంచి నారదుడు భగవద్భక్తుడయినాడు.

తల్లికివేవీ తెలియవు. అమాయకురాలు. నారదుడు ఒక్కగానొక్క కొడుకు అయినప్పటికీ అతని గురించి పెద్దగా పట్టించుకునేది కాదామె. ఓ రాత్రి ఇంటికి రాని ఆవును వెతుక్కుంటూ బయల్దేరిందామె. కొండలెక్కుతూ దిగుతూ నడచి నడచి అలసిపోయింది. ఆ అలసటలో కాళ్ళు తడబడ్డాయి. చూసుకోలేదు, నిద్రపోతున్న పాము మీద కాలు వేసింది. అంతే! కాటు వేసింది పాము. చనిపోయిందామె. అప్పటికి నారదుడికి అయిదేళ్ళు. తల్లి పోయిందన్న బాధే లేదతనికి. దానికి కారణం, అతను సన్యాసం స్వీకరించాలనుకోవడమే! ఉన్న ఒక్కగానొక్క బంధమూ తెగిపోవడంతో తనకి మంచే జరిగిందనుకున్నాడు నారదుడు. సన్యాసం స్వీకరించాడు. అరణ్యాలు, కొండలు, కోనలూ దాటాడు. ఆకలిదప్పులు బాధిస్తున్నా, అలసిపోతున్నా అతను హరినామస్మరణ మానలేదు.

## అశ్వత్థామ ఆగ్రహం:బ్రహ్మ శిరోనామకాస్త్రం

నడచి నడచి ఆఖరికి ఓ నది ఒడ్డుకి చేరుకున్నాడు నారదుడు. ఇక నడవలేననుకున్నాడు. నదిలో స్నానం చేశాడు. భగవంతునికి అర్ఘ్యం ఇచ్చి, కడుపు నిండా నీరు తాగాడు. దాహాన్ని తీర్చుకున్నాడు. తీరానికి చేరి, రావిచెట్టు కింద కూర్చున్నాడు. మనసులో మహావిష్ణువును తలచుకుంటూ హరినామస్మరణ చేయసాగాడు. ధ్యానించసాగాడు. భగవంతుడు ప్రత్యక్షమయ్యాడప్పుడు. అయితే మరుక్షణంలోనే అదృశ్యమయ్యాడు. ఏక కాలంలో సంతోషం, దుఃఖం రెండూ కలిగాయి నారదునికి. అయినా హరినామస్మరణ మానలేదు. అప్పుడు భగవంతుని గొంతు వినవచ్చిందిలా.

''బాలకా! నువ్వు నన్ను ఈ జన్మలో తనివితీరా చూడలేవు. నీ భక్తికి మెచ్చి క్షణ మాత్రమే నా దివ్య మంగళ రూపాన్ని చూపించాను. త్వరలోనే నువ్వు నీ దాసీపుత్ర దేహాన్ని త్యజిస్తావు. అప్పుడు నా చెంతే ఉంటావు. నా పట్ల నీ భక్తి ఎప్పుడూ స్థిరంగా ఉండేట్టుగా వరమిస్తున్నాను, స్వీకరించు. అలాగే ప్రళయకాలంలో కూడా నీ స్మృతి పోదు.''

శ్రీహరి కరుణకు పొంగిపోయాడు నారదుడు. కొంత కాలానికి దేహాన్ని విడిచాడు.

కల్పాంతాన లోకాలన్నీ జలమయమయిపోయాయి. నీరంతా ఒకే సముద్రంగా ఉంది. ఆ సముద్రంలో శ్రీహరి శయనించి ఉన్నాడు. అప్పుడు శ్రీహరి గర్భంలోకి బ్రహ్మదేవుడు ప్రవేశిస్తున్నాడు. ప్రవేశిస్తూ నిశ్వసించాడతను. అలా ఊపిరి వదిలే వేళ బ్రహ్మదేవుని గర్భంలో జొరుకున్నాడు నారదుడు.

అనేక యుగాలు గడిచిపోయాయి.

బ్రహ్మ మళ్ళీ సృష్టి ప్రారంభించాడు. బ్రహ్మదేవుని ప్రాణాల నుండి మరీచి మొదలయిన ప్రజాపతులు జన్మించారు. వారితో పాటు నారదుడు కూడా జన్మించాడు. శ్రీహరి అనుగ్రహంతో నారదునికి దివ్యదేహం ప్రాప్తించింది. దేవదత్తం, మహతి అనే వీణ కూడా లభించాయతనికి. సర్వజ్ఞత్వం, చిరంజీవత్వం సంప్రాప్తించాయి. దాంతో నిరంతరం హరినామస్మరణ చేస్తూ ముల్లోకాలూ సంచరించసాగాడు నారదుడు.

## అశ్వత్థామ

పరీక్షిన్మహారాజు ఎందుకు ప్రాయోపవేశం చేయాల్సి వచ్చింది? శుకుడు అతనికి భాగవతం ఎందుకు వినిపించాల్సి వచ్చిందంటూ శౌనకాది మునులు సూతుణ్ణి ప్రశ్నించారు. సమాధానంగా పరీక్షిన్మహారాజు జన్మ వృత్తాంతం తెలియజేయడానికి ముందు సూతుడు మహాభారతంలోని చివరి ఘట్టాన్ని వారికి వివరించాడు. శ్రీకృష్ణ నిర్యాణం, పాండవుల మహాప్రస్థానం మొదలయిన సంగతులు కొన్ని తప్పనిసరై చెప్పాల్సి వచ్చిందతనికి.

పద్దెనిమిది రోజుల పాటు కురుక్షేత్రంలో కౌరవులకూ పాండవులకూ యుద్ధం జరిగింది. ఇరు పక్షాన మహావీరులు అనేకులు మరణించారు. గదాయుద్ధంలో భీముడు, తొడలు విరగగొట్టడంతో దుర్యోధనుడు నేల కూలాడు. ఆనాటికి కురురాజు పక్షాన మిగిలిన ఒకే ఒక్క వీరుడు అశ్వత్థామ. నూరుగురు కొడుకుల్నీ, బంధుబలగాన్నీ, చతురంగబలాల్నీ కోల్పోయి జీవచ్ఛవంలా ఉన్నాడు ధృతరాష్ట్రుడు. ఆ మహారాజుకి సంతోషాన్ని కలిగించేందుకు అశ్వత్థామ ఘోరకృత్యానికి పూనుకున్నాడు. అర్ధరాత్రి వేళ నిద్రిస్తున్న ద్రౌపది కుమారులయిన ఉపపాండవుల తలలను నరికి వచ్చాడతను. తలలు తెగి, రక్తం మడుగులో ఉన్న కుమారులను చూసి కన్నీరు మున్నీరయింది ద్రౌపది. కంటికీ మంటికీ ఏకధారగా రోదించింది. ఎంత ఓదార్చజూసినా ద్రౌపది శాంతించలేదు. అప్పుడు అశ్వత్థామ తల నరికి తెస్తానని అర్జునుడు ప్రతిజ్ఞ చేశాడు. ఆ ప్రతిజ్ఞకు ద్రౌపది శాంతించింది.

అక్షయతూణీరాన్ని, గాండీవాన్నీ అందుకుని రథాన్ని అధిరోహించాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు సారథి అయ్యాడు. రథం పరుగందుకుంది.

''అడుగో అశ్వత్థామ! నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకో''

అశ్వత్థామను చూపించి, రథాన్ని మరింత వేగంగా ముందుకు పోనిచ్చాడు కృష్ణుడు. తనని వెంట తరముతున్న కృష్ణార్జునులను చూసి, వారి చేతికి చిక్కరాదనుకుని, రథాన్ని అధిరోహించి పరుగందుకున్నాడు అశ్వత్థామ. ముందు అశ్వత్థామ రథం, ఆ వెనుక కృష్ణార్జునుల రథం. పరిగెత్తి పరిగెత్తి అశ్వత్థామ గుర్రాలు అలసిపోయాయి. ఆగిపోయాయి ఒకచోట. కృష్ణార్జునులు చేరుకున్నారక్కడికి. ఒక్కుదుటన కిందకు దిగుతున్న అర్జునుని చూశాడు అశ్వత్థామ. తన ప్రాణాలు

పోతాయి. అందులో అనుమానం లేదు. అర్జునుడు తనని చంపేస్తాడనుకున్నాడు అశ్వత్థామ. అదే క్షణంలో పాండవుల అంతు చూడాలనుకున్నాడు కూడా. ఆలోచించాడు. బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రయోగించాలనుకున్నాడు. పర్యవసానాల్ని పట్టించుకోలేదు. ఆచమనం చేసి, శుచి అయ్యాడు అశ్వత్థామ.

''అపాండవమగుగాక'' అన్నాడు. అనుకున్నట్టుగానే బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రయోగించాడు. ఉగ్రతేజస్సుతో ఆ మహాస్త్రం దశదిశలా వ్యాపించింది. సకల ప్రాణికోటి అంతం చూసే ఆ తేజస్సు చూసి అర్జునుడు కలవరం చెందాడు. ఏం చెయ్యాలో తోచలేదతనికి. చేతులు జోడించి కృష్ణునికి నమస్కరించాడు. కర్తవ్యాన్ని బోధించమని ప్రార్థించాడు.

సాలోచనగా చూసి ఇలా అన్నాడు కృష్ణుడు.

''అర్జునా! అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని ప్రతిఘటించగలిగేది ఒక్కటే! బ్రహ్మశిరోనామకాస్త్రమే! దాన్నే నువ్వూ ప్రయోగించు.''

''మరో మార్గం లేదా?'' అడిగాడు అర్జునుడు.

''లేదు.''

కృష్ణునికి మళ్ళీ నమస్కరించి, ఆ పరమాత్మ చెప్పినట్టుగానే అర్జునుడు తాను కూడా బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు.

అస్త్రాలు రెండూ ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. ప్రళయాగ్ని జ్వాలలు చెలరేగాయి. సమస్త లోకాల్నీ ఆ జ్వాలలు దహించసాగాయి. ప్రాణికోటి సర్వం తల్లడిల్లింది. ప్రళయకాలం సమీపించినట్టనిపించింది. ఆలోచించాడు కృష్ణుడు. ఆ అస్త్రాలు రెంటినీ ఉపసంహరించాల్సిందిగా అర్జునుని ఆజ్ఞాపించాడు.

బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ద్రోణునికి అగస్త్యుడు ప్రసాదించాడు. ద్రోణుడు ఆ అస్త్రాన్ని అర్జునునికి బోధించాడు. తండ్రి ద్రోణుణ్ణి ప్రార్థించి అశ్వత్థామ కూడా ఆ అస్త్రాన్ని అందుకున్నాడు. తనయుడికి అస్త్రాన్ని ప్రసాదించి, ఎంతటి ప్రాణభయం ఉన్నా ఎన్నడూ ఈ అస్త్రాన్ని ప్రయోగించరాదన్నాడు ద్రోణుడు. అస్త్రాన్ని ప్రయోగించడమే తెలియజేశాడతడు. ఉపసంహరణ తెలియజేయలేదు. ఆ కారణంగా అశ్వత్థామకు అస్త్ర ఉపసంహరణ తెలీదు. తెలియకపోయినా ఆ మహాస్త్రాన్ని ప్రయోగించి పొరపాటు చేశాడు అశ్వత్థామ.

కృష్ణుని ఆజ్ఞానుసారం అర్జునుడు తను ప్రయోగించిన అస్త్రాన్నీ, అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రాన్నీ రెంటినీ ఉపసంహరించాడు. తర్వాత అణచుకోలేని కోపంతో అశ్వత్థామ మీద దాడి చేశాడు. పట్టుకున్నాడతన్ని. పట్టుకుని రథ చక్రానికి కట్టాడు. ద్రౌపది దగ్గరకు తీసుకుని వెళ్ళేందుకు రథాన్ని అధిరోహిస్తుంటే వారించాడతన్ని కృష్ణుడు.

''చక్రానికి కట్టి అశ్వత్థామని ప్రాణాలతో ఉంచడం పద్ధతి కాదు, ఇలాంటి దుర్మార్గుణ్ణి వెంటనే చంపేయాలి. చంపేయ్'' అన్నాడు కృష్ణుడు. అర్జునుడు ఆలోచిస్తూ తలొంచుకుని నిల్చున్నాడు.

''అర్జునా! ఆలోచించకు. ఈ అశ్వత్థామ అతి దారుణానికి ఒడిగట్టాడు. నిరపరాధుల్ని, ఉపపాండవుల్ని చంపాడు. నిద్రించేవాణ్ణి, బాలుణ్ణి, విరథుణ్ణి, శరణాగతుణ్ణి, జడుణ్ణి, ఉన్మత్తుణ్ణి,



భయపడినవాణ్ణి చంపకూడదంటుంది ధర్మశాస్త్రం. ఆ ధర్మశాస్త్రాన్ని చదువుకుని కూడా ఈ అశ్వత్థామ చేయరాని పని చేశాడు. ఇలాంటి వాణ్ణి క్షమించకూడదు. నీ ప్రతిజ్ఞ నువ్వు నెరవేర్చుకో! చంపేయ్.'' రెచ్చగొట్టాడు కృష్ణుడు. అయినా అర్జునుడు అందుకు సిద్ధపడలేదు. అంతుచిక్కక చూస్తున్న కృష్ణునితో అప్పుడు అర్జునుడు ఇలా అన్నాడు.

''కృష్ణా! ఎంత చెడ్డా ఈ అశ్వత్థామ నా గురుపుత్రుడు. గురుపుత్రుడు గురువుతో సమానం అంటారు. అందుకని చంపలేకపోతున్నాను. దయచేసి నన్ను అర్థం చేసుకో.'' విననన్నట్టుగా ఉన్న కృష్ణుణ్ణి ప్రార్థించి ఆఖరికి రథానికి కట్టిన అశ్వత్థామతో పాటుగా ద్రౌపదిని చేరుకున్నాడు అర్జునుడు.

శవాన్ని కట్టినట్టుగా రథ చక్రానికి కట్టి ఉన్న అశ్వత్థామను చూసింది ద్రౌపది. జాలి చెందింది. తన కుమారులను చంపాడు. కడుపుశోకాన్ని రగిల్చాడు. అయినా అశ్వత్థామ పట్ల ఆ క్షణం ద్రౌపదికి చెప్పలేనంత దయ కలిగింది. నమస్కరించిందతనికి. అర్జునునితో ఇలా అంది.

''దయచేసి గురుపుత్రుణ్ణి వదలిపెట్టండి.''

ద్రౌపది మాటకి అక్కడ ఉన్న శ్రీకృష్ణ ధర్మరాజాదులంతా ఆశ్చర్యపోయారు.

''అశ్వత్థామ బ్రాహ్మణుడు. పైగా ధనుర్వేదాన్ని పాండవులకు సంపూర్ణంగా నేర్పిన మహాత్ముడు ద్రోణాచార్యుని కొడుకు. అతన్ని చూస్తూంటే ద్రోణాచార్యుణ్ణి చూస్తున్నట్టుగానే ఉంది. అతన్ని సంహరించడం గురువుని సంహరించడం లాంటిది. వద్దు, అతన్ని విడిచి పెట్టండి'' అంది ద్రౌపది.

వినలేదెవరూ. అర్జునుడు కూడా ముఖాన్ని పక్కకి తిప్పుకుని నిల్చున్నాడు.

''స్వామీ'' అర్జునుని పిలిచింది ద్రౌపది.

''నా మాట విను. అశ్వత్థామను విడిచిపెట్టు. నువ్వు అతన్ని సంహరిస్తే పుత్రశోకంతో అతని తల్లి కృపి మరణిస్తుంది. ఆ పాపం మనకి వద్దు. బ్రాహ్మణశోకం ఎవరికీ మంచిది కాదు'' అంది ద్రౌపది. అయినా అర్జునుడు అందుకు అంగీకరించలేదనిపించడంతో కృష్ణుణ్ణి ప్రార్థించింది ద్రౌపది.

''అన్నా! నువ్వయినా చెప్పు, బ్రాహ్మణవధ కూడదు కదా'' అంది. అవునన్నట్టుగా తలూపాడు కృష్ణుడు. అర్జునుని సమీపించాడు.

''అశ్వత్థామ తలలో విలువ కట్టలేని మణి ఒకటి ఉంది. అది కేశాలతో పాటు పుట్టిన శిరోమణి. గొప్ప మహిమ కలది. శిరోజాలు కోసి, ఆ మణి తీసుకో.'' చెప్పాడు కృష్ణుడు.

అర్థం కానట్టుగా చూశాడు అర్జునుడు.

''తలగొరిగి అవమానించడం, అతని సర్వస్వాన్నీ హరించడం, అతన్ని దేశం నుండి వెళ్ళగొట్టడం...బ్రాహ్మణుల దండనలని ధర్మశాస్త్రం చెబుతోంది. ఆలోచించకు. చెప్పిన పని చెయ్యి'' అన్నాడు కృష్ణుడు. అర్జునుడు అందుకు సిద్ధమయ్యాడు. కృపాణంతో అశ్వత్థామ శిరోజాలు కోశాడు. దేదీప్యమానంగా వెలిగిపోతున్న అతని తలలోని దివ్యమణిని చేజిక్కించుకున్నాడు. తృప్తి చెందాడు. గుండె నిండా ఊపిరి పీల్చుకున్నాడు. అశ్వత్థామ కట్లు విప్పి, విడిచి పెట్టాడతన్ని. శిరోమణిని పోగొట్టుకుని, తీవ్ర అవమాన భారంతో క్షీణతేజుడై అశ్వత్థామ అక్కణ్ణుంచి దీనంగా వెళ్ళిపోయాడు.

ఎంత ఉపసంహరించినా అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్ర ప్రభావం మాత్రం పోలేదు.

'అపాండవమగుగాక' అన్నాడు అశ్వత్థామ. అంటే పాండవుల వంశం నశించాలని అతను ఆశించాడు. బ్రహ్మశిరోనామకాస్త్రం అందుకే ప్రయోగించాడు. అయితే ఆనాటికి యుద్ధంలో పోయినవారు పోగా మిగిలింది ధర్మజ భీమార్జున నకుల సహదేవులు అయిదుగురే! పంచపాండవులే మిగిలారు. ఆ అయిదుగురూ దేవతల వరప్రభావంతో వర్థిల్లుతున్నారు. అందువల్ల వారిని ఆ అస్త్రం ఏమీ చేయలేకపోయింది. అయితే ఆ సమయానికి అభిమన్యుడి భార్య ఉత్తర గర్భవతిగా ఉన్నది. ఆమెకు పుట్టబోయే బిడ్డే పాండవ వంశాంకురం. ఆ కారణంగా అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రం ఉత్తర గర్భంలోని పిండాన్ని శత విధాల వేధించసాగింది. ఆ బాధను తట్టుకోలేకపోయింది ఉత్తర. గగ్గోలుగా ఏడుస్తూ శ్రీకృష్ణుని ఆశ్రయించింది. అతని పాదాల మీద పడింది. అశ్వత్థామ ప్రయోగించిన దివ్యాస్త్రం నుండి తన గర్భస్థ శిశువుని కాపాడమని పలువిధాల వేడుకుంది. అభయాన్ని అందించాడు కృష్ణుడు. యోగమాయను ఉత్తర గర్భంలో ప్రవేశపెట్టాడు. ఆమె గర్భస్థ శిశువుని కాపాడాడు. తన చక్రాయుధంతో బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని తుత్తునియలు చేశాడు. అప్పుడు పుట్టిన బాలుడే పరీక్షిత్తు. కురువంశాంకురంగా నిలిచి అతను అనేక కార్యాలు చేశాడు. ప్రసిద్ధుడయినాడు.

తన వంశాన్ని కాపాడినందుకు కుంతి, శ్రీకృష్ణుణ్ణి వేయి విధాల స్తోత్రం చేసింది. అనంతరం ద్రౌపదీసమేతులై పాండవులు శ్రీకృష్ణుణ్ణి వెంటబెట్టుకుని గంగాతీరానికి చేరుకున్నారు. అశౌచస్నానాలు ఆచరించారు. యుద్ధంలో మరణించిన జ్ఞాతులకూ, బంధువులకూ, అందరికీ

ఉత్తర క్రియలు నిర్వహించారు. తిలతర్పణాలూ, జలతర్పణాలూ, పిండప్రదానాలన్నీ నిర్వర్తించి పరిశుద్ధులయినారు.

## పరీక్షిన్మహారాజు ప్రతాపం : కలి ప్రవేశం

పరిశుద్ధుడయినా యుద్ధంలో విజయలక్ష్మిని వరించాననిగాని, సామ్రాజ్యం తన హస్తగతం అయిందనిగాని ధర్మరాజు సంతోషించలేదు. బంధు మిత్రులందరినీ పోగొట్టుకున్నానన్న బాధ అతన్ని పీడించసాగింది. కన్నవారు, కావాల్సిన వారంతా మరణించిన తర్వాత రాజ్యాన్ని పాలించడం ఎవరిని ఉద్ధరించడానికి? ఇంకెవరిని సుఖపెట్టడానికి? అనిపించిందతనికి. ఈ నెత్తుటి కూడును తినలేననుకున్నాడు. అన్నిటా విరక్తి చెందాడు. అలా విరక్తి చెందిన ధర్మరాజుని వ్యాసుడు ఓదార్చాడు. కృష్ణుడు ఓదార్చాడు. అయినా దుఃఖోపశమనం కలగలేదు. పితామహుడు భీష్ముణ్ణి సందర్శించాలనుకున్నాడు ధర్మరాజు. వెళ్ళాడక్కడికి. ఆ సమయానికి భీష్ముడు శరతల్పగతుడై ఉన్నాడు. దేహత్యాగం చేసేందుకు నిరీక్షిస్తున్నాడు. శ్రీకృష్ణ, ధౌమ్యులు సహా సహోదరులను వెంటబెట్టుకుని తన వద్దకు వచ్చిన ధర్మరాజుని కళ్ళెత్తి చూశాడు భీష్ముడు. అతను ఎందుకు వచ్చిందీ తెలిసినా, తెలియనట్టుగానే ప్రశ్నించాడు. తాను వచ్చిన కారణాన్ని చేతులు జోడించి వివరించాడు ధర్మరాజు. మనోదుఃఖాన్ని తట్టుకోలేకపోతున్నానంటూ, కర్తవ్యం నిర్దేశించాల్సిందిగా ప్రార్థించాడు.

ధర్మమూర్తి భీష్ముడు ధర్మసూక్ష్మాలన్నీ ధర్మరాజుకి వివరించాడు. మహావిష్ణువు అవతారమయిన శ్రీకృష్ణుని మహిమను కథలు కథలుగా చెప్పాడు. జరిగిన అనర్థానికి ఎవరూ కారకులుకారనీ, జరిగిందంతా దైవ ప్రేరణనీ తెలియజేసి, ధర్మరాజుని రాజ్యపాలన చేయమన్నాడు. ఉత్తరాయణ పుణ్యకాలం రాగానే భీష్ముడు దేహత్యాగం చేశాడు.

ధర్మరాజు పట్టాభిషిక్తుడయినాడు. పాండవులు రాజ్యపాలనలో తలమునకలవడంతో శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోయాడు.

పుత్రశోకంతో కుమిలిపోతున్న గాంధారీదేవి, ధృతరాష్ట్రులను ఏ లోటూ రానీయక చూసుకోసాగాడు ధర్మరాజు. తీర్థయాత్రలు చేసి తిరిగి వచ్చాడు విదురుడు. తాను చూసిన పుణ్యక్షేత్రాలు, తీర్థాల గురించి పాండవులకు చెప్పాడతను. గాంధారీదేవి, ధృతరాష్ట్రులను కలిశాడు. వారికి వైరాగ్యాన్ని బోధించాడు. కాలగతి మారిపోనున్నదనీ, కలికాలం రానున్నదనీ తెలియజేశాడు. సర్వం త్యజించి సన్యసించడమే శ్రేయస్కరం అన్నాడు. విదురుడు చెప్పిన మీదట ధృతరాష్ట్రుడు సర్వసంగ పరిత్యాగై సన్యసించాడు. గాంధారీదేవి సహా హిమాలయాలకు చేరుకున్నాడతను.

సన్యసించి, సామ్రాజ్యాన్ని వదలి, గాంధారీదేవిసహా ధృతరాష్ట్రుడు హిమాలయాలకు చేరుకున్నాడన్న సంగతి ధర్మరాజుకి తెలియదు. వారు అంతఃపురంలో కనిపించకపోయేసరికి తలక్రిందులయినాడు. వారి కోసం అన్ని చోట్లా వెదికించసాగాడు. ఆ సమయంలో అక్కడికి నారదుడు విచ్చేశాడు. ధృతరాష్ట్రుని జాడ ధర్మరాజుకి తెలియజేశాడు. మహారాజు హిమాలయాలకు చేరుకున్నాడనీ, తపస్సు చేసుకుంటున్నాడనీ చెప్పాడు. త్వరలోనే ధృతరాష్ట్రుడు

దేహపరిత్యాగం చేస్తాడనీ, అతన్ని గాంధారీదేవి అనుసరిస్తుందనీ చెప్పాడు. విదురుడు మళ్ళీ తీర్థయాత్రలకు వెళ్ళిపోతాడన్నాడు.

శ్రీకృష్ణుని చూసేందుకు ద్వారకకు వెళ్ళాడు అర్జునుడు. కొన్నాళ్ళు గడిచింది. ఇంకా తిరిగి రాలేదు. హస్తినాపురంలో ధర్మరాజుకి అనేక అపశకునాలు తోచాయి. ద్వాపరయుగాంతం కానున్నదనీ, మహావిష్ణువు అవతారమయిన శ్రీకృష్ణుడు నిర్యాణం చెందే సమయం సమీపించనున్నదనీ ఆ అపశకునాలు చెప్పక చెప్పాయి అతనికి. ధర్మరాజు తల్లడిల్లిపోయాడు. అంతలో అర్జునుడు రానే వచ్చాడు. చావుకబురు చల్లగా చెప్పాడు.

మునుల శాపానికీ, మహాపతివ్రత గాంధారీదేవి శాపానికీ యాదవకులం అంతా నశించిందనీ, శ్రీకృష్ణుడు అవతారం చాలించాడన్నాడు అర్జునుడు. ద్వారక సముద్రంలో మునిగిపోయిందన్నాడు.

శ్రీకృష్ణ నిర్యాణాన్ని జీర్ణించుకోలేకపోయాడు ధర్మరాజు. అన్నతో పాటు భీమార్జున నకుల సహదేవులు కూడా శ్రీకృష్ణ నిర్యాణాన్ని తట్టుకోలేకపోయారు. అంతా మహాప్రస్థానానికి సిద్ధమయ్యారు. అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తునికి సామ్రాజ్య పట్టాభిషేకం చేసి, ద్రౌపది సహా పాండవులంతా ఉత్తరదిశగా మహాప్రస్థానయాత్ర కొనసాగించారు. స్వర్గానికి చేరుకున్నారు.

## పరీక్షిత్తు

సుభద్రార్జునుల కుమారుడు అభిమన్యుడు. అతడు యువకుడయినా భారతయుద్ధ వీరులలో చెప్పుకోదగినవాడు. కురుక్షేత్ర సంగ్రామంలో పద్మవ్యూహాన్ని విచ్ఛిన్నం చేసి, కౌరవ నాయకులందరినీ గడగడలాడించిన వీరాగ్రగణ్యుడు. పాపం! అధర్మయుద్ధంలో నేలకొరిగి పోయాడు. చనిపోయాడు. అభిమన్యుడు చనిపోయిన నాటికి అతని భార్య ఉత్తర గర్భవతి. అప్పుడే అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. పాండవ వంశాన్ని నిశ్శేషంగా నిర్మూలించాలన్నది అతని ధ్యేయం. బ్రహ్మశిరోనామకాస్త్రం ఉత్తర గర్భంలోని శిశువుని వేధించడంతో కృష్ణుణ్ణి వేడుకుందామె. బిడ్డను బతికించమని ప్రాధేయపడింది. అభయాన్ని ప్రసాదించాడు కృష్ణుడు. తన యోగమాయను ఉత్తర గర్భంలోకి ప్రవేశపెట్టాడు. ఆ యోగమాయ బొటనవేలంతటి బుడతడై, గదాయుధాన్ని తిప్పుతూ బ్రహ్మశిరోనామకాస్త్ర ప్రభావాన్ని అనుక్షణం అడ్డుకోసాగింది. ఉత్తర గర్భస్థ శిశువుని కాపాడసాగింది. అదంతా గమనించసాగాడు గర్భస్థ శిశువు. ఎవరీ బుడతడు? గదాయుధాన్ని ఎందుకు చేపట్టాడు. ఎందుకు తనని కాపాడుతున్నా డంటూ పరీక్షించసాగాడు. ఆ పరీక్షలో తొమ్మిది నెలలు నిండిపోయాయి. బుడతడు అదృశ్యమయిపోయాడు. ఉత్తర ప్రసవించింది. తేజశ్శాలి పరీక్షిత్తు జన్మించాడప్పుడు. గర్భంలోనే పలు ప్రశ్నలను సంధిస్తూ పరీక్షించిన కారణంగా 'పరీక్షిత్తు' అన్న పేరు అతనికి సార్థకమయింది.

మనువడు పరీక్షిత్తుని చూసి ధర్మరాజు ఉప్పొంగిపోయాడు. ఆ సందర్భంగా అనేక దానధర్మాలు చేశాడు. జోస్యులను రప్పించి, పరీక్షిత్తుని జాతకాన్ని పరీక్షించి చెప్పమన్నాడు. పరీక్షించి వారిలా చెప్పారు.

''పరీక్షిత్తు పరమ భాగవతోత్తముడు అవుతాడు. ప్రపంచ ప్రసిద్ధి చెందుతాడు.''

ధర్మరాజు ఆ మాటలకి ఎంతగానో ఆనందించాడు.

‘‘ఇంకా వినండి మహారాజా! ఈ పరీక్షిత్తు ప్రహ్లాదునిలా మహాభక్తుడై మీ వంశానికి గొప్ప కీర్తి ప్రతిష్ఠలు తెస్తాడు. ఇక్ష్వాకునిలా ప్రజల్ని కంటికి రెప్పలా కాపాడుతాడు. శ్రీరాముడిలా పుణ్యపురుషుడవుతాడు. శిబిచక్రవర్తిలా మహాదాత అవుతాడు. పరాక్రమంలో సాటిలేని వాడయి, అనేక అశ్వమేధాలు చేస్తాడు. శుకయోగితో తత్త్వోపదేశం పొంది, గంగానదిలో దేహాన్ని త్యజించి, చివరికి విష్ణుపదం చేరుకుంటాడు’’ అన్నారు జోస్యులు. వారు చెప్పినట్టుగానే ధర్మరాజు అనంతరం పరీక్షిత్తు హస్తినాపురానికి రాజయ్యాడు. సమస్త భూమండలాన్నీ అనేక సంవత్సరాలు పాలించాడు. జగత్ప్రసిద్ధుడయ్యాడు. పరీక్షిత్తు భార్య ఉత్తరుని కుమార్తె ఇరావతి. వారికి జనమేజయుడుసహా నలుగురు కుమారులు జన్మించారు.

ద్వాపరయుగం ముగిసిపోయింది. కలియుగం ప్రవేశించింది. తన రాజ్యంలో కలిపురుషుడు ప్రవేశించాడని తెలుసుకున్నాడు పరీక్షిత్తు. అతన్ని నిలువరించేందుకు చతురంగ బలాలతో, శస్త్రాస్త్రాలు పూని బయల్దేరాడు. అవక్ర విక్రమంతో భద్రాశ్వకేతుమాల భారతోత్తర కురుకింపురుషాది వర్షాలన్నీ జయించాడు. అనేక పుణ్యకార్యాలు చేశాడు. హరిభక్తులకు అపరిమితంగా దానధర్మాలు చేశాడు. భగవద్భక్తితో రాజ్యపాలన చేస్తూ పూర్వీకుల కథలు వినసాగాడు.

రోజులు గడుస్తున్నాయి.

ధర్మదేవత వృషభరూపం ధరించింది. ఒంటికాలిపై తిరగసాగింది. భూమాత గోవురూపం ధరించింది. దూడను పోగొట్టుకున్నదానిలా దుఃఖించసాగింది. రెండూ కలుసుకున్నాయి ఓ రోజు. ఏడుస్తున్న గోవుని చూసి వృషభం అడిగిందిలా.

‘‘ఎందుకు ఏడుస్తున్నావు?’’

‘‘ఏం చెప్పమంటావు? శ్రీకృష్ణుడు అవతారం చాలించాడు. నన్ను విడిచి వెళ్ళిపోయాడు. ఆ వియోగాన్ని భరించలేకుండా ఉన్నాను. ఈ బాధ చాలదన్నట్టుగా ఇప్పుడు కలి ప్రవేశించింది’’ అన్నది గోవు. అవునవునన్నట్టుగా తలూపింది వృషభం. గోవును బాధగా చూసింది.

‘‘అయినా నీకు తెలియనిది ఏముంది ధర్మమూర్తీ? మూడు పాదాలు పోగొట్టుకున్నావు. ఒంటి పాదం మీద నడుస్తున్నావు. ఎంత బాధ పడుతున్నావో! లోకంలో అవినీతి, అధర్మం పెచ్చు పెరిగిపోయాయి. ఇక దిక్కెవరు మనకి? అందుకే ఈ కన్నీరు.’’ అంది గోవు.

అప్పుడు ఆ రెండూ కురుక్షేత్ర ప్రాంతంలో సరస్వతినదీ తీరాన నిలిచి ఉన్నాయి. పరీక్షిన్మహారాజు అటుగా రాసాగాడు. వస్తున్న అతనికి ఓ దృశ్యం కనిపించింది. అబ్రాహ్మణు డొకడు, రాజులా వేషం వేసుకుని, కొరడా పట్టుకుని కొడుతూ, నిలిచి ఉన్న గోవునీ, వృషభాన్నీ కాళ్ళతో తంతున్నాడు. వృషభం చాలా తెల్లగా ఉంది. దానికి ఒకటే కాలు. అబ్రాహ్మణుడు హింసకి అది తట్టుకోలేక ఒంటి కాలితో పడుతూ లేస్తూ ఉన్నది. భయంతో మలమూత్రాలు విసర్జిస్తోంది. గోవు కూడా అతని హింసను భరించలేక ‘అంబా’ అని గగ్గోలు పెడుతూ కన్నీరు కారుస్తోంది.

ఆ దృశ్యాన్ని తట్టుకోలేకపోయాడు పరీక్షన్మహారాజు. పరుగున వచ్చాడక్కడికి.

‘‘పాపాత్ముడా! ఎవడ్రా నువ్వు? చూస్తే రాజులా ఉన్నావు. చేసే పనేమో మూగజీవాల్ని హింసిస్తున్నావు. నిన్ను క్షమించకూడదు. నీకు చావు తప్పదు’’ అన్నాడు పరీక్షిన్మహారాజు. తెల్లగా వెలుగులీనుతున్న వృషభాన్ని చూశాడు. సాలోచనగా అన్నాడిలా.



''వృషభరాజా! ఎవరు నువ్వు? నిజం చెప్పు. నాకేమో నువ్వు వృషభరూపాన్ని ధరించిన ధర్మదేవతలా ఉన్నావు. మూడు కాళ్ళు ఎలా పోగొట్టుకున్నావు. ఒంటికాలి మీద ఈ కుంటి నడక ఎందుకు ప్రాప్తించింది? నిన్నిలా చేసింది ఎవరు? ఈ అబ్రాహ్మణుడా? చెప్పు, వెంటనే ఇతన్ని హతమారుస్తాను.''

''మహారాజా! ధర్మాధర్మ విచక్షణ చేయగల మహనీయుడవు నువ్వు. నాకీ కష్టాన్ని కలిగించిందెవరో నీకు తెలియదా? తెలియకపోతే తెలుసుకో, తెలుసుకుని ఏం చేయాలో కూడా నువ్వే నిర్ణయించుకో'' అన్నది వృషభం.

ఆలోచించాడు పరీక్షిత్తు. సర్వం తెలుసుకోగలిగాడు. అనుమానం లేదు, ధర్మదేవతే ఈ వృషభం అనుకున్నాడు. ధర్మదేవతకు నాలుగు పాదాలు. అవి: ఒకటి తపస్సు, రెండు శౌచం, మూడు దయ, నాలుగు సత్యం. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నడిచింది. త్రేతాయుగంలో మూడుపాదాలతో నడిచింది. ద్వాపరయుగంలో రెండు పాదాలతో నడిచి, ఇప్పుడీ కలియుగంలో మూడు కాళ్ళు పోగొట్టుకుని, సత్యం అనే ఒంటికాలితో కుంటుతోంది. ఆ కాలుని కూడా తెగ నరికేందుకు ప్రయత్నిస్తున్నాడు కలిపురుషుడు.

కలి ప్రవేశంతో ధర్మదేవత, భూదేవత పొందుతున్న దుఃఖాన్ని తెలుసుకున్నాడు పరీక్షిత్తు. అబ్రాహ్మణులే ముందు ముందు రాజ్యాలు ఏలుతారని తెలుసుకున్నాడు. బాధపడ్డాడు. అంతలోనే తేరుకుని, ధర్మదేవతకూ, భూదేవతకూ అభయాన్నిచ్చాడు. ఓదార్చాడు వారిని. ఆలస్యం చేయదలచలేదు, అసత్యానికీ, అధర్మానికీ నిలయమయిన కలిని కడతేర్చేందుకు ఖడ్గాన్ని ఎత్తాడు పరీక్షిత్తు. వేటు తప్పదనుకున్న కలిపురుషుడు గడగడ వణికిపోయాడప్పుడు. దిక్కుతోచలేదతనికి. చేతులెత్తి నమస్కరించి, శరణంటూ పరీక్షిత్తు పాదాలను ఆశ్రయించాడు.

''శరణన్న వారిని చేయెత్తి కొట్టడం కూడా మహాపాపం. అందుకని నేను నిన్ను చంపకుండా వదలి పెడుతున్నాను. పో ఇక్కణ్ణుంచి'' అన్నాడు పరీక్షిత్తు. దిక్కులు చూశాడు కలిపురుషుడు. ఎక్కడికి వెళ్ళాలన్నదీ అంతు చిక్కలేదతనికి.

''నువ్వు ఉన్న చోట అధర్మం, అసత్యం, అలక్ష్మి, స్వధర్మత్యాగం, చౌర్యం, లోభం, కపటం, కలహం, డంభం అన్నీ తాండవిస్తాయి. పరమ పవిత్రమయిన, ధర్మానికి నిలయమయిన యజ్ఞభూమి లాంటి ఈ బ్రహ్మావర్తదేశంలో నువ్వు ఉండడానికి వీల్లేదు. నువ్విక్కడ కాలు మోపితే నేనొప్పుకోను, ఖండిస్తాను. తక్షణం తప్పుకో ఇక్కణ్ణుంచి'' అన్నాడు మళ్ళీ పరీక్షిత్తు.

సమాధానంగా మళ్ళీ చేతులు జోడించాడు కలిపురుషుడు. దీనంగా ప్రార్థించాడిలా.

''మహారాజా! నిన్ను శరణు కోరాను. ప్రసాదించావు. ధన్యుణ్ణయ్యాను. అయితే నన్ను పొమ్మనడం నీకు భావ్యం కాదు. తప్పదు, నిష్క్రమించాల్సిందే అంటే నేనెక్కడుండాలో, ఏ చోటున నివసించాలో నువ్వే చెప్పు. ఎక్కడికి వెళ్దామన్నా, ఎటు చూద్దామన్నా ఆగ్రహోదగ్రంగా ఖడ్గాన్ని ఎత్తి పట్టుకుని ఎల్లెడలా నువ్వే కనిపిస్తున్నావు. భయం వేస్తోంది. దయచేసి అన్యథా భావించక చెప్పు మహారాజా, నేనెక్కడుండాలో నువ్వే చెప్పు. అక్కడే నా నెలవు ఏర్పరుచు కుంటాను'' అన్నాడు కలిపురుషుడు. కన్నీరు పెట్టుకున్నాడు.

ఆలోచనలో పడ్డాడు పరీక్షిత్తు.

## పరీక్షిత్తు ప్రాయోపవేశం:భాగవత పురాణం

సమాధానానికి ముందు చాలా సేపు ఆలోచించాడు పరీక్షిత్తు. ఆలోచించాలోచించి ఆఖరికి ఇలా చెప్పాడు.

''జూదం, మద్యపానం, స్త్రీలు, హింస...ఈ నాలుగూ ఉన్న చోట నువ్వుండు. నాకు అభ్యంతరం లేదు.''

తనకి అభ్యంతరం అనుకున్నాడు కలిపురుషుడు. జూదం ఉన్న చోట అనృతం ఉంటుంది. మద్యపానం ఉన్నచోట మదం ఉంటుంది. స్త్రీలు ఉన్న చోట కామం ఉంటే, హింస ఉన్న చోట క్రౌర్యం ఉంటుంది. విడివిడిగా ఇన్ని చోట్ల ఉండడం కంటే అన్నీ ఉన్న ఒకే ఒక స్థానంలో తానుండడం క్షేమం అనుకున్నాడు కలి. ఆ స్థానాన్ని నిర్దేశించాల్సిందిగా పరీక్షిత్తుని ప్రార్థించాడు. ఆలోచించాడు పరీక్షిత్తు. ఇలా అన్నాడప్పుడు.

''సువర్ణంలో ఉండు. నువ్వు కోరుకున్నవన్నీ అందులో ఉంటాయి. అంతేకాదు, నీకు దానిని అయిదవస్థానంగా కూడా నిర్దేశిస్తున్నాను.''

ఆనందించాడు కలిపురుషుడు.

అనృతం, మదం, కామం, క్రౌర్యం, రజస్సు...ఈ అయిదింటికీ సువర్ణమే స్థానం. చక్కని స్థానం, తానుండ దగ్గది అదే అని ఆనందించాడు కలి. నమస్కరించి వెళ్ళిపోయాడక్కణ్ణుంచి. సత్యం అనే ఒంటి కాలి మీద నిలిచిన ధర్మదేవతకు తపస్సు, శౌచం, దయ...మిగిలిన మూడు పాదాలూ కల్పించి, హస్తినాపురానికి చేరుకున్నాడు పరీక్షిత్తు. ఆ మహారాజు పాలించినంత కాలం ఆ భూభాగంలో అడుగు పెట్టలేకపోయాడు కలిపురుషుడు. అణగిమణగి ఉన్నాడు.

ఒకరోజు వేటకి బయల్దేరాడు పరీక్షిత్తు. అడవిలో అనేక మృగాలను వేటాడాడు. ఆ వేటాడడంలో బాగా అలసిపోయాడతను. తాను ఎక్కడ ఉన్నదీ తెలుసుకోలేకపోయాడు. ఆకలి, దాహం బాధించసాగాయి. చుట్టూ చూశాడు. తాగేందుకు చుక్కనీరుగానీ, తినేందుకు చెట్టున

చిన్న కాయగానీ కనిపించలేదు. వెదకసాగాడు వాటి కోసం. వెదకుతూ వెదకుతూ మహాముని శమీకముని ఆశ్రమానికి చేరుకున్నాడు. శమీకుడు అక్కడ సమాధినిష్ఠుడై తపస్సు చేసుకుంటున్నాడు. అతన్ని సమీపించాడు పరీక్షిత్తు. దాహంగా ఉందని చెప్పాడు. నీరు ప్రసాదించమని వేడుకున్నాడు. సమాధానం లేదు శమీకుని దగ్గర నుంచి. అతను సమాధి స్థితిలో ఉన్నాడన్నది పరీక్షిత్తు తెలుసు కోలేకపోయాడు. తీవ్రకోపాన్ని తెచ్చుకున్నాడు. చక్రవర్తినన్న గౌరవం లేదని, దాహం తీర్చమంటే కనీసం బదులు లేదని పట్టరాని ఆగ్రహంతో ఊగిపోయాడు. శమీకుడు నిజంగా తపస్సులో ఉన్నాడా? లేకపోతే చక్రవర్తి పిలిస్తే పలికేదేమిటని పరాకు చేస్తున్నాడా? తేల్చుకోవాలనుకున్నాడు పరీక్షిత్తు. దగ్గరలో నేల మీద చచ్చి పడి ఉన్న పాముని చూశాడు. దానిని తన వింటి కొనతో తీసి, శమీకముని మెడలో వేశాడు. తగిన శిక్ష వేశాననుకుని నిష్క్రమించాడక్కణ్ణుంచి పరీక్షిత్తు.

శమీకుని కుమారుడు శృంగి. బాలుడు అయినప్పటికీ మహా తేజశ్శాలి. స్నానం చేసి నదీతీరం నుండి వచ్చాడక్కడికి. తండ్రి మెడలో చచ్చిన పాముని చూశాడు. కోపం కలిగింది. ఎవరు చేసి ఉంటారు ఈ పని? అని కళ్ళు మూసుకున్నాడు. పరీక్షిత్తు పని అని తెలుసుకున్నాడు.

బ్రాహ్మణులంటే చక్రవర్తులకు ఎంత చులకన? కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తించాడు పరీక్షిత్తు. అలాంటి వాణ్ణి క్షమించకూడదనుకున్నాడు. శుచిగా ఉన్నాడేమో! కమండలంలోని నీరు అందుకున్నాడు.

''నా తండ్రిని ఇంతగా అవమానించిన చక్రవర్తిపరీక్షిత్తు నేటికి ఏడవ నాడు తక్షకుడు అనే పాము కాటుకి బలి అయ్యి మరణించుగాక'' అని శపించి, శాంతించాడు. కాస్సేపటికి సమాధి స్థితి నుండి తేరుకున్నాడు శమీకుడు. కళ్ళు తెరిచాడు.



మెడలో చచ్చిన పాముని చూసి, నవ్వుతూ తీసి పారేశాడు.

''ఏమిటీ అల్లరి?'' కొడుకుని ప్రశ్నించాడు.

అల్లరి తనది కాదని, పరీక్షిత్తు చేశాడని చెప్పి, తగిన శాపం ఇచ్చానన్నాడు శృంగి. ఆ మాటలకి దిగ్భ్రమచెందాడు శమీకుడు. గొప్ప పుణ్యాత్ముడు. మంచి మనిషి పరీక్షిత్తుకి అంతటి శాపం తగదన్నాడు.

''ఎంత పని చేశావయ్యా! ఘోర పాపానికి పాల్పడ్డావు. పరీక్షిత్తు ఎవరనుకున్నావు? విష్ణుదేవాంశ సంభూతుడు. పరమభాగవతుడు. ధర్మమూర్తి. అశ్వమేధాలు చేసిన రాజర్షి. ఆ రాజర్షికా ఇంతటి శాపం? ముందు వెనుకలు ఆలోచించవా?'' కుమారుని కసురుకున్నాడు శమీకుడు. తల వంచుకున్నాడు శృంగి.

''మహోన్నతుడు, మంచివాడు కాబట్టి పరీక్షిత్తు నీకు ప్రతిశాపం ఇవ్వలేదు. లేకపోతే... భగవంతుడా నువ్వే రక్ష'' అన్నాడు శమీకుడు. బాధపడ్డాడు. అంతా దైవప్రేరణ అనుకున్నాడు కాస్సేపటికి.

హస్తినాపురానికి చేరుకున్న పరీక్షిత్తు తెలియని బాధతో అశాంతికి గురయ్యాడు. శమీకమునికి తను చేసిన అపరాధాన్ని పదే పదే తలచుకుంటూ తల్లడిల్లిపోసాగాడు. ఒకనాడు శమీకముని శిష్యుడు వచ్చాడు. పరీక్షిత్తుని కలసి, శృంగి శాపాన్ని తెలియజేశాడతనికి. ఇక ఏడంటే ఏడు రోజుల్లో తక్షకుని కాటుకి బలయ్యి, మరణిస్తావని చెప్పాడు. దానికి పరీక్షిన్మహారాజు బాధపడలేదు. చేసిన తప్పుకి సరయిన శిక్ష అనుకున్నాడు. శ్రీహరే శరణ్యమనుకున్నాడు. సమస్త భోగాలూ కాలదన్నాడు. సర్వమోహాల్నీ విడనాడాడు. సకల బంధాల్నీ తెంచుకుని, ఆ మహా విష్ణువే దిక్కు అనుకుని, ఆ దేవదేవుని మీద మనసు నిలుపుకున్నాడు. విష్ణుపాదోద్భవం, పరమ పవిత్రమయిన గంగానది తీరాన ప్రాయోపవేశానికి సిద్ధమయినాడు. ఆ సమయానికి తీర్థయాత్రలో భాగంగా, బ్రహ్మర్షులూ, దేవర్షులూ అయిన అత్రి, వసిష్ఠుడు, చ్యవనుడు, శరద్వంతుడు, అరిష్టనేమి, భృగువు, పరాశరుడు, పరశురాముడు, భరద్వాజుడు, అంగిరసుడు, అగస్త్యుడు, దేవలుడు, గౌతముడు, మైత్రేయుడు, వ్యాసుడు, నారదుడు మొదలయిన వారంతా తమ తమ శిష్యులతో అక్కడకి విచ్చేశారు. వారికి ఎదురేగాడు పరీక్షిత్తు. చేతులు జోడించి, నమస్కరించాడు. వారిని పూజించి, ఉచితాసనాలను కల్పించాడు. ఇలా అన్నాడు.

''ఎన్నడో చేసుకున్న పుణ్యం, మిమ్మల్నిలా దర్శించాను. దయావిహీనమయిన క్షత్రియ వంశంలో జన్మించినా, మీ అందరి అనుగ్రహం వల్లనేమో! భక్తి జ్ఞానాలు అలవడినాయి. సుఖ సంపదలకు ఎప్పుడు స్వస్తి చెబుదామా అని ఎదురు చూస్తున్న నాకు, శృంగి శాపం వరమయింది. ఆ శ్రీమన్నారాయణుడే శరణనుకుని బయల్దేరాను. తక్షకుని కాటు నాకు తప్పదు. చనిపోతాను. చనిపోయే ముందు విష్ణుకథలు వినాలని ఉంది, దయ ఉంచి, నాకు వాటిని వినిపించండి. ముందు ముందు ఏ జన్మలెత్తినా నాకు భదవద్భక్తీ, భాగవతానురక్తీ, బ్రాహ్మణ మైత్రీ కలిగేటట్టుగా దీవించండి.''

పరీక్షిత్తుని ఋషులంతా ఆదరపూర్వకంగా చూశారు.

''కుమారుడు జనమేజయునికి రాజ్యభారాన్ని అప్పగించి, ప్రాయోపవేశానికి సిద్ధమయ్యాను. కరుణించండి.'' అన్నాడు మళ్ళీ. ఆ మాటకి ఆకాశంలో దేవదుందుభులు మోగాయి. పుష్పవర్షం

కురిసింది. మహర్షులు గమనించారది. పరీక్షిత్తుని వేనోళ్ళ ప్రశంసించారు. అతను దేహత్యాగం చేసే వరకూ అక్కడే ఉండిపోదలచి, ఒకరినొకరు అంగీకారంగా చూసుకున్నారు. సరిగ్గా అదే సమయానికి మహర్షి వ్యాసుని పుత్రుడు, శుకయోగి అటుగా వచ్చాడు. పదహారేళ్ళ వయసులో ఉన్న శుకయోగిని చూసి, అంతా అతనికి ఎదురేగారు. స్వాగతం పలికి, తోడుకుని వచ్చారు. పూజించారతన్ని. చేతులు జోడించి, పరీక్షిత్తు ఇలా అన్నాడతనితో.

''మహర్షులకు కూడా నీ దర్శనభాగ్యం కష్టం. అలాంటిది, నాకు కలగడం నా పూర్వపుణ్యఫలం అనుకుంటాను. నీ దర్శనభాగ్యం చేత నా పాపాలన్నీ పటాపంచలయినాయి. ఎక్కడా ఆవుపాలు పితికినంత సేపు ఉండని నువ్వు, ఇక్కడ ఇలా ఇంతసేపు ఉండడం మా అదృష్టం. నీకు తెలిసే ఉంటుంది. నేను దేహత్యాగానికి సిద్ధమయి ఉన్నాను, తరుణోపాయమయిన తత్త్వోపదేశం చెయ్యి.''

పరీక్షిత్తుని ప్రార్థనకు శుకయోగీంద్రుడు సన్నగా నవ్వాడు. అతనికి అప్పుడు భాగవతాన్ని వినిపించాడు. మోక్షాన్ని ఆశించే వారంతా హరికథలు వినాలని బోధించాడు. అవసానదశలో హరిభక్తి, హరినామసంకీర్తన ఒక్కటే మోక్షసాధన అన్నాడు. కాలాన్నెంత వృథా చేసుకున్నప్పటికీ ఒక్క ఘడియ పాటు శ్రీహరిని ప్రార్థిస్తే చాలు, శ్రేయస్సు చేకూరుతుంది. ముహూర్తకాలం శ్రీహరిని ధ్యానించి, ముక్తి పొందిన వారెందరో ఉన్నారన్నాడు శుకయోగి.

''పరీక్షన్మహారాజా! చావు తప్పదని, చేసేదేమీ లేదని దిగులు పడకు. భక్తి కుదిరితే ముహూర్త కాలం చాలు, మోక్షం లభిస్తుంది. నీకింకా ఏడు రోజులు ఆయుః పరిమాణం ఉంది. సునాయసంగా మోక్షసాధన సమకూర్చుకోగలవు'' అన్నాడు శుకుడు. ఆశగా చూశాడు పరీక్షిత్తు.

''నా తండ్రి వ్యాసమహర్షి నాకు మాత్రమే ఉపదేశించిన మహాభాగవతం నీకు బోధిస్తాను. విని, శుభపరంపరలు అందుకో'' అన్నాడు శుకుడు.

పరీక్షిత్తునకు భాగవతాన్ని చెప్పాడు.

## భక్తియోగం

భాగవత తత్త్వానికి భక్తియోగమే ప్రధానం. ఇంద్రియాలను జయించి, మనస్సును విషయవాంఛల వైపునకు పోనీయకుండా జాగ్రత్త వహించాలి. గుర్రాన్ని కళ్ళెంతో పట్టినట్టుగా చెలరేగే భావనలన్నిటినీ నిగ్రహించుకోవాలి. భగవంతుని మీదే మనస్సును లగ్నం చెయ్యాలి. ఉరుకుల పరుగుల నది సముద్రసంగమంతో శాంతించినట్టుగా మనస్సు ఎక్కడైతే స్థిరపడి శాంతి పొందుతుందో అదే వైకుంఠం. మనస్సు చెదిరితే శ్రీహరి నామసంకీర్తనంతో దాన్ని నిరోధించాలి. సంకీర్తనప్రియుడు శ్రీహరి భక్తియోగానికే పట్టుబడతాడు అన్నాడు శుకుడు. ఈ అఖిలాండకోటి బ్రహ్మాండం అంతా విరాట్పురుషుని స్థూలరూపం అన్నాడు. విశ్వం యావత్తూ విష్ణుమయం. బ్రహ్మాదులంతా విష్ణువును ధ్యానించే కృతార్థులయినారు. నారదునికి బ్రహ్మ బోధించిన తత్త్వాన్ని వివరించి, సమస్త లోకాల సృష్టి పరిణామాన్ని కూడా పరీక్షిత్తుకి చెప్పాడు శుకుడు. భగవంతుని అనంతకోటి అవతారాల్లో కృష్ణావతారమే గొప్పదన్నాడు. కాల స్వరూపం, యుగధర్మాల గురించి కూడా చెప్పాడు.

## విదురుడు-మైత్రేయుడు

వ్యాసునికీ-దాసికీ పుట్టిన కుమారుడు విదురుడు. ఇతడు ధృతరాష్ట్రునికి తమ్ముడు. ధర్మమూర్తి యముడు మాండవ్యముని శాప కారణంగా భూలోకంలో విదురునిగా జన్మించాడు. ధర్మమూర్తే విదురుడవడంతో అతను నీతికీ, న్యాయానికీ, ధర్మానికీ మారుపేరుగా నిలిచాడు. పాండవులకు కౌరవులు చేసిన అన్యాయాలను నిరసించాడితను. కౌరవుల అన్యాయాల గురించి ధృతరాష్ట్రునికి చెప్పి, ముందే హెచ్చరించాడు. అయినా పాండవులకూ కౌరవులకూ యుద్ధం తప్పలేదు. యుద్ధాన్ని తప్పించడానికి, సంధి కోసం ఎంతగానో ప్రయత్నించాడు. ఫలించలేదు. కురుక్షేత్ర సంగ్రామం మొదలయింది. విదురుడు ఎవరి పక్షానా నిలవలేదు. దాయాదుల మధ్య యుద్ధం చూడలేనంటూ తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు. తిరిగి వచ్చే వేళకి యుద్ధం ముగిసింది. కౌరవలంతా చనిపోయారు. అప్పుడు ధృతరాష్ట్రునికి వైరాగ్యాన్ని బోధించింది విదురుడే! అతన్ని తపోవనానికి పంపింది కూడా విదురుడే! ఉద్ధవుని ముఖతః శ్రీకృష్ణ నిర్యాణాన్ని తెలుసుకున్నాడు. ఇక జీవించడం చాలనుకున్నాడు. హిమవత్పర్వత ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ తనువు చాలించాడు.

విదురుడు మహానీతివేత్త కావడంతో అతను బోధించిన నీతి 'విదురనీతి'గా ప్రసిద్ధి చెందింది. అందరికీ ప్రమాణమయింది.

విదురుడు తీర్థయాత్రలు చేస్తున్న సమయంలోనే అతను, మైత్రేయుడనే మహామునిని సందర్శించాడు. ఆయన చెప్పగా భగవంతుని తత్త్వాన్ని తెలుసుకున్నాడు. ఆత్మజ్ఞానం పొందాడు. యోగులెవరూ తెలుసుకోలేని సంగతులెన్నో విదురునికి మైత్రేయుడు తెలియజేశాడు. బ్రహ్మదేవుని జన్మ వృత్తాంతం, కాల లక్షణం, సృష్టి విధానం... చాలా చెప్పాడతనికి.

శ్రీమన్నారాయణుని నాభి కమలం నుండే బ్రహ్మ ఉద్భవించాడు. సమస్త లోకాల్నీ ఏకకాలంలో చూసేందుకు వీలుగా అతనికి నాలుగు ముఖాలు ఏర్పడ్డాయి. అలా ఏర్పడిన నాలుగు ముఖాలతో ఎన్నో వేల సంవత్సరాలు తపస్సు చేశాడు బ్రహ్మ. అప్పుడు నారాయణుని అనుగ్రహం పొందాడు. పరమేశ్వరతత్త్వాన్ని తెలుసుకున్నాడు. సమస్తలోకాలనూ, సకలజీవరాసులనూ సృష్టించే శక్తి సామర్థ్యాలు సాధించాడు.

# కాల పరిమాణం:జయవిజయుల శాపకారణం

బ్రహ్మ నాలుగు ముఖాల నుండి ప్రధానమైన నాలుగు వేదాలూ ముందు పుట్టాయి. తర్వాత ఉపవేదాలూ, పురాణేతిహాసాలయిన పంచమవేదం పుట్టాయి. బ్రహ్మ తూర్పు ముఖం నుండి ఋగ్వేదం పుట్టింది. దక్షిణ ముఖం నుండి యజుర్వేదం పుట్టింది. పశ్చిమ ముఖం నుండి సామవేదం పుడితే, ఉత్తర ముఖం నుండి అధర్వణ వేదం పుట్టింది. ఇలాగే ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, శిల్పశాస్త్రం తదితరాలు పుట్టాయి.

ఊర్ధ్వరేతస్కులయిన సనకసనందన, సనత్కుమార, సనత్సుజాతులనూ, మునీంద్రులనూ బ్రహ్మే పుట్టించాడు. అయితే వారంతా సృష్టికి తోడ్పడక, మోక్షాన్ని ఆశించి మరలిపోయారు. దాంతో బ్రహ్మ ఆత్మసమానులయిన పదిమంది మానసపుత్రులను పుట్టించాడు. బ్రహ్మ

బొటనవేలు నుండి దక్షుడు పుట్టాడు. తొడ నుండి నారదుడు పుట్టాడు. నాభి నుండి పులహుడు పుడితే, కళ్ళ నుండి క్రతువు, ముఖం నుండి అంగిరసుడు, ప్రాణం నుండి వసిష్ఠుడు, హృదయం నుండి మరీచి పుట్టారు. బ్రహ్మ కుడిచేతినుండి ధర్మం పుడితే, వెన్ను నుండి కర్దమ ప్రజాపతి పుట్టాడు. ఈ కర్దముడే తర్వాత దేవహూతికి భర్త అయినాడు. ఇలా బ్రహ్మ మనస్సు నుండి, శరీరం నుండి ఎందరు పుట్టినా సృష్టి వృద్ధి కాలేదు. ఏం చేయాలో పాలుపోలేదతనికి. అప్పుడు బ్రహ్మ శరీరం రెండు భాగాలుగా చీలిపోయింది. కుడి భాగం నుండి స్వాయంభువ మనువు పురుషుడుగా పుడితే, ఎడమ భాగం నుండి శతరూప స్త్రీగా పుట్టింది. వారిద్దరూ దంపతు లయ్యారు. వారు దంపతులు కావడంతో సృష్టి కొనసాగింది. స్వాయంభువమనువుకూ, శతరూపకూ ఇద్దరు కుమారులు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడుతో పాటు ముగ్గురు కుమార్తెలు ఆకూతి, దేవహూతి, ప్రసూతి జన్మించారు. ఆకూతి రుచికుణ్ణి పెళ్ళాడింది. దేవహూతి కర్దముని పెళ్ళాడింది. ప్రసూతి దక్షుణ్ణి పెళ్ళాడింది. ఈ పెళ్ళిళ్ళతో, వారి సంతతితో జగత్తు అంతా నిండిపోయింది.



## కాలపరిమాణం

పరమాణువు కంటే చిన్న వస్తువూ, విరాట్టు కంటే పెద్ద వస్తువూ లేవు. సమస్త కార్యాచరణ అంతా పరమాణు సంకల్పమే! పరమాణువులు ఒకటికొకటి కలియడంతోనే చర్య సిద్ధిస్తోంది. కాలపరిమాణానికీ, పరిణామానికీ కూడా పరమాణువులే కారణం. సూర్యగమనంతో ఈ కాలాన్ని విభజిస్తున్నారు. సూర్యుడు ఎంతకాలంలో పరమాణువుని చేరగలుగుతాడో ఆ కాలాన్ని పరమాణువుగా పేర్కొంటున్నారు. కాల పరిమాణంలో స్వల్పమైనది పరమాణుకాలం. ఈ విధంగా సూర్యుడు ద్వాదశరాశితో తేజరిల్లే భువనాన్ని దాటేందుకు ఎంత కాలం పడుతుందో దాన్ని 'సంవత్సరం' అంటున్నారు. ఇలాంటి సంవత్సరాలు అనేకానేకం కలిస్తేనే మన్వంతరాలు ఏర్పడుతున్నాయి.

రెండు పరమాణుకాలాల్ని కలిపి 'అణుకాలం' అంటున్నారు. మూడు అణువుల కాలాన్ని 'త్రసరేణువు' అని పేర్కొంటున్నారు. కిటికీ రంధ్రాల నుంచి ప్రసరించే సూర్యకిరణాల్లో కనిపించి, ఆకాశానికి ఎగసిపోయే పరాగకణమే త్రసరేణువుగా గుర్తించాలి. ఈ త్రసరేణువు ఉన్న ప్రదేశాన్ని సూర్యుడు ఎంత సేపట్లో అతిక్రమిస్తాడో అదే త్రసరేణుకాలం. ఇలాంటి మూడు త్రసరేణు కాలాల్ని కలిపి ఒక 'త్రుటి' అంటున్నారు. నూరు త్రుటులకాలం ఒక 'వేధ'. మూడు వేధల కాలం ఒక లవం. మూడు లవాల కాలం ఒక నిమేషం. మూడు నిమేషాలు ఒక క్షణం. అయిదు క్షణాలు ఒక కాష్ఠ. పదికాష్ఠలు ఒక లఘువు. పదిహేను లఘువులు ఒక నాడిక. రెండు నాడికలు లేదా రెండు ఘడియలు ఒక ముహూర్తం. ఆరేడు నాడికల కాలాన్ని 'జాము' అంటున్నారు.

పగటి పరిమాణాన్ని తెలుసుకునేందుకు ఓ సాధనాన్ని కనుగొన్నారు. పన్నెండున్నర పలము(మూడు తులాల బరువు)ల గల రాగిపాత్రను తయారు చెయ్యాలి. నాలుగు మినపగింజల ఎత్తుగల బంగారంతో నాలుగు అంగుళాల పొడవుండే ఒక కణిక తయారు చెయ్యాలి. ఈ కణికతో ఆ రాగిపాత్రకు ఒక రంధ్రం చెయ్యాలి. ఈ రంధ్రం ద్వారా నీరు లోపలికి ప్రవేశిస్తే, పాత్ర ఎంత సేపట్లో నిండుతుందో ఆ కాలాన్ని ఒక 'నాడిక' అంటారు. ఈ నాడికకే 'ఘడియ' అని మరో పేరు కూడా ఉంది.

నాలుగు జాముల కాలం మానవులకు ఒక పగలు. అలాగే నాలుగు జాముల కాలం ఒక రాత్రి. మొత్తం ఎనిమిది జాముల కాలం ఒక అహోరాత్రం. పదిహేను అహోరాత్రాలు ఒక పక్షం. ఈ పక్షాలు రెండు, ఒకటి శుక్లపక్షం, రెండు కృష్ణపక్షం. ఈ రెండు పక్షాలూ కలిపితే ఒక మాసం. రెండు మాసాలు ఒక ఋతువు. మూడు ఋతువులు ఒక ఆయనం. ఈ ఆయనాలు రెండు. ఒకటి ఉత్తరాయనం. రెండు దక్షిణాయనం. ఈ ఆయనాలు రెండూ కలిస్తే మానవులకు ఒక సంవత్సరం. నూరు సంవత్సరాలు పరమాయువు.

మానవుల మాసం పితృదేవతలకు ఒక రోజు. అలాగే మానవుల సంవత్సరం దేవతలకు ఒక దినం.

యుగాలు నాలుగు. అవి కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు. యుగానికీ యుగానికీ మధ్య కాలాన్ని 'సంధ్యాంశ'గా పేర్కొంటున్నారు. ఈ సంధ్యాంశతో కలుపుకుని కృతయుగ పరిమాణం పదహారు వేల ఎనిమిది వందల దివ్య సంవత్సరాలు. సంధ్యాంశతో కూడిన త్రేతాయుగ

పరిమాణం పది హేను వేల ఆరు వేల దివ్య సంవత్సరాలు. అలాగే ద్వాపరయుగం పద్నాలుగు వేల నాలుగు వందల సంవత్సరాలు. కలియుగం పదమూడు వేల రెండు వందల సంవత్సరాలు.

ఈ నాలుగు యుగాలూ వేయిసార్లు తిరిగితే బ్రహ్మకు ఒక పగలు. అలాగే వేయిసార్లు తిరిగితే ఒక రాత్రి. బ్రహ్మ మెలకువలో ఉంటే సృష్టి జరుగుతుంది. నిద్రపోతే విలయం సంభవిస్తుంది. పద్నాలుగు మంది మనువుల కాలం బ్రహ్మకు ఒక రోజు. ఒకొక్క మనువు ఆయుః ప్రమాణం డెబ్బయి ఒక్క మహాయుగాలు. మనువుల మధ్య ఉండే భాగాల్నే మన్వంతరాలు అంటారు. ఈ మన్వంతరాలలోనే మనువంశపురాజులూ, సురలూ, మునులూ భగవదంశాన పుట్టి పాలన చేస్తారు. బ్రహ్మమానంలో నూరేళ్ళు బ్రహ్మకు ఆయువు. అతని ఆయువులోని సగభాగాన్ని 'పరార్థం' అంటారు.

విదురుడికి మైత్రేయుడు కాలపరిమాణం గురించి చెబుతున్న సమయానికి బ్రహ్మకు మొదటి పరార్థం గడిచింది. రెండవది నడుస్తున్నది. మొదటి పరార్థం మొదటి భాగంలోనే బ్రహ్మ జన్మించాడు. కాబట్టి దీనిని 'బ్రహ్మకల్పం' అన్నారు. క్షీరసాగరమధ్యంలో శయనించిన శ్రీమన్నారాయణుని నాభి నుంచి పద్మం ఉద్భవించిన కాలం 'పద్మకల్పం'. ఈ రెండు కల్పాలూ మొదటి పరార్థంలో గతించాయి. రెండవ పరార్థం మొదటి భాగంలో శ్రీమన్నారాయణుడు వరాహావతారం దాల్చాడు. ఆ కారణంగానే 'వరాహకల్పం' అని పేరొచ్చింది. ఇప్పుడు నడుస్తున్నది వరాహకల్పం.

## జయవిజయులు

అనంతకోటి అవతారాలలో భగవంతుని పది అవతారాలే ప్రధానమయినవి. జగత్కంటకులయిన రాక్షసులను సంహరించి, భూభారాన్ని తగ్గించేందుకే భగవంతుడు ఒకొక్క అవతారాన్నీ దాల్చాడు.

రాక్షసులలో కొందరు మహాబలశాలులై, వరప్రభావంతో కూడా మరణాన్ని శాసిస్తూ లోకాలన్నిటినీ వేధిస్తూ వచ్చారు. రాక్షసుల్లో హిరణ్యాక్ష–హిరణ్యకశిపులు, రావణ–కుంభకర్ణులు ముఖ్యులు. అసాధారణ బల పరాక్రమాలు కలిగిన ఈ రాక్షసులు, దేవాంశతో శాపవశాన భూమి మీదకు రాగలిగారు. ఈ శాపానికి కారణమైనదే జయవిజయుల కథ

వైకుంఠంలో విష్ణుమూర్తి వద్ద ఇద్దరు ద్వారపాలకులు ఉంటారు. వారి పేర్లు జయుడు–విజయుడు. ఇద్దరూ విష్ణుభక్తులే! ఒకనాడు సనకసనందనాదులు విష్ణు సందర్శనార్థం వైకుంఠానికి వచ్చారు.

సనకసనందనాదులు మహామునులు, బ్రహ్మ మానసపుత్రులు, అసాధారణ మహిమలు గల మహనీయులు. సకల జగత్తూ వారికి ఈశ్వరమయంగానే కాన వస్తుంది. సమస్తలోకాలనూ యోగబలంతో సంచరించగలిగే వారికి ఎక్కడా ఎలాంటి అడ్డూ ఆపూ లేదు, ఉండదు. వారెప్పుడూ అయిదేళ్ళ ప్రాయంలోనే ఉంటారు. నగ్నంగా ఉంటారు. బాలురవలే కనిపిస్తారు.

వైకుంఠంలో ప్రవేశించిన సనకసనందనాదులు ఆరు ద్వారాలు దాటారు. ఏడవ ద్వారం దగ్గరకు చేరుకున్నారు. అక్కడే జయవిజయులు కాపలాగా ఉన్నది. లక్ష్మీదేవి, విష్ణుమూర్తుల కేళీమందిరమే ఏడవ ద్వారం. ఆ ద్వారం దాటాలంటే జయవిజయుల అనుమతి ఉండి

తీరాల్సిందే! అయితే సనకసనందనాదులకు ఒకరి అనుమతితో పని లేదు. బ్రహ్మ స్వరూపులు వారు. ఏడవ ద్వారం దాటబోతున్నారు. గమనించారది జయవిజయులు. అడ్డగించారు వారిని. అడ్డగించడమే కాదు, మదాంధులై ఆ మహామునుల్ని నిందావాక్యాలతో అవమానించారు.

''చిన్నపిల్లలు! దిగంబరులై ఉన్నారు. ఇంకో మాటగా చెప్పాలంటే పిచ్చివాళ్ళలా కనిపిస్తున్నారు. ఎక్కడికి వెళ్తున్నారు? ఇది వైకుంఠం. ఏడవ ద్వారం. ఏకాంత మందిరంలోని ఆ శ్రీహరిని సందర్శించాలంటే మా అనుమతి కావాలి. తీసుకున్నారా? లేదు. లేనప్పుడు ఎలా వెళ్ళగలుగుతున్నారు? పొండి, పొండిక్కణ్ణుంచి.''

సనకసనందనాదులు నిలబడిపోయారు. ఒకరినొకరు చూసుకున్నారు. తర్వాత జయవిజయుల్ని చూసి ఆగ్రహం చెందారు. ఇలా అన్నారు.

''జయవిజయులారా! మమ్మల్ని ఎవరనుకుంటున్నారు? మేము సనకసనందనాదులం. విష్ణుభక్తులం. ఆ శ్రీహరిని సందర్శించడానికి మాకు ఒకరి అనుమతి అనవసరం. నిష్కాములమయిన మేము శ్రీహరిని సేవించేందుకు వెళ్తుంటే మమ్మల్నే మీరు అడ్డుకుంటారా? దురాత్ములు మీరు. ఇక్కడీ పుణ్యలోకంలో ఉండడానికి మీరు అనర్హులు. మీ పాపానికి భూలోక మే గతి. వెళ్ళి, భూలోకంలో పుట్టండి. పొండి.''

ఆ శాపానికి జయవిజయులు భయకంపితులయినారు. మునుల కాళ్ళ మీద పడ్డారు. కాపాడమని వేడుకున్నారు.

''మహామునులారా! మీ పట్ల తప్పుగా ప్రవర్తించాం. మమ్మల్ని క్షమించండి. శ్రీహరికి దూరంగా మేము ఒక్క క్షణం కూడా జీవించలేం. కరుణించండి. మీ శాపానికి తిరుగులేదు, ఆ సంగతి మాకు తెలుసు. అందుకనే మా కోరిక మన్నించండి. మేము ఏ జన్మ ఎత్తినా, ఎక్కడ ఉన్నా, మాకు భగవద్భక్తీ, భగవన్నామ స్మరణా ఉండేటట్టుగా అనుగ్రహించండి.'' ప్రార్థించారు. వినిపించుకోలేదు సనకసనందనాదులు. జయవిజయులు వేడుకుంటూనే ఉన్నారు. ఏకాంతమందిరంలోని శ్రీహరికి ఇదంతా వేడుకగా అనిపించింది. నవ్వుకుని, బయటికి వచ్చాడతను. శ్రీహరిని చూస్తూనే మునులంతా చేతులెత్తి నమస్కరించారు. అనేక వేదమంత్రాలతో సన్నుతించారతన్ని. సంతోషించాడు శ్రీహరి. తర్వాత జయవిజయుల్ని చూశాడు. తనంతా గ్రహించినట్టుగా వారికి చూపులతోనే తెలియజేశాడు. ఇటు తిరిగి మునులతో ఇలా అన్నాడు.

''మహామునులారా! ఈ జయవిజయులు మీ పట్ల క్షమించరాని నేరమే చేశారు. వారు శిక్షార్హులే! సేవకులు చేసిన అపకారాలూ, అపచారాలన్నీ ప్రభువుకే చెందుతాయి. ఈ కారణంగా నేను కూడా మీ పట్ల తప్పుగా ప్రవర్తించినట్టే! అందుకనే వేడుకుంటున్నాను, క్షమించండి. మునులు దైవసమానులు. అందునా నా భక్తులు నా కంటే అధికులు. మీ మాటలు పొల్లు పోవు. మీ శాపం ఫలించి తీరుతుంది.''

''అంతా నీ లీల'' అన్నారు మునీశ్వరులు. శ్రీహరిని మరోసారి కళ్ళ నిండుగా చూసుకుని, అక్కణ్ణుంచి నిష్క్రమించారు. మహామునులు మరలిపోవడం చూసి, తర్వాత ఇటు శ్రీహరి వైపు చూశారు జయవిజయులు. బాధపడ్డారు. కళ్ళు చెమర్చుకున్నారు. శ్రీహరి పాదాల మీద పడ్డారిద్దరూ.

''అజ్ఞానంతో మునులను అవమానించాం. నీ సేవకులుగా నీకు మహోపచారం చేశాం. తప్పే చేశాం. ఒప్పుకుంటున్నాం. కాని, వారి శాపాన్ని మేము భరించలేం. నీకు దూరంగా జీవించలేం. కరుణించు దేవా! కటాక్షించు.'' వేడుకున్నారు.

''మునుల శాపం తిరుగులేనిది. అనుభవించి తీరాల్సిందే! పైగా మీకు లక్ష్మీదేవి శాపం కూడా ఉంది. జ్ఞప్తికి తెచ్చుకోండి. ఒకనాడు నేనూ లక్ష్మీదేవి ప్రణయకలహం కారణంగా విడిపోయాం. నేను నా ఏకాంతమందిరంలో అలిగి పడుకున్నాను. నా అలక తీర్చేందుకు లక్ష్మీదేవి వస్తోంటే అప్పుడు కూడా మీరిలాగే ఆమెను అడ్డుకున్నారు. ఆనాడు ఆమె కూడా మిమ్మల్ని శపించింది. మునుల శాపం, లక్ష్మీదేవి శాపం ఫలించి తీరాల్సిందే! తప్పదు'' అన్నాడు శ్రీహరి.

దిక్కు తోచక వెక్కి వెక్కి ఏడవసాగారు జయవిజయులు. జాలి చెందాడు శ్రీహరి. ఇలా అన్నాడు మళ్ళీ.

''దిగులు పడకండి. భూలోకంలో మీరు రాక్షసులై జన్మిస్తారు. నాకు బద్ధ విరోధులై, దేవ బ్రాహ్మణులకు అపకారం చేస్తూ జీవిస్తారు. ఆఖరికి నా చేతుల్లోనే హతులవుతారు. మూడు జన్మల అనంతరం మళ్ళీ మీకు వైకుంఠ ప్రవేశం ఉంటుంది. స్నేహంతోగాని, శత్రుత్వంతోగాని నిరంతరం నన్ను స్మరించేవారికి నా సాయుజ్యం లభించకుండా ఉండదు. విరోధం కారణంగా మీరు ఎల్లప్పుడూ నన్నే స్మరిస్తూ ఉంటారు. అనుక్షణం నన్ను ద్వేషిస్తూ ఉంటారు. ఆ కారణంగా మీరు నన్ను ఎడబాసి ఉన్నట్టే ఉండదు. శీఘ్రకాలంలో మీరు నన్ను చేరేందుకు ఇదే సరయిన మార్గం'' అన్నాడు శ్రీహరి. జయవిజయుల్ని ఓదార్చాడు.

# హరి హిరణ్యాక్షుల యుద్ధం

జయవిజయులు కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగాను, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగాను, ద్వాపరయుగంలో శిశుపాల దంతవక్త్రులుగాను జన్మించారు. అలా జన్మించి, శ్రీహరితో శత్రుత్వాన్ని పెంచుకున్నారు. అప్పుడు శ్రీహరి వరాహావతారం ఎత్తి హిరణ్యాక్షుణ్ణి, నరసింహావతారం ఎత్తి హిరణ్యకశిపుణ్ణి సంహరించాడు. రామావతారం దాల్చి రావణ కుంభకర్ణుల్ని వధించాడు. కృష్ణావతారం ధరించి, శిశుపాల దంతవక్త్రులను అంతమొందించాడు. ఇలా మూడు జన్మలలోనూ శ్రీహరితో శత్రుత్వాన్ని సాధించి, చివరికి జయవిజయులిద్దరూ వైకుంఠం చేరుకున్నారు.

## హిరణ్యాక్షుడు

బ్రహ్మ దేహం నుండి పుట్టిన స్వాయంభువు, శతరూపలు దంపతులై మానవ సంతతిని వృద్ధి చేయసాగారు. అయితే వారుండేందుకు స్థలం లేకపోయింది. స్థలం ఎందుకు లేదంటే...బ్రహ్మ మొదట ప్రళయ జలాన్నంతా తాగేశాడు. ఆ తర్వాత ప్రజలను, దేవతలను, రాక్షసులను, పశుపక్ష్యాదులను, పర్వతాలను, ఇంకా అనేకానేకాన్ని సృష్టించడం ప్రారంభించాడు. అయితే ఆ సమయంలో భూమి, పూర్తిగా జలంలో మునిగిపోయి, రసాతలాన్ని అంటింది. రసాతలాన్ని అంటిన భూమి మీద మానవులు నిలువలేకపోయారు. వారికి నిలువ నీడ కరవయింది. దాంతో బ్రహ్మ సన్నిధికి చేరుకున్నాడు స్వాయంభువు. చేతులు జోడించి నమస్కరించాడు. ఇలా ప్రార్థించాడు.

''తండ్రీ! నీ ఆజ్ఞానుసారం మానవసంతతిని అభివృద్ధి చేస్తున్నాను. అయితే వారుండేందుకు ఎక్కడా ఏ వీలూ లేదు. భూమి యావత్తూ నీళ్ళలో ఉంటే ఎలా తండ్రీ? మానవులు ఎలా జీవిస్తారు? దయచేసి వాసయోగ్యమయిన స్థలాన్ని మాకు చూపించు.''

అవును కదా! ఎలా ఇప్పుడు? ఆలోచనలో పడ్డాడు బ్రహ్మదేవుడు. అతనికీ ఏమీ పాలుపోలేదు. రసాతలం నుండి భూమిని ఉద్ధరించేదెలాగో అంతు చిక్కలేదు. నువ్వే దిక్కు అంటూ శ్రీహరిని ధ్యానించసాగాడు. అప్పుడు బ్రహ్మ నాసికాపుటాల నుండి బొటనవేలు ప్రమాణంలో ఒక తెల్లని వరాహం పుట్టుకొచ్చింది. మరుక్షణంలోనే ఏనుగంత అయిందది. దిక్కులన్నీ తేజరిల్లింపజేసింది. శంఖ చక్ర గదాది విష్ణు చిహ్నాలతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ వరాహం శ్రీమన్నారాయణుడేనని గ్రహించాడు బ్రహ్మ. జగత్తుని రక్షించడానికే యజ్ఞవరాహమూర్తిగా అవతరించాడని తెలుసుకున్నాడతను. ముల్లోక వాసులందరికీ తెలిసిందీ సంగతి. తెలిసి, వారంతా శ్రీహరిని వేనోళ్ళ కీర్తించారు. స్తోత్రాలు చేశారు. వారంతా చూస్తూండగానే వజ్రశరీరుడైన వరాహమూర్తి పెద్దగా గర్జించాడు. జలంలోకి ప్రవేశించి, వాలాన్ని తిప్పుతూ సంచరించసాగాడు. ఆకాశానికి ఎగిరి, వాడి డెక్కలతో మేఘజలాన్ని తూలగొడుతూ విహరించసాగాడు. తెల్లటి దంష్ట్రలు కలిగి, పెద్దగా ధ్వని చేస్తూ మునులకు మహదానందాన్నీ, రాక్షసులకు మహాభయాన్నీ కలిగించసాగాడు. నాసికాపుటాలతో సముద్ర జలాన్ని ఉమిసి వేస్తూ రసాతలం ప్రవేశించాడు. అక్కడ మునిగిపోయి ఉన్న భూమిని చూశాడు. భూనభోంతరాలు దద్దరిల్లేటట్టుగా గర్జిస్తూ కోరల కొనలతో భూమండలాన్ని పైకెత్తసాగాడు. భూమిని వరాహమూర్తి అలా ఉద్ధరిస్తున్న సమయంలో మహా భయంకరుడు, అపరిమిత పరాక్రమవంతుడు, రాక్షసుడయిన హిరణ్యాక్షుడు అతన్ని అడ్డుకున్నాడు. గదని గిరగిరా తిప్పుతూ ఎదుర్కొన్నాడతన్ని.

హిరణ్యాక్షుని కథ ఇలా ప్రారంభమయింది.


దక్షుని కూతురు దితి, కశ్యప ప్రజాపతిని పెళ్ళాడింది.

ఒకానొక అసురసంధ్య వేళ ఆమెకి మన్మథోద్రేకం కలిగింది. భర్తను సమీపించింది. కశ్యపుడు అప్పుడు అగ్నిశాలలో ఉన్నాడు. నియమవ్రతుడై భగవంతుని ధ్యానిస్తున్నాడు. తన కోరికను తీర్చమని అడిగింది దితి.

''నాథా! మన్మథబాధను తాళలేకుండా ఉన్నాను. రా! నాతో సంగమించు. నా సవతులు అదితి, వినత, కద్రువ... ఇంకా అనేక మంది గర్భవతులు. నేనే గర్భవతి కానిది. సహించలేక పోతున్నాను. నాకు సంతాన భిక్ష పెట్టు.'' ప్రార్థించింది. నవ్వాడు కశ్యపుడు. ఇలా అన్నాడు.

''నీ మనోభీష్టం తప్పకుండా నెరవేరుస్తాను. అయితే ఇది మూడు సంధ్యలూ ముడిపడే వేళ. ఇది భయంకరులకు కూడా మహాభయంకరమయిన సమయం. రుద్రుడు భూతగణాలతో సంచరించే సమయం. ఈ సమయంలో సంగమించకూడదు. ఓ ఘడియ సేపాగు. తర్వాత నీ కోరిక తీరుస్తాను.''

వినలేదు దితి. మన్మథోద్రేకాన్ని తట్టుకోలేకపోయింది. ఒళ్ళు విరుచుకోసాగింది. కామం కళ్ళు కప్పడంతో కశ్యపుని గట్టిగా కౌగిలించుకుంది. విడిపించుకోజూసిన కశ్యపుణ్ణి కదలనీయక, అధరామృతాన్ని అందించింది.



'అంతా దైవప్రేరణ. తప్పదిక.' అనుకున్నాడు కశ్యపుడు. నిష్ఠని వదలి వేశాడు. దితిని ముద్దిడితూ తీసుకుని వెళ్ళి ఆమె కోరికను తీర్చాడు. తర్వాత నదికి చేరుకుని స్నానం చేసి శుచి అయినాడు. సంధ్యావందనాదులు పూర్తి చేశాడు. మౌనం దాల్చి, బ్రహ్మోపాసన చేయసాగాడు.

కోరిక తీరడంతో శరీరం చల్లబడి, తాను చేసిన తప్పేమిటో గ్రహించింది దితి. చేసిన తప్పుకి సిగ్గుపడింది. ఎంతగానో బాధపడింది. భర్తని సమీపించి మన్నించమని వేడుకుంది.

''నాథా! నువ్వు చెబుతూనే ఉన్నావు, వినలేదు. పాపాన్ని చేశాను. రుద్రుడికి కోపం కలిగించానేమో! నా గర్భస్థ శిశువుని హింసిస్తాడేమో! దేవతలు ఏ అపకారాన్ని తలపెడతారో! నువ్వే నాకు దిక్కు.'' అంది దితి.

మౌనాన్ని వీడాడు కశ్యపుడు. ఇలా అన్నాడప్పుడు.

''జరిగిందంతా విధికృతం. దీనిని తప్పించడం ఎవరితరమూ కాదు. అసురసంధ్యవేళ నన్ను కోరావు కనుక నీకందరూ రాక్షసులే జన్మిస్తారు. నీ కొడుకులిద్దరూ మహారాక్షసులై లోక కంటకు లవుతారు. దేవతలనూ, మునులనూ హింసించి, ముల్లోకాలనూ ఆక్రమించుకుంటారు. ఆఖరికి ఆ శ్రీహరి చేతిలో మరణిస్తారు.''

దితి అందుకు చాలా దుఃఖించింది. అయితే కొడుకులిద్దరూ భగవంతుని చేతిలో మరణిస్తారని తెలిసినందుకు కొంతలో కొంత మేలనుకుంది.

''నా కడుపున పుట్టిన బిడ్డలంతా రాక్షసులై లోకకంటకులై నానా అల్లరీ చేసి నాకు అమర్యాద కలిగించడమేనా? అంతేనా నా బతుకు? గొప్పవాడు ఒక్కడు కూడా పుట్టే అవకాశమే లేదా?'' కన్నీరు మున్నీరయింది దితి.

''కొడుకుగా పుట్టే అవకాశం లేదు. గొప్పవాడు నీకు మనవడుగా పుడతాడు. రాక్షసుని కడుపున పుట్టినా అతగాడు గొప్ప హరిభక్తుడై పరమ భాగవతోత్తముడు అవుతాడు. సచ్చరిత్రుడై నీకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు కలిగిస్తాడు. వాడి కీర్తిని సమస్త లోకాలూ గానం చేస్తాయి. చాలా?''

''చాలు'' అంది దితి. చేతులు జోడించి నమస్కరించి వెళ్ళిపోయిందక్కణ్ణుంచి. గర్భవతి అయింది. నూరు సంవత్సరాలు గడిచాయి. అప్పుడామె గర్భంలో ఉన్న తేజస్సు దిక్కులన్నిటా అలుముకుంది. ఆ తేజస్సు ముందు సూర్యచంద్రులు వెలవెలబోయారు. ఏది పగలో ఏది రాత్రో తెలియని స్థితి. మునులకీ, దేవతలకీ అంతు చిక్కలేదేదీ. బ్రహ్మని సమీపించారంతా. నమస్కరించారు.

''ఏమిటి దేవా, ఏమిటిదంతా?'' అడిగారు.

''ఇదంతా దితి మహిమ. దీనంతటికీ దితి గర్భమే కారణం'' అన్నాడు బ్రహ్మ. తర్వాత జయవిజయులిద్దరూ శాపవశాన ఆమె గర్భాన రాక్షసులుగా జన్మించనున్నారని తెలియజేశాడు. భయపడిన మునులనూ, దేవతలనూ చూసి ఇలా చెప్పాడు.

''ఆ రాక్షసులిద్దరినీ శ్రీహరి సంహరిస్తాడు. లోకాల్ని కాపాడుతాడు.''

మునులూ, దేవతలూ అందుకు సంతోషించారు. నిష్క్రమించారక్కణ్ణుంచి.

నూరేళ్ళూ నిండుకున్నాయి. దితికి ఇద్దరు కొడుకులు పుట్టారు. వారు పుట్టినప్పుడు ఇటు భూమి మీద, అటు అంతరిక్షంలో కూడా అనేక మహోత్పాతాలు సంభవించాయి. దిక్కులన్నీ మండిపోయాయి. చుక్కలు రాలిపోయాయి. పెనువేగంతో గాలి వీచింది. చెట్లు కూలిపోయాయి. పిడుగులు పడ్డాయి. తోకచుక్కలు పుట్టుకొచ్చాయి. సముద్రాలు అల్లకల్లోలమయ్యాయి. రక్తవర్షం కురిసింది. కుక్కలూ, నక్కలూ, గుడ్లగూబలూ భయంకరంగా అరవసాగాయి. ఆలయాల్లో దేవతాప్రతిమలన్నీ కన్నీరు పెట్టుకున్నాయి. ఆవుల పొదుగుల నుండి పాలు రాలేదు, పిండకనే రక్తం కారసాగింది. గ్రహాలన్నీ వక్రగతిలో తిరగసాగాయి. ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. ఈ మహోత్పాతాలను గమనించి, మునులూ, దేవతలూ భయకంపితులయినారు. ఆందోళన చెందసాగారు.

కఠినంగా కర్కశంగా కనిపిస్తున్న కొడుకుల్ని చూశాడు కశ్యపుడు. పెద్దవాడికి హిరణ్యకశిపుడు అనీ, చిన్నవాడికి హిరణ్యాక్షుడు అనీ నామకరణం చేశాడు. వజ్రదేహులయిన ఆ ఇద్దరూ దినదిన ప్రవర్ధమానమై పర్వతాకారులయినారు. వారు నడుస్తుంటే భూమి బద్దలయ్యేది. ఆకాశం

అదిరిపడేది. వరప్రసాదులై, మదోన్మత్తులయిన ఆ ఇద్దరూ లోకాలను చీకాకు పరచసాగారు. దేవతలనూ, మునులనూ బాధించసాగారు. అజేయులయిన హిరణ్యాక్ష హిరణ్యకశిపులను అష్ట దిక్పాలకులు కూడా అదలించలేకపోయారు.

హిరణ్యాక్షుడు ఎల్లప్పుడూ యుద్ధాన్ని కోరుకునేవాడు. అయితే అతనితో యుద్ధం చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. దేవతలు కూడా హిరణ్యాక్షుడు కనిపిస్తే చాలు, అతనికి కనిపించక దాగునేవారు. స్వర్గ మర్త్య పాతాళ లోకాల్లో తనతో యుద్ధం చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పిచ్చెక్కినట్టయింది హిరణ్యాక్షుడికి. 'రండిరా రండి! యుద్ధానికి రండి.' అంటూ కేకలేస్తూ లోకాలన్నీ చుట్టబెట్టాడు. ఎవరూ రాలేదు. భూమి మీద తనతో యుద్ధం చేసేవారు ఎవరూ లేరని తెలిసి, గదాదండం గిరగిర తిప్పుతూ సముద్రంలోనికి ప్రవేశించాడతను. చాలా ఏళ్ళు జలంలో వీరవిహారం చేసి, ఆఖరికి విభావరీపురం చేరాడు. ఆ పురం వరుణుని రాజధాని. అక్కడ నిల్చుని యుద్ధానికి వరుణుని కేకేశాడు. వరుణుడొచ్చాడు. తాను యుద్ధానికి రాలేదంటూ ముందుగా చేతులు జోడించాడతను. తర్వాత ఇలా చెప్పాడు.

''ఈ ముల్లోకాల్లోనూ నీతో యుద్ధం చెయ్యగల సమర్థుడు ఆ విష్ణుమూర్తి ఒక్కడే! అతను వైకుంఠంలో ఉన్నాడు. వెళ్ళు. నీ బలపరాక్రమాలు చూపించు.'' అన్నాడు. హిరణ్యాక్షునికి చావు దగ్గర పడిందని ఆనందించాడు. తనతో యుద్ధం చేసేందుకు ఇన్నాళ్ళకు ఒక్కడయినా దొరికాడని సంతోషించాడు హిరణ్యాక్షుడు. వైకుంఠానికి బయల్దేరాడు. ఆకాశమార్గాన పయనిస్తున్న హిరణ్యాక్షుని అటుగా వస్తున్న నారదమహాముని చూశాడు.

''మహావీరా! గదాదండం తిప్పుతూ ఎక్కడికి ఇటు? ఎవరి మీద యుద్ధానికి?'' అడిగాడు నారదుడు.

''ఎవడో విష్ణుమూర్తిట! వైకుంఠంలో ఉన్నాట్ట! నాతో యుద్ధం చేయగలిగేది వాడొక్కడే అని తెలిసింది, వాడితో యుద్ధానికి పోతున్నాను'' అన్నాడు హిరణ్యాక్షుడు.

''అలాగా'' అని నవ్వాడు నారదుడు. తర్వాత ఇలా చెప్పాడు.

''నీకు కావాల్సిన విష్ణుమూర్తి ఇప్పుడు వైకుంఠంలో లేడు. పాతాళంలో ఉన్నాడు. యుద్ధం కావాలనుకుంటే నువ్వు పాతాళానికి వెళ్ళాల్సిందే!''

నారదుని మాటతో హిరణ్యాక్షుడు పాతాళానికి పరుగుదీశాడు. అక్కడ మహాతేజస్సుతో, తనంత బలంగా, తనంత ఎత్తున ఉన్న ఒక వరాహాన్ని చూశాడతను. రసాతలంలో మునిగి ఉన్న భూమండలాన్ని యజ్ఞ వరాహరూపంలో ఉండి, కోరల కొనలతో ఎత్తుతున్నాడప్పుడు విష్ణుమూర్తి. 'ఈ వరాహమా విష్ణుమూర్తి' అని నవ్వుకున్నాడు హిరణ్యాక్షుడు.

''నువ్వేనా విష్ణుమూర్తివి? ఇలా పంది రూపంలో పాతాళంలో దాగున్నావా? నీ కోసమే వచ్చానిక్కడకి. రా! నాతో యుద్ధానికి రా.'' పిలిచాడు హిరణ్యాక్షుడు. పట్టించుకోలేదు విష్ణుమూర్తి. భూమండలాన్ని జలమధ్యం నుండి వెలికి తీసే ప్రయత్నంలో కష్టపడుతున్నాడతను.

''యుద్ధానికి రమ్మంటే రావేమిటి? నిన్నే! వినిపించడం లేదా? సిగ్గూ ఎగ్గూ ఉంటే యుద్ధానికి రా.'' రెట్టించాడు మళ్ళీ హిరణ్యాక్షుడు. అయినా విష్ణుమూర్తి నుంచి సమాధానం లేదు. శక్తియుక్తులన్నీ ఉపయోగించి, భూమండలాన్ని పైకి తీసే ప్రయత్నంలో నిమగ్నమయి ఉన్నాడు విష్ణుమూర్తి. గమనించాడది హిరణ్యాక్షుడు. ఇలా అన్నాడప్పుడు.

''ఆ భూమండలం అంతా నా అధీనం. దానిని దొంగిలిద్దామని ప్రయత్నిస్తున్నావేమో! జరగని పని. ఆజ్ఞాపిస్తున్నాను, ఆగిపో.''

ఆ మాటలకి కోపోద్రిక్తుడయ్యాడు విష్ణుమూర్తి. భూమిని నీటి ఉపరితలాన జాగ్రత్తగా నిలిపి ఉంచాడు. దాని ఆధారశక్తి తానై కదలకుండా చేశాడు. హిరణ్యాక్షుణ్ణి కోపంగా చూశాడు. క్షణం కళ్ళు మూసుకున్నాడు. మూసిన కళ్ళు తెరిచేసరికి అతను మణిమయ భూషణాలూ, బంగారు కవచాన్నీ ధరించి కానవచ్చాడు. చేతికి గదాదండం అందింది. మరుక్షణంలో హిరణ్యాక్షుని ఎదుర్కొన్నాడు వరాహమూర్తి. ఇద్దరూ ప్రళయ భీకరంగా యుద్ధం చేయసాగారు. కాలం కరిగిపోతోంది. రోజులూ, వారాలూ, నెలలూ గడిచిపోతున్నాయి. యుద్ధానికి అంతులేకుండా పోతోంది. ఆ యుద్ధాన్ని బ్రహ్మాది దేవతలూ, మునులూ దగ్గరుండి చూస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు.

# దక్షయజ్ఞం:సతీదేవి పయనం

హిరణ్యాక్షుని త్వరగా సంహరించి, లోకాల్ని కాపాడమని విష్ణుమూర్తిని వేడుకున్నారంతా. వినవచ్చిన వేడుకోలుకి 'సరే'నన్నట్టుగా తలూపాడు విష్ణుమూర్తి. రాక్షసమాయతో యుద్ధం చేస్తున్న హిరణ్యాక్షుణ్ణి మరింత గట్టిగా ఎదుర్కొన్నాడప్పుడు.

''దేవాదిదేవా! ఆలస్యం చెయ్యకు. చీకటి చిచ్చు రగలకముందే, రాత్రి కాకుండానే ఆ రాక్షసుణ్ణి అంతమొందించు.'' ప్రార్థించారు మునులు. ఆ ప్రార్థనను ఆలకించిన మరుక్షణంలోనే విష్ణుమూర్తి చక్రాయుధాన్ని ధరించాడు. వాయువు మేఘాలను చెదరిగొట్టినంత సులభంగా చక్రాయుధంతో రాక్షసమాయను ఛేదించాడు. హిరణ్యాక్షుణ్ణి సంహరించాడు. హిరణ్యాక్షుడు నేలకొరగడంతో బ్రహ్మాది దేవతలూ, మునులూ హరిని వేదసూక్తాలతో అనేక విధాల స్తోత్రం చేశారు. దేవదుందుభులు మోగాయి. పూలవాన కురిసింది. లోకాలన్నీ శాంతించాయి. హిరణ్యాక్షుణ్ణి సంహరించిన విష్ణుమూర్తి, భూమండలాన్ని రక్షించి, వరాహ అవతారాన్ని చాలించాడు. వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

## కపిలాచార్యుడు

బ్రహ్మ సృష్టించిన ప్రజాపతులలో కర్దముడు ఒకడు. సరస్వతి నదీతీరం అతని నివాసం. పదివేల సంవత్సరాలు ఘోరమయిన తపస్సు చేసి, శ్రీహరి అనుగ్రహాన్ని సంపాదించాడతను. తన కుమార్తె దేవహూతిని కర్దముడికి ఇచ్చి వివాహం చేశాడు స్వాయంభువ మనువు. కర్దముడికీ, దేవహూతికీ తొమ్మిది మంది కుమార్తెలూ, ఒక కుమారుడూ జన్మించారు. ఆ కుమారుడే కపిలుడు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని అంశతో జన్మించాడతను.

తన తొమ్మిది మంది కుమార్తెలనూ మరీచ్యాది మహామునులకు ఇచ్చి పెళ్ళి చేశాడు కర్దముడు. కళను మరీచికీ, అనసూయను అత్రికీ, శ్రద్ధను అంగీరసునికీ, హవిర్భావును పులస్త్యునికీ, గతిని పులహునికీ, క్రియను క్రతువుకీ, ఖ్యాతిని భృగుమహర్షికీ, అరుంధతిని వసిష్ఠమహర్షికీ, శాంతిని అథర్వణునికీ ఇచ్చాడు.

సాక్షాత్తూ భగవంతుడే తనకు కుమారునిగా జన్మించినందుకు కర్దముడు ఎంతగానో ఆనందించాడు. ఆఖరికి సంసారబంధాలు తెంచుకుని, ముక్తిమార్గం అనుసరించాడు. ఆ దశలో తల్లి దేవహూతికి కపిలుడే ముక్తిమార్గం బోధించాడు. ముక్తిమార్గాన్నే కాదు, ఆత్మస్వరూపాన్ని తెలియజేసి, పిండోత్పత్తిక్రమం, జీవికి కలిగే ప్రకృతి బంధాలులాంటి పరమ రహస్యాలెన్నో తెలియజేశాడు. భక్తిమార్గాన్ని కూడా ఉపదేశించాడు. మహాయోగులకు కూడా అందని అద్భుత జ్ఞానాన్ని తల్లికి బోధించి, ఈశాన్య దిశగా ప్రయాణించాడు కపిలుడు. ప్రయాణించి ప్రయాణించి, అందరూ పరమపవిత్రంగా భావించే సముద్రుడిచ్చిన స్థలంలో నివాసం ఏర్పరుచుకుని, అక్కడే యోగం అవలంబించాడు. సాంఖ్యతత్త్వాన్ని ప్రతిపాదించాడు.

కపిలుడి ఉపదేశాన్ని అనుసరించి తపోయోగంతో భగవంతుణ్ణి చేరుకుంది దేవహూతి. కొడుకు కపిలుని జ్ఞానోపదేశం పొంది, దేవహూతి సిద్ధి చెందిన ప్రదేశానికి 'సిద్ధాశ్రమం' అని పేరు. పుణ్యస్థలి అని ముల్లోకాలూ ఈ ఆశ్రమాన్ని పేర్కొంటున్నాయి.

కపిలుడు ప్రతిపాదించిన సాంఖ్యతత్త్వాన్ని ఆసురి, పంచశిఖుడూ మొదలయిన వారంతా తర్వాతి కాలంలో ప్రచారం చేస్తూ వచ్చారు.

## దక్షయజ్ఞం

పరమేష్ఠి సృష్టించిన ప్రజాపతులంతా సంతానాన్ని వృద్ధి చేస్తూ వచ్చారు. వీరిలో దక్షుడు ముఖ్యుడు.

స్వాయంభువ మనువుకీ, శతరూపకీ ముగ్గురు కుమార్తెలు. వారిలో దేవహూతి, కర్దముని భార్య. ఇక ఆకూతి, రుచి భార్య. ఆకూతికీ రుచికీ విష్ణుమూర్తి యజ్ఞుడు పేరిట కుమారుడిగా జన్మిస్తే, లక్ష్మి దక్షిణ పేరిట కుమార్తెగా జన్మించింది. స్వాయంభువ మనుమడు క్రతువు, దక్షిణను పెళ్ళాడాడు. వారికి లెక్కకు మిక్కిలిగా సంతానం కలిగింది. వారంతా భగవద్భక్తులై లోకధర్మానికి అనుగుణంగా రాజ్యాలు ఏలారు. స్వాయంభువ మనువు మూడవ కుమార్తె ప్రసూతి దక్షప్రజాపతికి భార్య. వారికి కలిగిన సంతానంతో మూడులోకాలూ నిండిపోయాయి.

అనసూయను పెళ్ళాడిన అత్రి మహాముని బ్రహ్మదేవుని ఆదేశానుసారం ఋక్షమనేకుం పర్వత ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ వాయుభక్షణ చేస్తూ నూరు దివ్య సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ తపస్సుకి మెచ్చి, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు త్రిమూర్తులు ముగ్గురూ ప్రత్యక్షమయ్యారు. తమ అంశలతో ముగ్గురు పుత్రులు జన్మిస్తారని వరాన్ని ప్రసాదించారు. ఆ వర ప్రసాదంతో అత్రి అనసూయలకు బ్రహ్మ అంశతో చంద్రుడు, విష్ణు అంశతో దత్తాత్రేయుడు, రుద్రుని అంశతో దుర్వాసుడు జన్మించారు.

అంగీరసుడికీ శ్రద్ధకీ బృహస్పతి మొదలగు వారు జన్మిస్తే, పులస్త్యుడు, హవిర్భుక్కుకు అగస్త్యుడు, విశ్రవసువు జన్మించారు. విశ్రవసు, ఇలబిలకు కుబేరుడు జన్మించాడు. విశ్రవసుకు అతని రెండవ భార్య కేకసికీ రావణ, కుంభకర్ణ, విభీషణాది దానవులు జన్మించారు. క్రతువుకీ క్రియకీ వాలఖిల్యాది అరవైమంది మహామునులు జన్మించారు. అరుంధతి వశిష్ఠులకు సురోచి, విరజుడు మొదలయిన తొమ్మిది మంది కుమారులు కలిగారు. వశిష్ఠుని రెండో భార్య శక్తిముఖ పుత్రులను కన్నది. భృగువుకీ ఖ్యాతికీ దాత, విధాత అనే ఇద్దరు కుమారులు, శ్రీ అనే కుమార్తె

కలిగారు. దాత విధాతలు మేరువు అనే మునీంద్రుని కుమార్తెలు ఆయతిని, నియతిని పెళ్ళాడారు. ఆయతికి మృకండుడు, నియతికి ప్రాణుడు జన్మించారు. మృకండుడికి మార్కేండేయుడు, ప్రాణుడికి వేదశిరుడు జన్మించారు. ఈ వేదశిరుని కుమారుడే శుక్రాచార్యుడు.

దక్షప్రజాపతికీ ప్రసూతికీ పదహారు మంది కుమార్తెలు జన్మించారు. వారిలో పదమూడు మందిని ధర్ముడికి ఇచ్చి వివాహం జరిపించాడు దక్షుడు. ఆ పదమూడు మందిలో చివరిదయిన మూర్తికి నరనారాయణులు జన్మించారు. వీరే లోక రక్షణార్థం ద్వాపరయుగంలో కృష్ణార్జునులుగా జన్మించారు. దక్షుని కూతురు స్వాహాదేవి అగ్నిహోత్రుణ్ణి పెళ్ళాడింది. దక్షుని ఆఖరి కూతురు, మహాసాధ్వి సతీదేవి పరమ శివుణ్ణి పెళ్ళాడింది. మహాశివుడు అల్లుడు అయినందుకు ఆనందించక, అతనితో విరోధం తెచ్చుకున్నాడు దక్షుడు. కన్నకూతురు సతీదేవిని అవమానించి, అనర్థం కొని తెచ్చుకున్నాడు. అది ఎలా జరిగిందంటే....

ఒకప్పుడు మరీచుడు మొదలయిన ప్రజాపతులంతా సత్రయాగం చేసేందుకు సిద్ధమయ్యారు. ఆ యజ్ఞాన్ని చూసేందుకు దేవతలూ, మునులూ అంతా తరలి వచ్చారు. దక్షుడు కూడా సపరివారంగా వచ్చాడక్కడకి. అప్పుడు బ్రహ్మ, శివుడు తప్ప అంతా దక్షుని చూసి, గౌరవ సూచకంగా లేచి నిల్చున్నారు. శివుడు లేచి నిల్చోలేదని, తనని గౌరవించలేదనీ కోపం వచ్చింది దక్షునికి. తండ్రి బ్రహ్మకి నమస్కరించి, ఆ అగౌరవానికి అల్లుడు శివుణ్ణి నానా దుర్భాషలాడాడు.

''మునులారా! దేవతలారా! చూశారుగా, నేనొస్తే గౌరవంతో మీరంతా లేచి నిల్చున్నారు. ఈ శివుడు మాత్రం, తానేదో అధికుణ్ణన్నట్టుగా కూర్చున్న చోటు నుంచి లేచి నిల్చోలేదు. నిండు సభలో నన్ను అవమానించాడు. దుష్టుడు వీడు. లోకపాలకుడన్న పేరుకే అప్రతిష్ఠ తెచ్చి పెట్టాడు. ఇలాంటి వాడని తెలియక, నా కూతుర్నిచ్చి పెళ్ళి చేశాను. తప్పు చేశాను. కురూపి, భయంకరా కారుడు, దురహంకారి, జడలు విరబోసుకుని, దిగంబరంగా శ్మశానంలో తిరిగేవాడు. భూత పిశాచాల పరివారం. వల్లకాటి భస్మం గంధం. ఇలాంటివాడు నాకు అమర్యాద చేస్తాడా? వీణ్ణి ఇప్పుడే శపిస్తాను'' అన్నాడు దక్షుడు. జలం తీసుకున్నాడు.

''ఇక మీదట ఇంద్రాది దేవతలతో పాటుగా హవిస్సులందు ఈ శివుడికి, ఈ దురాచారికి భాగం లేకుండుగాక'' అని శపించాడు. శపించి, అక్కణ్ణుంచి చరచరా వెళ్ళిపోయాడు.

తనని మామగారు అనరాని మాటలు అన్నప్పటికీ, తనని శపించినప్పటికీ, నవ్వుతూ కూర్చున్నాడేగాని, మారుమాటాడలేదు శివుడు. దక్షునికి భయపడి మిగిలిన వారూ మాట్లాడలేదు. అంతటా భరించలేని నిశ్శబ్దం నిండుకుంది. దాన్ని భరించలేకపోయాడు శంకరుని పరిచారకుడు నంది. పట్టరాని కోపంతో ఊగిపోయాడతను.

''విన్నారుగా దక్షుని కారు కూతలు. విని కూడా మీరంతా ఊరుకున్నారంటే మిమ్మల్నే మనుకోవాలి? శివనింద మహాపాపం అని తెలియదా? అశాశ్వతమయిన సంపద, అధికారం, భోగభాగ్యాలు చూసుకుని, దక్షుడు విర్రవీగుతున్నాడు. అతనికి మీరంతా వత్తాసు పలుకు తున్నట్టుగా ఊరుకున్నారు. తప్పు. లోకపూజ్యుడయిన శంకరుణ్ణి నిందించి, దక్షుడు చేజేతులా కష్టాన్ని కొనితెచ్చుకున్నాడు. త్వరలోనే దక్షుడు మేషముఖుడై పశువులా ప్రవర్తిస్తాడు. ఇది నా శాపం'' అన్నాడు నంది.

ఆ శాపానికి అక్కడున్న మునులంతా ఒకరినొకరు చూసుకున్నారు. ఏదో మాట్లాడాలనుకుని, మనకెందుకనుకున్నారేమో! ఊరుకున్నారు మళ్ళీ. అది గమనించాడు నంది. ఇలా శపించాడు వారిని.

''శివనింద చెవులారా వింటూ మారు మాటాడని మీరంతా విద్యలభ్యసించి గొప్పవారయినా, ఉదరపోషణార్థం యాచకులై పోదురుగాక.''

నంది శాపానికి భృగుమహాముకి కోపం వచ్చింది. దిగ్గున లేచి నిల్చున్నాడతను.

''నందీ! నిష్కారణంగా మా మునులను శపించావు. నేనూ శపిస్తున్నాను, చూడు! కేవలం శివుణ్ణి కొలిచేవారంతా వేద విరుద్ధ కర్మలాచరిస్తూ పాషాండులయి పడి ఉందురుగాక.'' అన్నాడు.

శాపాలు, ప్రతిశాపాలతో సభామండపం అంతా అట్టుడికిపోవడాన్ని తట్టుకోలేని శివుడు, తన పరివారంతో అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. శంకరుని నిష్క్రమణానంతరం మరీచ్యాదులు వెయ్యేళ్ళు సత్రయాగం చేసి, తృప్తి చెందారు. గంగా యమునా సంగమంలో అవభృథస్నానం చేసి, ఎక్కడి వారక్కడికి వెళ్ళిపోయారు.

యాగం పూర్తయినా, ఎవరి మానాన వారున్నా మామా అల్లుళ్ళ మధ్య ఆ యాగం రేపిన విరోధం మాత్రం సమసిపోలేదు. పైగా నానాటికీ పెరిగి పెద్దదయింది.

దక్షుడు అనేక యాగాలు చేశాడు. ఆ యాగాలు వేటికీ శివునికి ఆహ్వానించలేదతను. హవిర్భాగం అందివ్వలేదు. తర్వాత వాజపేయం చేశాడు దక్షుడు. దాని తర్వాత బృహస్పతి సవనం ప్రారంభించాడు. ఆ యాగానికి దేవతలూ, బ్రహ్మర్షులూ, మహారుషులూ అంతా బంధు మిత్ర సపరివారంగా బయల్దేరారు. వారంతా దక్షాధ్వరం గురించి గొప్పగా చెప్పుకోవడాన్ని వినువీధిన విన్నది సతీదేవి. తనూ కూడా ఆ యజ్ఞానికి వెళ్ళాలనుకుంది. అనుమతి కోసం శంకరుణ్ణి సమీపించిందామె. చేతులు జోడించి, నమస్కరించింది.

''ప్రాణనాథా! నా తండ్రి గొప్ప యజ్ఞం చేస్తున్నాట్ట! అంతా సపరివారంగా తరలి వెళ్తున్నారు. నాకూ వెళ్ళాలని ఉంది. దయచేసి అనుమతించండి, వెళ్ళి వస్తాను. మీకూ, నా తండ్రిగారికీ సరిపడదని తెలుసు. మీరు రారనీ తెలుసు. అయినా అడుగుతున్నానంటే నన్ను అర్థం చేసుకోండి! నేను ఆ ఇంటి ఆడబిడ్డను. పుట్టింటి మీద మమకారంతో ప్రార్థిస్తున్నాను. పైగా నా తోబుట్టువులంతా ఈ యాగానికి వస్తున్నట్టుగా తెలిసింది. వారిని చూసి, చాలా యేళ్ళయింది. ఈ యాగం రూపేణా వారినీ చూసినదానినవుతాను. మా అమ్మను కూడా చూడాలని ఉంది. దయచేసి అంగీకరించండి.'' వేడుకుంది. సమాధానంగా ముందు సన్నగా నవ్వాడు శివుడు. తర్వాత ఇలా అన్నాడు.

''సతీ! నీ మాటను నేను కాదనను. పుట్టింటికి వెళ్తానంటే పంపనని అనలేను. కాకపోతే ఒక్క విషయం ఆలోచించుకో! నీ తండ్రికీ నాకూ బద్ధవైరం. ఐశ్వర్యమదంతో విర్రవీగుతున్నాడు. మన పొడే గిట్టదతనికి. అటువంటి చోటుకి వెళ్తానంటున్నావు. నిన్ను మర్యాదగా చూస్తారంటావా? లేనిపోని తలవంపులు తెచ్చుకుంటావేమో అనిపిస్తోంది. దేనినయినా భరించవచ్చు కాని, అవమానాన్ని భరించలేం. శత్రువు అవమానిస్తే భరించగలమేమో! అయిన వారూ, అమ్మవంక వారూ అవమానిస్తే తట్టుకోవడం కష్టం. నలుగురిలో నవ్వుల పాలవ్వడం దుర్భరం. అంతకంటే మరణమే మేలనిపిస్తుంది'' అన్నాడు శివుడు.



తల దించుకుంది సతీదేవి.

''పైగా ఇది పిలవని పేరంటం. ఎంత పుట్టింటివారయినప్పటికీ, పిలవకుండా వెళితే అవమానం కాదంటావా? అందుకని నా మాట విను. వద్దు. నువ్వు అక్కడికి వెళ్ళొద్దు.''

వినిపించుకోలేదు సతీదేవి. శివుడు ఎన్ని విధాల చెప్పినా పుట్టింటి మీది మమకారాన్ని చంపుకోలేకపోయిందామె. యజ్ఞానికి వెళ్ళి తీరాల్సిందేనని పట్టుబట్టింది. శంకరుడు సర్వేశ్వరుడు. అతనికి జరగబోయేదంతా తెలుసు. తెలుసు కనుకనే వద్దని వారించాడు. వినడం లేదు సతీదేవి. తప్పదనుకున్నాడప్పుడు.

''సరే నీ ఇష్టం. వెళ్ళు'' అన్నాడు శివుడు.

శివుని ఆనతి లేనిదే చీమయినా కదలదు. తను దాన్ని బలవంతంగా పొందింది. దీని పర్యవసానం ఎలా ఉంటుందో? వెళ్దామా? వద్దా? చాలాసేపు తీవ్రంగా ఆలోచించింది సతీదేవి. ఆఖరికి పుట్టింటి మీది ప్రేమతో వెళ్ళేందుకు సిద్ధమయింది.

# దక్షయజ్ఞ ధ్వంసం – వీరభద్ర జననం

సతీదేవి ఒంటరిగా బయల్దేరింది. ఆమె అలా ఒంటరిగా బయల్దేరడం, ప్రమథులకి ఆందోళన కలిగించింది. ఇంత మంది ఉన్నా ఎవరూ లేని దానిలా సతీదేవి ఒంటరిగా పుట్టింటికి పయన మవడం బాధ కలిగించింది వారికి. కాలినడకన వెళ్తున్న సతీదేవిని చూసి కళ్ళు చెమర్చుకున్నారు. తప్పు! ఇది భావ్యం కాదనుకున్నారు. కూడబలుక్కున్నారంతా. కానుకలు, వాహనాలు, వాయిద్యాలు సమకూర్చున్నారు. ఈ లోపు సతీదేవిని చక్కగా అలంకరించారు. నంది వాహనంపై కూర్చోబెట్టారు. 'పదమ్మా' అంటూ ఆమె వెంట తరలి వెళ్ళారు. అంతా దక్షుని యజ్ఞవాటికకు చేరుకున్నారు.

యజ్ఞం మహావైభవంగా జరుగుతోందక్కడ. సమస్త దేవతలూ, మునులూ కొలువుదీరి ఉన్నారు. అంతటా వేదఘోష వినవస్తోంది. చూసి పొంగిపోయింది సతీదేవి. యజ్ఞశాలలోకి ప్రవేశించింది. అయిన వారూ, అమ్మ వంక వారూ గుంపులు గుంపులుగా ఉన్నా, సతీదేవిని ఒక్కరూ 'వచ్చావా తల్లీ' అంటూ పలకరించలేదు. పలకరిస్తే ప్రమాదం అన్నట్టుగా ఊరుకున్నా రంతా. దక్షుడు అసలు పట్టించుకోలేదు. కన్నెత్తి కూడా కూతురిని చూడలేదు. బాధపడింది సతీదేవి. తల దించుకుని నిలబడింది. అంత దూరం నుండి తల్లి గమనించిందది. పరుగున వచ్చింది. సతీదేవిని గట్టిగా కౌగిలించుకుంది.

''వచ్చావా తల్లీ! రావేమో అనుకున్నాను'' అంది.

''ప్రయాణం చేసి అలసిపోయినట్టున్నావు'' అంది. చీర కొంగుతో కూతురు ముఖాన్ని తుడిచింది.

తల్లి ఎప్పుడయితే సతిని చేరదీసిందో అప్పుడు ఇక ప్రమాదం లేదనుకుని, తోబుట్టువులంతా చుట్టుముట్టారామెను. అభిమానంగా పలకరించారు. 'రా రా' అంటూ సరసన కూర్చోబెట్టు కునేందుకు సిద్ధపడ్డారు. కూర్చోలేదు సతి. కళ్ళెర్రజేసుకుని నిలబడింది.

అమ్మ అక్కున చేర్చుకుంది. తోబుట్టువులు చేరదీశారు. నాన్న రాడే! వచ్చి పలకరించడే! అంత కానిదయిపోయిందా తను? తండ్రి చేసిన అవమానాన్ని తట్టుకోలేకపోతోంది సతీదేవి. తోబుట్టువులంతా కుటుంబసమేతంగా వచ్చారు. వారందరినీ పేరు పేరునా పిలిచి, తన భర్తనే తండ్రి పిలకపోవడాన్ని భరించలేకపోయిందామె. మండుతున్న కళ్ళను ఒక్క క్షణం మూసుకుని, తెరిచింది. నిప్పుకణాల్లా, నెత్తురు చుక్కల్లా సతీదేవి కన్నీటిబొట్లు జలజలా నేల రాలాయి. చూశారది ప్రమథులు. కోపోద్రిక్తులయ్యారు. దక్షుని వధించేందుకు కత్తులు దూశారు. వారిని వారించింది సతీదేవి. తండ్రిని కోపంగా చూస్తూ ఇలా అంది.

''మదాంధుడువై నా భర్త శివుణ్ణి ద్వేషిస్తున్నావు. నీకిది మంచిది కాదు తండ్రీ! సర్వేశ్వరుడు నా భర్త ఎక్కడ? అధమాధముడవి నువ్వెక్కడ? నా భర్తకు హవిర్భాగం లేకుండా చేస్తావా? మమ్మల్ని అవమానిస్తావా? దీనికి ఇంతకింతా అనుభవిస్తావు నువ్వు. నీ తనువున పుట్టిన పాపాన్ని నేను భరించలేను. నాకీ శరీరం వద్దు. ఇప్పుడే ఈ క్షణమే ఈ శరీరాన్ని వదలి వేస్తాను. పవిత్రురాలునవుతాను.''

అయోమయంగా ఆందోళనగా చూస్తున్న మునులనూ, దేవతలనూ కడగంట చూసి, కుశలు పరచింది సతీదేవి. వాటిపై ఉత్తరదిశగా కూర్చుంది. కళ్ళు మూసుకుంది. చిత్తం పరమశివుని అధీనం చేసి, నవరంధ్రాలనూ బంధించింది. మహామహాయోగులకు కూడా సాధ్యం కాని యోగాన్ని ఆరంభించింది. పంచప్రాణాలనూ వాటి మూలస్థానాల్లోంచి కదలించింది. దాంతో సమాధి స్థితిలో ఉన్న ఆమె శరీరం నుండి మంటలు ఎగసిపడ్డాయి. ఆ యోగాగ్నిలో సతీదేవి దహనమయిపోయింది. ఆమె అలా దహనమయిపోవడం ఏమిటి, ముల్లోకాల్లోనూ హాహాకారాలు చెలరేగాయి. భయంతో సమస్త భూతకోటీ కంపించింది. దక్షుణ్ణి అంతా అసహ్యించుకున్నారు.

ప్రమథులు మరిక ఆగలేదు. యజ్ఞవాటికలో ఉన్న అందరినీ చంపేందుకు సిద్ధమయ్యారు. భృగుమహాముని అది గమనించి, ఋషుల్ని కాపాడేందుకు దక్షిణాగ్నిలో అభిచార హోమం చేశాడు. ఆ హోమ ఫలితంగా ఋభనామకులు దేవతలు వేలాదిగా పుట్టుకొచ్చారు. యజ్ఞశాల లోని కొరవులనే ఆయుధాలుగా ధరించి, దండెత్తి వచ్చిన ప్రమథులను ఎదుర్కొన్నారు. వారిని కొట్టిన చోట కొట్టకుండా కొట్టి, అక్కణ్ణుంచి తరమి కొట్టారు.

యోగసమాధిలో ఉన్న శివునికి సంగతంతా తెలిసింది. యోగాగ్నిలో సతీదేవి దేహత్యాగం, ప్రమథుల పరాజయం తెలిసి, కోపం తెచ్చుకున్నాడతను. కళ్ళు తెరిచాడు. దిగ్గున లేచి నిల్చున్నాడు. ప్రళయ తాండవం చేశాడు. ఆ తాండవంలో శిరస్సున జట ఒకటి తెంచి, భూమి మీదకి విసిరాడు. భయంకరంగా సింహంలా గర్జించాడు. చూస్తూండగానే జట నుండి మంటలు చెలరేగాయి. అంతెత్తున లేచాయవి. ఆకాశాన్ని దహించేట్టుగా నాలికలు చాపాయి. ఆ మంటల్లోంచి అప్పుడు వీరభద్రుడు పుట్టాడు. వెయ్యి చేతులు, భయంకరంగా కోరలు, నల్లటి దేహంతో ఆకాశం అంత ఎత్తుగా నిలిచాడు వీరభద్రుడు. నిప్పులు చెరగుతున్న మూడు కళ్ళు, అగ్ని జ్వాలల్లా ఎగిసిపడుతున్న జటలు, వెయ్యి చేతుల్లోనూ త్రిశూలాది ఆయుధాలు, మెడలో కపాల మాలికలతో అరివీర భయంకరంగా ప్రత్యక్షమయ్యాడు వీరభద్రుడు. శివునికి సాష్టాంగ ప్రణామం చేశాడు.

''దేవా! ఆజ్ఞ'' అన్నాడు.

''తక్షణం నువ్వు ప్రమథగణాలతో బయల్దేరి, దక్షుని యజ్ఞం ధ్వంసం చెయ్యి. బ్రాహ్మణ తేజం నిన్నేమీ చేయలేదు. నా అంశతో పుట్టిన నీకు ఎక్కడా ఎదురుండదు. వెళ్ళు.'' ఆజ్ఞాపించాడు శివుడు.

లేచి నిల్చున్నాడు వీరభద్రుడు. శివునికి ప్రదక్షిణం చేశాడు. పెద్దగా కేకపెట్టాడు. అతని కేకకి సకల లోకాలూ తల్లడిల్లాయి. గాయాలపాలయి, కసితో ఉన్న ప్రమథగణాలను చూశాడు. 'పదండి' అన్నట్టుగా కళ్ళెగరేశాడు. కదిలాడక్కణ్ణుంచి. వీరభద్రుడు నడుస్తోంటే మృత్యుధూళి జగం అంతా నిండిపోయింది. దక్షుని యజ్ఞవాటికకు చేరుకున్నాడతను. వీరభద్రుణ్ణి చూస్తూనే దక్షుడు సహా దేవతలూ, మునులూ గజగజా వణికిపోయారు. వీరభద్రుని అండ చూసుకుని ప్రమథులు రెచ్చిపోయారు. యజ్ఞశాలల్ని ధ్వంసం చేశారు. హోమకుండాల్ని చల్లార్చారు. వేదికల్ని పెకిలించి వేశారు. హోమద్రవ్యాల్ని విసిరి వేశారు. మునులనూ, దేవతలనూ కసిదీరా కొట్టి తిట్టి బాధిం చారు. కళ్ళెదుట భర్తలు చావుదెబ్బలు తింటుంటే చూడలేక మునిపత్నులూ, సురాంగనలూ చేతుల్లో ముఖాలు దాచుకుని పరుగెత్తారక్కణ్ణుంచి. యజ్ఞవాటిక అంతటినీ శ్మశానవాటికలా చేసి, భీకరంగా నవ్వుతూ నిల్చున్నాడు వీరభద్రుడు. నందీశ్వరుడు, చండీశ్వరుడు, మణిమంతుడు, శృంగి,



భృంగి మొదలయిన ప్రమథులంతా ఇంద్రాది దేవతలనూ, సూర్యచంద్రులనూ అనేక విధాల బాధించి, తీవ్ర అవమానాల పాల్జేశారు. మునులందరినీ తాళ్ళతో కట్టి పడేశారు. ప్రమథుడొకడు, భృగుమహర్షి మీసాలు లాగివేశాడు. మరొకడు అతని కళ్ళు పెరికి వేశాడు. ఇంకొకడు భృగుని జాలిగా చూస్తున్న సూర్యుని వెంటపడి, అతని పళ్ళూడగొట్టాడు. వెన్నిచ్చి పారిపోతున్న దక్షుణ్ణి చేతులు జాచి అందుకున్నాడు వీరభద్రుడు. బంతిలా అతన్ని కింద పడేశాడు. లేవకుండా అతని రొమ్ము మీద కాళ్ళుంచి, మట్టిని తొక్కినట్టుగా తొక్కిపారేశాడు. కత్తితో శిరస్సు ఖండించాడు. తెగి పడ్డ శిరస్సును చేతిలోనికి తీసుకుని చూసి, ఆనందించి, దానిని దక్షిణాగ్నిలో హోమంలో వేశాడు. దక్షసంహారంతో వచ్చిన పనయిపోయింది. ప్రమథులతో మరలిపోయాడు వీరభద్రుడు. కైలాసానికి చేరుకున్నాడు.

శివునితో వైరం తెచ్చుకున్న కారణంగా దక్షయజ్ఞానికి బ్రహ్మ, విష్ణువులు రాలేదు. తమ మిత్రుని అవమానం తమదిగా భావించి, ఆహ్వానాలు అందినా ఊరుకున్నారు వారు. బ్రహ్మ, విష్ణువులు వచ్చి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదనుకుని, జరిగిందంతా విన్నవించేందుకు ముందు బ్రహ్మని సమీపించారు దేవతలూ, మునులూ. అంతా పూసగుచ్చినట్టుగా చెప్పారాయనకి. ఆ తర్వాత శివుని కోపం చల్లారి ఉండదని, ప్రమథులూ, వీరభద్రుడూ మళ్ళీ మీద పడే అవకాశం ఉన్నదని గోలు గోలున విలపించారు. తమని కాపాడమని వేడుకున్నారు. అంతా విన్న బ్రహ్మ, బాగా ఆలోచించి, ఇలా అన్నాడు.

''శివుని కోపం చల్లార్చడం నా వల్ల కూడా కాదు. శాంతించమంటే నా మీదే తిరగబడొచ్చు. అందుకని, ఓ పని చేద్దాం. ఏమయితే అది అయిందని అందరం కలసికట్టుగా కైలాసానికి పోదాం. కాపాడమని ఆ పరమశివుణ్ణే వేడుకుందాం. పరమదయాళువు ఆ పరమేశ్వరుడు మన మొర వినకపోడు.''

''అయితే ఆలస్యం దేనికి, పదండి.'' అన్నారంతా. బయల్దేరారు. కైలాసానికి చేరుకున్నారు. పరమశివుణ్ణి పలు విధాల స్తోత్రం చేశారు. ప్రార్థించారు.

''దేవాదిదేవా! మహాశివా! నీకు యజ్ఞభాగం లేకుండా చేసిన దక్షునికి తగిన శాస్తే జరిగింది. అయిపోయిందేదో అయిపోయింది. ఇక మీదట నీ యజ్ఞభాగం నీదే! ఎప్పటిలా హవిర్భాగాన్ని అందుకొంటావు'' అన్నాడు బ్రహ్మ.

''కరుణించు దేవా! కటాక్షించు.'' మొక్కుకున్నారంతా. శివుని కోపం చల్లారిందప్పుడు. కళ్ళు తెరిచి, అందరినీ కరుణించాడు. దేవతల్నీ, మునుల్నీ అనుగ్రహించాడు. తెగిన శిరస్సు స్థానంలో మేక తలని అతికించి, దక్షుణ్ణి బతికించాడు. భృగునికి కళ్ళూ, సూర్యునికి పళ్ళూ ప్రసాదించాడు. యజ్ఞశాలలో ప్రాణాలు కోల్పోయిన వారందరినీ పునర్జీవితుల్ని చేశాడు. అందరికీ ప్రాణాలు పోశాడు. భృగుమహర్షికి మేక మీసాలు పెట్టాడు. యథావిధిగా యజ్ఞం కొనసాగించండన్నట్టుగా యజ్ఞవాటికను శోభిల్ల చేశాడు. తనని క్షమించమని శివుణ్ణి వేడుకున్నాడు దక్షుడు. చేతులు జోడించి, సర్వేశ్వరుణ్ణి స్తుతించాడు. యజ్ఞాన్ని ప్రారంభించాడు. ఎలాంటి అడ్డంకులూ లేకుండా యజ్ఞం పూర్తయింది. యజ్ఞవాటికలో అప్పుడు విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. అందరినీ దీవించి ఇలా అన్నాడప్పుడు.

''నాకూ శివునికీ భేదం లేదు. శివుణ్ణి నిందిస్తే నన్ను నిందించినట్టే! శివనిందని మించిన పాపం కూడా లేదు.''

''అవునవును'' అన్నారంతా. విష్ణువుకి సాష్టాంగ పడ్డారు.

## ధ్రువోపాఖ్యానం

సర్వోత్కృష్టమయినది భగవద్భక్తి. ఆ హరిభక్తునికి అందనిదేదీ లేదు. అది చెప్పేందుకే ఇప్పుడీ ధ్రువోపాఖ్యానం.

ధ్రువం అంటే శాశ్వతమయినదీ, సత్యమయినదీ అని అర్థం. ధ్రువ నక్షత్రం అన్నింటి కంటే ఎత్తున ఆకాశంలో ప్రకాశిస్తూ ఉంటుంది. సప్తర్షులూ, సూర్యచంద్ర గ్రహ నక్షత్ర తారకాగణం యావత్తూ ఈ ధ్రువ నక్షత్రం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ ఉంటాయి. కాలగణనలోనూ,

ఖగోళశాస్త్రంలోనూ ధ్రువ నక్షత్రానిదే ప్రముఖ పాత్ర. భాగవతంలో ధ్రువుని కథ విశిష్టమయినది. విశేషించి చెప్పుకోదగినది.

స్వాయంభువ మనువు కుమారుడు ఉత్తానపాదుడు. అతనికి సునీతి, సురుచి అని ఇద్దరు భార్యలు. పెద్దభార్య సునీతి సద్గుణశీల సంపన్నురాలు. చిన్నభార్య సురుచి మహా సౌందర్యవతి. సునీతికి ధ్రువుడు పుడితే, సురుచికి ఉత్తముడు జన్మించాడు. ఉత్తానపాద మహారాజుకి మహా సౌందర్యవతి సురుచి అంటే ప్రేమ ఎక్కువ. ఆమెను అధికంగా ప్రేమిస్తూ సునీతిని దూరం చేయసాగాడు. తల్లితో పాటు బిడ్డడు ధ్రువుణ్ణి కూడా అలక్ష్యం చేశాడు.

ఒకనాడు సురుచి కుమారుడు ఉత్తముణ్ణి తొడపై కూర్చోపెట్టుకుని, వాణ్ణి ముద్దాడసాగాడు ఉత్తానపాదుడు. చూశాడది ధ్రువుడు. పసివాడయిన తననీ తండ్రి అలా ముద్దాడితే బాగుణ్ణనిపించింది. పరుగున వచ్చాడు. తండ్రి తొడ ఎక్కి కూర్చోబోయాడు. సింహాసనం మీద కూర్చున్న తండ్రి తొడ అందడం లేదు. తండ్రి చేయందిస్తాడేమోనని చూశాడు ధ్రువుడు. తండ్రి చేయందించలేదు సరికదా, పట్టించుకోలేదసలు. అది అనువుగా తీసుకుంది అక్కడే ఉన్న సురుచి. ధ్రువుణ్ణి పురుగును చూసినట్టుగా చూసింది. అసహ్యించుకుంది. సింహాసనం మీదికి ఎగబాకుతున్న ధ్రువుణ్ణి రెక్క పుచ్చుకుని బలంగా ఇవతలికి లాగి పారేసింది.

కోపంగా ఇలా అంది.

''నువ్వేంటో నీ బతుకేంటో తెలుసుకోకుండా మహారాజు తొడను ఎక్కేందుకు ప్రయత్నిస్తావా? ఆ తొడను ఎక్కేందుకు ఒక్కడే అర్హుడు. వాడు నా కొడుకు ఉత్తముడొక్కడే! నీకా యోగ్యత ఈ జన్మలో లేదు. ఇంకో విషయం కూడా తెలుసుకో! రాజార్హత ఉన్న వాడే మహారాజు తొడనెక్కి కూర్చోగలగాలి. నీకా అర్హత కూడా లేదు. అధమురాలు సునీతి కడుపున పుట్టిన నీకు మహరాజయోగం లేదు. రాదు. వెళ్ళిక్కణ్ణుంచి.''

పినతల్లి మాటలు ధ్రువుని మనసుని బాణాల్లా గాయం చేశాయి. విలవిల్లాడాడు. అనరాని మాటలని తనని సవతి తల్లి హింసిస్తున్నా పట్టించుకోని తండ్రిని చూసి మరింతగా బాధపడ్డాడు. ఏడుపొచ్చింది. ఏడుస్తూ తల్లిని సమీపించాడు ధ్రువుడు.

''ఏంటమ్మా ఇది? నాన్నగారి తొడ మీద కూర్చునే భాగ్యం నాకు లేదా? నేను అందుకు యోగ్యుణ్ణి కానా? ఉత్తముడూ నేనూ ఒకటి కాదా? నన్నెందుకు పిన్నమ్మ కసిరి కొట్టింది? పిన్నమ్మ నన్ను అనరాని మాటలని హింసిస్తుంటే నాన్నెందుకు కల్పించుకోలేదు? ఊరుకున్నారెందుకు? ఎందుకమ్మా మనం అంటే ఇంత చులకన?'' అడిగాడు. సమాధానంగా సునీతి ముందు పెద్దగా ఏడ్చింది. తర్వాత ఇలా అంది.

## ధ్రువ నక్షత్రం

''తప్పు మీ పిన్నిది కాదు నాయనా! తప్పంతా మహారాజుదే! ఆయనే మనల్ని నిరాదరిస్తున్నారు. నన్ను తన భార్యగా చెప్పుకోవడం మహారాజుకి సిగ్గుచేటు. ఏం చేస్తాం, అంతా మన ఖర్మ.''

భార్యని భార్యగా చెప్పుకోవడం మహారాజుకి ఎందుకు సిగ్గుచేటు? ఆలోచించసాగాడు ధ్రువుడు. ఆ పసివాణ్ణి అట్టే ఆలోచించనీయలేదు తల్లి. ఏడుస్తూ అంతలోనే ఇలా అంది.

''కొందరు పుట్టుకతోనే కష్టాలూ కన్నీళ్ళూ వెంటబెట్టుకుని పుడతారు. వారిలో నేనొకదాన్ని. నా కడుపున నువ్వు పుట్టావు. అదే నువ్వు చేసిన నేరం. పాపం.''

'అవునా' అన్నట్టుగా చూశాడు ధ్రువుడు.

కన్నీరు తుడుచుకుంది సునీతి. చెప్పిందిలా.

''సింహాసనం మీద కూర్చున్న తండ్రి తొడను ఎక్కలేదే అన్న బాధే కనుక నిజంగా నీకు ఉంటే బాధపడకు. నేనో మాట చెబుతాను, వింటావా?''

''చెప్పమ్మా.''

''దేవాదిదేవుడు ఆ శ్రీమన్నారాయణుని ఆరాధించు. అతన్ని వేడుకుంటే నాన్నగారి తొడ మీదే కాదు, నాన్నగారి సింహాసనం మీదే నువ్వు కూర్చునే అవకాశం, అదృష్టం లభిస్తాయి. బ్రహ్మాది దేవతలెందరో హరిని పూజించి, అందరాని అదృష్టాలు అందుకున్నారు. ఆలస్యం చెయ్యకు, వెళ్ళు. నిండు గుండెతో విష్ణువుని పూజించు. అతని కరుణాకటాక్షం కోసం తపస్సు చెయ్యి'' చెప్పింది సునీతి. ఆ మాటలు మంత్రోపదేశం అయ్యాయి. అంతే! అయిదేళ్ళు కూడా నిండని ధ్రువుడు అక్కణ్ణుంచి కదలి, అరణ్యమార్గం పట్టాడు. కాకులు దూరని కారడవిలో ఒంటరిగా నడచి వెళ్ళసాగాడు. అది గమనించాడు నారదుడు. ఆకాశం నుంచి కిందికి దిగాడు. ధ్రువునికి ఎదురయ్యాడు.

''అయిదేళ్ళయినా లేవు. చూడబోతే రాకుమారుడిలా ఉన్నావు. ఎక్కడికయ్యా ఈ కీకారణ్యం లోకి?'' అడిగాడు నారదుడు.

''తమకు తెలియనిదేమున్నది మునీంద్రా? నా సవతితల్లి నన్ను అవమానించింది. నా గుండెను గాయం చేసింది. తట్టుకోలేకపోతున్నాను, తపస్సు చేసుకునేందుకు పోతున్నాను'' అన్నాడు ధ్రువుడు.

''తపస్సా?'' ఆశ్చర్యపోయాడు నారదుడు. తర్వాత పగలబడి నవ్వి, ఇలా అన్నాడు.

''ఏది మంచో ఏది చెడో తెలియని వయసు నీది. ఈ వయసులో తపస్సు చేస్తానంటున్నావు, సాధ్యమా?''

'ఎందుక్కాదు మునీంద్రా?' అన్నట్టుగా చూశాడు ధ్రువుడు.

''మహా మహా యోగులకు కూడా లభించని భగవత్ సాక్షాత్కారం నీకు లభిస్తుందని నువ్వు ఎలా అనుకుంటున్నావు? తపోనిష్ఠను తట్టుకోవడం చాలా కష్టం. అది నీ వల్ల కాదుగాని, నా మాట విను. ఎలా వచ్చావో అలాగే తిరిగి వెళ్ళిపో!'' అన్నాడు నారదుడు. అతన్ని సన్నగా నవ్వుతూ చూశాడు ధ్రువుడు.

''వెళ్ళను మునీంద్రా! సవతితల్లి అవమానాన్ని తట్టుకుని బతకలేను. ఆ అంతఃపురంలో అడుగు పెట్టలేను.'' అన్నాడు. గట్టి నిర్ణయం మీద ఉన్నట్టుగా గుండె నిండుగా ఊపిరి పీల్చి వదిలాడు.

''తండ్రి తొడని అధిరోహించడం కాదు, వారి సింహాసనాన్ని అధిష్ఠించడం అంతకంటే కాదు. ఇంతకు ముందు మా పెద్దలెవరూ పొందని ఉత్తమపదం నేను పొందాలి. దాన్ని నేను సాధించాలి.

సాధించే మార్గం చెప్పండి మునీంద్రా.'' నారదుడికి చేతులు జోడించి నమస్కరించాడు ధ్రువుడు.

''పరమ భాగవతోత్తములు. బ్రహ్మమానస పుత్రులు. మీరే నాకు దిక్కు. కర్తవ్యాన్ని బోధించండి.'' ప్రార్థించాడు.

వజ్రసంకల్పంతో వన్నె తేరిన ధ్రువుణ్ణి చూసి సంతోషించాడు నారదుడు.

''నీ దీక్ష మహదాశ్చర్యాన్ని కలిగిస్తున్నది. నీ కోరిక తీరాలంటే ఒకటే మార్గం, నీ తల్లి చెప్పినట్టుగా నువ్వు ఆ దేవదేవుణ్ణి, శ్రీహరిని ధ్యానించి తీరాలి. మరో దిక్కు లేదు. వెళ్ళు, నిశ్చల మనస్కుడవై శ్రీహరిని ధ్యానించు'' అన్నాడు నారదుడు. తపోనిష్ఠకు సంబంధించిన విధి విధానాన్ని చెప్పాడు. భక్తితత్త్వాన్ని బోధించాడు. వాసుదేవుని ద్వాదశాక్షర మంత్రం ఉపదేశించాడు.

''నాయనా! నిష్ఠతో ఈ మంత్రాన్ని జపించు. నీ కోరిక సిద్ధిస్తుంది'' అన్నాడు నారదుడు.

''ధన్యుణ్ణి మునీంద్రా'' అన్నాడు ధ్రువుడు. నారదునికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. తర్వాత మధువనికి తరలిపోయాడు.


భార్య సురుచి చేసిన అవమానాన్ని తట్టుకోలేక, కొడుకు ధ్రువుడు తపోవనాలకు తరలిపోయాడని తెలిసి, తండ్రి ఉత్తానపాదుడు తీవ్రంగా దుఃఖించాడు. జరిగిన దానిలో తన తప్పూ ఉన్నదని బాధపడ్డాడు. నిరాహారంతో ధ్రువుడు ఎన్నాళ్ళు బతికి ఉంటాడు? అసలు బతికి ఉన్నాడో లేదో? ఈ సరికి ఏ వన్యమృగం నోట పెట్టుకున్నదో? అని వాపోయాడు రాజు. కన్నీరు పెట్టుకు కూర్చున్నాడు. అప్పుడక్కడ నారదుడు ప్రత్యక్షమయ్యాడు.

''నీ కొడుకు ధ్రువుడు దేవతలూ మునులూ సాధించలేని గొప్ప కార్యాన్ని సాధిస్తాడు. ముల్లోకాల్లో కీర్తి గడిస్తాడు'' అని చెప్పాడు. అయినా కొడుకుని దూరం చేసుకున్న దుఃఖం ఉత్తానపాదుణ్ణి నిలువనీయలేదు. రాజ్యభోగాలకు దూరమయ్యాడతను. నిరక్తుడయిపోయాడు.

కాలం గడుస్తోంది.

మధువనానికి చేరుకున్నాడు ధ్రువుడు. కాళిందీనదిలో స్నానం చేశాడు. దీక్ష చేపట్టాడు. నారదుడు ఉపదేశించినట్టుగా తపస్సు ప్రారంభించాడు.

మూడు రోజులకొకసారి దొరికిన కాడికి పళ్ళు తినేవాడు. అలా ఓ నెల రోజులు గడిపాడు. తర్వాత నెల ఆరు రోజులకొకసారి ఆకులూ అలములూ తింటూ గడిపాడు. ఆ తర్వాతి నెల తొమ్మిది రోజులకొకసారి మంచితీర్థం పుచ్చుకుంటూ గడిపి, ఆ పై నెల పన్నెండు రోజులకొకసారి వాయుభక్షణ చేస్తూ గడిపాడు. నాలుగు నెలలు అలా పూర్తి చేసి, అయిదవ నెలలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు నిరోధించాడు. పంచప్రాణాల్నీ బిగబట్టాడు. ఒంటికాలిపై నిలుచుని, నిశ్చలుడయినాడు. స్థాణువయ్యాడు. శ్రీహరిని ప్రార్థిస్తూ చాలా ఏళ్ళు అలా తపస్సు చేశాడు ధ్రువుడు. అయినా భగవత్ సాక్షాత్కారం లభించలేదు. కాలి బొటన వేలు మీద నిలబడి తపస్సు ప్రారంభించాడు. ఘోర తపస్సు చేపట్టాడు. ఆ తపస్సుకీ, బొటన వేలితో నొక్కిపెడుతున్న బాధకీ భూమి వణికి పోసాగింది. సురులూ, మునులూ భయకంపితులయినారు. లోకంలో ప్రాణికోటి అంతా ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అయింది. దేవతలకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. శ్రీమన్నారాయణుని శరణు కోరారు. కాపాడమని ప్రార్థించారు. అభయాన్ని ప్రసాదించాడు శ్రీహరి. శంకు చక్రాలు దాల్చి, గరుడవాహనారూఢుడై మధువనానికి బయల్దేరాడు. చేరుకున్నాడక్కడకి.



''భక్తా'' పిలిచాడు. ఆ పిలుపునకు కళ్ళు తెరచి, శ్రీమన్నారాయణుని చూశాడు ధ్రువుడు. ఆనందంతో కన్నీరు పెట్టుకున్నాడు. చేతులు జోడించి, సాష్టాంగప్రణామం చేశాడు. తర్వాత లేచి ఆ దేవదేవుణ్ణి ఏమని స్తుతించాలో, ఎలా స్తుతించాలో తెలియక చూస్తూ నిల్చున్నాడు. అయిదేళ్ళ పసివాడికి అనంతుని ఆరాధనలు ఎలా తెలుస్తాయి? నవ్వుకున్నాడు శ్రీహరి. నవ్వుతూనే ధ్రువుని చెక్కిళ్ళు నిమిరాడు. తర్వాత వేదమయమయిన శంఖాన్ని తాకించాడతనికి. ఎప్పుడయితే శ్రీహరి చెక్కిళ్ళు నిమిరి, శంఖాన్ని తాకించాడో అప్పుడు ధ్రువుడికి దివ్యజ్ఞానం కలిగింది. సరస్వతి జిహ్వాగ్రంపై నాట్యం చేయడంతో వేదసూక్తాలతో శ్రీమన్నారాయణుని వేయి విధాల స్తుతించాడు ధ్రువుడు. ఆ స్తుతులకు పొంగిపోయాడు శ్రీహరి. సంతుష్టాంతరంగుడయినాడు.

''భక్తా! నువ్వు కోరుకున్నది సిద్ధిస్తుంది. ఇంతకు మునుపెన్నడూ ఎవరూ అధిష్ఠించని మహోన్నతపదం నీకు ప్రసాదిస్తున్నాను. నీ పదం గ్రహనక్షత్రాది జ్యోతిశ్చక్రానికి ఆధారభూత మవుతుంది. ముల్లోకాలకూ పైన ఉండే నక్షత్రరూపులయిన మహామహులంతా నీ చుట్టూ ప్రదక్షిణ చేస్తారు'' అన్నాడు శ్రీహరి.

''ధన్యుణ్ణి'' అన్నాడు ధ్రువుడు.

''తొలుత ఈ భూమిని పరిపాలించి, తర్వాతే నేను ప్రసాదించిన మహోన్నత పదాన్ని అధిష్ఠిస్తావు. నీ కీర్తి చిరస్థాయిగా నిలుస్తుంది'' అన్నాడు శ్రీహరి. అదృశ్యుడయ్యాడు.

సూర్యుడిలా వెలిగిపోతూ ధ్రువుడు, తల్లిదండ్రుల్ని కలిసేందుకు తిరుగు ప్రయాణమయ్యాడు. శ్రీహరి కరుణాకటాక్షాలతో కుమారుడు తిరిగి వస్తున్నాడని తెలుసుకుని, భార్యలిద్దరితోనూ, కొడుకు ఉత్తముడితోనూ ధ్రువుడికి ఎదురేగాడు ఉత్తానపాదుడు. బంగారు పల్లకీలో వచ్చాడు. మంగళవాయిద్యాలతో స్వాగతించాడు. తల్లిదండ్రుల్ని చూసి, ఆనందించాడు ధ్రువుడు. నమస్కరించాడు వారికి. ధ్రువుణ్ణి ప్రేమగా కౌగలించుకున్నాడు తండ్రి. తమ్ముడు కూడా అతన్ని చేరదీశాడు. రాజధానికి చేరుకున్నారంతా.

ధ్రువునికి యుక్తవయసు రాగానే అతనికి రాజ్యాన్ని అప్పగించి, తపోవనాలకు తరలిపోయాడు తండ్రి. ధ్రువుడు భ్రమిని వివాహమాడాడు. ఆమె శిశుమారుడు కుమార్తె. వాయుపుత్రి ఇలను కూడా వివాహమాడాడతను.

ఉత్తముడు, హిమవత్పర్వత ప్రాంతానికి వేటకి వెళ్ళి, అక్కడ యక్షులతో పోరాడి మరణించాడు. ఎంతకీ తిరిగి రాని కుమారుణ్ణి వెదుకుతూ సురుచి బయల్దేరింది. కుమారుణ్ణి వెదుకుతూ వెదుకుతూ మరణించిందామె. సవతితల్లీ, తమ్ముడూ మరణించడంతో అందుకు కారణమయిన యక్షుల మీద కోపగించాడు ధ్రువుడు. వారి మీద యుద్ధాన్ని ప్రకటించాడు. ఒకొక్కరినీ సంహరించసాగాడు. తరిగిపోతున్న యక్ష సంతతి మీద జాలి చెందాడు స్వాయంభువమనువు. తాతగా అతను ధ్రువుణ్ణి వారించాడు. హింస తగదని, యుద్ధం మానమన్నాడు. మానివేశాడు ధ్రువుడు. కుబేరుడితో స్నేహం చేసుకున్నాడు. తిరిగి వెళ్ళిపోయాడు. అరవై ఆరువేల సంవత్సరాలు రాజ్యాన్ని పాలించాడు. రాజభోగాలన్నీ అనుభవించాడు. మరిక భౌతికంగా అనుభవించేదీ ఆశించేదీ లేక రాజ్యాన్ని త్యజించాడు ధ్రువుడు. బదరీవనానికి వెళ్ళిపోయాడు. అక్కడ మందాకినిలో స్నానం చేసి, హరిని ధ్యానిస్తూ సమాధినిష్టుడయినాడు.

కొన్నాళ్ళు గడిచింది.

భౌతికదేహాన్ని త్యజించే సమయం ఆసన్నమయింది. విష్ణుదూతలు దివ్య విమానాన్ని వెంటబెట్టుకుని రావడంతో భౌతికదేహాన్ని త్యజించి, జ్యోతిర్మయమయిన దివ్యరూపాన్ని ధరించాడు ధ్రువుడు. విమానాన్ని అధిరోహించాడు. సమస్తదేవతలూ, మునులూ కీర్తించగా ముల్లోకాలనూ, గ్రహమండలాన్నీ, సప్తర్షుల స్థానాన్నీ అతిక్రమించి, ఉత్తర దిక్కున అన్నిటికంటే ఎత్తున ఉండే సత్యమూ నిత్యమయిన ధ్రువపదం చేరుకున్నాడు. స్వయం ప్రకాశిగా వెలుగొందుతూ అక్కడే స్థిరనివాసాన్ని ఏర్పరుచుకున్నాడు. ఆ క్షణం దేవదుందుభులు మోగాయి. పూలవాన కురిసింది. గంధర్వగానం వినిపించింది. ఆసరికే అతని తల్లి సునీతి స్వర్గాన్ని అలంకరించింది.

ఉత్తర దిక్కున సప్తర్షి మండలానికి ఎగువున మహోన్నత స్థానంలో ధ్రువనక్షత్రం అందరికీ కనిపిస్తూ నేటికీ కను విందు చేస్తున్న సంగతి తెలిసిందే! శుభప్రదమయిన ఈ నక్షత్రాన్ని నూతన వధూవరులకు చూపడం సంప్రదాయంగా వస్తోంది. అయితే గొప్ప కీడు మూడనున్నవాడికీ, అంత్యకాలం సమీపించేవాడికీ ధ్రువనక్షత్రం కనిపించదంటారు పెద్దలు.

## పృథుచక్రవర్తి

ధ్రువుని అనంతరం ఆ వంశంలో చెప్పుకోదగినవాడు పృథుచక్రవర్తి.

వేనుడు రాజ్యం చేస్తున్న కాలంలో ప్రజలు అనేక విధాల బాధలు అనుభవించారు. మునులనూ, బ్రాహ్మణులనూ నానా విధాల వేధించాడు వేనుడు. యజ్ఞయాగాదులు లేకుండా చేశాడు. దానధర్మాల జోలికి పోలేదు. దాంతో భూమి మీద అన్యాయం, అధర్మం ప్రబలి పోయాయి. రాజ్యం అతలాకుతలమయింది. అది తట్టుకోలేని మునులంతా వేనుణ్ణి సమీపించారు. ధర్మాన్ని ఉద్ధరించమని ప్రార్థించారు. వారి ప్రార్థనను పట్టించుకోలేదు వేనుడు. పెడచెవినపెట్టాడు. మునులకు కోపం వచ్చింది. శపించారతన్ని. శాపకారణంగా వేనుడు మృతి చెందాడు. అతనికి పుత్రసంతానం లేని కారణంగా రాజ్యానికి రాజు లేకుండా పోయాడు. రాజు లేని రాజ్యంలో ధర్మాలన్నీ మరింతగా తలకిందులయ్యాయి. వాటిని అరికట్టేందుకు రాజుని సృజించాలనుకున్నారు మునులు. వేనుడి మృతదేహాన్ని తీసుకుని, అతని తొడని మథించారు. అప్పుడు అందులోంచి బాహుకుడు పుట్టుకొచ్చాడు. చాలా వికృతంగా కనిపించాడతను. రాజయ్యే లక్షణాలు లేవతనిలో. నిషాదులకు మూలపురుషుడుగా మిగిలిపోయాడు. ఈసారి వేనుని బాహువులు మథించారు మునులు. అప్పుడు ఒక స్త్రీ, ఒక పురుషుడూ ఉద్భవించారు. ఇద్దరూ భగవదంశతో జన్మించిన వారే! ఆ పురుషుడే పృథువు. శ్రీమన్నారాయణుని అంశతో జన్మించిన పృథువు, సాక్షాత్తూ లక్ష్మీదేవి అంశతో జన్మించిన స్త్రీని, 'అర్చి'ని వివాహమాడాడు. ఆనాడు ఆ వివాహం మునులకూ, దేవతలకూ, సర్వులకూ కనుల పండువయింది. సంతోషించారంతా.

# పుడమిని వెంటాడిన పృథుచక్రవర్తి

పుడమికి రాజయినాడు పృథువు. మునీశ్వరులు అతన్ని అభిషేకించారు. అష్టదిక్పాలకులూ అతనికి అద్భుతమయిన కానుకలు అందజేశారు. కానుకల రూపేణా పృథువుకి దివ్యమయిన ఆయుధాలు లభించాయి. భూలోకంలో అఖండమయిన కీర్తిని ఆర్జించిన వారిలో ప్రథముడు పృథువు. ధర్మాన్ని ప్రతిష్ఠించాడతను. ఎన్నో గొప్ప గొప్ప కార్యాలు చేశాడు.

పృథువు రాజ్యాన్ని చేపట్టే నాటికి లోకంలో ప్రజలంతా చెప్పలేనన్ని ఈతిబాధలు అనుభవిస్తూ ఉన్నారు. అన్నం లేక అలమటిస్తూ ఉన్నారు.

''మహారాజా! మాకింత అన్నం పెట్టి, మమ్మల్ని కాపాడు.'' పృథు చక్రవర్తిని వేడుకున్నారు ప్రజలు. పిడికెడు మెతుకులు దొరకని ఈ కరువేమిటి? ఎందుకొచ్చి పడిందని ఆలోచించాడు పృథువు. సమస్త ఓషధులనూ భూమి హరించి వేయడంతోనే ఈ అవస్థ వచ్చి పడిందని అర్థం చేసుకున్నాడతను. పట్టరాని కోపం కలిగింది. భూమిని సంహరించడానికి ధనుర్బాణాలు అందుకున్నాడు. బాణాన్ని సంధించాడో లేదో భూదేవి గోరూపం ధరించి, భయంతో

పరుగందుకుంది. ఆమె వెంటపడ్డాడు పృథువు. భూదేవి సమస్త లోకాలూ తిరిగింది. రక్షించమని ఎందరినో వేడుకుంది. ఎవరూ రక్షించలేకపోయారామెను. వెంటపడి తరుముకు వస్తూన్న పృథువుని అడ్డగించలేకపోయారు. చేసేది లేక ప్రాణభిక్ష పెట్టమని పృథువుని ప్రార్థించింది భూదేవి.

''ఓషధులన్నీ గర్భంలో దాచుకుని, ధాన్యాదులు ఇవ్వకుండా కరువు తెచ్చిపెట్టావు. ఇప్పటి కయినా మించిపోయింది లేదు, నా ప్రజలందరికీ జీవనాధారం చూపించు. కాదన్నావా, నిన్ను సంహరించి తీరుతాను. హరిహరాదులు కూడా నిన్ను కాపాడలేరు.'' గర్జించాడు పృథువు. చావు నుంచి తప్పించుకునేందుకు భూదేవి రకరకాలుగా పృథువుని స్తుతించింది. పట్టించుకోలేదతను. పట్టిన పట్టు వీడలేదు. అప్పుడిలా అంది భూదేవి.

''మహారాజా! నీ ముందు రాజులు నన్ను అలక్ష్యం చేశారు. జీవనాధారమయిన ఓషధులన్నీ దుర్మార్గుల పరం చేశారు. దానిని నేను తట్టుకోలేకపోయాను. దుర్మార్గుల చేతికి చిక్కకుండా ఓషధులన్నిటినీ నేనే స్వీకరించాను. వాటిని నా గర్భంలో దాచి పెట్టాను. అయితే ఇది జరిగి చాలా రోజులయిన కారణంగా, ఇప్పుడు ఆ ఓషధులు నాలో క్షీణించాయి.''

''అబద్ధం'' గర్జించాడు పృథువు.

''లేదు మహారాజా, నిజమే చెబుతున్నాను. కోపించకు. ఇప్పుడు నీకు ఆ ఓషధులు కావాలంటే నేను ఓ ఉపాయం చెబుతాను, విను.''

''చెప్పు.''

''నేనిప్పుడు గోరూపంలో ఉన్నాను కదా, నాకు ఓ దూడనూ, పాలపాత్రనూ, పాలు పితికేవాణ్ణీ సృష్టించు. పాలరూపంలో సమస్త ఓషధులనూ నీకు అందజేస్తాను. అలాగే పర్వతాదులతో హెచ్చు తగ్గులుగా ఉన్న నన్ను చక్కగా చదును చెయ్యి. అలా చేస్తే వర్షం నీరు వృథాపోదు, సమతలంగా ఉన్న నాలోనే నీరంతా ఇంకి ఉంటుంది. ఏమంటావు?'' అడిగింది భూదేవి.

ఆవేశపడకుండా ఆలోచించాడు పృథువు. భూదేవి చెప్పినట్టుగా చేసేందుకు సిద్ధమయ్యాడు. స్వయంభువమనువును దూడగా మార్చాడు. తన చేతుల్నే పాలపాత్రగా మార్చాడు. తానే పాలను పితికేవాడై, భూదేవి పొదుగు నుండి పాలను పితకాడు. పాత్ర నిండుగా పాలు పితికాడు. సమస్త ఓషధులతో నిండిన ఆ పాలను, భూమి అంతటా జల్లాడు. అంతలో దేవతలూ, మునులూ వచ్చారక్కడకి. భూదేవి నుండీ తామూ తమకు కావాల్సినవి పితుక్కుంటామన్నారు. అభ్యంతరం చెప్పలేదు పృథువు. అంగీకరించాడందుకు. వశిష్ఠాది మునులంతా బృహస్పతిని దూడగా చేసి, ఇంద్రియాలను పాత్రను చేసి చంధోమయమ్మైన పాలను పితికారు. దేవతలు ఇంద్రుని దూడను చేసి, బంగారుకలశంలో అమృతాన్ని పితుక్కున్నారు. దానవులు ప్రహ్లాదుని దూడను చేసి, ఇనుపపాత్రలో గౌడి, పైష్ఠి, మాధ్వి అని మూడు రకాల మద్యాన్ని పితుక్కున్నారు. గంధర్వులు విశ్వావసును దూడను చేసి, పద్మాన్ని పాత్ర చేసి, అందులో వాంగ్మాధుర్యాన్ని పాలగా పితికారు. పితృదేవతలు సూర్యుణ్ణి దూడను చేసి, మట్టిపాత్రలో అన్నాన్ని పితుక్కున్నారు. కపిలుని గోవుగా చేసి, ఆకాశాన్ని పాత్రను చేసి, సిద్ధులు అణిమాదిసిద్ధులు పితుక్కున్నారు. విద్యాధరులు ఆకాశ గమనం మొదలయిన విద్యలను పితుక్కున్నారు. మయుని దూడను చేసి మాయావులు

ఇంద్రజాలాది విద్యలను పితుక్కున్నారు. యక్ష రాక్షస భూత పిశాచాదులు రుద్రుని దూడను చేసి, కపాలాన్ని పాత్రను చేసి, మద్యంలాంటి మత్తు కలిగించే రక్తాన్ని పితుక్కున్నారు. సర్పాలు తక్షకుణ్ణి దూడను చేసి, రంధ్రాలనే పాత్రలో విషతుల్యమయిన పాలను పితుక్కున్నారు. పశువులు శివుని వాహనం నందిని దూడను చేసి, అరణ్యంపాత్రలో తృణాదులను పితుక్కున్నారు. హిమవంతుని దూడను చేసి, సానువులను పాత్ర చేసి, పర్వతాలు గౌరవాది ధాతువుల్ని పితుక్కున్నాయి. ఇలా పదిమందీ పదిరకాలుగా భూదేవిని పిండి వారికి కావాల్సినవి అందుకున్నారు. నిష్క్రమించారక్కణ్ణుంచి. అప్పటి నుంచీ భూదేవిని కన్నకూతురులా ప్రేమగా చూడసాగాడు పృథువు. ఎగుడు దిగుళ్ళన్నీ సమం చేశాడు.

వర్షాలు కురిశాయి. పంటలు పండాయి. గ్రామాలు, పట్టణాలూ కళకళ్ళాడాయి. ఏ కొరతా లేకపోయింది ప్రజలకి. ధర్మపాలన చేశాడు పృథువు. సరస్వతినది గల బ్రహ్మావర్తం అనే సిద్ధక్షేత్రంలో నూరు అశ్వమేధయాగాలు చేసేందుకు సిద్ధపడ్డాడు పృథువు. తొంభైతొమ్మిది జయప్రదంగా ముగించాడు. సమస్త దేవతలనూ తృప్తిపరిచాడు. నూరవయాగం చేస్తుండగా దేవేంద్రునికి భయం పట్టుకుంది. నూరవయాగం పూర్తయితే పృథువు తనని మించిపోతాడనీ, స్వర్గాధిపత్యం పొందుతాడనీ తెలుసుకుని, ఆ యాగాన్ని విఘ్నం చేసేందుకు ప్రయత్నించాడు. యాగాశ్వాన్ని అపహరించాడు. కనిపెట్టారది అత్రి మొదలయిన మహామునులు. పృథు చక్రవర్తి చేత అభిచార హోమం చేసేందుకు సిద్ధమయ్యారు. ఆ హోమం చేస్తే యాగాశ్వంతో పాటుగా ఇంద్రుడు బయటపడక తప్పదు. అప్పుడతనికి శిక్ష తప్పదు. దాన్ని వారించేందుకు బ్రహ్మ కల్పించుకున్నాడు. హోమాన్ని మాన్పించాడు. పృథు చక్రవర్తికి హితబోధ చేశాడిలా.

''మహారాజా! నువ్విప్పటికి తొంభై తొమ్మిది అశ్వమేధయాగాలు చేశావు, చాలు. నూరవ యాగం చేయనవసరం లేదు, అది చేయకుండానే ఇంద్రుడంతటి వాడవయ్యావు.''

విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. పృథువుకి తత్త్వబోధ చేశాడు. మహామునులు సనకాదులు ప్రత్యక్షమయ్యారు. మోక్షప్రాప్తికి కావాల్సిన తత్త్వాన్ని ఉపదేశించారు. వెళ్ళిపోయారక్కణ్ణుంచి. మునులు, బ్రహ్మ,విష్ణువు ఉపదేశించిన మార్గాలలో ప్రయాణిస్తూ పృథువు చాలా సంవత్సరాలు ప్రజలకు ఎలాంటి కొరతా లేకుండా ధర్మపాలన చేశాడు. తర్వాత రాజ్యాన్ని త్యజించి అడవులకు వెళ్ళాడు. అక్కడ తపస్సు చేసి భగవంతునిలో ఐక్యం అయ్యాడు. అతని భార్య అర్చి, అగ్నిప్రవేశం చేసి భర్తని చేరుకుంది.

## ప్రియవ్రతుడు

పృథు చక్రవర్తి తర్వాత అతనిలా పేరు ప్రఖ్యాతులు పొందిన వాడు ప్రియవ్రతుడు. ఇతను స్వయంభువమనువు కుమారుడు. ఉత్తానపాదుని సోదరుడు. నారదమహాముని ఉపదేశంతో ఆత్మజ్ఞానాన్ని పొంది, అడవులను ఆశ్రయించాడు ప్రియవ్రతుడు. తపస్సు చేసుకుని తనువు చాలిద్దామనుకున్నాడు. అందుకు బ్రహ్మ ఒప్పుకోలేదు. గృహస్థాశ్రమం స్వీకరించాల్సిందిగా ఆజ్ఞాపించాడు. ఆజ్ఞాబద్ధుడై ప్రియవ్రతుడు వెనక్కి తిరిగి వచ్చాడు. చాలా సంవత్సరాలు భూమిని పాలించాడు.

భగవంతుని అంశతో జన్మించిన ప్రియవ్రతుడు, విశ్వకర్మని కుమార్తె బర్హిష్మతిని పెళ్ళాడాడు. వారిద్దరికీ ఆగ్నీధ్రుడు, కవి, మేధాతిథి మొదలయిన పదిమంది కుమారులు జన్మించారు. ఊర్జస్వతి అని కుమార్తె కూడా కలిగింది. కుమారులలో ముగ్గురు చిన్నతనంలోనే సన్యసించి, జ్ఞానులయినారు. శుక్రుణ్ణి పెళ్ళాడింది ఊర్జస్వతి. వారి కుమార్తె దేవయాని.

మరొక భార్య వల్ల ప్రియవ్రతుడికి ఉత్తముడు, తామసుడు, రైవతుడు జన్మించారు. ఈ ముగ్గురూ మన్వంతరాధిపతులయినారు. భగవంతుని ఉపాసించి, ప్రియవ్రతుడు గొప్ప శక్తిసామర్థ్యాలు సాధించాడు. అద్భుతమయిన సిద్ధులు కూడా పొందాడు. సూర్యుడు మేరు పర్వతం చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఉన్న కారణంగా భూమండలం సగభాగం వెలుతురు తోనూ, మిగిలిన సగభాగం చీకటితోనూ ఉంటూ వచ్చాయి. పగలూ రాత్రీ ఆ విధంగా ఏర్పడ్డాయి. సూర్యప్రకాశం లేని భూభాగంలో కూడా వెలుతురు వచ్చేటట్టు చేయాలని సంకల్పించుకున్నాడు ప్రియవ్రతుడు. సూర్యరథంతో సమానమయిన రథాన్ని సంపాదించాడు. ఆ రథాన్ని అధి రోహించి, సూర్యునిలా వెలిగిపోతూ, సూర్యుడు మేరు పర్వతానికి ఉత్తరాన ఉన్నప్పుడు తాను దక్షిణాన ఉంటూ, సూర్యుడు దక్షిణాన ఉన్నప్పుడు తాను ఉత్తరాన ఉంటూ అంతటా వెలుతురు నింపాడు. సూర్యుని అనుసరించి ఏడుసార్లు తిరిగాడలా. అప్పుడు అతని రథచక్రాల తాకిడితో ఏడు సముద్రాలు ఏర్పడ్డాయి. ఈ ఏడు సముద్రాల కారణంగానే భూమి జంబూ, ప్లక్ష, శాల్మలీ, కుశ, క్రౌంచ, శాక, పుష్కరము అని ఏడు ద్వీపాలయింది. ఈ ఏడు ద్వీపాలకూ తన ఏడుగురు కుమారులనూ రాజుల్ని చేశాడు ప్రియవ్రతుడు.

భారతవర్షం జంబూద్వీపంలో ఉంది. నదులు, పర్వతాలు, అరణ్యాలు మొదలయిన వాటివల్ల సాంకర్యం కలుగకుండా ప్రతి ద్వీపంలోనూ భూమిని విభాగించి, ఎల్లలు ఏర్పరిచాడు ప్రియవ్రతుడు. పదకొండు కోట్ల సంవత్సరాలు పాలించాడు. తర్వాత బ్రహ్మ ఆజ్ఞతో గంధమాదన పర్వతంపై తపస్సు చేసి, తనువు చాలించాడు. భగవంతునిలో ఐక్యం చెందాడు.

## భరతుడు

జంబూద్వీపాన్ని పాలించిన ఆగ్నీధ్రునికీ, అప్సరస పూర్వచిత్తకీ నాభి, కింపురుషుడు, హరివర్షుడు, ఇలావృతుడు, రమ్యకుడు, హిరణ్మయుడు, కురువు, భద్రాశ్వుడు, కేతుమాలుడు అని తొమ్మండుగురు కుమారులు జన్మించారు. ఈ తొమ్మండుగురికీ జంబూద్వీప వర్షాలను సమానంగా పంచి ఇచ్చాడు అగ్నీధ్రుడు. తండ్రి పంచి ఇచ్చిన వర్షాలను తమ తమ పేర్లతో అంతా పాలిస్తూ వచ్చారు.

నాభి భార్య మేరుదేవి. ఆమెకే విష్ణువు కుమారుడిగా జన్మించాడు. అతని పేరే ఋషభుడు. అతని ప్రభావాన్ని వర్ణించడం ఎవరి తరమూ కాదు. అతను ఎంతటి ప్రతిభావంతుడంటే తన శక్తి సామర్థ్యాల చేత వర్షాన్ని కురిపించి, ఇంద్రుని గర్వాన్ని అణచి వేశాడు. నాటి నుంచే తన రాజ్యానికి అజనాభం అని పేరు పెట్టాడు. దేవేంద్రుని కుమార్తె జయంతిని పెళ్ళాడాడతను. నూరుగురు కుమారులు జన్మించారతనికి. వారిలో పెద్దవాడు భరతుడు. భరతుడు పాలించిన కారణంగానే అజనాభానికి భరతవర్షం అని పేరొచ్చింది. పరమ భాగవతోత్తముడయిన భరతుడు, విశ్వరూపుని కుమార్తె పంచజనిని పెళ్ళాడాడు. వారికి అయిదుగురు కుమారులు కలిగారు. భరతుడు

పదివేల సంవత్సరాలు పాలించాడు. ఎన్నో యజ్ఞాలూ, యాగాలూ చేశాడు. చివరికి కుమారులకి రాజ్యభారాన్ని అప్పగించి, పులహ మహర్షి ఆశ్రమం సాలగ్రామానికి చేరుకున్నాడు. అక్కడ ప్రశాంతంగా కాలం గడపసాగాడు. ఎల్లవేళలా శ్రీహరిని పూజిస్తూ , గొప్ప భక్తుడై, బ్రహ్మజ్ఞాని అయినాడు.

ఒకనాడు స్నానానికై చక్రనదిని చేరుకున్నాడు భరతుడు. స్నానం చేసి, ప్రణవాన్ని జపిస్తూ తీరాన కూర్చున్నాడు. దప్పికతో అప్పుడొక ఆడలేడి అక్కడికి వచ్చింది. అది నిండు గర్భవతి. నీరు తాగుతోంది. అంతలో మహాభయంకరంగా సింహగర్జన వినవచ్చింది. దాంతో భయపడి, నదిని దాటే ప్రయత్నం చేసింది. ఆ ప్రయత్నంలో గర్భస్రావమై, దాని బిడ్డ నదిలో పడిపోయింది. ఒక వైపు సింహభయం, మరో వైపు నది పాలయిన బిడ్డ, ఇంకొక వైపు పరుగు...ఈ మూడింటితో ప్రాణాలు కోల్పోయింది ఆ లేడి.

నదీజలాల్లో కొట్టుకుపోతున్న లేడిపిల్లను చూశాడు భరతుడు. పాపం అనిపించింది. జాలి చెందాడతను. దయార్ద్రహృదయుడై దానిని నీళ్ళలోంచి తీసి, ఒడ్డుకు చేర్చి కాపాడాడు. ఒడలంతా నిమిరి, ఆశ్రమానికి తీసుకుని వచ్చాడు. పెంచసాగాడక్కడ. క్రూరమృగాల బారిన పడకుండా రక్షించసాగాడు. లేడిపిల్లని ఎత్తుకునే వాడు భరతుడు. ముద్దాడేవాడు. లాలించేవాడు.



లేత పచ్చిక కోసి, తనే స్వయంగా తినిపించేవాడు. కన్నబిడ్డ కంటే ఎక్కువగా చూసుకోసాగాడు. ఆ లేడిపిల్ల కూడా అంతే! భరతుణ్ణి ఒక్క క్షణం కూడా విడిచి ఉండేది కాదు. భరతుడు పూలు కోసుకుంటున్నా, పూజ చేసుకుంటున్నా, స్నానం చేస్తున్నా, ధ్యానం చేస్తున్నా పక్కనే ఉండేది. అన్ని బంధాలూ తెంచుకుని, భగవంతునిలో ఐక్యం చెందుదామనుకున్న భరతునికి ఆ లేడిపిల్ల ఎడతెగని బంధం అయింది. లేడిపిల్లను కంటికి రెప్పలా చూసుకోవడంలో భరతుని పూజలు అడుగంటాయి. అతని జపతపాలు గంగలో కలిశాయి. అన్ని విధాలా లేడిపిల్లే లోకమయి పోయింది. అందుకు అతను బాధపడలేదు సరికదా, లేడిపిల్ల సంరక్షణ బాధ్యత తనదన్నట్టుగా బతకసాగాడు.

## జడభరతుడు:అజామిళుడు

లేడిపిల్ల కంటికి కనిపించకపోతే తల్లడిల్లిపోయేవాడు. క్షణం కూడా దాని ఎడబాటును తట్టుకోలేకపోయే వాడు. చూపు కోల్పోయినట్టుగా తడుముకు పోయేవాడు. ఏ క్రూర మృగమయినా లేడిపిల్లను పొట్టన పెట్టుకుందేమోనని పరిపరి విధాల ఆలోచించేవాడు. విల పించేవాడు. ఇలా అనేక సంవత్సరాలు గడిచిపోయాయి. భరతునికి అవసానదశ సమీపించింది. మరణదశలో కూడా అతనికి లేడిపిల్లపై మమకారం పోలేదు. తన బిడ్డ అనుకున్నాడు దాన్ని. పక్కనే ఉంచుకున్నాడు. తుది ఘడియల్లో కూడా భగవంతుని స్మరించలేదు. ఆ లేడిపిల్లనే స్మరిస్తూ ప్రాణాలు విడిచాడు. ఈ కారణంగా అతను మృగజన్మ ఎత్తాడు. అయితే వెనకటి జన్మలో చేసిన పుణ్యం, తపోబలాల ఫలితంగా అతనికి పూర్వజన్మ జ్ఞానం కలిగింది. గతజన్మను తలచుకుని తీవ్రంగా దుఃఖించాడతను. భగవరాధన చేస్తూ మోక్షపదాన్ని ఆశించక, లేడిపిల్లను చేరదీసి, మృగమయిపోయానని కన్నీరు పెట్టుకున్నాడు. పూర్వజన్మ స్మృతితో విరక్తుడై తల్లి మృగిని విడిచిపెట్టాడు. కాలాంజనం పర్వతం నుండి సాలగ్రామానికి పులహాశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ ఎవరితోనూ సంబంధం పెట్టుకోక, ఒంటరిగా తిరగసాగాడు. మృగజన్మ పోయేందుకు ఆహారాన్ని మాని, ఆఖరికి అక్కడ నదీజలాల్లో మృగదేహాన్ని విడిచిపెట్టాడు.

### జడభరతుడు

మృగజన్మ విడిచిపెట్టిన భరతుడు, ఓ బ్రాహ్మణుని ఇంట జన్మించాడు. తర్వాతి కాలంలో అతనే జడభరతుడుగా ప్రసిద్ధుడయినాడు.

ఆ బ్రాహ్మణుడు బ్రహ్మవేత్త. వేదవేదాంగ పారంగతుడు. అతనికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య తొమ్మండుగురు కొడుకుల్ని కన్నది. రెండవ భార్య ఒక ఆడపిల్లనీ, ఒక మగపిల్లవాణ్ణీ కవలలని కన్నది. ఆ మగపిల్లవాడే భరతుడు. అదే అతని ఆఖరి జన్మ. ఈ జన్మలో కూడా భరతుడుకి పూర్వజన్మ జ్ఞానం కలిగింది. గతజన్మలో చేసిన తప్పులు చేయకూడదనుకుని, ఎవరితోనూ ఎలాంటి సంబంధ బాంధవ్యాలు పెట్టుకోక, ఒంటరిగా గడపసాగాడతను. నిరంతరం హరి నామస్మరణ చేస్తూ, ఆ భగవంతుణ్ణే తలచుకుంటూ ఉండేవాడు. హరికథలు వింటూ ఉండేవాడు. ఎవరినీ పట్టించుకోక, ఎవరితోనూ మాట్లాడకపోవడంతో భరతుణ్ణి అంతా వెర్రివాడన్నారు. తండ్రి కూడా అలాగే భావించాడు. ఎంతగానో బాధపడ్డాడు. ఆ బాధతోనే మరణించాడతను. తల్లి కూడా

సహగమనం చేసి, తరలిపోయింది. సవతితల్లీ, ఆమె కుమారులే దిక్కయినారు భరతునికి. పిచ్చివాడంటూ భరతుణ్ణి వారసలే పట్టించుకోలేదు. అన్నం కూడా పెట్టేవారు కాదు. కాని ఎవరూ చేయ సాహసించని కష్టమయిన పనులూ, నీచమయిన పనులన్నీ అతని చేత చేయించేవారు. భరతుడు ఎదురు చెప్పేవాడు కాదు, చెప్పిన పనులన్నీ చేసేవాడు. అన్నీ మౌనంగా భరించేవాడు. నిత్యమూ సత్యమూ అయిన బ్రహ్మజ్ఞానాన్ని ఉపాసించడంతో దేన్నీ పట్టించుకునేవాడు కాదతను. సుఖదుఃఖాలూ, ఉచ్చనీచాలూ, మానవమానాలన్నిటినీ ఒకేలా చూసేవాడతను. దేహాభిమానం కూడా లేదతనికి. నిమిత్తమాత్రంగా శరీరాన్ని భరించసాగాడు. స్నానం లేదు. దుస్తులు మార్చే వాడు కాదు. ఇది శుభ్రమూ, ఇది అపరిశుభ్రమూ అన్న భేదం లేదు. ఎక్కడ పడితే అక్కడ పడుకునే వాడు. మసిపూసిన మాణిక్యంలా ఉండేవాడు. ఊరు ఊరంతా హేళన చేసేదతన్ని. ఒరే పిచ్చాడా! జడుడా! ఉన్మత్తుడా అని పిలిచేవారు. ఆట పట్టించే వారు. కొందరు పిల్లలయితే రాళ్ళు విసిరి గాయపరిచేవారతన్ని. అయినా ఎన్నడూ ఎవరినీ ఏమీ అనేవాడు కాదు జడభరతుడు. సర్వం బ్రహ్మమయం అనిపించేదతనికి. సవతితల్లీ, సోదరులూ ఆజ్ఞాపించడంతో నిత్యం పొలంలోనే గడిపేవాడు. ఎండనక, వాననక కష్టపడేవాడు. పెడితే తినేవాడు. లేదంటే లేదు. ఎంగిలి మెతుకులు పడేసినా అమృతతుల్యంగా భావించేవాడు.


రోజులు గడుస్తున్నాయి.

దొంగలనాయకుడు ఒకడికి పిల్లలు లేరు. తనకి పిల్లలు పుడితే భద్రకాళికి నరబలి ఇస్తానని మొక్కుకున్నాడతను. కొన్నాళ్ళకి అతనికి ఓ కొడుకు పుట్టాడు. కొడుకు పుట్టిన కారణంగా కాళికాదేవికి మొక్కు తీర్చుకోవాలి. అనుయాయుల్ని పిలిచి, ఆజ్ఞాపించాడిలా.

''ఎవడి కర్మ కాలితే వాణ్ణి పట్టుకుని రండి, అమ్మవారికి బలి ఇద్దాం.''

బలి కోసం నరుణ్ణి వెతకసాగారు అనుయాయులు. కర్మ ఎవరికీ కాలలేదు. వారి కంట పడలేదెవరూ. చీకటి పడింది. ఆ చీకటి వేళ పొలంలో కూర్చుని కాపలా కాస్తున్న భరతుడు కనిపించాడు. అతని కర్మ కాలిందనుకుని, కాళ్ళూ చేతులూ కట్టి కాళికాలయానికి తీసుకుని వచ్చారు. స్నానం చేయించారు. పసుపు, కుంకుమలు రాసి అలంకరించారతన్ని. వాయిద్యాలు వాయిస్తూ భరతుణ్ణి కాళికాదేవికి ఎదురుగా కూర్చోబెట్టారు. దొంగలనాయకుడు బలిచ్చేందుకు కత్తిని ఎత్తాడు. ఇంత జరుగుతున్నా, తనని బలిచ్చేందుకు ప్రయత్నిస్తున్నా చలించలేదు భరతుడు. వారిని ప్రతిఘటించ లేదు. అది చూసి కాళికాదేవి తట్టుకోలేకపోయింది. కోపగించుకుంది. మండిపడి భయంకరంగా ప్రత్యక్షమయ్యింది. దొంగలనాయకుణ్ణీ, అతని అనుచరుల్నీ కత్తితో కండగా నరికి, వారి రక్తం తాగింది. శాంతించింది.

జడభరతుడు అక్కణ్ణుంచి వెను తిరిగాడు. ఇంటికి చేరుకున్నాడు. జరిగింది ఎవరికీ చెప్పలేదు. జరుగుతున్న దాన్ని గమనించసాగాడు. ఒకనాడు సింధు సౌవీర దేశాధిపతి రహూగణుడు, ఇక్షుమతీ నదీతీరానికి బయల్దేరాడు. పల్లకీని మోసే బోయలు దొరకలేదు అతనికి. వెంటనే బోయలను వెదకి తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. వెదకుతూంటే జడభరతుడు కనిపించాడు. బలంగా ఉన్నాడు. ఎంతటి బరువునయినా మోయగలిగేట్టున్నాడు. పనికి వస్తాడనుకుని బలవంతంగా పట్టుకుపోయారతన్ని. భరతునితో పాటు మరో ముగ్గురిని కూడా వెదకి పట్టుకున్నారు. నలుగురూ పల్లకీని మోయసాగారు. పల్లకీని మోయడం జడభరతునికి చాతకాలేదు.



దాంతో పదే పదే భుజాలు మారుస్తూ ఎగుడు దిగుడుగా నడవసాగాడు. అతనితో పాటు మిగిలిన బోయలు కూడా అలాగే నడవసాగారు. పల్లకీ వక్రగతిలో ప్రయాణించసాగింది. లోపల కూర్చున్న రహూగణునికి కోపం వచ్చింది.

''ఏమయింది? పల్లకీ ఎందుకిలా వక్రగతిలో ప్రయాణిస్తూంది? ఈ ఎగుడు దిగుడు నడకలేమిటి?'' ప్రశ్నించాడు. వణకిపోతూ రాజుకి ఇలా సమాధానం చెప్పారు బోయలు.

''మేము ముగ్గురం సరిగానే నడుస్తున్నాం ప్రభూ! ఈ కొత్తవాడే సరిగా నడవడం లేదు. అందువల్లే మీకు ఈ ఇబ్బంది.''

జడభరతుణ్ణి రహూగణుడు అవహేళన చేశాడు. మందలించాడు. 'నేను-నాది' అని పట్టించుకోని జడభరతునికి రాజు మాటలు చీమకుట్టినట్టయినా అనిపించలేదు. ఏ రకంగానూ స్పందించలేదతను. దాంతో రహూగణుడు మరింతగా కోపించాడు. అనేక దుర్భాషలాడాడతన్ని. పదే పదే జవాబు చెప్పమని రెచ్చగొట్టాడు. ఇక తప్పదనుకుని అప్పుడు నోరు విప్పాడు జడభరతుడు. వేదాంత వచనాలతో బదులు పలికాడు. తనకి పొగడ్తలూ తిట్లూ ఒకటేనన్నాడు. దండించినా, సన్మానించినా సమానమేనన్నాడు. ప్రారబ్ధకర్మ పోగొట్టుకునేందుకే తాను ఈ పల్లకీని మోస్తున్నట్టుగా చెప్పాడు. రహూగణుడికి జ్ఞానోదయం అయింది. పల్లకీని మోస్తున్నది మామూలు వ్యక్తి కాదని, ఎవరో మహానుభావుడని అర్థమయింది. పల్లకీని ఆపమన్నాడు. ఆగింది పల్లకీ. రహూగణుడు పల్లకీ దిగి, జడభరతుని పాదాల్ని ఆశ్రయించాడు. తన తప్పుని మన్నించమని ప్రార్థించాడు.

''మహాత్మా! ఎవరు నువ్వు? ఎక్కడివాడివి? బోయ అయిన వైనం ఏమిటి?'' రహూగణుడు ప్రశ్నించాడు. సమాధానంగా ముందు నవ్వాడు జడభరతుడు. తర్వాత జరిగిందంతా చెప్పి, అతనికి తత్త్వజ్ఞానబోధ చేశాడు. రహూగణుడి సంశయాలన్నీ తీర్చాడు. బ్రహ్మజ్ఞానాన్ని పొంది రహూగణుడు తరించాడు. అవధూతగా కొంతకాలం జీవించి, ఆఖరికి విష్ణుపదం చేరుకున్నాడు జడభరతుడు.

## అజామిళుడు

భాగవత రచనలో భూగోళ, ఖగోళశాస్త్ర సంబంధిత విషయాలన్నీ కూలంకషంగా చర్చించాడు వ్యాసుడు. భూగోళ పరిమాణం, సప్తద్వీపాల రూపురేఖలు, ప్రధానంగా జంబూద్వీపంలోని భరతవర్ష స్వరూపాన్ని వ్యాసుడు చెప్పినంత విపులంగా వేరొకరు వివరించలేకపోయారు. భారతదేశంలోని పర్వతాలు, నదులు, వాటి ఎల్లలు...అన్నీ లెక్కలు కట్టి మరీ చెప్పాడతను. ఊర్ధ్వలోకాలు, అధోలోకాలు, గ్రహాలు, గ్రహగతులు వ్యాసుడు ఆనాడు వర్ణించి చెప్పినట్టుగానే నేటికీ ఉన్నాయంటూ పరీక్షితునికి చెప్పాడు శుకుడు. ఆ తర్వాత విష్ణుభక్తి ఎంతటి ప్రభావవంత మయినదో చెప్పాడు. అందుకు ఉదాహరణగా అజామిళుని వృత్తాంతాన్ని వివరించాడు.

పూర్వం కన్యాకుబ్జ అని ఓ నగరం ఉండేది. ఆ నగరంలో అజామిళుడు అని ఓ బ్రాహ్మణుడు ఉండేవాడు. బ్రాహ్మణుడయిన అజామిళుడు, ఓ దాసిని పెళ్ళాడి, కులధర్మాల్ని కాలదన్నాడు. అన్ని విధాలా భ్రష్టుడయినాడు. జూదం, దొంగతనం, వంచనే జీవితంగా గడపసాగాడు. సజ్జనులను హింసిస్తూ, దుర్జనులతో చేతులు కలిపాడు. పదిమంది కొడుకుల్ని కన్నాడు. వారిలో ఆఖరివాడి పేరు నారాయణుడు. వాడంటే అజామిళుడికి చెప్పలేనంత ఇష్టం. ప్రేమ.

అజామిళుడికి ఎనభై యేళ్ళొచ్చాయి. ముసలివాడయిపోయాడు. అవసానదశ సమీపించింది. ఆ సమయంలో కూడా అతను దేవుణ్ణి స్మరించలేదు. ఆఖరి కొడుకు నారాయణుడి గురించే ఆలోచించసాగాడు. ప్రాణాలు పోతున్నాయి. యమభటులు వచ్చి అతనికి ఎదురుగా నిల్చున్నారు. వారిని చూసి, భయపడ్డాడు అజామిళుడు. కొడుకుని గట్టిగా కేకేశాడు.

''నారాయణా! నారాయణా'' గొంతు చించుకున్నాడు. చనిపోయాడు.

దేవుణ్ణి ఏ క్షణమూ తలచింది లేదు. ఒక్క మంచి పని కూడా చేసి ఎరుగడు. అయినా ఆఖరి క్షణాల్లో అజామిళుడు 'నారాయణా! నారాయణా' అన్నందుకు పుణ్యాన్ని మూటగట్టుకున్నాడు. ఫలితంగా విష్ణుదూతలు ప్రత్యక్షమయ్యారక్కడ. అజామిళుణ్ణి నరకానికి తీసుకుని పోయేందుకు సిద్ధమవుతున్న యమభటుల్ని వారించారు.

''అతను మా మనిషి. మీరు ముట్టుకోకండి'' అన్నారు. తేజరిల్లుతున్న విష్ణుదూతల్ని చూసి, వారితో ఇలా అన్నారు యమభటులు.

''అయ్యా! మీరెవరో తెలీదుగాని, మీరు మాత్రం యమధర్మరాజు శాసనాన్ని ధిక్కరిస్తున్నారు. అది తప్పు.''

''మేము విష్ణుదూతలం. ఈ అజామిళుణ్ణి విష్ణులోకానికి తీసుకుని పోయేందుకు వచ్చాం. ఇది యమధర్మరాజుని ఎంత మాత్రమూ ధిక్కరించడం కాదు'' అన్నారు. ఆశ్చర్యపోయారు యమభటులు. ఒకరిని చూసి ఒకరు నవ్వుకున్నారు.

''ఈ అజామిళుణ్ణి విష్ణులోకానికి తీసుకుని వెళ్తారా? ఏం పుణ్యం చేశాడని? ఇతని గురించి మీకు తెలీదేమో! ఇతను మహాపాపి. బ్రాహ్మణునిగా పుట్టి, చెప్పలేనన్ని నీచకార్యాలు చేశాడు. ఏనాడూ ఇసుమంత పుణ్యం చెయ్యలేదు. ఇలాంటి వాడికి విష్ణులోక ప్రాప్తా? ఆశ్చర్యంగా ఉంది'' అన్నారు. సమాధానంగా విష్ణుదూతలు జీవుల పుణ్య పాపాల గురించీ, మోక్షప్రాప్తికి సాధన మయిన భగవన్నామస్మరణ గురించీ యమభటులకు వివరించారు. భగవన్నామ మహిమను గురించి కూడా గొప్పగా చెప్పారు.

''ఎవరయినా సరే, ఎన్ని పాపాలు చేసినా సరే, ఆఖరి క్షణాల్లో నోరారా భగవన్నామస్మరణ చేస్తే చాలు, అతని పాపాలన్నీ పోతాయి. మీరు చెప్పింది నిజమే! ఈ అజామిళుడు మహాపాపాలు చేశాడు. ఇతను నరకానికి పోవాల్సిన వాడే! అయితే ఆఖరి క్షణాల్లో 'నారాయణా! నారాయణా' అంటూ హరి నామస్మరణ చేశాడు. అప్పుడు కూడా భగవంతుణ్ణి స్మరించలేదతను. కొడుకునే పిలిచాడు. అయినప్పటికీ అది హరినామస్మరణే! ఫలితంగా అతని పాపాలు పోయాయి. పుణ్యాత్ముడయినాడు. అందుకే మేము ప్రత్యక్షమయ్యాం. శ్రీహరి నామస్మరణ చాలా గొప్పది. మీరు అతన్ని స్పృశించరాదు. వెళ్ళిపోండిక్కణ్ణుంచి. కాదూ కూడదంటే జరిగిందంతా మీ యమధర్మరాజుకి వివరించి, నిజానిజాలు తెలుసుకోండి'' అన్నారు విష్ణుదూతలు. సరేనన్నట్టుగా యమదూతలు తొలగిపోయారక్కణ్ణుంచి. యమధర్మరాజును సమీపించారు. జరిగిందంతా చెప్పారతనికి.

''హరి నామస్మరణ అంత గొప్పదా స్వామీ?'' అడిగారు.

''చాలా గొప్పది. ఆ నామస్మరణ వినవస్తున్న వైపు మీరు పోవద్దు. ఇలాంటి తప్పు మళ్ళీ చెయ్యొద్దు.'' మందలించాడు యమధర్మరాజు. తన భటులు చేసిన తప్పుకి, వారినీ, తననీ కూడా క్షమించమని శ్రీహరిని ప్రార్థించాడు యమధర్మరాజు.

## ఇంద్ర వృత్తాసురుల యుద్ధం

మృత్యుఘడియలు సమీపిస్తుంటే యమభటులు రావడం, వారిని చూసి భయపడి, తన ఆఖరి కొడుకు నారాయణను 'నారాయణా! నారాయణా' అని కేక వేయడం, అప్పుడు విష్ణు

దూతలు రావడం, వారి మధ్య వివాదం చెలరేగడం అంతా గమనించాడు అజామిళుడు. అప్పుడతనికి జ్ఞానోదయం అయింది. హరినామస్మరణ శక్తి ఏమిటో ఎలాంటిదో తెలియవచ్చింది. దాంతో జీవితమంతా వ్యర్థం చేసుకున్నందుకు ఎంతగానో దుఃఖించాడు. తర్వాత మించి పోయింది లేదనుకుని, భగవద్భక్తిని పెంచుకున్నాడు. అన్ని బంధాలనూ తెంచుకుని, విరక్తుడై గంగాతీరం చేరుకున్నాడు. భగవంతుని స్మరిస్తూ ధ్యానంలో మునిగిపోయాడు. కొంతకాలానికి మృత్యుఘడియలు సమీపించినప్పటి విష్ణుదూతలు మళ్ళీ కనిపించారతనికి. వారిని చూసి ఆనందించాడు. చేతులు జోడించి నమస్కరించాడు. గంగాతీరంలో దేహాన్ని త్యజించి, విమానంలో వైకుంఠానికి చేరుకున్నాడు. జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు.

## వృత్రాసురుడు

జగత్ప్రసిద్ధం వృత్రాసురుని కథ. రాక్షసులలో వృత్రుడు మహా భయంకరుడు. అతని పేరు వింటే చాలు, దేవతలంతా వణికిపోతారు. అలాంటి వాణ్ణి సంహరించాలి ఇంద్రుడు. అందుకు అతను పడిన పాట్లు ఇన్నీ అన్నీ కావు.

వృత్రాసురుని కథకు వేదమే మూలమంటారు పెద్దలు. వృత్రాసురుణ్ణి సంహరించి, అతని బందీలుగా ఉన్న గోవులనూ, జలాలనూ ఇంద్రుడు విడిపించాడంటారు. సూర్యుణ్ణి పైకి తెచ్చాడని కూడా అంటారు. ఈ కథ మొత్తం ఋగ్వేదంలో ఉన్నదని చెబుతూ, వృత్రాసురుని కథకు వ్యాఖ్యానాలు చాలా ఉన్నాయంటారు. అయితే వ్యాసుడు చెప్పిన కథే అజరామరం అంటారు. ఆ కథనే మనం ఇప్పుడు చెప్పుకుందాం.

దేవతలకి గురువు బృహస్పతి. అలాగే రాక్షసులకు శుక్రాచార్యుడు గురువు. దేవతకీ రాక్షసులకీ పడనట్టుగానే ఈ గురువులిద్దరికీ కూడా క్షణం పడదు. ఒకనాడు ఇంద్రుడు కొలువుదీరాడు. బృహస్పతి వచ్చాడక్కడికి. గురువు వచ్చాడన్న గౌరవం లేదు, చూడలేదతన్ని. పలకరించలేదు, నమస్కరించలేదు. అసలతన్ని పట్టించుకోలేదు ఇంద్రుడు. నిండుసభలో ఇంద్రుడు తనని అగౌరవపరచాడని ఎంతగానో బాధపడ్డాడు బృహస్పతి. వెంటనే అక్కణ్ణుంచి వెను తిరిగాడు. వెను తిరిగి వెళ్ళిపోతున్న బృహస్పతిని చూశాడు ఇంద్రుడు. అరెరె! తప్పు చేశాననుకున్నాడు. త్వరలోనే తనకీ, తన లోకానికీ కీడు తప్పదనుకున్నాడు. అనుకున్నట్టే అయింది. బృహస్పతి అనుగ్రహాన్ని కోల్పోయారు దేవతలు. ఈ సంగతి తెలిసి, రాక్షసులు విజృంభించారు. దేవతలను హింసించసాగారు. ఇంద్రాధిపత్యానికి ముప్పు ఏర్పడింది. చేసిన తప్పును సరిదిద్దుకునేందుకు బృహస్పతిని వెదుక్కుంటూ అతని ఆశ్రమానికి చేరుకున్నాడు ఇంద్రుడు. అక్కడ బృహస్పతి లేడు. ఎక్కడికి వెళ్ళాడంటే తెలియదన్నారు.

చేసేది లేక, దేవతలను వెంటబెట్టుకుని, బ్రహ్మని సందర్శించాడు ఇంద్రుడు. జరిగిందంతా చెప్పాడతనికి. అమరలోకాన్ని కాపాడమని, అతని పాదాల్ని ఆశ్రయించాడు. అభయాన్ని ప్రసాదించాడు బ్రహ్మ. విశ్వరూపుణ్ణి ఆశ్రయించమని చెప్పాడు. సపరివారంగా విశ్వరూపుణ్ణి ఆశ్రయించాడు ఇంద్రుడు. దేవతలకు ఆచారత్వం స్వీకరించాల్సిందిగా వేడుకున్నాడు. తపస్సంపన్నుడూ, బ్రహ్మవిదుడూ అయిన విశ్వరూపుడు అందుకు అంగీకరించలేదు. పౌరోహిత్యం బ్రహ్మవర్చస్సును హరిస్తుందని, వద్దన్నాడు. ఇంద్రుడు పదే పదే బతిమలాడితే, కాళ్ళ మీద

పడి ప్రాధేయపడితే కాదనకలేకపోయాడు. ఆఖరికి ఒప్పుకున్నాడు. దేవతలను కాపాడేందుకు నడుం కట్టాడు. శుక్రుని విద్యాబలంతో విర్రవీగుతున్న రాక్షసులను అడ్డుకునేందుకు, వారిపై విజయాన్ని సాధించేందుకు ఇంద్రునికి వైష్ణవ మహావిద్యను ప్రసాదించాడు విశ్వరూపుడు. శ్రీమన్నారాయణ కవచాన్ని ఉపదేశించాడతనికి. దాని ప్రభావంతో ఇంద్రుడు రాక్షసులందరినీ నిర్జించాడు. ఇంద్రపదవికి అడ్డంకుల్ని తొలగించుకున్నాడు.

విశ్వరూపుడు దేవతలకు ఆచార్యత్వం వహిస్తున్నప్పటికీ మేనమామలయిన రాక్షసులకు యజ్ఞాలలో హవిర్భాగాలను అందజేస్తూ వచ్చాడు. ఈ విషయాన్ని ఇంద్రుడు గ్రహించాడు. రాక్షసులకు హవిర్భాగాలు అందుతూ పోతే తన ఆధిపత్యానికి ప్రమాదం అని అనుమానించాడు. కోపగించుకున్నాడతను. ఆ కోపంతో ఆచార్యుడని చూడకుండా, తనకెంతో మేలు చేశాడని కూడా తలచకుండా విశ్వరూపుని మూడు శిరస్సులనూ నరికి వేశాడు. చంపేశాడతన్ని. ఫలితంగా



ఇంద్రునికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. ఒక సంవత్సరం పాటు ఆ పాపాన్ని అనుభవించాడతను. తర్వాత ఆ పాపాన్ని నాలుగు భాగాలు చేశాడు. ఆ నాలుగింటినీ భూమికీ, జలానికీ, వృక్షాలకూ, స్త్రీలకూ పంచేశాడు. బ్రహ్మహత్యలో ఓ పాలు భూమి స్వీకరించిన కారణంగా భూమిలో ఊసరక్షేత్రాలు ఏర్పడ్డాయి. తన నుండి పాపాన్ని స్వీకరించిన ఫలితంగా గుంట చేసి తవ్వినా, దానంతట అదే పూడిపోయేటట్లు ఇంద్రుని నుంచి వరాన్ని పొందింది భూమి. అలాగే స్వీకరించిన బ్రహ్మహత్యాపాతకం జలాలపై నురుగు రూపంలో ఉండసాగింది. అయితే స్వీకరించిన పాపానికి ఫలితంగా తనలో చేరిన ద్రవ్యాన్ని ఆకృతిపరంగా అధికం చేసేటట్టు ఇంద్రుని నుంచి వరాన్ని పొందాయి జలాలు. బ్రహ్మహత్యాపాతకం చెట్లలో బంక రూపంలో నిలదొక్కుకుంది. నరికినా తిరిగి చెట్లు చిగురించేట్టుగా వాటికి వరాన్ని ప్రసాదించాడు ఇంద్రుడు. స్వీకరించిన బ్రహ్మహత్యా ఫలాన్ని నెలనెలా స్త్రీలు రజోరూపంలో అనుభవిస్తున్నారు. అయితే పాపాన్ని స్వీకరించారన్న కృతజ్ఞతతో ప్రసవం అయ్యేంత వరకూ గర్భానికి ఎటువంటి ముప్పు రాకుండా సంభోగ సుఖాలు అనుభవించేట్టుగా స్త్రీలకు వరాన్ని ప్రసాదించాడు ఇంద్రుడు. పాపాన్నీ, వరాల్నీ పంచి ఇచ్చి ఇంద్రుడు బ్రహ్మహత్యామహాపాతకం నుంచి బయటపడ్డాడు.

తన కుమారుడు విశ్వరూపుణ్ణి ఇంద్రుడు సంహరించినందుకు తండ్రి త్వష్టకు చెప్పలేనంత కోపం కలిగింది. ఇంద్రుని మీద పగబట్టాడతను. ఇంద్రుని తుదముట్టించాలనుకున్నాడు. అతన్ని సంహరించగలిగే బలిమిగల వాణ్ణి ఉద్భవింపజేసేందుకు త్వష్ట గొప్ప యజ్ఞాన్ని ప్రారంభించాడు. ముగిసిందది. యజ్ఞకుండం నుండి అనూహ్యమయిన బలంతో ఒక పురుషుడు జన్మించాడు. దినదినానికీ అతను బాణప్రమాణంలో ఎదుగుతూ వచ్చాడు. నల్లటి ఆకారాన్ని సంతరించుకున్నాడు. నిప్పులు కురిసే కళ్ళతో మెరిసిపోసాగాడు. త్రిశూలంతో ఆకాశం అంత ఎత్తున ఎదిగి, ప్రళయనాట్యం చేయసాగాడు. నక్షత్రాలనూ, నవగ్రహాలనూ మింగేస్తున్నట్టుగా అగుపించాడు. మూడులోకాలనూ పొట్టన పెట్టుకునేందుకు ప్రయత్నిస్తూ పెద్దపెద్ద కోరలున్న నోటిని కొండ గుహలా తెరచి లోకాలన్నిటినీ ఆక్రమించుకోసాగాడు. ఫలితంగానే అతనికి వృత్రాసురుడు అని పేరొచ్చింది. వృత్రాసురుణ్ణి చూసి లోకాలన్నీ భయంతో వణకిపోసాగాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగుదీయసాగారంతా. దేవతలు మూకుమ్మడిగా వృత్రాసురుణ్ణి ఎదుర్కొన్నారు. వందలు వేలాది శస్త్రాస్త్రాలను ప్రయోగించారు. అన్నిటినీ కరకరా నమిలి మింగేశాడు వృత్రుడు. నిరాయుధులయి దేవతలంతా వెన్ను చూపి పరుగుదీశారు. ఎప్పుడయితే దేవతలు ఓడిపోయారో అప్పుడు తనకి మరణం తప్పదనుకున్నాడు ఇంద్రుడు. కృంగిపోయాడు. విష్ణువుని ప్రార్థిస్తే ఫలితం ఉంటుందని, దేవతలంతా విష్ణువుని సమీపించారు. రక్షించమని వేడుకున్నారతన్ని. వేయి విధాల స్తోత్రం చేశారు. నారాయణుడికి అప్పుడు దేవతల మీద దయ కలిగింది. వృత్రుణ్ణి సంహరించేందుకు చక్కని ఉపాయాన్ని చెప్పాడతను.

''దధీచి గొప్ప తపస్వి. బ్రహ్మజ్ఞాని. ఋషిశ్రేష్ఠుడు. అశ్వశిరంబ్రహ్మవిద్యను అతనే అశ్వనీ దేవతలకు ఉపదేశించాడు. అతడే నారాయణ కవచాన్ని త్వష్టకు బోధించాడు. ఆ కవచాన్నే త్వష్ట, విశ్వరూపునికి ఉపదేశించాడు. అవన్నీ అలా ఉంచితే, దధీచి అధర్వణముని. గొప్పదాత. పరోపకారి. అడిగితే దేనినీ కాదనడు. వెళ్ళి అతన్ని శరణు కోరండి. వేయి విధాల బతిమాలి, అతని దేహాన్ని అడగండి. ఆ దేహంతో గొప్ప ఆయుధాన్ని సృజించండి. దాంతో వృత్రాసురుణ్ణి

సంహరించడం సులువు. దధీచి శరీరంతో సృజించబడిన ఆయుధంతోనే వృత్రాసురుడు మరణిస్తాడు. మరిక ఆలస్యం చేయకండి. వెళ్ళి రండి.'' అన్నాడు నారాయణుడు. ఇంద్రుడు ఊపిరి పీల్చుకున్నాడు. దేవతలతో దధీచి దగ్గరకు పరుగుదీశాడు. అతన్ని అనేక విధాల స్తుతించి, ప్రార్థించి ప్రసన్నుణ్ణి చేసుకున్నాడు. దేహాన్ని ప్రసాదించమని చేతులు జోడించి వేడుకున్నాడు. సరేనన్నాడు దధీచి. యోగసమాధినిష్ఠుడై, పరబ్రహ్మలో ఆత్మను ఐక్యం చేసి, దేహాన్ని త్యజించాడతను. మరుక్షణం విశ్వకర్మను అక్కడకి రప్పించాడు ఇంద్రుడు. దధీచి వెన్నెముకతో ఆయుధాన్ని తయారు చేయమని ఆజ్ఞాపించాడు. ఆయుధాన్ని తయారు చేశాడు విశ్వకర్మ. అదే వజ్రాయుధం. ఆ వజ్రాయుధాన్ని ఝుళిపిస్తూ వృత్రుని మీదకి యుద్ధానికి బయల్దేరాడు ఇంద్రుడు. భయంకరమైన యుద్ధం చేశాడతనితో. అలాంటి యుద్ధం మున్నెన్నడూ జరగలేదు. ఇక జరగబోదన్నారు చూసినవారంతా. యుద్ధంలో ఇంద్రుణ్ణి మింగేశాడు వృత్రుడు. ఆశ్చర్యపోయారంతా. అయితే ఇంద్రుడు చనిపోలేదు. వృత్రుని కడుపులో నారాయణకవచ ప్రభావంతో నిలదొక్కుకున్నాడు. చేతిలోని వజ్రాయుధంతో వృత్రుని పొట్టను చీల్చి బయటపడ్డాడు. బయటిపడి, అదే వజ్రాయుధంతో గిరి శిఖరాన్ని ఖండించినట్టుగా ఒక్క వేటుతో వృత్రుని శిరస్సును ఖండించాడు. వృత్రుడు మరణించాడలా.

వృత్రుడు ఇక లేడని దేవతలంతా సంతోషించారు. సంబరాలు చేసుకున్నారు. ఇంద్రుణ్ణి పొగడ్తలతో ముంచెత్తారు. తన పదవి సుస్థిరమయిందని, త్రిలోకాధిపత్యం తనదేనని ఆనందించాడు ఇంద్రుడు. అయినా ఏదో తెలియని బాధ ఇంద్రుణ్ణి పీడించసాగింది. అతనికి సుఖసంతోషాలు లేకుండా చేసింది. దానికి కారణం మళ్ళీ బ్రహ్మహత్యాపాతకం ఇంద్రుణ్ణి చుట్టుకోవడమే! ఆ పాపం అతన్ని ఓ భయంకర రూపంలో వెంటాడసాగింది. తప్పించుకునేందుకు పరుగుదీశాడు ఇంద్రుడు. ఎంత దూరం పరుగుదీసినా వెంటాడుతూనే ఉంది పాపం. దిక్కుతోచలేదు ఇంద్రునికి. నలుదిశలా పరుగుదీసి పరుగుదీసి ఆఖరికి మానససరోవరంలోకి ప్రవేశించాడు. అక్కడ ఒక కమలంలోని కాండంలో దాగున్నాడు. వెయ్యి సంవత్సరాలపాటు అతను అలాగే ఆ కాండంలోనే ఉన్నాడు. ఇంద్రుడు అక్కడ కాండంలో ఉండడంతో ఇక్కడ ఇంద్రపదవి ఖాళీగా మిగిలింది. ఆ పదవిని అప్పుడు గొప్ప తపోబలంతో నహుషుడు చేజిక్కించుకున్నాడు. ఇంద్రపదవితో నహుషుడు సంతోషించలేదు, ఇంద్రుని భార్య శచీదేవిని ఆశించాడు. ఆ కోరికతో పదవీభ్రష్టుడై అజగరమైపోయాడు. మానససరోవరంలో కమలకాండంలో దాగున్న ఇంద్రుడు శ్రీహరిని ధ్యానించి, ఆ దేవదేవుని అనుగ్రహంతో బ్రహ్మహత్యాపాతకాన్ని పోగొట్టుకున్నాడు. కాండం నుంచి బయటికొచ్చాడు. అశ్వమేధయాగం చేసి, యజ్ఞపురుషుడయ్యాడు. శ్రీహరిని ఆరాధిస్తూ సర్వపాపాలనూ పోగొట్టుకున్నాడు. పాపాలు తొలగడంతో మళ్ళీ త్రిలోకాధిపత్యాన్ని చేజిక్కించుకున్నాడు.

## చిత్రకేతువు

వృత్రాసురుడు రాక్షసుడు కదా, అతన్ని సంహరిస్తే ఇంద్రుడికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకోవడం ఏమిటి? అన్న సందేహం రాక మానదు. దానికి సమాధానం ఏమిటంటే... వృత్రుడు తపస్స్వభావుడు. బ్రహ్మవంశసంజాతుడు. గొప్ప విష్ణుభక్తుడు. అదెలా అంటే అతని పూర్వజన్మ గురించి తెలుసుకోక తప్పదు.

పూర్వం శూరసేన దేశాన్ని చిత్రకేతువు పాలించేవాడు. అతనికి కోటి మంది భార్యలు. అంతమంది భార్యలు ఉన్నప్పటికీ అతనికి పిల్లలు లేరు. దాంతో చిత్రకేతువు చెప్పలేనంత దుఃఖాన్ని అనుభవించసాగాడు. ఆ సమయంలో లోకసంచారం చేస్తూ బ్రహ్మర్షి అంగిరసుడు శూరసేన దేశాన్ని సందర్శించాడు. అంగిరసునికి సకల మర్యాదలూ చేశాడు చిత్రకేతువు. పూజించాడతన్ని. తన మనోదుఃఖాన్ని కూడా విడమరచి చెప్పాడు. సంతతి కలిగే మార్గం చెప్పమని ప్రాధేయ పడ్డాడు. జాలి చెందాడు అంగిరసుడు. వెంటనే అతని చేత త్వష్టృయాగం చేయించాడు. యజ్ఞఫలాన్ని చిత్రకేతు పెద్దభార్య కృతద్యుతికి అందజేసి, త్వరలోనే ఆమె ఓ కొడుకుని ప్రసాదిస్తుందని చెప్పి, అక్కణ్ణుంచి నిష్క్రమించాడతను.

కృతద్యుతి గర్భవతి అయింది. నవమాసాలూ నిండి ఓ కుమారుణ్ణి ప్రసవించింది. ఆ కుమారుణ్ణి చూసి చిత్రకేతువు ఆనందించాడు. రాజ్యం అంతటా పండుగ చేశాడు. ప్రజలకు అనేక కానుకలిచ్చాడు. బ్రాహ్మణులకూ, మునులకూ భూరిదానాలిచ్చాడు. అందరినీ సంతృప్తి పరిచాడు. ఇంత వరకూ బాగానే ఉంది. పెద్ద భార్య కృతద్యుతికి తప్ప తామెవ్వరికీ సంతానం లేదని, చిత్రకేతువు మిగిలిన భార్యలంతా దుఃఖించసాగారు.

## ప్రహ్లాద నారాయణ జపం:హిరణ్యకశిపుని కోపం

పిల్లాణ్ణి కని తనని తండ్రిని చేసినందుకు కృతద్యుతి పట్ల మరింతగా అనురాగాన్ని పెంచుకుని, ఆమె మందిరాన్ని వీడి రావడం మానుకున్నాడు చిత్రకేతువు. దీంతో మిగిలిన భార్యలకు కృతిద్యుతి పట్లా, ఆమె కుమారుడు పట్లా ఎక్కడలేని అసూయా ద్వేషాలు కలిగాయి. సవతి తల్లులంతా ఒకటయ్యారు. పిల్లాడికి విషం పెట్టి, చంపేశారు. కొడుకు పోవడంతో కృతద్యుతి మొదలు నరికిన చెట్టులా కిందపడి, స్పృహకోల్పోయింది. చిత్రకేతువు కూడా మూర్ఛపోయాడు. కాస్సేపటికి తేరుకుని భోరుభోరున విలపించారిద్దరూ. ఆ సమయానికి నారదుడు సహా అంగి రసుడు వచ్చాడక్కడకి. చిత్రకేతువుని ఓదార్చి, అతనికి వేదాంతాన్ని బోధించారిద్దరూ. భార్యాబిడ్డలు ఋణానుబంధం అన్నారు. వారి సంయోగ వియోగాలకు దుఃఖపడినవాడు అజ్ఞాని అన్నారు. జరిగిందేదో జరిగిపోయింది. ఇక సంసారబంధాలు తెంచుకుని, భగవంతుని ప్రార్థిస్తూ ముక్తిపదం చేరుకోమన్నారు. ఆలోచించగా ఆలోచించగా వైరాగ్యం కలిగింది చిత్రకేతువుకి. దుఃఖాన్ని మరచిపోయాడు. శ్రీహరిని ధ్యానించసాగాడు. అతనికి నారదుడు సంకర్షణ విద్య ఉపదేశించాడు. ఆ విద్య ప్రభావంతో చిత్రకేతువుకి భగవద్దర్శనం అయింది. దేవుడు ప్రత్యక్ష మయ్యాడు. జ్ఞానబోధ చేశాడతనికి. చిత్రకేతువు సిద్ధ పురుషుడయ్యాడు. విమానారూఢుడయి భార్యల సహా శ్రీహరిని కీర్తిస్తూ కులగిరి పర్వతప్రాంతాలలో విహరించసాగాడు. అనేక లక్షల సంవత్సరాలు గడిపాడలా. ఒకనాడు కైలాసానికి వెళ్ళాడు చిత్రకేతువు. పార్వతీ సహితుడై మహేశ్వరుడు కొలువుదీరారక్కడ. పార్వతి, శివుని అంకపీఠాన్ని అలంకరించి ఉంది. అది చూసి చిత్రకేతువు పగలబడి నవ్వాడు. నిరంతర తపోనిష్ఠాగరిష్ఠుడు, లోకేశ్వరుడు శంకరుడు, సాధారణ మానవునిలా భార్యను తొడ మీద కూర్చోబెట్టుకోవడం ఏమిటిని తప్పుబట్టాడు. మునులూ, ప్రమథగణాలూ ఎవరూ అందుకు బదులు పలకలేదు. మౌనం వహించారంతా. శివుడు కూడా

పెదవి విప్పలేదు. అది చూసి పార్వతికి కోపం వచ్చింది. చిత్రకేతువుని క్షమించరాదనుకున్నది. అతన్ని ఇలా శపించింది.

''శివనిందకు పాల్పడిన నీకిదే నా శాపం, రాక్షసుడివై జన్మించు.''

చేసిన తప్పుని తెలుసుకున్నాడు చిత్రకేతువు. చేతులు జోడించి శివపార్వతులకు నమస్కరించి అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. శాపఫలితంగా వృత్రాసురునిగా జన్మించాడు.

## భక్త ప్రహ్లాద

కశ్యప ప్రజాపతికి అదితి, దితి అని ఇద్దరు భార్యలు. అదితి గర్భాన దేవతలు జన్మిస్తే, దితి గర్భాన దానవులు జన్మించారు. దానవుల్లో కూడా పరమ భాగవతోత్తములు ఉద్భవించారు. వారిలో ప్రహ్లాదుడు ఒకడు.

విష్ణుమూర్తి ద్వారపాలకులయిన జయవిజయులు సనకసనందనాదుల శాపఫలితంగా తొలిజన్మలో దితి గర్భాన హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షులుగా జన్మించారు. హిరణ్యాక్షుణ్ణి వరహావతారం ఎత్తి శ్రీమన్నారాయణుడు సంహరించాడు. తమ్ముణ్ణి సంహరించిన శ్రీమన్నారాయణుని అంతు చూడాలనుకున్నాడు హిరణ్యకశిపుడు. తపస్సు చేయసాగాడు. మందరగిరిపర్వతప్రాంతాలలో నిరాహారుడై ఒంటికాలి బొటన వేలు మీద నిలిచి నూరు దివ్య సంవత్సరాలు బ్రహ్మ కోసం ఘోర తపస్సు చేశాడు. అతని తపోమహిమకి సముద్రాలు కలగాయి. కులగిరులు కంపించి పోయాయి. గ్రహ నక్షత్రాదులు, సూర్య చంద్రాదులు గతి తప్పి తిరిగాయి. లోకాలన్నీ కింద మీదులయ్యాయి. ప్రళయాల్ని తట్టుకోలేకపోయారు దేవతలు. బ్రహ్మదేవుణ్ణి ఆశ్రయించారు. హిరణ్యకశిపునిపై దయ తలచమని ప్రార్థించారు. ఫలితంగా హిరణ్యకశిపునికి బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. వరాలు కోరుకోమన్నాడు. హిరణ్యకశిపుడు కోరుకున్నాడిలా.

''భూతలాలలో దేని వలన కూడా నాకు మృత్యువు రాకూడదు. వెలుపల, లోపల, పగలు, రాత్రి, నేలలో, నింగిలో, నిప్పులో, నీటిలో ఎక్కడ కూడా ఏ ఆయుధం చేత కూడా నాకు మృత్యువు రాకూడదు. నరుల వల్ల, మృగాల వల్ల, ప్రాణ రహితాలయిన వాటి చేతగాని, ప్రాణ సహితాలయిన వాటి చేతగాని, దేవతలు, దానవులు, ఉరగలు చేత నాకు మరణం లేనట్టుగా వరాన్ని ప్రసాదించు. అప్రతిహత రాజ్యాధికారమూ, సకలలోకాలనూ జయించే శక్తినీ, అణిమాద్యైశ్వర్యాలూ నాకు ప్రసాదించు.''

హిరణ్యకశిపుడు అడిగినవన్నీ చాలా దుర్లభాలు. అయినా బ్రహ్మదేవుడు ప్రసాదించాడు వాటిని.తపస్సు చాలించమని చెప్పి తరలిపోయాడు. తనకిక తిరుగులేదని బరితెగించేశాడు హిరణ్యకశిపుడు. విష్ణుమూర్తికి తన చేతిలో చావు తప్పదనుకున్నాడు. సమస్త లోకాల్నీ పీడించడం ప్రారంభించాడు. దిగ్విజయాత్ర చేసి మూడు లోకాలనూ జయించాడు.సురాసుర నర యక్ష రాక్షస పిశాచ భూతప్రేత గరుడ గంధర్వ ఉరగ సిద్ధ చారణ విద్యాధరులనూ, పితృదేవతలనూ, మునులనూ, మహర్షులనూ వశపరుచుకున్నాడు. ఇంద్రాది అష్టదిక్పాలకుల చేత ఊడిగం చేయించుకోసాగాడు. స్వర్గాన్ని ఆక్రమించుకున్నాడు. ఇంద్రసింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇంద్రభోగాలన్నీ అనుభవించసాగాడు. అతని మాట శాసనమయింది. అతను ఆడింది ఆటయింది. పాడింది పాటయింది. హిరణ్యకశిపునికి ఎదురు లేకపోయింది. ఎదురు తిరిగిన



ఋషులనూ, మునులనూ, బ్రాహ్మణులనూ హిరణ్యకశిపుడు నానా విధాల హింసించసాగాడు. హరిభక్తుడు అని తెలిస్తే చాలు, అతన్ని పరిమార్చే వరకూ నిద్రపోయేవాడు కాదు. విష్ణుమూర్తి అన్న పేరు ఉచ్చరిస్తే చాలు, కఠినదండన విధించేవాడు. భగవంతుని పేర నిర్వహించిన యజ్ఞ యాగాదులన్నీ ధ్వంసం చేయించేవాడు. చేస్తే గీస్తే ఆ యజ్ఞ యాగాదులన్నీ తన కోసం చేయమని ఆజ్ఞాపించాడు. హవిర్భాగాలన్నీ తనకే దక్కాలన్నాడు. భగవంతుడు వేరెవరో లేడు, తనే భగవంతుణ్ణి అన్నాడు. తననే పూజించి తరించాలని ప్రకటించాడు హిరణ్యకశిపుడు. తను చెప్పిందే ధర్మం అన్నాడు. పుణ్య పాపాలకు తానే కర్తనంటూ ఋషుల చేత చెప్పించాడు. చెప్పకపోతే మరణదండన విధిస్తాడని ఋషులంతా హిరణ్యకశిపుడు చెప్పినట్టల్లా చేశారు. అతని నాయకత్వంలో రాక్షసులు చెలరేగిపోయారు. వారికి పట్ట పగ్గాలు లేకుండాపోయాయి. లోకం

మీద పడి పతివ్రతలను చెరబట్టారు. పుణ్యాత్ములను హింసించారు. ప్రజల ఆస్తిపాస్తుల్ని కొల్లగొట్టి, వైదికకర్మ కలాపాలను ధ్వంసం చేయసాగారు. వారిని అడిగే నాథుడే లేకపోయాడు.

హిరణ్యకశిపుడు పెట్టిన బాధల్ని తట్టుకోలేని ఋషులూ, దేవతలూ విష్ణుమూర్తిని శరణు కోరారు. కాపాడమని చేతులెత్తి ప్రార్థించారు. అయితే అప్పుడక్కడ విష్ణుమూర్తి లేడు. అదృశ్యుడై ఉన్నాడు. అయినా పదే పదే ప్రార్థించడంతో అశరీరవాణిగా అభయాన్ని ప్రసాదించాడతను. మరికొంత కాలం ఓపిక పట్టాలంటూ, సమయం వచ్చినప్పుడు హిరణ్యాకశిపుణ్ణి వధిస్తానన్నాడు. త్వరలోనే హిరణ్యకశిపునికి ప్రహ్లాదుడనే కుమారుడు జన్మిస్తాడనీ, అతన్ని కాపాడేందుకు తానూ జన్మించక తప్పదనీ, అప్పుడు హిరణ్యకశిపుణ్ణి సంహరిస్తానన్నాడు. విష్ణుమూర్తి మాట మీద నమ్మకం ఉంచి, దేవతలూ, మునులూ వెను తిరిగారు. హిరణ్యకశిపుని బాధలను అనుభవిస్తూ భగవంతుని కోసం ఎదురు చూడసాగారు. అనేక సంవత్సరాలు గడిచిపోయాయి. అధర్మాన్ని భరించలేక భూదేవి తల్లడిల్లిపోసాగింది. అప్పుడు ప్రహ్లాదుడు జన్మించాడు. అతని జన్మతో భూదేవికీ, సమస్త ప్రాణికోటికీ శాంతి లభించినట్టయింది. పుట్టుకతోనే ప్రహ్లాదుడు భగవద్భక్తుడయినాడు. బ్రహ్మజ్ఞాని అయినాడు. తండ్రికి విరుద్ధంగా ఎదిగాడతను. నిరంతరం శ్రీహరినే స్మరించసాగాడు. అయిదేళ్ళు వచ్చాయతనికి. ప్రహ్లాదుణ్ణి పాఠశాలలో వేయదలచి, తన గురువు శుక్రాచార్యుని కుమారుడు చండామార్కుల వారిని పిలిపించి, ప్రహ్లాదునికి పాఠాలు చెప్పమన్నాడు హిరణ్యకశిపుడు. సరేనంటూ ప్రహ్లాదుణ్ణి తన వెంట ఆశ్రమానికి తీసుకుని వెళ్ళాడు చండామార్కుడు. అక్కడ కొందరు రాక్షస బాలురతో పాటు ప్రహ్లాదునికి చదువు చెప్పసాగాడు. ఆ చదువు నచ్చలేదు ప్రహ్లాదునికి. అది వ్యర్థమని గ్రహించాడు. పరతత్త్వాన్ని బోధించేదే సరయిన చదువని, ఆ చదువు కేవలం హరినామస్మరణతోనే సాధ్యమనుకున్నాడతను. అనుకుని, రాత్రీపగలూ హరినామస్మరణ చేయసాగాడు. ఆ హరినామ స్మరణలో ఒకొక్కసారి నవ్వేవాడు. ఒకొక్కసారి ఏడ్చేవాడు. భగవంతుని సాన్నిధ్యాన్ని ఆశిస్తూ చిత్రవిచిత్రంగా ప్రవర్తించేవాడు. అతన్ని వెర్రివాడన్నారు తోటి పిల్లలు. పిచ్చివాడన్నారు గురువులు.

ఒకనాడు పిల్లాడి చదువు సంధ్యలు ఏ మేరకు వచ్చాయో తెలుసుకోవాలనుకున్నాడు హిరణ్యకశిపుడు. పిలిపించాడతన్ని. వచ్చిన ప్రహ్లాదుని చేతులు జాచి కౌగిలిలోనికి తీసుకుని, తొడ మీద కూర్చోబెట్టుకున్నాడు.

''నాయనా! గురువుల దగ్గర బాగా చదువుకుని ఉంటావు. సకల శాస్త్రాలూ అభ్యసించి ఉంటావు. ఏదీ చదువంటే ఏమిటో, అందులోని మర్మం ఏమిటో చెప్పు'' అడిగాడు హిరణ్యకశిపుడు.

చదువంటే శ్రీహరిని జపించడమన్నాడు ప్రహ్లాదుడు. చదువులలోని మర్మం అంతా ఆ భగవంతుడు శ్రీహరి సాన్నిధ్యాన్ని చేరుకోవడమే అన్నాడు. పాపపంకిలమయిన ఈ లోకాన్ని త్యజించి, విష్ణుపదం చేరుకోవడమే తన లక్ష్యమని, దాని కోసం తపస్సు చేయాలనుకుంటున్నానని చెప్పాడు ప్రహ్లాదుడు. కుమారుడి మాటలు గుండెల్లో గునపాలు దించినట్టయింది హిరణ్యకశిపునికి. తన విరోధి విష్ణుమూర్తిని గురించి, ఎవరో చాటుగా ప్రహ్లాదునికి అన్నీ నూరిపోస్తున్నారనుకున్నాడు. అందుకే ప్రహ్లాదుని బుద్ధి పెడత్రోవ పట్టిందనుకున్నాడు. వణికిపోతున్న చండామార్కుణ్ణి దగ్గరగా పిలిచి, అతనికి చెప్పాడిలా.

''పిల్లాడికి సరయిన చదువులు చెప్పండి. శిక్షించినా పర్వాలేదు. చక్కని చదువు తలకెక్కాలి.'' అన్నాడు. సరేనంటూ ఆశ్రమానికి ప్రహ్లాదుని సహా చేరుకున్నాడు చండామార్కుడు.

''ప్రహ్లాదా! శ్రీహరిని భగవంతుడంటున్నావు, తప్పు నాయనా. మనకు భగవంతుడు నీ తండ్రి హిరణ్యకశిపుడే! అతన్నే మనం ఆరాధించాలి. అతను చెప్పిందే మనకు వేదం'' అన్నాడు చండామార్కుడు. సమాధానంగా నవ్వి ఊరుకున్నాడు ప్రహ్లాదుడు. ఇతన్ని శిక్షించాల్సిందే అనుకున్నాడు గురువు. కొడతానని మీది మీదికొచ్చాడు.

''నేను చెప్పిందే నువ్వు చదవాలి. వేరొకటి చదివితే ఒప్పుకోను'' అని బెదిరించాడు. రాక్షసులకు అవసరమయిన దండనీతిని బోధించాడతనికి. వింటే కదా! ఏదీ చెవికెక్కించుకోలేదు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుని చదువు గురించి మళ్ళీ తెలుసుకోవాలనుకుని, అతన్ని పిలిపించాడు హిరణ్యకశిపుడు. బాగుపడి ఉంటాడు. తన గురించి అంతా తెలుసుకుని ఉంటాడనుకున్నాడు. వచ్చిన ప్రహ్లాదుని తొడ మీద కూర్చోబెట్టుకుని, లాలించాడు. బుజ్జగించాడు.

''ఏదీ నువ్వు ఇటీవల నేర్చుకున్నదాన్ని చక్కగా చెప్పు'' అని అడిగాడు. పాతపాటే పాడాడు ప్రహ్లాదుడు. సింహాసనం మీద నుంచి కిందికి దిగి, శ్రీహరిని కీర్తిస్తూ చిందులు వేశాడు. విష్ణుభక్తిని మించింది లేదని చెప్పాడు. విష్ణువుని చేరుకునేందుకు నవభక్తి సూత్రాలను తెలియజేశాడు. కొడుకు ప్రవర్తన పట్ల చెప్పలేనంత కోపం వచ్చింది హిరణ్యకశిపునికి. ఇదేనా నువ్వు నేర్పిన విద్యంటూ చండామార్కుని అనేక తిట్లు తిట్టాడు.

''ఓరీ బ్రాహ్మణాధమా! శత్రుపక్షం వహించి, నా కొడుకుని నా మీదికే ఉసిగొల్పుతున్నావా? ఇదా నువ్వు ఇచ్చిన శిక్షణ? నిన్నేం చేసినా పాపం లేదు'' అన్నాడు.

''క్షమించాలి దానవేంద్రా! ఆ చదువులేవీ నేను చెప్పలేదు. వాటిని ప్రహ్లాదుడు తనంత తానుగా నేర్చుకున్నాడు. ఇందులో నా ప్రమేయం ఎంత మాత్రం లేదు'' అన్నాడు చండామార్కుడు.

అవునా? అన్నట్టుగా ప్రహ్లాదుని చూశాడు హిరణ్యకశిపుడు. అవునన్నట్టుగా తలాడించాడు ప్రహ్లాదుడు. అంతే! ఒక్క ఉదుటన సింహానం మీద నుంచి లేచి వచ్చి, ప్రహ్లాదుణ్ణి విసురుగా ముందుకి తోసి వేశాడు. వెళ్ళి దూరంగా పడ్డ ప్రహ్లాదుని చూస్తూ ఇలా అన్నాడు.

''శత్రువుని కీర్తించేవాడు, వాడు కన్నకొడుకయినా నాకు శత్రువుతో సమానం. ఈ ప్రహ్లాదుడు వధార్హుడు. తీసుకుని వెళ్ళి వీణ్ణి చంపి రండి. చచ్చాడన్న శుభవార్తను నా చెవిన వెయ్యండి.''

అయిదేళ్ళ వాడయిన ప్రహ్లాదుణ్ణి రెక్కలు విరిచి పట్టుకుపోయారు రాక్షసులు. అతన్ని చంపడానికి నానా రకాలుగా ప్రయత్నించారు. ఏనుగుల చేత తొక్కించారు. పాముల చేత కరిపించారు. ఎత్తయిన కొండల మీంచి కిందికి తోశారు. ప్రజ్వలిస్తున్న మంటల్లో పడేశారు. కాలకూట విషాన్ని తాగించారు. అన్నానికీ నీటికీ దూరం చేశారు. ఏరకంగా ప్రయత్నించినా ప్రహ్లాదుడు మరణించలేదు. పైగా హరినామస్మరణతో మరింతగా బలాన్ని పుంజుకున్నాడు.

## నరకేసరిగా ప్రత్యక్షమయిన శ్రీహరి

రాజాజ్ఞను పాలిస్తూ ప్రహ్లాదుణ్ణి సంహరించేందుకు నానా రకాలుగా ప్రయత్నించి అలసిపోయారు రాక్షసులు. ప్రహ్లాదుడు మాత్రం మరణించలేదు. ఆ విషయాన్ని రాజుకి చెప్పి, తమ అశక్తతను వ్యక్తం చేశారు రాక్షసులు. క్షమించమన్నట్టుగా చేతులు జోడించి, నమస్కరించారు.

ఆశ్చర్యం! అయిదేళ్ళవాడు చావుని ఎదిరిస్తున్నాడా? వాణ్ణి చూసి చావు భయపడుతోందా? అది వాడి దరి చేరడం లేదా? నమ్మశక్యంగా లేదు. ఏదో ఉంది. ఏదో శక్తి ప్రహ్లాదుణ్ణి కాపాడుతోంది. వాణ్ణి కాపాడుతూ తనని పరిహసిస్తోంది. పిల్లాడి మీద పగ పెంచుకుని, మృత్యువుకి తను చేరువ కావడం లేదు కదా? అనుకున్నాడు హిరణ్యకశిపుడు. భయపడ్డాడు. నిస్త్రాణంగా సింహాసనంలో కూలబడ్డాడు. రాజుని గమనించాడు చండామార్కుడు. డీలా పడిన రాజుకి శక్తిని చేకూరుస్తు న్నట్టుగా ఇలా అన్నాడు.

''మహారాజా! మరి కొన్నాళ్ళు ప్రహ్లాదుణ్ణి నాకు అప్పజెప్పండి. మంచేదో చెడేదో చెప్ప ప్రయత్ని స్తాను. మరో అవకాశం నాకు కలిగించండి.''

హిరణ్యకశిపుడు ఆ మాటకి అవుననలేదు, కాదనలేదు. ఊరుకున్నాడంతే! మౌనం అంగీకారం అనుకున్నాడు చండామార్కుడు. ప్రహ్లాదుణ్ణి వెంటబెట్టుకుని ఆశ్రమానికి చేరుకున్నాడు. కొద్ది రోజులు గడిచాయి. ప్రహ్లాదుని బుద్ధిలో ఎలాంటి మార్పూ రాలేదు. తలపట్టుకున్నాడు చండా మార్కుడు. అభ్యర్థించాడిలా.

''నాయనా ప్రహ్లాదా! నీ మూలంగా మా అందరి ప్రాణాలూ పోయేట్టుగా ఉన్నాయి. చిన్న వాడివయినా చేతులెత్తి నమస్కరిస్తున్నాను, నా మాట వినరా! ఆ హరినామస్మరణ మానుకోరా.''

సమాధానం లేదు ప్రహ్లాదుని దగ్గర్నుంచీ.

''నీ కులవిద్యలు నీకు నేర్పుతాను, నేర్చుకుని, నీ తండ్రిని సంతోషపెట్టు.''

సమాధానం లేదు.

''నేను చెప్పినట్టు నువ్వు వినలేదనుకో, నిన్ను ముక్కలు ముక్కలు చేస్తాను. ఉప్పుపాతరేస్తాను.'' బెదిరించాడు చండామార్కుడు. బెదిరిపోలేదు ప్రహ్లాదుడు. పైగా భగవద్భక్తిని మరింతగా పెంచుకోసాగాడు. దైవాన్ని తాను ధ్యానించడమే కాదు, తోటిపిల్లలంతా ధ్యానించేట్టుగా చేయ సాగాడు. వారందరికీ భక్తితత్త్వాన్ని ఉపదేశించసాగాడు. హరికథలు వినిపిస్తూ, భాగవతధర్మాలు బోధించనారంభించాడు. వినసొంపుగా ఉన్న ఆ కథల్నీ, ధర్మాల్నీ వంటబట్టించుకుంటూ పరవశించిపోసాగారు బాలకులు. ఒకనాడు అడిగారిలా.

''నీకివన్నీ ఎలా తెలుసు?''

''అమ్మ కడుపులో ఉండగానే తెలుసుకున్నాను'' అన్నాడు ప్రహ్లాదుడు.

అదెలా? అని వారు ప్రశ్నించలేదు కాని, జరిగిందిది.

అనేక సంవత్సరాల పాటు మందరాద్రి మీద హిరణ్యకశిపుడు తపస్సు చేసినప్పుడు అతని చుట్టూ పుట్టలు పెరిగాయి. కనిపించకుండాపోయాడతను. అంతా శిథిలమయిపోయి ఉంటాడను కున్నారు. దేవతలకు ఈ సంగతి తెలిసి, ఆనందించారు. అదే అదనుగా ఇంద్రుడు, దానవుల మీదకి దండెత్తాడు. రాజు లేడు. తపస్సు చేసుకుంటూ అక్కడెక్కడో ఉన్నాడు. ఉన్నాడో లేడో కూడా తెలీదు. ఇంద్రుణ్ణి ఎదిరించడం ఎవరి వల్లా కాదు. వెను తిరిగి చూడకుండా పరుగుదీశారు దానవులు. తలో దిక్కుగా పారిపోయారు. ఇళ్ళూ వాకిళ్ళూ భార్యాబిడ్డల్నీ పట్టించుకోలేదు. సొంత కాపురాల్నే పట్టించుకోని వారు, హిరణ్యకశిపుని భార్య లీలావతిని పట్టించుకుంటారా? పట్టించు కోలేదెవరూ. అంతఃపురంలో ఆమె ఒంటరిదయిపోయింది. అప్పుడామెను ఇంద్రుడు చెరబట్టాడు. ఆకాశ దారులంట తీసుకుపోసాగాడు. అప్పుడామె గర్భవతి. రక్షించేవారు లేక భోరున విలపించ సాగింది. ఆమె రోదన నారదుడు విన్నాడు. ఇంద్రుణ్ణి వారించాడు.

''పతివ్రతనీ, పరపత్నినీ చెరబట్టడం మహాపాపం. నా మాట విను, ఆమెను విడిచిపెట్టు'' అన్నాడు నారదుడు.

''విడిచిపెట్టనుగాక పెట్టను'' అన్నాడు ఇంద్రుడు.

''మునీంద్రా! ఈ లీలావతి ఇప్పుడు గర్భవతి. దేవతలకు హాని చేసే హిరణ్యకశిపుని విషబీజం ఈమెలో వృద్ధి పొందుతోంది. ఇటువంటి సమయంలో ఈమెను విడిచిపెట్టడం దేవతలకు హాని తలపెట్టడమే! అందుకనే విడిచిపెట్టనంటున్నాను. ఈమె ప్రసవించే వరకూ బంధించి ఉంచుతాను. ప్రసవానంతరం పుట్టిన బిడ్డని చంపి, అప్పుడీమెను విడిచి పెడతాను'' అన్నాడు.

''నీ ఊహ సరికాదు'' అన్నాడు నారదుడు.

''ఇప్పుడీ సాధ్వి గర్భంలో పెరుగుతున్నది నువ్వు అనుకుంటున్నట్టుగా దేవతలకు శత్రువు కాదు, పరమ భాగవతోత్తముడు పెరుగుతున్నాడు. పాపరహితుడతను. అతన్ని చంపడం నీ వల్ల కాదు. నా మాట విను, లీలావతిని విడిచిపెట్టు.''

ఆలోచనలో పడ్డాడు ఇంద్రుడు.

''నా మాట మీద నమ్మకం లేదా?'' అడిగాడు నారదుడు.

''ఉంది, నీ మాట మీద నమ్మకంతోనే ఈమెను విడిచిపెడుతున్నాను, తీసుకెళ్ళండి.'' లీలావతిని విడిచి పెట్టాడు ఇంద్రుడు. వెళ్ళిపోయాడు. పెను ప్రమాదం నుంచి తనని తప్పించి, రక్షించినందుకు చేతులు జోడించి నమస్కరించి, నారదముని పాదాలను ఆశ్రయించింది లీలావతి.

''ప్రాణభిక్ష పెట్టారు. కృతజ్ఞురాలిని'' అన్నది.

''రా తల్లీ, రా'' అంటూ ముందుకు నడిచాడు నారదుడు.

లీలావతిసహా తన ఆశ్రమానికి చేరుకున్నాడతను.

''నీ భర్త తపస్సు నుండి తిరిగి వచ్చేంత వరకూ నువ్విక్కడే ఉండవచ్చు. నీకు ఏ కొరతా రాదు'' అన్నాడు. నారదమునిని సేవిస్తూ లీలావతి రోజులు గడపసాగింది. ఆమె భక్తికి మెచ్చాడు నారదుడు. ఆమెకు పరతత్వాన్ని బోధించాడు. జ్ఞానబోధ చేశాడు. నారదుని బోధనలన్నీ తల్లితో పాటు ఆమె గర్భంలో ఉన్న ప్రహ్లాదుడు కూడా విన్నాడు. బాగా ఆకళింపు చేసుకున్నాడు. ఈ కారణంగానే పుట్టుకతోనే ప్రహ్లాదుడు హరిభక్తుడు కాగలిగాడు. గొప్ప జ్ఞాని అయినాడు. ఆ జ్ఞానాన్నంతా పంచసాగాడిప్పుడు. తా చెడ్డ కోతి వనమెల్లా చెరచిందన్నట్టుగా ప్రహ్లాదుడు తానొక్కడే కాదు, రాక్షసబాలకులందరి చేతా హరినామస్మరణ చేయించడాన్ని చండామార్కుడు గమనించి, కొంపలు మునిగాయనుకున్నాడు. ప్రహ్లాదుని ఆశ్రమానికి తీసుకు వచ్చి తప్పు చేశాననుకున్నాడు. ప్రహ్లాదుని వెంటబెట్టుకుని, హిరణ్యకశిపుణ్ణి సమీపించాడతను. చేసిన తప్పుని క్షమించమంటూ, ఆశ్రమంలో ప్రహ్లాదుడు చేస్తున్నదంతా రాక్షసరాజుకి వివరించాడు చండామార్కుడు.

''నిజమా'' ఉరుముతూ చూశాడు హిరణ్యకశిపుడు. నిజమేనన్నట్టుగా సన్నగా నవ్వాడు ప్రహ్లాదుడు. ఆ నవ్వు భరించలేకపోయాడు హిరణ్యకశిపుడు. ఆగ్రహంతో ప్రహ్లాదుని జుత్తు పట్టుకున్నాడు.

''కులనాశకా! నన్ను కాదని నా శత్రువుని స్మరిస్తున్న నిన్ను ఈ క్షణమే నరకానికి పంపుతాను. ఎవడడ్డొస్తాడో చూస్తాను. అయినా ఎవరి వెన్నుదన్ను చూసుకునిరా నీకింత పొగరు?'' అడిగాడు.

''ఆ శ్రీమన్నారాయణుని చూసుకుని'' అన్నాడు ప్రహ్లాదుడు.

''ప్రహ్లాదా'' గట్టిగా అరిచాడు హిరణ్యకశిపుడు. ప్రహ్లాదుని విసురుగా ముందుకు తోసి వేశాడు. ఆ విసురుబాటుకి ఇంకొకరయితే వెళ్ళి నక్షత్రమండలంలో పడతారు. కాని, ప్రహ్లాదుడు పడలేదలా. నిలదొక్కుకున్నాడు. ఇలా అన్నాడు.

''తండ్రీ! నా మీద కోపగించుకోకు. చెప్పింది విను. నీకూ నాకూ సమస్త భూతకోటికీ ఆ నారాయణుడే వెన్నుదన్ను. సకల లోకాలకూ అతనే బలం. బలగం. లోకాలన్నీ ఆతని సృజనే! సృష్టి స్థితి లయకారకుడు అతనే! అతన్ని కాదనుకుని, అతనితో శత్రుత్వం పెంచుకోవడం అవివేకం. నా మాట విను తండ్రీ, నీలోని అసురగుణాన్ని వదులుకుని, ఆ పరాత్పరుణ్ణి ఆశ్రయించు. మనకంతా శుభమే జరుగుతుంది.''

తన ముందు శత్రువుని పొగడడమేగాక, తనకే హితబోధ చేస్తున్న ప్రహ్లాదునిపై అంతెత్తున లేచాడు హిరణ్యకశిపుడు.

''శుభమా? శత్రువుని తలచుకోవడం శుభమా? ఓరీ! నా బలపరాక్రమాలు తెలియక నోటికి వచ్చినట్టల్లా మాట్లాడుతున్నావు. కోరి మృత్యువుని కౌగిలించుకుంటున్నావు. ఎక్కడరా, ఎక్కడ నువ్వు చెప్పే శ్రీహరి? చూపించు, వాడి అంతు చూస్తాను. నీ పినతండ్రిని చంపిన నాటి నుంచి వాడి కోసం వెదుకుతునే ఉన్నాను, కనిపించడం లేదు. దాగున్నాడెక్కడో. దమ్ముంటే బయటికి రమ్మను. నా కంట పడమను. కాళ్ళూ చేతులూ విరిచి కట్టగట్టి విసురుతాను'' అన్నాడు హిరణ్యకశిపుడు.

శ్రీహరిని గురించి ఎంతలేసి మాటలు వినవలసి వచ్చింది. అయ్యయ్యో! భరించలేనను కున్నాడు ప్రహ్లాదుడు. తప్పు అన్నట్టుగా లెంపలు వేసుకున్నాడు.

''పరాత్పరుడట! పరాత్పరుడు. నాకంటే గొప్పవాడూ, శ్రేష్ఠుడూ ఇంకెవరున్నారురా? నేనే భగవంతుణ్ణి. నన్ను కాదనకు. నీకు పుట్టగతులుండవు'' అన్నాడు హిరణ్యకశిపుడు.

కోపాన్ని తమాయించుకునేందుకు దీర్ఘంగా నిట్టూర్చాడు. తర్వాత తెలివిగా అడిగాడిలా.

''నా రక్తం పంచుకుని పుట్టినందుకు చిన్న సాయం చెయ్యి నాయనా! ఆ శ్రీహరి ఎక్కడున్నాడో చెప్పు.''

''శ్రీహరి ఎక్కడున్నాడంటే ఏమి చెప్పను తండ్రీ. అతను సర్వాంతర్యామి. ఇక్కడ అక్కడనే కాదు, ఎక్కడ పడితే అక్కడ ఉంటాడు. ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు'' అన్నాడు ప్రహ్లాదుడు.

''అవునా? అయితే ఈ సభామండపంలో ఈ స్తంభంలో ఉంటాడా? ఉన్నాడా?'' కోపంగా కసిగా అడిగాడు హిరణ్యకశిపుడు.

''ఉంటాడు తండ్రీ, అనుమానం లేదు.''

ఆ మాట చాలనుకున్నాడు హిరణ్యకశిపుడు. సింహాసనానికి ఆనించి ఉన్న గదను అందు కున్నాడు.

''ఏదీ చూపించు'' అన్నాడు. గదతో స్తంభాన్ని గట్టిగా మోదాడు. స్తంభాన్ని గద తాకిన మరుక్షణం భీషణమయిన ఘోష పుట్టింది. బ్రహ్మాండం బద్దలవుతున్నట్టుగా శబ్దమయింది. ఆ శబ్దానికి భూతకోటి సమస్తం అదిరిపడింది. ప్రళయం వచ్చినట్టుగా బెదిరిపోయింది. వినవస్తున్న ఘోరనాదాన్ని భరించలేకపోతున్నట్టుగా చేతిలోని గదను వదలి, హిరణ్యకశిపుడు చెవులు



మూసుకున్నాడు. కళ్ళు కూడా మూసుకున్నాడు. మూసుకుపోయిన కళ్ళను కూడా తెరిపించేటంతటి కాంతి ముఖాన్న పడడంతో కళ్ళు తెరిచి చూశాడు హిరణ్యాకశిపుడు.

స్తంభాన్ని చీల్చుకుని శ్రీహరి నృసింహరూపంలో బయటికి రాసాగాడు. మున్నెన్నడూ ఎవరూ చూడని భీకరరూపంలో ఇటు నరుడూ కాదు, అటూ మృగమూ కాదు. నరమృగేంద్ర రూపంలో శ్రీహరి బయటకు రాసాగాడు. జ్వాలల్లా మండుతున్న కళ్ళు, ఎంతటి దాన్నయినా చీల్చి చెండాడే కోరలు, కత్తి అంచుకుండే పదునయిన నాలుక, కొండగుహలాంటి నోరు, వాడిగా గోళ్ళు, ఒంటి నిండా రోమాలు, పెను గర్జన చేయసాగాడు నృసింహుడు.

మహాకాయం. నాలుగు చేతులు, ఆ చేతుల్లో శంక చక్ర గదాది ఆయుధాలు, నరకేసరి రూపంలో తన ముందు ప్రత్యక్షమయిన శ్రీహరిని చూసి మృత్యువుని చూసినట్టుగా భయపడ్డాడు

హిరణ్యకశిపుడు. అంతలోనే తేరుకున్నాడు. వదలిన గదాయుధాన్ని అందుకున్నాడు. గిరగిరా తిప్పుతూ నృసింహస్వామిని ఎదుర్కొన్నాడు. గద స్వామిని తాకుతోంది కాని, దెబ్బ ఆయనకి తగలడం లేదు. శూన్యంలోకి గదను విసురుతున్నట్టుగా ఉంది హిరణ్యకశిపునికి. చిత్రంగా ఉంది. ఈసారి దెబ్బ తగిలి తీరాల్సిందే అనుకున్నాడు హిరణ్యకశిపుడు. మరింత బలంగా గదను విసిరాడు. విసిరిన గద విసిరినట్టుగానే మాయమయింది. చేతిలో ఆయుధాన్ని కోల్పోయి తెల్లబోయాడు హిరణ్యకశిపుడు. వెనుకడుగు వేయబోయాడు. అంతలో అతన్ని ఒడిసిపట్టు కున్నాడు నృసింహస్వామి. విడిపించుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు హిరణ్యకశిపుడు. అతని వల్ల కాలేదు. గింజుకోసాగాడు. అది రాత్రీ పగలూ కాని సంధ్యాసమయం. ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్నట్టుగా స్వామి, హిరణ్యకశిపుణ్ణి సభామండప ద్వారం దగ్గరకు ఈడ్చుకుపోయాడు. ద్వారం మీద కూర్చుని, హిరణ్యకశిపుణ్ణి ఒడిలో పెట్టుకున్నాడు. కదలకుండా మోచేతుల్తో అదిమి పట్టి, ఆ తర్వాత ఒక్కసారిగా చేతిగోళ్ళను అతని పొట్టలోనికి పోనిచ్చాడు స్వామి. హిరణ్యకశిపుని పొట్ట చీల్చి  సంహరించాడతన్ని. పేగులు తీసి, జందెంగా మెడలో వేసుకున్నాడు. నాలుక జాచి, రాక్షసరాజు రక్తాన్ని జుర్రాడు. హిరణ్యకశిపుణ్ణి నరహరి సంహరించాడని తెలుసుకుని, స్వామి మీద యుద్ధం ప్రకటించిన రాక్షసగణాన్ని తృటికాలంలో తుదముట్టించాడు భగవంతుడు. తర్వాత భూమండలం అదిరిపోయేట్టుగా చిందులు తొక్కుతూ విలయనృత్యం చేయసాగాడు. ఆ నృత్యానికి భువనభాండాలన్నీ దద్దరిల్లాయి.  సముద్రాలు అల్లకల్లోలం అయ్యాయి. దిగ్గజాలు వణికిపోయాయి. కులగిరులు కూలిపోయాయి. సూర్య చంద్రులూ, గ్రహనక్షత్రాదులూ గతులు తప్పాయి. నృత్యం చేసి చేసి అలసిసొలసిన స్వామి, పెద్దపెట్టున హూంకరించి, రాజ సింహాసనాన్ని అధిష్ఠించాడు. స్వామి సింహాసనాన్ని అలంకరించాడని తెలిసి, ఇంద్రాది దేవతలూ, దిక్పాలకులూ, ఋషులూ, సిద్ధ విద్యాధరాదులూ, బ్రహ్మ, మహేశ్వరుడూ అందరూ వచ్చారక్కడికి. అయితే ఏ ఒక్కరూ మహోగ్రరూపంలో తేజరిల్లుతున్న స్వామి చెంతకు చేరుకోలేకపోయారు. ఆయన్ని శాంతింపజేసేందుకు అనేక విధాల స్తోత్రం చేశారు. అనంతకోటి నామాలతో, వేదమంత్రాలతో శ్రీహరిని స్తుతించారు. అయినా ఉగ్రనరసింహుడు శాంతించలేదు.

# గజేంద్ర మోక్షం

లక్ష్మీదేవిని ఆశ్రయించారంతా.

''తల్లీ! నీ నాథుణ్ణి నువ్వే శాంతింపచెయ్యాలి. అది నీకే సాధ్యం'' అన్నారు. వేడుకున్నారామెను. స్వామిని దర్శించి లక్ష్మీదేవి కూడా అవాక్కయింది. భర్త ఉగ్రరూపాన్ని ఆమె ఎన్నడూ చూడలేదు. భయపడి, దాగుంది. బ్రహ్మ కలుగజేసుకున్నాడప్పుడు. చేతులు జోడించి, నమస్కరించి నిలుచున్న ప్రహ్లాదుణ్ణి చేరదీశాడు.

''ప్రహ్లాదా! నీ తండ్రిని సంహరించడం కోసం ఇంతటి ఉగ్రరూపాన్ని ధరించిన శ్రీహరిని నువ్వే శాంతింప చెయ్యాలి. ఇందుకు నువ్వే సమర్థుడవు. తన ఉగ్రరూపాన్ని శ్రీహరి ఉపసంహ రించేట్టు చేసే బాధ్యత నీదే'' అన్నాడు బ్రహ్మ. ఇంద్రాది దేవతలు కూడా ప్రహ్లాదుని వేడు

కున్నారు. దైవాన్ని చూసి భయపడడం అవివేకం అనుకున్నాడు ప్రహ్లాదుడు. వెళ్ళి నృసింహస్వామి ముందు చేతులు జోడించి నిల్చున్నాడు. అనేక రకాలుగా కీర్తించాడతన్ని. హరికథల్ని గానం చేశాడు. ప్రహ్లాదుని కీర్తనలకూ, గానానికీ పరమాత్ముడు శాంతించాడు. ఉగ్రరూపాన్ని పరిత్యజించి ప్రసన్నుడయినాడు.

''ప్రహ్లాదా! నీ భక్తికి మెచ్చాను, కోరుకో, వరం ఇస్తున్నాను.'' అన్నాడు శ్రీహరి.

''నిరంతరం నిన్నే ధ్యానించేట్టుగా, నీపై నా భక్తి రెట్టింపు అయ్యేట్టుగా వరాన్ని ప్రసాదించు'' అడిగాడు ప్రహ్లాదుడు.

''అనుగ్రహిస్తున్నాను. నా భక్తుల్లో నువ్వే ప్రథముడివి అవుతావు. ముల్లోకాల్లోనూ పరమ భాగవతోత్తముడిగా కీర్తి పొందుతావు'' అన్నాడు శ్రీహరి.

''ధన్యుణ్ణి. నన్ను నీలో చేర్చుకో స్వామీ.''

''తొందరెందుకు? రాజ్యభోగాలనుభవించు. నన్ను ఆరాధిస్తూ రాజ్యపాలన చెయ్యి. త్వరలోనే నన్ను చేరుకుందువుగాని'' అన్నాడు శ్రీహరి.

''స్వామీ నాది ఓ చిన్న కోరిక.''

''చెప్పు''

''నా తండ్రి చేసిన అపరాధాలన్నీ మన్నించి, వారికి సద్గతిని ప్రసాదించు.''

''తప్పకుండా! నీ తండ్రికే కాదు, నీ పితృపితామహులందరికీ కూడా మోక్షం ప్రసాదిస్తున్నాను. పరమభక్తుడివి అయిన నీ పుట్టుకతో దైత్యకులం అంతా పావనమయింది'' అన్నాడు శ్రీహరి. బ్రహ్మను చూశాడు. నమస్కరిస్తూ సమీపించాడతన్ని బ్రహ్మ.

''పరమేష్ఠీ!, క్రూరాత్ములకు వరాల్ని ప్రసాదించి, లోకాల్ని అల్లకల్లోలం చెయ్యకు.'' హెచ్చరించాడు శ్రీహరి. సరేనన్నట్టుగా తలూపాడు బ్రహ్మ. శ్రీహరి, శ్రీదేవి సహా దేవతలంతా అదృశ్యులయ్యారప్పుడు.

ప్రహ్లాదుడు పట్టాభిషిక్తుడయ్యాడు.ముల్లోకాలలోనూ ధర్మం ప్రవర్తిల్లింది. దేవతలూ, దిక్పాలకులూ వారి వారి స్థానాలను అలంకరించి, ఆనందించారు. భూదేవి మనోవేదన చల్లారింది. ఋషులూ, మునులూ అవిఘ్నంగా జపతపాదులు సాగించారు. యజ్ఞ యాగాదులు నిర్విఘ్నంగా కొనసాగాయి. అనేక సంవత్సరాల పాటు ప్రహ్లాదుడు ప్రజల్ని పాలించి, గొప్ప పాలకుడంటూ పేరు ప్రఖ్యాతులు సాధించాడు. పరమ భాగవతోత్తముడిగా కూడా ముల్లోకాలూ అతన్ని కీర్తించాయి.

## గజేంద్రమోక్షం

దేనికీ కట్టుబడని భగవంతుడు భక్తికి కట్టుబడతాడని ప్రసిద్ధి. భగవంతుడు భక్తవత్సలుడు. భక్తసులభుడు. భక్తుడు నోరారా పిలిస్తే చాలు, పరుగున వస్తాడు భగవంతుడు. భక్తుడు మానవుడే కానవసరం లేదు, చరాచరజీవకోటిలో ఏ ప్రాణి అయినా భక్తుడయి, భక్తిగా పిలిస్తే చాలు, ఆదరించి అక్కున చేర్చుకుంటాడు భగవంతుడు. ఏది కోరితే అది ప్రసాదిస్తాడు. కాపాడమంటే కాపాడతాడు. కన్నీరు తుడుస్తాడు.

పాలసముద్రం మధ్యలో త్రికుటాద్రి అని ఓ గొప్ప పర్వతం ఉంది. దాని పొడవు వెడల్పులు సరిసమానంగా పదివేల యోజనాలు. మూడు శిఖరాలు ఉన్నాయి దానికి. ఒకటి బంగారు శిఖరం, రెండు వెండి శిఖరం, మూడు ఇనుప శిఖరం. ఈ మూడు శిఖరాలూ మహాఎత్తులో ఉండి, శోభిల్లుతూ దిక్కులను ప్రకాశవంతం చేస్తూ ఉంటాయి. పళ్ళచెట్లకీ, పూలచెట్లకీ త్రికుటాద్రి ప్రసిద్ధి. లతలూ పొదలూ కూడా అక్కడ కోకొల్లలు. సెలయేళ్ళకు కొదవలేదు. చెప్పలేనన్ని గుహలు కూడా ఉన్నాయక్కడ. రమణీయమయిన ఆ ప్రదేశం అంటే దేవతలకూ, గంధర్వులకూ, సిద్ధులకూ, అప్సరసలకూ మహాఇష్టం. వారంతా విహరిస్తూ కనిపిస్తారక్కడ. రకరకాల పక్షులకు నెలవది. సింహ శార్దూలాది క్రూరమృగాలు అనేకం యథేచ్ఛగా అక్కడ సంచరిస్తూ ఉంటాయి. ఆ పర్వతాన్ని అనుకుని ఓ మహారణ్యం ఉన్నది. ఎన్నో జంతువులతో పాటు మదించిన ఏనుగులు కూడా నివసిస్తున్నాయి అక్కడ.

ఒకనాడు ఏనుగుల గుంపొకటి అరణ్యమంతా తిరిగి తిరిగి దాహంతో నీరు తాగేందుకు సమీపాన ఉన్న సరోవరానికి చేరుకున్నాయి. గజేంద్రుడు ముందు దారి తీస్తే అతన్ని భార్యాబిడ్డలు అనుసరించారు. కొలనులో దిగి, ఏనుగులన్నీ కడుపారా నీరు తాగాయి. తర్వాత నీరు పీల్చి, పైకి చిమ్ముతూ క్రీడించాయి. నీళ్ళలో మునుగుతూ లేస్తూ ఈదులాడుతూ కొలనంతటినీ కలచి వేశాయి. ఆ కల్లోలానికి భయపడి చేపలులాంటి జలచరాలు నలువైపులా పరుగుదీశాయి. చెదరిపోయాయి. గండుమీనాలు కొన్ని నీటిలోంచి ఎగిరెగిరి ప్రాణాలు దక్కించుకునే ప్రయత్నాలు చేశాయి. తన పరివారంతో ఆడుతూ ఆనందిస్తున్న గజేంద్రుణ్ణి చూసింది ఓ మొసలి. నీటిని చెల్లాచెదురు చేస్తూ, అలల్ని చీల్చుకుంటూ వేగంగా ముందుకు వచ్చింది. రాహువు సూర్యుని పట్టుకున్నట్టుగా గజేంద్రుని కాలు పట్టుకున్నది. తన కాలుని ఏదో పట్టుకున్నది అని తెలుసుకుని గజేంద్రుడు విదిలించుకోబోయాడు. సాధ్యం కాలేదు. కాలు వెనక్కి గుంజుకున్నాడు. రాలేదు. కొండలా కదలకుండా ఉండిపోయాడు. గజేంద్రుని పరిస్థితి గమనించాయి మిగిలిన ఏనుగులు. రాజు ఆపదలో ఉన్నాడని తెలుసుకున్నాయి. పెద్దపెట్టున ఘీంకరిస్తూ ఆక్రోశించసాగాయి. ఒడ్డునకు చేరుకుని విలపించసాగాయి. స్థానబలిమితో గజేంద్రుణ్ణి ముందుకు నీళ్ళలోకి లాగ సాగింది మొసలి. గజేంద్రుడు బలాన్నంతా ఉపయోగించి ఒడ్డునకు చేరుకునే ప్రయత్నం చేయసాగాడు. అటు మొసలి–ఇటు గజేంద్రుడూ రెండూ బలాబలాలు ప్రదర్శిస్తూ వెయ్యి సంవత్సరాల పాటు ఘోరంగా పోరాటం కొనసాగించాయి. గజేంద్రుడు రోజు రోజుకీ క్షీణించసాగాడు. అతని జవసత్వాలు ఉడిగిపోయాయి. మొసలి బలం రానూ రానూ పెరిగిందే తప్ప, క్షీణించలేదు. నీరే దాని బలానికి కారణమయింది. గజేంద్రుడు ప్రాణావశిష్టుడైనాడు. అవసానదశకి చేరుకున్నానని తెలుసుకున్నాడు. దిక్కు లేదు. భగవంతుని శరణు కోరాడు.

''దేవాధిదేవా! జగన్నాథా! శ్రీహరీ! ఎక్కడ ఉన్నావు స్వామీ! దాహంతో ఈ కొలనుకు చేరుకున్నాను. విధి వక్రించింది, మొసలికి చిక్కాను. బలమంతా అడుగంటిపోయింది. మొసలి పట్టు నుండి తప్పించుకోలేకపోతున్నాను. దీనరక్షకా! నన్ను కాపాడు. నిన్ను కరుణామయుడంటారు. దీనావస్థలో ఉన్నాను. దయచేసి నన్ను రక్షించు.''

గజేంద్రుని ఆర్తనాదం వైకుంఠంలో ఉన్న శ్రీహరికి వినిపించింది. ఆపదలో ఉన్న భక్తుణ్ణి ఆదుకోవాలనుకున్నాడతను. బయల్దేరేందుకు సిద్ధమయ్యాడు. అనుకున్నాడో లేదో గరుత్మంతుడు



వచ్చి ఎదురుగా నిలిచాడు. శంఖు చక్రాది ఆయుధాలు వాటంతటవే వచ్చి శ్రీహరిని చేరాయి. ఆలస్యం చేయలేదు. గరుత్మంతుణ్ణి అధిరోహించి, ముని బృందారకాదులు, లక్ష్మీదేవిసహా గజేంద్రుడు దీనంగా నిల్చున్న కొలను దగ్గరకి చేరుకున్నాడు. అల్లంత దూరంలో ఉండగానే నారాయణుణ్ణి చూశాడు గజేంద్రుడు. ఆనందబాష్పాలతో తొండం పైకెత్తి నమస్కరించాడతనికి.

''వచ్చావా స్వామీ! నా మీద కరుణ కలిగి, సతీసమేతంగా విచ్చేశావా, నిన్ను పూజించలేని దీనస్థితిలో పరుగు పరుగున వచ్చావా, రావయ్యా రా! రక్షించు'' వేడుకున్నాడు గజేంద్రుడు. అభయాన్ని ప్రసాదించాడు శ్రీహరి. గరుడవాహనం నుంచి కిందికి దిగాడు. గబగబా కొలను లోనికి నడిచి, మొసలిని పట్టి బయటికి లాగాడు. ఒడ్డునకు విసిరేసి, చక్రాయుధంతో దాని శిరస్సు ఖండించాడు. గజేంద్రుణ్ణి కాపాడాడు. ఆ దృశ్యానికి సురులూ మునులూ ముగ్ధులయ్యారు.

ఆనందించారు. దుందుభులు మోగించారు. పూలవాన కురిసింది. గంధర్వులు గానం చేస్తే, అప్సరసలు ఆడారు. చక్రాయుధం తనని ఖండించిన మరుక్షణం మొసలి శాపవిముక్తమయింది. గంధర్వునిగా రూపుదాల్చింది. శ్రీహరికి సాష్టాంగప్రణామం చేసి, వేయి విధాల ప్రస్తుతించాడు గంధర్వుడు. తర్వాత శ్రీహరి దగ్గర సెలవు తీసుకుని, అక్కణ్ణుంచి అదృశ్యుడయ్యాడు. బతికి బయటపడిన గజేంద్రుడు కూడా శ్రీహరిని స్తుతించాడు. అతని భక్తికి మెచ్చి, విష్ణుపదాన్ని అనుగ్రహించాడు శ్రీహరి. వెళ్ళిపోయాడక్కణ్ణుంచి.

శాపవిముక్తి పొందిన మొసలి, బతికి బయటపడిన గజేంద్రుడూ ఇద్దరూ కూడా వెనుకటి జన్మలలో చేసిన తప్పిదాల కారణంగానే శాపాలు పొంది ఇప్పుడీ జన్మలెత్తారు. గజేంద్రునికి అపారమయిన విష్ణుభక్తి కలగడానికీ, మొసలి గంధర్వుడిగా మారడానికీ కథ ఒకటి ఉన్నది.

హూహూ అని గంధర్వుడు ఉండేవాడు. గొప్ప హరిభక్తుడతను. భార్యామణులతో కూడి ఒకనాడతను సరోవరంలో జలక్రీడలాడసాగాడు. అదే సమయానికి స్నానం చేసేందుకు ముని దేవలుడు కూడా వచ్చాడక్కడికి. దేవలుణ్ణి చూడగానే హూహూకి ఆటపట్టించాలనిపించింది. అతని కాలు పట్టుకుని నీటిలోనికి లాగి పరిహసించాడు. దానికి విపరీతంగా కోపించాడు దేవలుడు. ఇలా శపించాడతన్ని.

''మదాంధుడవై నన్ను అవమానించినందుకు తగిన ప్రతిఫలం అనుభవించు. మొసలివై జన్మించు.''

చేసిన తప్పుని తెలుసుకున్నాడు హూహూ. క్షమించమని దేవలుని వేడుకున్నాడు. శాపవిముక్తి ప్రసాదించమని ప్రాథేయపడ్డాడు. కరుణించాడు దేవలుడు. ఇలా చెప్పాడు.

''ఇప్పుడు నన్ను నీటిలోకి లాగినట్టుగానే రానున్న జన్మలో మొసలివై ఒక గజేంద్రుణ్ణి నీటిలోకి లాగుతావు. అప్పుడు శ్రీహరి నిన్ను సంహరించి, గజేంద్రుణ్ణి కాపాడతాడు. ఆ క్షణం నీకు శాపవిముక్తి లభిస్తుంది. మొసలిరూపం పోయి, నువ్వు నీ రూపం గంధర్వరూపం పొందుతావు.''

దేవలుని శాపం కారణంగానే ఆ కొలనులో గంధర్వుడు మొసలిగా పడి ఉన్నాడు. శ్రీహరి సంహరించడంతో శాపవిముక్తి పొంది స్వస్థలానికి చేరుకున్నాడతను.

గజేంద్రుని పూర్వజన్మ వృత్తాంతం ఏమిటంటే...పూర్వం ద్రవిడదేశంలో ఇంద్రద్యుమ్నుడనే రాజు నివసించేవాడు. హరిభక్తుడతను. మలయాచలం మీద ఆశ్రమాన్ని ఏర్పరుచుకుని, తపస్సు చేయసాగాడు. మౌనవ్రతం పట్టి హరిని పూజిస్తున్న సమయంలో శిష్య సమేతంగా అగస్త్యుడు వచ్చాడక్కడికి. మౌనవ్రతదీక్షలో ఉన్న కారణంగా అగస్త్యుణ్ణి పలకరించలేదు ఇంద్రద్యుమ్నుడు. స్వాగతించి ఆయనకు మర్యాదలు చేయలేదు. దానితో అగస్త్యునికి కోపం వచ్చింది. ఇంద్రద్యుమ్నుణ్ణి ఏనుగుగా పుట్టమని శపించాడు. ఆ శాపకారణంగా ఇంద్రద్యుమ్నుడు గజేంద్రునిగా అవతరించాడు. అయితే హరిని పూజించిన కారణంగా అతనికి పూర్వజన్మ స్మృతి కలిగింది.

గజేంద్రుణ్ణి రక్షించి, శ్రీహరి వైకుంఠానికి తరలిపోతూ ఇలా అన్నాడతనితో.

''గజేంద్రా! నిన్నూ నన్నూ, ఈ సరోవరాన్నీ, ఈ త్రికుటాద్రినీ, ఈ కొండ శిఖరాలనూ, ఇక్కడున్న దేవతా వృక్షాలనూ, క్షీరసాగరాన్నీ, నాకు చిహ్నాలయిన గరుడధ్వజాన్నీ, శ్రీవత్స కౌస్తుభ వనమాలా కౌమోదకీ సుదర్శన పాంచజన్యాలనూ, నా వాహనమయిన గరుత్మంతుణ్ణీ,

ఆదిశేషుణ్ణీ, లక్ష్మీదేవినీ పొద్దునే నిద్రలేచి శుచిగా ఎవరయితే వీటిని స్మరిస్తారో వారు సకల పాప విముక్తులవుతారు. వారికి అనాయాస మరణం లభిస్తుంది.''

శ్రీహరి చెప్పింది సత్యం. ఆచరిస్తే అంతా శుభం.

## క్షీరసాగరమథనం

అమృతోత్పత్తికి మూలమయిన కథ ఇది. శ్రీహరి మోహినీ అవతారం ఎత్తిన అద్భుత వృత్తాంతం ఇది.

పూర్వం దేవతలకూ, రాక్షసులకూ పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో దేవతలు అనేకమంది మరణించారు. అదలా ఉంచితే...

ఐరావతాన్ని అధిరోహించి ఇంద్రుడు రావడాన్ని ఒకనాడు దుర్వాసమహర్షి చూశాడు. ఆ వైభవానికి ఎంతో సంతోషించి అతనికి పుష్పహారం కానుకగా ఇచ్చాడు. పుష్పహారాన్ని తేలికగా చూసి, దానిని ఏనుగు కుంభస్థలం మీద పడవేశాడు ఇంద్రుడు. ఏనుగు తొండంతో తీసి కింద వేసి, నుగ్గు నుగ్గు చేసింది దానిని. అది గమనించిన దుర్వాసునికి తట్టుకోలేనంత కోపం వచ్చింది. ఇంద్రుణ్ణి ఇలా శపించాడతను.

''నన్ను అవమానించిన కారణంగా నీ సర్వసంపదలూ త్వరలోనే నశిస్తాయి. నీ త్రిలోకాధిపత్యం పోతుంది. నువ్వు భ్రష్టుడివయిపోతావు.''

దుర్వాసుని శాపంతో ఇంద్రుడు త్రిలోకాధిపత్యాన్ని పోగొట్టుకున్నాడు. సకల ఐశ్వర్యాలనూ పోగొట్టుకున్నాడు. దరిద్రుడయ్యాడు. యజ్ఞయాగాదులు లేకుండాపోయాయి. దానవులతో ఓడిపోయి, పెద్ద ఎత్తున ప్రాణనష్టాన్ని కూడా భరిస్తున్న దేవతలు, ఇంద్రుడు దరిద్రుడు కావడంతో మరింతగా కుంగిపోయారు. దిక్పాలకులకు కూడా దిక్కు తోచలేదు. ఏం చెయ్యాలో ఎవరికీ తోచలేదు. బ్రహ్మను ఆశ్రయించారంతా. తమ దుస్థితి తెలియజేసి, ఆదుకొమ్మన్నారు.

# క్షీరసాగరమథనం

ఆదుకొనగలిగేది ఒక్కడే, ఆ శ్రీమన్నారాయణుడు అని చెప్పి, దేవతలందరినీ వెంటబెట్టుకుని, జగన్నాథుణ్ణి సందర్శించాడు బ్రహ్మ.

అంతా శ్రీహరిని వేయి విధాల స్తుతించారు. కాపాడమని వేడుకున్నారు. అప్పుడు శ్రీహరి చెప్పాడిలా.

''దేవతలకు మంచిరోజులు కావివి. చెడురోజులు. మంచిరోజులు వచ్చేదాకా మీరంతా ఓపిక పట్టాలి. అందుకోసం నిరీక్షిస్తూ కూర్చోకుండా ముందు మీరో పని చెయ్యాలి, రాక్షసులతో సంధి చేసుకోవాలి. అదే మీ తక్షణ కర్తవ్యం.''

రాక్షసులతో సంధా? జరగని పని అన్నట్టుగా దేవతలంతా ఒకరినొకరు చూసుకున్నారు. గ్రహించాడది శ్రీహరి, నవ్వుతూ ఇలా అన్నాడు మళ్ళీ.

''రాక్షసులతో సంధి మీకు చాలా అవసరం. ఎందుకంటే మీకు అమృతం కావాలి. అమృతాన్ని మీరొక్కరూ సాధించలేరు. అందుకు రాక్షసుల సహాయం కావాలి. అందుకే సంధి చేసుకోండి అంటున్నాను. వారితో సంధి చేసుకుని, అమృతాన్ని సాధించేందుకు వారిని సమాయత్తం

చేయండి. సమస్త ఓషధులకూ నిలయమయిన మందరపర్వతాన్ని కవ్వంగానూ, సర్పరాజు వాసుకుని తాడుగానూ చేసి, మీరూ, రాక్షసులూ కలసి పాలసముద్రాన్ని మథించండి. మథిస్తే అమృతం పుడుతుంది. ఆ అమృతాన్ని మీకు మాత్రమే అందేట్టుగా నేను తగిన జాగ్రత్తలు తీసుకుంటాను.''

'' సరే! అమృతం అందింది దేవా, ఉపయోగం?'' అడిగారు దేవతలు. నవ్వాడు శ్రీహరి.

''అమృతాన్ని పానం చేస్తే చావు అనేదే ఉండదు. మీరు అమరులవుతారు'' అన్నాడు.

దేవతలు ఆనందించారు. అక్కణ్ణుంచి నిష్క్రమించారు. శ్రీహరి చెప్పినట్టుగా ముందుగా రాక్షసులను మచ్చిక చేసుకున్నారు దేవతలు. తర్వాత వారితో సంధి చేసుకున్నారు. ఓ మంచి ముహూర్తం చూసుకుని రాక్షసులతో ఇలా అన్నారు.

''మనం మనం అన్నదమ్ములం. పెత్తల్లి పిన్తల్లి బిడ్డలం. మనలో మనకి గొడవలనవసరం. కలసి ఉంటే కలదు సుఖం అన్నారు. అందుకని అంతా కలసి ఉందాం. కలసి ఉండి, అమృతాన్ని సాధిద్దాం. మందరగిరితో క్షీరసాగరాన్ని మథిద్దాం. అమృతం పుడుతుంది. దాన్ని సరిసమానంగా పంచుకుందాం.''

'' సరే! అమృతాన్ని సరిసమానంగా పంచుకున్నాం, ఏమిటి లాభం?'' అడిగారు రాక్షసులు.

''అమృతపానం చేస్తే చావన్నదే రాదు. చావు లేదంటే శత్రు భయం లేనట్టే! అప్పుడు ముల్లోకాలూ మన అధీనంలోనే ఉంటాయి'' అన్నారు దేవతలు.

రాక్షసరాజు బలి, దేవతలు చెప్పిందంతా ఒకటి రెండుసార్లు ఆలోచించాడు. ఇదెంత వరకూ సాధ్యం అనుకున్నాడు. ఆఖరికి ఒప్పుకున్నాడు. రాక్షసుల్ని కూడా ఒప్పించాడు. హమ్మయ్య అనుకున్నారు దేవతలు, ఊపిరి పీల్చుకున్నారు. ఎలాగయితేనేం రాక్షసుల్ని తమ వైపునకు తిప్పుకున్నామనుకున్నారు.

దేవదానవులు క్షీరసాగరాన్ని మథించి, అమృతాన్ని సంపాదించేందుకు ఉపక్రమించారు. మందరపర్వతాన్ని పెళ్ళగించి, మోసుకుని రాసాగారు. పర్వతం బరువుని తట్టుకోలేకపోయారు. కాస్సేపటికి కిందపడవేశారు. అప్పుడు అటు రాక్షసులు, ఇటు దేవతలు కూడా చాలా మంది ఆ పర్వతం కింద పడి, చనిపోయారు. మిగిలిన వారు మందరాన్ని మోసుకుని వెళ్ళడం అసాధ్యం అనుకున్నారు. తలలు పట్టుకుని అక్కడే చతికిలబడ్డారు. అప్పుడు శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. దీనంగా కూర్చున్న దేవతలనూ, రాక్షసులనూ చూసి, వారికి అభయం ప్రసాదించాడు. పర్వతం కింద పడి చనిపోయిన వారందరినీ బతికించాడు. బతికిన వారితో పాటుగా పర్వతాన్ని మోసేందుకు అంతా సిద్ధమవుతుంటే, మీకెందుకు శ్రమ అన్నట్టుగా శ్రీహరే కల్పించుకున్నాడు. ఒంటి చేత్తో మందరాన్ని ఎత్తి పట్టాడు. దాన్ని గరుత్మంతుడి మీద పెట్టాడు.

''తీసుకుని వెళ్ళి క్షీరసాగరంలో జాగ్రత్తగా ఉంచు.'' ఆజ్ఞాపించాడు. సరేనన్నట్టుగా పర్వతంతో పాటుగా రివ్వున ఎగిరిపోయి, పర్వతాన్ని క్షీరసాగరంలో ఉంచాడు గరుత్మంతుడు. ఇక తాడుగా వాసుకి కావాలి. అందుకని అతన్ని ప్రార్థించారు దేవదానవులు. కరుణించాడు వాసుకి. మందరాన్ని తాడుగా చుట్టుకున్నాడు.

''అటూ ఇటూ పట్టుకోండి.'' అని శ్రీహరి ఆజ్ఞాపిస్తే వాసుకి తల దిక్కున దేవతలూ, తోక దిక్కున రాక్షసులూ పట్టుకున్నారు. సర్పం తల దిక్కున పట్టుకోమని దేవతలను ముందే

హెచ్చరించాడు శ్రీహరి. ఆ హెచ్చరికను గమనించిన రాక్షసులు అందుకు ఒప్పుకోలేదు. పైగా తోక దిక్కున సర్పాన్ని పట్టుకోవడం తమకి అవమానంగా భావించారు. దేవతలతో గొడవపడ్డారు. సర్ది చెప్పాడు శ్రీహరి. తోక వైపున దేవతలు పట్టుకుంటారన్నాడు. తనతో పాటుగా దేవతలంతా వాసుకి తోకని పట్టుకున్నారు. రాక్షసులు తలని పట్టుకున్నారు. క్షీరసాగరాన్ని మథించసాగారు. మందరపర్వతానికి అడుగున ఆధారం లేదు. దాంతో మథిస్తుంటే పట్టుతప్పి, పర్వతం సముద్రంలో మునిగిపోసాగింది. ఏం చేయాలిప్పుడు? మళ్ళీ తలలు పట్టుకున్నారు దేవదానవులు. శ్రీహరి మళ్ళీ కలుగజేసుకున్నాడు. కూర్మావతారం ఎత్తి పాలసముద్రంలోకి ప్రవేశించాడు. మందర పర్వతాన్ని వీపున ధరించి, లేవనెత్తాడు. తాబేలు ఏమిటి, మందరాన్ని మోయడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా?! మామూలు తాబేలు కాదది. మహాతాబేలది! దాని వీపు లక్ష యోజనాల విస్తీర్ణం అంటే ఆలోచించుకోండి. అలాంటి వీపు మీద మందరాన్ని మోస్తూ, క్షీరసాగరాన్ని మథించేందుకు దేవదానవుల్లోనూ, మందరగిరినీ, వాసుకునీ ఆవహించి శ్రీహరి బలాన్నీ, ధైర్యాన్నీ కలుగజేశాడు. దాంతో మథనం సులభతరమయింది. ఎప్పుడయితే శ్రీహరి కూర్మావతారం ఎత్తాడని తెలుసుకున్నారో అప్పుడు బ్రహ్మ రుద్రాదులు అది చూసేందుకు అక్కడకు వచ్చారు. చూసి తరించారు. పుష్పవృష్టి కురిపించారు.

దేవదానవులు మథిస్తుంటే క్షీరసాగరం అల్లకల్లోలమయింది. అందులోని మత్స్య, కూర్మ, మకరాది జలచరాలన్నీ నలుదిశలా పరుగులుదీశాయి. మథించగా మథించగా ముందుగా హాలాహలం పుట్టింది. పుట్టిన మరుక్షణమే అది దిక్కులన్నిటా వ్యాపించసాగింది. దాన్ని చూసి భయకంపితులయినారంతా. దిక్కుతోచలేదెవరికీ. పరమశివుణ్ణి ఆశ్రయించారప్పుడు. తపోయోగంలో ఉన్న ఆ మహాశివుణ్ణి స్తోత్రం చేశారు. కళ్ళు తెరిచి చూశాడు శివుడు. అభయాన్ని ప్రసాదించాడు. విషయాన్ని గ్రహించి, విషం తాను మింగుతానన్నాడు. అన్నాడే కాని, అర్థాంగి అనుమతి కావాలన్నాడు. పార్వతిని అడిగాడు. ఆమె అంగీకరించడంతో దిక్కులకు వ్యాపిస్తున్న హాలాహలాన్ని చేతిలోకి తీసుకుని, గొంతులో పెట్టుకున్నాడు. గొంతుని దాటనీయలేదు. గుండెల్లోకి పోనీయలేదు. కారణం చరాచర జీవరాశి అంతా ఆయన గర్భంలోనే ఉంది. హాలాహలాన్ని గొంతును దాటనిచ్చి, గుండెల్లోకి పోనిస్తే జీవరాశి అంతా నశిస్తుంది. అందుకే పోనీయలేదు. గొంతులో హాలాహలాన్ని దాచిన కారణంగా శివుని కంఠం నల్లగా మారింది. అందుకే ఆయన్ని నీలకంఠుడు అన్నారు.

సాగరాన్ని మథిస్తూనే ఉన్నారు దేవదానవులు. కామధేనువు పుట్టిందప్పుడు. మహర్షులు స్వీకరించారు దాన్ని. తర్వాత ఉచ్చైశ్రవం అని తెల్లటి గుర్రం పుట్టింది. దాన్ని బలి స్వాధీనం చేసుకున్నాడు. ఐరావతం పుట్టింది. దానిని ఇంద్రుడు కైవసం చేసుకున్నాడు. పారిజాతవృక్షం పుట్టింది. అప్సరాంగనలు పుట్టారు. లక్ష్మీదేవి పుట్టింది. లక్ష్మీదేవిని చూడగానే దేవదానవులకు ఆమె మీద మనసు పుట్టింది. నన్నంటే నన్ను వరించమంటూ అంతా ఆమె ముందుకొచ్చారు. అందరినీ పరిశీలించిందామె. అందరిలో ఏదో ఒక లోపాన్ని కనిపెట్టింది. శ్రీహరిని చూసింది. అతనిలో ఆమెకు ఎలాంటి లోపమూ కనిపించలేదు. అతన్ని వరించిందామె. తనని అంత ఇష్టంగా వరించినందుకు ఆమెను తన గుండెల్లో వక్షస్థలం మీద ఉంచుకున్నాడు శ్రీహరి.

దేవదానవులు క్షీరసాగరాన్ని ఇంకా మథిస్తూనే ఉన్నారు. ధన్వంతరి పుట్టాడప్పుడు. చేతిలో అమృతకలశంతో ప్రత్యక్షమయ్యాడు. అమృతకలశాన్ని చూడడం ఏమిటి, ఒక్కుదుటన దాన్నందుకుని దానవులు దూరంగా పారిపోయారక్కణ్ణుంచి. పరిగెత్తిపోయిన దానవుల్ని వెంబడించలేక నిస్త్రాణంగా కూలబడ్డారు దేవతలు. ఎంత కష్టపడ్డాం, ఎంత ఆశపడ్డాం, ఫలితం లేకపోయిందనుకున్నారు. శ్రీహరిని వేడుకున్నారు మళ్ళీ. అభయం ప్రసాదించి ఇలా అన్నాడు శ్రీహరి.

''అమృతాన్ని మీకు అందజేసే బాధ్యత నాది. అయితే మీరు కూడా మీ శాయశక్తులా దానవులతో పోరాడాలి.''

శ్రీహరి చెప్పడంతో శక్తిని సమకూర్చుకుని దేవతలంతా దానవులపై దాడి చేశారు. అమృతంలో మాకు భాగముందంటూ పోట్లాటకు దిగారు. వాళ్ళలా కొట్లాడుకుంటుంటే...

ముల్లోకాలనూ మోహంలో ముంచేసే విధంగా మోహినీరూపం దాల్చాడు శ్రీహరి. దేవదానవుల ముందు మెరుపుతీగలా వయ్యారంగా నిలిచి కేకేశాడందర్నీ. అమృతాన్ని పంచుకోవడంలో వాటాలు తెగక కొట్లాడుకుంటున్న దేవదానవులంతా ఆ కేకకి ఇటు చూసి, జగన్మోహిని వలలో చిక్కుకున్నారు. అమృతాన్ని పక్కనపెట్టి, నాకంటే నాకంటూ ఆమె కోసం పోట్లాడుకోసాగారు. తప్పు అంది మోహిని. అన్నదమ్ముల మధ్య వైరం కూడదంది.



''నాకోసం కొట్లాడుకున్నారు సరే, ముందు ఎందుకు కొట్లాడుకుంటున్నారు?'' ఏమీ తెలియని దానిలా అమాయకంగా అడిగింది.

''ముందు ఎందుకు కొట్లాడుకున్నామంటే అమృతం సమస్యయి కూర్చుంది. దాన్ని మేం పంచుకోవాలి. ఎలా పంచుకోవాలో తెలియడం లేదు'' అన్నారు.

''మీకు అభ్యంతరం లేకపోతే నేను పంచి పెడతాను'' అంది మోహిని.

అమృతాన్ని పంచి పెట్టేందుకు ఈమె ఎవరు? అంటూ దేవతలు ఒకరినొకరు చూసుకున్నారు. అనుమానంగా మోహినిని కూడా చూశారు. అప్పుడు వారికి తన అసలు రూపం గోప్యంగా చూపించాడు శ్రీహరి. మోహిని మోహినీ కాదు, శ్రీమన్నారాయణుడు అని తెలుసుకుని, మనసులోనే ఆ మహాదేవునికి నమస్కృతులు అర్పించి, మిన్నకున్నారు దేవతలు.

''ఏమంటారు? నేను మీకు అమృతాన్ని పంచిపెట్టడంలో మీకెవరికయినా అభ్యంతరాలు ఉన్నాయా?'' రెట్టించింది మోహిని.

రాక్షసులతో పాటుగా దేవతలంతా 'లేదు లేదు' అన్నారు. అదే అవకాశంగా మోహిని ఇలా అంది.

''అయితే ఓ షరతు.''

''చెప్పు.''

''నేను ఎలా ప్రవర్తించినా మీరు కాదనకూడదు.''

''కాదనం'' ఒప్పుకున్నారు. అమృత కలశం అప్పగించారామెకు. కలశాన్ని చంకనబెట్టుకుని, వయ్యారాలు పోయింది మోహిని. ఆమె వయ్యారాలకు వంకరలు తిరిగారు దానవులు.

అమృతాన్ని స్వీకరించాలంటే అశుచి పనికి రాదు. దాంతో దేవదానవులంతా ఉపవాసం ఉన్నారు. స్నానాలు చేశారు. పంచభూతాలనూ పూజించి, కుశాసనాలు పరచుకుని తూర్పు ముఖంగా బారులు తీర్చి కూర్చున్నారంతా. ఒక వరుసలో దేవతలు కూర్చుంటే మరో వరుసలో దానవులు కూర్చున్నారు. మధ్యలో అమృతకలశాన్ని చంకన ఉంచుకుని మోహిని నిలిచింది. ఎందుకయినా మంచిదని రాహువు అనే రాక్షసుడు, దేవతల వరుసలో కూర్చున్నాడు. దేవతలకి అమృతాన్ని పంచసాగింది మోహిని. దోసిళ్ళతో తాగసాగారు వారు. దేవతలకే ముందు ఎందుకు పంచుతున్నావని దానవులు అడగలేదు. కారణం ముందు చేసుకున్న ఒప్పందం. తానెలా ప్రవర్తించినా కాదనరాదన్నది మోహిని. సరేనన్నారప్పుడు. ఇప్పుడు కాదంటే పద్ధతి కాదని ఊరుకున్నారు దానవులు. చుక్క కూడా మిగలకుండా అమృతాన్నంతా దేవతలకి పంచేసింది మోహిని. దేవతల వరుసలో కూర్చున్న రాహువు కూడా దోసిట పట్టి అమృతాన్ని జుర్రుకున్నాడు. వాణ్ణి గమనించి, సూర్య చంద్రులిద్దరూ సైగలతో రాహువు సంగతి మోహినికి చెప్పారు. శ్రీహరి ఆలస్యం చేయలేదు, అమృతం కడుపులోనికి చేరకుండా, చక్రాయుధంతో రాహువు శిరస్సును ఖండించాడు. ఖండించినా అమృతం తాగిన కారణంగా రాహువు శిరస్సు అమరమయింది. గ్రహమయ్యాడతను. గ్రహమయ్యి, తన శిరచ్ఛేదనకు కారణమయిన సూర్య చంద్రుల మీద పగబట్టాడు. వారిని మింగుతూ వస్తున్నాడు. అవే సూర్య చంద్ర గ్రహణాలు.

అమృతాన్నంతా దేవతలకు పంచిపెట్టి, మోహినీ అవతారాన్ని చాలించాడు శ్రీహరి. నిజరూపం ధరించి, వైకుంఠానికి వెళ్ళిపోయాడు. జరిగిన మోసాన్ని దానవులు అప్పుడు

తెలుసుకున్నారు. తమ శ్రమంతా వృథా అయిందనుకున్నారు. బాధపడ్డారు. విచారించి లాభం లేదనుకున్నారు అంతలోనే. దేవతలతో యుద్ధానికి దిగారు. భయంకర యుద్ధం జరిగిందప్పుడు. ఆ యుద్ధంలో అమృతపానంతో అమిత బలవంతులూ, అమరులూ అయిన దేవతలు, రాక్షసుల్ని లెక్కకు మిక్కిలిగా చంపి వేశారు. రాక్షసరాజు బలిని ఇంద్రుడు తన వజ్రాయుధంతో సంహరించాడు. చనిపోయిన వారు చనిపోగా మిగిలిన రాక్షసులు, దేవతలకు భయపడి, రణక్షేత్రం నుంచి పారిపోయారు. ఎక్కడెక్కడో దాగారు.

మోహినీ అవతారాన్ని చూసి, జితేంద్రియుడూ, పరమయోగీ, తపోనిష్ఠాగరిష్ఠుడూ శివుడే ఆమె వెంటపడ్డాడని వ్యాసుడు రాశాడు. అదంతా వేరే కథ. అసలు విషయానికి వస్తే సాక్షాత్తూ శివుణ్ణే మోహావేశంలో బంధించిన శ్రీహరి మాయాప్రభావం తెలుసుకోవడం చాలా కష్టం. అఖిల ప్రపంచాన్నీ ఆ మాయే నడిపిస్తోంది. దానిని గుర్తించగలిగినవారే గొప్పవారు.

## బలి చక్రవర్తి

అన్ని గుణాల్లోనూ దానగుణం గొప్పది. దానగుణంతో పుణ్యమే కాదు, సూర్యచంద్రులు ఉన్నంత కాలం కీర్తి ప్రతిష్ఠలు కూడా సాధించవచ్చు. ముల్లోకాల్లోనూ మహాదాతగా ప్రసిద్ధి చెందిన బలిచక్రవర్తి, దానవకులంలో జన్మించినప్పటికీ  దానగుణంతోనే గొప్పఖ్యాతినీ, పరమాత్ముని అనుగ్రహాన్నీ పొందగలిగాడు.

హిరణ్యకశిపునికి ప్రహ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, హ్లాదుడు అని నలుగురు కుమారులూ, సింహిక అని ఓ కూతురూ జన్మించారు. పరమ భాగవతోత్తముడయిన ప్రహ్లాదుని కథ అందరికీ తెలిసిందే! ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. ఆ విరోచనుడి కొడుకే బలి, అంటే ప్రహ్లాదుని మనుమడే బలి చక్రవర్తి.

అమృతపానం చేసిన సురులు, యుద్ధంలో అసురులను ఓడించారు. ఆ యుద్ధంలో చాలా మంది అసురులు మరణించారు. మరణించిన వారు మరణించగా మిగిలిన వారు రణరంగం నుంచి పారిపోయారు. పారిపోయి, కులగురువు శుక్రాచార్యుని శరణు వేడారు. తమ పరిస్థితి చెప్పుకుని దుఃఖించారు. వారిని ఓదార్చాడు శుక్రాచార్యుడు. ఓదార్చి, మృతసంజీవని విద్యా ప్రభావంతో యుద్ధంలో మరణించిన అసురులందరినీ బతికించాడు. అప్పుడే రాక్షసరాజు బలి కూడా ప్రాణం పోసుకున్నాడు. ప్రాణం పోసుకున్న తక్షణం దానవకులానికి సంభవించిన దురవస్థను గురించి తీవ్రంగా ఆలోచించాడు బలి. ఎలాగయినా దేవతలను ఓడించి, సకల సంపదలనూ చేజిక్కించుకోవాలనుకున్నాడు. శుక్రాచార్యుని సంప్రదించాడు. ఆశించింది అందాలంటే 'విశ్వజిన్యాయం' అనే గొప్ప యాగం చేయాలన్నాడతను. చేస్తానన్నాడు బలి. శుక్రాచార్యుని నేతృత్వంలో యాగం పూర్తయింది. యాగఫలంగా అగ్ని నుండి సింహధ్వజంతో కూడిన దివ్యమైన రథాన్నీ, గుర్రాలనూ అందుకున్నాడు బలి. తాత ప్రహ్లాదుణ్ణి కూడా దర్శించాడు. ప్రహ్లాదుడు ప్రత్యక్షమై బలికి బంగారపు విల్లు, అక్షయతూణీరం, దివ్యకవచం, పుష్పమాల అందజేసి, ఆశీర్వదించాడు. గురువు శుక్రాచార్యులు కూడా శిష్యుడు బలికి ఓ శంఖాన్ని కానుకగా ఇచ్చాడు. జయసాధకాలయిన దివ్యాయుధాలు సంపాదించి, శుక్రాచార్యుని అనుమతితోనే స్వర్గం

మీదికి దండెత్తాడు బలి. ఇంద్రుని రాజధాని అమరావతిని ముట్టించాడు. ఈసారి అసురుల ధాటిని సురులు తట్టుకోలేకపోయారు. వారి తేజోబల సంపద చూసి ఇంద్రుడు సహా ఆశ్చర్య పోయారంతా. భయపడ్డారు. ఆ భయంతో బృహస్పతిని ఆశ్రయించాడు ఇంద్రుడు. తన దీనస్థితిని వివరించి, దిక్కు తెలియజేయమని ప్రార్థించాడు.

''నీకే కాదు, నాకూ దిక్కు తెలియడం లేదు. శుక్రాచార్యుని అనుగ్రహంతో దానవులు అమిత బలశాలురయ్యారు. వారిని జయించడం ఇప్పుడు అసాధ్యం. మంచి రోజులు వచ్చే వరకూ ఓపిక పట్టక తప్పదనిపిస్తోంది. అంత వరకూ మీరంతా రాక్షసులకు లొంగి ఉండడమే శ్రేయస్కరం. తర్వాత సంగతి అప్పుడు ఆలోచిద్దాం'' అన్నాడు బృహస్పతి.

మంచిరోజుల కోసం వేచి చూస్తూ సేవకులుసహా స్వర్గాన్ని విడిచిపెట్టాడు ఇంద్రుడు. ఒక రకంగా చెప్పాలంటే దేవతలంతా మారువేషాల్లో స్వర్గం నుంచి పారిపోయారు. అప్పుడు బలి స్వర్గాన్ని ఆక్రమించుకున్నాడు. ఇంద్ర సింహాసనాన్ని చేజిక్కించుకున్నాడు. ముల్లోకాలనూ అధీనం చేసుకుని, విశ్వవిజయుడై బలి సమస్త భోగాలూ అనుభవించసాగాడు. బలి మళ్ళీ చక్రవర్తి కావడంతో రాక్షసులకు పట్టపగ్గాలు లేకుండాపోయాయి. త్రిలోకాధిపత్యం తమది కావడంతో వారు ఆడింది ఆట, పాడింది పాటయింది. ఆ రోజుల్లోనే బలి చేత నూరు అశ్వమేధయాగాలు చేయించాడు శుక్రాచార్యుడు. దాంతో బలి కీర్తి నలుదిక్కులా వ్యాపించింది.



తన కుమారులు దేవతలు ఏమయ్యారో తెలియదు. ఎక్కడ ఉన్నారో తెలియదు. ఎలాంటి అవస్థలు పడుతున్నారో తెలియదంటూ రోదించింది అదితి. భర్త కశ్యపుని కలిసి, పిల్లలకు ఏ విధంగానయినా మళ్ళీ త్రిలోకాధిపత్యం కలుగజేసే మార్గం చెప్పమని వేడుకున్నది. 'పయోవ్రతం' అని ఓ పుణ్యవ్రతాన్ని చేయమన్నాడు కశ్యపుడు. వ్రతవిధానాన్ని తెలియజేశాడు. ఆ వ్రతాన్ని చేస్తే శ్రీహరి ప్రత్యక్షమవుతాడని, కోరిన కోరికలు నెరవేరుతాయన్నాడు. భర్త చెప్పినట్టుగానే వ్రతాన్ని భక్తిగా పూర్తి చేసింది అదితి. శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. వరం కోరుకోమన్నాడు. దేవతల కష్టాలు తీర్చమని వేడుకుంది అదితి. తన పిల్లలే మళ్ళీ త్రిలోకాధిపతులు కావాలని కోరుకుంది.

''తప్పకుండా అవుతారు. నేను నీ కుమారుడుగా పుట్టి, దేవతలకు అన్నీ సిద్ధించేటట్టు చేస్తాను. భయపడకు'' అన్నాడు శ్రీహరి.

కొన్నాళ్ళకు అదితి గర్భవతి అయింది. శ్రీహరి ఆమె గర్భాన వామనావతారుడై అవతరించాడు. భాద్రపదశుద్ధ ద్వాదశి శ్రవణానక్షత్రాన, అభిజిన్ముహూర్తంలో వామనమూర్తి జన్మించాడు. చాలా పొట్టిగా పుట్టడంతో వామనమూర్తి అన్నారతన్ని. ఉపనయనాది సంస్కారాలు చేశారు. బ్రహ్మ, సరస్వతి, సప్తర్షులు, పార్వతి తదితరులు వటువుకి దండం, కమండలం, కృష్ణాజినం మొదలయిన పరికరాలన్నీ అందజేశారు. ఇక్కడ ఈ కథ ఇలా ఉండగా...

అధర్మం అన్న మాటే తలెత్తకుండా బలిచక్రవర్తి లోకపాలన చేస్తున్నాడు. అతని పాలనలో దుఃఖం లేదు. కష్టం లేదు. ఈతిబాధలు లేవు. పంటలు పండుతున్నాయి. ప్రజలు సర్వసౌఖ్యాలూ అనుభవిస్తున్నారు. బ్రాహ్మణులూ, మహర్షులూ సంతుష్టులై ఉన్నారు.

బలిచక్రవర్తి సత్యసంధుడు. ఆడి తప్పనివాడు. ధర్మమూర్తి. దానగుణంలో అతనికి ముల్లోకాల్లోనూ సాటి రాగలవారు లేరు. దాంతో 'కృతయుగే బలిర్దాత'గా పేరు పొందాడు. కృతయుగంలో బలి ఒక్కడే దాత. అలాంటి బలిని నిగ్రహించాలి వామనుడు. అందుకు అతను సంసిద్ధుడయ్యాడు. యుద్ధం చేసి బలిని సంహరించ వీలులేదు. ఎందుకంటే బలపరాక్రమాలకు బలి పెట్టింది పేరు. పైగా ధర్మాత్ముడు. నిరంతరదానవ్రతుడు. పుణ్యశ్లోకుడు. అలాంటి వాణ్ణి సంహరించడం సాధ్యం కాదు కనుక ఏదైనా ఉపాయంతో బలిని తొక్కిపెట్టాలనుకున్నాడు శ్రీహరి. ఓనాడు వటువు వేషంలో బలిచక్రవర్తిని సందర్శించాడతను. అప్పుడు బలి నర్మదోత్తరతీరాన భృగువత్సనామక క్షేత్రంలో ఉన్నాడు. యజ్ఞదీక్షితుడై ఉన్నాడు. అతని చేత శుక్రాచార్యుడు అశ్వమేధయాగం చేయిస్తు న్నాడు. వామనుడు ఆ యజ్ఞశాలలోకి ప్రవేశించాడు. యజ్ఞోపవీతం, కృష్ణాజినం, ఛత్రం, దండం, కమండలాలతో ప్రత్యక్షమయిన వామనమూర్తిని మంత్రి సామంతుల సహా ఎదురొచ్చి ఆహ్వానించాడు బలిచక్రవర్తి. ఉచితాసనాన్ని చూపించి, యథావిధి పూజించాడు. అర్ఘ్య పాద్యాలతో అర్చించాడు. ఆయన పాదోదకాన్ని శిరస్సున జల్లుకున్నాడు.

''బ్రాహ్మణోత్తమా! నీలో మహర్షులందరి తేజస్సూ కనిపిస్తున్నది. నువ్వు వస్తే మహర్షులందరూ వచ్చినట్టుగా ఉంది. నీ రాకతో నేనూ, నా వంశం, నా పూర్వీకులు అంతా తరించినట్టే! నా యజ్ఞం సఫలం అయిందనుకుంటున్నాను. చెప్పు మహాత్మా! నీకేం కావాలో చెప్పు, ఇస్తాను. నీ కోరిక ఎలాంటిదయినా సంతోషంగా నెరవేరుస్తాను'' అన్నాడు బలి. మాయావటు వేషధారి శ్రీహరి అతని మాటలకు సన్నగా నవ్వుకున్నాడు. నవ్వుకుని, బలి కీర్తినీ,

గొప్పతనాన్నీ అనేక విధాల ప్రస్తుతించాడు. దానధర్మాలకు అతని పేరు పర్యాయపదం అన్నాడు. పరమ భాగవతోత్తముడు ప్రహ్లాదుడు జన్మించిన వంశం నీదంటూ, మీ వంశం లాంటి వంశం ముల్లోకాల్లోనూ లేనేలేదని శ్లాఘించాడతన్ని. తర్వాత చక్కగా తనకి కావాల్సింది అడిగాడు శ్రీహరి. మూడంటే మూడు అడుగుల నేల కావాలన్నాడు. ఇస్తే స్వీకరించి సంతోషంగా వెళ్ళిపోతానన్నాడు. ఆ మాటలకు నవ్వుకున్నాడు బలి. ఇలా అన్నాడు.

''విప్రనందనా! నేను ఎవరనుకుంటున్నావు, బలిచక్రవర్తిని. ముల్లోకాలూ నావే! నన్ను ద్వీపాలూ, రాజ్యాలూ దానం చేయమని అడగాలి. అంతేకాని మూడడుగుల నేల కావాలంటున్నావంటే నిన్నేమనుకోవాలి?''

ఏమనుకుంటావు? అన్నట్టుగా చూశాడు వామనమూర్తి.

''నీ కోరిక వింతగా ఉంది. సమస్త భూమండలానికే అధినాథుడుని అయిన నేను, నీకు మూడు అడుగుల నేల ఇవ్వడం పెద్ద సమస్య కాదు. ఇస్తాను, దానితో పాటు ఇంకేదయినా కోరుకో'' అన్నాడు బలి. మూడు అడుగుల నేలే చాలన్నాడు వామనమూర్తి. అదే తనకు కొండంత అండన్నాడు.

''సరే, స్వీకరించు'' అన్నాడు బలి. మూడు అడుగుల నేలని దానం చేసేందుకు జలకలశం అందుకున్నాడు.

వామనమూర్తి యజ్ఞశాలలోకి ప్రవేశించిన దగ్గర్నుంచీ అతన్ని పరిశీలిస్తూనే ఉన్నాడు శుక్రాచార్యుడు. అతని తేజస్సునూ, ఓజస్సునూ, మాట తీరునూ అంచనా కడుతూనే ఉన్నాడు. ఎప్పుడయితే మూడు అడుగుల నేల కావాలన్నాడో అప్పుడు, అతను ఎవరయి ఉన్నదీ దివ్య దృష్టితో చూశాడు. చిద్విలాసంగా నవ్వుతున్న శ్రీహరి కనిపించాడు. బ్రాహ్మణ వటువు కాదని, శ్రీహరే వామనమూర్తిగా అవతరించి వచ్చాడని తెలుసుకోగలిగాడు శుక్రాచార్యుడు. బలిని అడ్డుకున్నాడు.

''బలీ! ఇతను సాధారణ వటువు కాడు. సాక్షాత్తూ శ్రీహరే! ఈ రూపంలో వచ్చి నిన్ను అర్థిస్తున్నాడు. దానం చెయ్యకు. ఒకవేళ చేశావనుకో, ఈ దానం వల్ల నీకు చెప్పలేనంత ప్రమాదం జరుగుతుంది. వద్దు, నువ్వీ దానం చేయవద్దు'' అరిచాడు శుక్రాచార్యుడు.

నిజమా అన్నట్టుగా వామనమూర్తిని చూశాడు బలిచక్రవర్తి.

''ఈ మయావటువు అడిగింది మూడు అడుగుల నేలే కదా అని అనుకుంటున్నావు. కాని ఈ శ్రీహరి ఆ మూడు అడుగులతో ముల్లోకాలూ ఆక్రమిస్తాడు. నీ త్రిలోకాధిపత్యాన్నీ, నీ సంపదనీ, సర్వాన్నీ హరిస్తాడు. దేవతల కోసమే ఇదంతా చేస్తున్నాడితను. దయచేసి నువ్వు దానం చెయ్యకు.'' చెప్పాడు శుక్రాచార్యుడు.

ఆచార్యుని మాటలు పట్టించుకోలేదు బలిచక్రవర్తి. సన్నగా నవ్వుతూ ఆచార్యుని చూశాడతను. ఆడి తప్పడం పాపం అన్నాడు. ఇస్తానని ఇవ్వకపోవడం తన వ్యక్తిత్వానికే తీరని కళంకం అన్నాడు.

''గురుదేవా! మీరు చెప్పింది నిజమే అయిన పక్షంలో సాక్షాత్తూ ఇతను శ్రీహరే అయినప్పుడు ఇంతకు మించిన అదృష్టం ఇంకేముంది? శ్రీహరి అంతటి వాడే వచ్చి నన్ను యాచిస్తుంటే నాకింకేం కావాలి? నా రాజ్యం, నా సర్వ సంపదలూ పోతే పోయాయి. ఇలాంటి అవకాశం మళ్ళీ రాదు. ఈ దానం నేను చేసి తీరుతాను.'' గట్టి నిర్ణయం తీసుకున్నాడు బలిచక్రవర్తి. అదే మాట అన్నాడు.

శిష్యుడి ప్రవర్తనకు గురువుగారికి కోపం వచ్చింది. దిగ్గున లేచి మండిపడ్డాడు శుక్రాచార్యుడు.

''గురువునే ధిక్కరిస్తున్నావు. నా మాటనే కాదంటున్నావు కదా, ఇదిగో, ఇదే నా శాపం. త్వరలో నువ్వు సకల సంపదల్నీ కోల్పోదువు గాక.''

గురువు శపించినప్పటికీ ఇచ్చిన మాటను తప్పనన్నట్టుగా వామనమూర్తికి భూమిని దానం చేసేందుకు సిద్ధమయ్యాడు బలిచక్రవర్తి. అర్థాంగి వింధ్యావళి నీరు పోస్తుంటే వామనమూర్తి పాదాలు కడిగాడు బలి. ఆ జలాన్ని శిరసున జల్లుకున్నాడు. చేతులు జోడించి వామనమూర్తికి నమస్కరించాడు. ఆ దృశ్యం చూడముచ్చటయింది. సమస్త దేవతలూ, గంధర్వులూ, విద్యాధరులూ ఆ దృశ్యం చూసి ఉప్పొంగిపోయారు. బలిని వేయి విధాల ప్రశంసించారు. అతనిపై పుష్పవృష్టి కురిపించారు. దేవదుందుభులు మోగించారు.

''తీసుకోస్వామీ! నువ్వు అడిగిన మూడు అడుగుల నేలనూ ఇస్తున్నాను, స్వీకరించు'' అన్నాడు బలి. ఆ మాటకి వామనుడు నవ్వుతూ అందరూ చూస్తూ ఉండగానే తన ఆకారాన్ని ఇంతింతగా అంతంతగా అతిశయోక్తులకు కూడా అందనంతగా పెంచాడు. భూమికి జానెడు ఎత్తులో ఉన్న వామనమూర్తి ఇప్పుడు శరీరాన్నీ, తన ఎత్తునూ పెంచి, భువినీ, దివినీ సమస్తాన్నీ ఆక్రమించాడు. శ్రీహరి విరాట్ రూపాన్ని చూసి, మునులూ, దేవతలూ అతనిని వేదమంత్రాలతో స్తుతించారు. అతనికి సకల లోకాలూ మోకరిల్లాయి. ఈ అవతారమే త్రివిక్రమావతారంగా ప్రసిద్ధి చెందింది.

శ్రీహరి ఒక అడుగుతో భూమండలాన్ని ఆక్రమించాడు. రెండవ అడుగుతో అంతరిక్షాన్ని ఆక్రమించాడు. మూడవ అడుగు పెట్టేందుకు ఎక్కడా సూది మొనంత జాగా కూడా కనిపించలేదు.

''బలీ! నాకు నువ్వు మూడు అడుగులు ఇస్తానన్నావు. నా రెండు అడుగులకే ఇటు భూమీ అటు అంతరిక్షమూ సరిపోయాయి. ఇక మూడో అడుగేదీ? ఎక్కడ పెట్టను?'' అడిగాడు శ్రీహరి.

ముఖాన్నెత్తి శ్రీహరిని ఆశ్చర్యంగా చూశాడు బలిచక్రవర్తి.

''ఆడిన మాట తప్పావు. ఈ పాపానికిగాను నువ్వు సకల సంపదలనూ పోగొట్టుకుని, కొన్ని వేల సంవత్సరాల పాటు నరకంలో ఉండిపో.'' శపించాడు శ్రీహరి. బలిని వరుణపాశాలతో బంధించాడు. అప్పుడు దేవతలు వచ్చారక్కడికి. ఇన్నాళ్ళూ ఎక్కడ దాగారో ఏమో! కూడబలుక్కున్నట్టుగా ఒక్కసారిగా ఊడిపడ్డారంతా.

బలిని బంధించడాన్ని చూసి రాక్షసులు తట్టుకోలేకపోయారు. యుద్ధానికి దిగారు. వారిని దేవతలు ఎదుర్కొన్నారు. ఓడించి, తరిమేశారక్కణ్ణుంచి.

ఇంత జరిగినా, శప్తుడై పాశబంధంలో ఉన్నా, మహాత్ముడూ, సత్యసంధుడూ బలి నవ్వుతూనే ఉన్నాడు. ఎక్కడా విచారం అన్నది లేనేలేదు. అప్పుడు అతను శ్రీహరితో ఇలా అన్నాడు.

# మత్స్యావతారం

''జగన్నాథా! ప్రాణాలు పోయినా నేను మాట తప్పను, మూడో అడుగు ఎక్కడపెట్టాలని అడిగావు కదా!''

''ఇక్కడ పెట్టు'' అన్నాడు బలి. తన తలను చూపించాడు.

బలి సత్యసంధతనూ, వదాన్యతనూ ముల్లోకాల ప్రజలూ, సురులూ, మునులూ వేనోళ్ళ కీర్తించారు. బలిని అలా కీర్తించడాన్ని శ్రీహరి మెచ్చుకున్నాడు.

''బలిచక్రవర్తీ! నీ దానవ్రతం ముల్లోకాలనూ ఆశ్చర్యంలో ముంచి వేసింది. నీకు నువ్వే సాటి. అయినా తప్పదు, నువ్వు సుతలానికి తరలిపోవాల్సిందే!'' అన్నాడు శ్రీహరి.

''పచ్చని ఛాయతో అలరారే ఆరవ పాతాళమయిన సుతలంలో నివాసం ఏర్పరుచుకుని, సావర్ణి మన్వంతరంలో పైకి రా! ఆనాడు ఇంద్రపదవి చేపట్టి, త్రిలోకాలనూ పరిపాలించు'' అన్నాడు శ్రీహరి. బలి తల మీద అడుగు మోపాడు. అరికాలితో సున్నితంగా అదిమాడతన్ని. అంతే! బలి సుతలానికి జారిపోయాడు. అలా బలిని నిగ్రహించి, సురులకు మళ్ళీ త్రిలోకాధిపత్యాన్ని కట్టబెట్టాడు శ్రీహరి.

## మత్స్యావతారం

లోకాల్ని ఉద్ధరించేందుకు భగవంతుడు వివిధ జంతు రూపాలను కూడా ధరించాడు. ధరించి ఈశ్వరుడు సర్వాంతర్యామి అనీ, సర్వభూతమయుడనీ నిరూపించాడు.

పూర్వం ఒక కల్పాంతంలో బ్రహ్మ నిద్రిస్తున్నాడు. అంతలో జగత్ప్రళయం సంభవించింది. సమస్తలోకాలూ జలంలో మునిగిపోయాయి. అదే అవకాశంగా బ్రహ్మ ముఖం నుండి వెలువడిన వేదాలను హయగ్రీవుడు అనే రాక్షసుడు అపహరించాడు. పారిపోయి దాగున్నాడు. ఆ వేదాలను ఉద్ధరించేందుకు శ్రీహరి మత్స్యావతారం ఎత్తాల్సి వచ్చింది.

రాజర్షి సత్యవ్రతుడు, కేవలం జలాన్నే ఆహారంగా స్వీకరిస్తూ తీవ్రతపస్సు చేస్తున్నాడు. ఒకనాడు అతను కృతమాలాతీరంలో జలతర్పణ చేస్తుండగా, అతని దోసిట్లోకి నీటితో పాటుగా ఓ చిన్న చేప చేరింది. చేపను చూసి ముచ్చటపడ్డాడు సత్యవ్రతుడు. అంతలోనే నీరు విడచి చేప బతకలేదని ఆలోచించి, దోసిట్లోని చేపను నీటిలో విడిచి పెట్టేందుకు సిద్ధమయ్యాడు.

''ఆగాగు'' అన్నది చేప. ఆగాడు సత్యవ్రతుడు.

''ఈ నీటిలో పెద్ద చేపలకు ఆహారమయిపోయి చనిపోతానన్న భయంతోనే నీ దోసిట్లోకి చేరాను. నన్ను రక్షించు రాజర్షీ, నన్ను కాపాడు.'' వేడుకుంది.

సరేనన్నట్టుగా నవ్వి, చేపను తన కమండలంలో ఉంచుకుని, ఆశ్రమానికి చేరుకున్నాడు సత్యవ్రతుడు.

ఆ రోజు గడిచింది.

మర్నాడు చూస్తే చిత్రంగా చేప పెద్దయి, కమండలం అంతా నిండిపోయింది.

''రాజర్షీ! నాకీ కమండలం ఇరుకుగా ఉంది. తీసి మరోచోట ఉంచే ప్రయత్నం చెయ్యి'' ప్రార్థించింది చేప. నీళ్ళకాగులో ఉంచాడు దానిని సత్యవ్రతుడు. చూస్తుండగానే అక్కడ కూడా పెద్దయిందది. నీళ్ళకాగంతటా నిండిపోయింది చేప. తీసి, దానిని సరోవరంలో వదిలాడు సత్యవ్రతుడు. సరోవరం కూడా సరిపోలేదు ఆ చేపకి. సరోవరాన్ని మించి పెద్దదయిందది. ఏం చెయ్యాలి? ఎక్కడ దీనిని ఉంచాలి? పాలుపోలేదు సత్యవ్రతునికి. ఆలోచించి ఆలోచించి ఆఖరికి ఆ చేపను, సముద్రంలో విడిచిపెట్టేందుకు సిద్ధమయ్యాడు.

''సముద్రంలో మొసళ్ళూ, వాటికన్నా భయంకరమయిన జంతువులూ చాలా ఉంటాయి. అవి నన్ను చూసిన తక్షణం తినేందుకు పోటీపడతాయి. దయచేసి, అక్కడ వద్దు, ఇంకెక్కడయినా వదలిపెట్టు.'' వేడుకుంది చేప. ఇంకెక్కడ వదలిపెట్టాలి? సముద్రాన్ని మించిన చోటేది? తలపట్టుకున్నాడు సత్యవ్రతుడు. చేపను పరిశీలనగా చూశాడు. తర్వాత అనుమానంగా చూశాడు. అప్పుడిలా అన్నాడు.

''చూస్తూండగానే నూరు యోజనాల విస్తీర్ణం పెరిగావు. ఇది మామూలు చేపలకు సాధ్యం కాదు, నువ్వు చేపవి కాదు. చేప రూపంలో ఉన్న భగవంతుడివి. అవునా? కాదా?'' చేతులు జోడించాడు సత్యవ్రతుడు. సమాధానంగా ఇలా అన్నది చేప.

''సత్యవ్రతా! నేటికి ఏడవరోజు ఈ ముల్లోకాలూ మున్నీట మునిగిపోనున్నాయి. సరిగ్గా ఆ సమయానికి నేను ఒక పెద్ద నావను నీ దగ్గరకు పంపుతాను. ఆ నావలో సమస్త ఓషధులనూ, సర్వ బీజాలనూ ఉంచి, సప్తర్షులసహా నువ్వు జలార్ణవంలో సంచరించు. పెను తుపానుకి నావ మునిగిపోకుండా వాసుకిని తాడు చేసి, నా కొమ్ముకి కట్టు. దానిని ఈడుస్తూ నేను తిరుగుతాను. నేనెవరో, నా మహిమ ఏమిటో నీకు అప్పుడు అర్థమవుతుంది.''

చేప చెప్పినట్టుగానే ఏడవరోజు జలప్రళయం వచ్చింది. లోకాలన్నీ నీటిలో మునిగిపోయాయి. నావ వచ్చిందప్పుడు. సమస్త ఓషధులూ, సకల బీజాలూ, సప్తర్షులసహా నావ ఎక్కాడు సత్యవ్రతుడు. వాసుకిని తాడు చేసి, నావను చేపకొమ్ముకి కట్టాడు. ప్రచండమయిన గాలిలో, మహార్ణవంలో మత్స్యావతారంలో శ్రీమహావిష్ణువు నావను ఈడుస్తూ సంచరించసాగాడు.



సాంఖ్యయోగ క్రియాన్వితమయిన పురాణసంహితను అప్పుడే సత్యవ్రతునికి శ్రీహరి వివరించాడు. అదే మత్స్యపురాణంగా ప్రసిద్ధి చెందింది. ప్రళయాంతంలో హయగ్రీవుణ్ణి శ్రీహరి సంహరించాడు. హయగ్రీవుడు దొంగిలించిన వేదాలను తీసుకుని వచ్చి, బ్రహ్మకు అందజేశాడు.

నాటి సత్యవ్రతుడే ఏడవ మన్వంతరంలో వివస్వంతుడికి పుత్రుడిగా జన్మించాడు. అతని పేరే శ్రాద్ధదేవుడు. అనంతరం హరి ఆదేశానుసారం వైవస్వతమనువయినాడు.

## సూర్య చంద్రవంశాలు

వైవస్వతమనువువంశం దినదినప్రవర్ధమానమయింది. ఆ వంశంలో జన్మించిన వారే ఇటు సూర్యవంశపు రాజులకూ అటు చంద్రవంశపు రాజులకూ మూలపురుషులయినారు. వారంతా అనేక గొప్ప కార్యాలు చేసి, ప్రసిద్ధికెక్కారు.

కల్పాంతంలో శ్రీహరి ఒక్కడే ఈ విశ్వం అంతా వ్యాపించి ఉన్నాడు. అతని నాభి నుండి అప్పుడు బంగారు కమలం పుట్టింది. ఆ కమలనాళం నుండి చతుర్ముఖబ్రహ్మ పుట్టాడు. ఆ బ్రహ్మ మనస్సునుండి మరీచి జన్మించాడు. మరీచికి కశ్యపుడు పుట్టాడు. కశ్యపుడు, దక్షప్రజాపతి పుత్రిక అదితిని వివాహం చేసుకుని, వివస్వంతుని కన్నాడు. వివస్వంతునికీ-సంజ్ఞకీ శ్రాద్ధదేవుడు జన్మించాడు. అతనే వైవస్వతుడు. అతనే వర్తమానమనువుగా కూడా ప్రసిద్ధి చెందాడు.

వైవస్వతుని భార్య పేరు శ్రద్ధ. ఆమెకి చాలా కాలం వరకు సంతానం కలుగలేదు. అప్పుడు కులగురువు వశిష్ఠుడు, వైవస్వతుని చేత మైత్రావరుణేష్టి అని ఒక యాగం చేయించాడు. యాగం చేస్తూ వైవస్వతుడు పుత్రుడు కావాలనుకుంటే, అతని భార్య శ్రద్ధ పుత్రిక కావాలని కోరుకుంది. ఆమె అభిలాషకి అనుగుణంగానే హోత, మంత్రధ్యానం జరిగింది. యజ్ఞం పూర్తయింది. వైవస్వతునికీ-శ్రద్ధకీ ఇల అని ఒక చక్కని కూతురు పుట్టింది. కుమారుడు కావాలనుకుంటే కూతురు పుట్టిందేమిటని ఆశ్చర్యపోయాడు వైవస్వతుడు. అదే విషయాన్ని వశిష్ఠుణ్ణి అడిగాడు. అవును కదా అనుకుని, దివ్యదృష్టితో చూశాడు వశిష్ఠుడు. విషయం అర్థమయింది. హోత చేసిన నిర్వాకం అది అని తెలుసుకున్నాడతను. శ్రీహరిని మెప్పించి, ఇలకు పుంస్త్వాన్ని కలిగించాడు. నాటి నుంచి ఆమె సుద్యుమ్నుడుగా ప్రసిద్ధి చెందింది.

ఒకనాడు సుద్యుమ్నుడు, తన పరివారంతో ఉత్తరదిశలోని అడవులకు వేటకు వెళ్ళాడు. మేరుపర్వతం కిందన గల కుమారవనంలోకి ప్రవేశించాడు. అక్కడ అడుగు పెట్టాడో లేదో సుద్యుమ్నుడు స్త్రీగా మారిపోయాడు. అతని గుర్రం కూడా ఆడగుర్రంగా మారిపోయింది. మగపరివారం అంతా కూడా స్త్రీలయిపోయారు. దీనికి కారణం ఏమిటంటే...

శంకరుడు పార్వతితో విహరించే వనం కుమారవనం. ఒకనాడు మహర్షులు శంకరుని సందర్శనార్థమై అక్కడికి విచ్చేశారు. ఆ సమయంలో శివుడు, పార్వతితో శృంగారక్రీడలో తేలియాడుతున్నాడు. మహర్షుల రాకను గమనించింది పార్వతి. వివస్త్రగా ఉన్న ఆమె దిగ్గున లేచి, వస్త్రం ధరించింది. పార్వతిని శివుడు అనుభవిస్తున్న వేళ ఇది, రాకూడని సమయం. వచ్చాం, తప్పు చేశాం అనుకుని అక్కణ్ణుంచి తలలు వంచుకునే నిష్క్రమించారు ఋషులు. అయినా స్త్రీగా పార్వతి బాధ బాధే! ఆ బాధను తీర్చేందుకు పార్వతికి మళ్ళీ ఇలాంటి కష్టం కలుగకూడదనుకుని, ఇలా శాసించాడు శివుడు. ఇక మీదట కుమారవనంలో పురుషజాతికి చెందిన వారు ఎవరు

అడుగు పెట్టినా, వారు స్త్రీగా మారిపోతారన్నాడు. శివుడి మాట తెలుసుకున్న పురుషులంతా ఆ వనానికి రావడం మానుకున్నారు. సుద్యుమ్నుడుకి ఈ సంగతి తెలియదు, ప్రవేశించి ఫలితాన్ని అనుభవించాడు. అందమయిన స్త్రీగా మారిపోయాడు. మారిపోయి 'సుద్యుమ్న' అయినాడు. సుద్యుమ్న అక్కడే ఆ వనంలో తిరుగాడుతూ చివరకి చంద్రుని కుమారుడు బుధుని ఆశ్రమానికి చేరింది. ఆశ్రమంలో బుధుణ్ణి చూసి మోహించింది. బుధుడు కూడా సుద్యుమ్న చక్కదనానికి చకితుడై ఆమెను చేపట్టాడు. వారికి పురూరవుడు జన్మించాడు.

కొన్నాళ్ళకు తన స్త్రీత్వం పోగొట్టమని సుద్యుమ్నుడు వశిష్ఠుని వేడుకున్నాడు. వశిష్ఠుడు, శివుని సందర్శించి, సంగతంతా వివరించాడు. సుద్యుమ్నను సుద్యుమ్నుని చేయమని ప్రార్థించాడు. శివుడు కరుణించాడు. అయితే తన మాట పొల్లుపోకూడదని, వరాన్ని ఇలా ప్రసాదించాడు. సుద్యుమ్నుడు ఒక నెల స్త్రీగానూ, ఒక నెల పురుషుడిగానూ ఉంటాడన్నాడు. అలా ఉంటూనే సుద్యుమ్నుడు రాజ్యపాలన చేయసాగాడు. ప్రజలకి అది నచ్చలేదు. సుద్యుమ్నుడికి ఉత్కలుడు, గయుడు, విమలుడు అని ముగ్గురు కొడుకులు పుట్టారు. వారు ఉత్తరపథాన్ని పాలించసాగారు. సుద్యుమ్నుడికి ముసలితనం వచ్చింది. పరిపాలనకు తను అనర్హుడనుకున్నాడు. కొడుకు పురూరవుడికి రాజ్యాన్ని అప్పగించి, తపస్సు చేసుకునేందుకు అడవులకు వెళ్ళిపోయాడు.

సుద్యుమ్నుడు అలా అడవుల్లో తేలాడని తెలిసి, చాలా బాధపడ్డాడు వైవస్వతుడు. మళ్ళీ కొడుకు కావాలని, యమునాతీరంలో తపస్సు చేయసాగాడు. నూరేళ్ళు చేశాడు తపస్సు. అప్పుడు శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. అతని కోరిక తీర్చాడు. భగవదనుగ్రహంతో వైవస్వతునికి ఇక్ష్వాకుడు, నృగుడు, శర్యాతి, దిష్టుడు, కరూశకుడు, అరిష్యంతుడు, వృషధ్రుడు, నభగుడు, కవి, ఇంకొకరు కలసి పదిమంది కొడుకులు పుట్టారు. వారితో మనుసంతతి విస్తారమయింది. ఇక్ష్వాకుడు సూర్యవంశానికి మూలపురుషుడయినాడు. ఈ సంతతిలో హరిశ్చంద్రుడు, రఘువు, అజుడు, దశరథుడు, శ్రీరాముడు మొదలయిన వారంతా జన్మించారు.

ఇలకూ(సుద్యుమ్నుడు) బుధునకూ జన్మించిన పురూరవుడు చంద్రవంశానికి మూలపురుషుడయినాడు. ఆ వంశం కూడా అభివృద్ధి చెందింది.

## సుకన్య

వైవస్వతమనువు కుమారుడయిన శర్యాతి వేదార్థతత్త్వవిదుడు. అతనికి ఓ కుమార్తె జన్మించింది. ఆమె పేరే సుకన్య. శర్యాతి సుకన్యను వెంటబెట్టుకుని, ఒకనాడు వనవిహారానికి బయలుదేరాడు. చ్యవనమహాముని ఆశ్రమాన్ని సందర్శించాడు. తండ్రిని వదలి, సుకన్య ముందుకు పరుగుదీసింది. చెట్లు, పొదరిళ్ళ మధ్య విహరిస్తూ ఒక చోట ఓ పుట్టను చూసిందామె. ఆ పుట్టలో మిణుగురుల్లా మెరుస్తూ రెండు జ్యోతులు కనిపించాయి. అవేమిటో? వాటిని తెలుసుకోవాలనుకున్నది సుకన్య. పక్కన పడి ఉన్న ఓ ముల్లు తీసుకుని, జ్యోతులను పొడిచి చూసింది. పొడిచిన మరుక్షణం ఆ జ్యోతులు రక్తాన్ని స్రవించసాగాయి. సుకన్యకి ఏదీ అంతుచిక్కలేదు. భయం కలిగిందామెకు. ఇంతలో శర్యాతికీ, అతని వెన్నంటి వచ్చిన పరివారానికీ మలమూత్రాలు నిలచిపోయాయి. అడ్డగించినట్టుగా ఆగిపోయాయి. ఎందుకిలా జరిగిందన్నది విచారించాడు శర్యాతి. మాకు తెలియదంటే మాకు తెలియదని అంతా చేతులు జోడించారు.

సుకన్య అప్పుడు కలుగజేసుకుని, ముల్లు తీసుకుని, పుట్టలో పొడిచిన సంగతంతా వివరించింది. ఎంత పని చేశావన్నాడు శర్యాతి. తలపట్టుకున్నాడు. జరిగిందేమిటంటే...భార్గవ మునీంద్రుడు చ్యవనుడు, తపస్సు చేసుకుంటున్నాడు. అతని చుట్టూ పుట్ట పెరిగింది. ఆ పుట్టలోంచి జ్యోతుల్లా కనిపించినవి అతని కళ్ళే! అవి కళ్ళని తెలియక సుకన్య ముల్లుతో వాటిని గుచ్చింది. దాని ఫలితమే రాజుకీ, పరివారానికీ ఆ దుస్థితి.

చేసిన తప్పిదానికి మహాముని ఎలా ఆగ్రహిస్తాడోనని భయపడ్డాడు శర్యాతి. తన కూతురు తప్పు క్షమించమని చ్యవనుని ముందు మోకరిల్లాడతను. క్షమించాలంటే సుకన్యను ఇచ్చి తనకి వివాహం చెయ్యమన్నాడు చ్యవనుడు. తప్పకుండా అన్నాడు శర్యాతి. జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా సుకన్యను చ్యవనునికి సమర్పించి, శర్యాతి నిష్క్రమించాడక్కణ్ణుంచి.

## భక్త అంబరీష

భర్త చ్యవనమహామునిని భక్తిగా సేవించసాగింది సుకన్య. చ్యవనముని మహాకోపిష్ఠి. జవసత్వాలు ఉడిగిన వృద్ధుడు. తనేమో యౌవనంలో ఉన్న సుందరాంగి. అయినా సుకన్య ఏనాడూ ఆ విషయమై విచారించలేదు.

కొన్నాళ్ళు గడిచింది.

ఒకనాడు దేవవైద్యులు అశ్వినులు, చ్యవనముని ఆశ్రమాన్ని సందర్శించారు. వారిని భక్తిప్రపత్తులతో ఆహ్వానించి పూజించాడు చ్యవనముని. నాటికి అశ్వినీదేవతలకు సోమపానంలో భాగం లేదు. వారికి అందులో భాగాన్ని కల్పిస్తానన్నాడు చ్యవనుడు. ప్రతిఫలంగా తనకు సౌందర్యాన్నీ, యౌవనాన్నీ ప్రసాదించమని వేడుకున్నాడు. అశ్వినీదేవతలు అందుకు సమ్మతించారు. ఆశ్రమానికి సమీపంలో సిద్ధసరస్సును సృజించారు. ఆ సరస్సులో తమతో పాటు చ్యవనమహర్షిని కూడా మునిగి తేలమన్నారు. నీటిలో మునిగి మహర్షి తేలేసరికి, అతనికి యౌవనం, సౌందర్యం ప్రాప్తించాయి. దివ్యపురుషడయిపోయాడతను. అయితే చిత్రంగా అశ్వనీదేవతలు ఇద్దరూ, చ్యవనమహర్షీ ముగ్గురూ కూడా ఒకే రూపంతో సాక్షాత్కరించడంతో వారిలో తన భర్త ఎవరన్నదీ గుర్తించలేకపోయింది సుకన్య. తన భర్తను చూపమని అశ్వనీదేవతల్ని వేడుకుందామె. సుకన్య పతివ్రతాధర్మానికి మెచ్చి, ఆమె భర్తను చూపించారు అశ్వనీదేవతలు. అలా నవమన్మథుడై సుకన్యతో సర్వసుఖాలూ అనుభవించసాగాడు చ్యవనుడు.

ఇంతలో సుకన్య తండ్రి శర్యాతి ఓ యజ్ఞాన్ని తలపెట్టాడు. ఆ యజ్ఞానికి కూతుర్నీ, అల్లుణ్ణీ ఆహ్వానించేందుకు ఆశ్రమానికి చేరుకున్నాడు. ఆశ్రమంలో సుకన్య చెంతగా వృద్ధుడు చ్యవనుడు లేకుండా ఎవరో నవమన్మథుడులాంటి యువకుడు ఉండడాన్ని గమనించి, కూతుర్ని అనుమానించాడతను. భర్త చ్యవనుణ్ణి విడిచిపెట్టి సుకన్య ఎవరో పరపురుషుణ్ణి మోహిస్తున్నదని ఆగ్రహించాడు. వంశానికి తీరని కళంకం తెచ్చిపెట్టిందని కూతుర్ని అనరాని మాటలు అన్నాడతను. అప్పుడు చేతులు జోడించి తండ్రికి నమస్కరించింది సుకన్య. జరిగిందంతా చెప్పుకొచ్చింది. అశ్వనీదేవతల అనుగ్రహంతో తన భర్త చ్యవనుడే ఇలా యౌవనవంతు డయ్యాడన్నది. ఈ సుందరాకారుడు చ్యవనుడే అన్నది. సంతోషించాడు శర్యాతి. తాను వచ్చిన విషయం చెప్పి,

అల్లుణ్ణీ, కూతుర్నీ వెంటబెట్టుకుని బయల్దేరాడు శర్యాతి. మామగారి యజ్ఞాన్ని దగ్గరుండి నిర్వహించాడు చ్యవనుడు. అప్పుడు ఇచ్చిన మాటప్రకారం అశ్వనీదేవతలకు సోమపానంలో భాగాన్ని కల్పించాడు. వారికి సోమపానంలో భాగాన్ని కల్పించినందుకు చ్యవనుడంటే ఇంద్రుడికి కోపం కలిగింది. ఆ కోపంతో చ్యవనుణ్ణి అంతమొందించేందుకు అతనిపై వజ్రాయుధాన్ని ఎత్తాడు ఇంద్రుడు. తనపై ఎత్తిన వజ్రాయుధాన్నీ, ఇంద్రుని చేతినీ స్తంభింపజేశాడు చ్యవనుడు. తన తపఃప్రభావంతో ఆచేతనుల్ని చేశాడు వాటిని. ఇంద్రుడు తప్పయిపోయిందని తల వంచుకుంటే అప్పుడు మళ్ళీ చలనాన్ని కలిగించి, ఇంద్రుణ్ణి క్షమించాడు చ్యవనుడు.

శర్యాతి కుమారుడు ఆనర్తుడు. అతని కుమారుడే రైవతుడు. ఈ రైవతుడే సముద్రమధ్యంలో 'కుశస్థలి' అని గొప్ప నగరాన్ని నిర్మించాడు. ఈతనికి నూరుగురు కుమారులూ, ఓ కూతురూ జన్మించారు. ఆ కుమార్తె పేరే రేవతి. ఆ కుమార్తెకు తగిన వరుణ్ణి వెదుకుతూ బ్రహ్మలోకానికి చేరుకున్నాడు రైవతుడు. ఆ సమయంలో బ్రహ్మ, సభ తీర్చి గంధర్వగానాన్ని వింటున్నాడు. గానం పూర్తయి, సభ ముగిసేంత వరకూ నిరీక్షించాడు రైవతుడు. సభ పూర్తయింది. బ్రహ్మకు నమస్కరించాడు రైవతుడు. తన కుమార్తెకు తగిన వరుని చూపించమని ప్రార్థించాడు. సమాధానంగా ముందు సన్నగా నవ్వి తర్వాత ఇలా అన్నాడు బ్రహ్మ.

''నువ్వు భూలోకంలో బయల్దేరి ఇక్కడకి చేరుకునేంతలో ఇరవై ఏడు చాతుర్యుగాలు గడచిపోయాయి. ఇప్పుడు నీ పుత్ర పౌత్రాదులూ, బంధువులూ ఎవరూ భూలోకంలో లేరు. అయితే ఆదిశేషుని అంశతో భూలోకంలో బలరాముడు ఉన్నాడు. అతనికి నీ కుమార్తెను ఇచ్చి వివాహం జరిపించు.''

బ్రహ్మ ఆదేశానుసారం రేవతిని వెంటబెట్టుకుని భూలోకానికి చేరుకున్నాడు రైవతుడు. బలరామునికి రేవతినిచ్చి వివాహం చేశాడు. అనంతరం తపోవనాలకు తరలిపోయాడు.

## అంబరీషుడు

నభగుడు వైవస్వతమనువు కుమారులలో ఒకడు. ఈ నభగునికి నాభాగుడు జన్మించాడు. నాభాగుడు గొప్ప బ్రహ్మజ్ఞాని. మహావిద్వాంసుడు. ఈ నాభాగుని పుత్రుడే అంబరీషుడు. హరి భక్తాగ్రేసరులలో అంబరీషుడు కూడా ఒకడు. అతని చరిత్ర జగత్ప్రసిద్ధం.

సప్తద్వీపాలతో భూమండలం అంతటికీ అంబరీషుడు ప్రభువైనప్పటికీ రాజ్యభోగాలను అతను ఆశించలేదు. ఐహికసుఖాలను తృణప్రాయంగా త్యజించాడు. హరిస్మరణ తప్ప అంబరీషునికి మరొక ధ్యాసే ఉండేది కాదు. హరిని పూజిస్తూ, హరికథలు వింటూ హరిభక్తులను పూజించడమే అతని దినచర్య అయింది. హరికి ఇష్టమైన వ్రతాలూ, దానధర్మాలూ ఎన్నో చేశాడు అంబరీషుడు. చేసిన ఆ వ్రతాలూ, దానధర్మాల్లో ఏమాత్రం స్వార్థచింతనను కనబరిచేవాడు కాదు. అతనికి ఏకాదశీవ్రతం అంటే మహా ఇష్టం. ఏకాదశినాడు ఉపవాసం చేయడం, హరిని మనసారా పూజించడం, ద్వాదశినాడు హరిభక్తులకు అన్నదానం చేయడం అంబరీషునికి పరిపాటి. అతన్ని అన్ని విధాలా అనుసరించేది భార్య. ఆమె మహాపతివ్రత. హరిని అనుక్షణం ఆరాధించేదామె. అంబరీషుని భక్తిని మెచ్చుకున్నాడు శ్రీహరి. అతనికి భీతరక్షణమూ, శత్రుశిక్షణమూ చేసే సుదర్శన చక్రాన్ని బహూకరించాడు.

అంబరీషుడు సతీసమేతంగా ద్వాదశీవ్రతాన్ని ఆచరిస్తూ ఏడాది పాటు మహానిష్ఠ చేపట్టాడు. వ్రతం ముగిసింది. కార్తీకమాసంలో రాత్రి ఉపవాసం చేసి, మర్నాడు కాళిందీనదిలో స్నానం చేశాడు. తర్వాత మధువనానికి చేరుకుని, శ్రీహరిని భక్తితో పూజించి, బ్రాహ్మణులను గోదాన, భూదాన, హిరణ్య, వస్త్రదానాలతో సంతృప్తిపరచాడు. సంతర్పణ చేశాడు. భోజనానికి కూర్చున్నాడు. సరిగ్గా అదే సమయానికి దుర్వాసుడు వచ్చాడక్కడికి. దుర్వాసమహాముని సంగతి తెలిసిందే! అతను మహాకోపిష్టి. ఏ చిన్న తప్పు జరిగినా క్షమించడు. శపిస్తాడు. దుర్వాసుణ్ణి చూస్తూనే విస్తరి ముందునుంచీ లేచి నిల్చున్నాడు అంబరీషుడు. అతనికి ఎదురేగి అర్ఘ్యపాద్యాలు సమర్పించాడు. భోజనం చేయమని ప్రార్థించాడతన్ని. సరేనన్నాడు దుర్వాసుడు. యమునానదికి వెళ్ళి వస్తానన్నాడు. వెళ్ళిపోయాడక్కణ్ణుంచి. యమునాతీరానికి చేరుకున్న దుర్వాసుడు, మాధ్యాహ్నికక్రియలు ఆచరించి, ఆ తర్వాత ధ్యానంలో నిమగ్నమయిపోయాడు. యమునానదికి వెళ్ళిన మహర్షి ఎంతకీ రాకపోయేసరికి ఆందోళన చెందాడు అంబరీషుడు. ద్వాదశఘడియలు వెళ్ళిపోతున్నాయి. ఆ ఘడియల్లోనే తను భోజనం చెయ్యాలి. చేయకపోతే వ్రతఫలితం దక్కదు. ఫలితం కోసం భోజనం చేస్తే, మహాముని భోజనం చేయకుండా తను చేయడం తప్పు. పాపం కూడా. ఏం చేయాలో పాలుపోలేదు అంబరీషునికి. బాగా ఆలోచించాడు. చివరకి ధర్మచ్యుతి కలగకుండా నీరు తాగి, ముని రాకకోసం నిరీక్షించసాగాడు. దుర్వాసుడు వచ్చాడప్పుడు. వస్తూనే అంబరీషుడు నీరు తాగి కడుపు నింపుకున్నాడని తెలుసుకున్నాడు. భోజనానికి పిలిచి, తను రాకుండానే నీరు తాగాడని, తనని అవమానించాడని ఆగ్రహించాడు.

''అతిథిని అవమానించినందుకు తగిన శిక్ష అనుభవించు'' అన్నాడు దుర్వాసుడు. తన జడను ఒకదాన్ని పెరికి, దానిని అంబరీషునిపై ప్రయోగించాడు. జడ జ్వాలారూపాన్ని ధరించి, అంబరీషుని దహించేందుకు ముందుకు ఉరికింది. చేసేది లేక హరిధ్యానంలో మునిగిపోయాడు అంబరీషుడు. అతన్ని రక్షించేందుకు అగ్నిజ్వాలను ఎదుర్కొన్నది సుదర్శనచక్రం. నిర్మూలించింది దానిని. తర్వాత దుర్వాసుణ్ణి సంహరించేందుకు అతని మీదికి దూసుకు వెళ్ళింది. ప్రాణాన్ని కాపాడుకోవడానికి నలుదిక్కులా పరుగుదీశాడు దుర్వాసుడు. అతను ఎటు పరుగుదీస్తే అటుగా వెంటాడసాగింది చక్రాయుధం. ముల్లోకాలూ తిరిగాడు దుర్వాసుడు. అతన్ని వదలిపెట్టలేదు చక్రం. దిక్పాలకుల్ని వేడుకున్నాడు. చక్రాయుధం నుండి తనని రక్షించమన్నాడు దుర్వాసుడు. తమ వల్ల కాదన్నారు వారు. బ్రహ్మను ఆశ్రయించాడు. శివుణ్ణి ఆశ్రయించాడు. చక్రాయుధాన్ని ఆపడం తమ వల్ల కాదన్నారు వారు. ఆఖరికి శ్రీహరినే ఆశ్రయించాడు దుర్వాసుడు. రక్షించమని చేతులు జోడించాడు.

''మహర్షీ! నేను భక్తపరాధీనుణ్ణి. నాకంటే నా భక్తులే బాగా ప్రభావాన్ని కలిగి ఉంటారు. నిన్ను కాపాడగలిగేది నా భక్తుడేకాని నేను కాదు. నువ్వు అంబరీషుణ్ణే శరణు వేడుకో! ఆ భాగవతోత్తముడే నిన్ను కాపాడతాడు.'' అన్నాడు శ్రీహరి. దుర్వాసుడు వెనుతిరిగాడు. అంబరీషుణ్ణి ఆశ్రయించాడు. తన అపచారాన్ని మన్నించమన్నాడు. అంబరీషుడు చక్రాయుధాన్ని అనేక విధాల స్తుతించాడు. మహామునిని కాపాడమని ప్రార్థించాడు. శాంతించింది చక్రాయుధం. దుర్వాసుణ్ణి విడిచిపెట్టింది. ఊపిరి పీల్చుకున్న దుర్వాసుణ్ణి భోజనానికి ఆహ్వానించాడు అంబరీషుడు. అతనికి భోజనం పెట్టి, నమస్కరించాడు.



చక్రాయుధం తరుముతూంటే దుర్వాసుడు ముల్లోకాలూ తిరిగి, మళ్ళీ అంబరీషుణ్ణి చేరుకునేటప్పటికి ఒక సంవత్సరకాలం పట్టింది. ఈ సంవత్సరం అంతా అంబరీషుడు ఒట్టి నీటినే ఆహారంగా స్వీకరించి ప్రాణాలు నిలుపుకున్నాడు. దుర్వాసముని భోజనం చేసిన తర్వాతే అతను భోజనం చేశాడు.

హరిని ధ్యానిస్తూనే రాజ్యపాలన చేశాడు అంబరీషుడు. ఆఖరికి ఆ హరిని ధ్యానించేందుకు రాజ్యాన్ని కుమారులకు అప్పగించి, తపోవనాలకు తరలిపోయాడు.

### మాంధాత

సూర్యవంశంలో అనేక మంది మహాపురుషులు జన్మించారు. వారంతా అవిచ్ఛిన్నంగా రాజ్యపాలన చేసి ప్రఖ్యాతి చెందారు. వారిలో వైవస్వతమనువు కుమారుడు ఇక్ష్వాకు, శ్రీరాముని వంశానికి మూలపురుషుడు. వైవస్వతుడు తుమ్మగా అతని ముక్కు నుండి ఇక్ష్వాకు పుట్టాడంటారు. ఇక్ష్వాకునికి నూరుమంది కుమారులు. వీరంతా భూమిని మండలాలుగా విభజించుకుని పాలించారు. ఈ వంశలోని వాడే మాంధాత.

మహామహా చక్రవర్తుల్లో చెప్పుకోదగినవాడు మాంధాత. ఇతని జన్మవృత్తాంతం చిత్రమయినది. మాంధాత తండ్రి యువనాశ్వుడు. ఇతనికి నూరుగురు భార్యలు. అయినా ఎవరికీ సంతానం లేదు. అప్పుడు పుత్రకామేష్ఠి చేశాడతను. యజ్ఞం జరుగుతున్న రోజుల్లో ఓ రాత్రి యువనాశ్వునికి చెప్పలేనంత దాహం వేసింది. దాంతో యజ్ఞకలశంలోని మంత్రజలాన్ని తాగేసి, దాహాన్ని తీర్చుకున్నాడతను. మర్నాడు మునులు కలశంలోని మంత్రజలం కోసం చూస్తే అందులో నీటిబొట్టు కూడా లేదు. ఆందోళన చెందారంతా. తర్వాత దూరదృష్టితో జరిగిందంతా తెలుసుకున్నారు. అంతా దైవనిర్ణయం అనుకున్నారు. మంత్రజలాన్ని తాగిన ఫలితంగా యువనాశ్వుని పొట్ట చీల్చుకుని ఒక బాలుడు బయటపడ్డాడు. తల్లికి పుట్టి ఉంటే పాలు ఉండేవి. తండ్రికి పుట్టాడు ఆ బాలుడు. దాంతో వాడికి పాలు కరవయ్యాయి. పాలు లేక ఆకలిని తట్టుకోలేక ఏడవసాగాడు. అప్పుడు ఇంద్రుడు వచ్చాడక్కడకి. పిల్లాణ్ణి ఓదార్చాడు. 'నా వేలు కుడువు' అన్న అర్థంలో 'మాంధాతా' అన్నాడు. తన తర్జని పిల్లాడి నోటికి అందించాడు ఇంద్రుడు. దానిని కుడిచి పిల్లాడు మహా బలవంతుడయ్యాడు. వృద్ధి చెందాడు. అందుకే అతనికి 'మాంధాత' అన్న పేరు స్థిరపడింది. పొట్ట పగిలినప్పటికీ యువనాశ్వుడు మరణించలేదు. దేవతలు, మునుల అనుగ్రహంతో అతను బతికి బట్టకట్టాడు.

మాంధాతకు ఎదురులేకపోయింది. అతను పన్నెండవ యేటనే పట్టాభిషిక్తుడై, సమస్తదేశాల రాజులనూ జయించి, భూమండలాన్నంతా ఎదురులేకుండా పాలించాడు. మహా బలవంతుడయిన రావణాసురుణ్ణి ఈ మాంధాతే యుద్ధంలో ఓడించి బంధించాడు.

మాంధాత భార్య బిందుమతి, ఈమె శశిబిందు కుమార్తె. వీరికి పురుకుత్సుడు, అంబరీషుడు, ముచికుందుడు ముగ్గురు కుమారులు జన్మించారు. వీరిలో ముచికుందుడు మహాయోగి అయినాడు. మాంధాతకు అయిదువందల మంది కుమార్తెలు కూడా జన్మించారు. వారంతా సౌబరి అనే మునిని పెళ్ళి చేసుకున్నారు.

మాంధాత చాలా యజ్ఞాలు చేశాడు. దేవతలనూ, మునులనూ సంతృప్తిపరచాడు. అలా శ్రీహరి అనుగ్రహం సంపాదించాడు.

# త్రిశంకుస్వర్గం

మాంధాత కుమారుడు పురుకుత్సుడు. అతను నాగకన్య నర్మదను ప్రేమించాడు. ఆమె కోసం రసాతలంపై దండెత్తి, అక్కడి గంధర్వులను వధించాడు. తన ప్రేమనీ, పరాక్రమాన్నీ కథగా విన్నవారికి సర్పభయం ఉండదన్న వరాన్ని పొందాడతను. ఆ పురుకుత్సుని వంశానికి చెందిన

వాడే సత్యవ్రతుడు. వివాహిత అయిన ఓ స్త్రీని అతను బలవంతంగా ఎత్తుకొచ్చాడు. అది తండ్రి త్రిధన్వుడికి నచ్చలేదు. కోపగించుకున్నాడు. పట్టణం నుంచి బహిష్కరించాడతన్ని.

''పట్టణం వదలి వెళ్ళిపొమ్మంటున్నావు, ఎక్కడికి పోయేది?'' తండ్రిని అడిగాడు సత్యవ్రతుడు.

''ఎక్కడికి పోతావో పో, కుక్కమాంసం తినే చండాలులలో కలిసిపో'' అన్నాడు త్రిధన్వుడు.

సత్యవ్రతుడు పట్టణం వదలి వెళ్ళిపోయాడు. తర్వాతి కాలంలో త్రిధన్వుడి రాజ్యంలో పన్నెండు సంవత్సరాలు వర్షాలు లేక, తీవ్రకరువు ఏర్పడింది. అప్పుడు విశ్వామిత్ర మహర్షి కుటుంబం కూడా అక్కడే నివసిస్తూ ఉన్నది. తిండి లేక మహర్షీ, మహర్షి కుటుంబమూ అల్లాడిపోయింది. ఆకలికి తాళలేని విశ్వామిత్రుడు, తన కుమారుణ్ణి పురవీధులలో ఊరేగిస్తూ ఇలా ప్రార్థించాడు.

''ఎవరయినా నా కుమారుణ్ణి తీసుకుని, బదులుగా నూరు ఆవుల్ని ఇవ్వండి, లేదంటే నా కుటుంబాన్ని అయినా పోషించండి.''

ఎంత ప్రార్థించినా మహర్షి కుమారుణ్ణి తీసుకునేందుకుగాని, అతని కుటుంబాన్ని పోషించేందుకుగాని ఎవరూ ముందుకు రాలేదు.

కరువుతో అల్లాడిపోతున్న ప్రజల్నీ, రాజ్యాన్నీ కంటికి రెప్పలా కాపాడుతూ రాసాగాడు వశిష్ఠుడు. రాజు త్రిధన్వుడికి అతను చేదోడు, వాదోడయ్యాడు. తండ్రి తనని పట్టణం నుండి బహిష్కరించినప్పుడు వశిష్ఠుడు వారించలేదనీ, తనని సమర్థించలేదనీ సత్యవ్రతుడు, వశిష్ఠునిపై కోపాన్ని పెంచుకున్నాడు. ఆ కోపంతో విశ్వామిత్రుని చేరదీశాడు. అతని కుటుంబాన్ని పోషించసాగాడు. వశిష్ఠుని గోవుల్ని చంపి, ఆ  గోవుల్ని విశ్వామిత్రునికి ఆహారంగా అందజేద్దామనుకున్నాడు సత్యవ్రతుడు. గోవుల్ని చంపాడు. కాని, ఆకలిగా ఉండడంతో వాటిని తానే తినేశాడు. అది వశిష్ఠుడు గ్రహించాడు. ఆగ్రహోదగ్రుడయ్యాడు.

''ఇంతకు ముందు చేయరాని పని చేసి, నీ తండ్రి త్రిధన్వుడికి పెద్ద కష్టం కలిగించావు. ఇప్పుడు నా గోవుల్నే వధించి మహాపాపానికి ఒడిగట్టావు. గోవుని చంపి పాపాన్ని మూటగట్టుకోవడమే కాదు, అప్రోక్షిత మాంసాన్ని భక్షించావు. మూడు పాపాలు చేశావు. మరో మాటగా చెప్పాలంటే మూడు రకాల శంకువులు కల్పించుకున్నావు. త్రిశంకుడివి నువ్వు'' అన్నాడు వశిష్ఠుడు. సత్యవ్రతుణ్ణి చీదరించుకుని అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. ఆ క్షణం నుంచి సత్యవ్రతుని పేరు 'త్రిశంకుడు' అయింది. అటు తండ్రి మాట ఫలించడంతోనూ, ఇటు వశిష్ఠుని శాప కారణంగానూ త్రిశంకునికి చండాలత్వం ప్రాప్తించింది.

విశ్వామిత్రుణ్ణి ఆశ్రయించాడు త్రిశంకుడు. జరిగిందంతా చెప్పాడు. తన చండాలత్వాన్ని పోగొట్టమని బ్రతిమలాడాడు. బొందితో స్వర్గానికి కూడా పోయేట్టుగా సహకరించమన్నాడు. ఆలోచించాడు విశ్వామిత్రుడు. అతను చేసిన మూడు పాపాల్లో ఒక పాపం తన కోసం చేసినది. పైగా తన కుటుంబాన్ని అతనే పోషిస్తున్నాడు. ఆ కృతజ్ఞతో త్రిశంకుణ్ణి సశరీరంగా స్వర్గాన్ని పంపేందుకూ, అతని చండాలత్వాన్ని పోగొట్టేందుకూ సిద్ధమయ్యాడు. ముందుగా త్రిశంకుని చేత గొప్ప యాగం చేయించాడు. ఆ యాగానికి వశిష్ఠుడు రాలేదు. వశిష్ఠుని సమర్థించే గొప్ప గొప్ప మహర్షులు కూడా ఎవరూ రాలేదు. అయినా ఆందోళన చెందలేదు విశ్వామిత్రుడు.

తానొక్కడే అన్నీ అయ్యి త్రిశంకుని చేత యాగాన్ని పూర్తి చేయించాడు. యాగానంతరం తన తపస్సు అంతా ధారబోసి, త్రిశంకుణ్ణి సశరీరంగా స్వర్గానికి పంపించాడు. త్రిశంకుడు పాపి. పాపులకు స్వర్గప్రవేశం లేదు. ఇంద్రుడు అడ్డుకున్నాడతన్ని. త్రిశంకుణ్ణి స్వర్గం నుంచి కిందకి పడదోశాడు. త్రిశంకుడు తల కిందులుగా స్వర్గం నుంచి కిందికి పడిపోసాగాడు. ప్రాణభయంతో రక్షించమని విశ్వామిత్రుణ్ణి వేడుకున్నాడు. కిందకి పడిపోతున్న త్రిశంకుణ్ణి చూసి, జాలిపడ్డాడు విశ్వామిత్రుడు. తన తపోమహిమతో త్రిశంకుణ్ణి భూమికీ–అకాశానికీ మధ్య అంతరిక్షంలో ఒక ప్రత్యేకస్థానంలో నిలిపాడు. కిందపడిపోకుండా ఆపాడతన్ని. ఆ స్థలాన్నే 'త్రిశంకుస్వర్గం'గా వ్యహరిస్తున్నారు.

## హరిశ్చంద్రుడు

త్రిశంకుని కొడుకే హరిశ్చంద్రుడు. అయోధ్యకు రాజు అతను. చంద్రమతి అతని భార్య. హరిశ్చంద్రుని కథ మార్కేండేయపురాణంలో విపులంగా ఉన్నది. ఒకనాడు ఇంద్రసభలో సత్యాన్ని నమ్ముకున్నవాడూ, ఎల్లప్పుడూ సత్యాన్నే పలికేవాడూ ఎవరన్నది చర్చనీయాంశ మయింది. వశిష్ఠుడు అప్పుడు హరిశ్చంద్రుడు అని చెప్పాడు. వశిష్ఠుని ప్రతి మాటనీ ఖండించడమే విశ్వామిత్రుని అలవాటు. కాదన్నాడతను. అవును, కాదంటూ పెద్ద వాగ్యుద్ధం జరిగింది ఇద్దరికీ. హరిశ్చంద్రుడు ఆడిన మాట తప్పడన్నాడు వశిష్ఠుడు. తప్పుతాడన్నాడు విశ్వామిత్రుడు. తప్పిస్తానన్నాడు. నీ వల్లకాదు అన్నాడు వశిష్ఠుడు. నా వల్లే అవుతుందన్నాడు విశ్వామిత్రుడు. ఇద్దరూ పందెం వేసుకున్నారు. గెలుపు ఓటములు తేల్చుకుందామన్నారు.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని సందర్శించాడు. తను ఓ యజ్ఞం చేస్తున్నానని, దానికి చాలా ధనం కావాలని అడిగాడు. ఇస్తానన్నాడు హరిశ్చంద్రుడు. ఇప్పుడు వద్దు. అవసరం అయినప్పుడు తీసుకుంటాను. మాట తప్పవు కదా అన్నాడు విశ్వామిత్రుడు. తప్పనన్నాడు హరిశ్చంద్రుడు. విశ్వామిత్రుడు వెళ్ళిపోయాడక్కణ్ణుంచి.

ఒకనాడు క్రూరమృగాలను వేటాడేందుకు అడవికి వెళ్ళాడు హరిశ్చంద్రుడు. మృగాలను వేటాడి వేటాడి అలసిపోయాడు. ఒకచోట విశ్రాంతి తీసుకోసాగాడు. అప్పుడు అక్కడకి ఇద్దరు మాతంగకన్యలను పంపించాడు విశ్వామిత్రుడు. హరిశ్చంద్రుని అలసట తీర్చి, అతన్ని ఆనందింపజేయమన్నాడు. విశ్వామిత్రుడు చెప్పినట్టుగానే హరిశ్చంద్రుని అలసట తీర్చేందుకు మాతంగకన్యలు ఆడారు. పాడారు. అలసట తీర్చారు. తేరుకున్న హరిశ్చంద్రుడు, మాతంగకన్యలకు బహుమతి ఈయబోతే, ఆ బహుమతులు వద్దన్నారు వారు. మీరే మాకు కావాలన్నారు. మమ్మల్ని మీరు వివాహం చేసుకోవాలన్నారు. తప్పు అన్నాడు హరిశ్చంద్రుడు. ధర్మాన్ని తప్పను అన్నాడు. ఏకపత్నీవ్రతుణ్ణి అంటూ క్షమించమన్నాడు. అంతలో అక్కడకి విశ్వామిత్రుడు చేరుకున్నాడు. వలచి వచ్చిన కన్యలను కాదనకూడదన్నాడు. వివాహం చేసుకో అన్నాడు. బలవంతపెట్టాడు హరిశ్చంద్రుణ్ణి. కావాలంటే తన రాజ్యం యావత్తూ ఇస్తాను కాని, ఏకపత్నీవ్రతాన్ని విడచిపెట్టి, ధర్మానికి హాని చేయనన్నాడు హరిశ్చంద్రుడు. దొరికాడు అనుకున్నాడు విశ్వామిత్రుడు. రాజ్యాన్ని ధారబోయమన్నాడు. ధారబోశాడు హరిశ్చంద్రుడు. రాజ్యం యావత్తూ విశ్వామిత్రునికి ధారబోసి, కట్టుబట్టలతో, భార్య చంద్రమతి, పిల్లడు



లోహితాస్యుడుసహా నగరాన్ని విడచిపెట్టాడు. పొలిమేరలు దాటనే లేదు. ఎదురయ్యాడు విశ్వామిత్రుడు. అప్పుడు యజ్ఞానికి ఇస్తానన్న సొమ్ము సంగతి ఏమిటన్నాడు. ఆ విషయం తేల్చమన్నాడు. రాజునికాదు, రాజ్యం లేదు. అయినా ఆడిన మాట తప్పను. కొంచెం గడువియ్యండి, ఇస్తానన్న సొమ్ము తప్పకుండా ఇస్తానన్నాడు హరిశ్చంద్రుడు. విశ్వామిత్రుని చేతులు పట్టుకుని ప్రార్థించాడు. అంగీకరించాడు విశ్వామిత్రుడు. అయితే సొమ్మని వసూలు చేసుకుని వచ్చేందుకు అతని వెంట శిష్యుడు నక్షత్రకుణ్ణి పంపాడు విశ్వామిత్రుడు. నక్షత్రకుని సహా అరణ్యాలు పట్టాడు హరిశ్చంద్రుడు. ఆకలి, దాహం అంటూ నానారకాలుగా హరిశ్చంద్రుణ్ణి కష్టపెట్టాడు నక్షత్రకుడు. కట్టుకున్న భార్యనూ, కన్నకొడుకునీ జాగ్రత్తగా చూసుకోవడం కాదు,

తనని జాగ్రత్తగా చూడాలన్నాడు. చూడకపోతే బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటుందన్నాడు. హరిశ్చంద్రుణ్ణి హింసించసాగాడు నక్షత్రకుడు.

''ఈ హింసలు పడలేనంటే ఓ పని చెయ్యి, ఇస్తానన్న సొమ్ము ఇవ్వలేనని చెప్పు, వెళ్ళిపోతాను'' అన్నాడు. ఆ మాట అననన్నాడు హరిశ్చంద్రుడు. అసత్యం మాట్లాడనన్నాడు. సత్యం పలకడమే తన వ్రతం అన్నాడు.

''అయితే సొమ్ము చెల్లించు.'' అన్నాడు నక్షత్రకుడు. సొమ్ము చెల్లించేందుకు కాశీపట్టణానికి చేరుకున్నాడు హరిశ్చంద్రుడు. అక్కడ భార్య చంద్రమతిని కాలకౌశికునికి అమ్మాడు. నక్షత్రకునికి కొంత మొత్తాన్ని చెల్లించాడు. మిగిలిన మొత్తానికి తానే చండాలుడు వీరబాహునికి అమ్ముడుపోయాడు హరిశ్చంద్రుడు. భార్యను అమ్మినా, తనని తాను అమ్ముకున్నా హరిశ్చంద్రుని కష్టాలు తీరలేదు. ఇంకా రెట్టింపు అయ్యాయి.

ఇక్కడ చండాలుని సేవిస్తూ, కాటికాపరి అయ్యాడు హరిశ్చంద్రుడు. అక్కడ కాలకౌశికుని ఇంట్లో పరిచారిక అయింది చంద్రమతి. తల్లిసహా లోహితాస్యుడు కూడా ఇంటిపనీ, వంటపనీ చేయసాగాడక్కడ. ఒకనాడు లోహితాస్యుడు, దర్భలకై అడవికి వెళ్ళాడు. అక్కడ పాము కాటుకి మరణించాడు. కొడుకు మరణించాడని తెలిసినా, చేతినిండా పని ఉండడంతో పనంతా చేసి, ఆఖరికి అర్ధరాత్రివేళ అడవికి చేరుకుంది చంద్రమతి. కొడుకు మృతదేహాన్ని వెదకి వెదకి కనుక్కొంది. చేతుల్లోనికి తీసుకుని భోరుమంది. చాలాసేపు ఏడ్చింది. తర్వాత ఇలా అనుకున్నది. ఏడ్చి ఫలితం లేదు, ముందు ఈ మృతదేహాన్ని దహనం చేయాలి.

ఆ రాత్రివేళే శ్మశానానికి చేరుకున్నది చంద్రమతి. కొడుకు మృతదేహాన్ని దహనం చేసేందుకు పుల్లా పుడకా పేర్చుకున్నది. నిప్పుపెట్టేందుకు ప్రయత్నించిందో లేదో అడ్డుపడ్డాడు హరిశ్చంద్రుడు. కాటిసుంకం చెల్లించమన్నాడు. చిల్లిగవ్వ కూడా చేతిలో లేదని, కనికరించమని వేడుకున్నది చంద్రమతి. ఆమె మెడలో మంగళసూత్రాన్ని చూశాడు హరిశ్చంద్రుడు. దానిని అమ్మి సుంకం చెల్లించమన్నాడు. తన మాంగల్యం భర్తకి తప్ప వేరొకరికి కనిపించదు. దాంతో కాటికాపరి తన భర్త అని తెలుసుకున్నది చంద్రమతి. చనిపోయింది కొడుకు లోహితాస్యుడని భర్తకి తెలియజేసింది. లోహితాస్యుణ్ణి చూసి దుఃఖించాడు హరిశ్చంద్రుడు. కాస్సేపటికి తేరుకుని, దుఃఖిస్తున్న భార్యని ఓదార్చాడు. ఆ తర్వాత విధినిర్వహణ తప్పనంటూ సుంకం చెల్లించాల్సిందేనని పట్టుబట్టాడు. సుంకం కోసం మంగళసూత్రాన్ని అమ్మేందుకు ఆ రాత్రివేళే పట్టణానికి బయల్దేరింది చంద్రమతి. దోవలో మరో ఆపద వచ్చి పడిందామెకు.

కాశీరాజు కుమారుణ్ణి దొంగలు హత్య చేశారు. హత్యచేసి, అతని ఒంటి మీద నగలు దోచుకున్నారు. దోచుకుని పారిపోతుంటే వారిని వెంబడించారు రాజభటులు. తమను రాజభటులు వెంబడిస్తున్నారని తెలుసుకుని, వారి నుంచి తప్పించుకునేందుకు, దోవన పోతున్న చంద్రమతి చేతిలో దోచుకున్న సొమ్ములు ఉంచి, పరారయ్యారు దొంగలు. చేతిలో దొంగసొమ్ముని చూస్తూ అవాక్కయి నిల్చున్న చంద్రమతిని సమీపించారు రాజభటులు. తాము వెంబడించింది ఆమెనే అనుకుని, చంద్రమతే రాకుమారుణ్ణి హత్య చేసిందని భావించారు. ఆమెను పట్టుకున్నారు. రాజు ముందు దోషిగా నిలబెట్టారు. శిరచ్ఛేదన చేసి, చంద్రమతిని చంపమన్నాడు రాజు. చేసిన తప్పునకు అదే సరయిన శిక్ష అన్నాడు. శిక్షను అమలు చేసేందుకు చంద్రమతిని శ్మశానానికి తీసుకుని వచ్చారు

రాజభటులు. భార్య నిరపరాధి అని తెలుసు హరిశ్చంద్రునికి. అయినా రాజాజ్ఞ పాటించక తప్పదు. చంద్రమతి శిరచ్ఛేదన చేసేందుకు కత్తిని ఎత్తాడతను. ఎత్తిన కత్తి ఆ క్షణంలో పూలమాల అయింది. చంద్రమతి కంఠాన్ని అలంకరించింది. హరిశ్చంద్రుని సహా అంతా ఆశ్చర్యపోయారు. ఇంద్రాది దేవతలూ, వశిష్ఠుడూ, విశ్వామిత్రుడూ ప్రత్యక్షమయ్యారప్పుడు. ఎన్ని కష్టాలకు గురి చేసినా హరిశ్చంద్రుడు అబద్ధం ఆడలేదని, తానే పందెంలో ఓడిపోయానని ఒప్పుకున్నాడు విశ్వామిత్రుడు. వశిష్ఠుని ముందు తల వంచుకున్నాడు. లోహితాస్యుడు నిద్ర నుంచి మేల్కొన్నట్టుగా లేచి కూర్చున్నాడు. అలాగే కాశీరాజు కొడుకు మరణం, దొంగలు, దొంగసొత్తు అంతా పొగమంచులా వీడిపోయింది. అదంతా విశ్వామిత్ర సృష్టి అని తెలిసింది.

హరిశ్చంద్రుని సత్యనిష్ఠను దేవతలు మెచ్చుకున్నారు. పుష్పవర్షం కురిపించారు. గంధర్వులు ఆడిపాడి అలరించారు. మార్కేండేయపురాణంలో హరిశ్చంద్రుని కథ ఇంతే! అయితే ఈ కథకు భాగవతంలో మరికొన్ని విశేషాలు జోడించాడు వ్యాసమహాముని. ఆ విశేషాలు ఏమిటంటే... హరిశ్చంద్రుని సర్వస్వం హరించి అతన్ని నానా కష్టాలకూ గురి చేసినందుకు విశ్వామిత్రునిపై చెప్పలేనంత కోపాన్ని పెంచుకున్నాడు వశిష్ఠుడు. ఆ కోపంతో విశ్వామిత్రుణ్ణి గ్రద్దవు కమ్మని శపించాడు. విశ్వామిత్రుడు తక్కువ తినలేదు. వశిష్ఠుణ్ణి కొంగవు కమ్మని శపించాడు. అలా కొంగ, గ్రద్ద రూపాల్లో ఉండి, ఆ ఇద్దరూ అనేక సంవత్సరాలు పోరాడారు.

# సగరుల సాగరం

కొంగ, గ్రద్ద రూపాల్లో వశిష్ఠ విశ్వామిత్రుల పోరాటన్నే కాదు, హరిశ్చంద్రుని గురించి కూడా మరింత విపులంగా తన భాగవతంలో ఇలా చిత్రించాడు వ్యాసుడు.

సంతానలేమితో హరిశ్చంద్రుడు బాధపడుతుంటే అతన్ని నారదుడు కలిశాడు. సంతానం కోసం వరుణదేవుణ్ణి ప్రార్థించమని చెప్పాడు. నారదుడు చెప్పినట్టే చేశాడు హరిశ్చంద్రుడు. వరుణదేవుణ్ణి ప్రార్థించాడు. తనకు కొడుకు పుడితే ఆ బాలుణ్ణి పశువుగా తలచి, నరమేధంతో వరుణదేవుణ్ణి అర్చిస్తానని ప్రమాణం కూడా చేశాడు. వరుణదేవుడు అనుగ్రహించాడు. కొడుకు పుట్టాడు హరిశ్చంద్రునికి. అతని పేరు రోహితుడు. కొడుకు ముద్దుముచ్చట్లు చూస్తూ వరుణదేవునికి ఇచ్చిన మాటనూ, యాగాన్నీ మరచిపోయాడు హరిశ్చంద్రుడు. వరుణుడు వచ్చి అడిగినా ఏదో సాకు చెప్పి, యాగనిర్వహణను తప్పించుకోసాగాడు. ఇంతలో తనని బలిపశువుని చేసి, తండ్రి యాగం చేయనున్నాడనే సంగతి రోహితుడికి తెలిసింది. ప్రాణభయంతో ఆ పిల్లాడు అరణ్యాల్లోకి పారిపోయాడు. రోహితుని జాడ తెలియకపోవడం, హరిశ్చంద్రుడు యాగాన్ని నిర్వహించకపోవడంతో వరుణదేవునికి కోపం వచ్చింది. 'మహోదరం' వ్యాధితో బాధపడమని హరిశ్చంద్రుని శపించాడతను. బాధపడసాగాడు హరిశ్చంద్రుడు. తన కారణంగా తండ్రి రోగగ్రస్తుడయ్యాడని తెలిసి, రోహితుడు అయోధ్యకు బయల్దేరాడు. దోవలో వృద్ధ బ్రాహ్మణుని రూపంలో అతన్ని సమీపించాడు ఇంద్రుడు. విషయం అంతా తెలుసుకుని ఇలా ఉపదేశించాడు. ఓ ఏడాదిపాటు భూపర్యటనలో భాగంగా తీర్థయాత్రలు చేస్తే మేలు జరుగుతుందన్నాడు. రోహితుడు అలాగే చేశాడు. ఏడాది పాటు సర్వతీర్థాలూ సేవించి, అయోధ్యకు బయల్దేరాడు.

మళ్ళీ వృద్ధ బ్రాహ్మణుని రూపంలో ఇంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. తెలియనట్టుగా మళ్ళీ అంతా అడిగి తెలుసుకున్నాడు. తెలుసుకుని, మళ్ళీ మరో ఏడాదిపాటు ముందు చేసినట్టుగానే భూపర్యటన చేయమన్నాడు. రెండింతలుగా మేలు జరుగుతుందన్నాడు. అలాగే చేశాడు రోహితుడు. ఇంద్రుని ఆదేశానుసారం అలా ఆరేళ్ళు దేశసంచారంలో గడిపాడు రోహితుడు. ఆఖరికి ఆరవ ఏడు చివరి రోజుల్లో అజీగర్తుని కుమారుడు శునశ్శేపునితో అయోధ్యలో అడుగు పెట్టాడతను. శునశ్శేపుణ్ణి తండ్రికి సమర్పించి, అతనిని యజ్ఞపశువుని చేసి యాగాన్ని చెయ్యమన్నాడు రోహితుడు. హరిశ్చంద్రుడు అలాగే చేశాడు. వరుణుని తృప్తిపరిచాడు. మహోదరవ్యాధి నుండి బయటపడ్డాడు. హరిశ్చంద్ర యజ్ఞానికి బ్రహ్మాదిదేవతలు విచ్చేశారు. మునులూ, మహామునులు కూడా వేంచేశారు. హరిశ్చంద్రుని సత్యనిష్ఠను మెచ్చి, విశ్వామిత్రుడు అతనికి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించాడు. దాంతో హరిశ్చంద్రుడు బ్రహ్మజ్ఞాని అయి, రాజ్యసంపదలు త్యజించి తపోవనాలకు తరలిపోయాడు. కొన్నాళ్ళకు భౌతికదేహాన్ని వీడి, పరమపదం అందుకున్నాడు.

## సగరుడు

హరిశ్చంద్రుని కుమారుడు రోహితునకు జంపుడు జన్మించాడు. జంపుని కుమారుడు సుదేవుడు. అతనికి విజయుడు, విజయునికి రురుకు, అతనికి వృకుడు వరుసగా జన్మించారు. వృకుని కుమారుడు బాహుకుడు. ఆ బాహుకుని కుమారుడే సగరుడు. సూర్యవంశానికి వన్నె తెచ్చిన చక్రవర్తుల్లో సగరుడు ఒకడు.

తన రాజ్యాన్ని హైహయులు చేజిక్కించుకున్న మరుక్షణం భార్యా సమేతంగా బాహుకుడు అడవులకు తరలిపోయాడు. అక్కడే మరణించాడతను. భర్తతో పాటు భార్య సహగమనానికి సిద్ధపడింది. అయితే అప్పుడామె గర్భవతి. ఆ కారణంగా సహగమనం చేయరాదని ముని ఔర్వుడు వారించాడామెను. తన ఆశ్రమానికి తీసుకుని వెళ్ళి ఆదరించసాగాడు. కడుపులో బిడ్డతో ఔర్వుని ఆశ్రమంలో తలదాచుకున్న బాహుకుని భార్యనూ, ఆమె బిడ్డనూ బతకనీయ రాదనుకున్నారు ఆమె సవతులు. ఎట్టి పరిస్థితుల్లోనూ బిడ్డను కనరాదని, గరళాన్ని కలిపిన ద్రవాన్ని ఆమె చేత తాగించారు. సంగతి తెలుసుకున్న ఔర్వుడు ఆమె గర్భాన్ని కాపాడాడు. శిశువు మరణించకుండా చూశాడు. ప్రసవించిందామె. కుమారుణ్ణి కన్నది. గరంతో అంటే గరళంతో జన్మించాడు కాబట్టి ఆ పిల్లాడిని 'సగరుడు' అన్నారు. పెరిగి పెద్దవాడయ్యాడు సగరుడు. శస్త్రాస్త్రవిద్యలన్నీ సునాయాసంగా నేర్చాడు. శత్రురాజుల్ని ఓడించి, తండ్రి పోగొట్టుకున్న రాజ్యాన్ని తిరిగి సంపాదించాడు. చక్రవర్తిగా భూమండలాన్ని పాలించసాగాడు.

ఎన్నో యజ్ఞయాగాదులు చేసి, విష్ణుమూర్తిని ఆరాధించాడు సగరుడు. అనేక అశ్వమేధాలు కూడా చేశాడు.

సగరుడికి సుమతి, కేశి అని ఇద్దరు భార్యలు. సుమతికి అరవై వేలమంది పుత్రులు జన్మిస్తే, కేశికి అసమంజసుడు అని ఒకే ఒక కుమారుడు జన్మించాడు. వారంతా చిన్ననాటి నుండే అనేక దుర్మార్గాలకు ఒడిగట్టారు. సుమతి కుమారులు దేవతలనూ, మునులనూ అనేక విధాల హింసించసాగారు. వారి హింసలు తట్టుకోలేక దేవతలూ, మునులూ బ్రహ్మను ఆశ్రయించారు. కాపాడమని మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ ఇలా చెప్పాడు.

త్వరలో వారంతా కపిలమహామునికి అపకారం తలపెడతారు. అప్పుడు ఆ మహాముని కోపానికి నశించిపోతారు. అంత వరకు ఓపిక పట్టాలన్నాడు.

కేశి కుమారుడు అసమంజసుని ఆగడాలకు అంతులేకుండా పోయింది. ఆ పిల్లాడు అయోధ్యలో ఆడుకునే బాలకులందరినీ తీసుకుని వెళ్ళి సరయూనదిలో ముంచేసేవాడు. యోగబలంతో కొన్నాళ్ళకు మళ్ళీ తేల్చేవాడు. అంతటి దుర్మార్గుడికి యోగబలం ఏమిటని ఆశ్చర్యం కలుగుతోంది కదూ? దానికి ఓ కారణం ఉంది.

పూర్వజన్మలో అసమంజసుడు గొప్పయోగి. వైశ్యకులానికి చెందినవాడు. అయితే యోగభ్రష్టుడయినాడు. ఒకనాడతను అరణ్యంలో సంచరిస్తుండగా, పెద్ద ధనరాశి కనిపించిందతనికి. దానిని దోచుకోబోయాడు. అంతలో ఆ ధనరాశిని కాపలా కాస్తున్న భూతం ప్రత్యక్షమయి అతన్ని అడ్డగించింది. ఇలా అంది.

''ఈ ధనరాశి అంతా నాది. అయితే నీకివ్వడానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు. కాకపోతే నేను ఆకలి మీద ఉన్నాను, నా ఆకలి తీర్చు. ఒక గోవుని చంపి తీసుకుని రా! ఈ ధనరాశిని చేజిక్కించుకో.''

''ఇదిగో ఇప్పుడే తెస్తాను'' అన్నాడతను. ముందు ధనరాశిని చేజిక్కించుకున్నాడు. వెళ్ళిపోయాడు. వెళ్ళినవాడు తిరిగి రాలేదు. భూతానికి ఇస్తానన్న గోవుని ఇవ్వలేదు. చనిపోయాడు కొన్నాళ్ళకు. అతడే అసమంజసుడిగా పుట్టాడు. ఇచ్చిన మాట చెల్లించలేదన్న కోపంతో ఆ పిశాచం అసమంజసుణ్ణి ఆవహించసాగింది. పిశాచం ఆవహించినప్పుడే అసమంజసుడు, పిల్లల్ని సరయూనదిలో ముంచేయడం వంటి పిశాచకృత్యాలకు పాల్పడసాగాడు. రాకుమారుడు, పిల్లల్ని నదిలో ముంచేస్తున్నాడంటూ గుండెలు బాదుకుంటూ సగరుణ్ణి ఆశ్రయించారు ప్రజలు. అసమంజసుణ్ణి అదుపు చేయాలన్నారు. అప్పుడు సగరుడు, అసమంజసుణ్ణి నగర బహిష్కారం చేశాడు. పట్టణం నుంచి అతన్ని వెళ్ళగొట్టాడు. అరణ్యాల్లో ఉంటూ పిశాచంతో బాధలు పడుతూ అసమంజసుడు మరణించాడు ఆఖరికి. అతనికి అంశుమంతుడు అని ఓ కొడుకు పుట్టాడు. అతను బుద్ధిమంతుడు. దైవభక్తి కలవాడు.

అశ్వమేధయాగం చేస్తూ సగర చక్రవర్తి యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు. దాని రక్షణగా అరవై వేల మంది కుమారుల్ని పంపాడు. అశ్వాన్ని పట్టి నిలిపిన రాజుని ఓడించి రమ్మని చెప్పాడు. తండ్రి ఆజ్ఞను పాటించి కుమారులు అన్ని దేశాలూ తిరిగారు. అశ్వాన్ని పట్టి నిలిపిన రాజుల్ని ఓడించారు. ఆఖరికి ఆ యాగాశ్వం తీరాన పరిగెడుతూ సముద్రంలోకి ప్రవేశించింది. ఎప్పుడయితే అశ్వం ప్రవేశించిందో అప్పుడు ఆ సముద్రం అంతా ఇంకిపోయింది. అదే అదనుగా సగరపుత్రులను హతమార్చేందుకు ఇంద్రుడు, వాయుదేవుణ్ణి పిలిచాడు. పిలిచి, యాగాశ్వాన్ని చూపించి, దానిని తీసుకుని పోయి, రసాతలంలో తపస్సు చేసుకుంటున్న కపిలమహాముని ఆశ్రమంలో కట్టి వేయమన్నాడు. వాయుదేవుడు అలాగే చేశాడు. దాంతో యాగాశ్వం కనిపించలేదు. అశ్వం కోసం వెదకి వెదకి కనిపించకపోయేసరికి, అలసి సొలసి తండ్రిని సమీపించారు పుత్రులంతా. అశ్వం కనిపించలేదని, తక్షణకర్తవ్యం బోధించమని అడిగారు. అశ్వాన్ని తీసుకుని వచ్చేంతవరకూ పట్టణంలో అడుగుపెట్టరాదని ఆజ్ఞాపించాడు సగరుడు. పుత్రులందరినీ అక్కణ్ణుంచి వెళ్ళిపొమ్మన్నాడు. చేసేది లేక సగరపుత్రులంతా బయల్దేరి, మళ్ళీ యాగాశ్వం కోసం

వెదకసాగారు. సముద్రంలో ప్రవేశించినంతనే యాగాశ్వం కనిపించకుండా పోయింది. అంటే అశ్వం ఇంకిన సముద్రపు నేలలో ఉంటుందని భావించారు. అంతా సముద్రాన్ని తవ్వడం ప్రారంభించారు. రసాతలం వరకూ తవ్వారు. అప్పుడు అక్కడ ఈశాన్యదిక్కుగా తపస్సు చేసుకుంటున్న కపిలమహాముని వారికి కనిపించాడు. అతనికి సమీపంగా కట్టి వేసి ఉన్న యాగాశ్వం కూడా కనిపించింది. అశ్వాన్ని కపిలముని దొంగిలించాడని సగరపుత్రులనుకున్నారు. యోగసమాధిలో ఉన్న కపిలమునిని చంపేందుకు ముందుకు ఉరికారు.

''ఈ ముని పెద్ద దొంగ! మన యాగాశ్వాన్ని దొంగిలించాడు. ఇతన్ని క్షమించకూడదు. కొట్టండి, చంపండి'' అంటూ సగరపుత్రులంతా ఒక్కసారిగా కపిలమునిని చుట్టుముట్టారు. మారణాయుధాల్ని ఎక్కుపెట్టారు. ఆ కలకలానికి తపోభంగం కలిగింది. కళ్ళు విప్పి చూశాడు కపిలముని. ఆ చూపుల్లో అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లాయి. అరవైవేలమంది సగర పుత్రులూ ఆ జ్వాలలకు ఆహూతయిపోయారు. భస్మమయిపోయారు. బూడిదగుట్టలయ్యారు.

కపిలముని నేత్రాగ్నికి తన అరవై వేలమంది పుత్రులూ బూడిదయిపోయారని నారదుడు చెప్పగా తెలుసుకున్నాడు సగరుడు. బాధపడ్డాడు. అప్పుడు మనవడు అంశుమంతుణ్ణి పిలిచాడు. యాగాశ్వాన్ని తీసుకుని రమ్మని అతన్ని పంపాడు. తన పినతండ్రులు తవ్విన సముద్రమార్గం గుండా అంశుమంతుడు రసాతలానికి చేరాడు. అక్కడ బూడిదగుట్టల్నీ, వాటి సమీపంలో తపస్సు చేసుకుంటున్న కపిలమునినీ చూశాడతను. కట్టి వేసి ఉన్న యాగాశ్వాన్ని కూడా గమనించాడు. కపిలమునిని సమీపించాడు. చేతులు జోడించి నమస్కరించాడతనికి. అనేక విధాల స్తుతించాడు. అనుగ్రహించాడు కపిలముని. చల్లగా కళ్ళు తెరచి, మెల మెల్లగా ఇలా చెప్పాడు.

''యాగాశ్వాన్ని నిరభ్యంతరంగా తీసుకుని వెళ్ళు. నీ పినతండ్రులు పవిత్రులు కావాలంటే దానికి గంగాజలమే పరిష్కారం.''

కపిలునికి ప్రదక్షిణ నమస్కారం చేశాడు అంశుమంతుడు. యాగాశ్వాన్ని తీసుకుని బయల్దేరాడు. అశ్వాన్ని తాత సగరునికి అప్పగించాడు. యాగం పూర్తయిందప్పటికి. కొన్నాళ్ళకు రాజ్యభారాన్ని అంశుమంతుడికి అప్పగించి, తపోనిష్ఠలో తనువు చాలించాడు సగరుడు.

సగరపుత్రులు తవ్విన కారణంగా సముద్రానికి 'సాగరం' అని పేరు వచ్చింది. తన పినతండ్రులకు ఉత్తమగతులు కల్పించేందుకు అంశుమంతుడు అనేక సంవత్సరాలపాటు తపస్సు చేశాడు. అయితే అది సాధించకుండానే కాలధర్మం చెందాడు. అంశుమంతుడు కొడుకు దిలీపుడు కూడా గంగను రప్పించి, తన పితామహాదులకు ఉత్తమగతులు కల్పించాలని ఎంతగానో ప్రయత్నించాడు. అతని ప్రయత్నం కూడా ఫలించలేదు. చివరకి ఆ కార్యాన్ని దిలీపుని పుత్రుడు భగీరథుడు సాధించాడు.

## భగీరథుడు


ఎవరూ సాధించలేని గొప్ప కార్యాన్ని సాధించి ముల్లోకాల్లోనూ ప్రసిద్ధి చెందాడు భగీరథుడు. దివి నుండి భువికి గంగను తీసుకుని వచ్చింది అతనే! తన పితృదేవతలకు సద్గతి కల్పించాలని భగీరథుడు కఠోరమయిన తపస్సు చేశాడు. అతని తపస్సుకు దేవతలూ మునులూ ఆశ్చర్యపోయారు. ఆఖరికి గంగాదేవి ప్రత్యక్షమయింది. విషయం అడిగి తెలుసుకుంది. అప్పుడు ఇలా అంది.

''సరే, నీ కోరిక నేను నెరవేరుస్తాను. నీ పితృదేవతలకు సద్గతి కల్పిస్తాను. అయితే నేను స్వర్గలోకం నుంచి భూమి మీదకి వచ్చేటప్పుడు నా ప్రవాహవేగాన్ని తట్టుకునే మహనీయుడు కావాలి. లేకపోతే భూతలాన్ని చీల్చుకుని, నేను పాతాళంలోకి జారిపోతాను. నన్ను తట్టుకునే మహనీయుణ్ణి ముందు చూడు.''

''తప్పకుండా తల్లీ'' అన్నాడు భగీరథుడు.

''మరో విషయం. నేను భూమి మీద ఉంటే భూలోకంలోని పాపాత్ములంతా నాలో స్నానం చేసి, తమ పాపాలు నాకు అంటగడతారు. ఆ పాపాల్ని నేనెలా భరించేది?'' అడిగింది గంగ. ఆలోచించాడు భగీరథుడు. ఇలా అన్నాడు.

''నీ ప్రవాహవేగాన్ని తట్టుకునే మహనీయుడు శంకరుడు ఉన్నాడు. అతడు నిన్ను భరిస్తాడు. విష్ణుపాదోద్భూతమయిన నిన్ను పాపాలు అంటవు. నిప్పును చెదలు అంటుతాయా తల్లీ? దయచేసి నా ప్రార్థన ఆలకించి, భూలోకంలోకి దిగి రా.'' వేడుకున్నాడు భగీరథుడు.



అంగీకరించింది గంగ. తనని తట్టుకుని నిలబడే శంకరుని కోసం ముందు ప్రార్థించమంది. శంకరుని ప్రార్థిస్తూ కఠోర తపస్సు చేశాడు భగీరథుడు. అతని తపస్సును మెచ్చుకున్నాడు శంకరుడు. ప్రత్యక్షమయ్యి భగీరథుని అభీష్టాన్ని నెరవేర్చేందుకు సిద్ధమయ్యాడు.

## తారా శశాంకం

స్వర్గం నుంచి మహావేగంతో దూకుతూ వచ్చింది గంగ. శంకరుని శిరస్సున పడింది. భరించాడు శంకరుడు, తన జటాఝూటాన ధరించాడామెను. నాటి నుంచే శంకరుణ్ణి 'గంగాధరుడు' అని వ్యవహరించసాగారంతా.

శంకరుని శిరస్సు నుంచి జారి ప్రవహించసాగింది గంగ. రథాన్ని అధిరోహించి భగీరథుడు ముందు పరుగుదీస్తోంటే అతన్ని అనుసరించింది గంగ. హిమవత్పర్వతం నుంచి మహావాహినిగా భూలోకానికి వచ్చింది. భూలోకానికి వస్తూ వస్తూ జహ్నుముని యజ్ఞవాటికను ముంచి వేసింది గంగ. కోపం వచ్చింది మునికి. గంగను పుక్కిటపట్టాడు. వదలనని పట్టుబట్టాడు. అతన్ని ఎన్నో విధాల ప్రార్థించాడు భగీరథుడు. కరుణించమని కన్నీరు పెట్టుకున్నాడు. అప్పుడు తన చెవిలోనుంచి గంగను వదలిపెట్టాడు జహ్నువు. జహ్నువు చెవి నుండి వెలువడిన కారణంగా గంగకు 'జాహ్నవి' అని పేరు వచ్చింది. గంగను రసాతలానికి తీసుకుని వెళ్ళాడు భగీరథుడు. అక్కడ భస్మరాశులుగా పడి ఉన్న పితరులయిన సగరపుత్రుల దగ్గర ఆగాడు. గ్రహించింది గంగ. సగరపుత్రులను స్పృశించింది. అంతే! అరవై వేలమంది సగరపుత్రుల పాపాలన్నీ పటాపంచలయి, వారంతా సద్గతి పొందారు. భగీరథుడు గంగను భూమి మీదకు తీసుకుని వచ్చిన కారణంగా ఆమెను 'భాగరథి' అన్నారు. గొప్ప ప్రయత్నం చేసి భగీరథుడు ఇంతటి మహత్కార్యాన్ని సాధించిన కారణంగా ఎవరయినా గొప్ప ప్రయత్నానికి పూనుకుంటే దానిని 'భగీరథీ ప్రయత్నం' అంటున్నారు.

ఈ వంశంలోనే ఋతుపర్ణుడు జన్మించాడు. అయోధ్యపట్టణాన్ని ఏలిన ప్రముఖుల్లో అతను కూడా ఒకడు. అక్షహృదయం విద్యలో ఋతుపర్ణుణ్ణి మించిన వారు లేరు. బాహుకుడు అనే పేరుతో నలమహారాజు ఇతని వద్దనే వంటలవాడుగా చేరాడు. నలుని నుంచి అశ్వహృదయం విద్య నేర్చుకుని, తనకు తెలిసిన అక్షహృదయం విద్యను నలునికి నేర్పిన ఘనత కూడా ఋతుపర్ణునిదే! ఇదే సూర్యవంశంలో ఖట్వాంగుడు జన్మించాడు. విష్ణుభక్తునిగా ఉత్తమపదం అందుకున్నాడు. ఖట్వాంగునికి దీర్ఘబాహువు, దీర్ఘబాహువుకి రఘువు జన్మించారు. రఘువుతోనే రఘువంశం ఏర్పడింది. ఈ వంశంలోనే శ్రీరామచంద్రుడు అవతరించాడు. రఘువు కుమారుడు అజమహారాజు. అజమహారాజు పుత్రుడే దశరథుడు. దశరథునికే శ్రీరాముడు జన్మించాడు. శ్రీరాముని కుమారుడే కుశుడు. కుశసంతతి సుమిత్రునితో కలియుగంలో ఇక్ష్వాకువంశం అంతరించిందని వ్యాసుడు పేర్కొన్నాడు.

### తారశశాంకం

ఇష్టాయిష్టాలు, అభిమానాలు, ప్రేమలు, వయసులు గుర్తెరిగి మరీ వివాహాలు జరిపించాలి. వయస్సుల్లో మితిమీరిన ఎక్కువ తక్కువలు ఉండడం దాంపత్యానికి సరికాదు. యౌవనవతి

భార్య, ముసలి భర్తల కాపురం నిలువదు. ఈ విషయాన్ని వ్యాసుడు భాగవతంలో చాలా చక్కగా చిత్రించాడు.

దేవతల గురువు బృహస్పతి వృద్ధుడు. గొప్ప మేధావి. బ్రహ్మజ్ఞాని. తపస్వి. జపతపాదులే అతని దినచర్య. దేవ పురోహితుడు కావడంతో యజ్ఞయాగాదుల్లో క్షణం తీరిక లేకుండా గడపడం తప్పనిసరి అతనికి. అందాల యువతి తారను వివాహం చేసుకున్నాడతను. వివాహం చేసుకున్న దగ్గర నుంచీ భర్తకు సేవలు చేయడమే తప్ప, శారీరకంగా తార ఎలాంటి సుఖానికీ నోచుకోలేదు. మనసు పరిపరి విధాల పోతున్నా, అణచుకుంటూ జీవించసాగిందామె. కోరికలను అదుముకోసాగింది.

బృహస్పతికి అనేకమంది శిష్యులు ఉండేవారు. వారంతా విద్య నేర్చుకునేందుకు ఆశ్రమాన్ని అంటిపెట్టికుని ఉండేవారు. వారిలో చంద్రుడు ఒకడు. అతను అత్రి-అనసూయల పుత్రుడు. బ్రహ్మదేవుని అంశ. గొప్ప అందగాడు. అతన్ని చూసింది తార. మైమరచింది. మిసమిసలాడే యవ్వనంతో ఉన్నాడు, తగిన ఈడూజోడు అనుకున్నది. మోహించిందతన్ని. వృద్ధుడు బృహస్పతితో తీరని కోరికలన్నీ తీర్చుకునేందుకు తప్పుదోవ పట్టిందామె. భర్త ఇంట లేని వేళ చంద్రునితో సుఖించసాగింది. కొన్నాళ్ళకు గర్భవతి అయింది. ఆమె గర్భంలో ఉన్నది తన ప్రతిరూపం, ఆ రూపాన్ని జాగ్రతగా చూసుకోవాలనుకున్నాడు చంద్రుడు. తారను బృహస్పతికి దూరం చేశాడు. తీసుకునిపోయాడామెను. తన భార్య తనకు కావాలన్నాడు బృహస్పతి. ఇవ్వనన్నాడు చంద్రుడు. ఇద్దరూ యుద్ధానికి సిద్ధమయ్యారు. చంద్ర బృహస్పతుల యుద్ధం దేవదానవ సంగ్రామంగా మారింది. దేవగురువు బృహస్పతి మీద ఉండే ఈర్ష్యాసూయల కారణంగా చంద్రుణ్ణి సమర్థించాడు రాక్షసగురువు శుక్రాచార్యుడు. అదే అదనుగా రాక్షసులంతా చంద్రుని పక్షం వహించారు. రుద్రుడూ, ఇంద్రాది దేవతలూ బృహస్పతి పక్షం వహించారు. ఫలితంగా దేవదానవయుద్ధం చెలరేగింది. బ్రహ్మ జోక్యం చేసుకున్నా యుద్ధాన్ని విరమించ లేదెవరూ. ఒకస్త్రీ కోసం ఇంతటి యుద్ధం తగదన్నా వినిపించుకోలేదు. ఆఖరికి చంద్రునికి నచ్చజెప్పి, తారను బృహస్పతికి ఇప్పించాడు బ్రహ్మ. భార్యను వెంటపెట్టుకుని వెళ్ళిపోయాడు బృహస్పతి. కొన్నాళ్ళకు తార ప్రసవించింది. చక్కని కుమారుణ్ణి కన్నది. ఆ కుమారుడు నా వాడంటే నా వాడంటూ అప్పుడు చంద్ర బృహస్పతులిద్దరూ మళ్ళీ తగవు పడ్డారు. తగవు ఎంతటికీ తేలకపోవడంతో ఈసారి కూడా బ్రహ్మే జోక్యం చేసుకున్నాడు. తారను అడిగాడిలా.

''ఈ బిడ్డకు తండ్రి ఎవరు?''

''చంద్రుడు'' నిజం చెప్పింది తార. ఈసారి బృహస్పతికి నచ్చజెప్పి, బిడ్డణ్ణి చంద్రునికి ఇప్పించాడు బ్రహ్మ. అతని పేరే బుధుడు. చక్కదనంలో చంద్రునికీ, బుద్ధిలో బృహస్పతికీ సరయినవాడు బుధుడు. నిత్య యవ్వనుడు. నవగ్రహాలలో ఒకడు.

## పురూరవుడు

బుధుడికీ, ఇలకీ పురూరవుడు జన్మించాడు. షట్చక్రవర్తులలో పురూరవుడు ఒకడు. గంగా యమునా సంగమ తీరాన ఉన్న ప్రతిష్ఠానపురం రాజధానిగా పరిపాలించాడితను. గొప్ప

పరాక్రమశాలి. దేవతలకూ దానవులకూ యుద్ధం జరిగినప్పుడల్లా ఇంద్రుడు, పురూరవుని సహాయాన్ని అర్థించేవాడు. పురూరవుడు కత్తి పట్టాడంటే విజయం తథ్యం. చాలా యుద్ధాల్లో అతను దేవతలకు విజయం చేకూర్చాడు. ఈ కారణంగానే పురూరవుడంటే ఇంద్రునికి గొప్ప గౌరవం. ముల్లోకాల్లోనూ పురూరవుడు యథేచ్ఛగా సంచరించేవాడు. ఒకనాడు దేవలోకంలోని అప్సరసను చూశాడతను. మోహించాడు. అదో కథ. ఆ కథ అలా ఉండగా...

ఒకనాడు దేవసభలో పురూరవుణ్ణి నారదుడు ప్రశంసించాడు. అతని వీరవిక్రమాలనూ, గుణగుణాలనూ తెగ మెచ్చుకున్నాడు. అతని అందం గురించి కూడా పొగిడాడు. అదంతా విన్నది ఊర్వశి. పురూరవుణ్ణి ప్రేమించసాగింది. అందుకు మిత్ర వరుణుల శాపం కూడా కలసి వచ్చిందామెకు. ఊర్వశిని వారు భూలోకంలో పుట్టమని శపించారు.

దేవలోకం నుంచి భూలోకానికి వచ్చిన ఊర్వశి, ప్రతిష్ఠానపురంలో విహరించసాగింది. పురూరవుడు చూశాడామెను. మోహించాడు. పెళ్ళి చేసుకుందామన్నాడు. భార్యగా ఉండేందుకు కొన్ని షరతులు విధించింది ఊర్వశి.

''నా దగ్గర రెండు మేకపిల్లలు ఉన్నాయి. ప్రాణసమానంగా పెంచుకుంటున్నాను. వాటిని నువ్వు కాపాడాలి. నేను నెయ్యి తప్ప వేరేదీ తినను. నాకు నువ్వు ముప్పూటలా నేతినే వడ్డించాలి. సంభోగసమయంలో తప్ప నువ్వెప్పుడూ నాకు దిసమొలతో కనిపించకూడదు. ఈ మూడు షరతులూ నువ్వు పాటిస్తానని నాకు మాట ఇస్తే తప్పకుండా పెళ్ళి చేసుకుందాం'' అన్నది ఊర్వశి. పాటిస్తానని ప్రమాణం చేశాడు పురూరవుడు. పెళ్ళి చేసుకున్నారిద్దరూ. అనేక సంవత్సరాలపాటు సుఖాల్ని అనుభవించారు. ఇంతలో ఊర్వశికి శాపవిమోచనకాలం దగ్గరపడింది. ఆమెను దేవసభకు రప్పించేందుకు ఇంద్రుడు ప్రయత్నించాడు. పురూరవునికీ, ఊర్వశికీ ఎడబాటు కల్పించాలి. అందుకు గంధర్వులను పురిగొల్పాడతను. వారు ఓ రాత్రివేళ ఊర్వశి ప్రాణసమానమయిన మేకపిల్లలను దొంగిలించారు. తమనెవరో ఎత్తుకునిపోతున్నారని చెబుతూ మేకపిల్లలు బిగ్గరగా అరవడం ప్రారంభించాయి. ఆ సమయంలో ఊర్వశీ పురూరవులిద్దరూ ఏకశయ్యాగతులై ఉన్నారు. మేకల అరుపులు విని, ఊర్వశి గొల్లుమంది. ఏడ్చింది. వాటిని కాపాడమని పురూరవుణ్ణి వేడుకుంది. మేకపిల్లలను కాపాడేందుకు దిసమొలతోనే కత్తిపట్టి పరిగెత్తాడు పురూరవుడు. గంధర్వులను ఓడించాడు, మేకపిల్లలను తీసుకొచ్చి, ఊర్వశిని ఓదార్చాడు. అయితే అప్పుడు కూడా అతను దిసమొలతోనే ఉన్నాడు. దిసమొలతో ఊర్వశికి కనిపించి, నియమభంగం చేశాడు. దాంతో అతన్ని విడిచి పెట్టింది ఊర్వశి. వెళ్ళిపోయిందక్కణ్ణుంచి. ఊర్వశి వియోగాన్ని తట్టుకోలేని పురూరవుడు పిచ్చెక్కి తిరుగుతూంటే అతనికి ఊర్వశి కురుక్షేత్రంలో కనిపించింది. ఆనందించాడతను. వెంట రమ్మని బతిమలాడాడు. రాలేనని చెప్పింది ఊర్వశి. గర్భవతిని అంది. ఒక ఏడాది ఆగి, రమ్మంది అతన్ని. ఆగాడు పురూరవుడు. ఏడాది తిరగ్గానే వచ్చాడు. రమ్మని ఊర్వశిని బతిమలాడాడు మళ్ళీ. గంధర్వులను ప్రార్థించమందామె. ప్రార్థించాడు పురూరవుడు. గంధర్వులు అతని ప్రార్థనకు సంతోషించి, అగ్నిస్థాలి(వంటకుండ)ని బహూకరించి అదృశ్యమయ్యారు. దానిని జాగ్రత చేశాడు పురూరవుడు. దానినే ఊర్వశిగా భావించి కొంతకాలం గడిపాడు.



చివరికి అది ఊర్వశి కాదని తెలిసింది. దాంతో దానిని అడవిలో విడిచి పెట్టి వచ్చాడు. అయినా ఊర్వశి మీద మోహం పోలేదతనికి. ఆ మోహంలో మనోవ్యధకు గురయ్యాడు. ఆ వ్యధలో కొన్ని వేల సంవత్సరాలు గడిచిపోయాయి. కృతయుగం అంతరించి పోయింది. త్రేతాయుగం ప్రారంభమయింది. పురూరవునికి అప్పుడు కర్మబోధకమయిన వేదత్రయం అగుపించింది. అగ్నిస్థాలిని విడిచిన చోటుకి పరిగెత్తాడతను. దాని కోసం వెదికాడు. కనిపించలేదది. శమీగర్భజాతమయిన అశ్వత్థవృక్షం కనిపించిందతనికి. దానిని రెండు అరణులుగా రూపొందించాడు. ఒక అరణిని తానను కుని, రెండోదానిని ఊర్వశిగా భావించాడు పురూరవుడు. మధ్యగల కాష్ఠాన్ని కుమారుడనుకున్నాడు. మంత్రోచ్చారణ చేస్తూ అరణులను మథించాడు. అప్పుడు అందులో నుంచి అగ్ని పుట్టింది. దాని పేరు జాతవేదసుడు. పుత్రుడుగా ప్రకాశించింది. అంతవరకూ ఉపాసనార్థమయి ఉన్న అగ్నిని పురూరవుడు ఆనాడు మూడుభాగాలు చేశాడు. వాటినే 'త్రేతాగ్నులు' అన్నారు. దక్షిణాగ్ని, గార్హపత్యం, అవహనీయం వాటి పేర్లు. అలా త్రేతాగ్ని

ముఖాన పురూరవుడు 'త్రయీవిద్య'కు ఆద్యుడయినాడు. అగ్నిని సంతానంగా పొందడంతో అతనికి ఉత్తమలోకం సంప్రాప్తించింది.

పురూరవునికీ, ఊర్వశికీ ఆయువు, శ్రుతాయువు, సత్యాయువు, రయుడు, విజయుడు, జయుడు అని ఆరుగురు కుమారులు కలిగారు. వారిలో విజయుడికి భీముడు, అతనికి కాంచనుడు, కాంచనుడికి హోత్రకుడు పుట్టారు. ఈ హోత్రకుని కొడుకే జహ్నువు. ఈ జహ్నుముని కారణంగానే గంగకు 'జాహ్నవి' అని పేరు వచ్చింది. ఈ జహ్నుని వంశంలోనే గాధిరాజు జన్మించాడు. ఈ గాధి కుమారుడే విశ్వామిత్రుడని వాల్మీకి తన రామాయణంలో పేర్కొన్నాడు.

### పరశురాముడు

రఘురాముడు, బలరాముడు, పరశురాముడు అని రాములు ముగ్గురు ఉన్నారు. ఈ ముగ్గురూ అవతారపురుషులే! ఈ ముగ్గురూ శ్రీహరి అంశతో జన్మించినవారే! రావణుని సంహరించిన శ్రీరాముడు సాక్షాత్తూ శ్రీహరే! ఇకపోతే శ్రీకృష్ణునికి అగ్రజునిగా జన్మించిన బలరాముడు ఆదిశేషుని అవతారం. పరశురాముడు విష్ణ్వంశ. పరశువు అంటే గండ్రగొడ్డలి. దానిని ఆయుధంగా ధరించాడు కనుక పరశురాముడయ్యాడతను. భృగువంశంలో జన్మించాడు కనుక అతనిని 'భార్గవరాముడు' అని కూడా వ్యవహరించారు.

## పరశురాముడు

గాధిరాజు కుమార్తె సత్యవతి. ఆమెను భృగు పుత్రుడు ఋచికుడు పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. గాధిరాజుని కలిశాడతను. తన కోరికను తెలియజేశాడు. గాధికి అది ఇష్టం లేకపోయింది. కష్టం కూడా కలిగించింది. తన కుమార్తె సుకుమారి. సౌందర్యరాశి. ఋచికుడు అరణ్యాలలో నివసించే ముని. అతనికి తన కుమార్తెను కట్టబెడితే సుఖపడదని అభిప్రాయపడ్డాడతను. అయితే ఆ మాట చెప్పే ధైర్యం లేకపోయిందతనికి. ఋచికుడు గొప్ప తపస్సంపన్నుడు. కోపం వస్తే శపిస్తాడని భయపడ్డాడతను. తెలివిగా ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. దానిని ఇలా తెలియజేశాడు.

''చెవి మాత్రమే నలుపురంగులో ఉండి, మిగిలిన శరీరం అంతా తెల్లని తెలుపులో ఉన్న వేయి గుర్రాలను తెచ్చి ఇవ్వగలిగితే నా కుమార్తెను ఇచ్చి నీకు తప్పకుండా పెళ్ళి చేస్తాను.''

''ఆజ్ఞ'' అన్నాడు ఋచికుడు. నిష్క్రమించాడు అక్కణ్ణుంచి. వెళ్ళి వరుణదేవుణ్ణి ప్రార్థించాడతను. కరుణించాడు వరుణదేవుడు. గాధిరాజు చెప్పినటువంటి చెవి మాత్రమే నలుపురంగులో ఉండి, మిగిలిన శరీరం అంతా తెలుపురంగులో ఉన్న వేయి గుర్రాలను ప్రసాదించాడు. వాటిని గాధిరాజుకి సమర్పించాడు ఋచికుడు.

''సత్యవతిని నా అర్ధాంగిని చేస్తావా?'' అడిగాడు. తప్పదిక. చేస్తానన్నాడు గాధిరాజు.

సత్యవతి, ఋచికుల వివాహం జరిగిపోయింది. భర్తను సత్యవతి ప్రేమతోనూ, భక్తితోనూ సేవించసాగింది. ఆమె పతిభక్తికి మెచ్చుకున్నాడు ఋచికుడు. వరం కోరుకోమన్నాడు. తనకీ, తన తల్లికీ పుత్రసంతానాన్ని కలుగజేయమని ప్రార్థించింది సత్యవతి. సరేనన్నాడు ఋచికుడు. అప్పటి వరకు గాధిరాజుకి పుత్రసంతతి లేదు. సత్యవతి కోరిక మేరకు ఒక యజ్ఞాన్ని తలపెట్టాడు

ఋచికుడు. అందులో భాగంగా రెండు మంత్రపూరిత జలకలశాలనూ, విడివిడిగా రెండు చరువు(హవ్యము వండేందుకు ఉపయోగించే కుండ)లనూ ఏర్పరిచాడు. ఒక కలశంలోని జలాన్ని సత్యవతీ, వేరొక కలశంలోని జలాన్ని ఆమె తల్లీ స్వీకరించాల్సిందిగా చెప్పాడు. అలాగే ఎవరు ఏ చరువుని భక్షించాలో కూడా తెలియజేశాడు ఋచికుడు. తర్వాత సత్యవతిని మేడిమ్రానునీ, ఆమె తల్లిని రావిమ్రానునీ కౌగిలించుకోమని చెప్పాడు. అన్నీ వివరించి అతను స్నానానికి నదీతీరానికి వెళ్ళాడు. అతను అటు వెళ్ళగానే ఇటు అంతా తారుమారయింది. తాను తాగాల్సిన మంత్రపూరిత జలాన్ని తల్లికి ఇచ్చింది సత్యవతి. తానేమో తల్లి తాగాల్సిన జలాన్ని తాగింది. అలాగే తల్లి తినాల్సిన చరువుని తాను స్వీకరించి, తన చరువుని తల్లికి అందజేసింది. రావిమ్రానుని తను కౌగిలించుకుని, మేడిమ్రానుని తల్లి కౌగిలించుకునేలా చేసింది. స్నానం చేసి తిరిగి వచ్చిన ఋచికుడు తాను చెప్పిన దానికి భిన్నంగా జరిగినందుకు ఎంతగానో విచారించాడు. భార్యతో ఇలా అన్నాడు.

''నేను చెప్పిందొకటి, మీరు చేసిందొకటి. ఫలితంగా జరగబోయేదేమిటో తెలుసా? నీకు పుట్టే కుమారుడు బ్రాహ్మణుడు అయినప్పటికీ క్షత్రియస్వభావంతో దారుణాలకి ఒడిగడతాడు. నీ తల్లికి జన్మించే పుత్రుడు బ్రహ్మజ్ఞాని అవుతాడు. ఇది దైవసంకల్పం.''

అయ్యయ్యో అనుకుంది సత్యవతి. బాధపడింది.

''వద్దు ప్రాణేశ్వరా, నాకు అలాంటి పుత్రుడు వద్దు. దయచేసి మార్చండి. మీరు తపోధనులు. మీరు తలచుకుంటే ఏమయినా చేయగలరు.'' ప్రార్థించింది. అప్పుడు ఋచికుడు ఇలా అనుగ్రహించాడు, సత్యవతి కుమారుడుగాక, ఆమె మనుమడు అటువంటి దారుణస్వభావాన్ని కలిగి ఉంటాడన్నాడు. ఋచికునికీ సత్యవతికీ జమదగ్ని జన్మించాడు. ఋషిసత్తముడతను. జమదగ్ని కుమారుడే పరశురాముడు. అతను బ్రహ్మవంశసంజాతుడై కూడా క్షాత్రం కలవాడయి నాడు. దారుణస్వభావాన్ని పుణికిపుచ్చుకున్నాడు. గాధిరాజుకు విశ్వామిత్రుడు జన్మించాడు. అతను క్షత్రియవంశంలో జన్మించినప్పటికీ బ్రహ్మవేత్త అయినాడు. మహర్షి అయినాడు. జమదగ్నికి విశ్వామిత్రుడు మేనమామ కావడంతో ఈ రెండు వంశాలకూ బాంధవ్యం ఏర్పడింది. ఇక్కడ బ్రాహ్మణ క్షత్రియవంశాలు కలవడం విశేషం. సత్యవతి తన పాతివ్రత్య మహిమతో కౌశికీనదిగా మారింది. లోకపావని అయింది. జమదగ్ని రేణుపుత్రిక రేణుకను వివాహమాడాడు. వారికి అయిదుగురు కుమారులు జన్మించారు. అందులో ఆఖరివాడు పరశురాముడు. హిమవత్పర్వతం మీద అనేక సంవత్సరాలు పరశురాముడు, శివుని గురించి తపస్సు చేశాడు. అతని తపస్సుకి మెచ్చి ప్రత్యక్షమయ్యాడు శివుడు. ప్రత్యక్షమయ్యి పరశువు అనే ఆయుధాన్నేగాక, ఇంకా అనేక దివ్యాస్త్రాలను బహూకరించాడు. పరశురాముడంతటి పరాక్రమవంతుడూ, తేజశ్శాలీ మరొకడు లేడు. లోకంలో క్షత్రియుడు అనేవాడు లేకుండా చేస్తానన్నది పరశురాముని ప్రతిజ్ఞ. అందుకు ఓ కారణం ఉంది.

కృతవీర్యుని పుత్రుడు కార్తవీర్యార్జునుడు. హైహయవంశానికి చెందిన వాడు. వేయి చేతులతనికి. మాహిష్మతీపురం అతని రాజధాని. దత్తాత్రేయుని భక్తుడతను. ఆ దేవుని అనుగ్రహంతో కార్తవీర్యార్జునుడు గొప్ప శక్తిసంపన్నుడయ్యాడు. అనేక శస్త్రాస్త్రాలు సాధించాడు. ఆ కాలంలో అతన్ని ఎదిరించగలిగిన వీరుడే లేడు. రావణాసురుణ్ణే బంధించిన ఘనత అతనిది.

అలాంటి కార్తవీర్యార్జునుడు ఒకనాడు సైన్యసమేతంగా వేటకి వెళ్ళి, దోవలో జమదగ్ని ఆశ్రమాన్ని సందర్శించాడు. వచ్చిన రాజుని సాదరంగా ఆహ్వానించాడు జమదగ్ని. తన వద్దగల కామధేనువు ప్రభావంతో రాజుకీ, అతని సైన్యానికీ షడ్రసోపేతమయిన విందు ఏర్పాటు చేశాడు. విందు బాగుంది. కామధేనువు ప్రభావాన్ని మెచ్చుకున్నాడు రాజు. దానిని కావాలన్నాడు. ఇవ్వలేనన్నాడు జమదగ్ని. ముని వాకిట ఉండాల్సిన గోవు కామధేనువంటూ నచ్చజెప్పజూశాడు. అతని మాటలకి కోపం వచ్చింది కార్తవీర్యార్జునునికి. భటులతో బలవంతంగా గోవుని తోలుకుని పోయాడు. ఆ సమయంలో పరశురాముడు ఆశ్రమంలో లేడు. వచ్చిన తర్వాత జరిగిందంతా తెలుసుకున్నాడతను. ఆగ్రహంతో ఊగిపోయాడు. ధనుర్బాణాలూ, పరశువూ ధరించి, కార్తవీర్యార్జునుని మీద యుద్ధం ప్రకటించాడు. ఇద్దరికీ పెద్ద యుద్ధమే జరిగింది. కార్తవీర్యార్జుని బలపరాక్రమాలేవీ పరశురాముని ముందు పని చెయ్యలేదు. విష్ణ్వంశతో జన్మించిన పరశురాముడు, తన పరశువుతో కార్తవీర్యార్జుని వేయి చేతులూ ఖండించాడు. అతని శిరస్సును కూడా తుంచి వేశాడు. కామధేనువును చేజిక్కించుకుని, తీసుకుని వచ్చి, తండ్రికి సమర్పించాడు. రాజుని చంపడం మహాపాపం అని జమదగ్ని చెబితే, ఆ పాపాన్ని పోగొట్టుకునేందుకు ఓ సంవత్సరం పాటు తీర్థయాత్రలు చేశాడు పరశురాముడు.

రేణుక ఒకనాడు నీరు తెచ్చేందుకు గంగానదికి వెళ్ళింది. అక్కడ ఆమెకు చిత్రరథుడు అనే గంధర్వుడు కనిపించాడు. అతను, అచ్చరలతో జలక్రీడలాడడం చూడముచ్చటనిపించి, చూస్తూ ఉండిపోయింది రేణుక. కాస్సేపటికి నీరు తీసుకుని ఆశ్రమానికి చేరుకుంది. ఆలస్యంగా ఆశ్రమానికి చేరిన రేణుకను గమనించి, కోపించాడు భర్త జమదగ్ని. ఆమెను చంపమని కుమారులను ఆజ్ఞాపించాడు. తల్లిని చంపడం పాపమని, తమ వల్ల కాదని కుమారులంతా వెనుకడుగు వేశారు. పరశురాముడు మాత్రం తండ్రి ఆజ్ఞను పాటించాడు. తల్లిని వధించాడు. తన ఆజ్ఞను పాటించి, తల్లిని వధించినందుకు పరశురాముణ్ణి మెచ్చుకున్నాడు జమదగ్ని. వరం కోరుకోమన్నాడు. తల్లిని బ్రతికించమని కోరాడు పరశురాముడు. పరశురాముని కోరిక మేరకు రేణుక బ్రతికింది. జమదగ్ని ఆమెను పునర్జీవింపజేశాడు. తమ తండ్రి కార్తవీర్యార్జుని చంపినందుకు అతని కొడుకులు హైహయులు,  పరశురాముని మీద కసి తీర్చుకునేందుకు సమయం కోసం వేచి చూశారు. సమయం చిక్కింది. ఒకనాడు పరశురాముడు ఆశ్రమంలో లేని వేళ, తపస్సు చేసుకుంటున్న అతని తండ్రి జమదగ్ని తల నరికి వెళ్ళిపోయారు హైహయులు. పతివియోగాన్ని తట్టుకోలేక పోయింది రేణుక. కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది. అప్పుడు అక్కడకి వచ్చాడు పరశురాముడు. తండ్రిని తెగ నరికిన హైహయుల గురించి తెలుసుకుని, ఆగ్రహోదగ్రుడయ్యాడు. ఆ క్షణమే క్షత్రియుడు అన్నవాడే లోకంలో ఉండకుండా చేస్తానని శపథం పట్టాడు. మహిష్మతీపురంపై విరుచుకు పడ్డాడు. హైహయులందరినీ వధించాడు. ఆ పట్టణాన్ని భస్మీపటలం చేశాడు. అక్కడితో ఊరుకోలేదు. క్షత్రియుల మీద పగబట్టి ఇరవై ఒక్కసార్లు భూమి మీద నలువైపులా ఉన్న రాజయినవారినల్లా అంతమొందించాడు. పరశురాముడి నుంచి తప్పించుకునేందుకు కొందరు రాజులు గాజులు తొడిగించుకుని, స్త్రీల మధ్య దాగున్నారు. మరికొందరు పశువులమందలో కలసిపోయారు. అలా ప్రాణాన్ని కాపాడుకున్న వారిలో దశరథుడు ఒకడు. అతని కొడుకే శ్రీరాముడు. క్షత్రియులను సంహరించి, వారి రక్తాన్ని మడుగులు కట్టించాడు పరశురాముడు.



అలా ఏర్పడినదే శమంతకపంచకం. దీని సమీపంలో గల కురుక్షేత్రంలోనే పాండవులకూ కౌరవులకూ యుద్ధం జరిగింది. తండ్రి జమదగ్ని శిరస్సును మొండానికి అమర్చి, గొప్ప యజ్ఞం చేశాడు పరశురాముడు. ఆ యజ్ఞఫలంగా జమదగ్ని బ్రతికాడు. సప్తర్షుల్లో ఒకడై ఆకాశంలో విరాజిల్లసాగాడు.

శివధనుస్సును విరచి సీతను వివాహం చేసుకున్నాడు శ్రీరాముడు. భార్య సహా అయోధ్యకు బయల్దేరాడు. ఈ సంగతి తెలుసుకున్నాడు పరశురాముడు. తన దైవం శివుని ధనుస్సును శ్రీరాముడు విరవడాన్ని తట్టుకోలేకపోయాడు. అవమానంగా భావించాడు. శ్రీరాముణ్ణి ఎదుర్కొన్నాడు. తన కుమారుణ్ణి కాపాడమని దశరథుడు ఎంతగా కాళ్ళా వేళ్ళాబడినా కనికరించలేదు పరశురాముడు. కోపంతో కళ్ళెర్రజేసి అన్నాడిలా.

''చూడబోతే బాలుడవు, నువ్వా శివధనుస్సును ఎక్కుపెట్టి విరిచింది! ఏదీ నా ధనుస్సును ఎక్కుపెట్టు చూద్దాం. నీ బలం, ధైర్యం తెలిసిపోతాయి.''

తన ధనుస్సును శ్రీరాముడికి అందజేశాడు పరశురాముడు. అతని ధనుస్సును అవలీలగా ఎక్కుపెట్టాడు శ్రీరాముడు. దానితో పాటు పరశురాముని తేజస్సును కూడా హరించాడతను. అప్పుడు శ్రీరాముడు, సాక్షాత్తూ విష్ణుమూర్తి అని గ్రహించాడు పరశురాముడు. నమస్కరించాడతనికి. శాంతచిత్తుడై మహేంద్రపర్వతం మీదికి తరలిపోయాడు.

క్షత్రియులకు సింహస్వప్నం, బ్రాహ్మణపక్షపాతి పరశురాముడు చిరంజీవి. రానున్న మన్వంతరంలో అతను సప్తర్షులలో ఒకడు కాగలడు.

### విశ్వామిత్రుడు

గాధిరాజు కుమారుడయిన విశ్వామిత్రుడు, అనేక సంవత్సరాలపాటు రాజ్యపాలన చేశాడు. క్షత్రియుడు అయినప్పటికీ తపోబలంతో బ్రాహ్మణ్యం సాధించాడు. మహర్షి అయినాడు. విశ్వామిత్రుని తపోబలం చాలా గొప్పది. కాని, రాజసం వల్ల అతని తపోబలం చాలా వ్యర్థమయింది. విశ్వామిత్రుని గురించి భాగవతంలో చాలా సంక్షిప్తంగా ఉంది. అతను రామలక్ష్మణులకు గురువు. వారికి ధనుర్విద్యను నేర్పిన మహానుభావుడు. అంతేకాదు, గాయత్రీమంత్రానికి విశ్వామిత్రుడు ఋషి. విశ్వామిత్రునికీ, వసిష్ఠునికీ బద్ధ వైరం. విశ్వామిత్రుని రాజర్షిగానే అంగీకరిస్తాడు వసిష్ఠుడు. కాదు, తాను బ్రహ్మర్షినంటాడు విశ్వామిత్రుడు. ఆఖరికి ఆ స్థానాన్ని అందుకున్నాడతను. విశ్వామిత్రుని ఆశ్రమానికి సిద్ధాశ్రమం అని పేరు. అతనికి నూటొక్క మంది కుమారులు. వారిలో మధ్యవాడు మధుశ్చంద్రుడు. ఫలితంగా అంతా మధుశ్చంద్రులయినారు. హరిశ్చంద్రుని యజ్ఞపశువయిన శునస్సేపుణ్ణి తన ఆశ్రమానికి తీసుకుని వచ్చాడు విశ్వామిత్రుడు. పుత్రులతో సమానంగా చూశాడతన్ని. తన పుత్రులను కూడా అతన్ని అన్నగా చూడమని చెప్పాడు. పెద్దవారయిన యాభైమంది మధుశ్చంద్రులూ అందుకు అంగీకరించలేదు. కోపం వచ్చింది విశ్వామిత్రునికి. వారిని 'మ్లేచ్ఛులు'కండి అని శపించాడు. చిన్నవారయిన యాభైమందీ శునస్సేపుణ్ణి అన్నగా భావించి అభిమానించారు. అందుకు సంతోషించాడు విశ్వామిత్రుడు. వారికి సంతానవృద్ధి కలిగేటట్టుగా దీవించాడు.

జన్మతః భార్గవుడయినప్పటికీ తనని పుత్రునిగా విశ్వామిత్రుడు స్వీకరించడంతో శునస్సేపుడు కౌశికుడు అయినాడు. కౌశికుడికి అష్టకుడు, హారీతుడు, జయంతుడు, సుమదాముడు, మొదలయిన వారు జన్మించారు.

## యయాతి

పురూరవుని వంశంలో అనేకమంది ప్రసిద్ధులు జన్మించారు. పురూరవుని కొడుకు ఆయువునకు నహుషుడు, క్షత్రవృద్ధుడు, రజిరంభుడు, అనేనుడు, అనంగుడు అని అయిదుగురు పుత్రులు జన్మించారు. వారిలో క్షత్రవృద్ధుని సంతతికి చెందిన వాడే శౌనకుడు. ఆయన గొప్ప ముని. ఈ కోవలోనే ఆయుర్వేద ప్రవర్తకుడయిన ధన్వంతరి, ప్రఖ్యాతుడయిన కువలయాశ్వుడు జన్మించారు. కువలయాశ్వుని కుమారుడయిన అలర్కుడు, నిత్యయౌవనంతో అరవై ఆరువేల సంవత్సరాలు రాజ్యాన్ని పాలించాడు.

నహుషుడు అనేక యజ్ఞయాగాదులు చేసి ప్రసిద్ధి చెందాడు. అతని భార్య ప్రియంవద. అనేక యజ్ఞయాగాదులు చేసి, దేవతలను మెప్పించడంతో నహుషునికి స్వర్గలోకాధిపత్యం లభించింది. ఆ సమయంలో ఇంద్రుడు విశ్వరూపుని చంపిన పాపానికి భయపడి, స్వర్గం విడచిపెట్టి పారిపోయాడు. ఇంద్రపదవి అధిష్ఠించిన నహుషుడు అధికారమదంతో విర్రవీగసాగాడు. దేవతలనూ, మహర్షులనూ అవమానించాడు. ఇంద్రుని భార్య శచీదేవిని మోహించి, ఆమెను కావాలన్నాడు. తన వద్దకు తీసుకుని రావాల్సిందిగా దేవతలను ఆజ్ఞాపించాడు. శచీదేవికి ఏం చెయ్యాలో అంతుచిక్కలేదు. దుఃఖించసాగింది. బృహస్పతి అప్పుడామెకు ఒక ఉపాయం చెప్పాడు. మహర్షులచేత పల్లకీ మోయించుకుని వస్తే నహుషుణ్ణి స్వీకరిస్తానని చెప్పమన్నాడు. ఆమె అలాగే చెప్పింది. సరేనన్నాడు నహుషుడు. పల్లకీని అధిరోహించి, దానిని మోయమని మహర్షులను ఆజ్ఞాపించాడతను. నహుషునికి అంత్యకాలం సమీపించింది అనుకున్నారు మహర్షులు. తప్పనిసరయి పల్లకీని మోసారు. నహుషుడు పల్లకీలో శచీదేవిమందిరానికి ప్రయాణమయ్యాడు. పల్లకీని సరిగా మోయడం లేదని అగస్త్యమహాముని నహుషుడు కాలితో తన్నాడు. దాంతో ఆ మహాముని, స్వర్గం నుంచి పతనమై, నహుషుణ్ణి సర్పంగా భూలోకంలో పడి ఉండమని శపించాడు. తన తప్పును అప్పుడు గ్రహించాడు నహుషుడు. శాపవిమోచనాన్ని ప్రసాదించమని అగస్త్యుణ్ణి వేడుకున్నాడు.

''నీ ప్రశ్నలకు సరయిన సమాధానాలు చెప్పినప్పుడే నీకు శాపవిముక్తి'' అన్నాడు అగస్త్యుడు. నహుషుడు ఇంద్రపదవి కోల్పోయాడు. స్వర్గం నుండి తలక్రిందులుగా భూమి మీద పడి పోయాడు. ఒక పెద్ద సర్పం అయినాడు. పాండవుల అరణ్యవాస సమయంలో ఈ పామే భీమసేనుణ్ణి పట్టుకుంది. మహాబలాఢ్యుడయిన భీమసేనుడు కూడా ఈ పాము పట్టును విడిపించుకోలేకపోయాడు. భీముణ్ణి వెదుకుతూ ధర్మరాజు వచ్చాడప్పుడు. పాముకి చిక్కిన భీముణ్ణి చూసి ఆందోళన చెందాడు. బాధపడ్డాడు. భీముణ్ణి విడచిపెట్టమని పాముని ప్రార్థించాడు. తన ప్రశ్నలకు సరయిన సమాధానాలు చెప్పగలిగితే విడచిపెడతానన్నది పాము. సమాధానాలు చెప్పడం అసాధ్యం అనిపించే ప్రశ్నలను సంధించింది. ధర్మరాజు తెలివిగా తేలికగా సరయిన సమాధానాలు చెప్పాడు. ఆనాడు నహుషునికి శాపవిమోచనం జరిగింది. సర్పరూపాన్ని పోగొట్టుకున్నాడతను. నిజరూపం ధరించాడు. బ్రహ్మజ్ఞాని అయి పుణ్యలోకాలు సాధించాడు.

## యయాతి

నహుషుని కుమారుడు యయాతి. తండ్రి అనంతరం అతను చక్రవర్తి అయ్యాడు.

శుక్రాచార్యుని కుమార్తె దేవయాని. చాలా అందగత్తె. దానవరాజు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ. ఆమె కూడా మంచి అందగత్తె. ఇద్దరూ స్నేహితులు. కలసిమెలసి ఉండేవారు. ఒకనాడు దేవయాని, చెలికత్తెలుసహా శర్మిష్ఠ వనవిహారానికి వెళ్ళారు. అంతా చాలా సేపు ఆడుతూ పాడుతూ గడిపారు. తర్వాత ఓ కొలనులో జలక్రీడలు ఆడసాగారు. చీరెలు విప్పి ఒడ్డున పెట్టారు. ఒకరిపై ఒకరు నీరు జల్లుకుంటూ ఆనందించసాగారు. ఆ సమయంలో పార్వతీపరమేశ్వరులు వృషభవాహనారూఢులై ఆకాశంలో ప్రయాణించడం చూసి, కన్యలంతా సిగ్గుతో ఒడ్డునకు చేరి

గబగబా వస్త్రాలు ధరించారు. ఆ తొందరలో శర్మిష్ఠ పొరపాటున దేవయాని చీరె కట్టుకున్నది. అందుకు దేవయాని కోపగించుకుంది. చెలికత్తెల ముందు శర్మిష్ఠను నానామాటలూ అంది.

''నా చీరె కట్టుకుంటావా నువ్వు! యజ్ఞంలో మంత్రపూరితమయిన పురోడాశాన్ని కుక్క తాకినట్టుగా మేము పవిత్రంగా కట్టుకునే చీరెను నువ్వు కట్టుకుంటావా? నువ్వు కట్టుకోవడం వల్ల నా చీరె మైలపడింది. మేము అగ్రకులజులం. బ్రాహ్మణులం. భృగువంశానికి చెందినవారం. మేమెక్కడ? నీచమయిన దానవకులంలో పుట్టిన నువ్వెక్కడ? నీ తండ్రి వృషపర్వుడు, నా తండ్రి శిష్యుడు. నా తండ్రి అనుగ్రహంతోనే నీ తండ్రి రాజ్యం ఏలుతున్నాడు. తారతమ్యాలు తెలుసుకుని ప్రవర్తించాలి. నా చీరె కట్టుకుంటావా? ఇంతకు తెగిస్తావా?'' దేవయాని రగలిపోయింది. శర్మిష్ఠ కూడా తగు సమాధానాలు ఇచ్చింది.

''అగ్రకులజులట! అగ్రకులజులు. ఏమిటే మీ కులం? మా ఇళ్లల్లో పౌరోహిత్యం చేసుకుని బతికే మీ సంగతి ఎవరికి తెలియదే? లేచింది మొదలు మీరంతా మా ఇంటి ముందు కుక్కల్లా పడి ఉంటారు. చాల్లే నీ గొప్పలు'' అంది ఆమె. అలా మాటా మాటా పెరిగి, ఇద్దరూ ఒకరినొకరు కొట్టుకునే స్థితికి చేరుకున్నారు. ఆ స్థితిలో దేవయానిని ఓ పాడుబడ్డబావిలోనికి తోసి వేసి, చెలికత్తెల సహా వెను తిరిగింది శర్మిష్ఠ. అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. నూతిలో ఒంటరిగా ఏడుస్తూ కూర్చుంది దేవయాని.

ఆ సమయంలో యయాతి మహారాజు వేటకై అటుగా వచ్చి, దేవయాని ఆర్తనాదాలు విన్నాడు. నూతి దగ్గరగా వచ్చాడు. తొంగి చూశాడు. వివస్త్రగా అతనికి దేవయాని కనిపించింది.

దయతో తన ఉత్తరీయాన్ని దేవయానికి అందించాడతను. చేయి అందించి, ఆమెను నూతిలోంచి బయటికి తీశాడు. తన మానాన్ని కాపాడి, ప్రాణాలు కాపాడిన యయాతిని దేవ యాని మోహించింది. అతన్ని పెళ్ళి చేసుకోవాలని ఆశించింది. జరిగిన కథంతా యయాతికి చెప్పింది.

''మహారాజా! మీరు నా పాణిని గ్రహించారు. పాణిగ్రహణం జరిగింది. మీరే నా భర్త'' అన్నది దేవయాని. ఆలోచనలో పడ్డాడు యయాతి. తను క్షత్రియుడు. దేవయాని బ్రాహ్మణకన్య. పైగా శుక్రాచార్యుని కూతురు. ఆ వివాహం యుక్తం కాదనుకున్నాడు యయాతి. పాప హేతువన్నాడు. ఆ మాటే చెప్పాడు దేవయానికి. అయినా యయాతే తన భర్తని పట్టుబట్టింది దేవయాని. దోషం లేదన్నది. తండ్రి శుక్రాచార్యుని అనుమతి తీసుకున్న అనంతరమే తనని వివాహం చేసుకోమన్నది. పూర్వం కచుడు తనకు ఇచ్చిన శాపకారణంగా కూడా ఈ వివాహం జరగాల్సి ఉందన్నదామె.

ఇక్కడ కచుడు-దేవయానుల కథ కొంత మేరకు తెలుసుకోవాలి. దేవగురువు బృహస్పతి కుమారుడు కచుడు. మృతసంజీవనీ విద్య నేర్చుకునేందుకై అతను శుక్రాచార్యుణ్ణి ఆశ్రయించాడు. శుక్రునికి శుశ్రూషలు చేసి అతని అనుగ్రహాన్ని సంపాదించాడు. మృతసంజీవనీ విద్య నేర్చుకున్నాడు. అప్పుడే అతనికి దేవయానితో స్నేహం ఏర్పడింది. ఇద్దరూ ఆడారు పాడారు. విద్యపూర్తయి కచుడు వెళ్ళిపోతున్న వేళ, తన కోరికను తెలియజేసింది దేవయాని. తనని వివాహమాడమన్నదామె.



''నాకు నువ్వు గురుపుత్రివి. సోదరితో సమానం. నిన్ను పెళ్ళాడడం పాపం'' అన్నాడు కచుడు. కాదన్నదామె. రకరకాలుగా వేడుకున్నది. వినలేదు కచుడు. ఆఖరికి కోపంతో ఇలా శపించింది.

''మృతసంజీవనీ విద్య నీకు పనిచేయకుండుగాక.''

తనని అకారణంగా శపించినందుకు కచుడు కోపగించుకుని, దేవయానిని ఇలా శపించాడు.

''నిన్ను బ్రాహ్మణుడు పెళ్ళాడకుండుగాక.''

శాప ప్రతిశాపాలతో కచ దేవయానులు విడిపోయారు. నాటి శాపఫలితంగా దేవయానికి బ్రాహ్మణేతరుణ్ణి పెళ్ళాడే యోగ్యత ఉన్నది. ఆ మాటే యయాతికి ఇప్పుడు చెప్పింది దేవయాని. తనని స్వీకరించడంలో తప్పు లేదన్నది. ఒప్పించిందతన్ని.

తండ్రి శుక్రాచార్యుని సమీపించి, తనకి శర్మిష్ఠ చేసిన అవమానాన్ని వివరించింది దేవయాని. ఏడ్చింది. పౌరోహిత్యం కంటే భిక్షాటనే మేలు అనుకున్నాడు శుక్రాచార్యుడు. కుమార్తెను వెంటబెట్టుకుని వృషపర్వుని విడచి వెళ్ళిపోయాడు. శర్మిష్ఠ కారణంగా గురువుగారు తనని విడచి వెళ్ళిపోయారని ఎంతగానో బాధపడ్డాడు వృషపర్వుడు. శుక్రాచార్యుడు లేకపోతే దేవతల ఆగడాలకు అంతు ఉండదనుకున్నాడు. ఎలాగయినా గురువుగారి అనుగ్రహం సంపాదించు కోవాలనుకున్నాడు. వెళ్ళి శుక్రాచార్యుని పాదాలపై మోకరిల్లాడు.

''శర్మిష్ఠ చేసింది తప్పే! ఒప్పుకుంటాను. ఈ కారణంగా మీరు నన్ను విడచి రావడం భావ్యం కాదు. నా కూతురు చేసిన తప్పును క్షమించండి. మీరు లేకపోతే దానవకులం అంతరించిపోతుంది. మాకు దిక్కులేదు.'' వేడుకున్నాడు. శుక్రాచార్యుడు కరిగాడు. కోపాన్ని తగ్గించుకున్నాడు. వృషపర్వునితో వచ్చేందుకు సిద్ధమయ్యాడు. అయితే దేవయాని కోరిక తీర్చాలని వృషపర్వుని ఆజ్ఞాపించాడు శుక్రాచార్యుడు. తప్పకుండా అన్నాడు వృషపర్వుడు. ఆమె కోరికను తెలియజేయమన్నాడు. దేవయాని కల్పించుకుని చెప్పిందప్పుడు.

''నాకు పెళ్ళి చేసి నా తండ్రి నన్ను ఎక్కడకి పంపితే అక్కడకి శర్మిష్ఠ తన చెలికత్తెలతో వచ్చి, నాకు ఊడిగం చెయ్యాలి. నా దగ్గరే ఉండాలి. ఇందుకు నువ్వు ఒప్పుకోవాలి.''

శర్మిష్ఠను దేవయాని వెంట దాసిగా పంపడం భరించలేనిదే! అయినా తప్పదు. రాక్షస కులానికి కీడు మూడితే కాపాడేదెవరు? అనుకున్నాడు వృషపర్వుడు. తప్పనిసరయి దేవయాని కోరికను అంగీకరించాడు. విధిలేక శర్మిష్ఠ తండ్రి ఆజ్ఞకు కట్టుబడింది. చెలికత్తెలుసహా శర్మిష్ఠ, దేవయానిని చేరింది.

దేవయాని కోరిక మేరకు ఆమెను యయాతికి ఇచ్చి వివాహం చేశాడు శుక్రాచార్యుడు. అత్తారింటికి శర్మిష్ఠ, చెలికత్తెలుసహా చేరుకుంది దేవయాని. అయితే శర్మిష్ఠ అందాన్ని చూస్తే ఆమెను యయాతి కావాలనుకుంటాడని గ్రహించి, శర్మిష్ఠను కన్నెత్తి చూడరాదనీ, పన్నెత్తి పలకరించరాదనీ భర్తకు ఒట్టు పెట్టింది దేవయాని. కట్టుబడ్డాడు యయాతి. అంతఃపురంలో శర్మిష్ఠకు ప్రత్యేక మందిరాన్ని నిర్మించి, అందులో ఆమె ఉండేందుకు ఏర్పాట్లు చేశాడు. రోజు రోజుకీ దేవయానికీ, శర్మిష్ఠకీ స్పర్థలు ఏర్పడి, పంతాలు పెరిగిపోయాయి. రాకుమార్తె అయిన తాను, గురుపుత్రిక దేవయానికి దాసిగా ఉండడాన్ని శర్మిష్ఠ భరించలేకపోయింది. తన యౌవనం, చక్కదనం వ్యర్థమవుతున్నందుకు కుమిలిపోసాగింది. ఒకనాడు ఋతుస్నాతయ్యై చక్కగా అలంకరించుకుని, ఏకాంతంగా ఉంది శర్మిష్ఠ. అప్పుడామెకు యయాతి కనిపించాడు. అతన్ని అడ్డుకున్నదామె. తన మనోవాంఛ తెలియజేసింది. పత్నిగా చేపట్టి, సంతానాన్ని ప్రసాదించమని వేడుకున్నదామె. వనిత తనంత తానుగా వలచి వచ్చినప్పుడు కాదనకూడదు. అది ధర్మం కూడా కాదు. ఆ కారణంగా శర్మిష్ఠ కోరికను తీర్చాడు యయాతి. ఫలితంగా ఆమె గర్భవతి అయింది. శర్మిష్ఠ గర్భవతి అని తెలిసి భగ్గున మండిపడింది దేవయాని. ఒట్టు తీసి గట్టు మీద పెట్టిన యయాతిని అసహ్యించుకుంది. అతనిపై కోపగించుకుంది. అలిగి పుట్టింటికి చేరుకుంది. జరిగిందంతా తండ్రి శుక్రాచార్యునికి చెప్పుకుని బాధపడింది. దేవయానిని సమీపించాడు యయాతి. ఇంటికి రమ్మని ఎన్నో విధాల ప్రార్థించాడు. అనేక విధాల నచ్చజెప్పజూశాడు. లాభం

లేకపోయింది. తన కుమార్తెకు తీరని అన్యాయం చేశావంటూ యయాతిపై అంత ఎత్తున లేచాడు శుక్రాచార్యుడు.

''కాముకుడివై, శర్మిష్ఠను కూడి నా కుమార్తెకు తీరని వ్యథ కలిగించావు. ఇందుకు ఫలితంగా నీకు దుర్భరమయిన ముసలితనం ప్రాప్తించుగాక'' అని శపించాడు. శుక్రాచార్యుని శాపానికి తిరుగులేదు. అనుభవించక తప్పదు అనుకుంటూ శాపవిమోచనను ప్రసాదించమన్నాడు యయాతి.

''నీ వార్ధక్యాన్ని ఎవరికయినా ఇచ్చి, వారి యౌవనాన్ని స్వీకరించవచ్చు. ఇదొక్కటే నీకు మార్గం'' అన్నాడు శుక్రాచార్యుడు.

ముదిమితో వజావజా వణికిపోసాగాడు యయాతి. అప్పటికే అతను తండ్రి. దేవయాని వలన అతనికి యదు, తుర్వసు అని ఇద్దరు కుమారులు జన్మించారు. శర్మిష్ఠ వలన ద్రుహ్యుడు, అనుడు, పూరుడు అను ముగ్గురు కుమారులు జన్మించారు.

ముసలితనం ప్రాప్తించినా యయాతికి స్త్రీ వ్యామోహం తగ్గలేదు. యౌవనాన్ని కోరుకున్నాడ తను. కొడుకులను పిలిచాడు. వార్ధక్యాన్ని స్వీకరించి, ఎవరయినా తనకి యౌవనాన్ని ప్రసాదించండంటూ కోరాడు. పెద్దవాళ్ళు ఎవరూ తండ్రి కోరికను మన్నించలేదు. అందరిలోకి చిన్నవాడు, ఆఖరివాడు శర్మిష్ఠ కొడుకు పూరుడు, తండ్రి కోరికను అంగీకరించాడు. తండ్రిని సంతోషపరచడమే విధిగా భావించాడు. తన యౌవనాన్ని యయాతికి ఇచ్చి, అతని వార్ధక్యాన్ని తాను స్వీకరించాడు.

## శకుంతల

పూరుని యవ్వనంతో యయాతి ఎనలేనంతగా స్త్రీ సుఖాన్ని అనుభవించాడు. అనేక సంవత్సరాలు విషయసుఖాల్లో తేలి తూలాడు. ఆఖరికి అందులో విరక్తి కలిగిందతనికి. ఆ విరక్తితో యజ్ఞాలు చేసి భగవంతుణ్ణి ఆరాధించాడు. యవ్వనాన్ని పూరునికి ఇచ్చి, తన ముసలితనాన్ని తాను స్వీకరించాడు. పూరుణ్ణి సార్వభౌముణ్ణి చేసి, అన్నలంతా అతని ఆజ్ఞను అనుసరించాలని శాసించాడు. నిరాసక్తుడై తపోవనాలకు తరలిపోయాడు. అక్కడ భగవంతుని ఆరాధిస్తూ, విష్ణుపదం పొందాడు. దేవయాని కూడా పతిని అనుసరించి, భగవంతునిపై మనసు నిలిపి, దేహత్యాగం చేసింది.

ఈ పూరువంశం నుండే భరతవంశపు రాజులంతా జన్మించారు. మేధాతిథి, దుష్యంతుడు ఈ వంశంలోని వారే!

### శకుంతల

శకుంతల, దుష్యంతుల కథ అందరికీ తెలిసిందే! ఈ కథనే మహాకవి కాళిదాసు నాటకంగా మలిచాడు. భారతంలో విపులంగా వివరించిన ఈ కథను, భాగవతంలో క్లుప్తీకరించాడు వ్యాసుడు.

ఒకప్పుడు విశ్వామిత్రుడు తపస్సు చేస్తూ ఉండగా, అతని తపస్సును భగ్నం చేసేందుకు మేనకను పంపాడు ఇంద్రుడు. మేనక ప్రవేశంతో విశ్వామిత్రుని తపస్సు భగ్నమయింది. మేనకను మోహించాడు విశ్వామిత్రుడు. అతని వలన మేనకకు ఒక బాలిక జన్మించింది. ఆ బాలికను

అక్కడే అడవిలో విడచిపెట్టి, మేనక స్వర్గానికి వెళ్ళిపోయింది. విశ్వామిత్రుడు కూడా తనదోవన తాను వెళ్ళిపోయాడు. తల్లిదండ్రులు వదలి వేసిన ఆ శిశువును, తమ రెక్కల నీడన పక్షులు రక్షించసాగాయి. పక్షులు రక్షిస్తున్న ఆ బాలికను కణ్వమహర్షి చూశాడు. తన ఆశ్రమానికి తీసుకునిపోయాడు ఆ పిల్లను పెంచసాగాడక్కడ. పక్షులచే రక్షించబడినందున ఆ పిల్లకు 'శకుంతల' అని పేరు పెట్టాడు కణ్వుడు. ఆశ్రమంలో పెరిగి పెద్దదయింది శకుంతల. యౌవనవతి అయింది. అందాలను సంతరించుకుంది.

ఒకనాడు దుష్యంతుడు వేటకు వచ్చాడు. అరణ్యంలో వేటాడి వేటాడి అలసిపోయాడు. దగ్గరగా ఉన్న కణ్వాశ్రమానికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఆశ్రమంలో కణ్వుడు లేడు. శకుంతలే దుష్యంతుణ్ణి ఆహ్వానించి, గౌరవించింది. శకుంతల అందచందాలకు దుష్యంతుడు అప్రతిభుడయ్యాడు. మోహించాడామెను. శకుంతల కూడా దుష్యంతుణ్ణి ఆరాధనగా చూసింది. తనను వివాహమాడమన్నాడు దుష్యంతుడు. కణ్వమహర్షి అనుమతి లేనిదే అది సాధ్యం కాదన్నది శకుంతల. మహర్షి రాక కోసం వేచి చూద్దామన్నది. వినలేదు దుష్యంతుడు. క్షత్రియులకు గాంధర్వవివాహం శాస్త్రసమ్మతం అన్నాడు. శకుంతలను ఒప్పించాడు. ఆమెకు పుట్టిన కుమారుణ్ణే యువరాజుని చేస్తానని మాటిచ్చాడు. ఆఖరికి గాంధర్వవిధినే శకుంతలను వివాహమాడాడు దుష్యంతుడు. ఆ రాత్రి ఆమెను చేరి సుఖించాడు. మర్నాడు, రాజధానికి ప్రయాణమై వెళ్ళిపోయాడు. కూడా తను వస్తానన్నది శకుంతల. పరివారాన్నీ, పరిచారికుల్నీ పంపి, సగౌరవంగా తీసుకుని వెళ్తానన్నాడు దుష్యంతుడు. ఆలోపు కణ్వమహర్షి కూడా వస్తాడన్నాడు. తన వేలి ఉంగరాన్ని గుర్తుగా, ప్రేమగా శకుంతలకు ఇచ్చి వెళ్ళిపోయాడతను. కొంతకాలానికి శకుంతల గర్భవతి అయింది. అప్పుడు ఆశ్రమానికి చేరుకున్నాడు కణ్వమహర్షి. అతని దృష్టిలో పడేందుకు భయపడింది శకుంతల. తాను చేసిన పనికి మహర్షి మందలిస్తాడనుకున్నది. అయితే దూర దృష్టితో అంతా గ్రహించిన కణ్వుడు, శకుంతల-దుష్యంతుల వివాహాన్ని అంగీకరించాడు. ఆమెను దీవించాడు.

నెలలు నిండాయి. శకుంతుల కుమారుణ్ణి కన్నది. అతనికి భరతుడు అని పేరు పెట్టాడు కణ్వుడు. విష్ణుదేవుని అంశతో ఎన్నో శుభలక్షణాలతో జన్మించిన భరతుడు, బాల్యంలోనే మహావీరుడనిపించుకున్నాడు. అరణ్యంలో సింహాలతోనూ, పులులతోనూ ఆటలాడుకునేవాడు. అతని శౌర్యసాహసాలకు అశ్చర్యపోయేవారంతా. ఎంతకాలమయినా దుష్యంతుడు తిరిగి రాలేదు. శకుంతలను తోడుకుని తీసుకుని వచ్చేందుకు పరివారాన్నీ, పరిచారికుల్నీ పంపలేదు. భర్త తనని మరచిపోయాడనుకున్నది శకుంతల. బాధపడింది. శకుంతలను దుష్యంతుడు మరచిపోయేందుకు ఒక కారణం ఉన్నది.

ఒకనాడు దుష్యంతుణ్ణి తలచుకుంటూ శకుంతల కలలలోకంలో విహరిస్తున్నది. ఆ సమయంలో ఆశ్రమానికి దుర్వాసుడు వచ్చాడు. వచ్చిన మునిని గమనించలేదు శకుంతల. అతనిని కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలకరించలేదు. దాంతో కోపం వచ్చింది అతనికి.

''ఎవరినయితే నువ్వు తలచుకుంటూ ఉన్నావో, ఆ వ్యక్తి నిన్ను మరచిపోవుగాక'' అని శపించాడు. వెళ్ళబోయాడు. అప్పుడు దుర్వాసుణ్ణి గమనించి, చేతులు జోడించి నమస్కరించింది శకుంతల. చేసిన తప్పుని క్షమించమంటూ, శాపవిమోచనం ప్రసాదించమని వేడుకుంది.



''తాను ఇచ్చిన ఉంగరం ఆ వ్యక్తి చూసినప్పుడు, నిన్ను అతను గుర్తిస్తాడు. జరిగిందంతా జ్ఞాపకానికి వస్తుంది'' అన్నాడు దుర్వాసుడు. నిష్క్రమించాడక్కణ్ణుంచి.

దుష్యంతుని పిలుపు కోసం చూసి చూసి అలసిపోయి, అఖరికి కణ్వముని ఆదేశానుసారం భరతుణ్ణి తీసుకుని, తానే స్వయంగా బయల్దేరింది శకుంతల. రాజధానికి చేరింది. దుష్యంతుణ్ణి సందర్శించి, శకుంతలనంటూ, భరతుడు కుమారుడన్నది. తమని పరిగ్రహించమన్నది.

''నువ్వెవరో నాకు తెలియదు. ఈ బాలుడు నా కుమారుడు ఏమిటి? అంతా అబద్ధం. తప్పు'' అన్నాడు దుష్యంతుడు. దిగ్భ్రాంతి చెందింది శకుంతల. విలవిలలాడింది. భోరుమంది. వేటకి దుష్యంతుడు అడవికి రావడం, అలసిపోవడం, కణ్వాశ్రమానికి చేరడం, తనని చూడడం,

గాంధర్వ వివాహం చేసుకోవడం అంతా దుష్యంతునికి గుర్తు చేసింది శకుంతల. ఏదీ గుర్తుకు రాలేదు దుష్యంతునికి. తల అడ్డంగా ఊపాడతను.

''నువ్వు చెప్పినవేవీ నాకు సంబంధించినవి కావు. కావాలనే నువ్వెందుకో అబద్ధాలు ఆడుతున్నావు. పాపాన్ని మూటగట్టుకుంటున్నావు'' అన్నాడు దుష్యంతుడు. శకుంతలను అసహ్యించుకుని అక్కణ్ణుంచి నిష్క్రమించబోయేంతలో ఆకాశవాణి ఇలా పలికింది.

''దుష్యంతమహారాజా! శకుంతల చెప్పింది అంతా నిజం. ఆమె నీ భార్య, భరతుడు నీ కొడుకు. వారిని పరిగ్రహించి, నీ నిజాయితీని నువ్వు నిలుపుకో! పదే పదే శకుంతలను అవమానించకు.''

''మహారాజా! మీరు నాకు ఇచ్చిన ఉంగరాన్ని చూడండి, మీకు అంతా గుర్తుకు వస్తుంది'' అన్నది శకుంతల. ఆనాడు తనకి ఇచ్చిన ఉంగరాన్ని దుష్యంతునికి చూపించింది. ఉంగరాన్ని చూడగానే అతనికి అంతా జ్ఞాపకానికి వచ్చింది. చేసిన తప్పును క్షమించమన్నట్టుగా సన్నగా కన్నీరు పెట్టుకున్నాడు. శకుంతలనూ, భరతుణ్ణీ భార్యాపుత్రులుగా స్వీకరించాడు.

దుష్యంతుని తర్వాత భరతుడు చక్రవర్తి అయ్యాడు. ముల్లోకాల్లోనూ ఎనలేని కీర్తిప్రతిష్టలు గడించాడు. గంగాతీరంలో దీర్ఘతపుని ఆధ్వర్యంలో యాభై అయిదు అశ్వమేధయాగాలు చేశాడు. యమునాతీరంలో డెబ్బయి ఎనిమిది వాజిమేధాలు చేశాడు. మొత్తానికి నూటముప్పయి మూడు అశ్వమేధయాగాలు చేసి, భూరిదక్షిణలు ఇచ్చాడందరికీ. సమస్తరాజులూ సామంతులయ్యా రతనికి. ఇరవైవేల సంవత్సరాలు పాలించాడు భరతుడు. చివరకు ముక్తసంగుడై వనాలకు వెళ్ళిపోయాడు. తపస్సుతో దేహాన్ని చాలించాడు. విష్ణుపదం చేరుకున్నాడు.

భరతునికి ముగ్గురు భార్యలు. ఆ ముగ్గురూ విదర్భరాజ కుమార్తెలు. వారికి సంతానం కలిగింది. అయితే వారిలో ఏ ఒక్కరూ తండ్రితో సమానం కాలేకపోయారు. తండ్రి ధైర్యసాహసాలూ, అందచందాలూ అంటని ఆ పుత్రుల్ని, తల్లులే చంపివేశారు. తన పుత్రులు కారని భరతుడు శంకిస్తాడని వారి అనుమానం. వ్యభిచరించారని అంటాడన్న భయం తల్లుల్ని అందుకు పురిగొల్పింది. అప్పుడు మరుత్తులను ఆరాధించాడు భరతుడు. యజ్ఞం చేశాడు. ఫలితంగా భరద్వాజుని తెచ్చి, అతనికి పుత్రునిగా బహూకరించారు మరుత్తులు. భరద్వాజుని పుట్టుక చాలా చిత్రమయినది. బృహస్పతి, తన సోదరుని భార్య మమతను కామించాడు. ఆమె అప్పటికే గర్భవతి. తనని చేరవద్దని ఎంతగా బ్రతిమలాడినా వినలేదు బృహస్పతి. ఆమెను లొంగదీసుకుని, తన కోరికను తీర్చుకున్నాడు. కొన్నాళ్ళకు మమత ప్రసవించింది. కుమారుణ్ణి కన్నది. అయితే ఆ కుమారుణ్ణి గ్రహిస్తే భర్త తనని జారిణి అంటాడని భయపడి, అతన్ని వదలివేసింది. బృహస్పతి కూడా ఆ కుమారుణ్ణి స్వీకరించలేదు. క్షేత్రవీర్యాలు రెండూ కలసి పుట్టడంతో అతను ద్వాజుడయినాడు. పిల్లాణ్ణి నువ్వు భరించాలంటే నువ్వు భరించాలంటూ బృహస్పతీ, మమతా వాదులాడుకోవడంతో అతనికి 'భరద్వాజుడు' అని పేరొచ్చింది. ఆఖరికి అతన్ని మరుత్తులు తీసుకుని పోయి పెంచసాగారు. అతన్నే ఇప్పుడు భరతునికి పుత్రునిగా బహూకరించారు. వంశం వితథం(అసత్యం)అయినప్పుడు అవతరించాడు కనుక అతనికి 'వితథుడు' అని కూడా పేరు.

### రంతిదేవుడు

రంతిదేవుడు పుణ్యపురుషుడుగానూ, భాగవతోత్తముడుగానూ చాలా ప్రసిద్ధుడు.

వితథునికి మన్యువు జన్మించాడు. అతనికి బృహక్షత్రుడు, జయుడు, మహావీర్యుడు, నరుడు, గర్గుడు జన్మించారు. నరునికి సంకృతి జన్మించగా, ఆ సంకృతిపుత్రుడే రంతిదేవుడు.

రంతిదేవుడు ఐహికసుఖాలను ఆశించలేదు. ధనార్జనకోసం పరుగుదీయలేదు. అంతా దైవ కృప అంటూ ఏది లభిస్తే దానితో సంతృప్తి చెందుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాడు. అనేక కష్టాలు అనుభవించాడు. ఉన్నదానిలోనే దానం చేయసాగాడతను. ఒకొక్కప్పుడు, తనూ, తన కుటుంబం పస్తులుంటూ కూడా అతను దానం చేసేందుకు వెనుకాడలేదు. అంతా దానం చేయడంతో తినేందుకు కూడా ఏమీ లేనివాడయ్యాడు రంతిదేవుడు. ఆఖరికి తాగేందుకు మంచినీరు కూడా లేక నలభైఎనిమిది రోజులు అతని కుటుంబం ఉపవాసం ఉంది. ఒకనాడు కొద్దిగా అన్నం లభించింది ఆ కుటుంబానికి. దానిని కుటుంబసభ్యులంతా భుజించేందుకు సిద్ధపడుతోంటే అతిథిగా బ్రాహ్మణుడొకడు ప్రవేశించాడు. అతిథిని ఆహ్వానించి అన్నంలోని సగభాగాన్ని అతనికి అర్పించాడు రంతిదేవుడు. అతిథిని శ్రీహరిగా భావించాడతను. మిగిలిన అన్నాన్ని భుజించబోతుండగా శూద్రుడొకడు, ఓ కుక్కను వెంటబెట్టుకుని వచ్చాడక్కడికి. భిక్షపెట్టం డని అర్థించాడు. తనకీ, కుక్కకీ పట్టెడు మెతుకులు లేవని, ఆకలితో అలమటించిపోతున్నామని ప్రార్థించాడు. అంతే! కుటుంబసభ్యుల ముందున్న విస్తర్లలోని అన్నాన్ని తీసుకుని, శూద్రునికీ, కుక్కకీ సమర్పించాడు రంతిదేవుడు. ఆకలి తీర్చుకునేందుకు నీరు తాగబోయాడు. చండాలుడు ప్రవేశించాడప్పుడు. కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని కనిపించాడు. నీరిచ్చి తన దాహార్తిని తీర్చి, ప్రాణాలు కాపాడమన్నాడు. ఆ నీరు తాగకపోతే రంతిదేవుడు కూడా చనిపోయేట్టు ఉన్నాడు. అయినప్పటికీ అతను వెనుకడుగు వేయలేదు. తను తాగబోయే నీటిని చండాలునికి సమర్పించి, అతని దాహం తీర్చాడు. అప్పుడు రంతిదేవుని దానగుణాన్ని మెచ్చుకుంటూ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ ప్రత్యక్షమయ్యారక్కడ. అతని దానగుణాన్నీ, భక్తినీ పరీక్షించేందుకే ఆ ముగ్గురూ శూద్రుడూ, శునకమూ, చండాలుడు రూపాల్లో ప్రత్యక్షమయ్యారు. ఇప్పుడు నిజరూపాలు ప్రదర్శించి, వరం కోరుకోమన్నారు. త్రిమూర్తులు ముగ్గురికీ మొక్కి, తనకి సదా విష్ణుభక్తిని అనుగ్రహించమని కోరాడు రంతిదేవుడు. దీవించి, అనుగ్రహించారు త్రిమూర్తులు.

## కృష్ణావతారం

భరతవంశం శాఖోపశాఖలయింది. ఈ సంతతివారు అనేక వర్గాలుగా ఏర్పడ్డారు. వేర్వేరు వంశనామాలతో వీరంతా భరతఖండాన్ని పాలించారు. భరతపుత్రుడయిన మన్యువు కుమారులు అయిదుగురిలో గర్గుని సంతతివారు బ్రాహ్మణులయినారు. వారిని 'గార్గ్యులు' అన్నారు. అలాగే మహావీర్యునికి పుట్టినవారు కూడా బ్రాహ్మణులయినారు. బృహత్క్షత్రునికి సుహోత్రుడు పుట్టాడు. అతని కుమారుడు హస్తి. యమునానదీతీరాన అతను గొప్పనగరాన్ని నిర్మించాడు. అదే హస్తినాపురం. భారతరాజధాని ఢిల్లీ ప్రాంతమే ఒకనాటి హస్తినాపురం. ఈ నగరమే నాడు కౌరవులకూ, పాండవులకూ రాజధాని అయింది.

హస్తి సంతతి శాఖోపశాఖలయింది. ఈ సంతతివారే అయిదు విషయాలలో గొప్పవారై పాంచాలరాజులుగా జన్మించారు. ద్రుపదుడు, దృష్టద్యుమ్నుడు, ద్రౌపది తదితరులంతా ఈ వంశానికి చెందినవారే! ముద్గలుని సంతానం బ్రాహ్మణమయమై 'మౌద్గల్య' గోత్రికులయ్యారు. ముద్గలుని కుమారుడే దివోదాసుడు. కుమార్తె అహల్య. అహల్య–గౌతములకు శతానందుడు జన్మించాడు. ఈ వంశంలోనే కృపాచార్యుడు, కృపి, అశ్వత్థామ జన్మించారు. అజమీఢుని వంశంలో సంవరుణుడు జన్మించాడు. అతని కుమారుడే కురువు. యజ్ఞం చేసేందుకు ఇతను దున్నిన భూమినే 'కురుక్షేత్రం' అన్నారు. జయద్రథుని వంశంలో జరాసంధాదులు జన్మిస్తే, కురుసంతతిలో శంతనుడు, బాహ్లికుడు జన్మించారు. శంతనునికీ–గంగకీ భీష్ముడు జన్మించాడు. శంతనుడికీ – సత్యవతికీ చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు జన్మించారు. చిత్రాంగదుడు చిన్నతనంలోనే మరణించాడు. కాశీరాజు కుమార్తెలు అంబిక, అంబాలికలను విచిత్రవీర్యుడు వివాహమాడాడు. భీష్ముడే వారిని తెచ్చి, విచిత్రవీర్యునికి ఇచ్చి వివాహం జరిపించాడు. ప్రతిజ్ఞకు కట్టుబడి, విచిత్రవీర్యుణ్ణే రాజుని చేశాడతను. రోగపీడితుడై విచిత్రవీర్యుడు, సంతానం లేకుండా మరణించాడు. అప్పుడు సత్యవతి అంగీకారం మేరకు అంబిక, అంబాలికలకు వ్యాసుని కటాక్షంతో ధృతరాష్ట్రుడు, పాండురాజు జన్మించారు. అంబిక దాసికి వ్యాసమహాముని కృపతో విదురుడు జన్మించాడు.

శంతనుని వివాహానికి పూర్వం పరాశరమునీంద్రుని కోరిక మేరకు సత్యవతి ఓ కుమారుణ్ణి కన్నది. అతనే కృష్ణద్వైపాయనుడు. వేదాలను విభజించి 'వ్యాసుడు' అయినాడతను. గాంధారి–ధృతరాష్ట్రులకు దుర్యోధనాదులు నూరుగురు కుమారులు, ఓ కుమార్తె జన్మించారు. ఆ కుమార్తె పేరే దుశ్శల. తన పత్ని కుంతిని కూడి పాండురాజు సుఖించే యోగం లేకపోయింది. అందుకు ఓ మునిశాపం కారణమయింది. ఫలితంగా యముడు, వాయువు, ఇంద్రుడు కటాక్షంతో వరుసగా ధర్మరాజు, భీముడు, అర్జునులను కుంతి కన్నది. అశ్వినీదేవతల అనుగ్రహంతో పాండురాజు రెండవభార్య మాద్రి నకుల సహదేవుల్ని కన్నది. పంచపాండవులు వీరే! యయాతి కుమారుడు అనుడివంశంలో చాలా మంది జన్మించారు. ఈ వంశానికి చెందినవాడే బలి. అతనికి సంతానం లేదు. అయితే అతని భార్య, దీర్ఘతపుని అనుగ్రహంతో అంగుడు, వంగుడు, కళింగుడు, సింహుడు, పుళిందుడు, ఆంధ్రుడు అని ఆరుగురు కుమారులను కన్నది. వారంతా ప్రసిద్ధులై వేరు వేరు దేశాలు పాలించారు. ఆయా దేశాలు వారి పేర్లతోనే ప్రసిద్ధి చెందాయి. ఆంధ్రుడు పాలించిన దేశమే 'ఆంధ్రదేశం' అయింది. ఆయన సంతతి వారే 'ఆంధ్రులు' అయినారు. యయాతి జ్యేష్ఠపుత్రుడయిన యదువువంశం 'యదువంశం' పేరిట లోకంలో ప్రసిద్ధి చెందింది. శ్రీకృష్ణుడు ఈ వంశంలోనే అవతరించాడు.

## కృష్ణావతారం

రామాయణానికి సుందరకాండ, భారతానికి శాంతిపర్వం ఎంత గొప్పవో భాగవతానికి దశమస్కంధం అంత గొప్పది. సాక్షాత్తూ భగవంతుడు అయిన శ్రీకృష్ణుని అవతారకథ యావత్తూ దశమస్కంధంలో అభివర్ణితం కావడమే దీనికి కారణం. భగవంతుని అవతారాలన్నీ ఒక ఎత్తు, శ్రీకృష్ణావతారం ఒక్కటీ ఒక ఎత్తు అంటారు పెద్దలు. దీనికి కారణం ఉంది. భగవంతుడు

శ్రీకృష్ణావతారంలో సమగ్రంగా భాసించాడు. మిగిలిన అవతారాల్లో భగవంతుడు అసాధారణంగా కనిపించినప్పటికీ మానవాతీతంగా కనిపించడు. సాధారణ మానవుడిలాగానే భగవంతుడు కష్టసుఖాలు అనుభవించాడు. రామావతారం దీనికి తార్కాణం. అయితే కృ ష్ణావతారం దీనికి పూర్తి విరుద్ధం. ఈ అవతారంలో కృష్ణుడు పూర్ణపురుషుడు. భగవంతుడు ఇందులో పరిపూర్ణంగా భాసిస్తాడు.

నేను భగవంతుణ్ణి! సృష్టి స్థితిలయలకు కారణభూతుణ్ణి నేనే! ఇదంతా నా కల్పితం. మహాయోగులు కూడా నన్ను తెలుసుకోలేరు. నిష్కాములై నన్ను సేవించండి. మీకు ముక్తిని ప్రసాదిస్తాను అన్నది శ్రీకృష్ణుడు ఒక్కడే! తాను భగవంతుణ్ణి అని చెప్పిన అవతారం మరొకటి లేదు. అంతేకాదు, తనని కాదంటే పుట్టగతులు ఉండవు. వాణ్ణి శిక్షించి తీరుతాను. జాగ్రత అని అన్నది కూడా కృష్ణుడే! హెచ్చరించి ఊరుకోలేదు కృష్ణుడు. దానిని ఆచరించి చూపించాడు. కంస, శిశుపాలాదులవధ, కురుక్షేత్ర సంగ్రామంలో అతను నిర్వహించిన పాత్ర ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. తన తత్త్వాన్ని గీతోపదేశం ద్వారా లోకానికి చాటిన వాడు



కృష్ణుడు. సకల ఉపనిషత్సారం అయిన గీత నాటికీ నేటికీ లోకపూజ్యంగా నిలిచింది. కృష్ణావతారతత్త్వాన్ని పలువురు పలు విధాలుగా వాఖ్యానించారు. సామాన్యదృష్టితోగాక, విశేష దృష్టితో చూస్తేనేగాని కృష్ణావతారతత్త్వాన్ని అవగతం చేసుకోలేమన్నారు. కృష్ణుడు మహామాయగా కనిపిస్తాడు. అంతటి మాయగాడు మరొకడు లేడు. 'కృష్ణమాయ' అన్న పదం జగత్ప్రసిద్ధమన్నది అందరికీ తెలిసిందే! ముందు మాయపుట్టి, తర్వాతే కృష్ణుడు పుట్టాడు. అందుకనే అంతా మాయ అంటారు. ఈ మాయ అంతా భగవత్ స్వరూపమే! వేలాది గోపికలూ, మీరాబాయిలాంటి భక్తులూ అనేకమంది కృష్ణుని చెలికానిగా, పతిగా, దైవంగా కొలిచి ముక్తిపొందారు. పురుషులను సైతం మోహింపజేసే జగన్మోహనాకారం కృష్ణునిది. కృష్ణుడెంతటి భోగో అంతటి యోగి. ఆ మహానుభావుడు ద్వాపర, కలియుగ సంధికాలంలో యదువంశంలో అవతరించాడు. భగవంతుని కథా, అతని లీలలని సమగ్రంగా చెప్పడమే భాగవత రచనకు మూలం కనుక కృష్ణావతారం కథను భాగవతం దశమస్కంధంలో వ్యాసుడు నిక్షిప్తం చేశాడు. ఈ కథ చదివితేనే భాగవత పఠనానికి ఫలసిద్ధి.

ఒకప్పుడు భూమి మీద దైత్యులు విచ్చలవిడిగా ప్రవర్తించసాగారు. వారి దుర్మార్గాలనూ, దురాగతాలనూ భూదేవి సహించలేకపోయింది. గోవు రూపాన్ని ధరించి బ్రహ్మదేవుని వద్దకు గోలు గోలున చేరుకుందామె. కష్టాన్నంతా చెప్పుకుని విలపించింది. అప్పుడు శంకరుడు, ఇంద్రాది దేవతలు సహా బ్రహ్మ వైకుంఠానికి చేరుకున్నాడు. భూదేవి కష్టాన్ని తెలియజేసి, విష్ణుమూర్తిని ప్రార్థించారంతా. వారి ప్రార్థనకు విష్ణువు ఇలా స్పందించాడు. తాను త్వరలో యాదవకులంలో జన్మిస్తానన్నాడు. దుష్టులను సంహరిస్తానని, భూభారాన్ని తొలగిస్తానని చెప్పాడు. దేవతలను వారి వారి అంశలతో భూమి మీద జన్మించమని ఆదేశించాడు. దేవతాస్త్రీలను కూడా భూమి మీద జన్మించాల్సిందిగా కోరాడు. ఫలితంగానే విష్ణుమూర్తీ, మిగిలిన దేవతలూ భూలోకంలో జన్మించారు. గంగను చూసిన వాడు, గంగాజలంలో స్నానించిన వాడు, దానిని తాగిన వాడు ఎలా అయితే సకలపాపాల నుండి విముక్తమవుతారో అలాగే వసుదేవుని కుమారుడయిన వాసుదేవునికథ చెప్పమని అడిగినవాడు, దానిని చెప్పినవాడు, ఆ కథ విన్నవాడు ఈ ముగ్గురూ పరమపావనమై సద్గతులు పొందుతారు.

## వాసుదేవుడు

పూర్వం కాళింది నదీతీరాన మధువనం అని ఒక వనం ఉండేది. దానిని మధువు అనే వాడు పాలించాడు. ఈ కారణంగానే మధురానగరం ఏర్పడింది. ఈ మధురానగరమే యాదవులకు రాజధాని అయింది. మధువు తర్వాత అతని కుమారుడు లవణుడు రాజయినాడు. ఇతను రాక్షస ప్రవృత్తితో అనేక దుర్మార్గాలకు పాల్పడ్డాడు. శ్రీరాముని తమ్ముడు శత్రుఘ్నుడు, ఈ లవణాసురుణ్ణి చంపి, మధురానగరాన్ని తన కుమారులయిన పుష్కర, పుష్కరాక్షులకు అందజేశాడు. సూర్యవంశపు రాజులు అంతరించిన తర్వాత ఈ నగరం యాదవులవశమయింది. ఆనాటి నుంచి యాదవులకు అది రాజధాని అయింది.

మాధురం, శూరసేనం అనే రెండు రాజ్యాలూ పక్కపక్కనే ఉండేవి. యాదవులలో శూరుడయిన శూరసేనుడు, మధురానగరం రాజధానిగా చేసుకుని, ఆ రెండు రాజ్యాలనూ పాలించాడు.

అతని భార్య మారిష. వారికి పదకొండుమంది కుమారులు జన్మించారు. వారిలో పెద్దవాడు వసుదేవుడు. ఈ వసుదేవుని కుమారుడే శ్రీకృష్ణుడు. వసుదేవుడు పూర్వజన్మలో ఒక ప్రజాపతి. పిల్లలు లేరతనికి. పిల్లలకోసం అతనూ, భార్యా తీవ్రంగా తపస్సు చేశారు. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. తమకు కుమారునిగా విష్ణువునే జన్మించమని వరం కోరుకున్నారు వారు. ఆ వరం ఈ జన్మలో ఫలించదని, వచ్చే జన్మలో ఫలింపజేస్తానన్నాడు విష్ణువు. ఫలితంగానే విష్ణువు శ్రీకృష్ణుడిగా వసుదేవునికి జన్మించాడు.

శూరసేనునికి అయిదుగురు కుమార్తెలు జన్మించారు. వారిలో పెద్దది పృథ. మేనత్తకుమారుడు కుంతిభోజునకు పిల్లలు లేని కారణంగా పృథను పెంచుకోమని ఇచ్చాడు శూరసేనుడు. కుంతిభోజుడు పెంచిన కారణంగా పృథకు 'కుంతి' అని పేరొచ్చింది. ఆ విధంగా కుంతి, కృష్ణునికి మేనత్త అయింది. ఆమె పాండురాజుని పెళ్ళాడం, పాండవులు ఆమె పుత్రులు అన్న సంగతి సర్వులకూ తెలిసిందే! కుంతి కన్యగా ఉన్నప్పుడు దుర్వాసమహర్షి వారి ఇంటికి వచ్చాడు. ఆ మునికి అత్యంత భక్తిశ్రద్ధలతో కుంతి పరిచర్యలు చేసింది. అందుకు దుర్వాసుడు సంతోషించి, ఆమెకు ఒక మంత్రాన్ని ఉపదేశించాడు. ఏ దేవుని తలచుకుని ఆ మంత్రాన్ని పఠిస్తే ఆ దేవుడు వెంటనే ప్రత్యక్షమవుతాడు. కోరిన కోరిక తీరుస్తాడు. ఆ మంత్ర ప్రభావాన్ని పరీక్షించదలచింది కుంతి. సూర్యుని కోరుకుంటూ మంత్రాన్ని పఠించింది. సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు. పరీక్షకు పిలిచిందేకాని, వలచి పిలవలేదన్నది కుంతి. తనని చెడగొట్టవద్దని బతిమలాడింది. క్షమించ మంది. ఫలితంగా ఆమె కన్యాత్వం చెడకుండా గర్భం ప్రసాదించాడు సూర్యుడు. కొన్నాళ్ళకు ఆమె ఓ కుమారుణ్ణి కన్నది. లోకోపవాదుకి భయపడి, ఆ కుమారుణ్ణి ఓ పెట్టెలో పెట్టి, గంగలో విడచిపెట్టింది. బృహద్రథుని వంశానికి చెందిన అతిరథుడు అనే సూతునికి ఆ పెట్టె లభించింది. తెరచి చూశాడతను. సహజకవచకుండలాలతో సూర్యునిలా వెలుగుతున్న బాలుని చూసి ఆశ్చర్యపోయాడు. దైవప్రసాదంగా భావించి, ఆ బాలుని పెంచసాగాడు. ఆ బాలుడే కర్ణుడు. కర్ణుడు కుంతిపుత్రుడనీ, ధర్మరాజాదులకు జ్యేష్ఠసోదరుడనీ కృష్ణునికి తెలుసు. తెలిసినా ఆ సంగతి పాండవులకు చెప్పలేదతను. చెబితే భారతయుద్ధం జరగదని తలచాడు.

## కంసుడు

ఆహూకుడు యాదవరాజుల్లో ఒకడు. అతనికి ఉగ్రసేనుడు, దేవకుడు అని ఇద్దరు కుమారులు. ఉగ్రసేనుని కుమారుడే కృష్ణుని మేనమామ కంసుడు. ఇతడు రాక్షసప్రవృత్తితో విష్ణువుతో విరోధం పెట్టుకోవడానికి ఓ కారణం ఉన్నది. కంసుడు పూర్వజన్మలో ఓ రాక్షసుడు. అతని పేరు కాలనేమి. మారీచుని కుమారుడితను. రావణుని సమర్థిస్తూ శ్రీరామచంద్రునిపై కక్ష పూనాడు. యుద్ధంలో మూర్ఛిల్లిన లక్ష్మణుని కోసం హనుమంతుడు సంజీవనీపర్వతం తెచ్చినప్పుడు, ఈ కాలనేమే హనుమంతుని కార్యానికి విఘ్నం కలిగించేందుకు శతవిధాలా ప్రయత్నించాడు. హనుమంతుడు అప్పుడతన్ని సంహరించాడు. ఆ కాలనేమే ఇప్పుడు కంసునిగా జన్మించి, విష్ణువుపై కత్తిగట్టాడు. దానవఅంశతో కంసుడు పుట్టడానికి ఇంకొక హేతువు కూడా ఉన్నది. ఉగ్రసేనుని భార్య కొందరు యాదవస్త్రీలతో కలసి, ఒకనాడు స్నానానికై యమునానదికి వెళ్ళింది. అప్పుడు ఆమె అక్కడ రజస్వల అయింది. ఆమె చిత్తం రాగయుక్తం అయింది. దానిని ఓ దానవుడు కనిపెట్టాడు. అతని

పేరు ద్రవిళుడు. అతను ఉగ్రసేనుని రూపం ధరించి, ఆమెను కూడాడు. తర్వాత జరిగిన మోసాన్ని గ్రహించిందామె. ద్రవిళుణ్ణి 'నువ్వు ఎవరు?' అంటూ నిలదీసింది. నిజం చెప్పాడప్పుడు ద్రవిళుడు. కోపంతో అప్పుడామె ఇలా అన్నది.

''నీ బీజంతో నాకు జన్మించిన వాడు శ్రీహరి చేతుల్లో హతుడవుతాడు.''

దానవుని వలన ఉగ్రసేనునికి జన్మించినవాడే కంసుడు. అందుకే అతనికి రాక్షసగుణాలు అలవడ్డాయి.

# శ్రీకృష్ణ జననం

ఉగ్రసేనునికి క్షేత్రజ కుమారుడయిన కంసుడేగాక మరి ఎనిమిది మంది కుమారులు జన్మించారు. కంస, కంసవతి మొదలయిన అయిదుగురు కుమార్తెలు కూడా జన్మించారు. ఉగ్రసేనుని తమ్ముడు దేవకుడికి నలుగురు కుమారులు, ఏడుగురు కుమార్తెలు జన్మించారు.

ఆ ఏడుగురిలో చివరది దేవకి. ఈ ఏడుగురినీ వసుదేవుడు వివాహం చేసుకున్నాడు. దేవకీ వసుదేవులకే శ్రీకృష్ణుడు జన్మించాడు. దానవాంశతో జన్మించిన కంసుడు చిన్ననాటి నుంచే ఎన్నో దుష్కృత్యాలకు పాల్పడ్డాడు. పుణ్యాత్ములనూ, బ్రాహ్మణులనూ హింసించసాగాడు.

జరాసంధుని కుమార్తెలయిన అస్తి, ప్రాప్తిలను వివాహం చేసుకున్నాడతను. శిశుపాలుడు, దంతవక్త్రుడుతో స్నేహం కలుపుకున్నాడు. తండ్రి ఉగ్రసేనుణ్ణి బంధించి, తనని తాను రాజుగా ప్రకటించుకుని ప్రజలను పీడించసాగాడు.

## శ్రీకృష్ణజననం

ఆడపిల్లను తొలిసారిగా అత్తవారింటికి పంపేటప్పుడు, ఆమె వెంట అన్నో తమ్ముడో లేదంటే పుట్టింటికి సంబంధించిన మరొక వ్యక్తి ఎవరయినా ఉండడం ఆచారం. తోడుగా వెళ్ళి ఆమెను అత్త ఇంట దిగవిడచి రావడం సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని అనుసరించే దేవకీ వసుదేవుల వివాహం అనంతరం వారిని దిగవిడచి వచ్చేందుకు తోడుగా కంసుడు బయల్దేరాడు. చెల్లెలినీ, బావగారినీ రథంలో కూర్చోబెట్టుకుని, తానే రథాన్ని నడపసాగాడు కంసుడు. ఆ రథాన్ని అనేకమంది దాస దాసీజనం, పరివారం అనుసరించాయి. సకల మర్యాదలతో చెల్లెలిని అత్త వారింటికి తీసుకుని వెళ్తున్నాన్న ఆనందంలో ఉన్నాడు కంసుడు. అప్పుడు ఓ విచిత్రం జరిగింది. ఉత్సాహంగా ఉల్లాసంగా రథాన్ని నడుపుతున్న కంసుణ్ణి ఉద్దేశించి ఆకాశవాణి ఇలా పలికింది.

''కంసా! సోదరిని సంతోషంగా అత్తవారింటికి తీసుకుని వెళ్తున్నావు. చేజేతులా చావుని కొని తెచ్చుకుంటున్నావు. ఈ దేవకి కడుపున పుట్టిన ఎనిమిదవ బిడ్డే నీ ప్రాణాల్ని హరిస్తుంది. ఆ బిడ్డ చేతిలో నీకు మరణం తప్పదు.''

వినవచ్చిన ఆ మాటలకు విస్తుపోయాడు కంసుడు. కాసేపు కళ్ళు మూసుకున్నాడు. ఏకదీక్షతో ఆలోచించాడు. ఆకాశవాణి మాటలు నిజం కాకతప్పదు. తనకి మరణం తథ్యం. దానిని తప్పించుకోవాలి. ఎలా?

రథం దిగాడు కంసుడు. కొరకొరా చెల్లెలు దేవకిని చూశాడు. ఆమె సిగను పట్టి కిందకి లాగాడు. మొలలోని కత్తిని ఆమె పైకి దూశాడు.

''బావా'' అడ్డుకున్నాడు వసుదేవుడు.

''ఇది నా చెల్లెలు కాదు, నా ప్రాణాల్ని హరించే రాక్షసి. దీనిని ఈ క్షణమే హతమార్చి, నన్ను నేను కాపాడుకుంటాను. తప్పుకో'' అన్నాడు కంసుడు. వసుదేవుణ్ణి వెనక్కి నెట్టాడు. తూలిపడ బోయి నిలదొక్కుకుని, కంసుని కాళ్ళు పట్టుకున్నాడు వసుదేవుడు.

''బావా! భోజకులానికే ఎన్నదగినవాడవు. శూరుడవు. నీకు తెలియని ధర్మం లేదు. స్త్రీహత్య మహాపాతకం. చెల్లెలు, కొత్తపెళ్ళికూతురు, కాళ్ళపారాణి కూడా ఆరలేదు. అలాంటిదాన్ని, అమాయకురాలిని చంపుతాననడం ధర్మమా చెప్పు? దయచేసి నా మాట విను, దేవకిని వదలిపెట్టు.'' ప్రాథేయపడ్డాడు.

వినలేదు కంసుడు. దేవకిని చంపితీరుతానన్నాడు. ఎన్నో విధాలుగా నచ్చజెప్పి చూశాడు వసుదేవుడు. అయినా ఒప్పుకోలేదతను. తీవ్రంగా ఆలోచించి అప్పుడు ఇలా అన్నాడు వసుదేవుడు.

''ఎనిమిదవ బిడ్డ కదా నీ ప్రాణాల్ని హరించేది. ఎనిమిదవ బిడ్డనే కాదు, దేవకికి పుట్టిన ప్రతిబిడ్డనీ నీకు తెచ్చి ఇస్తాను. నువ్వేం చేసుకుంటావో చేసుకో! దేవకిని వదులు.''

వసుదేవుని వాగ్దానానికి శాంతించాడు కంసుడు. దేవకిని విడచిపెట్టాడు.



''మాట తప్పవు కదా?'' అడిగాడు వసుదేవుణ్ణి. తప్పనన్నాడతను.

''సరే, వెళ్ళిరండి.'' కంసుడు ఇద్దరినీ వదిలేశాడు. బ్రతుకుజీవుడా అని భర్తసహా అత్తారింటికి చేరుకున్నది దేవకి. కొన్నాళ్ళకు ఆమె ఓ కుమారుణ్ణి కన్నది. ఇచ్చిన మాట ప్రకారం ఆ కుమారుణ్ణి తీసుకుని, కంసుణ్ణి సమీపించాడు వసుదేవుడు.

''తీసుకోబావా'' అందజేశాడు. పసిబిడ్డను తీసుకుని చూశాడు కంసుడు. వేలెడు లేడు. తనని వీడేం చేస్తాడనుకున్నాడు. సన్నగా నవ్వుకున్నాడు. తర్వాత వసుదేవుని సత్యనిష్ఠకు కూడా సంతోషించి, ఇలా అన్నాడు.

''ఆడిన మాటకు కట్టుబడి బిడ్డను తీసుకుని వచ్చావు. ఆనందంగా ఉంది. ఈ పసిగుడ్డు నన్నేం చేస్తుంది. తీసుకునిపో, పిల్లాడితో సుఖంగా ఉండండి.'' వసుదేవునికి పిల్లాణ్ణి తిరిగి ఇచ్చేశాడు కంసుడు. ఆ బిడ్డపేరే కీర్తిమంతుడు.

కొన్నాళ్ళకి నారదమహర్షి, కంసుణ్ణి సందర్శించాడు. ఆ మాటా ఈ మాటా చెబుతూ వసుదేవాది యాదవులూ, దేవకీ మొదలయిన యదువనితలంతా దేవతలని చెప్పాడు. దేవకి గర్భాన శ్రీమహావిష్ణువు జన్మించనున్నాడని చెప్పి, అతడే కంససంహారానికి పూనుకుంటాడని తెలియజేశాడు. తట్టుకోలేకపోయాడు కంసుడు. గతజన్మలో తాను కాలనేమి అని తెలుసు కున్నాడతను. రాక్షసుణ్ణని కూడా తెలుసుకున్నాడు. రాక్షసులకూ, దేవతలకూ ఉన్న బద్ధవైరాన్ని తలచుకున్నాడు. తప్పదు, వసుదేవాది యాదవులందరినీ తుదముట్టించాలను కున్నాడు. అనుకున్నదే ఆలస్యం, దేవకీ వసుదేవుల్ని బంధించాడతను. సంకెళ్ళు వేసి, చెరసాలలో ఉంచాడు. చంపకుండా వదలివేసిన దేవకి తొలి సంతానం కీర్తిమంతుణ్ణి అప్పుడు నిర్దాక్షిణ్యంగా సంహరించాడు. లంబుడు, ప్రలంబుడు, చాణూరుడు, ముష్టికుడు, తృణావర్తుడు, అఘాసురుడు, అరిష్టుడు, ద్వివిదుడు, కేశి, ధేనుకాసురుడు, పూతనలాంటి రాక్షసులను చేరదీసి తనని తాను కాపాడుకునేందుకు ప్రయత్నించసాగాడు కంసుడు. కారాగారంలో జన్మించిన దేవకీ వసుదేవుల బిడ్డలు ఒకొక్కరినీ పొట్టన పెట్టుకుంటూ రాసాగాడు. అంతటా కట్టుదిట్టం చేసుకున్నాడు.

చెరసాలలో భటుల్ని కాపలా పెట్టాడు. దేవకికి బిడ్డ పుట్టీపుట్టగానే ఆ వార్తను తనకి చేర్చాలి. వార్త చేరిన మరుక్షణం కంసుడు అక్కడకి వచ్చేవాడు. తన ఖడ్గానికి ఆ బిడ్డను బలి చేసేవాడు. పుత్రశోకంతో దేవకీ వసుదేవులు కుమిలిపోసాగారు. నీవే దిక్కు అంటూ శ్రీమహావిష్ణువుని ధ్యానించసాగారు. కంసుని హింసలు భరించలేక యాదవులు చాలా మంది మధురానగరం విడచిపెట్టేశారు. కురు, పాంచాల, కేకయ, సాల్వ, విదర్భ, నిషధ, విదేహ, కోసలదేశాలకు తరలి పోయారు.

ఏడవసారి గర్భం ధరించింది దేవకి. భగవంతుని ఆజ్ఞానుసారం ఆదిశేషుడు భువిలో అవతరించాల్సి ఉంది. ఆ కారణంగానే అతడు, దేవకి గర్భంలో ప్రవేశించాడు. యోగమాయను పిలిచాడప్పుడు విష్ణుమూర్తి. ఇలా చెప్పాడామెకు.

''నువ్వు తక్షణం వ్రేపల్లెకు వెళ్ళు. అక్కడ వసుదేవుని భార్య రోహిణి ఉన్నది. ఆమె గర్భంలో దేవకి గర్భాన ఉన్న తేజస్సును చేర్చు. త్వరలో నేను దేవకి గర్భాన జన్మిస్తాను. నేను జన్మించకముందే నువ్వు, నందుని భార్య యశోదగర్భాన జన్మించు.''

వసుదేవుని భార్య రోహిణి, ఇంకొందరు కంసుడికి భయపడి, వ్రేపల్లెలో తలదాచుకున్నారు. యోగమాయ వ్రేపల్లెకు చేరుకుంది. దేవకీగర్భాన ఉన్న ఆదిశేషుని తేజస్సును ఆకర్షించి, దానిని రోహిణి గర్భంలో ప్రవేశపెట్టింది. ఆ విధంగా రోహిణికి జన్మించినవాడే బలరాముడు. కృష్ణుడికి అగ్రజుడయ్యాడతను. దేవకి గర్భం నుండి సంకర్షించి, రోహిణికి చేర్చడంతో అతనికి 'సంకర్షణుడు' అని పేరు వచ్చింది. లోకరమణీయుడు కావడంతో 'రాముడు' అని, మహాబలాఢ్యుడు కావడంతో 'బలుడు' అని అతన్ని వ్యవహరిస్తూ వచ్చారు. గర్భంలోని తేజస్సు పోవడంతో తనకి గర్భస్రావం అయిందని తలచింది దేవకి. అందుకు చాలా దుఃఖించిందామె. కొంతకాలానికి అష్టమగర్భం ధరించింది. శ్రీమహావిష్ణువు ఆమె గర్భంలో ప్రవేశించాడు. ఫలితంగా దేవకి అమితతేజస్సుతో ప్రకాశించసాగింది. దివ్యతేజస్సుతో వెలిగిపోతున్న దేవకిని చూసి అంతా ఆశ్చర్యపోసాగారు. ఆ వెలుగు చూసి కంసుడు భయపడ్డాడు. దేవకి గర్భంలో విష్ణుమూర్తి ప్రవేశించిన కారణంగానే ఆమె అంతటి వెలుగులీనుతున్నదని గ్రహించాడతను. పుట్టగానే ఆ బిడ్డను సంహరించా లనుకున్నాడు. కారాగారం దగ్గర కాపలాను మరింత కట్టుదిట్టం చేశాడు. దేవకి ప్రసవించిన మరుక్షణం తనకి ఆ సంగతి తెలియజేయాల్సిందిగా ఆజ్ఞాపించాడు. మహావిష్ణువు మాయలు అంతు చిక్కవని, వేయికళ్ళతో జాగ్రత వహించమని పదే పదే చెప్పాడు. దేవకిగర్భాన మహావిష్ణువు జన్మించనున్నాడని బ్రహ్మాదిదేవతలు తెలుసుకున్నారు. ఇంద్రాదులు, నారదుడు సహా వారంతా అదృశ్యంగా భూలోకానికి తరలివచ్చారు. దేవకి గర్భంలో ఉన్న విష్ణుమూర్తిని స్తుతించారు. అనేక విధాల కీర్తించారతన్ని. భూలోకంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ జరుగుతుందని సంతోషించి నిష్క్రమించారు.

దేవకికి నవమాసాలూ నిండాయి. శ్రావణమాసంలో కృష్ణపక్షంలో అష్టమి తిథినాడు అర్ధరాత్రి రోహిణీనక్షత్రయుక్త వృషభలగ్నంలో కృష్ణుడు జన్మించాడు. గ్రహనక్షత్రతారకలన్నీ సౌమ్యులై వెలిగిన మహాద్భుత క్షణం అది. సకలలోకాలకూ మంగళప్రదమయిన సమయం అది. కృష్ణుడు అవతరించగానే దేవదుందుభులు మ్రోగాయి. పూలవాన కురిసింది. గంధర్వులు గానం చేశారు. విద్యాధరాంగనలు, అప్సరసలు నాట్యం చేశారు. పరిమళభరితంగా గాలి వీచింది. సకలప్రాణి కోటీ సంతోషించింది. ఎందుకు ఆ సంతోషం అన్నది అంతుచిక్కలేదెవరికీ.

శంఖం, చక్రం, గద మొదలయిన ఆయుధాలు ధరించిన నాలుగు చేతులతోనూ, శిరస్సున మణిమయ కిరీటంతోనూ, మెడలో కౌస్తుభమణితోనూ, చేతులకు కేయూరాది భూషణాలతోనూ, వక్షస్థలాన శ్రీవత్సం పుట్టుమచ్చతోనూ, పద్మపత్రాలవంటి నేత్రాలతోనూ, వెలుగులు విరజిమ్ముతున్న ముఖబింబంతోనూ, పట్టువస్త్రంతోనూ, సకల జగత్తునూ సమ్మోహింపజేసే నీల మోహనరూపంతోనూ జన్మించిన శిశువును చూసి దేవకీ వసుదేవులు దిగ్భ్రాంతి చెందారు. ఆ తేజస్సును తట్టుకోలేకపోయారు. కళ్ళు మూసుకున్నారు. కళ్ళు మూసుకుని నిల్చున్న వసుదేవునికి అప్పుడు తెలిసింది, తనకి జన్మించింది విష్ణుమూర్తి అని. సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. కళ్ళు తెరచి, స్నానం చేసి పరిశుద్ధుడయ్యాడు. పదివేల గోవులను బ్రాహ్మణులకు దానం చేస్తానని సంకల్పం చేశాడు. విష్ణుమూర్తికి ప్రణమిల్లాడు. అనేక విధాల స్తోత్రం చేశాడతన్ని. అవతార మూర్తిగా తన కడుపున జన్మించిన విష్ణుమూర్తిని చూసి చేతులు జోడించింది దేవకి. నమస్క రించిందతనికి. అనేక విధాల కీర్తించింది. పూర్వజన్మ సుకృతం కారణంగానే భగవంతుణ్ణి కన

గలిగాననుకున్నది. అంతలోనే కంసుని బారి నుండి ఈ బిడ్డను రక్షించుకోవడం ఎలా అనుకున్నది. కన్నీరు పెట్టుకున్నది. కాపాడమని దేవతలందరినీ వేడుకున్నది. దేవకీ వసుదేవుల అంతరంగాల్ని గ్రహించిన విష్ణుమూర్తి శిశువు రూపంలోనే వారితో ఇలా పలికాడు.

''దేవకీ వసుదేవులారా! గతజన్మలో మీరు పుణ్యాత్ములు. పన్నెండువేల దివ్యసంవత్సరాలు నా గురించి మీరు తపస్సు చేశారు. ప్రత్యక్షమై వరం కోరుకోమంటే నాలాంటి కొడుకు కావాలన్నారు. మూడుసార్లు అదే కోరిక కోరారు. మీ కోరిక తీర్చేందుకు మీకు పుత్రునిగా మూడుసార్లు జన్మించాను.

తల్లీ దేవకీ! తొలిజన్మలో నువ్వు ప్రశ్నవి. నీ గర్భాన అప్పుడు 'ప్రశ్నిగర్భుడు'గా జన్మించాను. రెండవజన్మలో నువ్వు అదితివి. అప్పుడు 'వామనమూర్తి'గా నీకు జన్మించాను. ఇది నీకు మూడవ జన్మ. ఇప్పుడు కూడా నీ ముచ్చట తీర్చాను. నా మాట చెల్లించుకున్నాను.''

ఆనందబాష్పాలతో ఒకరిని ఒకరు చూసుకున్నారు దేవకీ వసుదేవులు. అంతలోనే భయపడుతూ శిశువుని చూశారు.

''నన్ను కంసుడు సంహరిస్తాడని మీరు భయపడనక్కరలేదు. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు'' అన్నాడు శ్రీమహావిష్ణువు. ఆ మాటకి దేవకీ వసుదేవులిద్దరూ మహదానందించారు.

''వసుదేవా! నువ్విప్పుడో పని చెయ్యాలి.''

''ఆజ్ఞ'' చేతులు జోడించి నమస్కరించాడు వసుదేవుడు.

''నా దివ్యస్వరూపాన్ని ఉపసంహరిస్తున్నాను. ఇక మీదట సాధారణ శిశువులా ఉంటాను. నన్ను ఇక్కణ్ణుంచి వ్రేపల్లెకు చేర్చు. అక్కడ నందుని భార్య యశోద ప్రసవించి ఉన్నది. నన్ను అక్కడ యశోద పక్కన పరుండబెట్టి, ఆమె కూతురుగా పుట్టిన నా యోగమాయను ఇక్కడకు తీసుకుని రా! కావలిగా భటులు ఉన్నారని, ఇదెలా సాధ్యం అని భయపడనక్కరలేదు. నా మహిమ కారణంగా నీకు ఎలాంటి ఆటంకమూ కలుగదు. అన్నీ అనుకూలిస్తాయి. వెళ్ళిరా'' అన్నాడు విష్ణుమూర్తి. తన దివ్యస్వరూపాన్ని ఉపసంహరించాడు. సామాన్య శిశువు అయిపోయాడు.

## వ్రేపల్లెవాసుడు శ్రీకృష్ణుడు

సామాన్య శిశువుగా మారిన శ్రీహరిని దేవకీ వసుదేవులు చూసి చాలా ఆనందించారు. ఒకరినొకరు చూసుకుని పొంగిపోయారు. శిశువును వ్రేపల్లెకు చేర్చేందుకు సిద్ధమయ్యాడు వసుదేవుడు. అప్పుడు ఎన్నో విచిత్రాలు జరిగాయి. వసుదేవుణ్ణి బంధించిన సంకెళ్ళు వాటంతటవే ఊడిపడ్డాయి. కాళ్ళకూ, చేతులకూ వేసిన సంకెళ్ళు ఊడిపడడంతో వసుదేవుడు, శిశువును చేతుల్లోకి తీసుకున్నాడు. ఒక బుట్టలో జాగ్రతగా పెట్టాడతన్ని. ఆ బుట్టను నెత్తిన పెట్టుకుని బయల్దేరాడు. అంతెత్తున నిలిచిన కారాగారం తలుపులు ఎవరో బలంగా లాగినట్టుగా తెరచుకున్నాయి. ధైర్యంగా ముందడుగు వేశాడు వసుదేవుడు. కావలి వాళ్ళంతా పెనునిద్దరలో ఉన్నారు. ఒళ్ళు తెలియకుండా ఒకరిమీద ఒకరు పడుకుని నిద్రపోతున్నారు. నగరం అంతా అదే తీరులో ఉన్నది. అంతా గాఢసుషుప్తిలో ఉన్నారు. ఎక్కడా ఎలాంటి అలికిడీ లేదు. నిశ్శబ్దంగా ఉంది. వసుదేవుడు నిరపాయంగా నగరాన్ని దాటాడు.



మధురానగరానికీ, వ్రేపల్లెకీ మధ్య యమునానది ప్రవహిస్తున్నది. తీరాన నిల్చుని ఈ నదిని దాటడం ఎలా? అనుకున్నాడు వసుదేవుడు. ఆందోళన చెందాడు. అంతలో కుండపోతగా వర్షం ప్రారంభం అయింది. భగవంతుడా! అంటూ బెంబేలుపడ్డాడు వసుదేవుడు. మనసులో శ్రీహరిని ధ్యానించాడు. అతనలా ధ్యానించినంతనే యమునానది రెండుగా చీలిపోయింది. త్రోవ చూపింది. వసుదేవుడు నదిలోంచి నడవసాగాడు. శిశువు వర్షానికి తడసిపోకుండా ఆదిశేషుడు, తన పడగలతో గొడుగు పట్టాడతనికి. వసుదేవుని వెనుక నడిచాడు. కాస్సేపటికి యమునానదిని దాటి, గోకులంలోకి ప్రవేశించాడు వసుదేవుడు. అక్కడ కూడా అతన్ని ఎవరూ గమనించలేదు. గోకులమంతా ఆదమరచి నిద్రిస్తోంది. నందుని ఇంటిలోకి ప్రవేశించాడు వసుదేవుడు. అతను ఆ ఇంటిలోకి ప్రవేశిస్తోంటే ద్వారాలు వాటంతటవే తెరుచుకున్నాయి. యశోద పురుటింటిని సమీపించాడు వసుదేవుడు. చూశాడామెను. యశోద గాఢనిద్రలో ఉంది. ఆమె ప్రక్కన ఆ రోజే పుట్టిన ఆడశిశువు ఉంది. బుట్టలోని తన శిశువుని యశోద ప్రక్కలో పడుకోబెట్టి, ఆమె ప్రక్కలో ఉన్న ఆడశిశువుని బుట్టలో పెట్టుకుని తిరుగు ప్రయాణం అయ్యాడు వసుదేవుడు.

యమునానదిని దాటాడు. మధురానగరానికి చేరుకున్నాడు. కారాగారంలోకి ప్రవేశించాడు. యశోద కుమార్తెను దేవకీ ప్రక్కలో పడుకోబెట్టాడు. చేతులు జోడించి, శ్రీహరికి నమస్కరించాడు. అంతే! అతని కాళ్ళకీ చేతులకీ ఎప్పటిలాగానే సంకెళ్ళు బిగుసుకున్నాయి. కారాగారం తలుపులన్నీ యథాప్రకారం మూసుకుపోయాయి. ఇక్కడ దేవకికి కుమారుడు జన్మించాడనిగాని, అక్కడ గోకులంలో యశోదకు కుమార్తె జన్మించిందనిగాని ఎవరికీ తెలియదు. అలాగే ఇక్కడి పిల్లాడు అక్కడకు చేరినట్టుగా, అక్కడ పిల్ల ఇక్కడకు చేరినట్టుగా కూడా ఎవరికీ తెలియదు. వ్రేపల్లెలో యశోదకు మెలకువ వచ్చింది. ప్రక్కలో ఉన్న బాబుని చూసింది. మగపిల్లాడు కలిగినందుకు ఆనందించింది. బాబుని దగ్గరగా తీసుకుంది.

ఇక్కడ కారాగారంలో దేవకి ప్రక్కలో ఉన్న ఆడపిల్ల ఒక్కసారిగా ఏడుపు అందుకుంది. ఆ ఏడుపునకు కావలివాళ్ళంతా మేల్కొన్నారు. పరుగున వెళ్ళి కంసుణ్ణి సమీపించారు. దేవకి ప్రసవించిందని తెలిపారు. ఆ వార్త కోసమే చూస్తున్నాడు కంసుడు.

దేవకి అష్టమగర్భం తనికి మృత్యుముఖం. ఆ గర్భంలో జన్మించిన శిశువు జీవించకూడదు. చనిపోవాలి. కాదు కాదు, చంపేయాలి అనుకున్నాడు కంసుడు. ఒక్క ఉదుటున లేచాడు. నిద్రమత్తులో తూలిపోతూ భయాందోళనలతో ఊగిపోతూ దేవకీవసుదేవులున్న కారాగృహానికి చేరుకున్నాడు. దేవకి ప్రక్కలో ఉన్న శిశువుని ఎర్రబారిన కళ్ళతో చూశాడు. ఆ చూపునకు భయపడింది దేవకి. అన్న కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడిందిలా.

''అన్నా! ఇది ఆడబిడ్డ. మగబిడ్డకాదు. నీకు ప్రాణభయాన్ని కలిగించేది మగబిడ్డ, ఆడబిడ్డ కాదు. అందుకని ఈ బిడ్డను దయచేసి చంపకు. ఏడుగురు బిడ్డల్ని చంపేశావు. నేను అడ్డుపడలేదు. ఇది ఎనిమిదవ బిడ్డ. ఆడబిడ్డ. దీనివల్ల నీకు ఎలాంటి ప్రమాదమూ లేదు. ఉండదు. కనికరించి వదిలేయి.''

వినిపించుకోలేదు కంసుడు. మరింత ఎర్రబారిన కళ్ళతో చూశాడు ఆ బిడ్డని. భయపడింది దేవకి. బిడ్డని గుండెలకు హత్తుకుంది. దూరంగా తొలగిపోజూసింది. ఒక్కడుగు వెనక్కి వేసిందో లేదో, జుత్తుపట్టుకుని నిలిపాడామెను. పసిబిడ్డ అని చూడలేదు. ఆడపిల్లని జాలి పడలేదు. తల్లి నుంచి గుంజుకున్నాడు ఆ పిల్లని. రెండు కాళ్ళూ పట్టుకుని గిరగిరా తిప్పాడు. తర్వాత అక్కడ బండ మీదికి విసిరికొట్టాడు. ఆ దెబ్బకి తలపగిలి పిల్ల చనిపోవాలి. జరగలేదలా. మరేం జరిగిందంటే... బిడ్డ ఆకాశానికి ఎగసింది. చూస్తూండగానే మాయాదేవి రూపంలో ప్రత్యక్ష మయింది. ఆమెకు ఎనిమిది చేతులు ఉన్నాయి. శంఖం, చక్రం, గద, శూలం, ఖడ్గం మొదలయిన ఆయుధాల్ని ధరించి ఉన్నదామె. దేవతలంతా చుట్టూ చేరి ఆమెను ప్రార్థిస్తున్నారు. అప్పుడు ఆ విష్ణుమాయ కంసునితో ఇలా అన్నది. గర్జనగా హెచ్చరించిందిలా.

''కంసా! నన్ను వధించడం నీ తరం కాదు. నిన్ను వధించేవాడు మాత్రం పుట్టి పెరుగు తున్నాడు. అతని చేతుల్లో నీకు చావు తప్పదు.''

కత్తి ఝుళిపిస్తూ క్రూరంగా చూశాడు కంసుడు. అదృశ్యమయింది విష్ణుమాయ. విష్ణుమాయ మాటలకు, ఆనాడు ఆకాశవాణి చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో అంతా అబద్ధం అనుకున్నాడు కంసుడు. అన్యాయంగా దేవకీవసుదేవుల్ని హింసించాననుకున్నాడు. తప్పు చేశాననుకుని, వారిని బంధవిముక్తుల్ని చేశాడు.

''బావా! ఆకాశవాణి మాటలు నమ్మి, మీకు చేయరాని అపకారం చేశాను. మిమ్మల్ని బంధించి, మీ బిడ్డల్ని హతమార్చాను. తప్పు చేశాను. నన్ను క్షమించండి.'' వేడుకున్నాడు కంసుడు.

''రాచమర్యాదలు పొందుతూ హాయిగా ఉండండి. వెళ్ళండి.'' అని అభయాన్నిచ్చాడు కంసుడు. అక్కణ్ణుంచి నిష్క్రమించాడు.

## యశోదానందులు

గోకులంలో నందగోపుడు ప్రముఖుడు. అతని నివాసం వ్రేపల్లె. యశోద అతని భార్య పేరు. ఈ దంపతులకు చాలా కాలంగా  పిల్లలు లేరు. వయసు మీరుతున్న వేళ యశోద ఆడపిల్లను కన్నది. అయితే తాను ఆడపిల్లను కన్నట్టుగా ఆమెకు తెలియదు. విష్ణుమాయలో ఉందామె. ఆ పిల్లను వసుదేవుడు తీసుకొనిపోయి, ఆ పిల్ల స్థానంలో మగబిడ్డను ఉంచిన సంగతి కూడా తెలియదామెకు. ఈ సంగతి యశోదానందులకే కాదు, వ్రేపల్లెలో ఎవరికీ తెలియదు. ఫలితంగా దేవకీవసుదేవులబిడ్డే తమ బిడ్డ అనుకుని, యశోదానందులూ, వ్రేపల్లెవాసులూ పొంగిపోయారు. అలా కృష్ణుడు యశోదాతనయుడిగా, నందనందనుడిగా దినదినప్రవర్ధమానం కాసాగాడు. కంసునికి దూరంగా గోకులంలో తమ బిడ్డ పెరుగుతున్నాడు, అదే పదివేలు అనుకున్నారు దేవకీవసుదేవులు.

లేకలేక కలిగిన పుత్రుడు శ్రీకృష్ణుడు. దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఆ ప్రకాశాన్ని గుర్తెరిగి, సాక్షాత్తూ భగవంతుడే తనకి జన్మించాడని ఆనందించాడు నందుడు. విష్ణుభక్తుడతను. భక్తితో పుత్రోత్సాహం చేశాడు. పూర్వజన్మలో నందుడు ఒక వసువు. అతని పేరు ద్రోణుడు. యశోద పూర్వజన్మలో కూడా అతని భార్యే! అప్పటి ఆమె పేరు ధర. వారు విష్ణుభక్తులూ, పుణ్యాత్ములూ అయిన కారణంగానే శ్రీకృష్ణుడు వారి బిడ్డ అయినాడు.

''గొప్పబిడ్డను కన్నావు తల్లీ! నీ బిడ్డ చూడముచ్చట అనిపిస్తున్నాడు. కనడం ఆలస్యమయినా బంగారంలాంటి బిడ్డని కన్నావు.'' అన్నారు గోపకాంతలు. యశోదను అనేక విధాల అభినందించారు. కృష్ణుణ్ణి పన్నీట జలకమాడించి, జోలపాడారు. అష్టమినాడు జన్మించాడు కృష్ణుడు. గోకులంలో ఆనాడు గొప్ప పండుగ చేసుకున్నారు. అదే 'గోకులాష్టమి'గా ప్రఖ్యాతి చెందింది. బాలకృష్ణుడు ఉట్లను చేజిక్కించుకునేవాడు. అందిన వెన్నను ఆబగా తినేవాడు. పాలు తాగేవాడు. అదే తర్వాతి రోజుల్లో 'ఉట్లపండుగ' అయింది. రోహిణీ నక్షత్రాన జన్మించిన కృష్ణుడు, మేనమామ కంసుణ్ణి వధించాడు. అందుకే కాబోలు, ఈనాడు ఎవరయినా రోహిణీనక్షత్రాన జన్మిస్తే 'మేనమామ' గండం అంటున్నారు.

## కంసుడు:దురాలోచనలు

దేవకి అష్టమగర్భంలో మగపిల్లవాడు జన్మిస్తాడు. ఆ బుడతడి చేతిలోనే తను హతమవుతానని భావించిన కంసునికి దేవకి అష్టమగర్భంలో ఆడపిల్ల జన్మించడం, ఆమె నిన్ను హతమార్చేవాడు పుట్టాడు, పెరుగుతున్నాడని చెప్పడం నమ్మలేని నిజాలనిపించాయి. ఆ నిజాలను ఆలోచిస్తూ నిద్రకు దూరమయ్యాడు కంసుడు. ఆహారం కూడా రుచించడం లేదతనికి. ఏం చెయ్యాలి?

తనని హతమార్చేవాడు పుట్టాడన్నది విష్ణుమాయ. ఎక్కడ పుట్టాడు? ఎక్కడ పెరుగుతున్నాడు? వాణ్ణి తెలుసుకోవడం ఎలా? పరిపరివిధాల ఆలోచించి, ఆపై సలహాలకూ, సూచనలకూ మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పరిచాడు కంసుడు.

మంత్రివర్గం, పరిజనులూ అతనికంటే క్రూరులు. వారంతా మరింతగా కంసుణ్ణి రెచ్చగొట్టారు. విష్ణుమూర్తిపట్ల అతనికి ఉన్న ద్వేషాన్ని పెంచి పెద్దదాన్ని చేశారు. కంసమహారాజుని చంపేవాడు యాదవ కులంలోనే జన్మిస్తాడని తెలిసింది కనుక, యాదవకులాన్నంతటినీ జల్లెడ పడితే సరి, దొరికిపోతాడన్నారు. గొల్లపల్లెలన్నీ గాలిద్దాం అన్నారు. పసిబాలుర ఉసురు తీద్దామన్నారు. ప్రతి ఊరిలోని పసిపిల్లలందరినీ చంపేద్దాం. చంపేస్తే ప్రమాదం ఇంకేముంటుంది? అన్నారు. ప్రధానంగా వసుదేవుని భార్యలూ, నందగోపుడూ నివసించే గోకులాన్ని ఓ కంట కనిపెట్టుకుని ఉందామన్నారు. వారి మాటలు బాగున్నాయనిపించింది కంసునికి.

ఇంకో సంగతి అంటూ మంత్రివర్గం మళ్ళీ కొన్ని మాటలు చెప్పింది. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ విష్ణువు ఉంటాడంటారు. గోవులు, బ్రాహ్మణులు, జపతపాలు, యజ్ఞయాగాలు, వేదపఠనం ఎక్కడ జరుగుతాయో అక్కడ ధర్మం ఉంటుంది కనుక, గోబ్రాహ్మణులను వధించడం, యాజ్ఞయాగాలను ధ్వంసం చేస్తే విష్ణువు బయటపడతారన్నారు. బయటపడితే విష్ణువుని ఇట్టే వధించవచ్చునీ, పగతీర్చుకోవచ్చునీ అన్నారు. మంత్రుల బోధలు కంసునికి నచ్చాయి. వారు చెప్పినట్టుగానే విష్ణువుని వధించి, నిశ్చింతగా ఉండవచ్చునుకున్నాడతను.

మంత్రవిద్యలు నేర్చినవారూ, మాయలు పన్నేవారూ, కామరూపులూ, బలాఢ్యులూ, దుర్మార్గులూ, రాక్షసులు ఎందరెందరో కంసుని అనుచరవర్గంలో ఉన్నారు. వారందరినీ కంసుడు ఆజ్ఞాపించాడు. అతడు ఆజ్ఞాపించినట్టుగానే వారంతా చెలరేగిపోయారు. సాధువుల్ని హింసించసాగారు. గోబ్రాహ్మణులను వధించసాగారు. యజ్ఞయాగాదులను ధ్వంసం చేస్తూ, తాపసులను చిత్రహింసల పాల్జేశారు. స్త్రీలను చెరబట్టారు. విష్ణువుకి నిలయాలయిన పుణ్యస్థలాలను అపవిత్రం చేసి, ఆనందించసాగారు.

కామరూపులయిన రాక్షసులు కోరుకున్నరూపంలో పల్లెల్లో, నగరాల్లో కనిపించిన బాలలందరినీ చంపడం మొదలుపెట్టారు. తల్లడిల్లిపోయారు తల్లులు. పిల్లలను కనడమే మహాపాపమయినట్టుగా రోదించారు. బాలలు బ్రతకడం కష్టం. వారి బ్రతుకు క్షణక్షణం ఓ గండం అయిపోయింది.

ఒకనాడు కంసుడికి కప్పం కట్టేందుకు నందగోపుడు మధురానగరానికి వచ్చాడు. కంసుడికి సామంతుడతను. ఏటేటా కంసునికి కప్పం కట్టాలి. కప్పం సొమ్మును మూటగా కట్టి మధురానగరానికి బయల్దేరుతూ, వ్రేపల్లెను జాగ్రతగా చూసుకోమని గోపాలురకు హెచ్చరించి వచ్చాడతను. కంసుణ్ణి దర్శించాడు. కప్పం చెల్లించి, కానుకలు కూడా సమర్పించాడతనికి.

వసుదేవునికి నందగోపుడు బంధువు. వసుదేవుని భార్య రోహిణీ, ఆమె కుమారుడు బలరాముడూ, ఇంకొందరు బంధువులూ అతని రక్షణలో వ్రేపల్లెలో ఉన్నారు. వారి క్షేమ సమాచారాలు తెలుసుకునేందుకు నందుణ్ణి చూడవచ్చాడు వసుదేవుడు. వసుదేవుణ్ణి చూస్తూనే గట్టిగా అతన్ని కౌగిలించుకున్నాడు నందుడు. ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. చాలా కాలానికి పుత్రసంతానం కలిగినందుకు నందుణ్ణి అభినందించాడు వసుదేవుడు. ఆ అభినందనలకు

పొంగిపోలేదు నందుడు, దేవకీ వసుదేవులు కంసుని చెరలో హింసలపాలయినందుకు బాధపడ్డాడతను. కన్నీరు పెట్టుకున్నాడు. నందుడు అలా కన్నీరు పెట్టుకుంటుంటే అతన్ని గమనించక, ఎటో చూస్తూ ఆందోళనగా ఒక్కసారిగా లేచి నిల్చున్నాడు వసుదేవుడు. ఏమయిందేమయింది అన్నట్టుగా నందుడు కూడా లేచి నిల్చున్నాడు. భయాందోళనలతో వణికిపోతున్న వసుదేవుణ్ణి ఆశ్చర్యంగా చూడసాగాడు.

## పూతన శకటాసురుల మరణం

''ఏమైంది వసుదేవా? ఎందుకలా ఆందోళనగా ఉన్నావు?''

''గోకులానికి ఏదో కీడు మూడనున్నట్టుగా అపశకునాలు తోస్తున్నాయి. దయచేసి నువ్వు తొందరగా వ్రేపల్లెకు బయల్దేరు.'' చెప్పాడు వసుదేవుడు. అతని మాటను కాదనలేదు నందుడు. వెంటనే పరివారంతో వ్రేపల్లెకు బయల్దేరాడు.

### పూతన

కంసుని అనుచరి పూతన. రాక్షసి. పిల్లలను చంపుతుందది. దానిని 'పూతిక' అని కూడా అంటారు. ఈ పూతన పూర్వజన్మలో బలిచక్రవర్తి కూతురు. పేరు రత్నమాల. శ్రీహరి వామనమూర్తిగా వచ్చి, బలిచక్రవర్తిని దానం అడిగినప్పుడు చూసిందతన్ని. బాలవటువు బాగున్నాడని ముచ్చటపడింది. పుత్రప్రేమ కలిగిందామెకు. ఇలాంటి బాలుడికి చన్నుకుడిపి, పాలు తాగించే అదృష్టానికి నోచుకుంటే బాగుండుననుకున్నది. ఆ కోరికను గ్రహించిన శ్రీహరి, వచ్చే జన్మలో ఆమె కోరిక తీర్చాలనుకున్నాడు. ఫలితంగానే పూతన జన్మించింది.

కంసుని ఆజ్ఞమేరకు పూతన పల్లెలు, పట్టణాలు తిరుగుతూ కనిపించిన శిశువులన్లా చంపుతూ వస్తోంది. వ్రేపల్లెకు చేరుకుంది. రాక్షసిరూపంలోగాక చక్కని స్త్రీరూపం ధరించి మరీ చేరుకుందక్కడికి. పట్టుచీరె కట్టుకుంది. మల్లెపూలు పెట్టుకుంది. చెవులకు అద్భుతమయిన కుండలాలు ధరించింది. నడుస్తోంటే కుండలాలు ఊగుతూ కాంతులు విరజిమ్ముతోంటే చూసిన ప్రతి ఒక్కరూ పూతనను మామూలు స్త్రీ కాదు, ఎవరో దివ్యాంగన అనుకున్నారు. ఊరంతా తిరిగింది పూతన. ఆఖరికి నందుడి ఇంటికి చేరింది. చిన్నికృష్ణుణ్ణి చూసిందక్కడ. యశోద, రోహిణి అతన్ని ముద్దుచెయ్యడాన్ని చూసి, ముందుకొచ్చింది. చిన్నికృష్ణుడు అప్పుడు ఉయ్యాలలో పడుకుని ఉన్నాడు. వస్తున్నది పూతన అని తెలుసతనికి. ఆమె రాక్షసి అని తెలుసు. అయినా ఏమీ తెలియని వాడిలా కళ్ళుమూసుకుని, పిడికిళ్ళు బిగించి పడుకున్నాడు.

''పిల్లాడు ముద్దొస్తున్నాడు'' అన్నది పూతన. కృష్ణుని బొజ్జనొక్కి చూసింది. మెత్తగా ఉన్నది.

''కడుపులో పాలులేవు. ఆకలి మీద ఉన్నాడు'' అన్నది. యశోద అనుమతి కోసం చూడలేదు. రోహిణి ఏమంటుందోనని భయపడలేదు. కృష్ణుణ్ణి అందుకున్నది. ఒడిలో పెట్టుకున్నది. ఏడుస్తున్న కృష్ణుణ్ణి ఓదారుస్తున్నట్టుగా ఎత్తి ఆడిస్తూ, తర్వాత పాలు కుడిపేందుకు రవికె ముడి విప్పింది. చిన్నికృష్ణుని నోటికి చన్ను అందించింది. ఆనందాశ్చర్యాలలో ఉన్నారు యశోద, రోహిణి. మంత్రముగ్ధుల్లా ఇద్దరూ వారించలేదామెను.

తనపాలలో విషాన్ని నింపుతుంది పూతన. ఆ పాలను తాగితే చాలు, చనిపోతారు పిల్లలు. చాలా మంది పిల్లల్ని అలాగే చంపింది. ఈ కృష్ణుడో లెక్కా అనుకుంది. అయితే అందుకు భిన్నంగా జరిగిందంతా. పూతన పాలనే కాదు, ఆమె ప్రాణాలను కూడా పీల్చేశాడు కృష్ణుడు. బాధను భరించలేకపోయింది పూతన. చన్ను నుంచి చిన్నికృష్ణుణ్ణి వేరు చేసేందుకు ప్రయత్నించింది. వీలుకాలేదు. కృష్ణుడు గట్టిగా పట్టుకున్నాడు.

''వదులు కృష్ణా! వదులు'' అంటూ రోదించింది పూతన. వదల్లేదు కృష్ణుడు. లాగి లాగి ఆఖరికి ఆమె ప్రాణాలను హరించాడు. చెమటలు పట్టిపోయింది పూతన. కాళ్ళూ చేతులూ కొట్టుకుంది. పెద్దగా అరుస్తూ వెల్లకిలా పడిపోయింది. ఆమె అరుపునకు భూమి వణికిపోయింది. కొండలు దద్దరిల్లాయి. ఆకాశం కంపించింది. గ్రహతారకలు ఒక్క క్షణం గతులు తప్పి అంతలోనే సర్దుకున్నాయి. అధోలోకాలు అదిరిపడ్డాయి. దిక్కులు ప్రతిధ్వనించాయి. ఒక్కసారిగా వందలాది పిడుగులు పడ్డట్టుగా వినవచ్చిన ఆ శబ్దానికి వ్రేపల్లెవాసులు మూర్ఛపోయారు. చనిపోయిన మరుక్షణం పూతన తన నిజరూపంతో ప్రత్యక్షమయింది. పెద్దపెద్ద కోరలతోనూ, కొండగుహలంత నాసికారంధ్రాలతోనూ, కొండల్లాంటి కుచాలతోనూ, పాడుబడిన బావుల్లాంటి కళ్ళతోనూ, నీళ్ళింకిన చెరువంతటి కడుపుతోనూ, ఎర్రటిజుట్టుతోనూ పూతన నేల మీద వెల్లకిలా పడడంతో చుట్టుపక్కల ఆరుకోసుల వరకూ ఉన్న చెట్లూ, మానులూ ఫెళఫెళా విరిగిపడ్డాయి. పూతనశవాన్ని చూసి పరుగులు పెట్టారు ప్రజలు. చిన్నికృష్ణుడు మాత్రం ఎలాంటి ఆందోళనా చెందక దాని శరీరం మీద ఆడుకోసాగాడు. జరిగింది చూస్తూ యశోదా, రోహిణీ తదితరులు చాలాసేపటి వరకు మనుషులు కాలేకపోయారు. అచేతనులయ్యారు. తర్వాత తేరుకున్నారు. తేరుకుని పరుగుదీసి, పూతన మీద ఆడుకుంటున్న కృష్ణుణ్ణి అందుకున్నారు.

''బాబూ! కన్నా! కృష్ణయ్యా! ఏం కాలేదు కదా నాయనా! ఆ రాక్షసి నిన్నేం చేయలేదుకదా'' అంటూ కృష్ణుణ్ణి తడిమి తడిమి చూశారు. కంటనీరు పెట్టుకుని ముద్దాడారు. దిష్టితీశారు. భూతవైద్యులను పిలిపించి, విభూతి పెట్టారు. మంత్రవేత్తల చేత తాయత్తులూ, రక్షరేకులూ కట్టించారు. ఏడుస్తూంటే పాలిచ్చి పడుకోబెట్టారు.

అంతలో నందగోపుడు చేరుకున్నాడక్కడికి. గుమ్మంలో కొండలా పడి ఉన్న పూతన మృతదేహాన్ని చూసి, ఆశ్చర్య ఆందోళనలకు గురయ్యాడు. వసుదేవుడు చెప్పినట్టే అయిందని, అతను దివ్యజ్ఞాన సంపన్నుడని తెలుసుకున్నాడు. వేనోళ్ళ పొగిడాడతన్ని.

గొడ్డళ్ళు పట్టుకుని పూతనను సమీపించారు వ్రేపల్లెప్రజలు. ముక్కలు ముక్కలు చేశారు ఆమె మృతదేహాన్ని. ఊరుకి దూరంగా తీసుకునిపోయి ఆ ముక్కల్ని దహనం చేశారు. పూతన దహనమవుతోంటే మంచిగంధం వాసన వచ్చింది. ఆశ్చర్యపోయారంతా. శ్రీహరి సంహారంతో పాపాలు నశించి, సుగంధాల్ని సంతరించుకున్నది పూతన. భక్తుడయినా, విరోధి అయి, పరమదుర్మార్గుడయినా భగవంతుని చేతిలో మరణిస్తే ఉత్తమలోకాలు అందుకుంటారు. భగవంతుని స్మరిస్తేనే పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయంటారు, మరి ఆ భగవంతుడే సంహరిస్తే సద్గతులు ఎందుకు లభించవు? సువాసనలు ఎందుకు రావు? భగవంతుని సంహరించాలని వచ్చి, ఆ భగవంతుని చేతిలోనే మృతిచెందిన పూతన మోక్షాన్ని అందుకున్నది.

ఉయ్యాలలో నిద్రపోతున్న చిన్నికృష్ణుణ్ణి చూసుకుని దీర్ఘంగా నిట్టూర్చాడు నందుడు. అంతా దైవకృప అన్నట్టుగా చేతులు జోడించి పైకి చూస్తూ నమస్కరించాడు. జరిగిందంతా యశోద చెప్పుకొచ్చింది. చిత్రం! బహుచిత్రం అనుకున్నారిద్దరూ.

## శకటాసురుడు

యశోద పుత్రునికి 'కృష్ణుడు' అని, రోహిణి పుత్రునికి 'రాముడు' అని పేర్లు పెట్టినవాడు గర్గుడు. అతను యాదవులకు పురోహితుడు. నామకరణాది సంస్కారాలు చేయమని అతన్ని వసుదేవుడే వ్రేపల్లెకు పంపాడు. పిల్లల నామకరణ సంస్కారాలు గోప్యంగా నిర్వర్తించడం మంచిదన్నాడు గర్గుడు. అర్థం కానట్టుగా చూశాడు నందుడు. అప్పుడు అసలు సంగతి చెప్పాడు గర్గుడు. పనిగట్టుకుని ఇలాంటి సంస్కారాలు నిర్వర్తిస్తున్నానని కంసునికి తెలిస్తే తనకి ప్రమాదం అన్నాడు.

''దేవకి అష్టమగర్భంలో కూతురు జన్మించలేదని కంసునికి అనుమానంగా ఉంది. ఆమెకు కొడుకే పుట్టాడు. ఎక్కడో పెరుగుతున్నాడు. అదంతా రహస్యంగా ఉందని భావిస్తున్నాడు. వసుదేవుడు నీకు స్నేహితుడు. బంధువు కూడా. నీ కొడుకు నీ కొడుకు కాదని, వసుదేవుడి కొడుకు అని కంసుడు అనుకుంటే నీకే ప్రమాదం. అందుకే ఈ నామకరణాది సంస్కారాలూ, నా రాక అంతా గోప్యంగా ఉంచమన్నది'' అన్నాడు గర్గుడు. తేటతెల్లం చేశాడంతా. తన కొడుకు వసుదేవుడి కొడుకు ఎందుకు అవుతాడు? ఆ అనుమానం కంసునికి కలగడం తప్పుకాదూ? అయినా ఇప్పుడు ఇవన్నీ అనవసరం. గర్గుడు చెప్పింది వినడమే శ్రేయస్కరం అనుకున్నాడు నందుడు. నామకరణాదులు రహస్యంగా నిర్వర్తించాడు.

చిన్నికృష్ణుని లీలలు ఇన్నీ అన్నీ కావు. పూతననే కాదు, అనేకమంది రాక్షసులను సంహరించాడు కృష్ణుడు. ఒక రోజు చిన్నపండుగ చేసింది యశోద. ఆ రోజు కృష్ణుని జన్మనక్షత్రం. పేరంటానికి ముత్తయిదువులను పిలిచిందామె. బ్రాహ్మణులను ఆహ్వానించి, వారి చేత కృష్ణునికి ఆశీర్వచనాలు ఇప్పించింది. నీళ్ళుపోసి, బొట్టుపెట్టి పడుకోబెట్టింది కృష్ణుణ్ణి. జోలపాడి నిద్రపుచ్చిందతన్ని. మంచినిద్రలో కృష్ణుడున్నాడని మిగిలిన పనులు చక్కబెట్టేందుకు అటుగా కదలింది. అప్పుడు అక్కడకి వచ్చాడు శకటాసురుడు. బండిరూపంలో వచ్చాడతను. చిన్నికృష్ణుణ్ణి చంపడానికి ప్రయత్నించాడు. ఉయ్యాలకు దగ్గరగా నిల్చున్నాడు. గమనించాడది కృష్ణుడు. ఏడుస్తూ కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ, కావాలనే ఓ కాలితో దగ్గరగా ఉన్న శకటాసురుణ్ణి బలంగా తన్నాడు. ఆ దెబ్బకి శకటం ముక్కముక్కలయింది. వీధిలోకి ఎగిరిపడింది. రక్తం కక్కుకుంటూ శకటాసురుడు మరణించాడు. నిజరూపం దాల్చాడు. ఇంటిలోనుంచి ఎగిరొచ్చి, వీధిలోపడి మరణించిన శకటాసురుణ్ణి అక్కడ ఆడుకుంటున్న పిల్లలు చూశారు. గుమిగూడారు. ఏం జరిగింది? ఏం జరిగింది అంటే కృష్ణుడు కాలితో తన్నాడు. వచ్చి పడి మరణించాడన్నారంతా. అది విన్నాడు నందుడు. యశోదను పిలుస్తూ పరుగుదీశాడు. పనిలో ఉన్నది యశోద. జరిగిందేదీ ఆమెకు తెలియదు. నందుడు వచ్చి చెబితే 'అవునా' అంటూ ఆశ్చర్యపోయింది. భర్తతోపాటుగా ఉయ్యాల దగ్గరకి పరుగుదీసింది. కుడిచేతి బొటనవేలు నోటిలో ఉంచుకుని నవ్వుతున్న కృష్ణుణ్ణి చూసి, ఊపిరి పీల్చుకుంది. గాలిసోకిందని, దిష్టిపోతుందని మళ్ళీ తాయెత్తులూ, రక్షరేకులూ కట్టించింది.



కృష్ణుడికి పారేడు ఈడు వచ్చింది. స్థిరంగా ఎక్కడా కూర్చోడం లేదు కృష్ణుడు. అటూ ఇటూ తిరుగాడుతున్నాడు. అలా తిరుగాడుతున్నవాణ్ణి తీసుకుని సరదాగా ఒడిలో కూర్చోబెట్టుకుంది యశోద. మోయలేకపోయిందతన్ని. భరించలేకపోయిందతని బరువుని. ఒడిలో కొండ వెలసి నట్టుగా విలవిలలాడిపోయింది. కిందకి దించి, పని చూసుకునేందుకు వెళ్ళింది. అదే అదనుగా అక్కడకి వచ్చాడు రాక్షసుడు తృణావర్తుడు. సుడిగాలిలా వచ్చాడు. ఆ గాలికి వ్రేపల్లె అంతా కకావికలయింది. దిక్కులన్నీ ధూళితో నిండిపోయాయి. చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఎవరికీ ఏదీ కనిపించకుండాపోయింది. సుళ్ళు తిరుగుతూ సుడిగాలి కృష్ణుణ్ణి సమీపించింది. ఆకాశానికి ఎత్తుకుపోయింది. నేల మీది గాలి నింగికెగయడంతో అంతా ఆకాశం కేసి చూడసాగారు. వారు చూసేందుకు వీలులేకుండా ఆకాశంలోంచి రాళ్ళవర్షం కురిపించాడు తృణావర్తుడు. పెద్దపెద్దరాళ్ళు. అంతెత్తు నుంచి కిందపడుతుండడంతో పరుగులుదీశారు ప్రజలు. చెట్ల కిందా, భవనాలలోనూ తలదాచుకున్నారు. కాస్సేపటికి రాళ్ళవాన తగ్గింది. బతుకుజీవుడా అని బయటికి వచ్చారు.

ఇంటి పనిలో నిమగ్నమయి ఉన్న యశోదకు ఇదేదీ తెలియదు. ఎవరో వచ్చి జరిగిందంతా చెబితే ఆశ్చర్యపోయి, ఇంటి బయట కూర్చోపెట్టిన కృష్ణుడికోసం పరుగుదీసింది. కృష్ణుడు కనిపించలేదక్కడ. గొల్లుమంది. గుండెలవిసేట్టుగా రోదించసాగింది. యశోద ఏడుపునకు గోపకులు, గోపకాంతలు చుట్టూ చేరారు. జరిగింది తెలుసుకున్నారు. కృష్ణునికోసం నలుదిక్కులా గాలించారు. కనిపించలేదు కృష్ణుడు. కన్నీరుపెట్టుకున్నారంతా.

హతమార్చాలని కృష్ణుణ్ణి ఆకాశానికి ఎత్తుకుపోయిన తృణావర్తుడు, నభస్సు సగం చేరకముందే కిందుమీదులయ్యాడు. కృష్ణుణ్ణి మోయలేకపోయాడు. పెద్దకొండను మోస్తున్నట్టుగా ఆపసోపాలు పడ్డాడు. కిందకి జారవిడచి చంపేద్దామనుకున్నాడు. అయితే ఆ అవకాశం లేకుండాపోయింది. వాడి మెడపట్టుకుని వేలాడసాగాడు కృష్ణుడు. అతనిపట్టు విడిపించుకోవడం రాక్షసుని వల్లకాలేదు. గింజుకున్నాడు. పెనుగులాడాడు. ఊపిరాడక గిలగిలాతన్నుకున్నాడు. ప్రాణాలు పోతున్న ట్టనిపించింది. నాలికజాచాడు. గ్రుడ్లు బయటకి వెళ్ళబెట్టాడు. భయంకరంగా అరుస్తూ ఆకాశం లోంచి కింద పడ్డాడు. కొండపడ్డట్టుగా శబ్దమయింది. పరుగున వచ్చి చూశారు గోపాలురు. ప్రాణాలు కోల్పోయి నిజరూపంలో ఉన్న తృణావర్తుణ్ణీ, వాడి రొమ్ముల మీద కూర్చుని పిడికిళ్ళతో గ్రుద్దుతున్న చిన్నికృష్ణుణ్ణీ చూసి ఆశ్చర్యపోయారు.

''రా కృష్ణయ్యా'' అని అందుకున్నారు తర్వాత. యశోదకు అప్పగించారు. ఇంటిదీపం, కంటివెలుగు చేతికి అందగానే ముద్దులతో ముంచెత్తింది యశోద. కృష్ణుణ్ణి గుండెలకు హత్తుకుంది.

# చిన్నికృష్ణుడు:చిలిపి చేష్టలు

తల్లి గుండెల్లో ఒదిగిపోయిన చిన్నికృష్ణుణ్ణి చూస్తూ ఇతడు మామూలు బాలుడు కాదనుకున్నారు గోకులవాసులు. సాక్షాత్తు దేవుడనుకున్నారు.

తృణావర్తుడు గతజన్మలో పాండుదేశపురాజు. అప్పుడు అతని పేరు సహస్రాక్షుడు. స్త్రీలోలుడతను. వెయ్యిమంది స్త్రీలతో తుంగభద్రాతీరంలో సహస్రాక్షుడు శృంగార క్రీడల్లో మునిగితేలుతుండగా అప్పుడక్కడకి దుర్వాసుడు వచ్చాడు. మునిని గమనించాడు సహస్రాక్షుడు. గమనించీ గమనించనట్టుగా ప్రవర్తించాడు. నమస్కరించలేదు సరికదా, ముని ముందే స్త్రీలతో మరింతగా క్రీడించసాగాడు. తట్టుకోలేకపోయాడు దుర్వాసుడు. కోపం వచ్చిందతనికి. రాక్షసునిగా పుట్టమని సహస్రాక్షుని శపించాడు. ఎప్పుడయితే దుర్వాసముని శపించాడో అప్పుడు క్షమించమంటూ అతని పాదాలను ఆశ్రయించాడు సహస్రాక్షుడు. అనుగ్రహించమని వేడుకున్నాడు. కన్నీరుపెట్టుకున్నాడు. దుర్వాసుడు కరుణించాడప్పుడు.

''రాక్షసుడిగా నువ్వు జన్మించినప్పటికీ విష్ణువు చేతిలో మరణిస్తావు. నీకు గోలోకం ప్రాప్తిస్తుంది. అప్పుడు నువ్వు పూర్వవైభవంతో విలసిల్లుతావు'' అన్నాడు దుర్వాసుడు. ముని శాపఫలితంగా సహస్రాక్షుడు తృణావర్తుడై, కృష్ణుని చేతిలో మరణించాడు. పుణ్యాలోకాలు అందుకున్నాడు.

### కొంటెకోణంగి

వెన్న, పాలు, పెరుగు అంటే కృష్ణునికి చాలా ఇష్టం. వాటిని దొంగిలించేవాడతను. గోపికలు ఇంట్లో లేని వేళ చూసి, ఇంట్లోకి జొరబడేవాడు. ఉట్టి మీది పాలనూ, పెరుగునూ, వెన్ననూ

జుర్రుకునేవాడు. ఎత్తులో ఉన్న ఉట్టి అందకపోతే రోకలితో దానిని కొట్టేవాడు కృష్ణుడు. కుండలు పగిలి పాలూ, పెరుగూ కింద ధారగా పడితే నోరుపట్టి తాగేవాడు. ఒకొక్కసారి మిత్రులను నిచ్చెనగా చేసుకుని ఉట్టిని అందుకుని ఆరగించేవాడు. సహకరించిన మిత్రులకు కూడా ముద్దముద్దలుగా వెన్నను అందించి ఆనందించేవాడు. గోపికలు వస్తే పరిగెత్తి పారిపోయేవాడు. అందేవాడు కాదెవరికీ. ఒకవేళ అందితే ఏమీ తెలియని అమాయకుడిలా నటించేవాడు. ఆ నటనకి గోపికలు నవ్వుకునేవారు. నవ్వితే పోయిన పాలూ పెరుగూ వస్తాయా? రావు కదా! అంతలోనే కోపం తెచ్చుకునేవారు. యశోద మీద మూకుమ్మడిగా దండెత్తి కృష్ణుని అల్లరిని కథలు కథలుగా చెప్పేవారు.

''అమ్మా, యశోదమ్మా! నీ కృష్ణుడి అల్లరిని తట్టుకోలేకపోతున్నాం. వేధించుకు తింటున్నాడు. వేగలేకపోతున్నాం.''

''తల్లీ! నీ కృష్ణుణ్ణి కాస్తంత అదుపులో పెట్టుకో! లేదంటే చెప్పు, ఇప్పుడే ఈ క్షణమే వ్రేపల్లె వదలివెళ్ళిపోతాం.''

''కట్టుకున్న ఉట్టెని తెంచేస్తాడు. పెట్టుకున్న కుండల్ని పగలగొడతాడు. ఇదెక్కడి అల్లరి తల్లీ, కృష్ణుణ్ణి కట్టి ఉంచుకో, లేదంటే పెట్టెలో దాచి ఉంచుకో, అంతేకాని మా ఇళ్ళ మీదకు పంపకు.''

కృష్ణుని మీద పితూరీలను వినలేకపోయేది యశోద. చెవులు మూసుకునేది.

''వెళ్ళిరండమ్మా! కృష్ణుణ్ణి మందలిస్తాను. ఇక ముందు ఇలా జరగదు'' అని నచ్చజెప్పేది. కృష్ణుడు కనిపిస్తే కొడదామనుకునేది. కనిపించడే! కేకేసి పిలిస్తే పలకడే! ఎక్కడ దాగున్నాడో ఏమో! ఎవరికీ తెలిసేది కాదు. తల్లి కోపం తగ్గేంత వరకూ వచ్చేవాడు కాదు కృష్ణుడు. కోపం తగ్గిన తర్వాత ఆకలి అంటూ వచ్చి యశోదను పెనవేసుకుపోయేవాడు. ఆకలంటే అమ్మ ఆగుతుందా? బువ్వతినిపిస్తూ విన్నదంతా వదలివేసేది.

తన మీద తల్లికి చెప్పిన చాడీలన్నీ అబద్ధాలని నిరూపించాలనుకున్నాడు కృష్ణుడు. అందుకేం చేశాడంటే...ఇంటింటా దొంగతనం చేస్తూ గోపికలకి దొరికిపోయాడు. కృష్ణుడు నాకు దొరికాడంటే నాకు దొరికాడంటూ దొరికిన కృష్ణుణ్ణి వెంటబెట్టుకుని గోపికలు యశోదను కలిశారు. చూస్తే యశోద దగ్గర కూడా ఓ కృష్ణుడు ఉన్నాడు. బుద్ధిగా వెన్నముద్దలు తింటున్నాడు. ఏం చెప్పి నమ్మించాలి యశోదను? నీ కొడుకు ఈ అల్లరి చేశాడు, ఆ అల్లరి చేశాడు, ఇదిగో వెంటబెట్టుకుని వచ్చాం, చూడంటే ఏడీ కృష్ణుడు? అనేక రూపాల్లో ఉన్న కృష్ణుడు అంతర్ధానమై ఒక్కడై బిక్కుబిక్కుమంటూ తల్లిచాటున ఉండడం గోపికలకు అంతుచిక్కలేదు. అయోమయానికి లోనయ్యారు. అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించి, నిష్క్రమించారు.

## ఏలినవాని నోట ఏడేడులోకాలు

రామకృష్ణులూ, గోపబాలకులూ ఆడుకుంటున్నారు. ఆడుకుంటూ ఆడుకుంటూ కృష్ణుడు బోర్లాపడ్డాడు. అప్పుడతని పెదవులకు మన్ను అంటింది. అంటిన మన్నును చప్పరించి చూశాడతను. బాగుంది. తియ్యగా ఉంది. మన్నును గుప్పెడు తీసుకున్నాడు. తినసాగాడు. రాముడది చూశాడు. వద్దని చెప్పాడు. వినలేదు కృష్ణుడు. గోపబాలకులు కూడా కల్పించుకుని వద్దన్నారు. వింటేనా? పైగా మరో గుప్పెడు అందుకున్నాడు కృష్ణుడు.

తల్లిని సమీపించాడు రాముడు. గోపబాలకులు కూడా అతన్ని అనుసరించారు.

''అమ్మా, అమ్మా! తమ్ముడు కృష్ణుడు మన్ను తింటున్నాడే!''

''అవునమ్మా! గుప్పెళ్ళకొద్దీ తీసుకుని తింటున్నాడు. వద్దని చెప్పినా వినిపించుకోవడం లేదు'' అన్నారు గోపబాలకులు.

''కృష్ణుడెక్కడ?'' కోపగించుకుంది యశోద.

''అక్కడ'' అంటూ అటుగా చూపించారు. అక్కడకి పరుగుదీసింది యశోద. మన్ను తినడం అనారోగ్యం. తినవద్దని చెబుతున్నా వినడం లేదు కృష్ణుడు. దండించాల్సిందేననుకున్నది యశోద.

''కృష్ణా'' గట్టిగా అరచింది.

చేతిలోని మన్నుని విసిరేసి, చేతిని దులుపుకుని అమాయకంగా చూశాడు కృష్ణుడు.

''మన్ను తినకూడదని, తింటే అనారోగ్యం అని నీకెన్నిసార్లు చెప్పాన్రా? విన్నావా? ఎందుకు వింటావు? నువ్వు వినవు. నీకెలా చెప్పాలో నాకు తెలుసు, పద చెబుతాను.'' కృష్ణుణ్ణి రెక్కపట్టి లాగింది యశోద.

''నిన్ను...నిన్నేం చేస్తానో చూడు.'' బెదిరించింది.

''మన్ను తినలేదమ్మా'' ఏడుపు ముఖం పెట్టాడు కృష్ణుడు.

''అబద్ధాలాడుతున్నావు.''

''లేదమ్మా! నేను నిజమే చెబుతున్నాను.''

''నమ్మను. నువ్వు మన్ను తిన్నావు. తినకపోతే నీ మీద చాడీలు చెప్పడం వాళ్ళకు సరదానా?''

''నా మాట నమ్మట్లేదుకదా, సరే, నా నోరు చూడు, నీకే తెలుస్తుంది'' అన్నాడు కృష్ణుడు.

''ఏదీ చూపించు.'' అడిగింది యశోద.

ముందు సన్నసన్నగా తెరచి, తర్వాత ఓ గుహలా బాగా విప్పార్చి నోరు చూపించాడు కృష్ణుడు. ఆ నోటిలోకి యశోద తొంగి చూసి విస్తుపోయింది. భూమి, ఆకాశం, పర్వతాలు, సముద్రాలు, సూర్యచంద్ర గ్రహనక్షత్ర తారకాగణాలు, సకల చరాచర భూతజాలం, స్వర్లోక పాతాళాదిలోకాలుసహా తనూ, తను నివసిస్తున్న గోకులం కూడా కృష్ణుని నోటిలో కనిపించాయి యశోదకు. దిగ్భ్రాంతి చెందింది. నోట మాటలేదు.

ఏమిటిదంతా? చిన్నికృష్ణుని నోటిలో సమస్తలోకాలూ కనిపించడం ఏమిటి? ఇది కలా? నిజమా? అంతుచిక్కని ఒకానొకదశలో కళ్ళు మూసుకుంది యశోద. మాయకు లోనయింది. అప్పుడు ఆమెకు సర్వేశ్వరుడు తన ఉనికిని అంతా విడమరచి చెప్పినట్టుగా వినవచ్చింది. అన్నిటా అంతటా తనేనన్న శ్రీహరి గొంతు వినవస్తోంటే యశోద రెండు చేతులూ జోడించి, కృష్ణునికి నమస్కరించింది. సమస్తానికీ ఆధారభూతుడయిన శ్రీమన్నారాయణుని శరణువేడింది. శరణువేడిన మరుక్షణం మాయ వీడిపోయింది. విశ్వరూపాన్ని ఉపసంహరించాడు కృష్ణుడు. నోరు మూసేశాడు. మామూలు పిల్లాడయిపోయాడు. ఏడుపు నటించాడు. యశోద తల్లి హృదయం తల్లడిల్లింది. కృష్ణుణ్ణి దగ్గరగా తీసుకున్నదామె. లాలించింది. ముద్దు చేసింది.

''ఏడవకు నాన్నా! ఏడవకు! నువ్వు ఏడిస్తే నేను చూడలేను'' అన్నది. కన్నీరు పెట్టుకుంది. తల్లి కన్నీరు పెట్టుకోవడాన్ని చూసి, జాలి చెందాడు కృష్ణుడు. గొలుసు గొలుసులుగా నవ్వసాగాడు. చిన్నికృష్ణుని నవ్వు తొలకరిలా అనిపించింది యశోదకు. అందులో తనివితీరా తడిసిపోయిందామె.

## మద్దిచెట్లు:సిద్ధపురుషులు

యశోద చల్ల చేస్తున్నది. కవ్వం తాళ్ళు పట్టుకుని కుండలో పెరుగు చిలుకుతున్నది. కృష్ణుడు వచ్చాడప్పుడు. పాలిమ్మని ఏడుపు అందుకున్నాడు.

''చల్లయిపోనీ, పాలిస్తాను'' అన్నది యశోద. వినడే! తల్లి చీరకొంగు లాగసాగాడు కృష్ణుడు.

''ఉండురా నాన్నా'' బతిమలాడుకున్నది యశోద. ఫలితం లేదు. పాలిమ్మని కృష్ణుడు ఒకటే ఏడుపు. తప్పదనుకున్నది యశోద. కృష్ణుణ్ణి ఒడిలోకి తీసుకుని పాలివ్వసాగింది. అంతలో పొయ్యి మీద పాలు పొంగిపోతూ కనిపించాయి. కృష్ణుణ్ణి తొలగించి, పరుగుదీసిందక్కడకి. తనకి పాలివ్వకుండా తల్లి అలా పరిగెత్తి పోవడాన్ని కృష్ణుడు సహించలేకపోయాడు. కోపం వచ్చిందతనికి. కళ్ళెర్రజేశాడు. పెదవులు కొరికాడు. దగ్గరలో ఉన్న రాయి అందుకున్నాడు. పెరుగుకుండ మీదకి విసిరాడు దాన్ని. 'ఫెడేళ్'మని పెరుగుకుండ పగిలిపోయింది. చల్ల అంతా కాలువలుగట్టి ప్రవహించసాగింది. ప్రవాహంలో తేలివస్తున్న వెన్నముద్దలు చేజిక్కించుకుని అక్కణ్ణుంచి పారిపోయాడు కృష్ణుడు. పొయ్యి మీది పాలు పొంగకుండా చేసుకుని, చల్లకుండ దగ్గరకి చరాచరా వచ్చింది యశోద. అక్కడి దృశ్యాన్ని చూసి కోపం తెచ్చుకుంది. నిండుకుండను పగలగొట్టి పారిపోతావా? ఉండు, నీ పని చెబుతాను అనుకుంటూ కృష్ణుని కోసం వెదకసాగింది. కృష్ణుణ్ణి కొట్టేందుకు చేతికర్ర కూడా అందుకుంది. అటు వెదకి, ఇటు వెదకి. వేసారిపోయింది. ఎక్కడున్నావు కృష్ణయ్యా అంటే ఇదిగో ఇక్కడ ఉన్నానన్నట్టుగా పెరటిలో పూలచెట్టునీడలో రోలు మీద కూర్చుని కనిపించాడు కృష్ణుడు. తిన్నంతగా వెన్న తిన్నాడు. మిగిలినది తన దగ్గర కూర్చున్న కోతికి పెడుతూ కనిపించాడు. వెల్ల వేసినట్టుగా ఒంటినిండా వెన్నే! కృష్ణుణ్ణి చూడగానే కోపం మరింత రెట్టింపయి, అతన్ని పట్టుకునేందుకు పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ రాసాగింది యశోద. అమ్మకి కోపం వచ్చింది. అమ్మ చేతిలో కర్ర కూడా ఉంది. కొడుతుంది. చిక్కకూడదనుకున్నాడు కృష్ణుడు. పరుగుదీశాడు. కాలిగజ్జెలు ఘళ్‌ఘళ్‌మంటూ కృష్ణుడు పరుగుదీస్తోంటే, అతన్ని పట్టుకునేందుకు యశోద ఆపసోపాలుపడ్డది. ఆఖరికి కృష్ణుణ్ణి అందిపుచ్చుకున్నది. చేతికర్ర ఎత్తి కొట్టబోయింది. కన్నీటితో చూశాడు కృష్ణుడు. కరగిపోయింది యశోద. కర్రను వదలి, కృష్ణుణ్ణి కౌగిలించుకుంది.

''ఉన్నచోట ఉండవు. పరుగులుదీసి ప్రాణాలు తీస్తున్నావు. నిన్ను కదలకుండా ఉంచడం ఎలాగో నాకు బాగా తెలుసు. చూడేం ఏం చేస్తానో.'' అన్నది యశోద. దగ్గరలో ఉన్న తాడు అందుకున్నది. ఒక కొస కృష్ణుని మొలకు కట్టి, రెండో కొసను రోలుకి కట్టేందుకు ప్రయత్నించింది. తాడు చాలలేదు. ఇంట్లోకి వెళ్ళింది. తాళ్ళు తెచ్చింది. ఎన్నితాళ్లో! అన్ని తాళ్ళు కట్టినా రోలు అందడం లేదు. కృష్ణుడు కదలడం లేదు. ఉన్నచోటే ఉన్నాడు. రోలు కూడా అంతే! ఉన్నచోటే ఉన్నది. మరి తాడెందుకు సరిపోవట్లేదో! అంతుచిక్కలేదు యశోదకు. కన్నీరు పెట్టుకుందామె. తల్లి అలా కన్నీరుపెట్టుకోవడం కృష్ణుడు చూడలేకపోయాడు. మాయను మటుమాయం చేశాడు. ఇప్పుడు తాడు సరిపోయింది. రెండో కొసను రోలుకు కట్టింది యశోద.

''ఇప్పుడిక ఎలా పరుగుదీస్తావో చూస్తాను. ఉన్నచోట ఉండాల్సిందే! బుద్ధిగా కూర్చో.'' అన్నది. ఎవరో పిలిస్తే వెళ్ళిపోయింది.



అమ్మ చెప్పినట్టుగా వింటే అల్లరికృష్ణుడు ఎందుకవుతాడు? వినడుగాక వినడు. రోలునీ, తాడునీ పదేపదే చూసి, రోలుని లాగుతూ, దోగాడుతూ అక్కణ్ణుంచి బయల్దేరాడు కృష్ణుడు. రెండు పెద్దమద్దిచెట్ల దగ్గరగా వచ్చాడు. కవలపిల్లల్లా జంటగా పుట్టిన చెట్లవి. రోలు ఈడ్చుకుంటూ ఆ చెట్లమధ్యనుంచీ వచ్చాడు. చెట్లమధ్య రోలు ఇరుక్కుంది. ముందుకు రావట్లేదు. లాగి చూశాడు కృష్ణుడు. రాలేదు. బలాన్నంతా ఉపయోగించాడు. గట్టిగా గుంజాడు. రోలు గట్టిగా అదమడంతో చెట్లు రెండూ వేళ్ళతో సహా విరిగిపడ్డాయి. విరిగిపడిన చెట్ల మధ్య నుంచి ఇద్దరు సిద్ధపురుషులు వెలిశారు. దివ్యతేజస్సుతో వెలిగిపోతూ ప్రత్యక్షమయ్యారు. చేతులు జోడించి చిన్నికృష్ణునికి నమస్కరించారు. వేదమంత్రాలతో స్తుతించారతన్ని. కృష్ణుడప్పుడు దివ్యరూపంతో వారిని అనుగ్రహించాడు. కృష్ణుని చుట్టూ ప్రదక్షిణగా తిరిగి, సెలవంటూ ఆ సిద్ధపురుషులిద్దరూ ఆకాశానికి ఎగిసిపోయారు. ఉత్తరదిక్కుగా తరలిపోయారు.

# గోవిందుడు అందరివాడు

వెళ్ళిపోయిన ఆ ఇద్దరు సిద్ధపురుషులూ కుబేరుని కుమారులు. నలకూబరుడు, మణిగ్రీవుడు వారి పేర్లు. శాపకారణంగా వారిద్దరూ మద్దిచెట్లుగా నందుడి ఇంట వెలిశారు. ఆ కథ ఏమిటంటే...

నలకూబరుడూ, మణిగ్రీవుడూ ఇద్దరూ చక్కనివాళ్ళే! నలకూబరునికంటే మణిగ్రీవుడు మరింత చక్కనివాడు. ఒకసారి ఈ ఇద్దరూ కైలాసపర్వత సమీపంలో ఉన్న ఒకానొకవనంలో అప్సరసలతో కలసి విహరించసాగారు. మదిరారసం తాగి మత్తెక్కి క్రీడించసాగారు. నగ్నంగా అక్కడి సరోవరంలో జలక్రీడలాడసాగారు. అప్పుడక్కడకి నారదుడు విచ్చేశాడు. ఆయనను చూసి అప్సరసలు వస్త్రాలు ధరించారు. సిగ్గుతో తలలు దించుకుని పరుగుదీశారు. నలకూబరుడు, మణిగ్రీవుడు మాత్రం వస్త్రాలు ధరించక, సిగ్గుపడక నారదుణ్ణి పట్టించుకోనట్టుగా ప్రవర్తించారు. ఆ మహర్షికి నమస్కరించలేదు కూడా. కుబేరుని కొడుకులం అన్న గర్వంతో పాటు మదిరాపాన మత్తులో ఉన్నారుగా, మంచిచెడ్డలు మరచిపోయారిద్దరూ. వారిని చూసి కోపగించుకున్నాడు నారదుడు. వారి మదం అణచాలనుకున్నాడు. శపించాడిలా.

''మీరిద్దరూ భూలోకంలో మద్దిచెట్లుగా పుట్టండి.''

దాంతో మత్తు వదలిపోయింది. జ్ఞానోదయం కలిగింది. నలకూబర, మణిగ్రీవులిద్దరూ తప్పు క్షమించమనీ, శాపవిమోచనం ప్రసాదించమనీ వేడుకున్నారు. నారదుడు దయతలచాడప్పుడు.

''నూరుదివ్యసంవత్సరాలు మద్దిచెట్లలా ఉండండి. తర్వాత కృష్ణావతారవేళ చిన్నికృష్ణుని పాదస్పర్శతో మీ రూపాలు మీరు పొందండి'' అన్నాడు నారదుడు.

నాటి శాపం నేడు తీరడంతో కుబేరుని కుమారులిద్దరూ ఆకాశానికి ఎగసిపోయారు.

పెరట్లో చెట్లేవో పడిపోయిన శబ్దం వినరావడంతో అటుగా పరుగుదీశాడు నందుడు. అతనితోపాటుగా గోపకులు కూడా పరుగందుకున్నారు. రెండు మద్దిచెట్లు కూలిపోయి ఉన్నాయి. చిన్నికృష్ణునికి రోలు కట్టి ఉంది. అంతుచిక్కలేదు నందునిసహా అక్కడకి వచ్చిన అందరికీ. ఇద్దరు గొల్లపిల్లలు నోరు తెరచి ఆశ్చర్యంగా కృష్ణుణ్ణి చూడడాన్ని గమనించాడు నందుడు. ఆ పిల్లల్ని అడిగాడిలా.

''చెట్లు ఎలా పడిపోయాయిరా?''

ఎలా పడిపోయాయో అంతా చూసింది చూసినట్టుగా చెప్పారు వారు. కృష్ణునికి యశోద రోలు కట్టడం, దానిని ఈడ్చుకుంటూ కృష్ణుడు మద్దిచెట్ల మధ్యనుంచీ రావడం, చెట్లు కూలడం, ఇద్దరు సిద్ధపురుషులు ప్రత్యక్షం కావడం, వారు కృష్ణునికి నమస్కరించడం, ఆకాశానికి ఎగసిపోవడం అంతా చెప్పారు.

''కలా నిజమా తేల్చుకోలేకపోతున్నామయ్యా'' అన్నారు పిల్లలు. మళ్ళీ కృష్ణుణ్ణి చూస్తూ నోరెళ్ళబెట్టారు.

''చెట్లను కూల్చేంత బలం కృష్ణునికి ఎక్కడిది? పిల్లలేవో కథలు చెబుతున్నారు'' అన్నాడు నందుడు.

''అంతే అంతే'' అన్నారు గోపకులు. జాలిగా కృష్ణుణ్ణి చూశాడు నందుడు. కట్టిన తాడు విప్పి, చేతుల్లోకి తీసుకున్నాడతన్ని. ముద్దులతో ముంచెత్తుతూ ఇంటికేసి నడిచాడు.

## అందరి బృందావనం

కృష్ణుడు అనగానే బృందావనం గుర్తుకొస్తుంది. అతని బాల్యం అంతా మధుర, గోకులం, బృందావనంలోనే గడిచింది.

బృందావనంలో అనేక వనాలు ఉన్నాయి. రకరకాల ఫలవృక్షాలతోనూ, పచ్చికబయళ్ళతోనూ బృందావనం అంతా అందంగా ఉంటుంది. ఏ కాలంలోనూ పశువుల మేతకు కొదవలేదక్కడ. అందువల్లనే గొల్లలకూ, ఆలమందలకూ బృందావనం నెలవయింది. దగ్గరగా యమునానది ఉండడంతో నీటికొరత కూడా లేదు. గోకులం, బృందావనం, యమునాతీరం కృష్ణుని ఆటపాటలకు చిరునామాలు. కృష్ణుడు అడుగు పెట్టినంతనే బృందావనం పరవశించిపోయేది. అడుగడుగునా ఆనందించేది. పవిత్రతను సంతరించుకునేది. ఆ పవిత్రతే నేటికీ అక్కడి నేలను అంటిపెట్టుకుని ఉందంటారు. బృందావనంలోని అణువణువూ కృష్ణునికి తెలుసు. అక్కడెన్నో అద్భుతాలు చేసి చూపించాడతను. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసిందక్కడే! అల్లనల్లన యమునానది ఇసుకతిన్నెల మీద సంచరించి, ముక్తిని ప్రసాదించిన మహానుభావుడు కృష్ణుడు.

బలరామకృష్ణులు కౌమారదశను దాటారు. చూడచక్కనయినారు. మురళిని బాగా వాయించేవాడు కృష్ణుడు. అతని వేణుగానానికి పరవశించిపోయేవారు జనం. ముల్లోకాలూ మత్తుగా తూగాడేవి. ఆలమందలు కూడా అబ్బురంగా చూసేవి. కొండకోనల్లో కనిపించక తిరుగాడే ఏ గోగణాన్నయినా వేణుగానంతోనే మరలించేవాడు కృష్ణుడు. పూతన, శకటాసురుడు, తృణావర్తుని అకృత్యాలకు వ్రేపల్లెవాసులు భయపడ్డారు. దానికి తోడు వారికి అనేక అపశకునాలు తోచాయి. దాంతో ఆందోళన చెందారంతా. గోగణాలకూ తమకూ రక్షణ కావాలనుకుని ఆలోచనలు సాగించారు. ఉపనందుణ్ణి ఆశ్రయించారు. యాదవులకు అతను పెద్ద. అన్నీ తెలిసినవాడు. గోగణాలసహా వెళ్ళి బృందావనంలో కొన్నాళ్ళు ఉండడం శ్రేయస్కరం అన్నాడతను. సరేనన్నారంతా. అతను చెప్పినట్టుగానే గోగణాలు, కుటుంబాలుసహా బృందావనానికి చేరుకున్నారు. విడిది ఏర్పాటు చేసుకున్నారక్కడ. హాయిగా గడపసాగారు.

ఒకనాడు గోపాలురుసహా రామకృష్ణులు యమునానది ఒడ్డున ఆలమందలు మేపుతున్నారు. అప్పుడక్కడకి కంసుడు పంపగా ఓ రాక్షసుడు చేరుకున్నాడు. తనని గుర్తించకుండా ఉండేందుకు దూడగా మారి మందలో కలసిపోయాడు. కలసిపోయి ఆవులనూ, గోపాలకులనూ చంపే ప్రయత్నాలు చేయసాగాడు. గమనించాడది కృష్ణుడు. పరుగునవచ్చాడు. దూడ కాళ్ళూ తోకా పట్టి గిరగిరా తిప్పి, నేల మీదకి విసరికొట్టాడు. ఆ దెబ్బకి నెత్తురు కక్కుకుని, విలవిలా తన్నుకుంటూ ప్రాణం విడిచాడు రాక్షసుడు. నిజరూపాన్ని దాల్చాడు. చచ్చిపడిన రాక్షసుణ్ణి చూసి, కృష్ణుణ్ణి అనేక విధాల పొగిడారు గోపాలకులు.

ఇంకొకనాడు ఆలమందలకు నీరు తాగించేందుకు యమునానదికి గొల్లపిల్లలు సహా రామకృష్ణులు వెళితే, అక్కడకి ఇంకొక రాక్షసుడు వచ్చాడు. అతనూ కంసుని ఆజ్ఞ మేరకే వచ్చాడక్కడకి. పెద్ద కొంగరూపం ధరించాడు. ఆడుకుంటూ పాడుకుంటున్న కృష్ణుణ్ణి చూశాడు. ఎగిరి వచ్చి

మింగేశాడతన్ని. మింగిన తర్వాత తెలుసుకున్నాడు, తానెంత తప్పు చేశాడో! కార్చిచ్చు మింగినట్టుగా బాధపడసాగాడు. కృష్ణుడు కడుపులో జ్వాలగా మారిపోయాడు. దహించసాగాడు. తట్టుకోలేని రాక్షసుడు కృష్ణుణ్ణి వెళ్ళగ్రక్కాడు. నేల మీదపడిన కృష్ణుణ్ణి ముక్కుతో పొడిచి చంపాలని ప్రయత్నించాడు. రెండు మూడుసార్లు బలంగా పొడిచాడు. తప్పుకున్నాడు కృష్ణుడు. తప్పుకుని, తెలివిగా కొంగ ముక్కుపట్టుకున్నాడు. వెదురుబొంగును చీల్చినట్టుగా రాక్షసుని ముక్కు చీల్చి, వాడి అంతు చూశాడు కృష్ణుడు. రక్తం కక్కుకుంటూ విలవిలా తన్నుకుంటూ ప్రాణాలు విడిచిన కొంగను ఆశ్చర్యంగా చూడసాగారు గోపబాలకులు. వారు అలా చూస్తుండగానే ఆ కొంగ నిజ రూపం దాల్చి, రాక్షసుడిగా పెనుకేకలు వేసి, చచ్చిపోయింది. కృష్ణుని ధైర్యాన్ని మెచ్చుకున్నారు మిత్రులంతా. చప్పట్లు చరిచారు. అతని మీద పువ్వులు జల్లారు. రాక్షసునితో పోరాడి, చిన్న



గాయం కూడా లేకుండా నిలిచిన కృష్ణుణ్ణి, బలరాముడు అభినందనగా కౌగిలించుకున్నాడు. సంగతి యశోదానందులకు తెలిసింది. పరుగు పరుగున వచ్చి, కృష్ణుణ్ణి అక్కున చేర్చుకున్నారు. తమ పట్ల దేవుడున్నాడంటూ, దేవునికి పదేపదే నమస్కరించారు.

కొద్దిరోజులు గడిచాయి. ఒకనాడు బలరామకృష్ణులూ, గోపబాలలూ కలసి ఆడుకుంటున్నారు. ఆవులు దూరంగా మేస్తున్నాయి. అఘాసురుడు వచ్చాడక్కడకి. ఆ రాక్షసుణ్ణి కూడా కంసుడే పంపించాడక్కడకి. వాడు పరాక్రమవంతుడు. బలశాలి. తన సోదరి పూతననూ, సోదరుడు బకాసురుణ్ణీ(కొంగరాక్షసుడు) చంపిన కారణంగా కృష్ణుని మీద పగపెంచుకుని వచ్చాడక్కడకి. కొండచిలువగా మారాడు. నోరు తెరచి, కృష్ణుణ్ణీ, అతని మిత్రబృందాన్నీ మింగేయదలచాడు. పైపెదవి ఆకాశాన్నంటి ఉంది. కింది పెదవి భూమిని తాకుతోంది. కొండశిఖరాల్లాంటి కోరలు, భయంకరమైన నాలుకతో  జరజరా రాసాగాడు. పాముని చూశారు బాలలు. భయపడి పరుగందుకున్నారు. నోటిని మరింతగా సాచి కృష్ణుణ్ణీ, అతని మిత్రబృందాన్నీ అందరినీ మింగేశాడు అఘాసురుడు. తమని కాపాడమని కృష్ణుణ్ణి వేడుకున్నారు బాలలు. అభయాన్ని ప్రసాదించాడు కృష్ణుడు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా తన దేహాన్ని పెంచుతూ పోయాడు కృష్ణుడు. వేలరెట్లుగా పెరిగిపోయాడు. కొండచిలువ తోక నుంచి నోటిదాకా కృష్ణుడే! ఇంకా పెరిగిపోతున్నాడు. ఊపిరాడలేదు అసురునికి. గుడ్లు వేలాడేశాడు. తలపేలిపోయింది. చనిపోయాడు రాక్షసుడు. పేలిన తలలోంచి మిత్రులుసహా బయటపడ్డాడు కృష్ణుడు. బ్రహ్మదేవుడు చూశాడిదంతా. వచ్చి, చేతులు జోడించి నమస్కరించాడు. కృష్ణుణ్ణి స్తోత్రం చేశాడు.

కొండచిలువ ఆకారంలో గల అఘాసురుడు చనిపోతూ నిజరూపం దాల్చలేదు. అలాగే పామురూపంలోనే ఉండిపోయాడు. దాంతో ఆ కళేబరం ఎండిపోయి బృందావనవాసులకు ఆటవస్తువు అయింది. పిల్లలు దాని నోటిలోకి పరుగున వెళ్ళడం, రావడం, అందులో దాగుంటూ ఆటలాడుకోవడం, ఆనందించడం అలవాటు చేసుకున్నారు.

## విష్ణుమాయ

'అంతా విష్ణుమాయ' అంటారు. ఈ మాయకు లోనుకానిదేదీ లేదు. మానవులేకాదు, దేవతలు కూడా విష్ణుమాయకు లోబడినవారే! బ్రహ్మ, శివుడు కూడా విష్ణుమాయను తెలుసుకోలేక పోయారు.  తెలుసుకోవాలనుకున్న బ్రహ్మ ఒకసారి ఏం చేశాడంటే...ఆలమందల్ని మాయం చేశాడు. ఆవులన్నీ మేస్తున్నాయి. హాయిగా ఉన్నాయి. మనం చద్దులు తిందామనుకున్నారు కృష్ణుడుసహా మిత్రులంతా. చద్దిమూటలు విప్పుకున్నారు. తింటూ మందలకేసి చూపు మరల్చారు. ఆవులు కనిపించవే! గొల్లుమన్నారంతా. తిండి సంగతి తర్వాత, ముందు మందల్ని గాలించాలనుకుని పరుగులు దీశారు. నలుదిక్కులా వెదికారు. కనిపించలేదు. వెదకి వెదకి అలసిపోయారు. ఏడుస్తూ కృష్ణుణ్ణి సమీపించారు.

''కృష్ణా! ఆలమందలు ఏమయ్యాయో తెలీడం లేదు. ఒక్క ఆవు కూడ కనిపించడం లేదు. అయ్యా అమ్మల్ని తలచుకుంటే భయంగా ఉంది. ఆటల్లో పడి చూసుకోలేదని తిడతారు. కొడతారు కూడా'' అన్నారు.

''కంగారుపడకండి. ఆవులెక్కడికీ పోవు. వాటిని తీసుకొచ్చే బాధ్యత నాది'' అన్నాడు కృష్ణుడు. వేణువు ఊదుతూ బయల్దేరాడు. అంతా గమనిస్తునే ఉన్నాడు బ్రహ్మ. మాయం చేసిన మందల్ని ఎక్కణ్ణుంచి తీసుకొస్తావు? అనుకున్నాడు. సన్నగా నవ్వుకున్నాడు. మిత్రుల్ని వదలి కృష్ణుణ్ణి కొద్దిదూరం వెళ్ళనిచ్చి, అప్పుడు ఆ మిత్రుల్ని కూడా మాయం చేశాడు బ్రహ్మ. మందల్ని పిలచి పిలచి అలసిపోయాడు కృష్ణుడు. ఎక్కడా కానరాలేదు. ఆ సంగతి మిత్రబృందానికి చెప్పేదెలా? అనుకుంటూ వచ్చిన కృష్ణునికి ఒక్క మిత్రుడు కూడా కనిపించలేదు. పేరు పేరునా మిత్రుల్ని పిలిచాడు. పలకలేదెవరూ. అర్థమయింది కృష్ణునికి. అంతా బ్రహ్మమాయ అనుకున్నాడు. నవ్వుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. పోయిన ఆలమందల్ని, ఎవరెవరివి ఏఏ ఆవులో అచ్చు అలాంటివే సృష్టించాడు కృష్ణుడు. అలాగే మిత్రులను కూడా సృష్టించాడు. కనిపించని గోపబాలురు, కనిపిస్తున్న గోపబాలురల్లో చిన్నపాటి తేడా కూడా లేదు. కట్టూ బొట్టూ అన్నీ అంతా ఒక్కటే! అందరిలోనూ తానై మెలగాడు. మందల్లోనూ తానై జీవించాడు. అంతా కృష్ణమయం చేశాడు. ఆవుల్నీ, మిత్రుల్నీ వెంటబెట్టుకుని ఇంటిముఖం పట్టాడు కృష్ణుడు. అల్లంత దూరం నుంచే పిల్లల్నీ, ఆవుల్నీ చూసి పరుగున వచ్చారు తల్లిదండ్రులు. ప్రేమగా నిమిరి ఎవరి ఆవులను వారు, ఎవరి పిల్లల్ని వారు వెంటబెట్టుకుని వెళ్ళిపోయారు. వారంతా కృష్ణమాయ అనీ, ఆవులూ, పిల్లలూ అంతా కృష్ణుడేనని ఎవరికీ తెలియదు. అలా ఏడాది గడిచిపోయింది.

## బలరాముని శౌర్య ప్రతాపాలు

ఈ ఏడాదీ బ్రహ్మమానంలో తృటికాలం మాత్రమే!

గోవులనూ, గోపాలురనూ దాచిపెట్టేశాను కదా! ఎవరూ లేని బృందావనం ఎలా ఉన్నదో చూద్దామనుకున్నాడు బ్రహ్మ. వచ్చి చూశాడు. చూసి ఆశ్చర్యపోయాడు. బృందావనంలో గోవులు ఉన్నాయి. గోపాలురు ఉన్నారు. అందరూ సంతోషంగా ఉన్నారు. అల్లరి కృష్ణుడి ఆటలు సాగుతూనే ఉన్నాయి. ఏదీ జరగనట్టుగానే ప్రవర్తిస్తున్నాడతను. ఆలమందలనూ, గోపాలురనూ తేరిపారజూశాడు బ్రహ్మ. చూస్తే ఆవుల్లోనూ, అందరిలోనూ శంఖ చక్రాలతో శ్రీమహావిష్ణువు కనిపించాడు. అంతా అందరూ మహావిష్ణువు అవతారాలనిపించారు. ఆశ్చర్యానికి లోనయినాడు బ్రహ్మ. ఏదీ అంతుచిక్కలేదతనికి. కాస్సేపటికి మాయ తొలగింది. బ్రహ్మకు జ్ఞానోదయం కలిగింది. తన మాయతో విష్ణువును అల్లరిపెట్టాలనుకున్నాడు కాని, తానే అల్లరిపాలయినాడని గ్రహించాడు బ్రహ్మ. విష్ణుమాయను ఎదుర్కోవడం సులభం కాదనుకున్నాడు. కృష్ణుణ్ణి సమీపించాడు. చేసిన తప్పును మన్నించమని వేడుకున్నాడు. వేదగానంతో ఆ దేవదేవుణ్ణి స్తుతించాడు. మాయం చేసిన ఆలమందలనూ, గోపాలురనూ ప్రత్యక్షం చేసి, అనుగ్రహించమని చేతులు జోడించి నమస్కరించాడు. అనుగ్రహించాడు కృష్ణుడు. తన తత్త్వాన్ని బోధించాడతనికి. కృష్ణతత్త్వాన్ని తెలుసుకున్న బ్రహ్మ, ఆత్మానందాన్ని అనుభవించి, అక్కణ్ణుంచి నిష్క్రమించాడు.

ఎప్పుడయితే బ్రహ్మ దాచిపెట్టిన గోవులూ, గోపాలురూ ప్రత్యక్షమయ్యారో అప్పుడు తన మాయను ఉపసంహరించాడు కృష్ణుడు. దాంతో అతను సృష్టించిన గోవులూ, గోపాలురూ అదృశ్యమయినారు. బ్రహ్మ దాచిపెట్టిన గోపాలురు, కృష్ణుణ్ణి పరుగున సమీపించారు. బ్రహ్మమానం

ప్రకారం క్షణకాలం వారు కృష్ణునికి దూరమయినారు. ఆ క్షణకాలం కూడా వారు కృష్ణవియోగాన్ని తట్టుకోలేకపోయారు. కృష్ణుణ్ణి సమీపించి, ఒకరు తర్వాత ఒకరుగా అతన్ని కౌగిలించుకున్నారు.

''ఎక్కడకి వెళ్ళావు కృష్ణా! నిన్ను చూడక క్షణకాలం కూడా ఉండలేం'' అన్నారు.

''ఎక్కడికి వెళ్ళాను? ఇక్కడే ఉన్నాను. మీతోనే ఉన్నాను, మీలోనే ఉన్నాను'' అన్నాడు కృష్ణుడు. వేణుగానం ఆలపించాడు. ఆ గానానికి గోవులూ, గోపాలురూ తన్మయత్వంగా తలలాడించారు.

## ధేనుకాసురుడు

అక్కచెల్లెళ్ళలా రోహిణి, యశోద ప్రవర్తించేవారు. వారిలాగానే బలరామకృష్ణులు కూడా మెలగేవారు. క్షణం కూడా ఒకరిని విడచి ఒకరు ఉండేవారు కాదు. కృష్ణుడికన్నా రాముడు పెద్దవాడు. అతను ఆదిశేషుని అవతారం. మహాబలాఢ్యుడు కావడంతో రాముణ్ణి బలుడనీ, బలరాముడనీ వ్యవహరించేవారు. కృష్ణుడులాగానే బలరాముడు కూడా చిన్నతనంలో అనేక గొప్ప పనులు చేశాడు.

గోకులానికి దగ్గరగా ఓ తాళవనం ఉన్నది. ఆ వనం నిండా తాటిచెట్లే! ఒకదాని నుంచి ఒకటి వచ్చినట్టుగా, ఒకదానిమీద ఒకటి పడి ఉన్నట్టుగా చెట్లు చిక్కగా ఉంటాయక్కడ. ఆ చెట్లకి గుత్తులు గుత్తులుగా తాటిపళ్ళు వేలాడుతూ ఉంటాయి. వాటిని కొట్టుకుని తినాలని గోపాలురకు ఎప్పటినుంచో కోరిగ్గా ఉంది. అయితే ఆ వనంలో అడుగుపెట్టాలంటేనే భయం. అక్కడ ఓ రాక్షసుడు ఉన్నాడు. వాడి పేరు ధేనుకాసురుడు. గాడిద ఆకారంలో ఉంటాడతను. బంధుమిత్రాదులతో నివసిస్తున్నాడక్కడ. ఇతరులు ఎవరూ వనంలోకి రాకూడదు. వస్తే సంహరిస్తాడు. కంసుడి మిత్రుడినని వాడికి పొగరెక్కువ.

ఒకనాడు బలరామకృష్ణుల దగ్గరకి వారి స్నేహితుడు శ్రీరాముడు వచ్చాడు. మిత్రులను వెంటబెట్టుకుని గుంపుగా వచ్చాడు. వచ్చినవాడు వచ్చినట్టుగా ఉండకుండా ఆమాటా ఈమాటా చెప్పి, అసలు సంగతి బలరామకృష్ణుల ముందు బయటపెట్టాడు. ఏంటయ్యా అది అంటే...వాళ్ళందరికీ తాళవనంలోని తాటిపండ్లు తినాలని ఎప్పటి నుంచో కోరిగ్గా ఉన్నదట! ఆ కోరిక తీర్చుకుందామంటే ఆ వనానికి వెళ్ళేందుకే భయమట! ఎందుకంటే...అక్కడ ఓ రాక్షసుడు ఉన్నాడనీ, వాడికంట పడితే చంపేస్తాడనీ చెప్పాడు. అందుకు పగలబడినవ్వారు బలరామ కృష్ణులు.

''రాక్షసుడేం చేస్తాడు? ఏమీ చెయ్యడు, చెయ్యలేడు. పదండి, ఎవరికి కావాల్సిన తాడిపండ్లు వారు తినండి. మేమున్నాం మీ వెనుక'' అన్నారు. అందరూ కలసి తాళవనానికి చేరుకున్నారు. ఆకాశాన్ని అంటుతున్న తాళవృక్షాలను చూశాడు బలరాముడు. ఆకాశంలో వేలాడుతున్నట్టుగా వృక్షాలకు వేలాడుతున్న తాటిపళ్ళను చూశాడు. చెట్ల మొదళ్ళను చూశాడు. బలంగా ఉన్నాయి. ఉంటేనేం? తన బలం ముందు అవెంత? అనుకున్నాడు బలరాముడు. రెండు చేతులా చెట్లను పట్టుకుని, తొండాన్ని చుట్టి చెట్లను ఏనుగు ఊపినట్టుగా బలంగా ఊపాడు బలరాముడు. ఆ ఊపునకు తాటిపళ్ళు జలజలా రాలిపడ్డాయి.

''తినండి'' అన్నాడు బలరాముడు.

గోపాలురు తనివితీరా తినసాగారు. బహురుచిగా ఉన్నాయంటే బహురుచిగా ఉన్నాయంటూ జుర్రుకున్నారు. బలరాముని ఊపునకు కొన్ని చెట్లు విరిగి పడిపోయాయి. మరికొన్ని అయితే ఒరిగి నిల్చున్నాయి. వనం అంతా అస్తవ్యస్తంగా అల్లకల్లోలంగా తయారయింది. ధేనుకాసురుడికి ఈ సంగతి తెలిసింది. అంతే! ఉగ్రుడైపోయాడు. పళ్ళు నూరాడు. గాడిదలా ఓండ్రపెడుతూ, కొండలా దొర్లుకుంటూ బలరామకృష్ణుల్ని సమీపించాడు. కృష్ణుడు అతన్ని ఎదుర్కొనబోయాడు. తమ్ముణ్ణి వారించాడు బలరాముడు. వీడు నా వంతు అన్నట్టుగా చూశాడు. కొండలా వచ్చి మీద పడుతున్న ధేనుకాసురుణ్ణి ఒంటిచేత్తో అడ్డుకున్నాడు బలరాముడు. వాడితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఎగిరి, రెండుకాళ్ళూ ఎత్తి ధేనుకాసురుని వీపు మీద తన్నాడు బలరాముడు. దెబ్బకు నడుము విరిగినట్టుగా కిందపడ్డాడు అసురుడు. బాధతో గట్టిగా అరిచాడు. లేచేందుకు ప్రయత్నించసాగాడు. లేవనీయలేదు బలరాముడు. అసురుని ముందు కాళ్ళు రెండూ పట్టుకుని అల్లంత దూరానికి విసిరేశాడు. ఎగిరొచ్చి కిందపడ్డాడు అసురుడు. ఎముకలు విరిగిపోయాయేమో! లేవలేకపోయాడు. బలరాముని బలానికి ఆశ్చర్యపోయారు గోపాలురు. మెచ్చుకున్నారతన్ని. బలరాముని చేతికండల్ని నిమురుతూ నిల్చున్నారు. అన్నబలం తమ్ముడికి తెలుసు. అదిప్పుడు ప్రదర్శితమవుతోంది. నలుగురికీ అన్నబలం తెలియాలి అనుకున్నాడు కృష్ణుడు. అందుకే తను కల్పించుకోకుండా దూరంగా నిల్చున్నాడు. నవ్వుతూ నిల్చున్నాడు. ఇంతలో బలాన్ని కూడదీసుకున్నాడు అసురుడు. పరుగు పరుగున వచ్చాడు. బలరాముని మీద దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం విఫలమయింది. పరుగున వచ్చిన అసురుని నాలుగుకాళ్ళూ పట్టుకుని, పైకెత్తాడు బలరాముడు. కొండను తిప్పుతున్నట్టుగా గిరగిరా తిప్పాడు వాణ్ణి. తర్వాత గాడిదరూపంలో ఉన్న ఆ అసురుణ్ణి నేల మీదకి గట్టిగా విసరికొట్టాడు. మెడ విరిగిపోయింది. కళ్ళు పేలిపోయాయి. పొట్ట చీలిపోయింది. ధేనుకాసురుడు చనిపోయాడు. రాక్షసుడు చనిపోయాడని తెలియడంతో కృష్ణుడుసహా గోపాలురంతా హర్షధ్వానాలు చేశారు. మెచ్చుకోలుగా బలరాముణ్ణి చుట్టుముట్టారు.

ధేనుకాసురుణ్ణి గిరగిరాతిప్పి నేలకేసి గట్టిగా విసిరికొట్టినప్పుడు అప్పుడు కలిగిన అదురుకి తాళవృక్షాలు నేలలోంచి లేచిపడిపోయాయి. చెట్లు ఒకదాని మీద ఒకటి విరిగి పడడంతో వనం అంతా కుప్పకూలిపోయింది. కుప్పకూలిపోతున్న వనాన్నీ, చనిపోయిన ధేనుకాసురుణ్ణీ చూసి అతని బంధుమిత్రులంతా గాడిదముఖాలతో బలరామకృష్ణుల మీద దాడి చేశారు. తమ్ముడు కృష్ణుని సహకారం ఇప్పుడు కావాల్సి వచ్చింది రాముడికి. కృష్ణునితో చేయికలిపాడు. రాక్షసుల్ని కృష్ణుడుసహా ఎదుర్కొన్నాడు. అన్నదమ్ములిద్దరూ ధేనుకాసుర బంధుమిత్రుల్ని చంపి పోగులుపెట్టారు. తాళవనంలో ఎక్కడ చూసినా విరిగిపడిన తాటిచెట్లూ, చచ్చిపడి ఉన్న గాడిద ముఖాల రాక్షసులే! ఆ దృశ్యాల్ని చూసి ఆకాశంలోని దేవతలు హర్షించారు. బలరామకృష్ణుల మీద పుష్పవృష్టి కురిపించారు. నాటి నుంచి తాళవనం యాదవుల వశమయింది. బలరామ కృష్ణుల వీరోచితగాథంతా పిల్లల నోటితో పెద్దలు తెలుసుకున్నారు. పొంగిపోయారు. బలరామ కృష్ణుల్ని ఊరేగించారు. బలరామకృష్ణులిద్దరూ పక్కపక్కన కూర్చుని రథంలో ఊరేగుతోంటే వారిని చూసి రోహిణి, యశోదలు ఉప్పొంగిపోయారు. వీరపుత్రులనుగన్న వీరమాతలమని ఆనందించారు.



## కాళీయమర్దనం

వ్రేపల్లె సమీపానగల యమునానది దగ్గరగా 'కాళింది' అని ఓ మడుగు ఉన్నది. ఆ మడుగులో 'కాళీయుడు' అని ఓ సర్పరాజు నివసిస్తున్నాడు. కోరల్లోనే కాదు, ఆ పాము అణువణువునా విషమే! ఆ విషం అంతా మడుగు అడుగడుగునా నిలిచి ఉండి, కుతకుతా ఉడుకుతుండేది. దాని ఆవిరికి మడుగు మీద ఆకాశంలో ఎగిరే పక్షులుసైతం చచ్చిపోయి రాలిపడేవి. ఇక మడుగులో జీవించే జలచరాల సంగతి వేరే చెప్పనవసరం లేదు. ఏదీ బతికిన పాపాన పోలేదు. మడుగుపైనుంచి వీచే గాలి కూడా ప్రమాదకారి అయింది. ఆ గాలిసోకి ఆలమందలు చచ్చిపోతున్నాయి. గోపాలురు అనారోగ్యానికి గురవుతున్నారు. చేసేదిలేక దూరంగా తరలిపోతున్నారంతా.

కాళీయుడు కాళింది మడుగులో నివసించేందుకు ఓ కారణం ఉన్నది. ఆ కారణం ఏమిటంటే...కద్రువ, వినత దక్షుని కుమార్తెలు. ఆ ఇద్దరూ కశ్యప్రజాపతిని వివాహం చేసుకున్నారు. కద్రువ కడుపున సర్పాలూ, వినత కడుపున పక్షులూ పుట్టాయి. కద్రువకి పుట్టిన సర్పరాజులలో వాసుకి, శేషుడు, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు, కాళీయుడు ముఖ్యులు. వినతకు సూర్యభగవానుని సారథి అనూరుడు, విష్ణువాహనమయిన గరుత్మంతుడు జన్మించారు. కద్రువ కుమారుడు కాళీయుడు రమణకద్వీపంలో ఉండేవాడు. అతనితోపాటు అనేక సర్పాలు కూడా అక్కడ ఉండేవి. సర్పాలకు నిలయమయి ఆ ద్వీపం సముద్రమధ్యంలో ఉండేది. గరుత్మంతుడంటే సర్పాలకు భయం. సర్పం కనిపిస్తే చాలు, పట్టి భక్షించేవాడు గరుత్మంతుడు. ఆ బాధపడలేక సర్పాలన్నీ అతనితో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. నెలలో వచ్చే ప్రతి పర్వదినానికీ ఒక నాగు అతనికి ఆహారం అవుతుంది. చెట్టు మొదట్లో నాగుని బలిగా ఉంచుతారు. గరుత్మంతుడు దానిని భక్షించవచ్చు. ఆ ఒప్పందం చాలా రోజులు కొనసాగింది. రమణకద్వీపంలోని సర్పరాజులంతా ఎన్నడూ ఒప్పందాన్ని తప్పలేదు. చివరికి కాళీయుడి వంతు వచ్చింది. మహావిషసర్పం కాళీయుడు. పైగా గొప్పబలాఢ్యుడు. ఆ గర్వంతో గరుత్మంతునికి బలి సమర్పించలేదతను. అంతేగాక, గరుత్మంతునికి బలికావాల్సిన సర్పాలను తానే భక్షించసాగాడు. ఇది తెలిసి గరుత్మంతుడు, కాళీయుడంటే కోపాన్ని పెంచుకున్నాడు. అతన్ని చంపడానికి వచ్చాడు. కాళీయుడు ధైర్యంగానే గరుత్మంతుణ్ణి ఎదుర్కొన్నాడు. పెద్దయుద్ధం జరిగింది ఇద్దరికీ. అనేక పడగలు ఉన్న కాళీయుడు, తన కోరలతో గరుత్మంతుణ్ణి కరచి కరచి హింసించాడు. బాణాలతో పొడుస్తున్నట్టుగా బాధ కలిగింది గరుత్మంతునికి. ఆగ్రహోదగ్రుడయ్యాడు. వజ్రంలాంటి కాలిగోళ్ళు విప్పి, బలంగా ఓ తన్ను తన్నాడు కాళీయుణ్ణి. అంతే! ప్రాణాలుపోతున్నట్టనిపించాయి. కాళీయుడు రమణకద్వీపం వదలి పారిపోసాగాడు. గరుత్మంతుడు వదలలేదు. వెంటపడి తరిమాడు. ప్రాణభీతితో నలుదిక్కులకూ పరిగెత్తి, ఆఖరికి కాళిందిమడుగులో తలదాచుకున్నాడు కాళీయుడు. అక్కడకి రాలేకపోయాడు గరుత్మంతుడు. అతనికి అది రాకూడని స్థలం. దానికి ఓ కారణం ఉంది. అది ఏమిటంటే...పూర్వం కాళింది ఒడ్డున 'సౌబరి' అనే ముని తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. కాళిందిలో అప్పుడు పెద్దపెద్ద చేపలు ఉండేవి. ఆ చేపల్ని తినడానికి ఒకనాడు గరుత్మంతుడు వచ్చాడక్కడకి. ఓ మత్స్యరాజును పట్టి తినసాగాడు. సౌబరి వద్దని వారించినా వినలేదు గరుత్మంతుడు. తిని ఎగిరిపోయాడు. గరుత్మంతునికి బలయిపోయిన మత్స్యరాజు భార్యలు అనేకం సౌబరి చుట్టూచేరి దీనంగా విలపించసాగాయి. భర్తని కోల్పోయి దిక్కులేనివారమయినామని ఏకధాటిగా రోదించాయి. వాటిని చూసి మునికి జాలి కలిగింది. మేలు చేయదలచాడు వాటికి.

''ఇక నుంచి గరుత్మంతుడు ఇక్కడకి వచ్చినా, ఈ మడుగులోని చేపలను భక్షించినా మరణించుగాక'' అని శపించాడు. దాంతో గరుత్మంతుడు అక్కడకి రావడానికి వీలులేకుండా పోయింది. ఈ సంగతి కాళీయుడుకి తెలుసు. అందుకే అక్కడ దాగాడు. దాగి, ఎలాంటి భయమూ లేకుండా భార్యలతో హాయిగా సుఖించసాగాడు. దాంతో ఎన్నో యుగాలుగా కాళింది జలం తాగేందుకు వీలుకాకుండా పోయింది.

# శ్రీకృష్ణ తాండవం

ఒకనాడు గోకులంలోని గోపాలురూ, గోవులూ గ్రీష్మానికి అలసిపోయి, కాళింది మడుగునకు చేరుకున్నారు. ఆ నీటితో దాహం తీర్చుకున్నారు. దైవప్రేరణతో జరిగిందలా. వెంటనే కొందరు మరణించారు. మరికొందరు విషాన్ని తట్టుకుని, స్పృహ తప్పిపోయారు. మిగిలినవారు కృష్ణుణ్ణి ఆశ్రయించారు. గోలుగోలున విలపించారు. వారికి అభయాన్ని ప్రసాదించాడు కృష్ణుడు.

గోపాలురనూ, ఆలమందలనూ బ్రతికించాడు. అందరూ నిద్రనుంచి మేల్కొన్నట్టుగా లేచి నిల్చున్నారు. ఆనందబాష్పాలతో కృష్ణుణ్ణి స్తుతించారు. చేతులు జోడించి నమస్కరించారు.

స్తుతులు వింటూ, నమస్కారాలు అందుకుంటూ మడుగులో ఉన్న కాళీయుని మదం అణచాలనుకున్నాడు కృష్ణుడు. మడుగులోని నీరు అందరూ తాగి, జీవించేటట్టుగా చేయాలనుకున్నాడు. అటుగా చూశాడు. కదంబవృక్షం కనిపించింది. దాని పైకి ఎక్కాడు. పట్టుపీతాంబరాన్ని పైకి ఎగగట్టాడు. తొడలు చరిచాడు. జబ్బలు తట్టాడు. ఎగిరి మడుగులోనికి ఒక్క దూకు దూకాడు. చూసిన వాళ్ళంతా గొల్లుమన్నారు. కృష్ణాకృష్ణా అంటూ కేకలేసి పిల్చారు. పలకడే! ఇంతలో మడుగులోని జలం అల్లకల్లోలమయింది. సర్పవిషం సెగలు పొగలుగా ఎగజిమ్మింది. కృష్ణుడు కాళ్ళతోనూ, చేతులతోనూ మడుగును కలచి వేశాడు. నీటిని మథించాడు. లోలోతుల్లో దాగిన కాళీయుడు అది భరించలేకపోయాడు. కోపంతో విషాగ్నులు కుమ్మరిస్తూ పైకి తేలాడు. కావాల్సింది అదే! కృష్ణుడు కాళీయుని పడగల్ని అందుకోబోయాడు. దొరకనీయక, దొరికినచోటల్లా కృష్ణుణ్ణి కాటేశాడు కాళీయుడు. విషాగ్నికి స్పృహ తప్పినట్టు అనిపించిన కృష్ణుణ్ణి గట్టిగా చుట్టుకుని, తన పడగలకింద దాచేశాడు. అలా కనిపించి, ఇలా కనిపించి, తర్వాత కనిపించకుండాపోయిన కృష్ణుని కోసం ఏడుస్తూ అతన్ని పిలవసాగారు గోపాలురు. ఆలమందలు 'అంబా' అంటూ రోదించసాగాయి. స్పృహలోనే ఉన్నాడు కృష్ణుడు. ఆత్మీయుల రోదనలూ, అంబారావాలు అన్నీ వినసాగాడు. కాని, కాళీయుని పడగలనెత్తి పైకి రాలేని నిస్సహాయతలో ఉన్నాడు. ఒడుపు దొరకడం లేదు. వీలుచిక్కడం లేదు. దాని కోసం చూస్తున్నాడు.

వ్రేపల్లెలో అపశకునాలు గోచరించాయి. అక్కడ భూమి కంపించింది. నిప్పులవాన కురిసింది. మగవారికి ఎడమ కన్నులూ, భుజాలూ అదిరాయి. స్త్రీలకు ఏదో తెలియని భయం కలిగింది. అశుభ సూచికాలు పొడగట్టాయి. నందుడు మొదలయినవారంతా ఆ విపరీతాలకు భయపడ్డారు.

ఆరోజు ఆలమందలు, గోపాలురుసహా కృష్ణుడు ఒక్కడే వెళ్ళాడు. బలరాముడు ఇంటనే ఉండిపోయాడు. కృష్ణుడికి ఏమయిందో ఏమోనని కలతచెందారంతా. అతన్ని వెదుక్కుంటూ బయల్దేరారు. కాళిందిమడుగునకు చేరుకున్నారు. గోపాలురూ, ఆలమందలూ మడుగులోనికి తొంగి చూడడాన్ని గమనించి ఏమయింది? ఏమయింది అని ఆరా తీశారు. జరిగింది చెప్పారు గోపాలురు. అమ్మయ్యో! కృష్ణుడు ఎంతకి తెగించాడు? జరగరానిది జరిగితే...భయపడ్డారంతా. భయపడనిది బలరాముడు ఒక్కడే! అతనికి కృష్ణుడి చాకచక్యమూ బలమూ తెలుసు. తమ్ముడికి ఏమీ కాదన్న ధైర్యంతో ఉన్నాడు. కాళీయుని చుట్లలో కదలకుండా ఉన్న కృష్ణుణ్ణి చూశారంతా. పెద్దపెట్టున రోదించారు. తమ ప్రాణం, తమ శ్వాస, తమ చూపు, తమ రూపు అన్నీ అయిన కృష్ణునికి జరగరానిది జరిగితే... అయ్యబాబోయ్ ఆ ఊహనే తట్టుకోలేకపోయారు. నందాది



గోపకులు, యశోద మొదలయిన గోపికలు కృష్ణుడు లేకుండా తమను ఊహించుకోలేకపోయారు. ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. మడుగులోకి దూకేందుకు ప్రయత్నించారు. బలరాముడు అడ్డుకున్నాడు వారిని. వద్దని వారించాడు. కృష్ణుడికి ఏమీ కాదన్నాడు. తన మాటల్ని నమ్మమన్నాడు. బలరాముని మాటలు నమ్మి ఊరుకున్నారుగాని, ఎవరూ మనుషుల్లా లేరు. జీవచ్ఛవాల్లా ఉన్నారు. అందరినీ కొనగంట చూశాడు కృష్ణుడు. సన్నగా నవ్వుకున్నాడు. ఇక ఏడిపించకూడదనుకున్నాడు. బలాన్నీ, దేహాన్నీ పెంచాడు. పెంచి, తనని చుట్టుకున్న కాళీయుణ్ణి గట్టిగా విదలించాడు. నాగబంధం నుండి విముక్తుడయ్యాడు. ఎదురు నిలిచాడు. నాలుకలు చాచి, క్రూరవిషాగ్ని జ్వాలలు వెళ్ళగ్రక్కుతూ కృష్ణుని మీదకి రాసాగాడు కాళీయుడు. కోరలు సాచి కాటేయబోయాడు. అందడే కృష్ణుడు. ఇటు తిరిగితే అటు కనిపిస్తున్నాడు. అటు తిరిగితే ఇటు కనిపిస్తున్నాడు. అటూ తిప్పి ఇటు తిప్పి ఎటు తిరిగాలో తెలియని ఒక అయోమయస్థితిలో

కాళీయుడు ఉన్నప్పుడు, ఒక్క ఉదుటన ఎగిరి, అతని పడగల మీద నిల్చున్నాడు కృష్ణుడు. చిందులు తొక్కుతూ చిత్రవిచిత్ర భంగిమల్లో నాట్యం చేయసాగాడు. శివతాండవంలా ఉంది ఆ నాట్యం. దానిని మునులూ, సిద్ధులూ, గంధర్వులూ, ముల్లోకదేవతలూ చూసి ఆనందపర వశులయినారు. కృష్ణుని తాండవానికి సంగీతాన్ని అందించారు. మృదంగాది వాయిద్యాలు మ్రోగించారు. అనేక విధాల కృష్ణుణ్ణి స్తుతించారు. దోసిళ్ళతో పూలు విసరి పూజించారు. కాళీయుని శిరసును పాదాలతో తొక్కుతూ సర్పరాజును మర్దించాడు కృష్ణుడు. వాడి మదం అణచాడు. కాళీయుని శిరస్సులన్నీ వంగిపోయాయి. అతని శరీరం అంతా విరిగిపోయింది. నోళ్ళనుండి రక్తం కక్కుతూ రక్షించమని వేడుకున్నాడు కాళీయుడు. కృష్ణుణ్ణి ప్రార్థించాడు. అతని భార్యాబిడ్డలు కూడా తేలి పైకివచ్చారు. చేతులెత్తి కృష్ణుణ్ణి ప్రార్థించారు. కాళీయుణ్ణి కాపాడమని వేడుకున్నారు. కరుణించాడు కృష్ణుడు. మదం అణగిపోయి, దీనంగా ఉన్న కాళీయుణ్ణి విడచిపెట్టాడు.

''ఇక మీదట ఈ మడుగులో నువ్వు ఉండకూడదు. భార్యాబిడ్డలతోపాటుగా సముద్రంలోనికి వెళ్ళిపో'' ఆజ్ఞాపించాడు కృష్ణుడు. సరేనన్నాడు కాళీయుడు.

''ఇక నుంచి ఈ జలం పానార్హమవుతుంది. అమృతతుల్యమవుతుంది. ఈ నీటిని తాగి తరిస్తారంతా'' అన్నాడు కృష్ణుడు. వంగి దోసిటతో నీరు తీసుకుని ముందుగా తాను తాగాడు.

''ఉపవశించి, పితృతర్పణాదులు చేసుకునేందుకు ఈ నీరు పరమపవిత్రమవుతుంది'' అన్నాడు మళ్ళీ.

''గరుత్మంతుని భయం నన్ను వెన్నాడుతోంది. ప్రాణభయంతో ఉన్నాను. నువ్వే కాపాడాలి.'' వేడుకున్నాడు కాళీయుడు.

''గరుత్మంతుడు నిన్నేమీ చేయడు. నీ పడగల మీది నా పాదముద్రలు చూసి, నువ్వు నా వాడవని తెలుసుకుంటాడు. నీ జోలికి రాడు'' అన్నాడు కృష్ణుడు. అభయాన్ని ప్రసాదించాడు.

''శలవు'' అన్నాడు కాళీయుడు. భార్యబిడ్డలతో అక్కణ్ణుంచి తరలిపోయేందుకు సిద్ధ మయ్యాడు. కృష్ణుడు అది గమనించి, అతని పడగల మీద నుంచి ముందుకు, కాళిందిమడుగు ఒడ్డునకు ఒక్క దూకులో చేరుకున్నాడు. ఎగిరి వచ్చి నిలిచిన కృష్ణుణ్ణి యశోదానందులుసహా అంతా చుట్టుముట్టారు. అతన్ని స్పృశించి, ముద్దులతో ముంచెత్తారు. పొదువుకుని పొంగిపోయారు.

## కార్చిచ్చు

గ్రామాల్లో సంభవించినట్టుగానే అరణ్యాల్లో కూడా అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి. చిత్రంగా అడవులు వాటంతటవే అంటుకుంటాయి. దీనినే 'దావానలం' అంటారు. 'కార్చిచ్చు' అని కూడా అంటారు. కార్చిచ్చు నుంచి గోవులనూ గోపాలురనూ కృష్ణుడు రెండుసార్లు కాపాడాడు.

కాళీయమర్దనం ముగిసింది. రాత్రి అయింది. అయినా ఎవరూ ఇళ్ళకు వెళ్ళలేదు. అంతా యమునానదీతీరంలోనే సంచరించసాగారు. అక్కడి వనంలో ఆనందంగా గడపసాగారు. అర్ధరాత్రి దాటింది. నిద్రలో ఉన్నారంతా. కార్చిచ్చు ప్రజ్వరిల్లింది. వనాన్ని ఆక్రమించింది. చిటపటమని ఆకులు కాలుతున్న శబ్దాలు, ఫట్ ఫెడేళ్‌మంటూ కొమ్మలు పేలుతూ విరిగిపడుతున్న

శబ్దాలు వినవచ్చి, చల్లచల్లగా ఉన్న వనం అంతా వేడెక్కిపోవడంతో మేల్కొన్నారంతా. దూకుడుగా వస్తున్న కార్చిచ్చుని చూసి భయపడ్డారు. కృష్ణుని ముందు చేతులు జోడించి నమస్కరిస్తూ నిల్చున్నారు. అభయాన్ని ప్రసాదించాడు కృష్ణుడు. శరవేగంగా కదలివస్తున్న కార్చిచ్చుని చేతులు జాచి అందుకున్నాడు. నోటిలో పెట్టుకున్నాడు. వెన్నముద్దను మింగినట్టుగా మింగేశాడు.

ఇంకొకసారి బలరాముడు, గోపాలకులతోసహా కృష్ణుడు ఆలమందలను తీసుకుని, ముంజారణ్య సమీపానికి చేరుకున్నాడు. ఆలమందలు మేస్తున్నాయి. పిల్లలంతా ఆటపాటల్లో పడ్డారు. మేస్తూ మేస్తూ ఆలమందలు అటెటో పోయాయి. తోవతప్పాయి. పిలిస్తే రాలేదు. గోపాలకులు పరుగుదీశారు. ఆలమందలకోసం వెదికారు. ఎక్కడా కనిపించలేదు. కన్నీరుపెట్టుకున్నారు. కాపాడమంటూ కృష్ణుణ్ణి వేడుకున్నారు. కృష్ణుడు చెట్టెక్కి చూశాడు. దూరంగా ఆలమందలు కనిపించాయి. పేరు పేరునా గొంతెత్తి పిలిచాడు వాటిని. వేణుగానం చేసి రారమ్మన్నాడు. పశువులన్నీ పరుగుపరుగున రాసాగాయి. వస్తున్న పశువుల్ని చూసి ఆనందంగా ఎదురేగారు గోపాలురు. అంతా తిరిగి వస్తున్నారు. అంతలో కార్చిచ్చు చెలరేగింది. అడవి అంతటా అలముకుంది. ఆవులూ, గోపాలురూ మంటల్లో చిక్కుకున్నారు. ఏడుస్తూ కృష్ణుణ్ణి వేడుకున్నారు. అభయం ఇచ్చాడు కృష్ణుడు. అందరినీ కళ్ళు మూసుకోమని చెప్పాడు. మూసుకున్నారంతా. కార్చిచ్చును పండులా అందుకుని నోటిలో పెట్టుకున్నాడు కృష్ణుడు. మింగేశాడు. కళ్ళు తెరవండన్నాడు కృష్ణుడు. తెరిచారు. కార్చిచ్చు కృష్ణుని గొంతు దాటి గుండెల్లోకి దిగజారడాన్ని గమనించారు గోపాలురు. సాష్టాంగపడ్డారతనకి. అనేక విధాల కృష్ణుణ్ణి కీర్తించారు.

## ప్రలంబాసురుడు

బలరాముడు చంపిన రాక్షసులలో ప్రలంబాసురుడు ఒకడు. మాయలుపన్నడంలో వాడికి తిరుగులేదు. అందులో వాడు ఆరితేరిపోయాడు. బలరామకృష్ణులు గోపాలురతో కలసి ఎప్పటిలాగే అడవిలో ఆడుకుంటున్నారు. పరుగులు దీస్తున్నారు. పడిపోతున్నారు. గుంపు గుంపులుగా ఉన్నారంతా. అదే అవకాశంగా ప్రలంబాసురుడు గొల్లపిల్లవాని వేషం ధరించి వారిలో కలసిపోయాడు. నువ్వు ఎవరు? అని ఎవరూ అడగలేదు వాణ్ణి. అలాగే కొత్తముఖమే అని ఎవరూ కనిపెట్టలేకపోయారు. తమలో ఒకడనే అనుకున్నారంతా.

కృష్ణుడు సరికొత్త ఆట ఆడదాం అన్నాడు. సరేనన్నారంతా. గోపాలురంతా రెండు జట్లుగా విడిపోయారు. ఒకజట్టుకి కృష్ణుడు నాయకుడయితే ఇంకొక జట్టుకి బలరాముడు నాయకుడయ్యాడు. శ్రీరాముడు, వృషభుడు మొదలయినవారంతా బలరాముని పక్షాన ఉంటే, భద్రసేనుడు, సుదాముడు మొదలయినవారంతా కృష్ణునిపక్షంలో చేరారు. ప్రలంబుణ్ణి కూడా తనపక్షంలోనే చేర్చుకున్నాడు కృష్ణుడు. ప్రలంబుడు గోపాలుడు కాదని, రాక్షసుడని కృష్ణుడు గుర్తించాడు. అయినా గుర్తించనట్టుగా ప్రవర్తించసాగాడు. మోసాన్ని మోసంతోనే జయించాలనుకున్నాడు కృష్ణుడు. పథకాన్ని రూపొందించాడు. ఆటప్రారంభించాడు. ఓడిపోయినవారు, గెలిచినవారిని భుజాలమీద మోసుకునిపోవాలి. ఏ మేరకు మోసుకునిపోవాలో హద్దు కూడా చూపించాడు కృష్ణుడు. ఇరుజట్లూ ఆటలో పాల్గొన్నాయి. హోరాహోరీ పోరాడాయి. కృష్ణుని

జట్టు ఓడిపోయింది. కావాలనే జట్టును ఓడిపోయేలా చేశాడు కృష్ణుడు. అనుకున్న ప్రకారం ఓడిపోయిన జట్టు గెలిచిన జట్టును భుజాల మీదకు ఎక్కించుకుని మోసుకునిపోవాలి. బలరాముణ్ణి ప్రలంబాసురుడు మోయాల్సి వచ్చింది. సంతోషంగా అందుకు ఒప్పుకున్నాడు వాడు. బలరాముణ్ణి మోసుకుని పరుగుదీస్తూ హద్దుదాటి ముందుకు వెళ్ళాడు ప్రలంబాసురుడు. చాలా దూరం వచ్చాడు. బలరాముణ్ణి సంహరించాలన్నది వాడి ఆలోచన. బలరాముణ్ణి కిందకి దించి, అప్పుడు అసలు రూపంలో రాక్షసుడిగా ప్రత్యక్షమయ్యాడు. తాటిచెట్టంత ఎత్తులో ఉన్నాడు. పొడుగాటి కోరలు ఉన్నాయి వాడికి. కొండగుహలాంటి నోరు తెరచి పెద్దగా నవ్వాడు ప్రలంబాసురుడు. ఆ నవ్వుకి ముందు బలరాముడు కంగారుపడ్డా, అంతలోనే తేరుకున్నాడు. ఇంతలో బలరాముణ్ణి తీసుకుని ఆకాశానికి ఎగిసిపోదామనుకున్నాడు ప్రలంబాసురుడు. ఎత్తుకున్నాడతన్ని. భూమిని శిరసుపై మోసే ఆదిశేషుణ్ణి ఎవరు భరించగలరు? బలరాముడు చాలా భారం అనిపించాడు వాడికి. అతన్ని మోయలేకపోయాడు ప్రలంబాసురుడు. ఎంతగా ప్రయత్నించి చూసినా వాడి వల్లకాలేదు. బలరాముణ్ణి ఎత్తడంలో వాడిలో శక్తి క్షీణించిపోయింది. కింద కుప్పకూలిపోయాడు. ఎప్పుడయితే ప్రలంబాసురుడు కిందపడ్డాడో అప్పుడు బలరాముడు వాడి మీద కూర్చుని పిడికిలి బిగించి వాడి నెత్తిన ఒక్క మోదు మోదాడు. అంతే! ఆ దెబ్బకి ప్రలంబాసురుని తల ముక్కలయింది. నెత్తురు కక్కుకుంటూ ప్రాణాలు విడిచాడు వాడు.

బలరాముని వెదుకుతూ కృష్ణుడు సహా గోపాలురంతా పరుగున వచ్చారక్కడికి. రాక్షసుణ్ణి చంపి విజయోత్సాహంతో నిలిచిన బలరాముణ్ణి చూసి అభినందించారతన్ని. అనేక విధాల స్తుతించారు. అన్నీ తెలిసినా అన్న వీరత్వాన్నీ, బలశౌర్యాలనూ గుర్తించాలని బలరాముణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు కృష్ణుడు. ప్రశంసల వర్షం కురిపించాడు. తమ్ముడు తనని పొగుడుతూంటే బలరాముడి ఆనందానికి అంతులేకుండాపోయింది.

## గోపికా వస్త్రాపహరణం

కృష్ణుణ్ణి జారుడు, చోరుడు, గోపికాలోలుడు అంటారంతా. కృష్ణుని శృంగారచేష్టల గురించి కొల్లలుగా కథలు చెబుతారు. ఆ కథల్లో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, కృష్ణుడు జగన్మోహనాకారుడు అన్నది నిజం. ఆ అందాన్నే గోపికలంతా ఆరాధించారు. అందంతో పాటు కృష్ణుని వేణుగానం హృదయాల్ని పరవశింపజేస్తుంటే గోపికలు తట్టుకోగలరా? అందుకే వారంతా అతని వెంటపడ్డారు.

కృష్ణుణ్ణి కావాలనుకున్నారు. కావాలనుకున్న ప్రతి గోపికనూ చేరదీశాడతను. వారితో యమునాతీరంలో వెన్నెల్లో ఇసుకతిన్నెల్లో విహరించాడు. జలక్రీడలాడాడు. రాసక్రీడలాడాడు. క్షణకాలం కృష్ణుడు దూరమయితే కన్నీరు పెట్టుకునేవారు గోపికలు. ఆ వియోగాన్ని భరించలేకపోయేవారు. కృష్ణుడు లేడు, కృష్ణుడు తనకడకు రాడు అన్న భావన ఆత్మహత్యలకు పురిగొలిపేది గోపికల్ని. బృందావనంలో కృష్ణుడూ గోపికలూ జరిపిన రాసక్రీడల్ని వ్యాసమహర్షి మనోజ్ఞంగా వర్ణించాడు. గోపికాగీతలు, భ్రమరగీతలు పేరిట వారి శృంగారక్రీడల్ని అత్యద్భుతంగా చిత్రించాడాయన. ఈ చిత్రణలను అపార్థం చేసుకుని కృష్ణుణ్ణి 'జారుడు' అనడం

పొరబాటు. అపచారం కూడా. శ్రీకృష్ణలీలలు వర్ణించడంలో వ్యాసమహర్షి ఉద్దేశం వేరు. స్త్రీలలో భగవద్భక్తిని పాదుకొలిపేందుకే కృష్ణుడు అలా ప్రవర్తించాడని అంటాడాయన. భక్తునికీ భగవంతునికీ తేడా లేదు. ఇద్దరూ ఒకటే! వారికి స్త్రీ పురుష భేదం లేదు. భక్తుడు, భగవంతునిలో తాదాత్మ్యం చెందడమే ముక్తి. సర్వం భగవదర్పణ చేయడమే భక్తుని కోరిక అంటాడు వ్యాసమహర్షి. దీనిని చాలా మంది భక్తులు నిజం చేశారు. జయదేవుడు, లీలాశుకుడు కృష్ణుని లీలలు గొంతెత్తి పాడారు. మీరాబాయిలాంటి వారు కూడా ఇదే విధంగా భగవంతుని సేవించి తరించారు. నిప్పునకు చెదలు అంటవంటారు. అలాంటి నిప్పు, సర్వాంతర్యామి పరమాత్మకు పాపపుణ్యాది కర్మవాసనలు అంటవన్నది నిజం. భక్తుడు, భగవంతునితో తాదాత్మ్యం చెందినప్పుడు ఆత్మానందమేకాని, శారీరకవాంఛల ప్రసక్తే ఉండదక్కడ. కృష్ణుడు భగవంతుడు. గోపికలు భక్తురాళ్ళు. కృష్ణుని శృంగారక్రీడలన్నిటినీ ఈ దృష్టితోనే అర్థం చేసుకోవాలి. మరోరకంగా అర్థం చేసుకుంటే అపార్థాలే కాదు, అంతుచిక్కని వేదన కూడా కలుగుతుంది. ఆ వేదనలు పక్కన పెడితే కృష్ణుని శృంగారక్రీడకు గోపికావస్త్రాపహరణం పరాకాష్ఠగా చెబుతారు పెద్దలు.

గోపికలంతా కృష్ణుణ్ణి తమ పతిగా పొందాలని ఆశించారు. అతన్ని పతిగా పొంది తరించాలనుకున్నారు. తమ కోరిక నెరవేరేందుకు వారంతా వ్రతం చేపట్టారు. దాని పేరు కాత్యాయనీవ్రతం. మార్గశిరమాసం నెలరోజులూ ఆ వ్రతాన్ని శ్రద్ధగా ఆచరించాలి. వ్రతాన్ని ఆరంభించారు గోపికలు. వేకువనే లేచారు. కాళింది మడుగులో స్నానాలు చేశారు. ఇసుకతో కాత్యాయనీదేవి ప్రతిమను రూపొందించి ఒడ్డున ప్రతిష్ఠించారు. ఆ ప్రతిమను గంధపుష్పాక్షతలతో పూజించి, రకరకాల పళ్ళూ, పువ్వులూ నివేదించారు. అలా కొద్దిరోజులు గడిచింది. ఒకనాడు ఎప్పటిలాగానే గోపికలంతా వేకువనే లేచి, స్నానానికి కాళిందిమడుగునకు చేరుకున్నారు. చీరెలు విప్పి ఒడ్డున పెట్టుకున్నారు. మడుగులో దిగి జలకాలాడసాగారు. అప్పుడు వచ్చాడక్కడకి కృష్ణుడు. ఒంటరిగా రాలేదు, చెలికాళ్ళతో వచ్చాడు. గుంపుగా వచ్చాడు. ఒడ్డున ఉన్న గోపికల చీరలు చూశాడు. జలకాలాడుతున్న గోపికల్ని చూశాడు. కొంటెబుద్ధి పుట్టింది. చీరెలందుకున్నాడు. పరుగందుకున్నాడు. పరిగెత్తి, దగ్గరగా ఉన్న వేపచెట్టెక్కి కూర్చున్నాడు.

''ఇదేమిటి కృష్ణా! చీరెలెత్తుకొచ్చి చెట్టెక్కి కూర్చున్నావు. ఇది ఎవరయినా చూస్తే ఇంకేమయినా ఉందా? దెబ్బలు పడతాయి. కిందకి దిగు, వాళ్ళ చీరెలు వాళ్ళకి ఇచ్చేయ్'' అన్నారు స్నేహితులు.

''నేను ఇవ్వను'' అన్నాడు కృష్ణుడు. కృష్ణుడు మాటంటే మాటే! చీరెలివ్వడు. గోకులంలో పెద్దలు చూస్తే దెబ్బలు తప్పవు. ఎందుకొచ్చిన గొడవ అనుకున్నారు స్నేహితులు. మెల్లగా తప్పుకున్నారు అక్కణ్ణుంచి. ఇంతలో స్నానాలు పూర్తయ్యాయేమో! చీరెలు కోసం ఒడ్డుకేసి చూశారు గోపికలు. లేవక్కడ. ఆందోళన చెంది, అటూ ఇటూ చూశారు. చెట్టుమీద చీరెలు పట్టుకుని కూర్చున్న చిన్నికృష్ణుడు కనిపించాడు. నవ్వుకున్నారు.

''కృష్ణా'' పిలిచారు.

''చెప్పండి.''

''మా చీరెలు మాకియ్యవూ, మా బాబు కదూ'' అడిగారు.

''మీ చీరెలు మీకు ఇవ్వడానికి నాకేమిటి అభ్యంతరం, రండి, వచ్చి తీసుకోండి'' అన్నాడు కృష్ణుడు. వెళ్ళేందుకు ప్రయత్నిస్తూ గోపికలు లేవబోయారు. అంతలోనే కృష్ణుని బుద్ధి గమనించి, మళ్ళీ మెడలోతు నీళ్ళలో కూర్చున్నారు. ఇప్పుడెలా? అనుకుంటూ ఒకరినొకరు చూసుకున్నారు.



''నీ దగ్గరకు రాలేము కృష్ణా! మా చీరెలు మాకు విసిరేయ్. పట్టుకుంటాం'' అన్నారు గోపికలు.

''అబ్బా ఆశ. అదేం కుదరదు. మీ చీరెలు మీకు కావాలంటే మీరు నీళ్ళలోంచి లేచి, ఎంచక్కా నడుచుకుంటూ నా దగ్గరకు, ఈ చెట్టుదగ్గరకు రావాల్సిందే! వస్తే మీ చీరెలు మీకిచ్చేస్తాను, నాకెందుకు?'' అన్నాడు కృష్ణుడు.

ఏం చేద్దాం అంటే ఏం చేద్దాం అనుకున్నారు గోపికలు. చలి పుడుతున్నదే అంటే చలి పుడు తున్నది అనుకున్నారు. బ్రతిమలాడారు కృష్ణుణ్ణి. చీరెలు ఈయమని కన్నీరు పెట్టుకున్నారు. వినలేదు కృష్ణుడు.

''నీ దాసీలుగా ఉంటాం. నువ్వే పని చెబితే ఆ పని చేస్తాం. కరుణించు కృష్ణా, చీరెలు ఇవ్వు'' అడిగారు గోపికలు. ఇవ్వనన్నాడు కృష్ణుడు. చీరెలన్నీ చుట్టచుట్టి ఒళ్ళో పెట్టుకున్నాడు. కూడబలుక్కు న్నారు గోపికలు. ఒకరికొకరు ఏదో చెప్పుకున్నారు. అలా చెప్పుకున్న మీదట మర్మస్థానాన్ని చేతులతో కప్పుకుని, నీళ్ళలోంచి లేచి నిల్చున్నారు. ఒకరి తర్వాత ఒకరుగా వరుసగా నడచి వచ్చి వేపచెట్టును సమీపించారు.

''నువ్వు చెప్పినట్టుగానే వచ్చాం కదా, చీరలివ్వు'' అడిగారు. నవ్వుతూ చెట్టు దిగి వచ్చాడు కృష్ణుడు. చీరలిస్తాడనుకున్నారు. ఇవ్వడే, దూరంగా నిల్చుని చీరల్ని చూపించి తీసుకోండి అంటున్నాడు కృష్ణుడు. చేతులు జాచి అందుకుందామంటే అమ్మో! ఇంకేమయినా ఉందా? జాలిజాలిగా చూశారు గోపికలు. గమనించాడది కృష్ణుడు. ఇలా అన్నాడు.

''హవ్వ! స్త్రీలు దిసమొలతో స్నానం చేయకూడదు. పైగా మీరు కాత్యాయనీవ్రతం చేస్తున్నారు. వ్రతం చేస్తూ ఇలా దిసమొలతో స్నానం చేయడం ఎంత అపచారం. ఎంత పాపం.''

''నిజమా కృష్ణా! అయ్యయ్యో'' బాధపడ్డారు గోపికలు.

''చేసిన అపచారానికీ, చుట్టుకున్న పాపానికీ పరిహారం ఏమిటో తెలుసా?''

''ఏమిటి కృష్ణా?''

''మీరు రెండు చేతులూ ఎత్తి నాకు మొక్కండి. మీ పాపాలు పోతాయి, మీ చీరెలు మీకు దక్కుతాయి'' అన్నాడు కృష్ణుడు. కొంటెగా నవ్వాడు.

అమ్మయ్యో! అనుకున్నారు గోపికలు. కృష్ణుని దురాలోచన పసిగట్టారు. కుదరదు అన్నారు. అయితే చీరెలివ్వనన్నాడు కృష్ణుడు. గోపికలంతా మళ్ళీ ఆలోచనలోపడ్డారు. గుంపుగా చేరి గుసగుసగా మాట్లాడుకున్నారు. సరేనంటూ ఓ చేత్తో మర్మస్థానాన్ని కప్పుకుని, మరో చేతితో కృష్ణునికి నమస్కరించారు.

''ఛీఛీ! ఒంటిచేతి నమస్కారమా? ఇదెక్కడయినా ఉందా? ఒంటిచేత్తో నమస్కరిస్తే ఏ చేత్తో నమస్కరించారో ఆ చేతిని ఖండించమంటుంది ధర్మశాస్త్రం. ఒకతప్పు సరిదిద్దుకోవడం కోసం మరో తప్పు చేశారు మీరు. దిసమొలతో స్నానం చెయ్యడం ఒక తప్పు. ఒంటి చేత్తో నమస్కరించడం రెండో తప్పు. ఇప్పుడు ఈ రెండు తప్పులూ పోవాలంటే ఏం చెయ్యాలో తెలుసా?''

''ఏం చెయ్యాలి?''

''ఇంతకు ముందు చెప్పిందే, మీ రెండు చేతులూ ఎత్తి నాకు నమస్కరించాలి'' చెప్పాడు కృష్ణుడు.

''తప్పదా.''

''తప్పదు.''

గత్యంతరం లేదు. గోపికలు రెండు చేతులూ ఎత్తి నమస్కరించారు కృష్ణునికి. ఆ క్షణంలో వారికి లజ్జ, బిడియం, దేహాభిమానం ఇవేవీ లేకుండాపోయాయి. కృష్ణుణ్ణి దైవస్వరూపంగా భావించారు. సర్వాంతర్యామి శ్రీహరికీ తమకీ భేదం లేదనుకున్నారు. అన్నిటా అంతటా తామే! కృష్ణుడే! భగవత్ స్వరూపమే కనిపించింది వారికి. భక్తితాదాత్మ్యంతో తూలిపోయారు. తూలిపోతున్న గోపికల్ని చేరదీశాడు కృష్ణుడు. ఎవరి చీరెలు వారికిచ్చాడు. స్వాంతన కలిగించాడు.

స్వచ్ఛమయిన భక్తికి ఈ సంఘటన గొప్ప ఉదాహరణ. అన్ని రకాల అభిమానాలూ విడచిపెడితేనే పరిశుద్ధతా, పవిత్రతా లభిస్తుంది. అప్పుడే అసలుసిసలైన భక్తి ఏర్పడుతుంది. అలాంటి భక్తితో సర్వం అర్పించినప్పుడే భగవంతుణ్ణి చేరుకోగలం. గోపికలు ఈ రీతినే కృష్ణుణ్ణి ఆస్వాదించారు. అనుభవించారు. ఆనందించారు.

## గోవర్ధనగిరిధారి

యాదవులంతా ఇంద్రయాగం చేయాలనుకున్నారు. సంభారాలు సమకూర్చున్నారు. హడావుడి పడసాగారు. గమనించాడది కృష్ణుడు.

''ఎందుకిదంతా'' అడిగాడు.

''ఇంద్రుడు మేఘాలకు అధిపతి. ఆ దేవుడు సంతృప్తి చెందితే వర్షాలు బాగా పడతాయి. వర్షాలు బాగా పడితే కరువు కాటకాలు ఉండవు'' అన్నారు నందాదులు.

''అలాగా'' అన్నాడు కృష్ణుడు. నవ్వుకున్నాడు. ఇంద్రుడే వర్షం కురిపిస్తున్నట్టూ, అతని దయాదాక్షిణ్యాలతోనే బతుకుతున్నట్టుగా ఉన్న యాదవులందరికీ కళ్ళు తెరిపించాలనుకున్నాడు కృష్ణుడు. అలాగే ఇంద్రుడికి కూడా గర్వభంగం చేయాలనుకున్నాడు. జగద్రక్షకుడు తనకంటే వేరొకరు లేడనీ, ఉండడనీ లోకానికీ తెలియజెప్పేందుకు నడుము బిగించాడు. ఇంద్రయాగం చేయవద్దని చెప్పాడు కృష్ణుడు.

''యాగం చేయకపోతే ఇంద్రునికి కోపం రాదూ?'' అడిగారు.

''వస్తే రానీ, ఏం చేస్తాడు? వర్షాలకీ ఇంద్రుడికీ ఎలాంటి సంబంధమూ లేదు. సత్వరజస్తమో గుణాలే లోక కారకాలు. ఈ జగత్తు ఇలా ఆవిర్భవించిందంటే దానికి రజస్సే కారణం. మేఘాలు రజోగుణ కారణంగానే ఉద్భవిస్తాయి. వాటి స్వభావసిద్ధంగా వర్షిస్తాయి. ఇంద్రుడికి ఇందులో సంబంధం ఏముంది?'' అడిగాడు కృష్ణుడు.

''అవును ఏముంది? లేదు లేదు.'' అనుకున్నారు పెద్దలు.

''సర్వం కర్మవశం. ఆ కర్మ దైవాధీనం. ఎవరి కర్మానుసారంగా వారు సుఖదుఃఖాలు అనుభవిస్తారు'' అన్నాడు కృష్ణుడు. ఇంద్రయాగం అనవసరం అన్నాడు.

''మనకూ మన గోగణాలకూ, బృందావనాది ఈ అడవులకూ గోవర్ధనగిరి ప్రాణాధారం. సమస్త ఓషధులనూ అందజేస్తూ ప్రాణాధారంగా ఉన్న ఆ గోవర్ధనగిరిని పూజించండి. పుణ్యం పురుషార్థం లభిస్తాయి, అంతేగాని ఇంద్రుడికెందుకు యాగం?'' అడిగాడు కృష్ణుడు. సంభారాలన్నీ గోవర్ధనోత్సవానికి తరలించమన్నాడు. ఎంత వైభవంగా గోవర్ధనోత్సవం జరిపిస్తే అంత వైభవంగా శుభాశీస్సులు అందుకోవచ్చన్నాడు.

కృష్ణుడు చెబితే తిరుగేముంది? అలాగేనన్నారు యాదవులు. ఇంద్రయాగం మానుకున్నారు. వైభవంగా గోవర్ధనోత్సవాన్ని జరిపేందుకు పూనుకున్నారు. అంతా బళ్ళు కట్టుకుని, బయల్దేరారు. పాలు, పెరుగు, వెన్న, నెయ్యి కావిళ్ళకెత్తారు. ఉప్పు, పప్పు, బియ్యం, కూరలు బళ్ళకెత్తారు. వేదమంత్రాలు బ్రాహ్మణులు పఠిస్తోంటే, మంగళవాద్యాలు మోగుతోంటే గోవర్ధనపర్వతాన్ని సమీపించారంతా. హోమాలు చేశారు. పూజించారు. బ్రాహ్మణులకు భూరి దక్షిణలూ, దానాలూ ఇచ్చారు. గోపూజ చేశారు. తర్వాత గోవర్ధనగిరిని పూజించారు. బలులిచ్చారు. కృష్ణుడప్పుడు తన దేహాన్ని పెంచి, గోవర్ధనగిరి తానేనన్నట్టుగా ఆ బలులన్నింటినీ స్వీకరించాడు. గోవర్ధనగిరికి ప్రదక్షిణ చేశారు యాదవులు. నృత్యగానాలతో, క్రీడలతో ఆనందించారు. గోవర్ధనోత్సవం ముగిసింది.

తనకు యాగం తలపెట్టి, యాగం చెయ్యలేదు. పైగా గోవర్ధనగిరికి పూజలు చేశారు. కృష్ణుడు చెబితే తలలూపారంతా. సహించలేకపోయాడు ఇంద్రుడు. యాదవుల పొగరణ చాలనుకున్నాడు. జ్ఞానాన్ని కోల్పోయాడతను. కృష్ణుణ్ణి సామాన్య మానవునిగా తలచి, గోకులాన్ని సర్వనాశనం చేసేందుకు కోపంతో పిడికిలి బిగించాడు. అతని వద్ద సంవర్తక మేఘగణాలు ఉన్నాయి. జగత్తును అంతం చేసే మేఘాలవి. వాటిని ప్రళయేతర సమయాల్లో విజృంభించకుండా బంధిస్తారు. కట్లు విప్పితే వాటని పట్టశక్యం కాదు. జగత్తంతా అల్లకల్లోమయిపోతుంది. కావాల్సింది అదే అనుకున్నాడు ఇంద్రుడు. ఆ మేఘ గణాలను పిలిచాడు.

''మీరు వెళ్ళి గోకులంపై వర్షించండి. గోపాలురనూ, గోగణాలనూ సర్వనాశనం చేసేయండి. నేనీలోపు ఐరావతం అధిరోహించి వస్తాను'' అన్నాడు. సరేనన్నాయి సంవర్తక మేఘాలు. గోకులం మీద విరుచుకుని పడ్డాయి.

# గోవర్ధన గిరిధారి

ఆకాశం చీలిపోతున్నట్టుగా ఉరుములు, మెరుపులు ప్రారంభమయ్యాయి. ఒక్కసారిగా ఏనుగుతొండమంత ధారలతో వర్షం కురవసాగింది. పిడుగులు పడసాగాయి. వర్షంతో పాటు చిత్రంగా అంతంత రాళ్ళు కూడా పడనారంభించాయి. రాళ్ళవానంటూ భయపడ్డారు యాదవులు. ఆ వానకు తెరిపిలేకుండాపోయింది. ఆవులు గొంతులు పగిలేటట్టు అరవసాగాయి. దిక్కుతోచక అటు ఇటుగా పరుగుదీశాయి. ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నిల్చున్నారు. గోకులం అంతా కొట్టుకుపోతోంది. సముద్రాన్ని తలపిస్తూ ఎటు చూసినా నీరే! గోపాలకులు కృష్ణుణ్ణి సమీపించారు. చేతులెత్తి నమస్కరించారతనికి. ''కాపాడు కృష్ణా! నువ్వే దిక్కు'' అంటూ కన్నీరుపెట్టుకున్నారు. ఇంద్రుడికి చేయాల్సిన యాగం చెయ్యలేదు. దాంతో అతనికి కోపం వచ్చినట్టుంది. ఇలా కసి తీర్చుకుంటున్నాడు అని మొరపెట్టుకున్నారు. అప్పుడు కురుస్తున్న వర్షాన్నీ, ఆకాశాన్నీ కమ్మేస్తున్న మేఘాలనూ చూశాడు కృష్ణుడు. ముందు గోకులాన్ని రక్షించాలి. తర్వాత ఇంద్రుణ్ణి శిక్షించాలి అనుకున్నాడు. తల దించి ఎదురుగా చూశాడు. గోవర్ధనగిరి కనిపించింది. గబగబా ఆ గిరి దగ్గరగా నాలుగు అడుగులు వేశాడు. గిరి అడుగున చేయి ఉంచి, ఒంటి చేత్తో పైకెత్తాడు దాన్ని. చిటికెనవేలు మీద నిలబెట్టాడు. చూసి ఆశ్చర్యపోయింది గోకులం.

''అంతా ఈ కొండ కిందకు రండి. భయపడకండి. ఆలమందలను కూడా తోడుకుని రండి.'' అన్నాడు కృష్ణుడు. అనుమానంగా చూసిన గోపాలురతో మళ్ళీ ఇలా అన్నాడు.

''ఈ కొండ చాలా బరువనీ, నేను బాలుణ్ణనీ, మోయలేననీ అనుమానపడకండి. రండి మీకేం కాదు.''

కృష్ణుడు నొక్కి చెప్పడంతో యాదవులకు నమ్మకం కలిగింది. గోగణాలుసహా అంతా కొండ క్రిందకు చేరారు. గోవర్ధనగిరి గొడుగయింది. ఎవరికీ ఏ హానీ లేకుండాపోయింది. రాళ్ళూ, వానా కొండమీది నుంచి జారిపడుతూ ముందుకు కొట్టుకుపోసాగాయి. ముల్లోకాలవారూ ఆ చిత్రాన్ని ముచ్చటగా చూశారు. ఇంద్రుడు వారం రోజులపాటు రాళ్ళవాన కురిపించాడు. ఆ వారం రోజులూ కృష్ణుడు గోవర్ధనగిరిని అలా చిటికెనవేలు మీదే నిలిపి ఉంచాడు. వేలు వంగలేదు.



కనీసం వణకలేదు. కృష్ణుడు కూడా అంతే! అంత పెద్దపర్వతాన్ని మోస్తూ అతను కూడా ఆయాసపడలేదు. అలసట చెందలేదు. అనుకున్నదొకటి. అయినదొకటి. ఇంద్రుడుకి ఏదీ అంతుచిక్కలేదు. తానెంత భయపెట్టినా, బాధపెట్టినా యాదవులకేం కాలేదు. కృష్ణుడు ఆదుకున్నాడు వారిని. ఏం చెయ్యాలిప్పుడు? ఆలోచనలోపడ్డాడు ఇంద్రుడు. ఆలోచించి ఆలోచించి భయపడ్డాడు. కృష్ణుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడని గుర్తించాడు. అతని గర్వం అణగింది. మేఘాలను వెనక్కి రమ్మన్నాడు. యథాస్థానానికి చేరుకున్నాయి మేఘాలు. మూటగట్టినట్టుగా ముద్దగా ఒకచోట కూర్చున్నాయి. వాన వెలిసింది. రాళ్ళుపడడం కూడా ఆగిపోయింది. తూర్పున సూర్యుడు ఉదయించాడు. తెరిపినపడ్డారు యాదవులు.

''ఇక మీరంతా బయటకు వెళ్ళవచ్చు. ఏంకాదు'' అన్నాడు కృష్ణుడు. యాదవులంతా కొండను విడచి బయటకు వచ్చారు. బాధలేదనుకున్నారు. ఊపిరిపీల్చుకున్నారు. ఆలమందలు కూడా బయటకు నడిచాయి. ఆనందంగా అంబారవాలు చేశాయి. కృష్ణుడు అప్పుడు గోవర్ధనగిరిని క్రిందకి దించాడు. యథాస్థానంలో దానిని ఉంచాడు. ఏడేళ్ళ బాలుడేంటి, గోవర్ధనగిరిని ఎత్తడమేమిటి? చిటికెనవేలుపై నిలపడమేమిటంటూ యాదవులంతా కృష్ణుణ్ణి చూసి ఎంతగానో ఆశ్చర్యపోయారు. ఒకటా రెండా ఏకంగా ఏడురోజులపాటు కొండనెత్తి నిల్చున్నాడు కృష్ణుడు, గొప్పవాడనుకున్నారు. అతన్ని వేయివిధాల పొగిడారు. గోగణాలుసహా క్షేమంగా వ్రేపల్లెకు చేరుకున్నారు. యాదవులు అటు నిష్క్రమించగానే ఇటు దేవతలు కృష్ణునిపై పుష్పవర్షం కురిపించారు. ఐరావతాన్ని అధిరోహించి ఇంద్రుడు వచ్చాడక్కడకి. కామధేనువుని వెంట తీసుకుని మరీ వచ్చాడు. వాహనం దిగి, కృష్ణుణ్ణి సమీపించాడు. కిరీటం తీసి, కృష్ణుని పాదాల ముందు ఉంచాడు. సాష్టాంగపడ్డాడు. మన్నించమని వేడుకున్నాడతణ్ణి.

''జగద్రక్షకా! నీవెవరివో తెలిసింది. నువ్వు ఈశ్వరుడవు. బ్రహ్మవు. దుష్టశిక్షణార్థం భువిలో వెలసిన శ్రీమన్నారాయణుడవు. నా అపరాధాన్ని మన్నించు. నన్ను కరుణించి కాపాడు'' అన్నాడు ఇంద్రుడు. అనేక విధాల కృష్ణుణ్ణి ప్రార్థించాడు. ఐరావతం తొండంలో నింపి తెచ్చిన ఆకాశగంగతో కృష్ణుణ్ణి అభిషేకించాడు. కామధేనువు క్షీరంతో కూడా అభిషేకించాడతన్ని. అప్పుడక్కడకి బ్రహ్మ, శివుడు, నారదాది మహామునులు విచ్చేశారు. వేదమంత్రాలతో కృష్ణుణ్ణి స్తుతించారంతా. సంతోషించాడు కృష్ణుడు. ఇంద్రుణ్ణి క్షమించాడు. ఇక మీదట ఇటువంటి కోపతాపాలకు లోనుకావద్దని ఆజ్ఞాపించాడు. జ్ఞానంతో మెలగమని హెచ్చరించాడు. కృష్ణుని అభయం తీసుకుని, ఇంద్రాదులంతా వెళ్ళిపోయారక్కణ్ణుంచి.

ఈ సంఘటన అనంతరం నదులు అనేకరసాలతో ప్రవహించాయి. కొమ్మ కొమ్మనా చెట్లకు తేనెపట్టింది. దున్నకుండానే భూమి సమస్త ఓషధులనూ అందించింది. దివ్యమణులతో కొండలు అలరారాయి. గోవులు సమృద్ధిగా పాలనిచ్చాయి. ప్రజలంతా శాంతంగా సౌఖ్యంగా జీవించసాగారు.

## నందుడు:నందనందనుడు

కృష్ణుడు చేసిన అద్భుతకార్యాలలో నందుని ప్రాణరక్షణను ప్రముఖంగా చెబుతారు. రెండు సందర్భాలలో నందుణ్ణి కాపాడాడు కృష్ణుడు.

ఏకాదశి. నందుడు ఉపవాసం ఉన్నాడు. మర్నాడు ద్వాదశి. ఆ తిథి కొద్ది గడియలు మాత్రమే ఉన్నది. ఆ గడియల్లోనే భోంచెయ్యాలి. అందుకని తొందరగా నిద్రలేచాడు నందుడు. చీకటివేళ యమునానదికి చేరుకున్నాడు. స్నానానికి నదిలో దిగాడో లేదో ఎవరో పట్టి లాక్కుపోతున్నట్టుగా నీళ్ళలో మునిగిపోయాడు. వరుణుడి భటుడు అతన్ని అలా పట్టుకుని పోసాగాడు.

స్నానానికని నదికి వెళ్ళిన నందుడు ఎంతకీ తిరిగి రాకపోయేసరికి గోపికలంతా ఆందోళన చెందారు. కన్నీరు పెట్టుకున్నారు. కృష్ణుణ్ణి సమీపించారంతా.

''నందనందనా! నీ తండ్రి ఏమయినాడో నువ్వే కనిపెట్టాలి. నువ్వే అతన్ని కాపాడాలి'' అన్నారు.

కృష్ణుడప్పుడు దృష్టి సారించాడు. జరిగింది అంతా తెలుసుకున్నాడు.

''ఆందోళన చెందకండి, నా తండ్రి క్షేమంగానే ఉన్నాడు'' అన్నాడు. ఉన్నపళంగా వరుణ లోకానికి ప్రయాణమయ్యాడు. పశ్చిమ దిక్కునకు అధిపతి వరుణుడు. తన దిక్కుగా వస్తున్న శ్రీకృష్ణుణ్ణి చూశాడతను. భగవంతుని రాకకు పొంగిపోయాడు. కృష్ణునికి సకల మర్యాదలూ చేసి, పూజించాడతన్ని. తర్వాత అతని రాకకు కారణం తెలుసుకున్నాడు.

నందుణ్ణి బంధించి తెచ్చిన భటుణ్ణి కేకేసి అదలించాడు. ఎందుకు చేశావు ఈ పని అంటూ హెచ్చరించాడతన్ని. తెలియక చేశాడంటూ భటుని తరపున కృష్ణుణ్ణి క్షమార్పణలు కోరాడు వరుణుడు. నందుణ్ణి అప్పగించాడు. తండ్రిని వెంటబెట్టుకుని వ్రేపల్లెకు చేరుకున్నాడు కృష్ణుడు. ఎక్కడకి వెళ్ళావు? ఏమయిపోయావు? అని అడిగిన గోకులానికి జరిగిందంతా చెప్పాడు నందుడు. కృష్ణుడే లేకుంటే తిరిగి వచ్చే అవకాశమే లేదన్నాడు. గోకులం అంతా కృష్ణుణ్ణి గొప్పగా చూసింది. భగవంతుడంటూ అతన్ని పొగిడింది. భక్తితో పూజించింది.

ఒకనాడు నందుడు మొదలయిన యాదవ ప్రముఖులు కొందరు అంబను పూజించేందుకు అంబికావనానికి ప్రయాణమయ్యారు. ఆ వనం సరస్వతీ నదీతీరాన ఉన్నది. వ్రేపల్లెకు చాలా దూరం. అందుకని రథాలలో ప్రయాణించారక్కడకి. బలరామకృష్ణులు కూడా ఉన్నారు వారితో. అంతా వేళపట్టున అక్కడకి చేరుకుని, సరస్వతీనదిలో స్నానాలు చేశారు. పార్వతీపరమేశ్వరులను పూజించారు. బ్రాహ్మణులకు అనేక దానాలు చేశారు. వారిని సంతుష్టిపరచారు. జలపానం మాత్రమే చేస్తూ ఉపవసించారంతా. రాత్రి అయింది. అక్కడే పడుకున్నారు. అడవిప్రదేశం. పురుగూపుట్రా యధేచ్ఛగా తిరుగుతున్నాయి. పెద్దసర్పం ఒకటి నందుణ్ణి పట్టుకుంది. అతన్ని కరచి కబళించేందుకు ప్రయత్నించసాగింది. ప్రాణభయంతో నందుడు కేకలేశాడు. బలరామ కృష్ణులు సహా అంతా మేల్కొని చూశారు. నందుణ్ణి చుట్టుకుని పెనుపాము కనిపించింది వారికి. కాగడాలతో దాన్ని మోదారు. నిప్పువేడికీ, గట్టిగా కొట్టిన దెబ్బలకీ నందుణ్ణి పాము వదులుతుందనుకున్నారు. కాని, వదల్లేదది. మరింతగా నందుణ్ణి బిగించి పట్టుకుంది. నవ్వుతూ నిల్చున్న కృష్ణుణ్ణి చూశారంతా. కాపాడమంటూ వేడుకున్నారు.

''మీరు వేడుకోవాలా? నా తండ్రిని నేను కాపాడుకోను? ఎందుకు వేచి చూస్తున్నానంటే ఆ పాము బలమెంతో అంచనా వేస్తున్నాను'' అన్నాడు కృష్ణుడు. ఒక్కంగలో వెళ్ళి, కాలు ఎత్తి పాము మీద బలంగా ఉంచాడు. తొక్కి మర్దించాడు దాన్ని. కృష్ణుడు అలా మర్దిస్తుండగానే పాము అదృశ్యమయింది. దాని స్థానంలో ఓ గంధర్వుడు ప్రత్యక్షమయ్యాడు. దివ్య ఆభరణాలతో, వస్త్రాలతో వెలిగిపోతూ కనిపించాడతను. కృష్ణునికి సాష్టాంగ నమస్కారం చేశాడు. కృష్ణుని పాదస్పర్శతో తనకు శాపవిమోచనం జరిగిందంటూ అనేక విధాల శ్రీకృష్ణుణ్ణి స్తుతించి అక్కణ్ణుంచి తరలిపోయాడతను.

పాముగా మారిన గంధర్వుని కథ ఏమిటంటే...ఆ గంధర్వుని పేరు సుదర్శనుడు. విమానంలో విహరిస్తుండగా అతను ఒకసారి అంగిరసమునుల్ని చూడడం జరిగింది. వారంతా విరూపులుగా ఉన్నారు. వికృతంగా ఉన్నారు. అలా ఉన్నవారిని చూసి సుదర్శనుడు ఎగతాళి చేశాడు. గంధర్వుని ఎగతాళికి మునులకు కోపం వచ్చింది.

''సుందరాంగుణ్ణని మమ్మల్ని ఎగతాళి చేశావు కదూ, దీనికి ఇదే మా శాపం. నువ్వు పాముపయిపోవుగాక'' అన్నారు. సుదర్శనుడికి అప్పుడు జ్ఞానోదయం కలిగింది. తను చేసింది తప్పు అని తెలుసుకున్నాడు. చేతులు జోడించి మునులకు నమస్కరించాడు. శాపవిమోచనం ప్రసాదించమన్నాడు. కరుణించారు మునులు. త్వరలో యాదవకులంలో శ్రీహరి జన్మిస్తాడనీ, ఆ శ్రీహరి పాదస్పర్శవల్ల శాపవిమోచనం జరిగి, నిజరూపం ప్రాప్తిస్తుందన్నారు. అంగిరసమునుల శాపఫలితంగానే సుదర్శనుడు పాము అయ్యాడు. అడవులలో సంచరిస్తూ శ్రీహరి పాద స్పర్శకోసం తపించిపోయాడు. ఇన్నాళ్ళకు ఆ భాగ్యం దొరికింది. సుదర్శనుడు నిజరూపం పొంది వెళ్ళిపోయాడు. పాముకి చిక్కి నందుడు బతకడం, పాము గంధర్వునిగా మారడం, అతను కృష్ణుణ్ణి స్తుతించడం యాదవులు చూసి, తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు. తర్వాత తేరుకుని, కృష్ణుణ్ణి వేవిధాల వారూ ప్రస్తుతించారు. అనుమానం లేదు, కృష్ణుడు భగవంతుడని నిర్ధారణకు వచ్చారు.

**శంఖచూడుడు**

శరత్కాలం. వెన్నెల వెల్లివిరుస్తున్నది. చల్లగా ఉంది వాతావరణం. యమునానదీతీరాన గోపికలతో విహరిస్తున్నారు బలరామకృష్ణులు. శంఖచూడుడు అది చూశాడు. అందమయిన గోపస్త్రీల పొందు ఆశించాడతను. యక్షుణ్ణి, కుబేరుని అనుచరుణ్ణి, తనకు తిరుగేమున్నది అనుకున్నాడు శంఖచూడుడు. మాయచేసి గోపస్త్రీలను ఎత్తుకుపోసాగాడు. ఆకాశంలో విలవిల్లాడుతూ గోపికలంతా 'కృష్ణా! కృష్ణా! కాపాడు' అంటూ కేకలేయసాగారు. వారి ఆర్తనాదాలు విన్నాడు కృష్ణుడు. బలరాముడు సహా దాడికి సిద్ధమయ్యాడు. అన్నదమ్ములిద్దరూ పెద్దపెద్దచెట్లను పెరకి, ఆయుధాలుగా పట్టుకున్నారు. ఉత్తరదిశగా పోతున్న శంఖచూడుడుని వెంటపడ్డారు. పెద్దపెద్ద చెట్లతో పరుగున వస్తున్న బలరామకృష్ణులను చూసి భయపడ్డాడు శంఖచూడుడు. గోపికలను విడిచిపెట్టాడు. ప్రాణభయంతో పరుగందుకున్నాడు. గోపికలకు బలరాముణ్ణి కావలిగా ఉంచి, శంఖచూడుని వెంటపడ్డాడు కృష్ణుడు. పట్టుకున్నాడతన్ని. చేతిలో ఉన్న చెట్టుతో తల మీద బలంగా మోది, వాడిప్రాణం తీశాడు కృష్ణుడు. పగిలిన శంఖచూడుని తలలో దివ్యరత్నం కనిపించింది. కృష్ణుడు ఆ శిరోరత్నాన్ని అందుకున్నాడు. తెచ్చి దానిని బలరామునికి కానుకగా ఇచ్చాడు. కృష్ణుని ప్రతాపాన్ని బలరాముడూ, గోపికలూ ఒక్కగొంతుతో పొగిడారు. పొగిడి పొగిడి కౌగిటపొదువుకున్నారతన్ని.

# రాక్షసుల అంతు చూసిన రణధీరుడు


గోకులాన్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు కంసుడు. బలరామకృష్ణుల సాహసగాథలను వేగుల ద్వారా వింటూనే ఉన్నాడతను. వారి అద్భుతకృత్యాలు, మహిమల గురించి ఆరాలు తీస్తూ, తనకు ప్రాణాపాయం ఉన్నదని తెలుసుకున్నాడు. బలరామకృష్ణులను మట్టుపెట్టేందుకు రకరకాల ప్రయత్నాలు చేయసాగాడు. అనుచరులయిన రాక్షసులను బలరామకృష్ణులను పరిమార్చి రమ్మని పంపసాగాడు. అయితే వెళ్ళిన రాక్షసులు వెళ్ళినట్టే హతమయి తిరిగిరాకపోవడంతోనూ, బలరామకృష్ణులు క్షేమంగా ఉన్నారని తెలియడంతోనూ కంసుని ఆందోళనకు అంతులేకుండా

పోయింది. మరింతగా జాగ్రతపడసాగాడతను. ఆ జాగ్రతలో భాగంగా వృషభాసుర, కేశి, వ్యోమాసురులను బలరామకృష్ణుల మీదకు పంపాడు. ఎలాగయినా వారిద్దరినీ సంహరించి తీరాలన్నాడు. ముందుగా అరిష్టుణ్ణి పంపించాడు కంసుడు. వృషభరూపం ధరించి గోకులానికి చేరుకున్నాడు అరిష్టుడు.

ఎద్దురూపంలో పెద్దకొండలా నడచి వస్తున్న అరిష్టుణ్ణి చూశారు గోపకులు. ఆశ్చర్యపోయారు. గోపికలు చూశారు. భయపడ్డారు. గోవులు చూశాయి. బెదరి నలుదిశలా పరుగులుదీశాయి. వృషభాసురుడు రంకె వేశాడు. మేఘం గర్జించినట్టుగా ఉందది. గిట్టలతో బలంగా భూమిని తాకాడు. ఆ తాకిడికి భూమి అదరిపోయింది. కొండకొమ్ముల్లాంటి శృంగాలతో నేలను పెళ్ళగించసాగాడు. యాదవులూ, పశుగణాలూ భీతిల్లాయి. పరుగు పరుగున శ్రీకృష్ణుని సమీపించారంతా. చూసింది చెప్పారు. శరణుకోరారు. అభయం ఇచ్చాడు కృష్ణుడు.

''ఎక్కడ ఉన్నది ఆ వృషభం?'' అడిగాడు. తీసుకుని వెళ్ళి చూపించారు కృష్ణునికి. వృషభాన్ని చూస్తూనే రాక్షసుడని గమనించాడు కృష్ణుడు. ధైర్యంగా వాడి ముందు నిలిచాడు. కృష్ణుణ్ణి కొమ్ములతో కుమ్మబోయాడు వృషభాసురుడు. అదను చూసి కొమ్ములను అందుకున్నాడు కృష్ణుడు. గట్టిగా నిలిపి, వెనక్కి నెట్టేశాడు. పద్దెనిమిది అడుగుల దూరం వెనక్కి పోయి, తూలిపడ్డాడు వృషభాసురుడు. అంతలోనే లేచి నిల్చున్నాడు. పరుగున వచ్చాడు. కృష్ణుణ్ణి ఎదుర్కొన్నాడు. వృషభాసుర కృష్ణుల యుద్ధం ముల్లోకాలనూ ఆశ్చర్యపరచింది. ఇద్దరూఇద్దరే అన్నట్టుగా పోట్లాడారు. మళ్ళీ వృషభాసురుని కొమ్ములు అందుకున్నాడు కృష్ణుడు. వాటిని ముందుకు వంచాడు. వెనుక భాగాన లేచి నిల్చున్నాడు వృషభాసురుడు. లేచి నిల్చిన వృషభాసురుణ్ణి లేచినట్టుగా నిలిపి, గిరగిరా తిప్పాడు కృష్ణుడు. బలంగా భూమి మీదకు విసిరేశాడు. కిందపడిన వృషభాసురుడు లేవకుండా వాడి మీద పడి, చేతుల్తోనూ, కాళ్ళతోనూ మర్దించాడు. కృష్ణుని మర్దనకి నోటి నుంచి రక్తాన్ని కక్కుతూ, గిలగిలా తన్నుకుంటూ ప్రాణాలు విడిచాడు వృషభాసురుడు. ఎప్పుడయితే వృషభాసురుడు మరణించాడో అప్పుడు కృష్ణుని సమీపించి వ్రేపల్లె వాసులంతా అభినందించారతన్ని. అనేక విధాల కీర్తించారు.

వృషభాసురుడు మరణించాడని తెలిసి, కంసుడు కంగారుపడ్డాడు. మరో రాక్షసుణ్ణి పిలిచాడప్పుడు. వాడి పేరు కేశి. కృష్ణుని అంతుచూడమని ఆ రాక్షసునికి ఆజ్ఞాపించాడు. కంసుని ఆజ్ఞప్రకారం కేశి భయంకరమయిన గుర్రం రూపం ధరించాడు. గోకులంలో ప్రవేశించాడు. సకిలించాడు. ఆ సకిలింపుకి సమస్తలోకాలూ భీతిల్లాయి. వ్రేపల్లెవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. వద్దు వద్దన్నా వినకుండా కేశిని సమీపించాడు కృష్ణుడు. గుర్రం రూపంలో ఉన్న రాక్షసుణ్ణి కవ్వించాడు. యుద్ధానికి రమ్మన్నాడు. కోరుకున్నదదే! కృష్ణునితో యుద్ధమే కావాలి వాడికి. కొండగుహలాంటి నోరు తెరిచి కృష్ణుని మీదకి దాడి చేశాడు కేశి. ఆకాశంలోకి ఎగిరి, ముందరి కాళ్ళెత్తి కృష్ణుని గుండెల మీద తన్నాడు. తూలిపడబోయాడు కృష్ణుడు. నిలదొక్కు కున్నాడు. గుండెల మీద నిలిచిన గుర్రం ముందరి కాళ్ళను గట్టిగా పట్టుకున్నాడు. పైకెత్తాడు. ఎత్తి అటుగా విసిరివేశాడు. చక్రంలా గిరగిరా తిరుగుతూ వెళ్ళి అల్లంతదూరంలో పడ్డాడు కేశి. మూర్ఛపోయాడు. లేవడనుకున్నారు, కాని లేచాడు కేశి. తెప్పరిల్లాడు. మరింతగా కోపించి,



ఉరుకుతూ వచ్చి కృష్ణుణ్ణి ఎదిరించాడు మళ్ళీ. పెద్దగా నోరుచాచి కృష్ణుణ్ణి మింగేయాలనుకున్నాడు. అదే అదనుగా కృష్ణుడు వాడి నోటిలోకి తన ఎడమచేతిని జొనిపాడు. నిప్పుల్లోంచి తీసిన ఇనుపదూలాన్ని జొనిపినట్టుగా కృష్ణుడు చేయి ఎప్పుడయితే కేశి నోటిలోకి వెళ్ళిందో అప్పుడు వాడి నోటిపళ్ళన్నీ రాళ్ళలా రాలిపోయాయి. వాడి కడుపులోనికి చొచ్చుకుంది కృష్ణుని వామహస్తం. చొచ్చుకుని క్షణక్షణానికీ పెద్దది కాసాగింది. కృష్ణుని చేయి కేశి కడుపునిండా, నోటినిండా నిండి పోయింది. ఊపిరి ఆడలేదు వాడికి. గిజగిజా తన్నుకున్నాడు. గ్రుడ్లు గిరగిరా తిప్పుతూ పెద్దగా అరచి ప్రాణాలు వదిలాడు కేశి. కొండలా నేల మీద పడ్డాడు. అప్పుడు చేతిని వెనక్కి గుంజాడు కృష్ణుడు. ఆ వేగానికి కేశి నోరు దోసపండులా చీలిపోయింది. ఆ దృశ్యాన్ని కళ్ళారా చూసిన వ్రేపల్లెవాసులే కాదు, దేవతలు కూడా ఆశ్చర్యపోయారు. కృష్ణునిపై పుష్పవర్షం కురిపించారు. కేశిని సంహరించిన కారణంగానే కృష్ణుడికి 'కేశవుడు' అని పేరొచ్చింది.

ఆలమందలు, గోపాలకులుసహా ఒకనాడు కృష్ణుడు అడవికి వెళ్ళాడు. కొండనెత్తంలో ఆలమందల్ని వదలి గోపాలకులతో దాగుడుమూతలాడసాగాడు. అది గమనించాడు వ్యోమాసురుడు. ఇదే సరయిన సమయం అనుకున్నాడతను. వ్యోమాసురుడు మయుని కొడుకు. గొప్ప మాయావి. గోపబాలకుని రూపం ధరించాడు. గోపాలకుల్లో కలసిపోయాడు. ఆటలాడ సాగాడు. దాగుడుమూతలాడుతూ గోపాలకుల్ని ఎత్తుకుపోయి ఓ కొండగుహలో దాచసాగాడు. పిల్లలు బయటకి రాకుండా, వారి ఆర్తనాదాలు వినరాకుండా గుహకు అడ్డంగా బండరాయిని పెట్టాడు. ఆటకీ ఆటకీ గోపాలకులు తగ్గిపోతుండడంతో కృష్ణునికి అనుమానం వచ్చింది. పరిశీలించసాగాడు. గోపబాలకుని రూపంలో ఉన్న వ్యోమాసురుణ్ణి కనిపెట్టాడు. పట్టుకున్నాడు వాణ్ణి. కృష్ణుడు పట్టుకున్నంతనే తన దేహాన్ని పెంచి, పెద్దగా నవ్వుతూ భయభ్రాంతుల్ని చేశాడు వ్యోమాసురుడు. కృష్ణుణ్ణి అందుకున్నాడు. అతన్ని మింగేసేటందుకు నోటి దగ్గరగా తీసుకున్నాడు. నోటి దగ్గరకు రాగానే కృష్ణుడు ఎగిరి, వాడి గొంతు పట్టుకున్నాడు. వాడి మెడలు వంచాడు. కిందకి పడదోశాడు. మహావృక్షంలా కిందపడిన వ్యోమాసురుణ్ణి పిడికిటి పోటులతో మర్దించి సంహరించాడు కృష్ణుడు. పిల్లల ఆచూకీ తెలుసుకుని, కొండగుహదగ్గరకి చేరుకున్నాడు. అక్కడ బండరాయిని తొలగించి, వారిని ఆదుకున్నాడు. పిల్లలంతా కృష్ణుణ్ణి కౌగిలించుకుని కన్నీరుపెట్టుకుంటుంటే దేవతలు ఆ దృశ్యానికి ఆనందించి కుసుమ వర్షం కురిపించారు.

ఇలా కంసుని అనుచరగణాన్ని వరుసగా హతమారుస్తూ వచ్చాడు కృష్ణుడు. రాక్షసుల్ని హతమార్చి ఇటు యాదవులనూ, అటూ దేవతలనూ రక్షించాడు. భూదేవికి శాంతిని ప్రసాదించాడు.

## మేనమామ కుట్ర

బలరామకృష్ణులు మానవాతీతులని ఇటు వ్రేపల్లెలోనే కాదు, అటు అన్ని రాజ్యాల్లోనూ తెలియవచ్చింది. వారి మహిమల గురించి ప్రజలు కథలు కథలుగా చెప్పుకోసాగారు. ఆ కథలు విన్న మేనమామ కంసునికి నిద్ర కరువయింది. గొప్పగొప్ప రాక్షసుల్నే సంహరించిన బలరామ కృష్ణులు, తనను అవలీలగా సంహరించగలరని తెలుసుకున్నాడు. ఆ భయంతో అన్నపానాలకు దూరమయ్యాడు. ఏదీ రుచించడం లేదతనికి. లేచింది మొదలు భయం భయంగా బ్రతుకుతున్న కంసుణ్ణి, అదే పనిగా వచ్చి పలకరించాడు నారదుడు. ముల్లోకాల్లోని ముచ్చట్లు చెబుతూ మాటలో మాటగా కొన్ని రహస్యాలను కూడా అతని చెవిన వేశాడు.

కృష్ణుడే దేవకి అష్టమగర్భం అన్నాడు. యశోదకు కూతురు పుట్టిందనీ, ఆ కూతుర్ని ఇక్కడకు తెచ్చి, ఇక్కడి దేవకికి పుట్టిన కృష్ణుణ్ణి అక్కడ ఉంచారని చెప్పాడు. అలాగే బలరాముడు కూడా దేవకీ గర్భస్థుడనీ, తర్వాతే రోహిణీ సుతుడయినాడనీ చెప్పాడు. బలరామకృష్ణులు తన బిడ్డలని తెలిస్తే ప్రమాదం అని, అది తెలియకుండా ఉండేందుకే వారిని మిత్రుడు నందుని ఇంట వసుదేవుడు ఉంచాడని జరిగిందంతా పూసగుచ్చినట్టుగా చెప్పాడు. బలరామకృష్ణులే పూతన, ప్రలంబాది రాక్షసుల్ని సంహరించారని చెబుతూ, ఎప్పటికయినా నీ మేనల్లుళ్ళ కారణంగానే నీకు ప్రాణాపాయం అని చావుకబురు చల్లగా ఊదాడు. ఒకొక్క నిజమూ తెలియవస్తుంటే నీరుగారిపోయాడు కంసుడు. కళ్ళు మూసుకుని ఆలోచించసాగాడు. కంసుడు అలా కళ్ళు మూసుకుని ఆలోచిస్తుంటే నారదుడు సన్నగా నవ్వుతూ చూశాడతన్ని.

రహస్యాలన్నీ కంసునికి నారదుడు చెప్పడానికి ఒక కారణం ఉంది. త్రికాలజ్ఞుడు నారదునికి తెలియంది ఏమీ లేదు. ముందు జరగనున్నదంతా అతనికి తెలుసు. రహస్యాలన్నీ తెలియడం వల్ల బలరామకృష్ణులపై మరింత ద్వేషాన్ని పెంచుకుంటాడు కంసుడు. వారిని చంపడానికి తొందరపడతాడు. కంసుడు ఎంత తొందరపడితే అంత మంచిది. తొందరగా హతుడవుతాడతను. ప్రజలకు కంసుని బాధ తప్పుతుంది. పాపం పండాలి. కంసుడు మరిన్ని పాపాలు చెయ్యాలి. చేస్తేనే వినాశకాలే విపరీతబుద్ధిః అని చావుకి దగ్గరవుతాడు. దుష్టశిక్షణ జరుగుతుంది. నారదునికి కావాల్సింది అదే! అందుకే అంతా చెప్పుకొచ్చాడతను. నారదుడు ఆశించిందే జరిగింది. ఆలోచించి ఆలోచించి కళ్ళు తెరచి నారదుణ్ణి చూశాడు కంసుడు. తెరచిన అతని కళ్ళు నిప్పుముద్దల్లా ఉన్నాయి. మండిపోతున్నట్టుగా ఉన్నాయి.

''అనుకున్నాను మునీంద్రా! ఆ బలరామకృష్ణులిద్దరూ వసుదేవుని తనయులని అనుమానిస్తూనే ఉన్నాను. అదే జరిగింది. ఇక ఉపేక్షించను. ఈ క్షణమే వసుదేవుని అంతు చూస్తాను'' అన్నాడు కంసుడు. దిగ్గున లేచి బయల్దేరబోయాడు. నారదుడు వారించాడతన్ని.

''ప్రాణాపాయ కారకుల్ని వదలిపెట్టి వారిని కన్నవారిని శిక్షించడం అనుచితం. తప్పు కూడా. నా మాట విని అతన్ని వదలిపెట్టు'' అన్నాడు నారదుడు. మునీంద్రుని మాట మీద వసుదేవుణ్ణి చంపకుండా వదలిపెట్టినా, ఎందుకయినా మంచిదని, దేవకిసహా వసుదేవుణ్ణి కారాగారంలో బంధించాడు కంసుడు. తర్వాత బలరామకృష్ణులను పరిమార్చేందుకు స్వయంగా తానే పథకరచనకు పూనుకున్నాడు. మంత్రివర్గంతో మంతనాలు జరిపాడు. మంచిగా బలరామకృష్ణులను మధురకు రప్పించాలి. రప్పించి గుట్టుగా మట్టుబెట్టాలి అనుకున్నారంతా.

కంసుడి ఆస్థానంలో ఇద్దరు మల్లయోధులు ఉన్నారు. వారి పేర్లు చాణూరుడు, ముష్టికుడు. ఇద్దరూ మహాబలవంతులు. మల్లయుద్ధంలో తిరుగులేని వీరులు. వారిని మించిన వారు చుట్టుప్రక్కల ఎవరూ లేరు. అలాగే కంసుని వద్ద 'కువలయాపీడం' అని ఒక మదపుటేనుగు ఉన్నది. బంధించి ఉంచారు దానిని. వదలిపెడితే బలరామకృష్ణుల్ని ఇట్టే చంపేస్తుందది. ఇటు మల్లయోధులు, అటు మదపుటేనుగు ఈ రెంటినీ బలరామకృష్ణులను సంహరించేందుకు సిద్ధం చేశాడు కంసుడు. ఇక మిగిలింది బలరామకృ ష్ణులను మధురకు రప్పించడం. అందుకు ఆస్థానంలో వినోదక్రీడలూ, వేడుకలూ ఏర్పాటు చేసి, వాటిని చూసేందుకు బలరామకృష్ణులను ఆహ్వానించాలనుకున్నాడు. గౌరవంగా ఆహ్వానించి, గుండెల్లో కత్తులు దింపాలనుకున్నాడు. మేనమామగా ఆహ్వానిస్తే బలరామకృష్ణులుగాని, నందాది గోపకులుగాని కాదనరనీ, అనుమానించరనీ ఆశించాడతను. అయితే చక్కగా ఆప్యాయంగా అభిమానంగా వారిని ఆహ్వానించాలి. అందుకు తగిన దూతకావాలి. ఆ దూత నేర్పుగలవాడూ, సమర్థుడూ అయి ఉండాలి. చెప్పిన కార్యాన్ని చేసుకు రాగలిగిన వాడై ఉండాలి. అలాంటి వారెవరున్నారు? బాగా ఆలోచించాడు కంసుడు. అతని దృష్టికి అక్రూరుడు కనిపించాడు. అక్రూరుడు దౌత్యకార్యంలో సమర్థుడు, స్వామిభక్తి పరాయణుడు. అందులో అనుమానం లేదు. పిలిపించాడతన్ని.

''అక్రూరా! నువ్వు నా మిత్రుడవి. కార్యదక్షుడవు కూడా. నువ్వు నాకు ఓ చిన్న సాయం చెయ్యాలి. వచ్చే చతుర్దశినాడు ధనుర్యాగం చేస్తున్నాను. ఆ సందర్భంగా అనేక వేడుకలూ, వినోద క్రీడలూ నిర్వహిస్తున్నాను. ఈ సందర్భంగా నా మేనల్లుళ్ళు బలరామకృష్ణులను నువ్వు

ఆహ్వానించాలి. గోకులానికి వెళ్ళి, నేర్పుగా వ్యవహరించి, యాదవులను ఒప్పించి, బలరామ కృష్ణులనూ, నందాది గోపప్రముఖులనూ వెంటబెట్టుకుని నువ్వు మధురకు రావాలి'' అన్నాడు కంసుడు. ఆలోచిస్తున్న అక్రూరుణ్ణి, ఆలోచించనీయక, తన మాటనే పదేపదే చెప్పి ఆఖరికి అతన్ని అంగీకరింపజేశాడు. బలరామకృష్ణులను ఆహ్వానించేందుకు వెళ్ళొస్తానన్నాడు అక్రూరుడు.

## అక్రూరుడు

అక్రూరుని తల్లి కాందిని. తండ్రి శ్వఫల్కుడు. అంతా మధురాపురంలో జీవిస్తున్నారు. అక్రూరుడు మంచివాడు. బుద్ధిమంతుడు. భగవద్భక్తి కలవాడు. బలరామకృష్ణుల గురించి అతనికి బాగా తెలుసు. వారిద్దరూ అవతారపురుషులని ఎన్నడో గ్రహించాడతను. వారి మహిమలను గురించి కూడా విని తరించాడు. వారిద్దరినీ చూడాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాడు. అది ఈ రకంగా నెరవేరుతున్నది. వ్రేపల్లెకు వెళ్ళి బలరామకృష్ణులను తాను ఆహ్వానించాలి. మధురకు వెంటబెట్టుకుని రావాలి. ఎంత సౌభాగ్యం. వదులుకుంటాడా తను? వదులుకోడుగాక వదులుకోడు. అందుకే కంసుడు ఆజ్ఞాపించిన వెంటనే ఒప్పుకున్నాడతను. బలరామకృష్ణులను మధురకు రప్పించడంలో కంసుని ఉద్దేశం అక్రూరునికి తెలుసు. వారిని మట్టుబెట్టాలన్న కంసుని ఆలోచన ఇట్టే గ్రహించాడతను. అయినా వారిని వెంటబెట్టుకుని వచ్చేందుకు ఎందుకు సాహసించాడంటే...అవతారపురుషులు బలరామకృష్ణులు. వారిని అంతమొందించడం కంసునితరం కాదు. కోరి మృత్యువును ఆహ్వానిస్తున్నాడు కంసుడు. వద్దంటే వినడు. ఒప్పుకోకతప్పదనే బలరామకృష్ణుల ఆహ్వానానికి నడుం బిగించాడు అక్రూరుడు. వ్రేపల్లెకు వెళ్ళేందుకు సిద్ధమయ్యాడు.

రథాన్ని అధిరోహించి, బయల్దేరాడతను. గుర్రాలు ఉత్సాహంగా పరుగుదీస్తున్నాయి. వాతావరణం అంతా చల్లచల్లగా హాయిహాయిగా ఉంది. ఆనందంగా ఉంది అక్రూరునికి. అవతారపురుషులు బలరామకృష్ణులను ఎంత వేగిరం చూస్తానా? వారి అనుగ్రహం పొంది, ఎంత వేగిరం ఈ భవబంధాలనుంచి విముక్తిని సాధిస్తానా అని తహతహలాడిపోతున్నాడు. బలరామకృష్ణుల దివ్యరూపాలను మనస్సులో ఊహించుకోసాగాడు. బలరాముడు ఇలా ఉంటాడు. నల్లనయ్య కృష్ణయ్య ఇలా ఉంటాడు అనుకుంటూ అంచనాలు వేయసాగాడు. ఆనందించసాగాడు.

పొద్దువాటారింది. వ్రేపల్లెకు చేరుకున్నాడు అక్రూరుడు. వ్రేపల్లెలో ప్రవేశించిన దగ్గర నుంచి బలరామకృష్ణులకోసం అటూ ఇటూ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూడసాగాడు. బృందావనంలోకి దారి తీశాడు. మందలు మందలుగా గోవులు ఉన్నాయి అక్కడ. ఆ మందల్లో మణిపూసల్లా వెలిగిపోతున్న ఇద్దరిని చూశాడు అక్రూరుడు. వారిద్దరూ బలరామకృష్ణులని గ్రహించాడు. అంతే! రథం దిగి, పరుగు పరుగున వెళ్ళి బలరామకృష్ణులకు సాష్టాంగప్రణామం చేశాడు. వారి పాదపద్మాలను కళ్ళకు అద్దుకున్నాడు. ఎప్పుడయితే బలరామకృష్ణుల పాదాలను స్పృశించాడో అప్పుడే తన పాపాలన్నీ మటుమాయం అయి, తాను పరిశుద్ధుడయినట్టుగా భావించాడు అక్రూరుడు. ఆనందం అతని శరీరం అణువణువునా పొంగిపొర్లింది. నోట మాటరాలేదతనికి.

తమను చూస్తూ కన్నీరు పెట్టుకుంటున్న అక్రూరుణ్ణి లేవనెత్తారు బలరామకృష్ణులు. గట్టిగా కౌగలించుకున్నారతన్ని. శిరస్సు నిమిరారు. రండంటూ ఇంటికి తీసుకుని వెళ్ళారు. ఉచితాసనం చూపించి, అర్ఘ్యమూ పాద్యమూ సమర్పించారు. కుశలప్రశ్నలు వేశారు. షడ్రసోపేతమయిన విందు ఏర్పాటు చేసి, భోజనానంతరం పట్టుపాన్పుపై పవళింపజేశారు. విశ్రాంతి తీసుకుని, మేల్కొన్నాడు అక్రూరుడు. అప్పుడతనితో ఏకాంతంగా సంభాషించారు బలరామకృష్ణులు.

''అక్రూరా! క్రౌర్యం లేని నిన్ను అక్రూరుడని వ్యవహరించడం సముచితం. పుణ్యాత్ముడవు. సదాచార సంపన్నుడవు. చెప్పు, నువ్వు వచ్చిన పని ఏమిటి?'' అడిగాడు బలరాముడు.

''మధురానగరంలో అంతా కుశలమే కదా? పూజ్యులు మా తల్లిదండ్రులు దేవకీ వసుదేవులు క్షేమమే కదా?'' అడిగాడు శ్రీకృష్ణుడు.

''మా మేనమామ కంసుడు ఏమంటున్నాడు? మధురానగర ప్రజలు అతని బాధలు తట్టుకోగలుగుతున్నారా?'' బలరాముడు అడిగాడు. అన్నదమ్ములిద్దరూ అడిగిన ప్రతిప్రశ్నకూ చక్కని సమాధానాలిచ్చాడు అక్రూరుడు. తర్వాత అసలు విషయం, కంసుడు ధనుర్యాగం తలపెట్టిన సంగతీ, బలరామకృష్ణులను అతను ఆహ్వానించిన సంగతీ చెప్పాడు.

''దగ్గరుండి మిమ్మల్ని మధురకు తీసుకుని వెళ్ళేందుకే నేను వచ్చాను. మీరు వస్తారని ఆశిస్తున్నాను'' అన్నాడు అక్రూరుడు.

''మీరిద్దరూ వసుదేవుని బిడ్డలని కంసునికి తెలిసిపోయింది. నారద మహాముని ఈ సంగతి చెప్పేశాడు. మిమ్మల్ని మట్టుబెట్టే ఉద్దేశంతోనే ఇప్పుడు ఈ ధనుర్యాగం'' అన్నాడు అంతలోనే.

''తప్పని పరిస్థితుల్లో నేను మీకు దూతనయ్యాను. అంతేగాని, అన్యథా నన్ను భావించవద్దు'' అని వేడుకున్నాడు. ఆ మాటలకి బలరామకృష్ణులు నవ్వుకున్నారు. అక్రూరుడుసహా బలరామకృష్ణులు తండ్రి నందగోపుణ్ణి సమీపించారు. కంసరాజు ఆజ్ఞను తెలియజేశారతనికి. కంసునికి నందుడు సామంతుడు. రాజాజ్ఞను ధిక్కరించలేడతను. ఇటువంటి కార్యాలప్పుడు, సామంతరాజుగా ఆహ్వానాన్ని అందుకుని పరిజనులతో వెళ్ళి కానుకలను సమర్పించి తీరాలి. అది ఆచారం. అందుకని నందుడు మధురకు వెళ్ళేందుకు సన్నద్ధుడయ్యాడు. తోడుగా యాదవప్రముఖులను తరలిరమ్మని చాటింపు వేయించాడు.

## బలరామకృష్ణుల ప్రయాణం

అక్రూరుడు రథాన్ని సిద్ధం చేశాడు. బలరామకృష్ణులను ఆహ్వానించాడు. వారొచ్చి, రథాన్ని అధిరోహించారు. అధిరోహించి, పక్కపక్కన కూర్చున్న ఆ ఇద్దరూ బుధ, శుక్రుల వలె మహాతేజస్సుతో వెలిగిపోసాగారు. అక్రూరుడు సారథి అయి, రథాన్ని ముందుకు పోనిచ్చాడు. నందుడు మొదలయిన యాదవ ప్రముఖులు అతన్ని అనుసరించారు. రథాలు మెల్లగా నడుస్తున్నాయి. బలరామకృష్ణులు మధురకు ప్రయాణమయ్యారని తెలిసి, గోపికలు పరుగు పరుగున వచ్చారక్కడకి. ప్రయాణిస్తున్న రథానికి అడ్డుగా నిలిచారు. కన్నీరు పెట్టుకుని, కన్నయ్యను చూశారు. నిన్ను వదలి క్షణం కూడా ఉండలేమన్నారు. వద్దువద్దన్నట్టుగా కూలబడ్డారు. వారిని సముదాయించడం ఎవరి వల్లా కాలేదు.



''నిన్ను చూడకుండా నిముషం కూడా ఉండలేం. నీతోపాటు మమ్మల్ని కూడా తీసుకునిపో కృష్ణా'' ప్రార్థించారు గోపికలు. రథం దిగిరమ్మనట్టుగా అతని చేయిపట్టుకున్నారు. సున్నితంగా విదలించుకున్నాడు కృష్ణుడు.

''త్వరలో వచ్చేస్తాను. మధురకు నా దేహమే ప్రయాణిస్తోంది. నా మనసు ఇక్కడే ఈ వ్రేపల్లెలోనే ఉంది'' అన్నాడు. పేరు పేరునా గోపికలను బుజ్జగించి, బయల్దేరాడు. అంతలో యశోద, రోహిణి వచ్చారక్కడకి. బలరామకృష్ణుల నొసట తిలకాలు దిద్ది, హారతులిచ్చారు. పిల్లలకు ఏ ఆపదా రాకూడదని దేవుళ్ళను ప్రార్థించారు. వారిని ముద్దిడి దీవెనలిచ్చారు. అంతా ఊరి సరిహద్దుల దాకా వచ్చి, బలరామకృష్ణులను సాగనంపి, వెను తిరిగారు. రథం వేగం పుంజుకుంది. అక్రూరుడు రథాన్ని వాయువేగంతో నడపసాగాడు. మధ్యాహ్నం వేళకు యమునాతీరం చేరుకున్నారంతా. దాహం తీర్చుకోదలచి, బలరామకృష్ణులుసహా యమునలోకి దిగారు. కాళ్ళూ

చేతులూ కడుక్కున్నారు. దోసిటపట్టి నీరు తాగి దాహం తీర్చుకున్నారు. కాస్సేపు నదీతీరాన చెట్లనీడల్లో విశ్రమించి, సేదదీరారు. బలరామకృష్ణుల్ని రథం మీద కూర్చోబెట్టి, తానూ దాహం తీర్చుకునేందుకు యమునలోకి దిగాడు అక్రూరుడు. నీరు దోసిట పట్టి తీయబోతున్నంతలో బలరామకృష్ణులు నీళ్ళలో కనిపించారు. రథంలో కూర్చున్న బలరామ కృష్ణులు నీళ్ళలోకి ఎప్పుడొచ్చారా? అని ఆశ్చర్యపోయాడు అక్రూరుడు. తల తిప్పి, తీరాన ఉన్న రథం కేసి చూశాడు. రథం మీద బలరామకృష్ణులు కూర్చుని కనిపించారు. నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ కనిపించారిద్దరూ. మరి నీళ్ళలో ఉన్నదెవరు? నీటిలోకి తేరిపార చూశాడు అక్రూరుడు. నీటిలో కూడా బలరామకృష్ణులు ఉన్నారు. నిజరూపాలతో కనిపించసాగారు. శ్రీదేవిసహా శ్రీమహావిష్ణువు శేషపాన్పుపై పవళించి కనిపించాడు. సమస్త దేవతలూ, మునులూ విష్ణువును పరివేష్టించి ఉన్నారు. వేదసూక్తాలతో స్తోత్రాలు చేస్తున్నారతన్ని. మహావిష్ణువుని చూసిన మరుక్షణం అక్రూరుని ఆనందానికి అంతులేకుండాపోయింది. పులకించిపోయాడతను. భవబంధాలనుండి విముక్తి లభించినట్టుగా సంతోషించాడు. మహాయోగులకు కూడా అందని బ్రహ్మజ్ఞానం, ఆత్మచైతన్యం కలిగాయి అతనికి. పరతత్త్వం బోధపడింది. మరింతగా భగవంతునిపై భక్తి కుదిరింది. అంతా జన్మజన్మల పుణ్యఫలం అనుకున్నాడు అక్రూరుడు. చేతులు జోడించి నమస్కరించాడు. గద్గదంగా శ్రీహరిని స్తోత్రం చేశాడు. అక్రూరుణ్ణి అనుగ్రహించాడు కృష్ణుడు. తాను శ్రీమహావిష్ణువునని తెలియజేసేందుకే అలా కనిపించాడతనికి. జపతపాలు లేవు. నియమనిష్ఠలు లేవు. కేవలం భక్తితత్పరతే...అక్రూరుని భక్తితత్పరతే భగవంతుని సాక్షాత్కారానికి కారణమయింది. భగవదనుగ్రహం పొంది, దాహాన్ని తీర్చుకుని వచ్చాడు అక్రూరుడు. రథాన్ని అధిరోహించాడు. ముందుకుపోనిచ్చాడు. రథం నడుస్తోంటే అతని దగ్గరగా వచ్చి అడిగాడు కృష్ణుడు.

''నదిలో నీకేమయినా కనిపించిందా అక్రూరా?''

''కనిపించింది కృష్ణా! సర్వం శ్రీహరిమయం అనిపించింది. ఈ జన్మకి ఇది చాలు'' అన్నాడు అక్రూరుడు. వారలా మాట్లాడుకుంటూ మధురాపురం పొలిమేరలకు చేరుకున్నారు. అప్పటికి సూర్యాస్తమయం అయింది. ఓ ఉద్యానవనం ముందు రథాన్ని నిలిపాడు అక్రూరుడు. అప్పటికే అక్కడకి చేరుకున్న నందుడు మొదలయిన యాదవ ప్రముఖులంతా బలరామకృష్ణులను చుట్టుముట్టారు. అన్నతోసహా రథాన్ని దిగాడు కృష్ణుడు.

''అక్రూరా! ఈ రాత్రి ఇక్కడే ఈ ఉద్యానవనంలో విడిది చేస్తాం. రేపు పట్టణంలోకి ప్రవేశిస్తాం. మీరిక వెళ్ళొచ్చు.'' చెప్పాడు.

''నిన్ను విడచి వెళ్ళలేను కృష్ణా! నువ్వు లేకుండా మధురాపురంలో అడుగుపెట్టలేను. నేను నీ భక్తుణ్ణి. ఈ రాత్రి నా ఇంట ఆతిథ్యాన్ని స్వీకరించు. దయచేసి నన్ను కరుణించు.'' ప్రార్థించాడు అక్రూరుడు.

''నీ కోరిక తప్పకుండా తీరుస్తాను, అయితే ఇప్పుడు కాదు, త్వరలో. ముందు నేను వచ్చిన పని చక్కబెట్టనీ'' అన్నాడు కృష్ణుడు. సరేనన్నాడు అక్రూరుడు. శలవు తీసుకున్నాడు. నిష్క్రమించాడక్కణ్ణుంచి. కంసుణ్ణి సందర్శించాడు. బలరామకృష్ణుల్ని వెంటబెట్టుకుని వచ్చానని చెప్పాడతనికి. కుట్ర ఫలించినందుకు సంతోషించాడు కంసుడు.

### రజకుని రగడ

బలరామకృష్ణులు మధురపురానికి రావడం అదే మొదటిసారి. ఆ కారణంగా చాలా సంతోషంగా ఉన్నారిద్దరూ. పైగా తమ తల్లిదండ్రులు, మేనమామ కలగిసిన ఊరు. ఆ నేలతో తెలియని అనుబంధం ఉన్నదనిపించింది. పురవీథులు తిరగాలనిపించింది. బయల్దేరారిద్దరూ. మధుర ఎంతో బాగుంది. వైభవంగా ఉంది. ఎటు చూసినా ఐశ్వర్యం కనిపించసాగింది. ఒకరి చేయి ఒకరు పట్టుకుని తిరుగుతున్న బలరామకృష్ణుల్ని చూసి, మధురాపురవాసులు వారెవరో ఇట్టే గుర్తించగలిగారు. బలరామకృష్ణుల్ని చూసి జన్మ తరించిందనుకున్నారు. మహదానందం చెందారు. భక్తితో నమస్కరించారు. పూలూ, గంధాక్షితలూ చల్లి పూజించారు. కంసునికి రోజులు దగ్గరపడ్డాయి. అందుకే బలరామకృష్ణులు వేంచేశారనుకున్నారు యోగులు.

తిరుగుతూ తిరుగుతూ ఓ మలుపు దగ్గరకు చేరుకున్నారు బలరామకృష్ణులు. అక్కడ వారికి ఓ రజకుడు కనిపించాడు. కంసుని బట్టలుతికేవాడతను. మహారాజూ, అతని పరివారం ధరించేందుకు రకరకాల రంగు రంగుల దుస్తులు ఉన్నాయి అతని దగ్గర. చలువజేసి, చక్కగా మడతలుబెట్టి ఉన్నాయి. వాటిని ధరించాలనిపించింది బలరామకృష్ణులకు. గోకులంలో పెరిగారు. ఆలమందలను కాచుకుంటూ తిరిగారు. ఎన్నడూ అలాంటి వస్త్రాలు ధరించలేదు. సరదాపడ్డా రిద్దరూ.

''ఇదిగో నీ దగ్గర బలే మంచి మంచి దుస్తులు ఉన్నాయి. మేము వాటిని ధరించాలను కుంటున్నాం. ఓ రెండు జతలివ్వు'' అడిగారు. సమాధానంగా పగలబడి నవ్వాడు రజకుడు. కంసునిలాగే వాడు కూడా దుష్టుడు. మదాంధుడు. బలరామకృష్ణులను అవమానించాడతను.

''గోవులు కాచుకునే మీకు రాజదుస్తులు కావాలా? తప్పు తప్పు. తప్పుకోండి'' అన్నాడు.

''ఈ దుస్తులు కంసమహారాజే ధరించాలి. వీటిని ధరించే అర్హత, అందం, చందం అతనికే ఉన్నాయి '' అన్నాడు. ఆ మాటలకి కృష్ణుడికి కోపం వచ్చింది. రజకుణ్ణి కోపంగా చూశాడతను. పిడికిలి బిగించి, రజకుని గుండెలో గట్టిగా ఒక్క పోటు పొడిచాడు. దెబ్బకి వాడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అది చూశారు సాటి రజకులు. ప్రాణభయంతో పరుగందుకున్నారు. పారిపోతున్న రజకుల్ని కేకేసి మరింతగా బెదిరించి, తర్వాత తీరిగ్గా రాజదుస్తులు అందుకున్నారు బలరామకృష్ణులు. నచ్చిన వాటిని ధరించారు. కొన్ని దుస్తుల్ని వెన్నంటి వచ్చిన గోపాలురకు బహూకరించారు.

## కుబ్జ కేళివిలాసం

కంసుని ధనుర్యాగం ఆహ్వానాన్ని అందుకుని బలరామకృష్ణులు మధురాపురం చేరుకున్నారు. ఇద్దరికీ సరదాగా పురవీథులు తిరగాలనిపించింది. తిరగసాగారు. ఓ సాలెవాణ్ణి చూశారప్పుడు. అతడు చిత్రవిచిత్రంగా వస్త్రాలు నేస్తున్నాడు. బాగున్నాయవి. చూడముచ్చట అనిపించాయి. నిలిచారక్కడ. తన ఎదురుగా నిలిచిన బలరామకృష్ణులను అవతారపురుషులని గ్రహించాడు నేతగాడు. చేతులెత్తి నమస్కరించాడు. యథాశక్తి వారిని పూజించాడు. తను నేసిన చిత్ర విచిత్ర వస్త్రాలు కట్టబెట్టి, అలంకారాలు చేశాడు వారికి. చూసి ఆనందించసాగాడు. అతని భక్తిని

మెచ్చుకున్నాడు కృష్ణుడు. అష్టైశ్వర్యాలూ, ఆయురారోగ్యాలూ ప్రసాదించాడతనికి. అక్కణ్ణించి నిష్క్రమించారు. ముందుకు నడిచారు. పూలమాలలు అల్లే సుదాముడి ఇంటి ముంగిట నిలిచారు. సుదాముడు గొప్ప భక్తుడు. బలరామకృష్ణులు ఇంటి ముంగిట నిలిచిన మరుక్షణం వారిని గుర్తించాడతను. లోనికి ఆహ్వానించాడు. పూజించాడు వారిని. స్వయంగా అల్లిన పూలమాలలు బలరామకృష్ణుల మెళ్ళో వేసి, తనివితీరా చూసి పొంగిపోయాడు. సాష్టాంగపడ్డాడు వారికి. కృష్ణుడు అతని భక్తిని మెచ్చుకున్నాడు.

''వరం కోరుకో'' అన్నాడు.

''నీ పట్ల నిరంతరభక్తిని ప్రసాదించు, చాలు'' అన్నాడు సుదాముడు.

''సిరిసంపదలక్కర్లేదా?'' అడిగాడు కృష్ణుడు.

''అక్కర్లేదు'' అన్నాడు సుదాముడు. కళ్ళుమూసుకుని కృష్ణనామజపం చేయసాగాడు. అతని భక్తి కృష్ణుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది. సిరిసంపదలుసహా భగవద్భక్తిని కూడా ప్రసాదించాడతనికి.

## కుబ్జ

కంసుని అంతఃపుర దాసిలలో కుబ్జ ఒకతె! ఆమె కురూపి. పుట్టుకతోనే అందవికారంగా పుట్టిందామె. శరీరం మూడు వంకరలు తిరిగి ఉంటుంది. 'త్రివక్ర' అని కూడా పిలుస్తారామెను. త్రివక్ర కనిపిస్తే చాలు, అంతా అసహ్యించుకుంటారు. దూరదూరంగా తొలగిపోతారు. పిలిచినా పలకరు. పలకరిస్తే కసురుకుంటారు. కంసునికి కావాల్సిన గంధం మొదలయిన లేపనాలు తయారు చేసి అందించడం ఆమె పని. ఆ లేపనాలు ఎంత సుగంధభరితమో, అవి పూసుకుంటే శరీరసుఖం ఎంతటి తీవ్రస్థాయిలో ఉంటుందో ఊహించుకోగలదామె. ఊహకే పరిమితం కుబ్జ. ఇంతవరకు ఆమెకు ఆ సుఖం తెలియదు. అంతా దాని గురించి మాట్లాడుకుంటుంటే విని చాటుగా కన్నీరు కార్చేది కుబ్జ.

''దేవుడా! నేనే పాపం చేశాను? నన్ను ఎందుకిలా పుట్టించావు? ఏ సుఖానికీ నోచుకోని ఈ బతుకు ఎందుకు?'' అనేది. ఆత్మహత్యకు ప్రయత్నించి అంతలోనే మానుకుంది కూడా.

సుదాముని కటాక్షించి వెళ్తున్న బలరామకృష్ణులకు దారిలో కుబ్జ కనిపించింది. ఆమె చేతిలో గంధం మొదలయిన మైపూతల పాత్రలు ఉన్నాయి. సువాసనలు వెదజల్లుతున్నాయవి. ఆ సువాసనలకు ఆమెను సమీపించారు బలరామకృష్ణులు. ఎవరన్నట్టుగా వారిని చూసింది కుబ్జ. నువ్వు మాకు తెలుసు! అలాగే మేమెవరో నీకు తెలుసు అన్నట్టుగా చూశారు వారు.

''కుబ్జ'' పిలిచాడు కృష్ణుడు. ఆ పిలుపే మధురం. వయ్యారాలు పోయింది కుబ్జ.

''ఎవరు నువ్వు? ఈ పాత్రలలో ఏమిటిదంతా? ఈ సుగంధాలు ఎక్కడికి?'' అడిగాడు కృష్ణుడు.

సిగ్గుల మొగ్గయింది కుబ్జ. కృష్ణుడితో మాట్లాడేందుకు పెదవులు విడివడడం లేదు. ఏమిటిది? ఎందుకిలా అనుకుంటూ బలంగా పెదవులెత్తి పలికిందిలా.

''నేను దాసిని. కంసుని అంతఃపురంలో పని చేస్తున్నాను. నన్ను అంతా త్రివక్ర అంటారు. ఇవన్నీ మైపూతలు, కంసమహారాజు కోసం తీసుకుని వెళ్తున్నాను'' అన్నది కుబ్జ.

''సుగంధభరితమయిన ఈ మైపూతలు మాకొంచెం ఈయరాదూ?'' అడిగాడు కృష్ణుడు. అడిగిందే ఆలస్యం అందజూపింది కుబ్జ.

''ఈ పూతలకు మీరే అర్హులు. తీసుకోండయ్యా'' అంది. తీసుకున్నారు బలరామకృష్ణులు. పూతలు పూసుకున్నారు. బంగారానికి తావి అబ్బినట్టుగా అవతారపురుషులయిన బలరామ కృష్ణులు మైపూతలతో మరింతగా మెరసిపోయారు. సూర్యునిలా తెల్లగా, చంద్రునిలా చల్లగా వెలిగిపోతున్న కృష్ణుణ్ణి కన్నార్పకుండా చూడసాగింది కుబ్జ. తనని కుబ్జ గమనిస్తున్నదని తెలుసుకుని, మెల్లమెల్లగా కళ్ళెత్తి ఆమెను చూశాడు కృష్ణుడు. తనని కృష్ణుడు గమనించాడని తెలుసుకుని, సనసన్నగా కళ్ళు దించుకుంది కుబ్జ. సెలవివార నవ్వు కోసాగింది. ఆమెను కరుణించాడు కృష్ణుడు. కటాక్షించేందుకు సిద్ధమయ్యాడు.

''కుబ్జ'' పిలిచాడు. వేణునాదంలా వినవచ్చింది ఆ పిలుపు. నిలువెల్లా కదలిపోయిందామె. వంగలేక వంగలేక వంగి కృష్ణుని పాదాలను స్పృశించింది కుబ్జ. కళ్ళకద్దుకుంది వాటిని. అప్పుడు కృష్ణుడు ఆమె ముంగాళ్ళను తొక్కిపట్టి, కుడిచేతి చూపుడు వేలుని చుబకం మీద నుంచి లేవనెత్తాడామెను. అతనలా లేవనెత్తుతోంటే ఎముకలు పటపటమని శబ్దం చేస్తూ సర్దుకున్నాయి. ముద్దలు ముద్దలుగా గడ్డలుగా ఉన్న మాంసం కింద మీదులయింది. శరీరం అంతా సమంగా పరుచుకుంది. చర్మం సరిదిద్దుకుంది. వికారాలన్నీ పోయాయి. విచిత్రంగా కుబ్జ అందగత్తెగా మారిపోయింది. కటిప్రదేశం, వక్షస్థలం, కంఠం...ఈ మూడుచోట్లా కుబ్జ దేహం వంకరలు తిరిగి ఉండేది. ఆ వంకరలన్నీ పోయి ఇప్పుడవి వయ్యారాలు అయ్యాయి. దేవకన్యలా వెలిగిపోసాగింది కుబ్జ. తనని తాను చూసుకుంది. ఆశ్చర్యపోయింది. కృష్ణుని కళ్ళలో తన ప్రతిబింబాన్ని చూసు కుంది. పొంగిపోయింది. ఈ అందాలభరిణె ఎవరనుకుంది. ఇంకెవరు? తనేననుకుంది. తన్మ యత్వం చెందింది. కృష్ణుని పాదాలను ఆశ్రయించింది. కన్నీటితోనూ, కృతజ్ఞతతోనూ ఆ పాదాలను పరిశుభ్రం చేసింది. భుజాలు పట్టి లేవనెత్తాడామెను కృష్ణుడు. చిరునవ్వుతో చూశాడామెను. సన్నగా వణకిపోతూ ఇలా అంది కుబ్జ.

''అందం ఇంత అందంగా ఉంటుందని నాకు తెలియదు. అలాగే నీ స్పర్శలో ఇంత సుఖం ఉన్నదని కూడా నాకు తెలియదు. ఈ అందం, ఈ సుఖం నాకు శాశ్వతం చెయ్యి. నా భర్తవు నువ్వే! నన్ను కరుణించు. నల్లనయ్యా నా ఇంటికి రావయ్యా, నను కూడి శయనించయ్యా.'' కృష్ణుణ్ణి వేడుకుంది కుబ్జ.

''తప్పకుండా వస్తాను'' అన్నాడు కృష్ణుడు.

''నిజంగా'' ఒళ్ళంతా కళ్ళు చేసుకుని కృష్ణుణ్ణి నఖశిఖపర్యంతం చూసింది కుబ్జ.

''నిజం. అయితే ఇప్పుడు కాదు. ఈ మధురాపురిలో నేను వచ్చిన పని కానీ. అది అయిన తర్వాత తప్పకుండా నీ దగ్గరకు వస్తాను. నిన్ను అలంకరిస్తాను. ఆనందిద్దాం'' అన్నాడు కృష్ణుడు.

''నీ కోసం వేచి ఉంటానయ్యా'' అని కృష్ణుణ్ణి పదేపదే చూస్తూ అక్కణ్ణుంచి పరుగందుకుంది కుబ్జ.

క్షణం ఒక యుగంగా ఎన్ని యుగాలు కృష్ణుని కోసం వేచిందో! వేగిపోయిందో! ఆఖరికి కృష్ణుని కౌగిలిలో కరగిపోయింది కుబ్జ. కన్నీరయి అతని పాదాలనంటి తరలిపోయింది. కంసుని సంహరణానంతరం ఉద్ధవుని వెంట కృష్ణుడు, కుబ్జ ఇంటికి వెళ్ళాడు. గుమ్మంలో నిలిచిన కృష్ణుని చూసి నమ్మలేకపోయింది కుబ్జ. మాధవుడు మాట నిలబెట్టుకుంటాడా? అని అను



మానించింది. నిలబెట్టుకుని, నిలిచాడు ఎదురుగా. చేతులు జాచి ఆహ్వానించిందతన్ని. ప్రేమించి పూజించింది. ఆ రాత్రంతా కుబ్జను అనుభవించాడు కృష్ణుడు. రసరాజాన్ని అందించాడు. తర్వాతికాలంలో శ్రీకృష్ణ కుబ్జలు ఓ కుమారుణ్ణి కన్నారు. అతని పేరు ఉపశ్లోకుడు.

తనని ఆరాధిస్తే చాలు, భగవంతుడు అనంతసౌఖ్యాలు అందిస్తాడు. అందుకే ఈ కథ అంటారు పెద్దలు. త్రివక్రను, పరిచారికను, దాసిని ఉద్ధరించడం, ఆమె మనోరథం ఈడేర్చడం శ్రీకృష్ణుని ఉదాత్తగుణానికి ఓ ఉదాహరణ. ఆ దేవదేవుని సంస్కారానికి మచ్చుతునక.

## కంసుదు:కకావికలు

కుబ్జను కటాక్షించి బలరామకృష్ణులు వెనుదిరిగారు. ఉద్యానవనానికి రావాల్సి ఉంది. అయితే వారిద్దరూ అటుగా నడవలేదు. ధనుర్యాగం జరిగేదెక్కడో తెలుసుకున్నారు. నడిచారటుగా.

కంసమహారాజుకి తమ ధైర్యస్థయిర్యాలు తెలియజెయ్యాలి. బలరామకృష్ణులంటే అతనికి వణకుపుట్టాలి. ఈ రాత్రి నిద్ర కరవవ్వాలతనికి అనుకున్నారు.

ధనుర్యాగం జరిగే ప్రదేశానికి చేరుకున్నారు బలరామకృష్ణులు. చుట్టూచూశారు. అదో పెద్ద ఆయుధశాల. రకరకాల శస్త్రాస్త్రాలు ఉన్నాయక్కడ. వాటిని బలశాలురయిన భటులు కాపలా కాస్తున్నారు. వారు వారించినప్పటికీ బలరామకృష్ణులు వినలేదు. ఆయుధాలను పట్టి చూశారు. పెద్దధనుస్సు కనిపించింది కృష్ణునికి. వెళ్ళి దాన్ని స్పృశించాడు. చూడచక్కగా ఉన్నది ధనుస్సు. ఇంద్రధనుస్సులా, శివధనుస్సులా వెలిగిపోతున్నది. అందుకున్నాడు దాన్ని. సునాయసంగా ఎత్తాడు. భటులది చూసి ఆశ్చర్యపోయారు. ఇంత వరకూ ఆ ధనుస్సును ఎత్తినవారు లేరు. కంసమహారాజుకూడా దానిని ఎత్తేందుకు ఎక్కుపెట్టేందుకు చాలా కష్టపడతాడు. అలాంటి ది కృష్ణుడు ధనుస్సును అవలీలగా ఎత్తాడు. ఎత్తి దానికి నారిని బిగించబోయాడు. అంతే! ఫెళఫెళమంటూ విరిగిపోయింది ధనుస్సు. అది చూసి భటులంతా బెదరిపోయారు. హాహాకారాలు చేశారు. ధనుస్సు విరిగిన ధ్వని అంతఃపురంలో ఉన్న కంసునికి వినవచ్చింది. అదిరిపడ్డాడతను. ధనుస్సును విరచినందుకు కృష్ణుని మీద భటులు దాడి చేశారు. కత్తులు ఝుళిపించారు. ఆ పాపానికి అంతా ప్రాణాలు కోల్పోయారు. కృష్ణుని మీదకి కత్తి ఎత్తితే ప్రాణాలు పోతున్నాయని తెలుసుకున్నాడు కంసుడు. భయపడ్డాడు. అంతలోనే తేరుకుని, బలరామ కృష్ణులను వధించి రమ్మని వారి మీదకి సైన్యాన్ని ఉసిగొల్పాడు. వందలాది మంది సైన్యం మూకుమ్మడిగా బలరామకృష్ణులను ఎదుర్కొంది. పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కంసుని సైన్యం ఒక్కరూ మిగల్లేదు. అంతా మరణించారు. బలరామకృష్ణుల శౌర్యపరాక్రమాలకు మధురాపుర ప్రజలు ఆశ్చర్యపోయారు. వేనోళ్ళ ప్రశంసించారు వారిని. అప్పటికి బాగా చీకటి పడింది. నందాది ప్రముఖులు ఆందోళన చెందుతారని, ఇక వెళ్ళక తప్పదని అప్పుడు ఉద్యానవనానికి బయల్దేరారు ఇద్దరూ. చేరుకున్నారక్కడకి. రాత్రి సుఖంగా నిద్రించారు.

బలరామకృష్ణులు హాయిగా ఇక్కడ నిద్రపోతుంటే అక్కడ కంసుడికి నిద్రకరవయింది. కృష్ణుడు ధనుర్భంగం కావించడం, కావలి భటులనూ, సైన్యాన్నీ మట్టుబెట్టడం తలచుకుంటూ కంసుడు నిద్రకు దూరమయ్యాడు. భయాన్ని మించిన భూతం లేదు. అది పట్టుకుందంటే మనిషిని పీల్చి పిప్పి చేసి కాని వదలదు. ఇప్పుడది కంసుణ్ణి గట్టిగా పట్టుకుంది. ఊపిరాడనీయడం లేదతన్ని. బలరామకృష్ణులు తనని సంహరించేందుకే పుట్టారు. అనుమానం లేదనుకున్నాడతను. అయిపోయింది. తనిక ఎంతో కాలం బతకననుకున్నాడు. నీడలా తనని మృత్యువు వెంటాడుతోందనిపించింది. కంటి మీద కునుకు లేదు. లేచి కూర్చున్నాడు కంసుడు. తల్పానికి చేరబడి కళ్ళు మూసుకున్నాడు. ఆలోచించసాగాడు. గత కొద్దిరోజులుగా పొడగట్టిన దుర్నిమిత్తాలను నెమరువేసుకున్నాడు.

అద్దంలోకి చూసుకుంటూ మైపూతలు పూసుకుంటుంటే అద్దంలో తన తల కనిపించలేదు. మొండమే కనిపించింది. అలా కనిపిస్తే మృత్యువు దగ్గరపడినట్టే! దీపం, సూర్యుడు, చంద్రుడు రెండు రెండుగా కనిపించాయి. అలా కనిపించకూడదు. కనిపిస్తే మరణం ఆసన్నమయినట్టే! పాదప్రక్షాళన చేసుకుని భోజనానికి వస్తూ తడికాళ్ళ ముద్రలను అప్రయత్నంగా చూశాడు. లేవు. నేల మీద కాలిముద్రలు లేవంటే ఎంతోకాలం బతకరంటారు. చెవిరంధ్రాల్లో వేళ్ళు పెట్టుకుంటే

గమ్మత్తయిన ఘోష వినవస్తుంది. చెవిలో వేళ్ళు పెట్టుకుంటే అలా వినరావడం లేదు. వినరాలేదంటే చావుకి దగ్గరపడినట్టే! శవాన్ని కౌగలించుకున్నట్టు, గాడిదనూ, దున్నపోతునూ ఎక్కి ఊరేగుతున్నట్టు, తైలంతో తలంటుకున్నట్టు, దిసమొలతో తిరుగుతున్నట్టు తరచూ కలలు వస్తున్నాయి. ఆ కలలకు అర్థం మృత్యువు. చెట్లు బంగారు రంగులో కనిపించకూడదు. ఉద్యానవనంలోని చెట్లన్నీ అలాగే కనిపిస్తున్నాయి. ఆకుల దగ్గర్నుంచీ అంతా సువర్ణమయంగా కనిపిస్తోంది. కనిపించిందంటే చావు మూడిందనే అంటారు. చావు తనని సమీపిస్తోంది. పొదివిపట్టుకునేందుకు దీర్ఘబాహువులు చాస్తోంది. తాను అందకూడదు. అందకుండా పరుగెత్తాలి. పరిగెత్తాడు కంసుడు. తల్పం మీద నుంచి ఎప్పుడు దిగాడో తెలియదు. ఎటు నుంచి ఎటు పరిగెత్తాడో తెలియదు. అంతఃపురం ఆఖరి వసారాను చేరుకున్నాడతను. దాటితే కందకం. పడితే మొసళ్ళకు ఆహారమయిపోతాడు. కాని పడలేదు. నిలదొక్కుకున్నాడు కంసుడు. బాధతో, భయంతో నిస్త్రాణంగా అక్కడి గోడకి చేరగిలబడ్డాడు.

## కంసవధ

కంసుణ్ణి మృత్యువు కబళించబోతోంది. పైపైకి వస్తోంది. తప్పించుకుంటూ దానిని ఎదుర్కొనేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నాడతను. తెల్లారుతూనే మల్లక్రీడా మహోత్సవానికి అందరినీ ఆహ్వానించాడు కంసుడు. రాజుగారి ఆహ్వానాన్ని కాదంటారా? అంతా తరలివచ్చారు. రంగస్థలం అంతా నిండిపోయారు. పౌరులూ, జానపదులూ కొంచెం దూరంగా కూర్చున్నారు. మంత్రులూ, సామంతులూ, రాజోద్యోగులూ దగ్గరగా కూర్చున్నారు. సర్వాలంకా రశోభితమయిన సింహాసనం మీద కంసుడు కూర్చున్నాడు. ఆత్మీయులూ, అంగరక్షకులూ అతన్ని పరివేష్టించి కూర్చున్నారు. అంతలో మహోత్సవం ప్రారంభం కానున్నట్టు భేరీమృదంగాది వాయిద్యాలు ఒక్క పెట్టున మ్రోగాయి.

మహోత్సవానికి ముందు రాజుకి సామంతులు కానుకలు చెల్లించాలి. అది సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని అనుసరించి, నందగోపుడు మొదలయిన యాదవ ప్రముఖులంతా తాము తెచ్చిన కానుకలను కంసునికి సమర్పించారు. ఆసీనులు కండి అన్నట్టుగా చూపిస్తే కంసుడు చూపించిన ఉచితాసనాల్లో కూర్చున్నారంతా. యుద్ధంలో పాల్గొనే యోధుల్ని పెద్దగొంతుతో పిలవసాగారు. పిలుస్తోంటే చాణూరుడు, ముష్టికుడు, కూటుడు, శలుడు, తోసలుడు మొదలయిన వారంతా తగిన వేషాలంకారాలతో రంగప్రవేశం చేశారు. వారిని చూసి నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు కంసుడు. మహాయోధులు, బలవంతులు చాణూరాదులు. వారితో యుద్ధం బలరామకృష్ణుల వల్ల కాదు. ఓడిపోతారు. ఓడిపోవడం కాదు, మరణించడం తథ్యం అనుకున్నాడు. అందాకా దేనికి? అక్కడే రంగద్వారం దగ్గరనే ఆ ఇద్దరూ హతమవడం ఖాయం. వారి మృత్యురూపంలో అక్కడ మదపుటేనుగు కాచుక్కూర్చుంది. వారి అంతు అది చూస్తుందనుకున్నాడు కంసుడు.

బలరామకృష్ణులిద్దరూ గోపాలకులుసహా అలంకరించుకుని రంగప్రదేశానికి చేరుకున్నారు. రంగద్వారం దాటబోతున్నారు. వారికి ఆ అవకాశం ఈయలేదు మదపుటేనుగు కువలయా

పీడనం. పెద్దకొండలా ఉందది. ఘీంకరిస్తూ ఉంది. అగ్నికి ఆజ్యం పోసినట్టుగా దానిని రెచ్చగొడుతున్నాడు మావటి. దిక్కులు పిక్కటిల్లేలా ఘీంకరిస్తూ బలరామకృష్ణుల మీద దాడి చేసింది ఆ ఏనుగు. తొండంతో కృష్ణుణ్ణి చుట్టివేసింది. పైకెత్తి పండులా విసరి వేద్దామనుకుంది. అయితే దాని ఆటలు సాగలేదు. పిడికిలి బిగించి కృష్ణుడు ఒక్కపోటు పొడిచేసరికి వదలి వేసిందతన్ని. వదలడమే ఆలస్యం, దాని కాళ్ళ కింద దాగాడు కృష్ణుడు. కోపంతో ఘీంకరిస్తూ కృష్ణుని కోసం వెదకసాగింది ఏనుగు. ఎక్కడా కనిపించలేదు కృష్ణుడు. ఆఖరికి వాసననుపట్టి కృష్ణుడు ఎక్కడ ఉన్నదీ కనుగొనగలిగింది. తొండాన్ని కాళ్ళకిందకి జొనిపి, కృష్ణుణ్ణి అందుకో బోయింది. వెనక్కి జరిగాడు కృష్ణుడు. ఏనుగు తోక దగ్గరకు చేరుకున్నాడు. పట్టుకున్నాడు దాన్ని. పాతిక విల్లుల దూరం లాగాడు ఆ తోకను. బలంగా దూరంగా కృష్ణుడు తోకను లాగుతోంటే ఆ బాధను భరించలేకపోయింది ఏనుగు. మూలుగుతూ బలరామకృష్ణుల్ని చంపేందుకు ప్రయత్నించ సాగింది. అటు తిరిగింది. ఇటు తిరిగింది. ఎటు తిరిగినా కృష్ణుడు అందడు. అందడు సరికదా, అందేట్టుగా ఊరించసాగాడు. నానా తిప్పలూ పెట్టాడు దాన్ని. అంత బాధలోనూ అదను చూసి కాలు విసిరింది. కృష్ణుడు కాలి కింద పడేవాడే! తప్పించుకున్నాడు. తప్పించుకుని, ఏనుగు



తొండం అందుకున్నాడు. దానిని కాళ్ళ మధ్య నుంచీ లాగి కిందకి పడదోశాడు. కిందపడ్డ ఏనుగు మీదకి సింహంలా ఎగిరాడు. దాని దంతాన్ని పెరికాడు. ఆ దంతంతో ఏనుగు కుంభస్థలాన్ని పగలగొట్టాడు. దిక్కులు పిక్కటిల్లేలా ఘీంకరిస్తూ ఏనుగు మరణించింది. మావటిని చూశాడు కృష్ణుడు. పారిపోయే ప్రయత్నంలో ఉన్నాడతను. పట్టుకున్నాడతన్ని కృష్ణుడు. చేతిలోని ఏనుగుదంతాన్ని కత్తిలా అతని కడుపులో గుచ్చాడు. విలవిలా తన్నుకుని చనిపోయాడతను. మావటికడుపులోని దంతాన్ని పెరికి, దానికి అంటిన రక్తాన్ని తుడిచి వేశాడు కృష్ణుడు. తెల్లగా మెరిసిపోతున్న దంతాన్ని మూపున అలంకారంగా అమర్చుకున్నాడు. అన్నయ్య బలరాముడు, గోపబాలకులుసహా రంగస్థలం వైపునకు నడిచాడు కృష్ణుడు. అతని కంటే ముందుగా మదపుటేనుగుని కృష్ణుడు సంహరించాడన్న వార్త కంసునికి చేరింది. ఆ వార్తకి వణికిపోయాడతను. అంతలోనే తేరుకున్నాడు. చాణూరాది మల్లయోధుల్ని చూసి గుండెదిటవు చేసుకున్నాడు.

రంగస్థలానికి చేరుకున్న బలరామకృష్ణులను చూసి పౌరులూ, జానపదులూ హర్షధ్వానాలు చేశారు. బలరామకృష్ణుల శౌర్యప్రతాపాలూ, మహిమల గురించి విని ఉన్నారేమో, వారిని ఇప్పుడు చూడగానే ఆనందోత్సాహాలతో పెద్దపెట్టున అరిచారు.

బలరామకృష్ణులంటే దేనినయినా ఎవరినయినా ఎదుర్కొనగలరు. వారిద్దరూ తలచుకుంటే సాధ్యం కానిది లేదు. వారి గురించి కథలు కథలుగా విన్నాం. అవి కథలు కావని, నిజాలని ఇప్పుడు తెలుసుకోబోతున్నాం అనుకున్నారు.

కంసుని కనుసైగ అందుకున్నారు చాణూరముష్టికులు. బలరామకృష్ణులను మల్లయుద్ధానికి రమ్మని తొడలు చరిచారు. కంసుని చూశారు బలరామకృ ష్ణులు. బలాబలాలు తేల్చుకోండన్నట్టుగా కళ్ళెగరేశాడతను. తేల్చేస్తాం చూడు అంటూ బలరామకృష్ణులు ఒకరినొకరు నవ్వుతూ చూసుకున్నారు. కృష్ణుడు చాణూరుడుతోనూ, బలరాముడు ముష్టికునితోనూ పోరాడేందుకు బరిలోకి దిగారు. బలరామకృష్ణులు బాలకులు. బాలకులతో యోధుల యుద్ధమా? తప్పు, అధర్మం అంటూ గుసగుసలాడారు ప్రేక్షకులు. పువ్వుల్లాంటి బలరామకృష్ణులెక్కడ? కొండల్లాంటి చాణూరముష్టికులెక్కడ? యుద్ధం సరిసమానుల మధ్య జరగాలి. అలా కాకుండా పువ్వును కొండ డీకొనడం అన్యాయం. మేము ఒప్పుకోం అన్నారు ప్రేక్షకులు. అయితే వారి గొంతు గుండెల్లోనే ప్రతిధ్వనించింది తప్ప, బయటకు వినరాలేదు. దుర్మార్గుడు కంసుని ఎదిరించి మాట్లాడటమంటే మృత్యువును కౌగలించుకోవడమేనని ఊరుకున్నారంతా.

కృష్ణుడూ చారూణుల మధ్య, బలరాముడూ ముష్టికుల మధ్య మల్లయుద్ధం ప్రారంభ మయింది. ఒకరిని ఒకరు ఒడిసిపడుతున్నారు. తడిగుడ్డను పిండుతున్నట్టుగా భుజాలను పిండుకొంటున్నారు. ఎముకలు విరిగేట్టుగా మెలికలు తిరుగుతున్నారు. మునుపెన్నడూ ఇలాంటి యుద్ధాన్ని చూడలేదు మధురప్రజలు. విస్తుపోతున్నారంతా. మదపుటేనుగుల మీద సింహం పిల్లల్లా పడుతున్నారు బలరామకృష్ణులు. బాహాబాహీ ముష్టాముష్టీ యుద్ధం జరుగుతోంది. చాణూరుణ్ణి ఎత్తి కిందకి పడవేశాడు కృష్ణుడు. అలాగే ముష్టికుణ్ణి ముందుకు తోసి, అతని వీపునెక్కి మెడలు వంచసాగాడు బలరాముడు. చాణూరముష్టికుల బలాలు తగ్గుతున్నట్టనిపించి కంసుడూ, అతని అనుచరులూ కంగారుపడసాగారు. భయం కూడా కలిగింది వారికి. ప్రపంచప్రసిద్ధులు చాణూర ముష్టికులు. వారి పట్టునుంచి తప్పించుకోవడం అసాధ్యం. ఆ అసాధ్యాలను సుసాధ్యం

చేయసాగారు బలరామకృష్ణులు. కృష్ణుడి ముష్టిఘాతాలకు చాణూరుడూ, బలరాముని పిడికిటిపోట్లకు ముష్టికుడూ స్పృహ తప్పుతున్నట్టు అనిపించారు. అలసిపోయారిద్దరూ. రొప్పారు. అయినా ఆఖరి ప్రయత్నంగా మాయోపాయంతో బలరామకృష్ణులను మట్టుబెట్టాలని చూశారు. ఫలించలేదు. ఇక చాలు, యుద్ధానికి ముగింపు పలకాలనుకున్నారు బలరామకృష్ణులు. రెచ్చిపోయారిద్దరూ. మీది మీదికి వస్తున్న చాణూరుణ్ణి గట్టిగా పట్టుకుని బట్టలు ఉతికినట్టుగా కిందకేసి కొట్టసాగాడు కృష్ణుడు. మూడుసార్లు కొట్టాడలాగ. ఆ కొట్టుడికి పెద్దగా అరుస్తూ నెత్తురుకక్కుకుంటూ మరణించాడు చాణూరుడు. ముష్టికుణ్ణి కిందకు పడదోశాడు బలరాముడు. లేవకుండా వాడి మీద కొండలా కూర్చున్నాడు. పీకపట్టుకున్నాడు. రెండు చేతులా బలంగా పిసికాడు. అంతే! నాలిక వెలికొచ్చి ప్రాణాలు కోల్పోయాడు ముష్టికుడు. విజయం బలరామ కృష్ణులదవడంతో ప్రేక్షకులంతా ఒక్కసారిగా లేచి నిల్చుని హర్షధ్వానాలు చేశారు. నందాది గోపాలకుల, వ్రేపల్లె ప్రజల ఆనందానికి అంతులేకుండాపోయింది. బలరామకృష్ణులకు జయజయధ్వానాలు చేశారు. ఆ దృశ్యాలను చూసి తట్టుకోలేకపోయాడు కంసుడు. మిగిలిన మల్లయోధుల్ని కనుసైగ చేసి, బలరామకృష్ణుల మీద దాడి చేయమన్నాడు. రాజాజ్ఞ. మల్లయోధులు బలరామకృష్ణులపై దాడి చేశారు. క్రోధంతో రోషంతో రెచ్చిపోయారు. తనని ఎదుర్కొన్న శలుణ్ణీ, తోసలుణ్ణీ కృష్ణుడు చంపేశాడు. అలాగే బలరాముడు తనని ఎదుర్కొన్న కూటుడనే వాణ్ణి సంహరించాడు. ఇంకా ఎవరున్నారు? ఎవరొస్తారు యుద్ధానికి అన్నట్టుగా బరికి ఆవల నిల్చున్న యోధుల్ని చూశారు బలరామకృష్ణులు. ఆ చూపునకే భయపడి పారిపోయారు యోధులు.

## కంసవధ

బలరామకృష్ణులను మట్టుబెడతారనుకున్న మహామహామల్లయోధులు మరణించారు. మరికొందరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగుదీశారు. ఆగండి ఆగండి అని హెచ్చరించినా నిలువలేదెవరూ. దాంతో కంసుడికి గుండెలు జారిపోయాయి. పంచప్రాణాలనూ ఒకటొకటిగా కోల్పోతున్నట్టనిపించింది. జరిగిందంతా కలా? నిజమా? బాలకులు బలరామకృష్ణులేమిటి, మహా మహా యోధుల్ని మట్టి కరిపించడం ఏమిటి? అంతుచిక్కలేదేదీ కంసునికి. వణకిపోయాడతను. ఏం చెయ్యాలో పాలుపోక బాధగా భారంగా కళ్ళు మూసుకున్నాడు. రాజు అలా సింహాసనంలో ఆలోచనామగ్నుడు అవడంతో అనుచరులంతా గగ్గోలుగా లేచి నిల్చున్నారు. మహారాజా! మహారాజా అంటూ ఆందోళన చేశారు. అప్పుడు కళ్ళు తెరిచాడు కంసుడు. తేరుకున్నాడు. అనుచరులను ఇలా ఆజ్ఞాపించాడు.

''బలరామకృష్ణులను బంధించండి. చుట్టుముట్టి వారిని సంహరించండి. నందగోపుణ్ణి కూడా వదలొద్దు. అతన్ని కూడా పట్టుకోండి. అలాగే ప్రేక్షకులుగా తరలివచ్చిన యాదవుల్ని బంధించి, వారి వద్ద ధనాన్ని కొల్లగొట్టండి. ''

కంసుని మాటల్ని ఖండిస్తూ లేచి నిల్చున్నాడు ఉగ్రసేనుడు.

''అన్యాయం. అధర్మం'' అన్నాడు.

''చేసిన పాపాలు చాలవా? ఆనాడు బావను బంధించే ఇంతదాకా తెచ్చుకున్నావు. నా మాట విను, అనుచరుల్ని వెనక్కి తగ్గమను. ఉత్సవాన్ని చూడవచ్చినవారి మీద చేయి చేసుకోవడం

తప్పు నాయనా, పాపం కూడ'' అన్నాడు ఉగ్రసేనుడు. తండ్రి తనని ఎదిరించి మాట్లాడడాన్ని తట్టుకోలేకపోయాడు కంసుడు. కోపం వచ్చిందతనికి. గట్టిగా అరిచాడిలా.

''వసుదేవుని పక్షపాతి, నా తండ్రి ఉగ్రసేనుణ్ణి కూడా బంధించండి.''

''అది అసాధ్యం. మా ప్రాణాలు పణం పెట్టి ఉగ్రసేన మహారాజుని కాపాడుకుంటాం'' అన్నారు ఆయన అనుచరులు. కత్తులు దూశారు.

''ముందు ఈ అనుచరుల్ని వధించండి.'' ఆజ్ఞాపించాడు కంసుడు.

అటు ఉగ్రసేన అనుచరులూ, ఇటు కంసుని అనుచరులూ, వారి మీద బలరామకృష్ణులు, రంగస్థలం అంతా యుద్ధరంగమయింది. ఎవరు ఎవరిని సంహరిస్తున్నదీ తెలియకుండాపోయింది. ఇక ఉపేక్షించరాదనుకున్నాడు కృష్ణుడు. కంసవధ జరిగితీరాలనుకున్నాడు. పరమదుర్మార్గుడు కంసుణ్ణి చంపి, ముల్లోకాలకూ సంతోషం కలిగించాలనుకున్నాడు. చూశాడు అటు వైపుగా. సింహాసనం మీద దర్పంగా కూర్చున్న కంసుడు కనిపించాడతనికి. మామా అంటూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ అటుగా నడిచాడు. వేదికను అధిరోహించసాగాడు. ఒకొక్కమెట్టూ ఎక్కి వస్తున్న కృష్ణుణ్ణి చూశాడు కంసుడు. మృత్యువు వస్తున్నట్టనిపించిందతనికి. ఎదుర్కోవాలను కున్నాడు. పక్కనున్న కత్తీ, డాలూ అందుకున్నాడు. దగ్గరగా వచ్చిన కృష్ణుని మీదకు దాడికి దిగాడు. కత్తి విసిరాడు కృష్ణుని మీదకి. తప్పించుకున్నాడతను. మళ్ళీ విసిరాడు. తప్పించుకున్నాడు కృష్ణుడు. అదను చూసి అమాంతం ఒడిసిపట్టుకున్నాడు కంసుణ్ణి. కాలెత్తి అతని శిరసున తన్నాడు. కృష్ణుని కాలిదెబ్బకి కంసుని రత్నకిరీటం ఎగిరిపడింది. అల్లంతదూరంలో కిందపడి నేలపాలయింది. కిరీటం నుండి రత్నాలు చెల్లాచెదురయినాయి. అటుగా చూసి ఆశ్చర్యపోతున్నాడు కంసుడు. అదే అవకాశంగా కంసుణ్ణి వేదిక మీద నుంచి కిందికి బలంగా తోశాడు కృష్ణుడు. కిందపడి దొర్లుకుంటూ నేలను కరిచాడు కంసుడు. అతనిలో శక్తి క్షీణించింది. పరాక్రమం పారిపోయింది. తేజస్సు అంతరించింది. కృష్ణుడు అతని మీద సింహంలా పడ్డాడు. మర్మస్థానాలన్నిటా బలంగా కాళ్ళతో తన్నాడు. నొప్పిని భరించలేకపోయాడు కంసుడు. బాధగా కేకలు వేశాడు. అలా కేకలు వేసి వేసి ఆగిపోయాడు. ఆఖరికి చనిపోయాడు. చనిపోయిన కంసుని కాళ్ళు పట్టి గిరగిరా తిప్పాడు కృష్ణుడు. వేగంగా తిప్పి తిప్పి విసిరేశాడు. కంసుడు కోట గోడకి కొట్టుకున్నాడు. తల పగిలింది. పడిపోయాడక్కడ. దేవతలు సంతోషించారప్పుడు. కృష్ణునిపై పుష్పవర్షం కురిపించారు. బ్రహ్మరుద్రాదులు కీర్తించారతన్ని.

## బలరామకృష్ణుల విద్యాభ్యాసం

ఆకాశం నుంచి కురుస్తున్న పుష్పవర్షానికీ, వినవస్తున్న జయజయ ధ్వానాలకీ కంసుని భటులూ, అనుచరులూ భయపడ్డారు. పారిపోయారు అక్కణ్ణుంచి.

కంసుని తమ్ములు కంకన్య క్రోధకాదులు ఎనిమిదిమంది బలరామకృష్ణులపై యుద్ధానికి దిగారు. కృష్ణుడు కోపంగా ముందుకు ఉరకబోతుంటే వారించాడతన్ని బలరాముడు. ఒక్కడే ఎదిరించాడు వారిని. పెద్ద ఇనుపగుదియ తీసుకుని, దానితో మోది మోది చంపేశాడు అందరినీ. కంసుడు చనిపోయాడు, అతని తమ్ములు కూడా చనిపోయారని తెలుసుకున్న వారి భార్యలంతా

అంతఃపురాన్ని వీడి యుద్ధప్రాంగణానికి పరుగు పరుగున వచ్చారు. భోరుభోరున విలపించారు. శవాలపైపడి, దిక్కెవరంటూ శోకించసాగారు. వారలా శోకిస్తోంటే బలరామకృష్ణులకు బాధకలిగింది. జాలి వేసింది. ఓదార్చారు వారిని. మంచిమాటలు చెప్పి, అంతఃపురానికి తిరిగి పంపించారు వారిని.

దగ్గరుండి కంసునికీ, అతని తమ్ములకీ అంత్యక్రియలు నిర్వహించారు బలరామకృష్ణులు. కంసుని మరణానికి ఇటు యాదవులేకాదు, అటు మధురాపురవాసులు కూడా ఎంతగానో సంతోషించారు. శాంతించారంతా.

## రాజ్యాధికారం

తండ్రి మరణానంతరమో, లేదంటే తండ్రి రాజ్యత్యాగం చేసి, తపోవనాలకు తరలిపోతేనో కొడుకుల్లో పెద్దవాడు రాజ్యాధికారం చేపట్టడం సంప్రదాయం. అయితే కంసుని తండ్రి ఉగ్రసేనుడు మరణించలేదు. రాజ్యత్యాగం చేసి అతను తపోవనాలకు తరలిపోలేదు. మరి, కంసుడు రాజెలా అయ్యాడంటే... తండ్రిని చెరశాలలో బంధించి మరీ రాజయ్యాడు. ఉగ్రసేనుడు ధర్మాత్ముడు. పైగా యాదవపక్షపాతి. ఆ రెండు లక్షణాలూ తండ్రిలో కంసునికి నచ్చలేదు. ఆ లక్షణాలతో అడుగడుగునా తండ్రి అడ్డుపడతాడని తెలిసి కంసుడు అతన్ని బంధించాడు. కంసుని మరణానంతరం బలరామకృష్ణులు తాతని బంధవిముక్తుణ్ణి చేశారు. అతనినే మళ్ళీ రాజుని చేశారు. ఎప్పుడయితే ఉగ్రసేనుడు మళ్ళీ రాజయ్యాడో అప్పుడు యదు, వృష్ణివంశీయులంతా మధురకు తిరిగి వచ్చారు. అంతకు ముందు వారంతా కంసునికి భయపడి, మధురను వీడి పారిపోయారు. ఇప్పుడు కావాల్సినవాళ్ళంతా కలుసుకున్నారు. హాయిగా జీవించసాగారు.

బలరామకృష్ణులు తమ తల్లిదండ్రులు దేవకీవసుదేవుల్ని కూడా చెరనుండి విడిపించారు. వారి పాదాలపై పడి నమస్కరించారు.

''మీ కొడుకులుగా జన్మించినా మీ ఆదరాభిమానాలకు మేము నోచుకోలేదు. కంసుడే దీనికి కారణం. ఇప్పుడు ఆ పాపాత్ముడు లేడు, మరణించాడు. మీరెలాంటి భయాలకూ లోనుకానక్కర లేదు. తల్లిదండ్రుల ఋణం తీరనిది అంటారు. మీకు సేవలు చేసి, ఆ ఋణాన్ని తీర్చుకునే అవకాశం మాకు కలుగజేయండి'' అన్నారు బలరామకృష్ణులు. వారి మాటలకు దేవకీవసుదేవులు ముచ్చటపడ్డారు. పిల్లలిద్దరినీ ఆనందబాష్పాలతో దగ్గరగా తీసుకున్నారు. గట్టిగా కౌగిలించు కున్నారు.

తల్లిదండ్రుల దగ్గర బలరామకృష్ణులు కొంతకాలం ఉంటారని నందుడు తెలుసుకున్నాడు. ఆ మాటను యశోదకూ, రోహిణికీ చెప్పాడు. విన్నంతనే కన్నీరు పెట్టుకున్నారిద్దరూ. పెంచిన ప్రేమతో వారిని విడచి క్షణం కూడా ఉండలేమన్నారు. బలరామకృష్ణులను సమీపించారు.

కిష్టయ్యా! మమ్మల్ని కాదంటావా? అడిగారు.

బలరామా! మమ్మల్ని వేరు చేస్తున్నావా? అని బాధపడ్డారు. లేదన్నారు బలరామకృష్ణులు. కొన్నాళ్ళు మధురలో ఉండి, తిరిగి వ్రేపల్లెకు వస్తామన్నారు. వెళ్ళిరండి అని పేరు పేరునా గోపకులుసహా అందరికీ వీడుకోలు పలికారు. రోహిణి, యశోదానందులను వ్రేపల్లెకు సాగనంపారు.

## గురుదక్షిణ

బలరామకృష్ణులకు సకల విద్యలూ నేర్పించాలనుకున్నాడు వసుదేవుడు. ముందుగా పురోహితుడు గర్గాచార్యుణ్ణి రప్పించాడు. శాస్త్రోక్తంగా పిల్లలిద్దరికీ ఉపనయనం జరిపించాడు. గర్గాచార్యుడు గాయత్రిమంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని పఠించి, విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు బలరామకృష్ణులు. అవంతీపురం చేరుకుని, మహావిద్వాంసుడు సాందీపుణ్ణి ఆశ్రయించారు. గురుకులవాసం చేశారక్కడ. నిరంతరం శుశ్రూషలు చేసి, గురువు అనుగ్రహాన్ని సంపాదించారు. సమస్త విద్యలూ అభ్యసించారు. పూర్వపుణ్యఫలంగా భగవంతుడికి సాందీపుడు ఆచార్యుడయ్యే అవకాశం లభించింది. ఆయన వేదవేదాంగాలూ, సకల ధర్మశాస్త్రాలూ బలరామకృష్ణులకు బోధించాడు. ధనుర్వేదాన్ని ఆమూలాగ్రం ఉపదేశించాడు. నీతిశాస్త్రం అభ్యసింపజేశాడు. శిష్యులిద్దరూ ఏకసంతాగ్రాహులు. గురువు చెప్పడమే ఆలస్యం, నేర్చుకునేవారు. అరవైనాలుగు విద్యలూ అభ్యసించి, సకలవిద్యా పారంగతులయ్యారు బలరామ కృష్ణులు. ఇక్కడే పేద బ్రాహ్మణ బాలుడు కుచేలుడు కూడా చదువుకున్నాడు. కృష్ణుడు అంటే అతనికి చెప్పలేనంత అభిమానం. అలాగే కుచేలుడంటే కూడా కృష్ణునికి చాలా అభిమానం.

విద్యాభ్యాసం పూర్తి అయింది. బలరామకృష్ణులు గురువుకి పాదాభివందనం చేశారు. గురుదక్షిణగా ఏది కావాలో కోరుకోమన్నారు. బలరామకృష్ణులు సామాన్యులు కారు.



లోకోత్తరపురుషులు. వారిని కోరాల్సిందే కోరాడు సాందీపుడు. చనిపోయిన తన కుమారుణ్ణి తెచ్చి ఇవ్వమని కన్నీరుపెట్టుకున్నాడు. పుత్రశోకంతో కన్నీరుమున్నీరవుతున్న భార్య వేడుకోలు మేరకే పుత్రభిక్షపెట్టమని అర్థించాడతను. విద్యాభ్యాసం ముగిసిన తర్వాత గురుదక్షిణ చెల్లించాలి. అది ఆనాటి సంప్రదాయం. అసాధ్యం అని తెలిసినా చెల్లించి తీరాల్సిందే! గురువు కోరికను తప్పకుండా చెల్లిస్తామన్నారు బలరామకృష్ణులు. బయల్దేరారు అక్కణ్ణుంచి.

ఒకనాడు సాందీపుని కుమారుడు సముద్రస్నానానికి వెళ్ళాడు. ప్రభాతతీర్థం అన్నచోట స్నానం చేస్తుండగా పెద్దకెరటం వచ్చి కొట్టిందతన్ని. సముద్రంలో మునిగిపోయాడు. మునిగిపోయిన అతన్ని పంచజనుడు అనే రాక్షసుడు మింగేశాడు.

గురుదక్షిణ చెల్లించే ప్రయత్నంలో ముందుగా సముద్రతీరానికి చేరుకున్నారు బలరామ కృష్ణులు. ప్రభాసతీర్థం ముందు నిల్చున్నారు. సముద్రుణ్ణి పిలిచారు. పిలిచిన వెంటనే ప్రత్యక్షమయ్యాడు సముద్రుడు. చేతులు జోడించి నమస్కరించి నిల్చున్నాడు.

''మా గురువు సాందీపుని కుమారుణ్ణి ప్రసాదించు.'' అడిగారు బలరామకృష్ణులు.

''అసాధ్యం''అని విన్నవించుకున్నాడు సముద్రుడు. తర్వాత అసలు సంగతి చెప్పాడు. సాందీపుని కుమారుణ్ణి రాక్షసుడు పంచజనుడు మ్రింగేశాడని, ఎవరికీ చిక్కకుండా నీటిలో దాగున్నాడని చెప్పాడు. సముద్రుడు చెప్పడమే ఆలస్యం బలరామకృష్ణులిద్దరూ సముద్రంలో మునిగి పంచజనుడి కోసం వెదికారు. కనిపించాడతను. యుద్ధం చేశారతనితో. పొట్ట చీల్చి చంపేశారతన్ని. గురుపుత్రుని కోసం పొట్టలో వెదికారు. కనిపించలేదు. అయితే పంచజనునితో పాటుగా పుట్టి, అతని కడుపులో పెరిగి ఉన్న దివ్యశంఖం ఒకటి కనిపించింది. దానిని కృష్ణుడు అందుకున్నాడు. పంచజనుడి దేహం నుండి పుట్టింది కాబట్టి ఆ శంఖాన్ని 'పాంచజన్యం' అన్నారు. పంచజనుడి గర్భంలో గురుపుత్రుడు లేడంటే తప్పకుండా అతను యమలోకానికి చేరుకుని ఉంటాడని భావించారు. అక్కడికి చేరుకున్నారు బలరామకృష్ణులు. యమలోకంలో ప్రవేశిస్తూనే కృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. ఆ శబ్దానికి సమస్తలోకాలూ దద్దరిల్లాయి. యముడు భయపడ్డాడు. పరుగున వచ్చి బలరామకృష్ణుల ముందు చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

''ఆజ్ఞ'' అన్నాడు.

''మా గురువు సాందీపుని పుత్రుడు కావాలి. తెచ్చివ్వు'' అడిగారు. సరేనని యముడు, మరణించిన ఆ పుత్రుణ్ణి బ్రతికించి అందజేశాడు వారికి. ఆ పుత్రుణ్ణి వెంటబెట్టుకుని, ఆశ్రమానికి చేరుకున్నారు బలరామకృష్ణులు. గురువుని సమీపించి, గురుదక్షిణగా పుత్రుణ్ణి అతనికి సమర్పించారు. సాందీపుడు ఎంతగానో సంతోషించాడప్పుడు. ఆనందబాష్పాలతో శిష్యులను ఆశీర్వదించాడు. గురువు దగ్గర శలవు తీసుకుని మధురానగరానికి చేరుకున్నారు బలరామ కృష్ణులు.

## ఉద్ధవుడు

శ్రీకృష్ణుని ఆరాధించిన వారిలో ఉద్ధవుడు కూడా ఒకడు. అతడు వృష్ణివంశానికి చెందిన వాడు. దేవభాగుని కుమారుడు. ఉద్ధవుడూ, కృష్ణుడూ మంచిమిత్రులు. ఉద్ధవుడు తన ఆంతరంగికుడు అని కృష్ణుడు ఎందరికో చెప్పాడు. చేతలతో నిరూపించాడు కూడా.

అయిదేళ్ళ వయసులోనే ఉద్ధవునికి శ్రీహరి అంటే భక్తి కలిగింది. ఆ భక్తి కారణంగానే ఎవరికీ బోధించని జ్ఞానాన్ని శ్రీకృష్ణుడు ఉద్ధవునికి బోధించాడు. ఉద్ధవుడు బుద్ధిశాలి. కార్యసాధనలో అతన్ని మించినవాడు లేడు. యాదవులంతా మరణించిన తర్వాత కూడా ఉద్ధవుడు ఒక్కడే జీవించి ఉండగలిగాడు. అలా ఉండగలిగాడంటే అతనెంత గొప్పవాడో అర్థం చేసుకోవచ్చు.

కృష్ణుడు మధురలో ఉన్నప్పుడు ఉద్ధవుణ్ణే అనేక కార్యాలలో ప్రముఖుణ్ణి చేశాడు. వ్రేపల్లెకు పోయి అక్కడి వారి క్షేమసమాచారాలు కనుక్కొని రమ్మన్నది ఉద్ధవుణ్ణే! కృష్ణుని మాటను కాదనలేదు ఉద్ధవుడు. వ్రేపల్లెకు బయల్దేరాడు. యశోదానందులనూ, యాదవప్రముఖులనూ కలసి వారి క్షేమసమాచారాలు సేకరించాడు. కృష్ణుని ఎడబాసి విరహతాపంతో తల్లడిల్లుతున్న గోపికలకు కృష్ణ సందేశాన్ని వినిపించాడు ఉద్ధవుడు. ఆ సందేశంతో వారు చల్లబడ్డారు. ఈ గోపికల విరహవేదనే 'భ్రమరగీతికలు' అయ్యాయి. ఉద్ధవుణ్ణి చూస్తే, అతనితో సంభాషిస్తే కృష్ణుణ్ణి చూసినట్టుగా ఉండేది గోపకులకూ, గోపికలకూ. కుబ్జ కోరిక తీర్చేందుకు ఆమె ఇంటికి వెళ్ళినప్పుడు కూడా కృష్ణుని వెన్నంటే ఉన్నాడు ఉద్ధవుడు. బలరామకృష్ణులు ఉద్ధవుణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళే అక్రూరుని ఇంటి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

అక్రూరుడు మహా కృష్ణభక్తుడు. కృష్ణుడు అతన్ని అనుగ్రహించిన కారణంగానే అతను 'అక్రూరవరదుడు' అయ్యాడు.

• • •

కిందమముని శాపకారణంగా పాండురాజు వైరాగ్యంలో మునిగిపోయాడు. శతశృంగానికి చేరుకున్నాడు. వద్దువద్దన్నా భార్యలు కుంతీ, మాద్రి అతన్ని అనుసరించారు. పాండవులు జన్మించారప్పటికే.

ఒకనాడు మాద్రిని చూసి కామమోహితుడయ్యాడు పాండురాజు. ఆమెను కూడి, మరణించాడు. పాండురాజు మరణానికి కారణం కిందమముని శాపమే! కిందమముని, అతని భార్య జింకల రూపం ధరించి క్రీడిస్తోంటే, అవి నిజమయిన జింకలనుకుని, ఆడజింకను బాణంతో గురి చూసి కొట్టి, చంపాడు పాండురాజు. మగజింకగా కిందమముని అందుకు కోపించాడు.

''రాజా! ఇదే నా శాపం. నువ్వు నీ ప్రియురాలిని కలసిన మరుక్షణం మరణిస్తావు'' అన్నాడు. శాపం ఫలించింది. పాండురాజు మరణించాడు. అతనితో పాటు మాద్రి సహగమనం చేసింది. కుంతి కూడా సహగమనం చేయాల్సిందేకాని, పిల్లల్ని పెంచే బాధ్యత స్వీకరించడంతో మానుకుందామె. భర్త మరణించడంతో పిల్లల్ని తీసుకుని హస్తినాపురానికి చేరుకున్నది కుంతి. తమ్ముడు పిల్లలు తనని ఆశ్రయించడం ఇష్టం లేకపోయింది ధృతరాష్ట్రునికి. దుర్యోధనాదులు పాండవుల మీద పదేపదే చాడీలు చెప్పడంతో అతను అలా తయారయ్యాడు. కౌరవులు పెడుతున్న కష్టాలు భరిస్తూ, అవమానాలు తట్టుకుంటూ పాండవులు బతుకీడుస్తున్నారు. కృష్ణునికి కుంతి మేనత్త. పాండవులు మేనత్త పిల్లలు. వారు హస్తినాపురంలో పడరాని పాట్లు పడుతున్నారని తెలిసి బాధపడ్డాడు కృష్ణుడు. వారు ఎలా ఉన్నదీ విచారించి రమ్మని అక్రూరుణ్ణి హస్తినకు పంపించాడు కృష్ణుడు.

హస్తినకు చేరుకున్న అక్రూరుడు, కుంతినీ, పాండవులనూ కలిశాడు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నాడు. మీ వెనుక కృష్ణుడు ఉన్నాడంటూ ధైర్యాన్ని కలిగించాడు వారికి. ఓదార్చాడు.

తర్వాత ధృతరాష్ట్రుణ్ణి కూడా కలిశాడతను. హితవు చెప్పాడతనికి. కొడుకుల మాట విని తప్పుదోవలో పోవద్దన్నాడు. తండ్రిలేని పిల్లలు. తమ్ముణిపిల్లలు అని పాండవులను చూసి జాలిచెందమన్నాడు. పాండవులకు న్యాయంగా చెందాల్సిన రాజ్యభాగాన్ని ఇచ్చి, వారిని ఆదరించమన్నాడు. అక్రూరుని మాటల వెనుక అదృశ్యంగా కృష్ణుడు ఉన్నాడన్నది ధృతరాష్ట్రుడు అర్థం చేసుకున్నాడు. రానున్న మహాభారత యుద్ధానికి ఆనాడే బీజం పడింది. భారతయుద్ధంలో కృష్ణుడిదే ప్రముఖపాత్ర. ఆ పాత్ర అలా కురుపాండవ రణక్షేత్రంలోకి ప్రవేశించింది.

# జరాసంధునితో బలరామకృష్ణుల యుద్ధం

అస్తి, ప్రాప్తి అని కంసునికి ఇద్దరు భార్యలు. వారిద్దరూ మగధదేశాధిపతి జరాసంధుని కుమార్తెలు. జరాసంధుడు గొప్ప బలవంతుడు. అతని దగ్గర లెక్కకు మిక్కిలిగా సైన్యం ఉంది. యుద్ధంలో అతనిని జయించడం అసాధ్యం. అందుకే చుట్టుపక్కల రాజులంతా అతనికి దాసోహం అన్నారు.

కంస వధానంతరం అస్తి, ప్రాప్తి పుట్టింటికి చేరారు. తండ్రికి తమ బాధనంతా వెళ్ళబోసుకు న్నారు. తమ వైధవ్యానికి కృష్ణుడే కారణం అన్నారు. ఏడ్చారు. కూతుళ్ళు అలా ఏడుస్తోంటే తట్టుకోలేకపోయాడు జరాసంధుడు. కృష్ణుడు అంటే కోపాన్ని పెంచుకున్నాడు. అంతకు ముందే కృష్ణుడంటే జరాసంధుడికి పడదు. అల్లుడి శత్రువు తనకూ శత్రువే మరి! ఇప్పుడు పిల్లల మూలంగా ఆ శత్రుత్వాన్ని మరింతగా పెంచుకున్నాడు. బలరామకృష్ణుల్ని చంపితీరాలనుకున్నాడు. యుద్ధానికి సైన్యాన్ని సిద్ధం చేశాడు. ఇరవై మూడు అక్షౌహిణి (అక్షౌహిణి అంటే 21,780 రథాలు, అంతే సంఖ్యగల ఏనుగులు, 65,610 గుర్రాలు, 1,09,350 మంది సైనికులు)లతో మధురానగరంపైకి దండెత్తాడు. సముద్రంలా పొంగుతున్న సైన్యాన్ని చూసి, ప్రజలు భయడ్డారు. పరుగు పరుగున వెళ్ళి బలరామకృష్ణులను శరణు కోరారు. ప్రజలకు అభయాన్నిచ్చారు బలరామకృష్ణులు. జరాసంధుణ్ణి ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు.

బలరామకృష్ణులు ఇప్పుడు పిల్లలు కాదు, యువకులు. సకల విద్యలూ తెలిసినవారు. అస్త్రవిద్యలో ఇద్దరూ ఆరితేరారు. వారి దగ్గర దివ్యరథాలు ఉన్నాయి. అనేక అస్త్రశస్త్రాలు ఉన్నాయి. ఇంకెందుకు భయం? జరాసంధుని మీద యుద్ధాన్ని ప్రకటించారు. కవచాలు ధరించారిద్దరూ. ధనుర్బాణాలు చేతపట్టారు. దివ్యరథాలెక్కి యుద్ధరంగానికి బయల్దేరారు. అలా బయల్దేరిన బలరామకృష్ణులు అరివీరభయంకరులనిపించారు. కృష్ణుడికి దారకుడు సారథ్యం వహించాడు. యుద్ధరంగంలోకి ప్రవేశించిన కృష్ణుడు, గట్టిగా పాంచజన్యాన్ని పూరించాడు. ఆ శంఖధ్వనికి జరాసంధుడు ఉలిక్కిపడ్డాడు. భయం అనేది ఎరుగని అతడు, తొలిసారిగా భయపడ్డాడు. సైన్యం కూడా భయపడింది. ఏనుగులూ, గుర్రాలూ వెనకడుగు వేశాయి. వెనకడుగు వేసిన సైన్యాన్ని ముందుకు రారమ్మంటూ జరాసంధుడు, బలరామకృష్ణులతో తలపడ్డాడు. గొప్పయుద్ధం చేశాడు. యదువీరులను మగధసైన్యాలు నిలువరించలేకపోయాయి. జరాసంధుడు కూడా బలరామ కృష్ణుల ముందు నిలువలేకపోయాడు. అతని అస్త్రశస్త్రాలేవీ కృష్ణుని గాయపరచలేకపోయాయి. ఎంత ప్రోత్సహించినా సైన్యం నిలువలేకపోయింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగు

దీసింది. సాహసించి ముందుకు ఉరికిన వారంతా హతమయిపోయారు. బలరామకృష్ణుల ముందు ఇన్ని అక్షౌహిణిల బలగం ఏమీ కాకుండాపోయింది. యుద్ధరంగాన ఒక్కరూ మిగల్లేదు. చనిపోయారంతా. జరాసంధుడు ఓడిపోయాడు. వరుణపాశాలతో జరాసంధుణ్ణి బంధించాడు బలరాముడు. అతన్ని హతమార్చేందుకు హలాయుధాన్ని ఎత్తాడు. వారించాడు కృష్ణుడతన్ని.

''వద్దు అన్నయ్యా, చంపొద్దు. వదిలేయి. ఈ జరాసంధుడు ప్రాణాలతో ఉండడం చాలా అవసరం. ఎందుకు అవసరమో నీకు తర్వాత తెలుస్తుంది'' అన్నాడు కృష్ణుడు. ఎత్తిన హలాయుధాన్ని కిందకు దించమన్నాడు. ఒప్పుకోనన్న బలరాముణ్ణి ఒప్పించాడు. ప్రాణభిక్ష పెట్టినట్టుగా జరాసంధుణ్ణి వదిలేశాడు.

భీముని చేతిలో జరాసంధుడు మరణించాలి. ఆ మరణం కౌరవులకు కనువిప్పు కావాలి. కనువిప్పు అయితే కురుపాండవ సంగ్రామాన్ని నిలువరించవచ్చని కృష్ణుని ఆశ. అయితే ఆ ఆశ నిరాశ అయింది. అది వేరే సంగతి. జరాసంధుని మీద విజయం సాధించినందుకు మధురా పురవాసులూ, యాదవులూ బలరామకృష్ణులను అభినందించారు. పెద్ద ఎత్తున పండుగ చేశారు.

యుద్ధంలో ఓడిపోవడం జరాసంధుడికి అదే మొదటిసారి. మహాయోధుడు అయి ఉండి, లక్షలాది సైన్యాన్ని వెంటబెట్టుకుని వెళ్ళి కూడా ఓడిపోయాడంటే జరిగింది కలా? నిజమా? అనిపించిందతనికి. యువకులు బలరామకృష్ణుల చేతిలో ఓడిపోవడం అవమానం అనిపించింది. కుంగిపోయాడతను. రాజ్యపాలనలో ఆసక్తి నశించింది. అన్నపానాల మీద అరుచి పుట్టింది. అన్నిటా విరక్తి కలిగింది. తపోవనాలకు తరలిపోదామనుకున్నాడు. బంధు మిత్రులను పిలిచి, వారికి మనసులోని మాట చెప్పాడు. తప్పు అన్నారు వారు. జయాపజయాలు దైవాధీనాలని చెప్పారు. ఊరడించారు. సమయం చూసి శత్రువుని మట్టుబెట్టాలని హితవు చెప్పారు. సమయం కోసం వేచి చూస్తూ జరాసంధుడు సైన్యాలని సమాయత్తం చేశాడు. ఇదే సమయం అనుకున్నప్పు డల్లా మధుర మీద, కృష్ణుడిమీద దండెత్తాడు. అలా పదిహేడుసార్లు దండెత్తాడతను. ప్రతిసారీ ఇరవైమూడు అక్షౌహిణిలకు తక్కువగాకుండా సైన్యాన్ని వెంటబెట్టుకుని మరీ వెళ్ళేవాడు. అయితే ఈ పదిహేడుసార్లూ ఓడిపోయాడు. పద్దెనిమిదోసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడిపోకూడదను కున్నాడు జరాసంధుడు. కృష్ణుడు మీదకి దండెత్తేందుకు సర్వసన్నాహాలూ చేసుకోసాగాడు. ఇదిలా ఉండగా మధురకు మరో ముప్పు ఏర్పడింది. కాలయవనుడు మూడుకోట్లమంది సైన్యంతో మధుర మీద యుద్ధాన్ని ప్రకటించాడు. అదే సరయిన సమయం అనుకున్నాడు జరాసంధుడు. అతడూ మధుర మీదకి దండెత్తి వచ్చేందుకు సిద్ధమయ్యాడు. అటు కాలయవనుడు, ఇటు జరాసంధుడు...యాదవులకు ఏమీ పాలుపోలేదు. పెద్ద ఇబ్బందిలో పడ్డారు. బలరామకృష్ణులను ఆశ్రయించారు.

## కాలయవనుడు

కాలయవనుడుకి సంబంధించి ఓ కథ ప్రచారంలో ఉన్నది. పూర్వం యాదవులు మదోన్మాదంతో తమ కులగురువు గర్గుని అవమానించారు. ఆ అవమానానికి ఎంతగానో బాధపడ్డాడతను. యుద్ధంలో యాదవులను ఓడించగల కొడుకు కోసం శివుణ్ణి ప్రార్థించాడు. తపస్సు చేయసాగాడు. యవనరాజుకి గర్గుని సంగతి తెలిసింది. తపస్సును భగ్నం చేస్తూ అతనిని



ఆలమంద మధ్య ఉంచమన్నాడు. చెప్పింది చేశారు సైన్యం. ఆలమంద మధ్య అద్భుతంగా మెరసిపోతున్న గర్గుని చూసిందో అప్సరస. అతన్ని కామించింది. గర్గుని కూడిన ఫలితంగా ఆమె ఓ కుమారుణ్ణి కన్నది. ఆ కుమారుణ్ణి యవనరాజు పెంచి పెద్ద చేశాడు. అతనే కాలయవనుడు. మిక్కిలి బలాఢ్యుడతను. ప్రపంచంలో తనను జయించే వారు లేరని అతనికి గర్వం. ఆ గర్వంతో ఎవరినీ లెక్క చేసేవాడు కాదు. వాణ్ణి నశింపజేయాలనుకున్నాడు నారదమహర్షి. ఒకనాడు అతన్ని సమీపించాడు.

''నీకు ఈ సంగతి తెలుసా? జరాసంధుణ్ణి శ్రీకృష్ణుడు ఓడించాడు'' చెప్పాడు.

అయితే ఏమిటి? అన్నట్టుగా చూసిన కాలయవనుడితో మళ్ళీ ఇలా అన్నాడు నారదుడు.

''యవనా! కృష్ణుణ్ణి జయిస్తేనే నువ్వు బలవంతుడి కింద లెక్క. అతన్ని జయించు, చూద్దాం.''

''చూడయితే'' అన్నాడు కాలయవనుడు. మూడుకోట్లమంది మ్లేచ్ఛసైన్యాన్ని తీసుకుని మధుర మీదకి దండెత్తాడు. ఇదే అదను అనుకుని అటు జరాసంధుడు కూడా దండెత్తి వచ్చేందుకు

సిద్ధమయ్యాడు. యాదవులు ఊహించని సంకటస్థితి. బలరామకృష్ణులను సమీపించారంతా. చేతులు జోడించి, తక్షణ కర్తవ్యం సెలవీయమన్నారు. కళ్ళు మూసుకున్నాడు కృష్ణుడు. ఆలోచించసాగాడు. ఇద్దరు బలవంతుల్ని ఏకకాలంలో ఎదుర్కోవడం కష్టం. ఒకవేళ ఎదుర్కొంటే అటో ఇటో ఓడిపోక తప్పదు. తాము ఓటమి చెందకూడదనుకున్నాడు. చక్కని ఉపాయం ఆలోచించాడు. శత్రువులకు దుర్భేద్యంగా సముద్రంలో ఓ మహానగరం నిర్మించి, అక్కడకి మధురాపురవాసులను తరలించడం క్షేమం అనుకున్నాడు. అనుకున్నదే ఆలస్యం, వెంటనే విశ్వకర్మను ఆహ్వానించాడు. వచ్చాడతను. అతనికి తన అభిమతాన్ని తెలియజేశాడు కృష్ణుడు. సాక్షాత్తు భగవంతుడే ఆజ్ఞాపించాడు. కాదంటాడా విశ్వకర్మ. పని కాకపోతుందా? క్షణాల మీద సముద్రమధ్యంలో పన్నెండు ఆమడల వైశాల్యంతో ఒక మహానగరాన్ని నిర్మించాడు విశ్వకర్మ. వాస్తురీత్యా కోటలు, రాజవీధులు, భవనాలు, చాతుర్వర్ణాలవారికీ తగినట్టుగా గృహాలు నిర్మించి, సకల సౌకర్యాలు చేకూర్చాడు. మణిమయ గోపురాలతో, సువర్ణ ప్రాసాదాలతో, ఉద్యానవనాలతో, జలాశయాలతో మరో వైకుంఠంలా శోభిల్లింది నగరం. దానికి 'ద్వారక' అని పేరు పెట్టాడు కృష్ణుడు. నగరప్రవేశం చేశాడు. ఆ శుభసందర్భంలో దిక్పాలకులు అతనికి వారి వారి వైభవాలకు తగినట్టుగా కానుకలు పంపారు. ఇంద్రుడయితే 'సుధర్మ' అని పేరుగల సభాభవనాన్నే కృష్ణునికి సమర్పించాడు. ఒళ్ళంతా తెలుపు, ఒక చెవి మాత్రమే నలుపు ఉండే వేయి గుర్రాలను వరుణుడు బహూకరించాడు.

మధురాపుర వాసులందరినీ ఇప్పుడు ద్వారకకు చేర్చాలి. అదెలా? బలరాముడు తలపట్టుకున్నాడు. ఇలా అన్నాడు కృష్ణుడు. తన యోగమాయతో మధురాపుర ప్రజలందరినీ ద్వారకకు చేర్చాడు. వారి రక్షణ బాధ్యత అన్నకు అప్పగించాడు. నిర్జనంగా ఉన్న మధురాపురంలో తానొక్కడై నిలిచాడు కృష్ణుడు. వస్తున్న కాలయవనుణ్ణి చూశాడు. సన్నగా నవ్వుకున్నాడు. పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చిన కాలయవనుడికి మధురలో మనుషులు కనిపించకపోయేసరికి చిర్రెత్తుకొచ్చింది. ఖాళీగా ఉన్న భవనాలనూ, అంగళ్ళనూ చూసి అసహనానికి గురయ్యాడు. ఆ అసహనంలో కృష్ణుణ్ణి చూశాడు. కావాల్సింది కృష్ణుడు. అతనున్నాడు, చాలు అనుకున్నాడు. కృష్ణుని ముందుకు రథాన్ని పోనీయమన్నాడు. కాలయవనుడి రాకను గుర్తించిన కృష్ణుడు, అక్కడ నిలబడక పరుగందుకున్నాడు. పారిపోతున్న కృష్ణుణ్ణి చూసి, ఆశ్చర్యపోయాడు కాలయవనడు. యుద్ధం అంటే కృష్ణుడికి ఎంత భయం? అనుకున్నాడు. అయినా వదలిపెట్టక, వెంబడించాడతన్ని. కృష్ణుణ్ణి పరాభవించాలి. పట్టుకుని, బుద్ధి చెప్పాలి అనుకున్నాడు. గుర్రాలు కూడా అంత వేగంగా పరుగుదీయవు. అంతలా పరుగుదీస్తున్నాడు కృష్ణుడు. అతని వెంట వేగంగా రథాన్ని పోనిస్తున్నాడు యవనుడు. చాలా దూరం పరిగెత్తాడు కృష్ణుడు. మధురానగరం దాటిపోయాడు. అడవులు దాటిపోయాడు. ఆఖరికి ఓ కొండగుహలోకి ప్రవేశించాడు. అదృశ్యమయిపోయాడు. రథం దిగి, కాలయవనుడు కూడా ఆ గుహలోకి పరుగుదీశాడు.

''కృష్ణా! కృష్ణా''అంటూ కేకేస్తూ కృష్ణుని కోసం వెదకసాగాడు. ఎక్కడా కనిపించడే! గుహ దద్దరిల్లేటట్టు కృష్ణుణ్ణి పిలుస్తూ ఒక చోట ఆగాడు కాలయవనుడు. అతను ఆగిన చోటుకి దగ్గరలో ఒక ఎత్తయిన ప్రదేశం ఉంది. దాని మీద ఎవరో అటుగా తిరిగి గాఢనిద్రలో ఉన్నారు. గురక వినవస్తోందంతే! నిద్రపోతున్నది కృష్ణుడే! అనుమానం లేదు. నిద్ర నటిస్తున్నాడనుకున్నాడు

కాలయవనుడు. దొరకక దొరకక దొరికాడు. వదులకోకూడదనుకున్నాడు. కాలు ఎత్తిపెట్టి నిద్రపోతున్న వ్యక్తి భుజమ్మీద బలంగా తన్నాడు. గురక ఆగింది. మేల్కొన్నట్టున్నాడు. నిద్రపోతున్న వ్యక్తి ఇటు తిరిగాడు. కళ్ళు తెరచి కోపంగా చూశాడు కాలయవనుణ్ణి. అంతే! ఆ చూపులకే కాలయవనుడు కాలి బూడిదయిపోయాడు.

మహాబలవంతుడు కాలయవనుణ్ణి చూపులతోనే కాల్చి చంపింది కృష్ణుడు కాదు, ఇంకొక వ్యక్తి. అతని పేరు ముచికుందుడు. ఇక్ష్వాకు వంశీయుడు. మంధాత చక్రవర్తి కొడుకతను. పరాక్రమశీలి. సత్యసంధుడు. పూర్వం దేవతలకూ, దానవులకూ యుద్ధం జరిగినప్పుడు దేవతలు, ముచికుందుని సహాయాన్ని అర్థించారు. అంగీకరించాడతను. దేవతల పక్షాన నిలచి, చాలా కాలం రాక్షసులతో యుద్ధం చేశాడు. చాలా మంది రాక్షసులను తెగటార్చాడు. ఆఖరికి పరమశివుని కుమారుడు కుమారస్వామి దేవతలకు సేనానాయకుడయినాడు. అప్పుడు, తమకు ఎంతో కాలం నుంచి ఉపకారం చేస్తూ వచ్చిన ముచికుందుణ్ణి ఏదేని వరం కోరుకోమన్నారు ఇంద్రాది దేవతలు. ఏం కోరుకోవాలి? చాలా కాలంగా అవిరామంగా యుద్ధం చేయడం వల్ల బాగా అలసిపోయి ఉన్నాడు ముచికుందుడు. విశ్రాంతి కావాలి. అదే కోరుకున్నాడు. బహుకాలం నిద్రపోవాలన్నాడు. నిద్రాభంగం కలిగించిన వారు, తను కను తెరిచి చూసిన మరుక్షణం భస్మమయిపోవాలన్నాడు. ఆ వరం చాలన్నాడు. ప్రసాదించారు దేవతలు. ఆ వరప్రభావంతో ముచికుందుడు కొండగుహలో పడుకుని, గాఢనిద్రలో ఉన్నాడు.

# రుక్మిణీకల్యాణం

కాలయవనుణ్ణి యుక్తిగా మట్టుబెట్టాలనే కృష్ణుడు అతన్ని గుహలోనికి రప్పించాడు. ఎప్పుడయితే యవనుడు తుదముట్టుకుపోయాడో అప్పుడక్కడ ప్రత్యక్షమయ్యాడు కృష్ణుడు. కృష్ణుణ్ణి చూడగానే ముచికుందునికి దివ్యజ్ఞానం కలిగింది. కృష్ణుడు శ్రీమన్నారాయణుని అవతారం అని గ్రహించాడతను. సాష్టాంగ నమస్కారం చేసి, అనేక విధాల కృష్ణుణ్ణి స్తుతించాడు.

''ఊహించని అదృష్టం.'' అంటూ పొంగిపోయాడు. ఆ అదృష్టానికి అసలు కారణం కాలయవనుణ్ణి తుదముట్టించడం అంటూ, అందుకే అతన్ని అక్కడికి తీసుకు వచ్చానని జరిగిందంతా వివరించాడు కృష్ణుడు. తనకు సహకరించినందుకు కృతజ్ఞతగా ఏదేని వరం కోరుకోమన్నాడు. తనకు మోక్షపదం అనుగ్రహించమన్నాడు ముచికుందుడు. మోక్షం లభించాలంటే ముందు ఘోరతపస్సు చేయాలంటూ, క్షత్రియధర్మాన్ని అనుసరించి, యుద్ధాలతో ప్రాణహింస చేసినందుకుగాను, కఠోర తపస్సు అత్యవసరం అన్నాడు కృష్ణుడు. తపస్సు చేసి, పవిత్రుడవయితే విష్ణుపదం తప్పక ప్రాప్తిస్తుందని చెప్పాడు. సంతోషించాడు ముచికుందుడు. కృష్ణునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. గంధమాదనపర్వతానికి చేరుకున్నాడు. అక్కడ కృష్ణుడు చెప్పినట్టుగానే అనేక సంవత్సరాలపాటు కఠోర తపస్సు చేశాడు. చివరికి భగవంతుని అనుగ్రహం లభించింది. విష్ణుపదం చేరుకున్నాడు.

ముచికుందుని సాయంతో కాలయవనుని సంహరించి కృష్ణుడు మధురకు చేరుకున్నాడు. ముట్టడించిన మ్లేచ్ఛుల్ని మట్టుబెట్టాడు. వారి ధనరాశుల్ని చేజిక్కించుకున్నాడు. దాన్నంతా

ద్వారకకు తరలించాడు. కృష్ణుడిలా ఊపిరితీసుకున్నాడో లేదో, ఇరవైమూడు అక్షౌహిణిల సైన్యంతో పద్దెనిమిదోసారి దండెత్తి వచ్చాడు జరాసంధుడు. బలరామకృష్ణులు బాగా ఆలోచించారు. జరాసంధునితో యుద్ధం చేసేందుకు సాహసించలేదు. ఇద్దరూ యుద్ధానికి భయపడుతున్నట్టుగా నటించి పారిపోసాగారు. అయినా వారిని వదల్లేదు జరాసంధుడు. వెంబడించాడు. పరిగెత్తి పరిగెత్తి బలరామకృష్ణులిద్దరూ ప్రవర్షణం అనే కొండనెక్కి, దాని శిఖరానికి చేరుకున్నారు. శిఖరం చాటుగా దాగున్నారిద్దరూ. దాగున్న బలరామకృష్ణులు కనిపించకపోవడంతో జరాసంధుడు చక్కని ఉపాయం ఆలోచించాడు. కొండచుట్టూ కట్టెలు పేర్చి, ముట్టించాడు వాటిని. ఇంత కొండా తగలబడిపోసాగింది. మంటలు మిన్నంటడంతో అంతెత్తు మీద నుంచి బలరామకృష్ణులు ఎవరికీ కనిపించకుండా కిందకి దూకి, చల్లగా ద్వారకకు చేరుకున్నారు. మంటకు కొండ పేలిపోయింది. శిఖరం కూలిపోయింది. బలరామకృష్ణులకోసం రాళ్ళూ రప్పలూ అన్నీ వెదికారు. ఎక్కడా దొరకలేదు వారు. దాంతో కొండతో పాటూ వారూ తునాతునకలు అయి ఉంటారని భావించి వెనుతిరిగాడు జరాసంధుడు.


కాలయవనుడూ, పదేపదే జరాసంధుడూ మధురపైకి దండెత్తి రావడంతో యాదవులను సంరక్షించేందుకు సముద్రంలో ద్వారకను నిర్మించాడు కృష్ణుడు. దానినే రాజధానిని చేశాడు. అలా ద్వారకాధీశుడయినాడు కృష్ణుడు. ద్వారక భూలోక వైకుంఠం అయింది. పుణ్యస్థలమయింది. కృష్ణుణ్ణి సందర్శించేందుకు మునులూ, దేవతలూ నిత్యం ద్వారకకు వచ్చేవారు. ఫలితంగా ఆ పట్టణం మోక్షప్రదమయింది. ద్వారకతో పాటు మరి ఆరు పట్టణాలు కూడా భారతదేశంలో మోక్షప్రదమయినవంటారు. అవి: అయోధ్య, మధుర, హరిద్వారం, కాశి, కాంచీ, ఉజ్జయిని. నేటికీ ఈ పట్టణాలు పవిత్ర యాత్రాస్థలాలుగా విరాజిల్లుతున్నాయి.

## రుక్మిణీకల్యాణం

ద్వారకానగరం రాజధానిగా బలరామకృష్ణులు యాదవరాజ్యాన్ని ఏర్పరిచారు. వారి నాయకత్వంలో యాదవులు బలవంతులయ్యారు. ధనవంతులయ్యారు.

రేవతిని వివాహం చేసుకున్నాడు బలరాముడు. ఆమె అనర్తాధిపతి రైవతుని కుమార్తె. కృష్ణుడు రుక్మిణిని వివాహం చేసుకున్నాడు. భాగవతంలో రుక్మిణీకల్యాణ కథ అద్భుతఘట్టం. అప్పట్లో రాజులు ఎనిమిది విధాలుగా వివాహాలు చేసుకునేవారు. బ్రాహ్మం, దైవం, ఆర్షం, ప్రాజాపత్యం, అసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచం. ఈ విధాల్లో ఏ విధంలోనైనా రాజులు వివాహం చేసుకోవచ్చు. అది శాస్త్రసమ్మతం. బలాత్కారంగా కన్యను తీసుకుని వచ్చి వివాహం చేసుకుంటే దానిని 'రాక్షసం' అంటారు. కృష్ణుడు ఈ విధానంలోనే రుక్మిణిని వివాహం చేసుకున్నాడు.

కుండిననగరాన్ని రాజధానిగా చేసుకుని విదర్భదేశాన్ని పాలిస్తున్నాడు భీష్మకుడు. అతని కుమార్తె రుక్మిణి. భీష్మకునికి రుక్మి, రుక్మరథుడు, రుక్మబాహుడు, రుక్మకేశుడు, రుక్మమాలి అని అయిదుగురు కొడుకులు. ఈ అయిదుగురు కొడుకులు కంటే చిన్నది రుక్మిణి. ఆఖరిపిల్ల కూడా. రుక్మిణి రూపవతి. గుణవతి. సమస్త విద్యలూ తెలుసామెకు. లక్ష్మీ అంశతో జన్మించిన కారణంగా చిన్ననాటి నుంచే ఆమె విష్ణు భక్తురాలయింది. ప్రఖ్యాతి చెందిన కృష్ణుని గురించి చాలా విన్నది



రుక్మిణి. అందగాడు అని విన్నది. మంచి సాహసవంతుడు అని విన్నది. అతనికి తెలియని మాయలూ, మంత్రాలూ లేవని కూడా విన్నది. విని విని కృష్ణుణ్ణి ఆరాధించడమే కాదు, అతన్నే పతిగా కూడా పొందాలని ఆశించింది. నిరంతరం రుక్మిణికి కృష్ణుని ధ్యాసే! అనుక్షణం అతన్ని ధ్యానిస్తూ ఉండేదామె. కథలు కథలుగా అతని గుణగుణాలు తెలుసుకునేది. పాటలుగా, పరవశించి చేసే నాట్యాలుగా అతని రూపలావణ్యాలను తెలుసుకునేది. అలా తెలుసుకుంటూ చేసుకుంటే కృష్ణుణ్ణే పెళ్ళి చేసుకుంటాను, లేదంటే లేదు అనుకున్నది. కృష్ణుణ్ణి తనకి భర్తని చేయమని వేయిదేవుళ్ళకు మొక్కుకుంది. కృష్ణుడు కూడా రుక్మిణి గురించి విన్నాడు. ఆమె చక్కదనాలు,

గుణశీలాలు తెలుసుకున్నాడు. తనని ఆమె ఆరాధిస్తున్నదనీ, భర్తగా ఆశిస్తున్నదనీ తెలుసుకున్నాడు. దేనికైనా సమయం రావాలి. ఆ సమయం కోసం నిరీక్షించసాగాడు.

యుక్తవయసుకి వచ్చిన రుక్మిణికి వివాహం చేసేందుకు తండ్రి భీష్మకుడు సిద్ధమయ్యాడు. భర్తగా ఆమె ఎవరిని కోరుకుంటున్నదీ తెలుసుకోదలచాడు. అయితే అన్నయ్య రుక్మి, పెళ్ళికి చెల్లెలు అభిప్రాయం అనవసరం అన్నాడు. ఆమెను శిశుపాలునికి ఇచ్చి వివాహం చేద్దామన్నాడు. శిశుపాలుడూ, రుక్మి స్నేహితులు. రుక్మిణి-శిశుపాలుర వివాహానికి సకల ఏర్పాట్లూ చేయసాగాడు. రుక్మి దుర్మార్గుడు, అహంకారి. అతన్ని ఎదిరించడం, అతని మాటకు ఎదురు చెప్పడం భీష్మకుని వల్ల కూడా కాదు. అందుకే అతనితోపాటు అంతా ఊరుకున్నారు. రుక్మిణి అంతరంగం తెలుసు భీష్మకునికి. ఆమెను కృష్ణునికి ఇచ్చి వివాహం చేయాలని ఉన్నది. అయినా కొడుకు అంటే భయం. ఊరుకున్నాడతను. సిగ్గు విడిచి, తను ఎవరిని ప్రేమిస్తున్నదీ, పెళ్ళి చేసుకుంటే కృష్ణుణ్ణే చేసుకుంటానని తండ్రికి ఎప్పుడో చెప్పింది రుక్మిణి. అయినా అందుకు విరుద్ధంగా శిశుపాలునితో పెళ్ళి నిశ్చయించి ఏర్పాట్లు చేస్తున్నారంటే తనేం చెయ్యగలదు? నిస్సహాయంగా రోదించింది రుక్మిణి. శిశుపాలునితో పెళ్ళి అంటే భయపడింది. తర్వాత తేరుకుని బాగా ఆలోచించింది. ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. 'నువ్వంటే నాకిష్టం' అని కృష్ణునితో చెబుతుంది. 'పెళ్ళి చేసుకుంటే నిన్నే చేసుకుంటాను.' అంటుంది. అన్న రుక్మి చేస్తున్న అట్టహాసం గురించి కూడా చెప్పి, కాపాడమంటుంది. కృష్ణునికి కనికరం ఎక్కువ. తప్పకుండా కాపాడుతాడు అనుకుంది రుక్మిణి. అయితే తన ఇష్టాయిష్టాలన్నీ ముందు కృష్ణునికి తెలియాలి? ఎలా? మార్గం ఏది? మళ్ళీ ఆలోచించింది రుక్మిణి. అప్పుడు ఆమెకు అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుడు గుర్తొచ్చాడు.

అగ్నిద్యోతనుడు ఆప్తుడు. బుద్ధిశాలి. సదాచారసంపన్నుడు. భగవద్భక్తుడు. అన్నిటికంటే ఉపకారబుద్ధికలవాడు. అతన్ని పిలిచింది రుక్మిణి. దోయిలి ఒగ్గి వచ్చాడతను. తన ప్రేమ గురించి సర్వం చెప్పింది రుక్మిణి. విని, ఆజ్ఞాపించండి అన్నట్టుగా చూశాడతను.

''నా దూతగా మీరు ద్వారకకు వెళ్ళి రండి. నా బాధంతా ఆ దేవదేవుడికి తెలియజెయ్యండి. సమయం మించిపోకముందే వచ్చి, నన్ను చేపట్టమని చెప్పండి'' అన్నది రుక్మిణి. సరేనన్నాడు బ్రాహ్మణుడు. బయల్దేరాడక్కణ్ణుంచి. కుండిననగరం సరిహద్దులు దాటాడు. రుక్మిణి చెప్పిన మాటల్ని మననం చేసుకోసాగాడు.

కృష్ణా! జగన్మోహనా! చిన్ననాటి నుంచి నేను నీ భక్తురాలిని. నిన్నే నా సర్వస్వంగా భావిస్తున్నాను. నా భర్త కూడా నువ్వేనని తలుస్తున్నాను. ఆ తలంపుతోనే సిగ్గు విడచి నీకీ సందేశం పంపుతున్నాను. అన్యథా భావించకు. తప్పయితే నన్ను క్షమించు. నిన్ను పతిగా వరించినప్పటికీ మా అన్నయ్య రుక్మి, నన్ను శిశుపాలునికి ఇచ్చి వివాహం చేద్దామనుకుంటున్నాడు. అందుకు సర్వ సన్నాహాలూ చేస్తున్నాడు. నేను నీదాన్ని. నీ కోసం పుట్టినదాన్ని. నేను సదా నిన్నే ధ్యానించే దాన్నయితే, మంచి నోములు నోచినదాన్నయితే, దేవ బ్రాహ్మణులను ఎల్లవేళలా పూజించిన దాన్నయితే నువ్వు వచ్చి నన్ను స్వీకరిస్తావు. మన వివాహం జరుగుతుంది.

త్వరలోనే శిశుపాలునితో నా వివాహం. ఈ వివాహం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదు. నీతోనే నా వివాహం జరగాలి. జరగాలంటే నువ్వు నా వివాహ సమయానికి రహస్యంగా నీ యదుసైన్యంతో ఇక్కడికి తరలిరావాలి. నన్ను కన్నెత్తి చూసేందుకు సాహసించిన శిశుపాలాది

దుష్టులను నువ్వు నిర్జించి, రాక్షస వివాహపద్ధతిలో నన్ను పెళ్ళి చేసుకో! బలాత్కారంగా నన్ను తీసుకుని వెళ్ళిపో!

కృష్ణా! నన్ను చేపట్టేందుకు నీకొక ఉపాయం కూడా చెబుతున్నాను, దయచేసి నన్ను అర్థం చేసుకో! అంతఃపురంలో ఉన్న నన్ను, అనేక మంది బంధుమిత్రుల మధ్య ఉన్న నన్ను, పెళ్ళివేళ తీసుకుని పోవడం నీకు సాధ్యం కాని పని. అందుకుని పెళ్ళి ముందే రోజే రా! పెళ్ళి ముందు రోజు నన్ను అలంకరించి, గౌరీపూజకై ఊరవతల ఉన్న ఆలయానికి తీసుకుని వెళ్తారు. నువ్వు ఆ ఆలయానికి వచ్చావా, అక్కడ నుంచి నన్ను తీసుకునిపోవడం నీకు సులువవుతుంది. ఇంతగా విన్నవించుకున్నా, నీ ముందు నా మనసు పరిచినా నువ్వు రాలేదంటే నాకు మరణమే శరణ్యం.

రుక్మిణి సందేశాన్ని యథాతథంగా కృష్ణుని ముందు ఉంచేందుకు పదేపదే ఆమె మాటల్ని మననం చేసుకుంటూ అగ్నిద్యోతనుడు సముద్రం దాటాడు. ద్వారకకు చేరుకున్నాడు. కృష్ణుని సందర్శించాడు. కృష్ణుడు అతనికి సకల మర్యాదలూ చేశాడు. షడ్రసోపేతమయిన విందు చేశాడు. తృప్తిపరిచాడతన్ని. తర్వాత ఏకాంతమందిరంలోనికి తీసుకునిపోయి అడిగాడిలా.

''విప్రవర్యా చెప్పండి, ఎక్కణ్ణుంచి వచ్చారు? సముద్రాన్ని దాటి నన్ను సందర్శించాల్సిన అవసరం ఏమిటి?''

''నీకు తెలియనిదేముంది ముకుందా? సర్వం తెలిసిన వాడివి, అయినా రాయబారిగా వచ్చినప్పుడు నా కర్తవ్యం నేను నిర్వర్తించక తప్పదు'' అన్నాడు అగ్నిద్యోతనుడు. అని, తాను ద్వారకకు ఎందుకు వచ్చిందీ, తనని రుక్మిణి దూతగా ఎందుకు పంపినదీ, ఆమె సందేశం యావత్తూ కృష్ణునికి స్పష్టంగా వినిపించాడతను. అంతా విన్నాడు కృష్ణుడు. సన్నగా నవ్వాడు. తర్వాత ఇలా అన్నాడు.

''వలచి వచ్చిన స్త్రీని ఎందుకు కాదంటాను, తప్పకుండా రుక్మిణిని పెళ్ళి చేసుకుంటాను. నాకు కూడా ఆమె అంటే చాలా ఇష్టం.'' అన్నాడు కృష్ణుడు. ఆనందిస్తూ ప్రమాణం చెయ్యి అన్నట్టుగా అగ్నిద్యోతనుడు చేయి ముందుకు జాచాడు. అతని చేతిలో చేయి వేసి, గంభీరంగా ఇలా అన్నాడు కృష్ణుడు.

''పంచభూతాలసాక్షిగా చెబుతున్నాను, నేను రుక్మిణిని అర్ధాంగిగా స్వీకరించి తీరుతాను, ఎవరు అడ్డువచ్చినా నేను నా మాట తప్పను.''

''చాలు కృష్ణా! చాలు'' అన్నాడు అగ్నిద్యోతనుడు.

రుక్మి తనకు ప్రతికూలుడు. రుక్మిణిని తనకిచ్చి పెళ్ళిచేయడం అతనికి ఇష్టం లేదు. ఆ సంగతి తెలుసుకున్నాడు కృష్ణుడు. అంతేకాదు, రుక్మికి శిశుపాల జరాసంధాదులు అండగా ఉన్నారని కూడా తెలుసు అతనికి. అయినా సరే, రుక్మిణిని చేబట్టాలనుకున్నాడు కృష్ణుడు. సారథి దారకుణ్ణి పిలిచాడు. మర్నాడు పొద్దునే రథాన్ని సిద్ధం చేయమన్నాడు. చేశాడతను. సకల శస్త్రాస్త్రాలతో రథాన్ని అధిరోహించి, అగ్నిద్యోతనుడుసహా బయల్దేరాడు కృష్ణుడు. ఆ రోజల్లా ప్రయాణించాడు. మర్నాడు ఉదయం కుండిననగరం చేరుకున్నాడు.

# రుక్మిణీ శ్రీకృష్ణులు ఒక్కటయిన వేళ...

కుండిననగరం అంతా పువ్వులు, మామిడాకుల తోరణాలతో పచ్చపచ్చగా ఉంది. వీధులన్నీ రంగురంగుల రంగవల్లులు, జెండాలతో చూడముచ్చటగా ఉన్నాయి. రుక్మిణి వివాహానికి ఏర్పాట్లన్నీ జరిగిపోతున్నాయి. రుక్మిణిని శిశుపాలునకు ఇచ్చి వివాహం చేసేందుకు సిద్ధమయ్యారంతా. రుక్మి మాటకు తండ్రి భీష్మకుడు కూడా ఎదురు చెప్పలేకపోయాడు. అంతఃపురం అంతా హడావుడిగా ఉంది. రుక్మిణిని బంగారునగలతో అలంకరించారు. పెళ్ళికూతురిని చేశారామెను.

శిశుపాలుని తండ్రి, చేది దేశాధినేత దమఘోషుడు, కొడుకు శిశుపాలుణ్ణి పెళ్ళికొడుకుని చేసి, పురోహిత బంధు మిత్రులుసహా కుండిననగరం తరలివచ్చాడు. తరలి వచ్చిన పెళ్ళివారికి భీష్మకుడు ఆహ్వానం పలికాడు. విడిది భవనాకి వారిని సకలమర్యాదలతో చేర్చాడు.

రుక్మిణిని తనకి ఇచ్చి పెళ్ళి చేస్తానన్నా, ఆమె అంతరంగం పసిగట్టిన శిశుపాలుడు, ఎందుకయినా మంచిదని సర్వసైన్యసమేతంగా తరలివచ్చాడు. కృష్ణుడు మీద అతనికి అనుమానంగా ఉంది. ఏ క్షణాన్నయినా వచ్చి రుక్మిణిని కృష్ణుడు తీసుకుపోతాడని భయంగా ఉంది. ఆ భయంతోనే సాల్వుడు, జరాసంధుడు, దంతవక్త్రుడు, విదూరథుడు, పౌండ్రకుడు సహా విడిది చేశాడు శిశుపాలుడు. శిశుపాలుడుసహా వారందరికీ కృష్ణుడు శత్రువే! శత్రువుని ఓడించి, రుక్మిణిని శిశుపాలునికి కట్టబెట్టాలని వారంతా సిద్ధమయ్యారు.

వేగుల ద్వారా సంగతంతా బలరాముడు తెలుసుకున్నాడు. రుక్మిణీకల్యాణ విషయంలో యుద్ధం తప్పదనుకున్నాడు. కుండిననగరానికి కృష్ణుడు ఒంటరిగా వెళ్ళినందుకు ఆందోళన చెందాడు. అన్నగా తమ్ముణ్ణి కాపాడుకోవాలనుకున్నాడు. పెద్ద ఎత్తున సైన్యాన్ని సమకూర్చుకుని, అతనూ కుండిననగరం చేరుకున్నాడు.

–ఇవేవీ రుక్మిణికి తెలియవు. తెలియక ఆందోళన చెందసాగిందామె. అగ్నిద్యోతనుడు ద్వారకకు వెళ్ళాడో లేదో? కృష్ణుణ్ణి కలిశాడో లేదో? కలిశాడనుకుంటే, తనతో పెళ్ళికి కృష్ణుడు ఒప్పుకున్నాడో లేదో? వెళ్ళిన బ్రాహ్మణుడు ఇంత వరకూ తిరిగి రాలేదంటే...ఏమనుకోవాలి? దిగులుపడసాగింది రుక్మిణి. ఈ రాత్రి గడిచిందంటే...రేపు పెళ్ళి. గడువు ఈ ఒక్కరాత్రే! ఆదిదంపతులు పార్వతీ పరమేశ్వరులను నమ్ముకుంది. తన కోరిక నెరవేర్చమని ప్రార్థించింది. తన ప్రార్థన ఆ దంపతులు వినిపించుకున్నారో లేదో? అనుకుంటూ కన్నీరు పెట్టుకుంది రుక్మిణి. అంతలో శుభసూచికంగా ఆమె ఎడమకన్ను అదిరింది. ఎడమభుజం అదిరింది. ఆనందించిందామె. ప్రేమగా ఎడమభుజాన్ని నిమురుకుంది. ఇంతలో అగ్నిద్యోతనుడు వచ్చాడక్కడికి. అతన్ని చూడగానే ప్రాణాలు లేచి వచ్చాయి రుక్మిణికి. పరిశీలనగా ముందు అతని ముఖకవళికలు పరిశీలించింది. సంతోషంగా ఉందతని ముఖం. అంటే...వెళ్ళిన పని అయినట్టే! ఆనందంగా ఒక్క ఉదుటన లేచి, అగ్నిద్యోతనుణ్ణి సమీపించిందామె.

‘‘స్వామి ఏమన్నారు?’’ ఆత్రంగా అడిగింది రుక్మిణి.

''అంగీకరించారు'' అన్నాడు అగ్నిద్యోతనుడు. తర్వాత జరిగిందంతా చెప్పుకొచ్చాడు. కృష్ణుడు ఊరి వెలుపుల ఉద్యానవనంలో వేచి ఉన్నాడన్నాడు. ఆ మాటకి కృతజ్ఞతగా బ్రాహ్మణుని పాదాలనంటి నమస్కరించింది రుక్మిణి.

ఆ రాత్రి గడిచింది. తెల్లారింది. వివాహఘడియలు సమీపించాయి. మంగళస్నానం అయింది. అలంకరించుకుంది రుక్మిణి. గౌరీపూజకు ఊరి వెలుపల ఉన్న ఆలయానికి బయల్దేరింది. తోడుగా చెలికత్తెలూ, ముత్తయిదువులూ ఆమె వెంట నడిచారు. మంగళవాద్యాలతో ఊరేగింపు ముందుకు వెళ్తుంటే...ఆయుధధారులయిన రాజభటులు ఆ ఊరేగింపునకు ముందు వెనుకా కాపలాగా నిలిచారు. అడుగులో అడుగు వేసుకుంటూ, ఆందోళనను అరికట్టుకుంటూ గౌరీఆలయానికి చేరుకుంది రుక్మిణి. దేవిని భక్తితో పూజించింది. ముత్తయిదువులకు మొక్కి దీవెనలు అందుకుంది. వెనుతిరిగింది. ఆలయం వెలుపలకు వచ్చి, చెలులతో ఇంటి దారి పట్టబోతుంటే నిలువెత్తు రూపంలో ఎదురొచ్చాడు కృష్ణుడు. నవ్వుతూ చేయి చాచాడు. సిగ్గుపడుతూ ఆ చేతిని అందుకుంది రుక్మిణి. బలంగా ముందుకు లాగాడామెను. వచ్చి కృష్ణుని గుండెల మీద వాలింది రుక్మిణి. ఆమెను అలాగే రథంపైకి ఎక్కించాడు కృష్ణుడు.

''పోనీయ్'' అన్నాడు దారకునితో. రథం పరుగుదీసింది. రాజభటులూ, ముత్తయిదువులూ, చెలికత్తెలూ చూస్తూండగానే అక్కణ్ణుంచి నిష్క్రమించాడు కృష్ణుడు. దాడి చేద్దామన్న తలంపు కూడా రాలేదు రాజభటులకు. అంతా వింతగా చూస్తూ నిల్చున్నారు. చెలికత్తెలు చేతులూపి వీడ్కోలు పలికినా, తక్షణ కర్తవ్యం గుర్తొచ్చి పరుగుదీశారక్కణ్ణుంచి.

కొద్దిదూరం ప్రయాణించిన తర్వాత కృష్ణుని రథాన్ని అనుసరించారు యదువీరులు. బల రాముడు నేతృత్వంలో బలగాలన్నీ యుద్ధానికి సన్నద్ధమయి ప్రయాణించసాగాయి. విడిదికి చేరుకున్నారు చెలికత్తెలు. జరాసంధుడుసహా అక్కడ ఉన్న అందరికీ రుక్మిణిని కృష్ణుడు తీసుకుని పోతున్నాడని చెప్పారు. కుండిననగరం సరిహద్దులు దాటుతున్నారన్నారు. యదుసైన్యం తోడుగా ఉన్నదని, బలరాముడు కూడా తమ్ముని కాపాడుకునేందుకు వచ్చాడని తెలిపారు. ఇంకా చెప్ప బోతుంటే వినిపించుకోలేదెవరూ. అడ్డుగా ఉన్న చెలికత్తెల్ని చేతుల్తో విదిలించి లేచారు రాజు లంతా.

''కృష్ణుణ్ణి పట్టుకోండి, కొట్టి చంపండి'' అన్నారు ముక్తకంఠంగా. రథాలను పరుగులెత్తించారు.

అదిగో యదుసైన్యం అంటే, అడిగో కృష్ణుడు అన్నారు. బలరామకృష్ణులను సమీపించారు. వెన్నంటి సముద్రంలా పొంగివస్తున్న శత్రుసైన్యాన్ని చూశాడు కృష్ణుడు. రథాన్ని నిలిపాడు. కృష్ణుడు ఆగడంతో సైన్యంతో సహా బలరాముడు కూడా ఆగాడు. సమీపించిన శత్రుసైన్యాన్ని ఎదుర్కొన్నాడు. పెద్దయుద్ధం జరిగింది. ఆ యుద్ధం చూసి రుక్మిణి భయపడింది. వణికిపోసాగింది.

''ఎందుకు భయం? నా వీరవిక్రమ పరాక్రమాలను వీక్షించు. ప్రేయసి ముందు ప్రతాపాలు ప్రదర్శించడం గొప్ప అదృష్టం'' అన్నాడు కృష్ణుడు. రుక్మిణిని తన వెనుగ్గా దాచి, జరాసంధుణ్ణి అరురారుణ నేత్రాలతో చూశాడు. జరాసంధుడు ప్రయోగించిన బాణాలను చేతితో అందుకుని వాటిని ముక్కలు చేశాడు. పెద్దగా సింహనాదం చేశాడు. దివ్యాస్త్రాలు ప్రయోగించాడు. ఆ అస్త్రాలను తట్టుకుని నిలబడగలిగే ధైర్యం లేకపోయింది శత్రుసైన్యానికి. వెన్నిచ్చి పారిపోసాగింది. అదే అవకాశంగా జలభద్రుడు, గదుడు మొదలయిన యదువీరులంతా శత్రుసైన్యాన్ని చీల్చి



చెండాడసాగారు. నిమేషకాలంలో ఆ ప్రదేశం పీనుగులతో నిండిపోయింది. రక్తం బురదగా ప్రవహించసాగింది. అరకొరగా మిగిలిన సైనికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగు దీయసాగారు. అది చూసి, జరాసంధాదులు ఓటమిభయంతో అక్కణ్ణుంచి వెనుతిరిగారు.

''నిలు నిలు'' అంటున్నా వినిపించుకోక, కృష్ణుని కేకకు అందనంతదూరంగా పారిపోయారు. శిశుపాలుడు కూడా కృష్ణుని ఎదురించలేకపోయాడు. చేజారిపోయిన రుక్మిణిని కసిగా చూసి కదలిపోయాడక్కణ్ణుంచి.

రుక్మి వెనుతిరగలేదు. చెల్లెలు రుక్మిణిని వెంటబెట్టుకుని వస్తానంటూ, కృష్ణుని చంపితీరుతా నంటూ ముందుకురికాడు. కొండను పొట్టేలు డీ కొన్నట్టుగా కృష్ణుని డీ కొన్నాడతను. ఇద్దరి మధ్యా పెద్ద యుద్ధం జరిగింది. రుక్మిని విరథుణ్ణి చేశాడు కృష్ణుడు. నిస్సహాయంగా నిల్చున్న రుక్మి పెడరెక్కలు విరచిపట్టుకుని, అతన్ని సంహరించేందుకు సిద్ధమయ్యాడు. అప్పుడు అతన్ని వారించింది రుక్మిణి. అన్నను చంపవద్దంటూ కన్నీరుపెట్టుకుని, కృష్ణుని పాదాలను ఆశ్రయించింది. ఆమె మీది ప్రేమతో రుక్మిని వదలివేశాడు కృష్ణుడు. అయితే పరాభవించకపోతే రుక్మికి బుద్ధిరాదని,

అతని మీసాలూ, తలగొరిగి వదలివేశాడు. అది చూసి రుక్మిణి ఎంతగానో విలపించింది. ఆమెను ఓదార్చాడు బలరాముడు. దుష్టులకు తగిన శిక్ష తప్పదన్నాడు. జరిగిందానికి కృష్ణుని మీదా, యదువీరుల మీదా కోపం పెంచుకోవద్దన్నాడు. కన్నీరు తుడుచుకోమన్నాడు. కొత్తపెళ్ళికూతురు కన్నీరుపెట్టుకుంటే కలసిరాదన్నాడు. బలరాముని మాటని చెవినపెట్టి, కన్నీరు తుడుచుకుంది రుక్మిణి. అంతా ద్వారకకు చేరుకున్నారు. రుక్మిణిని అక్కడ శాస్త్రోక్తంగా వివాహం చేసుకున్నాడు కృష్ణుడు. రుక్మిణీకల్యాణం వైభవాతివైభవంగా జరిగింది. దేవతలూ, మునులూ అంతా వచ్చారప్పుడు. రుక్మిణీకల్యాణం చూసి తరించారు.

కృష్ణుని చేతిలో అవమానం పొందిన రుక్మి, కుండిననగరం చేరుకోలేదు. నగరప్రజలకు తన ముఖం చూపించలేననుకున్నాడు. సిగ్గుపడి భోజకటకం అనే నగరంలో ఉండిపోయాడు. కొన్నాళ్ళకు భారతయుద్ధం జరిగింది. అప్పుడు, కృష్ణునిపై కోపంతో అతను కౌరవపక్షంలో చేరేందుకు సిద్ధమయ్యాడు. అయితే దుర్యోధనుడు నిరాకరించాడతన్ని. తర్వాతకాలంలో అతను బలరాముని చేతిలో మరణించాడు.

## సత్యభామ:శ్యమంతకమణి

నిమ్నుని కుమారుడు సత్రాజిత్తు. సూర్యోపాసకుడు. అతని భక్తికి మెచ్చి సూర్యభగవానుడు దివ్యమైన మణిని కానుకగా ఇచ్చాడు. దాని పేరు శ్యమంతకం.

శ్యమంతకాన్ని పూజామందిరంలో పెట్టి నిరంతరం పూజించేవాడు సత్రాజిత్తు. మహిమగల ఆ మణి రోజుకి ఎనిమిది బారువుల బంగారాన్ని ఇచ్చేది. బంగారాన్ని ఇవ్వడమే కాదు, శుభాల్ని అందించేది. ఆ మణి గురించి బాగా తెలిసిన శ్రీకృష్ణుడు, దానిని తనకి ఈయమంటూ సత్రాజిత్తును అడిగాడు. ఇవ్వనన్నాడు సత్రాజిత్తు.

ప్రసేనుడు అని సత్రాజిత్తుకి ఓ తమ్ముడు ఉన్నాడు. అతను శ్యమంతకాన్ని కంఠాన ధరించి వేటకి అడవికి వెళ్ళాడు. ఓ సింహంతో తలపడ్డాడు. ప్రసేనుణ్ణి సింహం చంపేసింది. శ్యమంతకాన్ని తీసుకునిపోయింది. మణితో పర్వతప్రాంతంలో తిరుగుతున్న సింహాన్ని జాంబవంతుడు చూశాడు. సింహం వెంటపడ్డాడు. రెండూ బాగా పోట్లాడుకున్నాయి. చివరికి జాంబవంతుడు, సింహాన్ని చంపేశాడు. శ్యమంతకాన్ని చేజిక్కించుకుని, గుహకి వెళ్ళిపోయాడు. అక్కడ తన కూతురు జాంబవతికి దానిని కానుకగా అందజేశాడు.

వేటకి వెళ్ళిన తమ్ముడు ఎంతకీ తిరిగిరాకపోయేసరికి, ఏమయ్యాడో తెలియక సత్రాజిత్తు ఆందోళన చెందాడు. ఆ ఆందోళనలో వివేచన కోల్పోయాడతను. కృష్ణుణ్ణి అనుమానించాడు. శ్యమంతకం ఈయమని కృష్ణుడు అడిగాడు. తను ఈయలేదు. ఆ కోపాన్ని పెట్టుకుని, ప్రసేనుణ్ణి శ్రీకృష్ణుడే చంపి ఉంటాడని అనుమానించాడు సత్రాజిత్తు. ఆ మాటనే బంధుమిత్రులకందరికీ తెలియజేశాడు. ఆ మాట ఆ నోటా ఈనోటా చెలరేగి నగరం అంతటా పెద్దవదంతిగా వ్యాపించింది. ప్రసేనుని చంపి, కృష్ణుడు శ్యమంతకాన్ని అపహరించాడంటూ ప్రజలు చెప్పుకోసాగారు. ఈవార్త కృష్ణునికి చేరింది. బాధపడ్డాడు. నిజానిజాలు ప్రజలకి తెలియజెయ్యాలి. అది తన బాధ్యత అనుకున్నాడు. నగరంలోని ప్రముఖులనూ, కొంతమంది ప్రజలనూ వెంటతీసుకుని అడవికి వెళ్ళాడతను. ప్రసేనుని పాదముద్రలను అనుసరించాడు. వెతగ్గా వెతగ్గా ఒకచోట

ప్రసేనుని శవం కనిపించింది. పక్కనే సింహం అడుగుజాడలు కనిపించాయి. విషయం అర్థమయింది. ప్రసేనుణ్ణి సింహం చంపేసింది. చంపేసింది సరే, శ్యమంతకం ఏమయింది? దాని కోసం సింహం అడుగుజాడలను అనుసరించారంతా. ఓ గుహను చేరుకున్నారు. అక్కడ ఓ సింహం చచ్చిపడి ఉంది. గుహలో భల్లూకం అడుగుజాడలు కనిపించాయి. వాటిని అనుసరించేందుకు సిద్ధమయ్యారు. అందరూ వద్దని, తానొక్కణ్ణే గుహలోకి ప్రవేశిస్తానంటూ, తోడుగా వచ్చిన వారందరినీ గుహద్వారం వద్ద ఉండమని చెప్పి, లోనికి వెళ్ళాడు కృష్ణుడు. లోపలంతా గాఢాంధకారంగా ఉంది. ఎవరూ ఉన్న అలికిడి లేదు. అయినా లోలోపలకి ప్రవేశించాడు కృష్ణుడు. అక్కడ  శ్యమంతకం వేలాడుతూ కనిపించింది. అందుకోబోయాడు దాన్ని. అంతలో ఆ జాంబవంతుడు పరుగున వచ్చాడక్కడికి. కృష్ణుణ్ణి చూశాడు. అతన్ని భగవంతుడని తెలుసుకోలేకపోయాడు. మామూలువ్యక్తి అనుకుని అతనితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. జాంబవంతుడు, శ్రీకృష్ణుల మధ్య ఇరవై ఎనిమిది రోజులు ఘోరయుద్ధం జరిగింది. రాళ్ళతో కొట్టుకున్నారిద్దరూ. చెట్లతో కొట్టుకున్నారు. ముష్టియుద్ధం కూడా చేశారు. యుద్ధంలో రానురానూ జాంబవంతుని బలం సన్నగిల్లసాగింది. కృష్ణుని దెబ్బలను జాంబ వంతుడు తట్టుకోలేకపోయాడు. ఆలోచనలోపడ్డాడతను. సాక్షాత్తు విష్ణుమూర్తి తప్ప తననెవరూ ఓడించలేరు. అయితే ఈ వ్యక్తి విష్ణుమూర్తా? కృష్ణుని చేతిలో దెబ్బలు తింటూ తేరిపార చూశాడతన్ని. కృష్ణుడప్పుడు శ్రీరామచంద్రమూర్తిలా దర్శనం ఇచ్చాడు.


## సత్యభామ:శ్యమంతకమణి

అంతే! వెంటనే చేతిలోని ఆయుధాన్ని వదలి, శ్రీకృష్ణుని పాదాలను స్పృశించాడు జాంబ వంతుడు. భగవంతుణ్ణి అనేక విధాలుగా స్తుతించాడు. అనుగ్రహించాడు కృష్ణుడు. జాంబవంతుణ్ణి రెండు చేతులా లేవనెత్తి, అతన్ని ఆప్యాయంగా నిమిరాడు. శ్రీకృష్ణుని స్పర్శతో శరీరం మీది గాయాలన్నీ మటుమాయమయ్యాయి.

జాంబవంతుడు పూర్వస్థితిని పొందాడు. బలాన్ని పుంజుకున్నాడు. చేతులు జోడించి భక్తితో నిల్చున్నాడు. తన అవతారతత్వాన్ని జాంబవంతునికి తెలియజేశాడు కృష్ణుడు. శ్యమంతకమణి, తనపై వచ్చిన అపప్రథ తెలియజేసి, తాను శ్యమంతకం కోసం వచ్చానని చెప్పాడు కృష్ణుడు. చేసిన తప్పుని క్షమించమని వేడుకున్నాడు జాంబవంతుడు. శ్యమంతకమణిని తీసుకు వచ్చి కృష్ణునికి సమర్పించాడు. మణితోపాటు తన కూతురు జాంబవతిని కూడా భార్యగా స్వీకరించమని వేడుకున్నాడు. అంగీకరించాడు  శ్రీకృష్ణుడు.

జాంబవంతుడు బ్రహ్మదేవుని అంశతో జన్మించాడు. మహాబలవంతుడు. చిరంజీవి. ఈ కారణంగానే నాడు శ్రీరాముణ్ణేకాదు, నేడు శ్రీకృష్ణుణ్ణి కూడా దర్శించగలిగాడు. జాంబవంతుడు రామభక్తుడు. అతను భగవంతుణ్ణి రాముని రూపంలోనే దర్శిస్తాడు. అందుకనే శ్రీరామునిగా దర్శనం ఇచ్చాడు శ్రీకృష్ణుడు.

శ్యమంతకమణినీ, జాంబవతినీ తీసుకుని గుహ ద్వారానికి చేరుకున్నాడు కృష్ణుడు. ఇరవై ఎనిమిదిరోజుల నాడు ద్వారం దగ్గర విడిచిన ఆత్మీయులకోసం చూశాడు. ఎవరూ కనిపించలేదు. ఏమయ్యారంతా? అనుకున్నాడు.



కృష్ణుడు గుహాంతర్భాగంలోనికి వెళ్ళిన తర్వాత పన్నెండు రోజుల పాటు గుహద్వారం దగ్గర కృష్ణునితో వచ్చినవారంతా అతనికోసం వేచి చూశారు. కృష్ణుడు అప్పటికీ రాకపోయేసరికి, అతనికేదో ప్రాణాపాయం సంభవించి ఉంటుందని ఊహించి, బాధగా వెనుతిరిగారు. ద్వారకకు చేరుకున్నారు. జరిగిందంతా దేవకీవసుదేవులకూ, రుక్మిణికీ చెప్పారు. శోకార్తులయ్యారంతా. సత్రాజిత్తు కారణంగానే ఇంతటి ఘోరం జరిగిందని అతన్ని శాపనార్థాలు పెట్టసాగారు. శోకిస్తూ, శాపనార్థాలు పెట్టుకుంటూ కూర్చోడం కాదు, కృష్ణుడు సురక్షితంగా తిరిగిరావాలని దేవిని వేడుకుందాం అంటే, సరేనన్నారంతా. చంద్రభాగను పూజించసాగారు. కొద్దిరోజులకే జాంబవతిసహా శ్రీకృష్ణుడు ద్వారకకు చేరుకున్నాడు. అతన్ని చూడగానే దేవకీవసుదేవులు, రుక్మిణిసహా యాదవులంతా ఆనందసాగరంలో మునిగితేలారు. పెద్ద ఎత్తున ఉత్సవం చేసుకున్నారు. ఉత్సవం అనంతరం సత్రాజిత్తును పిలిచాడు కృష్ణుడు. అందరిసమక్షంలో

శ్యమంతకమణి తనకి ఎలా లభించిందీ వివరించాడు. మణిని సత్రాజిత్తుకు అందజేశాడు. తనపై వచ్చిన అపవాదును పోగొట్టుకున్నాడు. తప్పు చేశాం, తప్పుగా ఆలోచించాం, అసలు కృష్ణుని గురించి తప్పుగా ఆలోచించడానికి కారణం సత్రాజిత్తు. అతన్ని నిందించాలంటూ ప్రజలూ, ప్రముఖులూ సత్రాజిత్తును ఆడిపోసుకున్నారు. అతనికి కునుకులేకుండా చేశారు.

అనవసరంగా కృష్ణుణ్ణి తెగనాడాను. నిందించానతన్ని. చేజేతులా పాపాన్ని మూటగట్టుకున్నాను. ఏం చెయ్యాలిప్పుడు? ఏం చేస్తే కృష్ణునితో సంబంధాలు మెరుగుపడతాయి?

రాత్రంతా బాగా ఆలోచించాడు సత్రాజిత్తు. ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. తన కూతురు సత్యభామసహా శ్యమంతకమణిని కృష్ణునికి సమర్పించుకోవడం మంచిదను కున్నాడు. తెల్లారుతూనే కృష్ణుణ్ణి సమీపించి, అనుకున్నట్టే, సత్యభామసహా శ్యమంతకమణిని అతనికి సమర్పించాడు. సత్యభామను అర్ధాంగిగా స్వీకరించాడు కృష్ణుడు. శ్యమంతకాన్ని వద్దన్నాడు.

''ఇది సూర్యదేవుడు నీకు ప్రసాదించిన దివ్యమణి. ఇది నీ దగ్గర ఉండడమే సముచితం'' అన్నాడు కృష్ణుడు. సున్నితంగా సత్రాజిత్తు కానుకను తిరస్కరించాడు. ఈ సంగతి ఆ నోటా ఈ నోటా అక్రూరుడు, కృతవర్మలకు చేరింది. శ్యమంతకమణిని ఆశించినవారిలో ఆ ఇద్దరు కూడా ఉన్నారు. శ్యమంతకమణి కారణంగా ఆ ఇద్దరూ సత్రాజిత్తు మీద ఏనాటి నుంచో ఆగ్రహావేశాలను పెంచుకున్నారు. సత్రాజిత్తు అంతు చూసేందుకు ఇదే సరయిన సమయం అనుకున్నారు. అయితే తాము వెనుక ఉండి, శతధన్వుణ్ణి ముందుకు తోసి, సత్రాజిత్తు పనిపట్టాలనుకున్నారు. ఒకప్పుడు సత్యభామను శతధన్వునికి ఇచ్చి వివాహం చేస్తానన్నాడు సత్రాజిత్తు. అన్నమాట నిలబెట్టుకోలేదు సరికదా, సత్యభామను కృష్ణునికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఇది అన్యాయం. ఈ అన్యాయాన్ని ఎదిరించాలి. సత్రాజిత్తును సంహరించాలి. అతన్ని సంహరించి అతని దగ్గర ఉన్న శ్యమంతకాన్ని చేజిక్కించుకో అన్నారు అక్రూర, కృతవర్మలు. శతధన్వునికి పదేపదే అదే సంగతి చెప్పి, సత్రాజిత్తును చంపితీరాలన్నారు. మరో ఆలోచన లేకుండా చేశారతన్ని. దాంతో శతధన్వుడు ఓ రాత్రివేళ సత్రాజిత్తును చంపి, అతని దగ్గర ఉన్న శ్యమంతకాన్ని కాజేశాడు.

ఆ సమయంలో బలరామకృష్ణులు ద్వారకలో లేరు. కుంతిసహా పాండవులు హస్తినాపురంలో లక్కఇంటిలో దగ్ధమయిపోయారని తెలిసి, వెళ్ళారక్కడికి. బలరామకృష్ణులు ద్వారకలో ఉండి ఉంటే శతధన్వుడు ఇంతకు తెగించేవాడు కాదు.

తండ్రి మరణానికి సత్యభామ ఎంతగానో దుఃఖించింది. అతని మృతదేహం చెడిపోకుండా తైలభాండంలో భద్రపరిచి, బలరామకృష్ణులను ద్వారకకు తీసుకుని వచ్చేందుకు హస్తినకు బయల్దేరింది. చేరుకుందక్కడికి. శోకిస్తూ ద్వారకలో జరిగిందంతా బలరామకృష్ణులకు తెలియజేసింది. బావగారినీ, భర్తనీ వెంటనే బయల్దేరమంది. బయల్దేరారు వాళ్ళు. ద్వారకకు చేరుకున్నారు. ముందు శతధన్వుణ్ణి సంహరించి, శ్యమంతకమణిని చేజిక్కించుకోవాలనుకున్నారు. బలరామకృష్ణులు. తనను వధించేందుకు రానున్నారని తెలిసి, అక్రూర కృతవర్మలను ఆశ్రయించాడు శతధన్వుడు. ప్రాణభిక్ష పెట్టండంటూ సహాయం చేయమని ప్రాధేయపడ్డాడు. సత్రాజిత్తును చంపమన్నదీ వారే! శ్యమంతకాన్ని తీసుకుపొమ్మన్నదీ వారే! అయినా బలరామకృష్ణుల శౌర్యప్రతాపాల ముందు తామేమీ కారన్నది తెలుసుకున్న అక్రూర కృతవర్మలు, శతధ్వనునికి ఎలాంటి అభయాన్నీ ప్రసాదించలేకపోయారు. ప్రాణాపాయం తప్పదని తెలుసుకున్నాడు శతధ

న్వుడు. ద్వారకలో ఉండడం ప్రమాదం అనుకున్నాడు. శ్యమంతకాన్ని అక్రూరుని వద్ద ఉంచి, అక్కణ్ణుంచి పారిపోయాడు. రోజుకి నూరుయోజనాలు పరిగెత్తగలిగే గుర్రం ఎక్కి పరుగు దీశాడతను. బలరామకృష్ణులకు శతధన్వుడు పారిపోతున్నాడని తెలిసింది. వెంబడించారతన్ని. రథం మీద బలరామకృష్ణులు, గుర్రం మీద శతధన్వుడు ముందు వెనుకలుగా పరిగెత్తారు. ఆఖరికి మిథిలానగరం ప్రాంతంలో బలరామకృష్ణులకు శతధన్వుడు దొరికిపోయాడు. అతన్ని అక్కడే సంహరించారు. శ్యమంతకం కోసం అతని దుస్తులన్నిటా వెదికారు. కనిపించలేదది. అయితే ద్వారకలోనే శ్యమంతకం ఉంది, ఎవరిదగ్గరో దాచిపెట్టి ఉంటాడన్నాడు కృష్ణుడు. ద్వారకకు బయల్దేరాడు. బలరాముడు కొద్దికాలం మిథిలానగరంలోనే ఉండిపోయాడు. జనకరాజు ఆతిథ్యాన్ని స్వీకరించాడతను. అప్పుడే దుర్యోధనుడు మిథిలకు చేరుకుని, బలరాముణ్ణి సేవించాడు. మెప్పించి అతని దగ్గర గదాయుద్ధంలో మరిన్ని మెలకువలు తెలుసుకున్నాడు.

ద్వారకకు చేరుకున్నాడు కృష్ణుడు. శతధన్వుణ్ణి హతమార్చానని సత్యభామకు చెప్పాడు. అయితే అతని వద్ద శ్యమంతకం లభ్యం కాలేదన్నాడు. ఇక్కడే ఎక్కడో దానిని భద్రపరచి ఉంటాడన్నాడు. సత్రాజిత్తుకి అంత్యక్రియలు జరిపించాడు. తండ్రి అంత్యక్రియల అనంతరం, శ్యమంతకం కావాలంటూ పట్టుబట్టింది సత్యభామ. సాధిస్తానన్నాడు కృష్ణుడు. ఆ ప్రయత్నంలో అహర్నిశలూ శ్రమించసాగాడు. శతధన్వుని మరణం, శ్యమంతకం కోసం కృష్ణుని ప్రయత్నం తెలుసుకున్న అక్రూర కృతవర్మలు ఎంతో కాలం ద్వారకలో ఉండడం క్షేమకరం కాదనుకున్నారు. శతధ్వనుణ్ణి ప్రోత్సహించింది తామేనని కృష్ణునికి తెలిస్తే నేల మీద నూకలు చెల్లినట్టేనని భావించారు. భయపడ్డారు. ఆ భయంతో ద్వారకను విడిచి పారిపోయారిద్దరూ.

అక్రూరుడు పారిపోవడంతో ద్వారకావాసులకు అనేక కష్టాలు కలిగాయి. అనావృష్టి ఏర్పడింది. కరువొచ్చింది. ప్రజలు అనేకరకాల వ్యాధులకూ, ఈతిబాధలకూ గురయ్యారు. అక్రూరుడు ఉంటే ఈ బాధలు ఉండవని, అతను ద్వారకను విడిచిపెట్టిన కారణంగానే ఈ బాధలన్నీ వచ్చిపడ్డాయని అనుకున్నారు ప్రజలు. ప్రజాభిప్రాయాన్ని కృష్ణునికి తెలియజేశారు పెద్దలు. ఎలాగయినా అక్రూరుని ద్వారకకు రప్పించమని ప్రార్థించారు. అక్రూరుడు లేనంత మాత్రాన అనావృష్టీ, కరువూ వచ్చిందని భావించడం తప్పన్నాడు కృష్ణుడు. అక్రూరుడు లేనందువల్ల కాదు, శ్యమంతకం లేనందువల్ల ఈ బాధలన్నీ వచ్చి పడ్డాయన్నాడు. సూర్యదత్తమూ, మహిమాన్వితమూ అయిన శ్యమంతకం ఎక్కడ ఉంటుందో అక్కడ బాధలు ఉండవంటూ శ్యమంతకం అక్రూరునివద్దే ఉన్నదని గ్రహించాడు. అక్రూరుని ద్వారకకు తిరిగి రావాల్సిందంటూ దూతలను పంపించి ఆహ్వానం పలికాడు. ఎలాంటి భయాలూ పెట్టుకోవద్దన్నాడు. హాని తలపెట్టనన్నాడు కృష్ణుడు. ఎప్పుడయితే అభయం దొరికిందో అప్పుడు ద్వారకకు చేరుకున్నాడు అక్రూరుడు. కృష్ణుని సందర్శించి ఊపిరిపీల్చుకున్నాడు. భయాన్ని పోగొట్టేందుకు అక్రూరునితో చాలా తీయగా మాట్లాడాడు కృష్ణుడు. మంచి మాటలతో అతన్ని సంతోషపెట్టాడు. రాజ్యంలో కరువుని ప్రస్తావించాడు. శ్యమంతకం ప్రాముఖ్యతను వివరించాడు. అప్పుడు తన వద్దనే ఉందంటూ శ్యమంతకాన్ని చూపించి, దానిని కృష్ణునికి సమర్పించాడు అక్రూరుడు. వద్దన్నాడు కృష్ణుడు.

''నీ దగ్గరే ఉండనీ! ఈ మణి మనరాజ్యంలో ఉంటే చాలు'' అన్నాడు. శ్యమంతకం రాకతో ద్వారకలో వర్షాలు కురిశాయి. పంటలు పండాయి. కరువుతీరింది. ప్రజలు సుఖించారు.

### అష్టభార్యలు

రుక్మిణి, సత్యభామ, జాంబవతిసహా శ్రీకృష్ణుడు మరో అయిదుగురు కన్యలను వివాహమాడాడు. వారు కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ. అష్టభార్యలలో రుక్మిణి పట్టమహిషి. ఆమె లక్ష్మీదేవి అంశతో జన్మించింది. సత్యభామ అంటే కృష్ణుడికి అనురాగం ఎక్కువ. ఆమె నెరజాణ. ధైర్యసాహసాలుకలది. కాళింది సూర్యుని కుమార్తె. విష్ణుమూర్తిని వివాహం చేసుకోవాలని కాళింది కోరిక. ఆ కోరిక నెరవేర్చుకునేందుకు ఆమె తపస్సు చేసింది. కూతురుకోసం సూర్యుడు యమునాజలంలో ఒక గృహాన్ని నిర్మించాడు. ఆ గృహంలోనే విష్ణుమూర్తిని ధ్యానించసాగింది కాళింది.

పాండవులు ఇంద్రప్రస్థంలో ఉన్నప్పుడు వారిని చూసేందుకు అక్కడికి వచ్చాడు కృష్ణుడు. కొన్నాళ్ళు విడిది చేశాడు. ఒకనాడు అర్జునుడుసహా కృష్ణుడు యమునానదికి వెళ్ళాడు. అప్పుడు వారికి కాళింది కనిపించింది. ఆమె అభిమతం వెల్లడించింది. కృష్ణుడు అంగీకరించి ఆమెను వివాహం చేసుకున్నాడు.

మిత్రవింద అవంతీ దేశాధీశ్వరులయిన విందానువిందుల చెల్లెలు. శ్రీకృష్ణుని మేనత్త రాజాధిదేవి కూతురు. మిత్రవిందకు శ్రీకృష్ణుడంటే ఇష్టం. అది అన్నలకు కష్టం కలిగించింది. వారు ఆమెకు స్వయంవరాన్ని ప్రకటించారు. అప్పుడు ఆ స్వయంవరంలో పాల్గొని, రాజులందరినీ నిర్జించాడు కృష్ణుడు. మిత్రవింద మనసు తెలుసుకుని, ఆమెను వివాహం చేసుకున్నాడు.

నాగ్నజితి కోసలదేశాధీశుడు నగ్నజితి కుమార్తె. నగ్నజితి దగ్గర మదించిన వృషభాలు ఏడు ఉన్నాయి. వాటిని లొంగదీయడం మహాకష్టం. గొప్పగొప్పశూరులు అందుకు ప్రయత్నించి విఫలురయ్యారు. వాటిని లొంగదీసిన వారికి తన కుమార్తె నాగ్నజితిని ఇచ్చి వివాహం చేస్తానన్నాడు రాజు. కృష్ణుడు ప్రయత్నించి విజయం సాధించాడప్పుడు. నాగ్నజితిని వివాహం చేసుకున్నాడు.

కృష్ణుని మేనత్త శ్రుతకీర్తి కుమార్తె భద్ర. సుదర్శనాదుల చెల్లెలు. ఆమెను అపురూపంగా వివాహమాడాడు కృష్ణుడు. మద్రదేశపు రాకుమార్తె లక్షణ. సకల శుభలక్షణాలూ గల ఆమెను కోరికోరి మరీ వివాహం చేసుకున్నాడు కృష్ణుడు.

## ప్రద్యుమ్నుడు-అనిరుద్ధుడు

అష్టభార్యలతో వాసుదేవుని వంశం తామరతంపరగా వృద్ధి చెందింది. కృష్ణుని భార్యలొకొక్క రికీ పదిమంది పుత్రులు జన్మించారు. పట్టపురాణి రుక్మిణికి ప్రద్యుమ్నుడు, చారుధేష్ణుడు మొదలయినవారు జన్మించారు. సత్యభామకు భానుడు, సుభానుడు మొదలయినవారు జన్మించారు. సాంబుడు, శథజిత్తు మొదలయినవారు జాంబవతికి జన్మించారు. వృషదాముడు, వేగవంతుడు మొదలయినవారు నాగ్నజితికి జన్మించారు. కాళిందికి భద్రుడు, సుబాహుడు మొదలయినవారు జన్మించారు. లక్షణకు ప్రఖోషుడు, బలుడు మొదలయినవారు జన్మించారు. మిత్రవిందకు వృకుడు, అర్కుడు మొదలయినవారు జన్మించారు. బృహత్సేనుడు, సంగ్రామజిత్తు

మొదలయినవారు భద్రకు జన్మించారు. ఈ అష్టభార్యలేగాక కృష్ణునికి మరో భార్య కూడా ఉంది. ఆమె పేరు రోహిణి. ఆమెకు దీప్తిమంతుడు ఆదిగా గలవారు జన్మించారు.

## ప్రద్యుమ్నుడు

సంతానం కోసం విష్ణుమూర్తి ఒకప్పుడు శివుణ్ణి ప్రార్థించాడు. శివుని వరప్రభావంతో విష్ణుమూర్తికి ఓ చక్కని కుమారుడు జన్మించాడు. అతనే మన్మథుడు. శంకరుని ప్రార్థించి, విష్ణుమూర్తి తనని ప్రార్థించలేదని సతీదేవికి కోపం వచ్చింది. ఆ కోపంతో శివుని అనుగ్రహంతో విష్ణుమూర్తికి పుట్టిన కుమారుడు అదే శివుని ఆగ్రహంతో మరణిస్తాడని శపించిందామె. అప్పుడు విష్ణుమూర్తి, సతీదేవిని ప్రార్థించాడు. క్షమించమన్నాడు. క్షమించింది సతీదేవి. శాపం తొలగించ మని వేడుకున్నాడు. తొలగించింది సతీదేవి. మరణించినప్పటికీ కుమారుడు బ్రతుకుతాడని విష్ణుమూర్తికి అభయం ఇచ్చింది.

మన్మథుడు చూడచక్కనివాడు. లోకంలోని అందం అంతా పోగయి, తీర్చిదిద్దినట్టుగా ఉంటాడతను. అతని వాహనం చిలుక. చెరకుగడ అతని విల్లు. అరవిందాది పుష్పాలు బాణాలు. వసంతుడు అతని చెలికాడు. మన్మథుని వామభాగం నుండి ఓ కన్య జన్మించింది. ఆమె పేరు రతీదేవి. మన్మథుడు ఆమెనే భార్యగా స్వీకరించాడు. మన్మథకార్యం ఒకటే! బ్రహ్మాదిదేవతలనేగాక జితేంద్రియులయిన మహర్షులను కూడా మోహపెట్టి వారిని కామాసక్తులను చేయడమే!

తమను తారకాసురుడు హింసిస్తున్నప్పుడు, దేవతలంతా బ్రహ్మదేవుని సమీపించి మొరపెట్టుకున్నారు. కాపాడమని వేడుకున్నారు. శివునికి పుట్టే కుమారుడు తప్ప, మరెవరూ తారకాసురుణ్ణి వధించలేరని, అంత వరకూ ఓర్పు వహించాలన్నాడు బ్రహ్మ. ఆ సమయంలో పరమనిష్ఠతో స్త్రీ చింతనే లేకుండా శివుడు ఘోరతపస్సు చేసుకుంటున్నాడు. అతన్ని వివాహం చేసుకోవాలని హిమవంతుని కుమార్తె పార్వతి వేచి చూస్తున్నది. ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలనుకున్నారు దేవతలు. మన్మథుణ్ణి ఆశ్రయించారు. శివుని మనసు పార్వతిపై లగ్న మయ్యేట్టుగా చూడమని ప్రార్థించారు. సరేనన్నాడు మన్మథుడు. శివుని మీదకు పూలబాణాలు ప్రయోగించసాగాడు. ఆ బాణాలకు శివుని ఏకాగ్రత చెడింది. మనసు చెదిరింది. తననిలా చేసింది ఎవరన్నట్టుగా కోపంతో కళ్ళు తెరచి చూశాడు శివుడు. ఎదురుగా మన్మథుడు కనిపించాడు. రెట్టించిన కోపంతో మూడోకన్ను తెరిచాడు శివుడు. అంతే! మన్మథుడు బూడిదయిపోయాడు. భర్త బూడిదయిపోయాడని తెలిసి రతీదేవి విలపించింది. అతని వియోగాన్ని తట్టుకోలేక రోదించింది. అప్పుడు దేవతలు కల్పించుకున్నారు. మరణించిన మన్మథుడు ప్రద్యుమ్నుడుగా జన్మిస్తాడని తెలియజేశారు. ఓదార్చారామెను. కొన్నాళ్ళకు నారదుడు, రతీదేవిని సందర్శించాడు. రుక్మిణి కృష్ణులకు ప్రద్యుమ్నుడు పుడతాడని, అయితే అతన్ని శంబరాసురుడు చంపేందుకు ప్రయత్నిస్తాడని చెప్పాడు. భర్తను కాపాడుకునేందుకు రతీదేవి భూలోకానికి ప్రవేశించింది. మాయావతి పేరుతో శంబరాసురుని ఇంట చేరింది. సేవలు చేయసాగిందక్కడ.

కొద్దిరోజులు గడిచాయి. ద్వారకలో రుక్మిణీదేవికి చక్కని కుమారుడు జన్మించాడు. ప్రద్యుమ్నుడు అతడే! ఆనాడు శివుని మూడోకంటికి బూడిదయిన మన్మథుడు, ఈనాడు కృష్ణావతారంలో ఉన్న విష్ణుమూర్తికి కుమారుడయినాడు. వారంరోజులు గడవలేదు. ప్రద్యుమ్నునికి ఆపద



ముంచుకొచ్చింది. జటాసురుని పుత్రుడు శంబరాసురునికి, ప్రద్యుమ్నుని కారణంగా మరణం ఉన్నదని తెలిసింది. ఆ సంగతి ఆకాశవాణి చెప్పి, హెచ్చరించిందతన్ని. దాంతో శంబరుడు కాకిరూపంలో పురిటింట ప్రవేశించాడు. ప్రద్యుమ్నుని ముక్కున కరచుకుని పారిపోయాడు. సముద్రంలో పడవేశాడతన్ని. మాగన్నులో ఉంది రుక్మిణి. పొత్తిళ్ళలో పిల్లాడు ఉన్నాడనుకున్నది. మెలకువ తెచ్చుకుని చూస్తే లేడు. గొల్లుమంది. ఏమయినాడంటే ఏమయినాడంటూ ప్రద్యుమ్నుని వెదకసాగారంతా.

శంబరాసురుడు సముద్రంలో పడవేసిన ప్రద్యుమ్నుణ్ణి ఒక చేప మింగి వేసింది. దైవవశాన జాలరి వలకి చిక్కిందది. వలలో చిక్కిన చేపను చూసి ముచ్చటపడ్డాడు జాలరి. ఎంతపెద్దది, ఎంత అందమయినది, ఎంత అరుదయినది అనుకున్నాడు. ఏలికకు బహూకరించాలనుకున్నాడు. తీసుకుని వెళ్ళి దాన్ని శంబరాసురునికి బహూకరించాడు. వంటవారు చేపను తరిగారు. దాని

కడుపులో బాలుణ్ణి చూసి ఆశ్చర్యపోయారు. అక్కడ ఉన్న మయావతికి పిల్లాడి సంగతి చెప్పి, ఏం చేద్దామని ప్రశ్నించారు. ఆలోచనలో పడింది మాయావతి. ఈ పిల్లాడు ఎవరయి ఉంటాడంటూ తర్జనభర్జన పడసాగింది. అప్పుడు నారదుడు వచ్చాడక్కడికి. రతీదేవికి సంగతంతా చెప్పాడు. ఆ పిల్లాడు ఎవరో కాదు, నీ భర్తే అన్నాడు. శంబరాసురుడు సముద్రంలో పడేస్తే, చేప మింగిందన్నాడు. సంతోషించింది రతీదేవి. ప్రద్యుమ్నుణ్ణి జాగ్రత్తగా పెంచసాగింది. పెద్దవాడయినాడు ప్రద్యుమ్నుడు. యువకుడయ్యాడు. అప్పుడు అతనికి పూర్వగాథంతా చెప్పింది రతీదేవి.

నువ్వు మన్మథుడివి.

నేను రతీదేవిని.

తారకాసురుని కారణంగా అప్పుడలా విడిపోయి, ఇప్పుడిలా కలుసుకున్నామన్నది. శంబరుని వల్ల ప్రమాదం ఉన్నదని చెప్పి, అతనికి మహామాయావిద్యను ఉపదేశించింది. మహామాయా విద్యను సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్న ప్రద్యుమ్నుడు, శంబరాసురుణ్ణి యుద్ధానికి పిలిచాడు. నువ్వో నేనో తేల్చుకుందాం రా అన్నాడు. ఇద్దరి మధ్యా ఘోరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో శంబరాసురుడు అనేక మాయలు ప్రయోగించాడు. ఆ మాయలన్నిటినీ తను నేర్చుకున్న మహామాయావిద్యతో తుత్తునియలు చేశాడు ప్రద్యుమ్నుడు. చివరికి శంబరాసురుణ్ణి సంహరించాడు.

రాక్షససంహారం అనంతరం భార్య రతీదేవిసహా ఆకాశ మార్గాన ద్వారకకు ప్రయాణించాడు ప్రద్యుమ్నుడు. అంతఃపురంలో దిగాడు. కృష్ణునికీ, ప్రద్యుమ్నునికీ నెమలిపింఛమే తేడా! కృష్ణుడు నెమలిపింఛాన్ని ధరిస్తాడు. ప్రద్యుమ్నుడు ధరించడు. రూపురేఖావిలాసాల్లో ఇద్దరూ ఒకటే! అంతఃపుర స్త్రీలు ప్రద్యుమ్నుని చూసి, ముందు కృష్ణుడు అనుకున్నారు. తర్వాత అతని పక్కన ఉన్న రతీదేవిని చూసి కాదు కాదు అనుకున్నారు. ఎవరో కొత్తదంపతులు అనుకున్నారు. ఎవరయి ఉంటారా? అని ఆలోచనలు చేయసాగారు. ప్రద్యుమ్నుని చూసి రుక్మిణీదేవి, ఆనాడు తను కోల్పోయిన బిడ్డ పెరిగి పెద్దయితే ఇంతవాడయ్యేవాడనుకున్నది. పట్టి పట్టి ప్రద్యుమ్నునిలో పోలికలు వెదకసాగింది. అప్పుడక్కడికి నారదుడు విచ్చేశాడు. ఇంతలో దేవకీవసుదేవులు సహా శ్రీకృష్ణుడు కూడా వచ్చాడక్కడికి. రుక్మిణికి జరిగిన కథంతా తెలియజేశాడు నారదుడు.

ఈ కుర్రాడు నీ కొడుకే అన్నాడు.

ఈమె నీ కోడలు అన్నాడు.

ఆనందించింది రుక్మిణీదేవి. భార్యసహా ప్రద్యుమ్నుడు తల్లిదండ్రులకూ, పెద్దలకూ నమస్కరించాడు. ఆశీర్వాదాలు అందుకున్నాడు.

మేనమామ రుక్మి కుమార్తె రుక్మవతిని కూడా వివాహం చేసుకున్నాడు ప్రద్యుమ్నుడు. స్వయంవరంలో రాజులందరినీ గెలిచి మరీ రుక్మవతిని సొంతం చేసుకున్నాడతను. బావ–బావమరిదిగా రుక్మి కృష్ణులకు శత్రుత్వం ఉన్నప్పటికీ, పిల్లల భవిష్యత్తు కోసం, తెగిన బంధుత్వాన్ని కలుపుకోవడం కోసం రుక్మవతితో ప్రద్యుమ్నుని వివాహానికి ఇరువురూ అంగీకరించారు. రుక్మవతి ప్రద్యుమ్నులకు ఒక కుమారుడు జన్మించాడు. అతని పేరు అనిరుద్ధుడు. అతను తండ్రి తాతలు ఇరువురికీ సరిసమానుడుగా ప్రసిద్ధి చెందాడు.

## ఉషాపరిణయం

బలిచక్రవర్తికి నూరుగురు కొడుకులు. వారిలో పెద్దవాడు బాణుడు. మహాబలశాలి అతను. శోణపురం అతని రాజధాని. బాణుడికి వెయ్యి చేతులు. శివభక్తుడతను. ఘోరతపస్సు చేశాడు. తాండవోత్సవంలో తన వేయి చేతుల్తో అనేక వాద్యాలు వాయించి శివుణ్ణి మెప్పించాడతను. ఆ ఆనందంలో అనుగ్రహించాడు శివుడు. వరం కోరుకో అన్నాడు. తన నగరి వాకిలి ముందు కావలిగా శివుణ్ణి ఉండమన్నాడు బాణుడు. శంకరుడు అందుకు అంగీకరించాడు. భార్యపార్వతి, ప్రమథగణాలసహా వచ్చి, శోణపురం వాకిలి ముందు కావలి అయ్యాడు. ఎప్పుడయితే శివుడు కావలి అయ్యాడో అప్పటి నుంచి బాణాసురుడు విర్రవీగసాగాడు. యుద్ధోన్మాదుడయ్యాడు. తనతో పోరాడే బలశాలి కోసం వెదకసాగాడు. ఎవరూ కనిపించలేదు. కనిపించకపోవడంతో ఆఖరికి శివుణ్ణే యుద్ధానికి పిలిచాడు. తనని యుద్ధానికి పిలవడంతో బాణుడికి దుర్దినాలు సమీపించాయనుకున్నాడు శివుడు. అతని మదం అణగే రోజు రానున్నదని అర్థమయిందతనికి.

''మూర్ఖుడా! నీ ధ్వజం ఎప్పుడు విరిగిపడుతుందో అప్పుడు నీ మదం అణచేందుకు నాలాంటి వాడే నిన్ను ఎదిరిస్తాడు. వేచి చూడు'' అన్నాడు శివుడు.

బాణాసురునికి ఓ కుమార్తె ఉన్నది. ఆమె పేరు ఉష. గొప్ప అందగత్తె. ఓ రాత్రి ఆమె ఓ కలగన్నది. అనిరుద్ధుని బిగికౌగిలిలో కరిగిపోతున్నట్టుగా, పరవశించిపోతున్నట్టుగా అనిపించిందామెకు. చూడచక్కని రూపం, బలమైన దేహం, ఊపిరాడనీయని తాపం చాలు చాలనుకున్నది. పెళ్ళి చేసుకుంటే అతన్నే చేసుకోవాలనుకున్నదామె. అయితే అనిరుద్ధుడెవరో ఆమెకు తెలియదు. అతను ఎక్కడివాడో తెలియదు. అయినా అతన్నే మనసూ, శరీరం కోరుకోవడంతో రాత్రీ పగలూ అనిరుద్ధుని ధ్యాసలోనే ఉండసాగిందామె. నిద్రాహారాలు మానుకున్నది.

బాణాసురునికి ఓ మంత్రి ఉన్నాడు. అతని పేరు కుంభాండుడు. అతనికి ఓ కుమార్తె. ఆమె పేరు చిత్రలేఖ. ఆమెకు రాని విద్య లేదు. ఉషకు ఆమె ప్రాణసఖి. ఒకనాడు చిత్రలేఖ ముందు మనసు విప్పింది ఉష. తన మనోవేదనను గుమ్మరించింది. ఎలా ఉంటాడు? వివరాలు అడిగింది చిత్రలేఖ. ఒకొక్కటీ వివరించింది ఉష. వివరిస్తూనే మదనతాపానికీ మత్తుకీ గురయింది. ఉష చెప్పినదంతా గుర్తుంచుకుని చిత్తరువు గీసి చూపించింది చిత్రలేఖ. చిత్తరువును చూస్తూనే సంబరపడిపోతూ అవునవును! ఇతనే అన్నది ఉష. చిత్తరువును గుండెలకు గట్టిగా అదుముకుంది. అనిరుద్ధుని చిత్తరువును వారికీ వీరికీ చూపించి వివరాలు సేకరించింది చిత్రలేఖ. అతను కృష్ణుని మనుమడు. ప్రద్యుమ్నుని కుమారుడు, అనిరుద్ధుడు అని తెలుసుకుంది. తెలుసుకున్నదే ఆలస్యం, ఆకాశయానం చేసి, ద్వారకకు చేరుకున్నది చిత్రలేఖ. ఎవరికీ కనిపించకుండా అనిరుద్ధుని ఏకాంతమందిరంలోనికి చేరుకున్నది. అక్కడ నిద్రిస్తున్న అనిరుద్ధుణ్ణి అలాగే తన యోగబలంతో శోణపురికి చేర్చింది. అంతఃపురంలో ఉష మందిరంలో ఉంచిందతన్ని. తెల్లారింది. మేల్కొన్నాడు అనిరుద్ధుడు. ఎదురుగా మత్తుకళ్ళతో మురిసిపోతూ నిల్చున్న ఉషను చూశాడు. మోహించాడామెను. ఇద్దరూ ఏకశయ్యాగతులయ్యారు. ఆనాటి నుంచి అక్కడే ఉండిపోయాడు అనిరుద్ధుడు. అయితే అతను అక్కడ ఉన్నట్టుగా ఇటు ఉషకూ, అటు చిత్రలేఖకూ తప్ప వేరెవరికీ తెలియదు.

కొద్దిరోజులు గడిచాయి. ఉష గర్భవతి అయింది. రహస్యం కాస్త బయటపడింది. కావలి భటులు వెళ్ళి రాకుమారి గర్భవతి అన్న సంగతి బాణాసురునికి తెలియజేశారు. అగ్గిరుద్రు డయ్యాడు బాణాసురుడు. ఒక్క ఉదుటున ఉష మందిరానికి వెళ్ళి, అక్కడ ఉన్న అనిరుద్ధుణ్ణి చూశాడు. అంతఃపురంలో రాకుమారి మందిరంలో పరపురుషుడు. రాకుమారి గర్భవతి. తట్టుకోలేకపోయాడు బాణాసురుడు. అనిరుద్ధుణ్ణి సంహరించేందుకు ముందుకురికాడు. అనిరుద్ధుడు బెదరిపోలేదు. అతనూ వీరుడే! బాణాసురునితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఇద్దరికీ పెద్ద యుద్ధం జరిగింది. బాణుణ్ణే కాదు, అతని సైనికుల్ని కూడా నిలువరించగలిగాడు అనిరుద్ధుడు. తను ఓడిపోతున్నాననిపించి, ఇక తప్పదనిపించి, నాగపాశాలతో అనిరుద్ధుని బంధించాడు బాణుడు. కుప్పకూలిపోయాడు అనిరుద్ధుడు. అలా కుప్పకూలిన అనిరుద్ధుణ్ణి చూసి ఉష కన్నీరుమున్నీరయింది. భోరుభోరున విలపించింది.

## శివకేశవుల యుద్ధం

అక్కడ అలా బందీ అయిపోయిన అనిరుద్ధుడు, ఇక్కడ ద్వారకలో కనిపించకపోయేసరికి అతను ఏమయ్యాడో తెలియక బంధుమిత్రులంతా ఆందోళన చెందసాగారు. దుఃఖసముద్రంలో మునిగిపోయారు. అయితే నడుస్తున్నది వానాకాలం. ఈ వానాకాలం నాలుగునెలలూ ఎక్కడికీ వెళ్ళడానికి వీలుపడదు, వెదికేందుకు కూడా అనువుకాదనుకుని ఊరుకున్నారంతా. అప్పుడక్కడికి నారదుడు విచ్చేశాడు. దుఃఖితులయి ఉన్న యాదవ ప్రముఖులను చూసి జాలి చెందాడు. అనిరుద్ధుడు ఎక్కడ ఉన్నదీ తెలియజేశాడు వారికి. ఉషాకన్యను ప్రేమించి, అతను బాణాసురునికి బందీ అయినాడని తెలిపాడు. దానికి నారదమహర్షికి కృతజ్ఞతలు తెలిపి, కృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, సాత్యకి, గదుడు, సాంబుడు మొదలయిన వారంతా అనిరుద్ధుణ్ణి విడిపించుకునేందుకు పన్నెండు అక్షౌహిణుల సైన్యంతో శోణపురంపై దండెత్తారు.

యదుసైన్యాన్ని వాకిలిలో కావలిగా ఉన్న శంకరుడు, తన ప్రమథగణాలతో ఎదుర్కొన్నాడు. బాణాసురుడు కూడా ఎదుర్కొన్నాడు వారిని. భయంకరమయిన యుద్ధం జరిగింది. నంది వాహనారూఢుడై శివుడు, త్రిశూలంతో శ్రీకృష్ణునితో తలపడ్డాడు. శివకేశవుల మధ్య ఘోరయుద్ధం సంభవించింది. ఆ యుద్ధం చూసేందుకు దేవతలు అంతా ఆకాశంలో నిలిచారు. బలరాముడు ప్రమథగణాలనూ, బాణాసుర సైన్యాలనూ తీవ్రంగా నొప్పించాడు. దివ్యాస్త్రాలను ప్రయోగించి, కృష్ణుణ్ణి నేలకూల్చే ప్రయత్నం చేశాడు శివుడు. వాటికి సరిజోడు అస్త్రాలను ప్రయోగించి, శివుణ్ణి మోహపరవశుణ్ణి చేశాడు కృష్ణుడు. లక్షలాదిగా బాణాసుర సైన్యాలను కూడా కడతేర్చాడు. అటు తిరిగి, ఇటు తిరిగి ఆఖరికి బాణాసురుణ్ణి ఎదుర్కొన్నాడు కృష్ణుడు. అతన్ని విరథుణ్ణి చేశాడు. కృష్ణుని ధాటికి వెన్నిచ్చి పారిపోతున్న ప్రమథగణాలను చూసి, మహేశ్వరజ్వరాన్ని సృష్టించాడు శివుడు. మూడు తలలూ, మూడుకాళ్ళూ గల ఆ జ్వరాన్ని చూసి, దానికి ప్రతిగా వైష్ణవజ్వరాన్ని సృష్టించాడు కృష్ణుడు. రెండిటికీ పెద్దయుద్ధం జరిగింది. చివరకు మహేశ్వరజ్వరం ఓడిపోయింది. శ్రీకృష్ణుని శరణు వేడింది. అతని పాదాలమీదపడి, అనేక విధాల స్తుతించింది. ప్రసన్నుడయ్యాడు కృష్ణుడు. మహేశ్వరజ్వరానికి అభయం కల్పించాడు. జరిగిందంతా తెలుసుకున్నవారికి జ్వరభయం



ఉండదన్నాడు. ఇంతలో బాణుడు పుంజుకున్నాడు. కృష్ణుడితో మళ్ళీ తలపడ్డాడు. అప్పుడు అతని వెయ్యి చేతుల్నీ కృష్ణుడు ఖండించేశాడు. శిరస్సును ఖండించేందుకు ముందుకు ఉరుకుతున్న కృష్ణుణ్ణి వారించాడు శివుడు. తన భక్తుణ్ణి రక్షించమని వేడుకున్నాడు.

''కృష్ణా! ఈ బాణుడు నా భక్తుడు. ఇతనికి అభయం ఇచ్చాను, ఎవరూ చంపలేరన్నాను. నా మాట మన్నించి ఇతన్ని వదిలేయి.'' ప్రార్థించాడు శివుడు. వేదమంత్రాలతో కృష్ణుణ్ణి స్తుతించాడు. అనుగ్రహించాడు కృష్ణుడు.

''మహాదేవా! ప్రహ్లాదుడు నాకు పరమభక్తుడు. అతని వంశీయుల్ని చంపనని ఆనాడే మాట ఇచ్చానతనికి. ఈ బాణుడు ప్రహ్లాదుని మనుమడు. చంపను. కాకపోతే బెదిరించకతప్పదు. ఆ

కారణంగానే ఇతని వేయి చేతుల్నీ నరికివేశాను. ఇక అనంతమయిన ఇతని సైన్యాన్ని ఎందుకు సంహరించానంటే భూభారం తగ్గించాలి కదా, తప్పదు'' అన్నాడు కృష్ణుడు.

బాణుడుకి నాలుగు చేతులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఆ చేతుల్తో బాణుడు శ్రీకృష్ణుని శరణు వేడాడు. అనుగ్రహించాడు కృష్ణుడు. శివుని సామాజికుల్లో ప్రముఖుడివయి, జరామరణ రహితంగా వర్ధిల్లమన్నాడు. శివుడు అందుకు ఎంతగానో సంతోషించాడు. అనిరుద్ధుణ్ణి బంధ విముక్తుణ్ణి చేశాడు బాణుడు. తీసుకుని వచ్చి శ్రీకృష్ణునికి అప్పగించాడు. ఉషనిచ్చి వైభవంగా వివాహం జరిపించాడు. వివాహానికి విచ్చేసిన శ్రీకృష్ణునికీ, అతని బంధువులందరికీ దివ్యవస్త్రాలు బహూకరించి, వారిని సత్కరించాడు బాణుడు. కృష్ణుడు అప్పుడు ద్వారకానగరానికి తిరుగు ప్రయాణమయ్యాడు.

ఉషనేగాక అనిరుద్ధుడు రుక్మి మనుమరాలు రుక్మలోచననుకూడా వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం చాలా వైభవంగా జరిగింది. బలరాముడు, రుక్మిణి సహా కృష్ణుడు భోజకటకపురానికి తరలివెళ్ళాడు. వివాహానంతరం కళింగరాజుల ప్రోత్సాహం మేరకు రుక్మి, బలరాములు జూదం ఆడారు. జూదంలో బలరాముడు గెలిచినప్పటికీ రుక్మి కాదన్నాడు. తానే గెలిచానన్నాడు. తగవు పెట్టుకున్నాడు. బలరామునికి కోపం వచ్చిందప్పుడు. ఆ కోపంతో రుక్మిని సంహరించాడతను. జూదాన్ని ప్రోత్సహించిన కళింగరాజులను కూడా కడతేర్చాడు బలరాముడు.

## నరకాసురవధ

పూర్వం వరహావతారవేళ విష్ణుమూర్తికీ, భూదేవికీ ఒక కుమారుడు కలిగాడు. అతడే నరకాసురుడు. ప్రాగ్జ్యోతిపురం అతని నివాసం. రాక్షస ప్రవృత్తితో నరకాసురుడు లోకాలనన్నిటినీ బాధించసాగాడు. మహాబలవంతుడు, దివ్యాస్త్ర, శస్త్రాలూ కలిగినవాడవడంతో నరకాసురుణ్ణి ముల్లోకాల్లోనూ ఎవరూ ఎదిరించలేకపోయారు. అతని హింసను ఇటు మానవులేకాదు, అటు దేవతలుకూడా భరించలేకపోయారు. ఆఖరికి భూదేవి కూడా, తన కుమారుడు కలుగజేస్తున్న హింసను చూడలేక అతను మరణిస్తే బాగుణ్ణనుకున్నది. నరకాసురునికి ఓ ఏనుగు ఉన్నది. దాని పేరు సుప్రతీకం. అది అతని వాహనం. పీఠుడు అతని దండనాథుడు. పెద్దసైన్యంతో నరకుడు అకారణంగా అనేక రాజ్యాలపై దండెత్తేవాడు. రాజుల్ని యుద్ధంలో ఓడించి, వారిని హింసించి ఆనందించేవాడు. ఓడిపోయిన రాజుల ధనద్రవ్యాలను కొల్లగొట్టడమేకాదు, పదహారువేలమంది రాచకన్యలను కూడా చెరబట్టాడు. నగరంలో వారిని నిర్బంధించాడు. ఇంద్రాది దిక్పాలకులు కూడా నరకుణ్ణి ఎదుర్కొనలేకపోయారు. దీనికి కారణం, నరకుడు బలాఢ్యుడు అయి ఉండడమే కాదు, అతని నగరం ప్రాగ్జ్యోతిపురం దుర్భేద్యం కావడం కూడా మరో కారణం. ప్రాగ్జ్యోతిపురం చుట్టూ గిరిదుర్గం, శస్త్రదుర్గం, జలదుర్గం, అగ్నిదుర్గం, వాయుదుర్గం అని అయిదు దుర్గాలు ఉన్నాయి. ఈ దుర్గాలేకాదు, మురపాశాలు కూడా కట్టుదిట్టంగా ఉన్నాయి. వాటినన్నిటినీ భేదించుకుని నరకాసురుని ఎదిరించడం ఎవరి వల్లా కాదు.

తనని ఎవరూ ఎదుర్కొనలేరు. తనని ఎవరూ జయించలేరని విర్రవీగుతూ నరకుడు వరుణుని ఛత్రం, అదితిదేవి కర్ణకుండలాలు, దేవతలకు నివాసయోగ్యమయిన మేరుపర్వతంలోని మణిపర్వతం, వైజయంతీ వనమాలికను అపహరించాడు. అది తట్టుకోలేక శ్రీకృష్ణుని

ఆశ్రయించాడు ఇంద్రుడు. జరిగిందంతా కృష్ణునికి తెలియజేశాడు. నరకాసురుని హింసలనుంచి తమను కాపాడమని ప్రార్థించాడు. అనుగ్రహించాడు కృష్ణుడు. 'వెళ్ళిరా' అన్నాడు. అన్న మరుక్షణమే గరుత్మంతుని అధిరోహించి నరకునిపై యుద్ధానికి బయల్దేరాడు. అప్పుడు అతను సత్యభామ గృహంలో ఉన్నాడు. కృష్ణుడు యుద్ధానికి బయల్దేరుతోంటే తాను వస్తానన్నదామె. కాదనక రమ్మన్నాడు కృష్ణుడు. సత్యభామసహా గరుడవాహనంపై ప్రాగ్జ్యోతిపురాన్ని చేరుకున్నాడు. గదాదండంతో గిరిదుర్గాన్ని ముందు పగులగొట్టాడు. తర్వాత బాణాలతో శస్త్రదుర్గాన్ని భేదించాడు. ఆ తర్వాత చక్రాయుధంతో జల, అగ్ని, వాయుదుర్గాలనూ, మురపాశాలనూ భేదించాడు. పాంచజన్యాన్ని పూరించాడు. నగరప్రాకారాలను గదాదండంతో పగలగొట్టి, మరింతగా శంఖాన్ని పూరించడంతో ఆ ధ్వనికి మురుడు అనే రాక్షసుడు మేల్కొన్నాడు. వాడికి అయిదు శిరస్సులు. ఉగ్రుడై వాడు, త్రిశూలం ధరించి కృష్ణుణ్ణి ఎదుర్కొన్నాడు. గరుడుడుపై త్రిశూలం విసిరి, సింహనాదం చేశాడు మురుడు. ఆ నాదానికి సమస్తలోకాలూ భయకంపితమయినాయి. కృష్ణుడు ఆ శూలాన్ని తునాతునకలు చేశాడు. అనేక బాణాలు ప్రయోగించి నరకాసురుణ్ణి నొప్పించాడు. ఇద్దరికీ ఘోరయుద్ధం జరిగింది. చక్రాయుధంతో మురుని అయిదుతలలూ ఖండించాడు కృష్ణుడు. తండ్రి చనిపోవడంతో అతని కుమారులు తామ్రుడు, అంతరిక్షుడు మొదలయినవారు పీఠుణ్ణి సేనానాయకుడుగా చేసుకుని కృష్ణునితో తలపడ్డారు. వారందరినీ కృష్ణుడు సంహరించాడు. తన పరివారం అంతా పరిసమాప్తి అయిందని తెలుసుకున్నాడు నరకుడు. రోషంతో యుద్ధభూమికి వచ్చాడు. సుప్రతీకాన్ని అధిరోహించి మరీ వచ్చాడు. అతని వెంట పెద్దసేన వచ్చింది. సముద్రంలో పుట్టిన అనేక ఏనుగులు కూడా వచ్చాయి. వారందరితో కృష్ణుడు యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో కృష్ణునికి సత్యభామ సాయపడింది. గరుత్మంతుడు తన కాలిగోళ్ళతో చీల్చి, ముక్కుతో పొడిచి నరకాసుర సైన్యాన్ని చంపివేశాడు. చూశాడది నరకాసురుడు. బాధపడ్డాడు. గరుత్మంతుడిపై ఒక మహాశక్తిని ప్రయోగించాడు. ఆ శక్తి గరుత్మంతుణ్ణి ఏమీ చేయలేకపోయింది. ఈలోపు శ్రీకృష్ణుడు తన చక్రాయుధంతో నరకాసురుని శిరస్సును ఖండించాడు. ఎప్పుడయితే నరకాసురుడు నేల కూలాడో అప్పుడు దేవతలు దుందుభులు మ్రోగించారు. పూలవాన కురిపించారు.

నరకాసురుణ్ణి వధించి, అతను అపహరించిన అదితి కుండలాలనూ, వరురుణి గొడుగునూ, మహామహినీ, వనమాలికనూ తెచ్చి ఎవరివి వారికి అందజేశాడు కృష్ణుడు.

నరకాసురునికి ఒక కొడుకు ఉన్నాడు. అతనిపేరు భగదత్తుడు. ఆ పసివాణ్ణి తీసుకుని శ్రీకృష్ణుణ్ణి సమీపించింది భూదేవి. కనికరించి బాలుణ్ణి కాపాడమన్నది. ప్రార్థించింది. అనుగ్రహించాడు కృష్ణుడు. భగదత్తుడికి అభయం ఇచ్చాడు. నగరప్రవేశం చేసి, చెరలో ఉన్న పదహారువేలమంది రాచకన్యలనూ విడిపించాడు. విముక్తి పొందిన రాచకన్యలంతా కృష్ణుణ్ణే వరించారు. వారందరినీ భార్యలుగా స్వీకరించాడు కృష్ణుడు. బంగారు పల్లకీలో ఎక్కించి ద్వారకకు తీసుకునిపోయాడు.

అదితికి కుండలాలు సమర్పించేందుకు సత్యభామసహా అమరావతి వెళ్ళినప్పుడు శ్రీకృష్ణుణ్ణి, ఇంద్రుడూ, అతని భార్య శచీదేవీ ఎంతగానో పూజించి, గౌరవించారు. వారికి నందనవనాన్ని విడిది చేశారు. అప్పుడు అక్కడి పారిజాత వృక్షాన్ని చూసింది సత్యభామ. చూసి, తనకి అది కావాలన్నది. అది దివ్యవృక్షం. దాని పుష్పపరిమళం ఒక్క దేవతలకే ఆస్వాదయోగ్యం. కాని

ముద్దులభార్య సత్యభామ అడిగింది. కాదనలేకపోయాడు కృష్ణుడు. పారిజాత వృక్షాన్ని పెకలించాడు. గరుత్మంతుని మూపున పెట్టాడు. భూలోకానికి తీసుకునిపో అన్నాడు. గరుత్మంతుడు బయల్దేరనుండగా దేవతలు కృష్ణుని మీదికి దండెత్తి వచ్చారు. పారిజాతవృక్షాన్ని తమకు కాకుండా చేయడం దేవతలకు నచ్చలేదు. ఆగ్రహించారు వారు. ఇంద్రాది దేవతలు కృష్ణునితో యుద్ధానికి అజ్ఞానులై తలపడ్డారు. వారందరినీ ఓడించాడు కృష్ణుడు. పారిజాత వృక్షాన్ని భూలోకానికి తరలించాడు. కోరుకున్నట్టుగానే దానిని సత్యభామ పూదోటలో నాటాడు.

నరకాసురుని కుమారుడు భగదత్తుడు, కురుపాండవయుద్ధంలో దుర్యోధనుని పక్షాన పోరాడాడు. విష్ణుమూర్తి తనకు ఇచ్చిన వైష్ణవాస్త్రాన్ని నరకుడు కొడుకు భగదత్తునికి ఇచ్చాడు. దానిని అర్జునునిపై ప్రయోగించాడు భగదత్తుడు. అప్పుడు అర్జునుని కాపాడడం కూడా తనవంతుగానే భావించాడు కృష్ణుడు. కాపాడాడతన్ని. చివరికి సుప్రతీకం సహా భగదత్తుడు అర్జునుని చేతిలో హతమయ్యాడు.

దీపావళికి ముందురోజును 'నరక చతుర్దశి' అంటారు. పండుగ చేసుకుంటారు. ఈ నరక చతుర్దశి రోజునే నరకుడు మరణించాడని ప్రచారం ఉన్నది. అయితే ఈ పండుగనకూ, నరకుని మరణానికీ ఎలాంటి సంబంధం లేదంటున్నారు పురాణ పెద్దలు. అలాగే నరకునితో సత్యభామ యుద్ధం చేసినట్టు వ్యాసభాగవతంలో లేదు. పోతనభాగవతంలో మాత్రమే ఉన్నది. నరకునితో సత్యభామపోరాటం బహుళంగా ప్రచారంలో ఉండడంతో దానిని తన భాగవతంలో పొందుపరిచాడు పోతన. నరకునితో సత్యభామ యుద్ధం చేసినట్టుగా అద్భుతంగా వర్ణించి చెప్పాడు.

## ఊసరవెల్లి–పౌండ్రక వాసుదేవుడు

పూర్వకాలంలో నృగుడు అని ఓ రాజు ఉండేవాడు. అతను గొప్పదాత. దానధర్మాలకు పెట్టింది పేరు. గో భూ హిరణ్యాది దానాలు చెయ్యాలంటే అతనే చెయ్యాలనేవారంతా. శ్రేష్ఠమయిన కపిలధేనువులను అలంకరించి మరీ బ్రాహ్మణులకు దానం చేసేవాడతను.

ఆకాశంలోని చుక్కల్ని ఎలా అయితే లెక్కపెట్టలేమో, అలాగే నృగుడు దానం చేసిన ధేనువులు కూడా లెక్కకు అందవు అంటారు. దానధర్మాలేకాదు, యజ్ఞయాగాదులు కూడా చాలా చేశాడు నృగుడు. ఒకసారి ఏమయిందంటే...ఓ బ్రాహ్మణునికి నృగుడు దానం చేసిన గోవు ఎలా వచ్చిందో వచ్చి, మహారాజు గోగణంలో కలసిపోయింది. ఎవరికీ ఆ సంగతి తెలియలేదు. ఆ గోవును మళ్ళీ మరో బ్రాహ్మణునికి దానం చేసేశాడు నృగుడు. దానాన్ని స్వీకరించిన బ్రాహ్మణుడు ఆవును ఆనందంగా తోలుకునిపోతూ ఉంటే, ఇంతకు ముందు అదే ఆవును మహారాజు తనకు దానం చేయగా స్వీకరించిన బ్రాహ్మణుడు చూశాడు. తప్పిపోయిన ఆవును వెదుకుతూ వస్తున్నాడతను. ఎట్టకేలకు దొరికిందనుకున్నాడు. ఆవును అతను తోలుకునిపోజూశాడు. అడ్డగించాడు రెండవ బ్రాహ్మణుడు. ఆ ఆవు తనదన్నాడు. మహారాజు ఇందాకే తనకి దానం చేశాడన్నాడు. లేదు లేదు, ఈ ఆవు తనదంటూ మహారాజు తనకి ఎప్పుడో దానం చేశాడన్నాడు మొదటి బ్రాహ్మణుడు. కాదు, లేదంటూ ఇద్దరూ తగవుకు దిగారు. తీరలేదది. పద రాజునే

అడుగుదాం అన్నారు. నృగుణ్ణి సమీపించారు. దానం ఇచ్చిన గోవునే తిరిగి దానం చేస్తున్నావని రాజుని ఆక్షేపించారు. ఇదేం దానం అన్నారు. కోపగించుకున్నారు. వారిని చూసి భయపడ్డాడు నృగుడు.

''ఎలా జరిగిందో తప్పు జరిగింది. ఒప్పుకుంటున్నాను. క్షమించండి. క్షమించి మీలో ఎవరో ఒకరు ఆ ఆవును వదులుకోండి. వదులుకున్నవారికి లక్షగోవులు ఇస్తాను'' అన్నాడు నృగుడు. అందుకు ఒప్పుకోలేదు బ్రాహ్మణులు. ఆ గోవు తనకి కావాలంటే తనకి కావాలంటూ పోట్లాటకు దిగారు. కాళ్ళావేళ్ళాపడ్డాడు రాజు. తన మాట వినమని ప్రార్థించాడు. వినలేదు బ్రాహ్మణులు. వినలేదు సరికదా గోవుని రాజుకే ఇచ్చి ఇద్దరూ వెళ్ళిపోయారు.

రోజులు గడిచిపోయాయి. నృగుడు చనిపోయాడు. యమదూతలు వచ్చి అతన్ని నరకానికి తీసుకునిపోయారు. నృగునితో యమధర్మరాజు ఇలా అన్నాడు.

''రాజా! నువ్వు చాలా కొద్దికాలంపాటు పాపఫలాన్ని అనుభవించాల్సి ఉంది. తర్వాతంతా పుణ్యఫలమే అనుభవిస్తావు. ముందు ఏది అనుభవిస్తావో చెప్పు.?''

''పాపఫలం అనుభవిస్తాను'' అన్నాడు నృగుడు. అంతే! ఆ మాటనడమే ఆలస్యం, పెద్ద ఊసరవెల్లి అయి ఓ పాడుబడిన బావిలో పడిపోయాడు నృగుడు.

యాదవ కుమారులు ప్రద్యుమ్నుడు, సాంబుడు, గదుడు మొదలయినవారంతా ఒకనాడు వనవిహారానికి వెళ్ళారు. విహారం చేసి చేసి అలసిపోయారు. దాహం వేసింది వారికి. మంచినీటి కోసం వెదకసాగారు. అప్పుడు ఓ పాడుబడిన బావిలో ఓ పెద్ద ఊసరవెల్లి పడి ఉండడాన్ని గమనించారు. దాని అవస్థ చూసి జాలి చెందారు. దానిని పైకి లాగేందుకు ప్రయత్నించారు. తాళ్ళతో కట్టి లాగారు కూడా. రాలేదు. మహాబలవంతులం అనుకునే ప్రద్యుమ్నాది వీరులకే ఊసరవెల్లిని బయటికి లాగడం అసాధ్యం అనిపించడంతో తమవల్ల అయ్యేపనికాదులే అనుకుని, అంతా వెనుతిరిగారు. ఇంటికి చేరుకున్నారు. శ్రీకృష్ణుణ్ణి సమీపించారు. ఊసరవెల్లి సంగతి చెప్పారతనికి. అవునా! ఆశ్చర్యపోయాడు కృష్ణుడు. రండి, చూద్దాం అంటూ యదువీరుల్ని వెంటబెట్టుకుని వనానికి చేరుకున్నాడు. పాడుబడిన బావి దగ్గరకు వచ్చారంతా.

అదిగో ఊసరవెల్లి చూపించారు. ఇదా! ఎందుకు రాదు? అంటూ ఎడమచేత్తో అనాయాసంగా నూతిలోంచి దానిని బయటికి తీశాడు కృష్ణుడు. కృష్ణుని హస్తస్పర్శతో నృగుని పాపం పోయింది. అతని ఊసరవెల్లి రూపం తొలగిపోయింది. దివ్యదేహంతో ప్రత్యక్షమయ్యాడు నృగుడు. చేతులు జోడించి నిల్చున్నాడు.

''ఎవరు నువ్వు? నీ కథేమిటి?'' అడిగాడు కృష్ణుడు. నృగుడు తన కథంతా చెప్పాడు.

''నీ స్పర్శతో నా పాపఫలం పోయింది. అనుమతిని దయచేస్తే నేను పుణ్యలోకాలకు వెళ్ళిపోతాను'' అన్నాడు.

''తథాస్తు'' అన్నాడు కృష్ణుడు. నృగుడు అక్కణ్ణుంచి నిష్క్రమించాడు.

## పౌండ్రకవాసుదేవుడు

కరూశదేశాన్ని పౌండ్రకుడనే రాజు పాలించేవాడు. అతనికి కూడా కృష్ణుడికి ఉన్నట్టుగానే శంఖం, చక్రం, గద, శ్రీవత్సం మొదలయినవి ఉండేవి. అవి ఉండడంతో అతనే అసలు



వాసుదేవుడనీ, ద్వారకలోని వాసుదేవుడు నకిలీ అని ప్రచారం జరిగింది. ఆ ప్రచారాన్ని పౌండ్రకుణ్ణి అంటిపెట్టుకుని ఉన్న వందిమాగధులు చేశారు.

''మహారాజా! వసుదేవుని కుమారుడయిన వాసుదేవునికి ఉన్న చిహ్నాలన్నీ మీకూ ఉన్నాయి. ఉన్నాయి అంటే మీరు కూడా వాసుదేవులే! మీరు కూడా కాదు, మీరే అసలైన వాసుదేవుడు'' అన్నారు వందిమాగధులు.

''లోకంలో ఇద్దరు వాసుదేవులు ఉండకూడదు. ఎవరో ఒకరే ఉండాలి. తానే భగవంతుణ్ణంటూ గొప్పలు చెప్పుకుంటున్న ద్వారకలోని వాసుదేవుడు, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భూమి మీద ఉండకూడదంటే ఉండకూడదు. ఉంటే మీకు రావాల్సిన ప్రఖ్యాతి అతను కొట్టుకుపోతాడు. అలా జరగడానికి వీల్లేదు. అందుకని మీరు ఓ పని చెయ్యాలి.''

''చెప్పండి, ఏం చెయ్యమంటారు?''

''తన చిహ్నాలు త్యజించి, మిమ్మల్ని వాసుదేవుడని కృష్ణుడు ఒప్పుకోవాలి. ఒప్పుకోకపోతే యుద్ధంలో అతన్ని ఓడించి మీరే అతని చేత ఒప్పించాలి'' అన్నారు. బాగుందనుకున్నాడు పౌండ్రకుడు. వందిమాగధులు పొగడడంతోనూ, పదే పదే 'మీరే వాసుదేవుడు' అనడంతోనూ తానే అసలు సిసలు వాసుదేవుణ్ణని పౌండ్రకునకు పిచ్చి నమ్మకం కలిగింది. ఆ నమ్మకంతో శ్రీకృష్ణుణ్ణే ఎదిరించాలనుకున్నాడతను. ద్వారకకు ఒక దూతను పంపాడు. కృష్ణుణ్ణి కలసిన ఆ దూత పౌండ్రకుని మాటల్ని ఇలా తెలియజేశాడు.

''కృష్ణా! నువ్వు నా పేరు పెట్టుకుని తిరుగుతున్నావు. అది తప్పు. వాసుదేవుణ్ణి నేను. వాసుదేవునిగా నన్ను గుర్తించిన పక్షంలో వెంటనే నీ చిహ్నాలన్నీ విడచిపెట్టి, నన్ను శరణు కోరు. లేదంటే యుద్ధానికి సిద్ధం కా.''

దూత వినిపించిన మాటలకు కృష్ణుడూ, యాదవులూ ఒకరిని ఒకరు చూసుకుని పగలబడి నవ్వుకున్నారు. దూతముందే పౌండ్రకుణ్ణి ఎగతాళి చేశారు. అతనికి చావు మూడిందని,అందుకే ఇలాంటి రాయబారాలు పంపాడన్నారు.

''సరే! వారి ముచ్చటే తీరుద్దాం. నేను యుద్ధానికి సిద్ధమని చెప్పండి'' అన్నాడు దూతతో కృష్ణుడు. అదే తన సమాధానం అని పౌండ్రకునికి గట్టిగా చెప్పమన్నాడు కూడా. సాక్షాత్తు భగవంతునితో యుద్ధం. ఆ సంగతి మూర్ఖుడు పౌండ్రకునికి తెలియదు. కృష్ణునితో తలపడేందుకు సిద్ధమయ్యాడు. మిత్రుడు కాశీరాజును సాయంగా రమ్మన్నాడు. మూడు అక్షౌహిణుల సైన్యంతో సాయంగా వచ్చాడతను. పౌండ్రకుడు శంఖ, చక్ర, గద, శ్రీవత్స మొదలయిన చిహ్నాలు ధరించి పగటివేషగాడిలా యుద్ధరంగంలో నిలిచాడు. యుద్ధం కాశీలో అంటే సరేనన్నాడు కృష్ణుడు. అక్కడికే వచ్చాడతను. ఇద్దరికీ పెద్దయుద్ధం జరిగింది. ప్రగల్భాలు పలికిన పౌండ్రకవాసుదేవుణ్ణి కృష్ణుడు సంహరించాడు. అతని సైన్యాలన్నిటినీ తుత్తునియలు చేశాడు. సాయంగా వచ్చిన కాశీరాజు తలను కూడా నరికివేశాడు. కృష్ణుని ఖడ్గచాలనకి కాశీరాజు తల ఎగిరి వారణాసి నగరద్వారం ముందు పడింది. ఆ శిరస్సును చూసి కాశీరాజు భార్యలూ, బంధుమిత్రులూ, పుత్రులూ చాలా దుఃఖించారు. కాశీరాజు కొడుకు సుదక్షిణుడు తండ్రికి పరలోక క్రియలు నిర్వర్తించి, తండ్రిని చంపిన కృష్ణుని మీద పగ సాధించాలనుకున్నాడు. అందుకోసం శివుణ్ణి ప్రార్థించసాగాడు. కొన్నాళ్ళకు శివుడు ప్రత్యక్షమయ్యాడు. కోరిక నెరవేరేందుకు అభిచారహోమం చేయమన్నాడు. చేశాడు సుదక్షిణుడు. అప్పుడు ఆ హోమకుండం నుండి కృత్యాగ్ని పుట్టింది. అది సుదక్షిణుని కోరిక మేరకు భూతగణాలసహా వెళ్ళి ద్వారకమీద పడింది. పట్టణాన్ని చుట్టుముడుతున్న ఘోరాగ్నిని చూసి ద్వారకా పురవాసులంతా భీతిల్లారు. పరిగెత్తుకుని శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చారు. కాపాడమని అతని పాదాలను ఆశ్రయించారు.

పట్టణాన్ని చుట్టుముడుతున్న ఘోరాగ్నిని పరీక్షగా చూశాడు కృష్ణుడు. అది మహేశ్వర కృత్యాగ్ని అని తెలుసుకున్నాడు. దానికి దీటయినది చక్రాయుధమే! ఆ ఆయుధాన్ని ప్రయోగించాడతను. కోటిసూర్యప్రభలతో వెళ్ళి కృత్యాగ్నిని చల్లార్చిందది. అంతటితో చక్రాయుధం ఊరుకోలేదు. కృత్యాగ్నికి కారణమయిన సుదక్షిణుణ్ణీ, అతని చేత అభిచారహోమం చేయించిన వారందరినీ సంహరించింది. కాశీపట్టణాన్ని కూడా కాల్చి వేసింది. అప్పటికి శాంతించి, శ్రీకృష్ణుని చేరింది.

## జరాసంధుడు

మగధ దేశాన్ని బృహద్రధుడు పాలించేవాడు. సంతానం లేదతనికి. ఒకనాడు అతను వేటకి వెళ్ళి, తిరిగి వస్తూ ఓ మామిడిచెట్టుకింద తపస్సు చేసుకుంటున్న ఒక మునిని చూశాడు. ఆ ముని పేరు చండకౌశికుడు. బృహద్రధుడు మునిని భక్తితో పూజించి, తనకు సంతానాన్ని ప్రసాదించమన్నాడు. అనుగ్రహించాడు ముని. చెట్టునుండి రాలిపడిన ఓ మామిడిపండును తీసి, మంత్రించి దానిని బృహద్రధునికి ఇచ్చాడు.

''మహారాజా! ఈ పండును నీ భార్యను తినమను. నీకు పుత్రుడు కలుగుతాడు'' అన్నాడు ముని. ఆ మాటకు మునికి సాష్టాంగప్రణామం చేసి, ఇంటికి చేరుకున్నాడు బృహద్రధుడు. రాజుకి ఇద్దరు భార్యలు. ఇద్దరికీ చెరిసగంగా మామిడిపండు కోసి ఇచ్చాడతను. వారు గర్భవతులయ్యారు. నెలలు నిండి ప్రసవించారు. అయితే మామిడిపండు చెరిసగంగా తిన్న కారణంగా ఒకే శిశువును నడిమికి చీల్చినట్టుగా ఒక కన్ను, ఒక కాలు, ఒక చెయ్యి, సగం పొట్ట, సగం తల కలిగిన రెండు భాగాలను కన్నారు. ఆ భాగాలను చూసి భయపడ్డారు. చూపిస్తే రాజు కోపగించుకుంటాడని, అతనికి చూపించకుండా దాసీలకు ఇచ్చి కోట అవతల పారేయమన్నారు. రాణులు చెప్పినట్టే చేశారు దాసీలు.

ఏదయినా దొరికితే తిందామని ఆ సమయంలో అక్కడ ఓ రాక్షసి తిరుగుతోంది. దాని పేరు జర. కోటకు ఆ పక్క నుంచి ఇటుగా పడిన శిశుఖండాలను చూసిందది. పరుగున వాటిని సమీపించింది. శిశుఖండాలు రెంటినీ తీసుకుని ఒకేసారి ఆబగా తినేందుకు ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో ఆ ఖండాలు రెండూ కలుసుకున్నాయి. ఒకటి అయినాయి. సగం సగంగా ఉన్న ఖండాలు కలసి పూర్తి శిశువుగా రూపుదిద్దుకుంది. ప్రాణం పోసుకుంది. ఏడుపు అందుకుంది. ఆ ఏడుపు విని, దాసీలు కోట బయటికి రాసాగారు. వస్తున్న దాసీల ఎదుట రాక్షసిగా ఉండడం ప్రాణాపాయం అనుకున్నది జర. వెంటనే తన రూపాన్ని మార్చుకున్నది. పల్లెకన్యలా రూపం దాల్చింది. చేతుల్లో బిడ్డను ఆందోళనగా చూడసాగింది. దాసీలు వచ్చి, జర చేతిలోని బిడ్డను చూశారు. తాము విసిరేసిన రాచబిడ్డే! రెండు భాగాలూ కలసి చూడముచ్చటగా తయారయ్యాడు. రాజుకి ఆ విషయం తెలియజేసేందుకు పరుగుదీశారు. చేతుల్లో బిడ్డడు భారంగా తోచడంతో వాణ్ణి మోయలేకా, రాచబిడ్డడు కాబట్టి కిందపెట్టలేకా, నానా అవస్థపడింది జర. అంతలో అక్కడికి రానేవచ్చాడు రాజు. రాజుకి బిడ్డణ్ణి అందించి, భారం దించుకుంది జర.

''ఎవరు నువ్వు'' అడిగాడు బృహద్రధుడు.

తన పేరు జర అని, రాక్షసినంటూ, పడి ఉన్న మాంసఖండాలను కలపడంతో బిడ్డడు ఉదయించాడని జరిగిందంతా చెప్పిందామె. రాజు అందుకు ఎంతగానో సంతోషించాడు. బిడ్డణ్ణి చూసి మురిసిపోయాడు. రాక్షసికి కడుపునిండా భోజనం పెట్టించాడు. ఏటేటా ఆ రాక్షసి పేరిట పెద్దజాతర, ఉత్సవం చేయిస్తూ వచ్చాడు. జర అనే రాక్షసి వల్ల సంధింపబడినాడు కాబట్టి తన కుమారునికి 'జరాసంధుడు' అని నామకరణం చేశాడు.

జరాసంధుడు పెరిగి పెద్దవాడయి, మహాబలవంతుడయినాడు. తండ్రి తదనంతరం మగధ దేశానికి రాజయినాడు. రాజధాని గిరివ్రజం చుట్టూ గోరధం, ఋషభం, వైహారంలాంటి పర్వతాలు పెట్టని కోటగోడలవ్వడంతో ఆ నగరం శత్రువులకు అభేద్యమయింది. అంతేకాదు, శత్రువుల రాక తెలుసుకునేందుకు జరాసంధుడు రెండు భేరీవాద్యాలను కొండకొమ్మున ఉంచాడు. నగరంలో శత్రువులు ప్రవేశిస్తే ఆ భేరీవాద్యాలు వాటంతటవే మోగుతాయి. దాంతో శత్రువులు ప్రవేశించిన సంగతి జరాసంధుడు ఇట్టే తెలుసుకోగలుగుతాడు. ఇలాంటి ఏర్పాట్లతోనూ, పెద్దసైన్య సంపత్తితోనూ ఉన్న జరాసంధుణ్ణి ఎదుర్కోవడం ఎవరివల్లా కాలేకపోయింది. అతన్ని జయించడం అసాధ్యమయింది.

# ధర్మరాజు రాజసూయం:శ్రీకృష్ణ సహాయం

జరాసంధుడు గొప్ప పరాక్రమవంతుడు. మల్లయుద్ధంలో అతన్ని మించిన వారు లేరు. పురుజితుడు, కరూశుడు, యవనుడు, హంసడిభకులు, కంసుడు మొదలయినవారు అతనికి మిత్రులు. కంసుడు మిత్రుడే కాదు, అల్లుడు కూడా. జరాసంధుడు తన కుమార్తెలందరినీ కంసునికి ఇచ్చి వివాహం చేశాడు. కంసుణ్ణి కృష్ణుడు సంహరించిన నాటి నుంచి కృష్ణుడంటే అసహ్యమూ, కోపమూ పెంచుకున్నాడు జరాసంధుడు. పగ కూడా పెంచుకున్నాడు అతని మీద. శత్రుత్వం వహించాడు. కృష్ణుణ్ణి సంహరించేందుకు పదిహేడుసార్లు మధురపై దండెత్తాడతను. అయినా ఫలితం లేకపోయింది. కృష్ణుణ్ణి గెలువలేకపోయాడు. పద్దెనిమిదవసారి జరాసంధుడూ, కాలయనుడూ ఇద్దరూ ఒకేసారి దండెత్తి రావడంతో కృష్ణుడు తెలివిగా తప్పించుకున్నాడు. సముద్రంలో ద్వారకను నిర్మించుకుని, యాదవులసహా వెళ్ళిపోయాడక్కడికి.

జరాసంధుణ్ణి ఏ ఆయుధమూ ఏమీ చేయలేదు. ఏ ఆయుధం చేతా మరణించకుండా ఉండేట్టుగా వరం పొందాడతను. అనేకమంది రాజులను బంధించాడు జరాసంధుడు. అలా బంధించిన రాజుల్ని వారానికి ఒకరిని బలి ఇస్తూ భైరవపూజ చేయసాగాడతను. బ్రాహ్మణులు అంటే జరాసంధునికి భక్తి ఎక్కువ. వారు ఏది అడిగినా కాదనకుండా సమర్పిస్తాడు.

బందీలుగా ఉన్న రాజులు, జరాసంధుని హింసలు తట్టుకోలేకపోయారు. వారంతా ఒక దూతను రహస్యంగా కృష్ణుని దగ్గరకు పంపారు. తమకు బంధవిముక్తి ప్రసాదించమని ప్రార్థించారు. ఆ సమయంలో నారదుడు అక్కడే ఉన్నాడు. ధర్మరాజు రాజసూయయాగం చేయనున్నాడు. యాగధర్మంగా అతను రాజులందరినీ జయించవలసి ఉన్నది. జయించి తెచ్చిన ధన ద్రవ్యాలతో దేవ బ్రాహ్మణ పూజ చెయ్యాలి. అదంతా జయప్రదం కావాలంటే శ్రీకృష్ణుని సహాయం అవసరం. అతని సహాయాన్ని అర్థిస్తూ, యాగానికి కూడా కృష్ణుణ్ణి ఆహ్వానిస్తూ ఆ మాట, తన నోట చెప్పమని నారదుణ్ణి ప్రార్థించాడు ధర్మరాజు. అందుకు అంగీకరించాడు నారదుడు. ద్వారకకు చేరుకున్నాడు.

ఇటు జరాసంధుని బందీలుగా ఉన్న రాజుల్ని విడిపించాలి. అటు ధర్మరాజు రాజసూయం నిర్విఘ్నంగా జరిపించాలి. రాజసూయానికి వెళితే జరాసంధుని బందీలుగా ఉన్న రాజుల్ని విడిపించడం పనిలో పని అనుకున్నాడు కృష్ణుడు. ధర్మరాజు ఆహ్వానాన్ని అందుకున్నాడతను. ఉద్ధవుడు కూడా కృష్ణుణ్ణి సమర్థించాడు.

''జరాసంధుడు నాగాయుత బలసంపన్నుడు. చతురంగ బలాలతో వెళ్ళినా, అతన్ని జయించడం కష్టం. అందుకని ఓ పని చెయ్యి కృష్ణా! భీముణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళు. జరాసంధుడూ, భీముడూ ఇద్దరూ బలాబలాల్లో సరితూగుతారు. ద్వంద్వయుద్ధంలో భీముని చేత జరాసంధుణ్ణి వధియింపజెయ్యి. బందీలయిన రాజుల్ని విడిపించు. ఆ తర్వాత ధర్మరాజు రాజసూయాన్ని నిర్విఘ్నంగా జరిపించు. చాలా దూరదృష్టితో ఆలోచించి చెబుతున్నాను, నువ్వు తక్షణం ఇంద్రప్రస్థం బయల్దేరు'' అన్నాడు ఉద్ధవుడు.

''ఇదిగో, బయల్దేరుతున్నాను'' అన్నాడు కృష్ణుడు. బందీలు పంపిన దూతతో ఇలా అన్నాడు.

''త్వరలోనే జరాసంధుడు మరణిస్తాడు. రాజులు బంధవిముక్తులవుతారు. అభయం ఇస్తున్నాను.''

దూత ఆనందంగా అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. అలాగే నారదునితో కూడా రాజసూయానికి వస్తున్నానని, యాగం నిర్విఘ్నంగా జరిపించే బాధ్యత తనదని అన్నాడు కృష్ణుడు. ఆ మాట ధర్మరాజుకి తెలియజేయమన్నాడు. సంతోషంగా నారదుడు ఆకాశమార్గాన బయల్దేరాడు.

సకుటుంబ బంధుమిత్ర సపరివారంగా ఇంద్రప్రస్థానికి కృష్ణుడు కూడా బయల్దేరాడు. పర్వతాలు, అడవులు, నదీనదాలు దాటి రాజధానికి చేరిన శ్రీకృష్ణుణ్ణి తన పరివారంతో ఎదురువెళ్ళి స్వాగతించాడు ధర్మరాజు. సకలమర్యాదలూ చేసి, విడిది చేయించాడు. వెనువెంటనే కృష్ణుని ఆదేశానుసారం పాండవుల దిగ్విజయయాత్ర ప్రారంభమయింది. తూర్పుదిక్కునకు భీముడు బయల్దేరాడు. దక్షిణ దిక్కునకు సహదేవుడు వెళ్ళాడు. పశ్చిమ దిక్కునకు నకులుడు బయల్దేరగా, ఉత్తర దిక్కునకు అర్జునుడు వెళ్ళాడు. మహావీరులయిన ఆ నలుగురూ కొద్దిరోజుల్లోనే ఆయా దిక్కుల్లోగల రాజులను జయించి, అపారమయిన ధన కనక వస్తు వాహనాలను తీసుకుని వచ్చారు. అన్నగారికి సమర్పించారు. అయితే జరాసంధుణ్ణి ఎవరూ గెలవలేదు. అతన్ని కూడా జయిస్తేనే గాని, రాజసూయం చేసేందుకు వీలులేదు. జరాసంధుని జయించడం ఎలా? తలపట్టుకున్నాడు ధర్మరాజు. అతనికి ధైర్యం చెప్పాడు కృష్ణుడు. జరాసంధుణ్ణి ఓడించేందుకు తాను భీమార్జునులసహా వెళ్తానన్నాడు కృష్ణుడు. అన్నట్టుగానే వారిద్దరితో గిరివ్రజానికి బయల్దేరాడు. అయితే రాజులుగాగాక, బ్రాహ్మణ వేషధారులై బయల్దేరారు. సింహద్వారం ద్వారా ప్రవేశిస్తే భేరీవాద్యాలు మోగే ప్రమాదం ఉండడంతో దొంగదోవన నగరంలోనికి ముగ్గురూ ప్రవేశించారు. జరాసంధుణ్ణి సమీపించారు. బ్రాహ్మణులు జరాసంధునికి ఆరాధ్యులు. ముగ్గురు బ్రాహ్మణులనూ పూజించాడు జరాసంధుడు. వారికి సకల మర్యాదలూ చేశాడు. యాచనకి వచ్చామన్నారు వారు. సరేనని, జాగ్రతగా వారిని పరిశీలించాడు జరాసంధుడు. ముగ్గురిలోనూ కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్న క్షాత్రతేజస్సును గుర్తించాడు. ఆకారాలు, దేహదార్ఢ్యత పరిశీలించి, ముగ్గురూ బ్రాహ్మణులు కారని తెలుసుకున్నాడు. క్షత్రియులని నిర్ధారణ చేసుకున్నాడు.

''చెప్పండి, మీకేం కావాలి?'' అడిగాడు.

''యుద్ధం కావాలి'' అన్నాడు కృష్ణుడు.

''మా ముగ్గురిలో ఏ ఒక్కరితోనయినా నువ్వు ద్వంద్వయుద్ధం చెయ్యవచ్చు'' అన్నాడు.

''నేను కృష్ణుణ్ణి, ఇతను భీముడు, ఇతను అర్జునుడు'' అన్నాడు.

నిజరూపాలను ప్రదర్శించారు ముగ్గురూ. వారిని చూసి సన్నగా నవ్వుకున్నాడు జరాసంధుడు. అంతలోనే కోపించాడు.

''ఏమంటావు, ఎవరితో యుద్ధం చేస్తావు?'' రెట్టించాడు కృష్ణుడు.

''నీతో యుద్ధం చెయ్యను. నువ్వు పిరికివాడివి. నాతో యుద్ధం చెయ్యలేక వెళ్ళి సముద్రంలో దాగున్నవాడివి. నీతో యుద్ధం చెయ్యడం నాకు అప్రతిష్ఠ'' అన్నాడు జరాసంధుడు. అర్జునుని చూశాడు. మీసం దువ్వుతూ యుద్ధానికి ఆహ్వానించాడు అర్జునుడు.

‘‘నువ్వు నా కంటే చిన్నవాడివి. బలంలో కూడా తక్కువవాడివి. నువ్వు నాతో యుద్ధం చెయ్యలేవు. వద్దు’’ అన్నాడు జరాసంధుడు. భీముణ్ణి చూశాడు. కండలూ గుండెలూ పొంగించి నిల్చున్న భీముణ్ణి మెచ్చుకోలుగా చూసి ఇలా అన్నాడు.

‘‘యుద్ధం చేస్తే నీతో చెయ్యాలి. నువ్వూ నేనూ సరిపోతాం.’’

భీముడికీ జరాసంధునికీ మధ్య యుద్ధం ప్రారంభమయింది. ఇద్దరూ ముందు గదాయుద్ధం చేశారు. ఒకరిని ఒకరు గట్టిగా మోదుకున్నారు. ఇద్దరి గదలూ విరిగిపోయాయి. విరిగిన గదలను విసిరి పారేశారు. మల్లయుద్ధం చేయసాగారిద్దరూ. ఎవరికి ఎవరూ తీసిపోవట్లేదు. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని లేదు, ఇద్దరికిద్దరూ సరిసమానంగా పోట్లాడుతున్నారు. భయంకరంగా ఉంది ఆ యుద్ధం. అద్భుతంగా కూడా ఉంది. జరాసంధుణ్ణి సంహరించడం భీముని వల్ల కాదనిపించింది కృష్ణునికి. ఒక ఉపాయం ఆలోచించాడు. జరాసంధుని జన్మరహస్యం తెలిసిన వాడు. అతన్ని ఎలా అంతమొందించాలో చిటికెలో తెలుసుకున్నాడు. తన వైపు చూడమంటూ భీమునికి సైగ చేశాడు కృష్ణుడు. చూడసాగాడు భీముడు. దగ్గరగా ఉన్న పుల్లను చేతిలోకి తీసుకున్నాడు కృష్ణుడు. దానిని నిడివికి రెండుగా చీల్చాడు. ఆ రెంటినీ అటొకటి, ఇటొకటిగా అభిముఖంగా గాక, అడ్డదిడ్డంగా విసిరేశాడు. అంతరార్థం అర్థమయింది భీముడికి. జరాసంధుణ్ణి చిక్కించుకున్నాడు. అతన్ని కిందకి పడవేశాడు. కాలిని తన కాలితో తొక్కిపట్టి, అతని దేహాన్ని ఏనుగు చెట్టుకొమ్మను చీల్చినట్టుగా రెండుగా చీల్చాడు భీముడు. ఆ రెండు ఖండాలనూ అడ్డదిడ్డంగా అటొకటి ఇటొకటిగా విసిరి వేశాడు.

జరాసంధుడు మరణించాడు. అతని మరణానంతరం మగధరాజ్యానికి జరాసంధుని కుమారుడు సహదేవుణ్ణి రాజుగా ప్రకటించాడు కృష్ణుడు. తర్వాత జరాసంధుడు బంధించిన రాజులందరినీ బంధవిముక్తుల్ని చేశాడు. వారంతా కృష్ణుణ్ణి గొప్పగా స్తుతించారు. భీమార్జునులకు విలువకట్టలేనంత ధనాన్నీ, వస్తువాహనాలనూ అందజేశారు. వాటన్నిటితో ఇంద్రప్రస్థం చేరుకున్నాడు కృష్ణుడు.

తన ఉపాయాలతో పాండవులను అనుక్షణం బలవంతుల్ని చేస్తూ వచ్చాడు కృష్ణుడు. ముఖ్యంగా భీముణ్ణి మరింత బలవంతునిగా ప్రచారం చేసేందుకు అహర్నిశలూ కష్టించాడతను. జరాసంధుని మరణానికి భీముని బలంకన్నా కృష్ణుని ఉపాయమే ప్రధానకారణమయింది. కురుక్షేత్ర సంగ్రామంలో కూడా ఇంతే జరిగింది. భీమునికీ, దుర్యోధనునికీ ద్వంద్వయుద్ధం జరిగినప్పుడు కృష్ణుడు చెప్పినట్టుగానే చేసి, దుర్యోధనుణ్ణి చంపాడు భీముడు. గదాయుద్ధంలో నడుము కిందిభాగంలో కొట్టకూడదు. అది ధర్మవిరుద్ధం. అయితే కృష్ణుడు చెప్పడంతో నడుము కింది భాగంలో కొట్టి, దుర్యోధనుని తొడలు విరగ్గొట్టాడు భీముడు. దుర్యోధనుణ్ణి హతమార్చాడు. కృష్ణుడే తలచుకోకుంటే దుర్యోధనుడు మరణించి ఉండేవాడు కాదు. ఇటు దుర్యోధనుణ్ణీ, అటు జరాసంధుణ్ణీ ప్రత్యక్షంగా భీముడు చంపినా పరోక్షంగా వారి మరణాల వెనుక కృష్ణుడు ఉన్నాడన్నది అందరికీ తెలిసిన విషయమే! అధర్మయుద్ధానికి సాక్షాత్తు భగవంతుడే ఒడిగట్టాడని ఈ రెంటినీ ఉదహరిస్తుంటారు పెద్దలు. ఆనాడు చెట్టుచాటుగా వాలిని చంపి రాముడు ఎంతటి అపఖ్యాతి మూటగట్టుకున్నాడో అలాగే శ్రీకృష్ణుడు కూడా మహాభారతయుద్ధంలో అపఖ్యాతిని మూటగట్టుకున్నాడు.



**రాజసూయం**

ధర్మరాజు చేసిన రాజసూయం అతి వైభవంగా జరిగింది. ఈ యాగానికి ఇంద్రాది దిక్పాలకులూ, బ్రహ్మ, శివుడూ సపరివారంగా విచ్చేశారు. వ్యాసుడు, పరాశరుడు, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, కణ్వుడు, గౌతముడు, చ్యవనుడు, మైత్రేయుడు మొదలయిన మహర్షులూ, భీష్మ ద్రోణాది మహనీయులూ ఈ యాగంలో పాల్గొన్నారు. శత్రుత్వం ఉన్నా దానిని మరచి మరీ కౌరవులు ఈ యాగ సందర్భంగా పాండవులతో కలసి మెలసి తిరిగారు. ఇదంతా ఒక ఎత్తు అయితే మరొక ఎత్తుగా శిశుపాలుని వధ జరిగింది ఇక్కడే! అది ఎలా సంభవించిందంటే...

సోమాభిషదినాన యజ్ఞదీక్షితుడయిన ధర్మరాజు యాజకులకూ, సదస్యులకూ పూజ చేయాల్సి ఉన్నది. ఇది యాగంలో చెప్పుకోదగిన ఘట్టం. ఈ పూజ చేసేటప్పుడు తొలిగా ఎవరిని పూజించాలన్న మీమాంస వచ్చింది. పెద్దలు ఎవరిని చేయమంటే వారిని చేస్తానంటూ తన అభిప్రాయాన్ని సభ ముందు సవినయంగా ఉంచాడు ధర్మరాజు. సభలో ఉన్నవారంతా ప్రముఖులే! వారిలో గొప్పవారెవరు? ప్రథమపూజార్హులెవరు? నిర్ణయించడం కష్టసాధ్యమయింది అందరికీ. అప్పుడు పాండవుల్లో ఆఖరి వాడయిన సహదేవుడు కలుగజేసుకున్నాడు. చెప్పాడిలా.

''సాక్షాత్తు భగవంతుడయిన కృష్ణుడే ప్రథమపూజార్హుడు.''

అతని మాటను ముక్తకంఠంతో సభ ఆమోదించింది. ధర్మరాజు సకుటుంబ సపరివారంగా కృష్ణుణ్ణి సమీపించాడు. అతన్ని తోడుకుని వచ్చాడు. ఉన్నతాసనంపై కూర్చొండజేశాడు. బంగారుపళ్ళెరంలో పెట్టి అతని పాదాలను కడిగాడు. ఆ పాదోదకాన్ని తన శిరసున జల్లుకున్నాడు. అలాగే అందరిపైనా జల్లాడు. తర్వాత కృష్ణునికి అమూల్య వస్త్రాలూ, ఆభరణాలూ అందజేసి పులకించిపోయాడు. కృష్ణునికి అలా ప్రథమపూజ జరగడం చేది దేశాధీశుడు శిశుపాలుడు సహించలేకపోయాడు. దిగ్గున లేచి నిలబడి గట్టిగా అరిచాడిలా.

''మహనీయులెందరో ఈ సభలో ఉన్నారు. తపోధనులూ, బ్రహ్మనిష్ఠాగరిష్ఠులయిన ఋషులెందరో ఉన్నారిక్కడ. వీరందరినీ కాదని, ఒక గొల్లవానికి అగ్రతాంబూలం ఇవ్వడం, ప్రథమపూజ నిర్వహించడం అనుచితం. ధర్మరాజు చాలా తప్పు చేశాడు. గొల్లకులానికి చెందిన కృష్ణుడు పూజార్హుడు కాడు గాక కాడు. యయాతి శాపం వలన యాదవవంశమే సాధుబహిష్కృతమయింది. ఇది అందరికీ తెలిసిన విషయమే! కృష్ణుడు దొంగ. అల్పుడు. శౌర్యహీనుడు, ఇలాంటివాణ్ణి నిండుసభలో పూజించడం పెద్దలను అవమానించడమే.''

నోటికి వచ్చినట్టుగా కృష్ణుణ్ణి నిందించసాగాడు శిశుపాలుడు. భగవంతుణ్ణి నిందించిన వారితోపాటు భగవన్నింద విన్నవారు కూడా శిక్షార్హులే! అందుకని సభలోని చాలా మంది పెద్దలు శిశుపాలుని నిందావాక్యాలు వినలేక చెవులు మూసుకున్నారు. కొందరు అక్కడ ఉండలేక నిష్క్రమించారు.

## శిశుపాలవధ

జయవిజయులు వైకుంఠంలో విష్ణుమూర్తి ద్వారపాలకులు. శాపవశాన వారు భూమి మీద జన్మించాల్సి వచ్చింది. మూడు జన్మల్లో శాపవిముక్తులవుతారని, తదనంతరం తన సన్నిధికి చేరుకుంటారని వారిని అనుగ్రహించాడు భగవంతుడు. జయవిజయులు మొదటిజన్మలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగానూ, రెండవజన్మలో రావణ కుంభకర్ణులుగానూ జన్మించారు. ఆ రెండు జన్మల్లోనూ భగవంతునితో విరోధించి, సంహరింపబడ్డారు. ఇప్పుడు మూడవజన్మలో శిశుపాల దంతవక్త్రులుగా జన్మించారు. దేవదేవుడు శ్రీకృష్ణుణ్ణి ద్వేషించసాగారు.

శిశుపాలుడు దమఘోషుని పుత్రుడు. అతని తల్లి సాత్వతి. ఆమె కృష్ణునికి మేనత్త. పుట్టుకతోనే రాక్షసప్రవృత్తితో పుట్టాడు శిశుపాలుడు. పైగా వికృతాకారాన్ని సంతరించుకున్నాడు. నాలుగు చేతుల్తోనూ, నొసట మూడవ కన్నుతోనూ అసహ్యంగా పుట్టిన శిశుపాలుణ్ణి చూసి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. బంధువులు భయపడ్డారు. అప్పుడు ఆకాశవాణి ఇలా పలికింది.

ఈ బాలుణ్ణి ఏ వ్యక్తి ఎత్తుకుంటే ఇతనికి అధికంగా అసహ్యంగా ఉన్న అవయవాలు అదృశ్యమవుతాయో ఆ వ్యక్తి చేతిలోనే ఇతనికి మరణం సంభవిస్తుంది.

–ఈ కారణంగా ఇంటికి వచ్చిన ప్రతివారినీ శిశుపాలుణ్ణి ఎత్తుకోమనేది సాత్వతి. ఎందరు ఎత్తుకున్నా శిశుపాలుని వికృతావయవాలు అదృశ్యం కాలేదు. ఒకనాడు బలరామకృష్ణులు మేనత్తను పలకరించేందుకు ఆమె ఇంటికి వచ్చారు. అప్పుడు సాత్వతి, శిశుపాలుణ్ణి ఎత్తుకోమని వారికి ఇచ్చింది. బలరాముడు ఎత్తుకున్నాడు. ఏమీ కాలేదు. కృష్ణుడు ఎత్తుకున్నాడు. అంతే! శిశుపాలునికి

అధికంగా ఉన్న రెండు చేతులూ, మూడవకన్నూ మాయమయినాయి. దాంతో శ్రీకృష్ణుని చేతిలోనే శిశుపాలుడు మరణిస్తాడని సాత్వతి తెలుసుకున్నది. తెలుసుకున్న మరుక్షణం కృష్ణుణ్ణి ఇలా ప్రార్థించింది.


''కృష్ణా! శిశుపాలుడు దుర్మార్గుడై నీకు అపకారం తలపెడతాడేమో! కోపం వచ్చి నువ్వు సుదర్శనాన్ని ఉపయోగిస్తావేమో! మేనత్తగా నాదో చిన్న కోరిక. వీడు నీకు బంధువు కనుక నూరు తప్పులు వరకూ క్షమించు. తర్వాత నీ ఇష్టం.''

''మేనత్త అడిగితే కాదంటానా? తప్పకుండా నూరు తప్పుల వరకూ క్షమిస్తాను. తర్వాత శిక్ష తప్పదు. అప్పుడు నన్ను నువ్వు తప్పు పట్టకూడదు'' అన్నాడు కృష్ణుడు. ఆ అభయానికి ఆనందం చెందింది సాత్వతి. చాలంటూ చేతులు జోడించి, నమస్కరించింది కృష్ణునికి.

పెరిగి పెద్దవాడయి శిశుపాలుడు, కృష్ణుడిపట్ల ఎన్నో అపచారాలు చేశాడు. కృష్ణుడు ప్రేమించిన రుక్మిణిని తాను పెళ్ళాడాలనుకున్నాడు. జరగలేదది. రాజులందరినీ ఓడించి, రుక్మిణిని బలవంతంగా తీసుకునిపోయి మరీ పెళ్ళి చేసుకున్నాడు కృష్ణుడు. నాటి నుంచి కృష్ణుడంటే శిశుపాలుడు పగపెంచుకున్నాడు. ఆ పగతో భోజరాజులను చంపాడు. వసుదేవుని యాగాశ్వాన్ని అపహరించాడు. దానిని చంపి, యాగానికి భంగం కలిగించాడు. ద్వారకలో కృష్ణుడు లేనివేళ వెళ్ళి, ఆ పట్టణాన్ని కాల్చి వచ్చాడు. బభ్రుభార్యను తన అర్ధాంగిగా చేసుకున్నాడు. శిశుపాలుడు చేసిన ప్రతి తప్పునీ లెక్కగడుతూ రాసాగాడు కృష్ణుడు. మేనత్తకు ఇచ్చిన మాట మీద నిలబడుతూ వచ్చాడు.

ఆఖరికిప్పుడు రాజసూయ యాగసభలో నోటికి వచ్చినట్టుగా తనని దూషించిన శిశుపాలుని నూరు తప్పులూ పూర్తి కావడంతో సన్నగా నవ్వుతూ లేచి నిల్చున్నాడు కృష్ణుడు. సింహాసనం మీద నుంచి కృష్ణుడు అలా లేచి నిల్చోగానే సభలోని పాండుపుత్రులూ, మత్స్య, కేకేయదేశపు రాజులూ కూడా వినమ్రంగా లేచి నిల్చున్నారు. శిశుపాలుని మీద దాడి చేసేందుకు భీమార్జునులు ముందడుగు వేయబోతుంటే వారిని వారించాడు కృష్ణుడు. కళ్ళు మూసుకుని, చక్రాయుధాన్ని ఆవాహన చేశాడు. వచ్చి చేరిందది. దానిని శిశుపాలుని మీద ప్రయోగించాడు కృష్ణుడు. మహాతేజస్సుతో దిక్కుల్ని వెలిగిస్తూ వెళ్ళి, శిశుపాలుని శిరస్సును ఖండించిందది. వధానంతరం కుప్పకూలిపోయిన శిశుపాలుని శరీరం నుండి ఒక దివ్యతేజస్సు పైకి లేచింది. ప్రయాణించి వచ్చి, కృష్ణపరమాత్మలో ప్రవేశించింది. శిశుపాలుడు మరణించడంతో సభలో కోలాహలం చెలరేగింది. అతన్ని సమర్థించిన రాజులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయా రక్కణ్ణుంచి.

ధర్మరాజు రాజసూయం జయప్రదంగా ముగిసింది. బంధుమిత్రాదులతో గంగానదికి చేరుకుని, అవభృథస్నానం ఆచరించాడతను. యాగం ముగిసినా కృష్ణుడు ఇంద్రప్రస్థాన్ని వీడలేదు. పాండవుల కోరిక మేరకు కొద్దిరోజులు ఉన్నాడక్కడ. పాండవుల వైభవాన్ని చూసి దుర్యోధనుడు ఈర్ష్య చెందాడు. దాయాదులు సమర్థులై అంతటి ఐశ్వర్యం, పలుకుబడి సంపాదించుకోవడాన్ని తట్టుకోలేకపోయాడు. అసూయా ద్వేషాలతో ఉడికిపోయాడు. ఒకనాడు అతను మయసభాభవనానికి వచ్చాడు. మయుడు నిర్మించిన సభాభవనం అది. ఆ భవనంలో అన్నీ అద్భుతాలే! నీరు లేని చోట ఉన్నట్టూ, నీరున్న చోట లేనట్టూ నిర్మించిన పరమాద్భుత



కట్టడం అది. ధర్మరాజు అలాంటి సభాభవనంలో బంధుమిత్రులతోనూ, పరివారంతోనూ కొలువుతీరి ఉన్నాడు. సుయోధనుడు అక్కడికి వచ్చాడప్పుడు. తమ్ములతోనూ, దాసదాసీ జనంతోనూ ప్రవేశించాడు. సభలోని చిత్రవిచిత్రాలను తిలకించసాగాడు. తిలకిస్తూ తమ్ములకు దూరమయినాడతను. దాసదాసీజనానికి కూడా దూరమయినాడు. జల స్థలభేదాలు కనిపెట్టలేకపోయాడు. నీరు లేని చోట ఉన్నట్టుగా భ్రమించి, వస్త్రం ఎగగట్టి మరీ నడిచాడు. నీరు లేదనుకుని, నీరున్న చోట కాలు మోపాడు. అంతే! గుంటలో పడిపోయాడు. పట్టువస్త్రాలు తడిసిపోయాయి. పరువుపోయినట్టనిపించింది. అంతలో నవ్వులు వినవచ్చాయి. చూశాడటు. సభాభవనం పై అంతస్తులో పరిచారికులు, భీముడుసహా ద్రౌపది నవ్వుతూ కనిపించింది. వద్దని వారిస్తున్న ధర్మరాజుని కూడా గమనించాడతను. తనని హేళన చేస్తూ వారంతా అలా నవ్వడాన్ని దుర్యోధనుడు సహించలేకపోయాడు. ఆ నవ్వులు అతని చెవుల్లో శూలాల్లా దిగబడ్డాయి. తనని చూసి ద్రౌపది పరిహసించడం మానధనుడు దుర్యోధునికి మరణంతో సమానం అనిపించింది. చిన్నబుచ్చుకుని నిష్క్రమించాడక్కణ్ణుంచి. వెనువెంటనే హస్తినాపురానికి చేరుకున్నాడు.

నిద్రాహారాలు మాని ఆలోచించసాగాడు. అవమానం అగ్నిహోత్రంలా దహించి వేస్తుంటే పాండవుల అంతు చూడాలనుకున్నాడతను. మహాభారతయుద్ధానికి ఈ సంఘటనే కారణమంటారు పెద్దలు.

నిజానికి మయసభలో దుర్యోధనుని పాట్లు చూసి భీముడు, పరిచారికులుసహా పాంచాలి నవ్వడానికి కృష్ణుని ప్రోత్సాహప్రోద్బలాలే కారణం. ధర్మరాజు వద్దంటున్నా వారంతా అలా పగలబడి నవ్వడానికి కృష్ణుడి సైగలే ప్రధానం. కృష్ణుని చెప్పిన మీదటే వారంతటి సాహసానికి ఒడిగట్టారు. వ్యాసభారతాన్ని జాగ్రతగా పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. భారతయుద్ధం జరగాలి. ఆ యుద్ధంలో అనేకమంది మరణించాలి. భూభారం తగ్గాలి. ఇది కృష్ణుని ఆలోచన. ఆ ఆలోచనకు అనుగుణంగానే మయసభలో బీజం వేశాడు కృష్ణుడు. దుర్యోధనుని నవ్వులపాలు చేశాడు. తాను నిమిత్తమాత్రుణ్ణంటూ, రథసారథినంటూ చేయాల్సిందంతా చేస్తూ వచ్చాడు కృష్ణుడు. అతని ఎత్తుల ముందు, యుద్ధతంత్రం ముందు ఎవరూ నిలబడలేకపోయారు. కౌరవుల నాశనాన్ని కళ్ళారా చూశాడతను. పాండవులకు విజయాన్ని కట్టబెట్టాడు. అయితే ఇరుపక్షాల్లోనూ అక్షౌహిణుల సైన్యం హతమయింది. కావాల్సింది అదే! దానిని నిర్విఘ్నంగా జరిపించాడు కృష్ణుడు.

## సాల్వసంహారం

సాల్వదేశానికి అధిపతి సాల్వుడు. శిశుపాలునికి మిత్రుడు. కాశీరాజు పెద్దకూతురు అంబను ప్రేమించాడతను. అంబ కూడా అతన్ని ప్రేమించింది. అయితే స్వయంవరానికి వచ్చిన భీష్ముడు, చెల్లెళ్ళసహా అంబను ఎత్తుకుపోయాడు. అప్పుడు అతన్ని ఎదిరించాడు సాల్వుడు. ఇద్దరికీ పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో సాల్వుడు ఓడిపోయాడు. అంబను తీసుకుని వెళ్ళిన భీష్మునికి అసలు సంగతి తెలిసింది, సాల్వుణ్ణి ప్రేమిస్తున్నదని తెలిసి ఆమెను అతని వద్దకు పంపాడు. కాని సాల్వుడు అంబను పరిగ్రహించలేదు. ఒకరు ఎత్తుకుపోయిన స్త్రీని తాను పరిగ్రహించలేనని, చేపట్టననీ అన్నాడు. దాంతో దిక్కులేనిదయిపోయింది అంబ. క్రుంగిపోయింది. తన జీవితం సర్వనాశం కావడానికి కారణం భీష్ముడు కనుక, అతని అంతు చూడాలనుకున్నదామె. పగ పెంచుకున్నది. తపస్సు చేసి శివుణ్ణి మెప్పించింది. భీష్ముని మరణమే తన లక్ష్యమంది. వరాన్ని కోరింది. అది ఈ జన్మలో నెరవేరదన్నాడు శివుడు. మరుజన్మలో సాధ్యమన్నాడు. అంబ మరుజన్మ ఎత్తింది. ద్రుపదరాజుకి శిఖండిగా పుట్టింది. భారతయుద్ధంలో భీష్ముని మరణానికి కారణమయింది.

రుక్మిణి స్వయంవరానికి శిశుపాలుడుసహా సాల్వుడు వచ్చాడు. ఆ ఇద్దరినేగాక అనేకమంది రాజుల్ని ఓడించి, రుక్మిణిని ఎత్తుకుపోయాడు కృష్ణుడు. నాటి నుంచి కృష్ణుడిపై పగబూనాడు సాల్వుడు. యాదవుల్ని నాశనం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ప్రతిరోజూ పిడికెడు బూడిద తింటూ శివుని గురించి తపస్సు చేశాడు. ఫలించింది. శివుడు ప్రత్యక్షమయ్యాడు. వరం కోరుకోమన్నాడు. సురాసుర నర గంధర్వాదులకు అభేద్యమై కామగమనం గల విమానం కావాలన్నాడు సాల్వుడు. సరేనన్నాడు శివుడు. విశ్వకర్మచేత అలాంటి విమానాన్ని నిర్మింపజేసి బహూకరించాడతనికి. దాని పేరు సౌభం. దానినెవరూ భేదించలేరు. దాన్ని అధిరోహించి ఎక్కడికయినా వెళ్ళవచ్చు.

ఏ లోకాన్నయినా చుట్టి రావచ్చు. దాంతో మదాంధుడై కృష్ణుణ్ణి మట్టుబెట్టాలనుకున్నాడు సాల్వుడు. మిత్రుడు శిశుపాలుణ్ణి కృష్ణుడు సంహరించడం కూడా అతనికి బాధ కలిగించింది. ధర్మరాజు రాజసూయానంతరం కృష్ణుడు ఇంద్రప్రస్థంలోనే ఇంకా ఉన్నాడని తెలుసుకుని ఇదే సరయినసమయం అనుకున్నాడు సాల్వుడు. యాదవుల్ని నాశనం చేసేందుకే సౌభాన్ని అధిరోహించి, ద్వారకను ముట్టడించాడు. ఆకాశంలో విమానంలో విహరిస్తూ రాళ్ళ వర్షం కురిపించాడు. ఎన్నో శస్త్రాస్త్రాలు ప్రయోగించాడు. యాదవులకు దిక్కుతోచలేదు. అప్పుడు కృష్ణుడి కుమారుడు ప్రద్యుమ్నుడు, సాంబుడు సాత్యకిసహా యదువీరుల్ని వెంటబెట్టుకుని సాల్వునితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఇరువర్గాలకీ ఘోరయుద్ధం జరిగింది. ఇరవై ఏడురోజులపాటు యుద్ధం జరిగింది. అయినా సాల్వుని సంహరించడం యదువీరుల వల్ల కాలేదు.

ఇంద్రప్రస్థంలో ఉన్న కృష్ణునికి, ద్వారకపై సాల్వుని దండయాత్ర తెలిసింది. పరుగున వచ్చాడతను. సాల్వునికీ కృష్ణునికీ పెనుయుద్ధం జరిగింది. సాల్వుని మాయలన్నిటినీ కృష్ణుడు తిప్పికొట్టాడు. కృష్ణుడు తండ్రి వసుదేవుడు మరణించినట్టుగా అద్భుత దృశ్యాన్ని సృజించాడు సాల్వుడు. కృష్ణుణ్ణి భ్రాంతిలో పడవేసేందుకు ప్రయత్నించాడతను. అయితే అదంతా మాయ అని కృష్ణుడు గ్రహించాడు. తన గదను ప్రయోగించాడు. ఆ గద దెబ్బకు సాల్వుని విమానం తుత్తునియలు అయింది. సముద్రంలో కుప్ప కూలింది. వెంటనే చక్రాయుధాన్ని ప్రయోగించాడు కృష్ణుడు. సాల్వుని శిరస్సును ఖండించాడు. ఎప్పుడయితే సాల్వుని శిరస్సు తెగి కిందపడిందో అప్పుడు ఆకాశంలో దేవతలు ఆనందించారు. కృష్ణునిపై పూలవాన కురిపించారు.

### దంతవక్త్రుని సంహారం

అన్నయ్య శిశుపాలుణ్ణి హతమార్చాడు. అతని మిత్రుడు సాల్వుణ్ణి తెగనరికాడు. కృష్ణుణ్ణి వదలకూడదనుకున్నాడు దంతవక్త్రుడు. అతనిపై యుద్ధాన్ని ప్రకటించాడు. శాపవశాన భూలోకంలో జన్మించిన జయవిజయుల్లో దంతవక్త్రుడు ఒకడు. పూర్వజన్మలో అతను హిరణ్యాక్షుడుగానూ, కుంభకర్ణుడుగానూ జన్మించాడు. ఇది మూడవజన్మ. దంతవక్త్రుడికీ, కృష్ణునికీ మధ్య పెద్ద యుద్ధం జరిగింది. తన గద కౌమోదకితో దంతవక్త్రుని గుండెలు పగలగొట్టాడు కృష్ణుడు. ఆ దెబ్బకి నెత్తురుకక్కుకుంటూ నేల కూలాడతను. చనిపోయాడు. అప్పుడొక జ్యోతి దంతవక్త్రుడి దేహం నుండి వెలువడింది. కృష్ణునిలో ప్రవేశించి, అదృశ్యమయింది.

అన్న దంతవక్త్రుడు మరణించాడని తెలిసి అతని తమ్ముడు విదూరథుడు కృష్ణుడి మీద దండెత్తాడు. అతన్ని కూడా హతమార్చాడు కృష్ణుడు. దుష్టులను సంహరించి ఇలా భూభారాన్ని తగ్గించాడు దేవదేవుడు.

## కుచేలోపాఖ్యానం

పదవి, అధికారం, డబ్బు ఈ మూడూ మానవుల మనస్తత్వాలను మార్చి వేస్తాయి. ఏమార్చి వేస్తాయి. మానవుల్ని అవి స్థిరంగా ఉండనీయవు. వాటి వ్యామోహంలో పడిన మానవుడు, మంచిచెడులను గుర్తించలేని స్థితికి చేరుకుంటాడు. గర్వాన్ని పెంచుకుంటాడు. అహంకారం అంచులు చూస్తాడు. బాల్యమిత్రులనూ, బంధువులనూ మరచిపోతాడు. వారిని పలకరించడం,

వారితో సంబంధం పెట్టుకోవడం చిన్నతనంగా భావిస్తాడు. ఈ కారణంగానే బంధువులనూ, మిత్రులనూ అవమానిస్తాడతను. అయితే ఇందుకు భిన్నంగా కొందరు ఉంటారు. వారు ఆపదలో ఉన్న బంధు మిత్రులను ఆదుకుంటారు. చేతనయిన సాయం చేస్తారు. మహనీయులు వారు. ఆదర్శప్రాయులు. అలాంటివాడే శ్రీకృష్ణుడు. మహనీయులు అస్థిరాలయిన ఐశ్వర్యాదులకు విర్రవీగరనీ, స్నేహితులనూ, బంధువులనూ మరువరనీ, వారిని ఆదుకుంటారని చెప్పేందుకే వ్యాసుడు ఈ కథ అల్లాడు.   కుచేలోపాఖ్యానం గొప్ప కథ.  పిల్లలేకాదు, పెద్దలు కూడా ఇది తప్పక చదవాల్సిన కథ.

ఓ బీద బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని పేరు కుచేలుడు. కృష్ణునికి అతను బాల్యస్నేహితుడు. ఇద్దరూ బాల్యంలో సాందీపుని వద్ద చదువుకున్నారు. ఒకరిని విడచి ఒకరు ఉండేవారు కాదప్పుడు. ప్రాణమిత్రులు. వేదవేదాంగాలు అభ్యసించి కుచేలుడు గొప్ప పండితుడయినాడు. పండితునికి ఉన్నదే, దుర్భరదారిద్ర్యం. అది పీడించసాగిందతన్ని. దానికి తోడు మితిమీరిన సంతానం. కుచేలుని బాధలకు కొదవలేకుండాపోయింది. తినేందుకు తిండీ, కట్టేందుకు బట్టా కరువయ్యాయి. పిల్లలు ఆకలికి తట్టుకోలేక ఏడ్చేవారు. వారిని ఓదార్చడం కష్టమయ్యేది. ఒకనాడు ఆకలితో వచ్చిన నిద్రతో కునికిపాట్లు పడుతున్న కుచేలుని దగ్గరకు అతని భార్య వచ్చింది. కన్నీరు పెట్టుకున్నది. దీనంగా ఇలా అన్నది.

''స్వామీ! ఎన్నాళ్ళు ఈ దుర్భరదారిద్ర్యం? పిల్లల పరిస్థితి చూసి తట్టుకోలేకపోతున్నాను. ఏం చేద్దాం, ఏం చేస్తే బాగుంటుంది?'' అడిగింది. సమాధానంగా సన్నగా నవ్వి ఊరుకున్నాడు కుచేలుడు. ఆ క్షణంలో అతనికేదీ తోచలేదు. అందుకే నవ్వి ఊరుకున్నాడు.

మళ్ళీ భార్యే అన్నది.

''శరణాగతరక్షకుడూ, ఆపద్బాంధవుడూ శ్రీకృష్ణుని వేడుకోండి. ఈ కష్టాల నుంచి గట్టెక్కించమని ప్రార్థించండి. ద్వారకకు వెళ్ళిరండి. మీ బాల్యమిత్రుడ తను. మీరు అడిగితే ఏదీ కాదనడు. ఆలోచించండి.''

సలహా బాగానే ఉన్నది అనుకున్నాడు కుచేలుడు. ఈ రూపంగానయినా కృష్ణుణ్ణి సందర్శించవచ్చని ఆనందించాడు. చాలా కాలంగా కృష్ణుణ్ణి చూడాలని కోరికగా ఉన్నదతనికి. ఆ కోరిక ఇలా తీరబోతున్నదనుకున్నాడు.

''వెళ్ళొస్తాను కానీ, ఒట్టి చేతుల్తో అంతటి మహానుభావుణ్ణి కలిస్తే ఏం బావుంటుంది చెప్పు? అందుకని ఇంట్లో ఏమన్నా ఉంటే చూడు, మూటగట్టివ్వు'' అన్నాడు కుచేలుడు.

ఇంట్లో మంచినీళ్ళు కూడా లేవు. ఆ మాట చెప్పలేదామె. వెళ్ళి ఇరుగుపొరుగును అర్థించింది. వారు అటుకులు ఇచ్చారు. నాలుగు పిడికిళ్ళయినాయి. చాలనుకున్నదామె. వాటిని మూటగట్టి ఇచ్చింది భర్తకి.

''వెళ్ళిరండి. అదృష్టాన్నీ, ఆత్మీయతనూ పరీక్షించుకోండి'' అన్నది.

బయల్దేరాడు కుచేలుడు. ద్వారకకు చేరుకున్నాడు. ఆ నగరాన్నీ, నగరవీధుల్నీ చూస్తూ అక్కడక్కడా ఆగిపోయాడు. ఆగిన చోటల్లా అనుమానాలు పెంచుకున్నాడు.

కృష్ణుడు ద్వారకాధీశుడు. యాదవప్రభువు. అలాంటి వాడింట తాను అడుగుపెట్టగలడా? అంతఃపురసైనికులూ, ద్వారపాలకులూ అడ్డుకోరా! కృష్ణునికి చిన్ననాటి స్నేహితుణ్ణంటే

నమ్ముతారా? ఒక వేళ నమ్మారనుకుందాం. కృష్ణుని చెంతకు పంపించారనుకుందాం. అప్పుడు కృష్ణుడు తనని చూసి పలకరిస్తాడా? గుర్తుపడతాడా?

రకరకాల అనుమానాలతోనే అనేక కక్ష్యలూ, దుర్గాలూ దాటాడు కుచేలుడు. శ్రీకృష్ణుని భార్యలు ఉండే పదహారు వేల దివ్యభవనాలనూ దాటాడు. దాటి సాక్షాత్తు లక్ష్మీస్వరూపిణి రుక్మిణీదేవి భవనానికి చేరుకున్నాడు. శ్రీకృష్ణుడు అప్పుడు అదే భవనంలో ఉన్నాడు. రుక్మిణి కాళ్ళొత్తుతోంది. సత్యభామ, జాంబవతి వింజామర సేవలు అందిస్తున్నారతనికి. కృష్ణుడు మాగన్నుగా ఉన్నాడు. కుచేలుడు కనిపించాడతనికి. భయం భయంగా అడుగులు వేస్తూ వస్తున్న కుచేలుణ్ణి మనో దృష్టితో చూశాడతను. కళ్ళు తెరచి ఒక్క ఉదుటన లేచాడు. గబగబా అడుగులు వేస్తూ ముందుకు నడిచాడు. ఎక్కడికి స్వామీ? అని రుక్మిణి అడిగింది. సమాధానం లేదు. ప్రియా ఈ పరుగేమిటి? సత్య నిలదీసింది. వినిపించుకోలేదు. జాంబవతి మొదలు మిగిలిన భార్యలంతా అడ్డు నిలిచారు. తొలగించుకుని తరలిపోయాడు కృష్ణుడు. అతని వెన్నంటి నడిచారు అంతఃపురకాంతలు. నాథుని నడకవేగాన్ని అందుకోవడం అసాధ్యం. అయినా ప్రయత్నించి పరుగు పరుగున కృష్ణుణ్ణి అనుసరించసాగారు. అల్లంతదూరంలో ఉన్న కుచేలుణ్ణి చూశాడు కృష్ణుడు. మిత్రమా అంటూ వెళ్ళి గట్టిగా కౌగలించుకున్నాడతన్ని. చిరిగిన వస్త్రాలు, తైలసంస్కారం లేని జుత్తు, మట్టిగొట్టుకు పోయిన దేహం...కుచేలుణ్ణి ముట్టుకోవడమే మహాపాపం అనుకుంటారెవరైనా. అలాంటిది అతన్ని కృష్ణుడు కౌగలించుకోవడం వింతల్లో వింత అనిపించింది చూసిన వారికి. ఎన్నాళ్ళకెన్నాళ్ళకు అన్నాడు కృష్ణుడు. కుచేలుని జబ్బ చరిచాడు. తోడుకుని వచ్చి, కుచేలుణ్ణి రత్నఖచితసింహాసనం మీద కూర్చోబెట్టాడు. హంసతూలికాతల్పం అది. మెత్తమెత్తగా ఉంది. స్థిరంగా కూర్చోలేక పోయాడు కుచేలుడు. అటూ ఇటూ ఒరిగిపోసాగాడు. దిళ్ళు ఆసరా చేసి కూర్చోబెట్టాడతన్ని కృష్ణుడు. సిగ్గుపడ్డాడు కుచేలుడు. సన్నసన్నగా నవ్వుకున్నాడు. వెనుక నిల్చున్న భార్యలను చూసి, బంగారు పళ్ళెరాన్ని తీసుకుని రమ్మన్నాడు కృష్ణుడు. తీసుకు వచ్చారు. అందులో కుచేలుని పాదాలు ఉంచి, కడిగాడు. ఆ నీటిని శిరస్సున జల్లుకున్నాడు. చూసి ఆశ్చర్యపోయారు భార్యలు. గంధపుష్పాక్షతలతో కుచేలుణ్ణి పూజించాడు కృష్ణుడు. ధూపదీపాలు, తాంబూలం నివేదన పెట్టాడు. సకల మర్యాదలతో స్వాగతం పలికాడు. కృష్ణుని కనుసైగను అర్థం చేసుకున్నది రుక్మిణి. కుచేలునికి వింజామరతో వీచసాగింది.

బలహీనుడు. పేదగుండె. కుచేలుడు కృష్ణుని గౌరవమర్యాదలను తట్టుకోలేకపోయాడు. కన్నీరు పెట్టుకున్నాడు. చుట్టుముట్టిన అంతఃపుర కాంతలను చూస్తూ, కట్టుకున్న వస్త్రం చిరుగుల్ని దాచే ప్రయత్నం చేశాడు. అతని అవస్థను గమనించాడు కృష్ణుడు, చిరుగుల మీద తన రెండు చేతులూ ఉంచాడు. చేతుల్లో అతని చిరుగుల్ని దాచాడు. బాల్యాన్ని గుర్తు చేశాడు. నాటి అల్లరిని తలపునకు తెచ్చి, కుచేలుణ్ణి నవ్వించాడు. గురుకులవాసం గొప్పదన్నాడు. ఆనాటి కొన్ని అద్భుత సంఘటనలూ, ఆ సంఘటనల వెనుక తన అదృశ్యహస్తం గురించి చెప్పి, ఆశ్చర్యచకితుణ్ణి చేశాడతన్ని. తర్వాత ఇలా కుశల ప్రశ్నలు వేశాడు.

''పెళ్ళి అయింది అని విన్నాను, తండ్రి అయ్యావని కూడా తెలిసింది. బహుసంతానం అన్నారు. అదృష్టవంతుడివి'' అన్నాడు కృష్ణుడు. ఇబ్బందిగా నవ్వాడు కుచేలుడు.



''చిన్ననాటి స్నేహితుణ్ణి. చిరుతిళ్ళకు అలవాటుపడ్డవాణ్ణి, నాకోసం ఏం తెచ్చావు?'' అడిగాడు కృష్ణుడు.

''అటుకులు'' అని ఆనందంగా చెప్పి, అంతలోనే తప్పుచేసినట్టుగా తలవంచుకున్నాడు కుచేలుడు. అటుకుల మూటను వెనక్కి దాచాడు. దాచిన అటుకుల మూటను ముందుకు లాగాడు కృష్ణుడు.

''ప్రేమతో ఎవరేమిచ్చినా నేను కాదనను. అటుకులు అంటూ ఇవ్వకుండా దాచడం తప్పు కాదూ? నాకిష్టమయిన అటుకులు, బాల్యమిత్రుడు బంగారంలా తెచ్చిన అటుకులు వదులు కుంటానా, వదలనుగాక వదలను'' అన్నాడు కృష్ణుడు. మూటవిప్పాడు. అటుకుల్ని చూశాడు. గుప్పెడు తీసుకున్నాడు. నోట వేసుకున్నాడు. నములుతూ ఇలా అన్నాడు.

''బాగు బాగు, బహురుచిగా ఉన్నాయి.''

మరో గుప్పెడు తీసుకున్నాడు. నోట వేసుకోబోయాడు. నవ్వుతూ వారించిందతన్ని రుక్మిణి.

''ఏమయింది దేవి?'' అడిగాడు కృష్ణుడు.

''మొదటి గుప్పెడుకే ఈ బ్రాహ్మణోత్తమునికి సకల సంపదలూ సమర్పించారు. ఇక రెండవ గుప్పెడు కూడా మీరు స్వీకరిస్తే మీరూ, మీతోపాటు నేనూ, సకల పరివారం ఈతనింట ఉండాల్సి వస్తుంది. స్నేహితుణ్ణి ఆదరించింది చాలు'' అన్నది రుక్మిణి, ఇదంతా భర్త చెవిలో గుసగుసగా రహస్యంగా చెప్పిందామె.

''సరే'' అన్నాడు కృష్ణుడు. తన గుప్పెటలోని అటుకుల్ని ప్రసాదంగా రుక్మిణికి ఇచ్చాడు. మిగిలిన అటుకుల కోసం మాకంటే మాకు అంటూ అంతఃపురకాంతలంతా ముందుకు వచ్చారు. అటుకుల్ని వారలా పంచుకుని తినడం పరమానందం అనిపించింది కుచేలునికి. ఆ ఆనందంలో తానెందుకు అక్కడికి వచ్చిందీ మరచిపోయాడు. ఆ రాత్రి గడిచింది. తెల్లారింది. ఇంటికి బయల్దేరాడు కుచేలుడు. అతన్ని ద్వారక సరిహద్దుల వరకూ సాగనంపి వెనుతిరిగాడు కృష్ణుడు.

తన ఊరికి చేరుకున్నాడు కుచేలుడు. వీధి మలుపు తిరిగాడు. తన నివాసం పర్ణకుటీరం కోసం చూశాడతను. కనిపించలేదు. దాని స్థానంలో ఓ దివ్యభవనం కనిపించింది. ఆ భవనాన్ని దేవతల్లాంటి వ్యక్తులు కాపలా కాస్తున్నారు. కత్తులూ, శూలాలూ ఉన్నాయి వారిదగ్గర. వందలాదిగా పరిచారికలు ఉన్నారు. వారంతా వజ్ర వైడూర్యాలు, స్వర్ణాభరణాలతో తులతూగుతున్నారు. మంచి సంగీతం వినవస్తున్నది లోపల నుంచి. ఎవరో వీణలు మీటుతున్నారు. బాగుందీ భవనం, ఎవరిదో? అనుకున్నాడు కుచేలుడు. అంతలో అతని భార్య సాక్షాత్తు లక్ష్మీదేవిలా ప్రత్యక్షమయింది. దివ్యభూషణాలంకారాలతో వెలిగిపోతూ కనిపించింది.

''గుమ్మంలోనే ఉండిపోయారేంటండీ, లోపలికి రండి. ఇది మన ఇల్లే'' అన్నది. అవునా! ఆశ్చర్యపోయాడు కుచేలుడు.

''రండి! రండి'' అని భర్తని తోడుకుని వచ్చింది. లోపలంతా లక్ష్మీప్రసన్నంగా ఉంది. తల్పాలు, తోరణాలు, అలంకారాలు, ఆభరణాలు కనువిందుగా ఉన్నాయి. బంగారు పళ్ళెరాన్ని తెచ్చి,అందులో భర్త పాదాలను ఉంచి, కడిగిందామె. పువ్వులతో పూజించింది వాటిని.

''చెప్పానా, కృష్ణుణ్ణి వేడుకోండి, కరుణిస్తాడని. కరుణించాడాయన. మన కష్టాలు గట్టెక్కాయి'' అన్నది.

తన పేదరికం, పడుతున్న కష్టాలూ ఇవేవీ కృష్ణునికి చెప్పనేలేదు, మరచిపోయాడతను. కృష్ణుణ్ణి చూసిన ఆనందంలో అదేదీ గుర్తుకు రానేలేదు. అయినా గ్రహించాడు కృష్ణుడు. తనని కటాక్షించాడనుకున్నాడు కుచేలుడు. రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ కళ్ళు మూసుకున్నాడు. శ్రీకృష్ణ దర్శనం భాగ్యం కలిగింది. ఆ దేవదేవుణ్ణి అనేక విధాల స్తుతించాడతను. నాటి నుంచి శ్రీకృష్ణధ్యాన తత్పరుడై ధర్మపథంలో జీవించి, ఆఖరికి మరణించాడు. ముక్తిపొందాడు కుచేలుడు.

## సుభద్రాపరిణయం

బలరామకృష్ణుల చెల్లెలు సుభద్ర. వసుదేవుడు, రోహిణి ఆమె తల్లిదండ్రులు. పాండవ మధ్యముడు అర్జునుని గురించి విన్నదామె. అతని రూపురేఖావిలాసాలూ, గుణగణాలూ, శౌర్యప్రతాపాలూ అన్నీ తెలుసుకున్నది. ప్రేమించిందతన్ని. పెళ్ళాడితే అతన్నే పెళ్ళాడాలను కున్నది. అయితే రాజ్యాన్ని పోగొట్టుకుని, అనేక కష్టాలకులోనవుతున్న పాండవులతో వియ్యమందడం బలరామునికి ఇష్టం లేదు. తన శిష్యుడూ, కురురాజయిన దుర్యోధనునికి సుభద్రను

ఇవ్వాలని అతని ఆలోచన. అది కృష్ణునికి ఇష్టంలేదు. చెల్లెలు మనసు తెలిసిన కృష్ణుడు, ఆమెను అర్జునునికి ఇచ్చి వివాహం చెయ్యాలనే సంకల్పించుకున్నాడు. ఇందుకు అతనికి బంధుమిత్రుల ప్రోత్సాహమూ, సహకారమూ ఉన్నాయి. వారికి కూడా అర్జునుడే సుభద్రకు తగిన వరుడు అన్న అభిప్రాయం ఉన్నది. అయితే సుభద్రార్జునుల వివాహం కారణంగా అన్న బలరామునితో తగవు తెచ్చుకోవడం ఇష్టంలేదు కృష్ణునికి. ఏదేని ఉపాయం ఆలోచించి, సుభద్రార్జునులను ఒకటి చెయ్యాలని, అందులో తన హస్తం లేనట్టుగా ప్రవర్తించాలని అనుకున్నాడు కృష్ణుడు. తగిన సమయం కోసం వేచి చూడసాగాడు.

ఆనాటికే ద్రౌపదితో వివాహం జరిగింది పాండవులకు. అన్నదమ్ములు అయిదుగురూ ఒకొక్కరూ ఒకో సంవత్సరం ద్రౌపదితో కలసి జీవించడం అన్నది నియమంగా పెట్టుకున్నారు కూడా. ఒకరు ద్రౌపదితో ఉన్నప్పుడు వేరొకరు అటుగా వెళ్ళరాదు. వారిరువురినీ చూడరాదు. చూడటం సంభవిస్తే ఏడాదిపాటు తీర్థయాత్రలు చేయాల్సి ఉంటుంది. ఇదీ వారు ఏర్పరుచుకున్న నియమమే! ఓ ఏడాది ద్రౌపదిని కూడి ఉన్నాడు ధర్మరాజు. ఆ సమయంలో అనివార్యంగా అటుగా వెళ్ళి, వారిరువురినీ చూశాడు అర్జునుడు. చూసినందుకుగాను తీర్థయాత్రలు చేయాల్సి వచ్చిందతను. అలా తీర్థయాత్రలు చేస్తూ అర్జునుడు ప్రభాసతీర్థానికి చేరుకున్నాడు. అప్పటికే సుభద్రను అతను ప్రేమిస్తున్నాడు. పెళ్ళాడాలని కూడా అనుకుంటున్నాడు. అయితే తమ పెళ్ళికి బలరాముడు సుముఖంగా లేడని తెలుసుకున్నాడతను. పైగా సుభద్రను దుర్యోధనునికి ఇచ్చి వివాహం చేసేందుకు ప్రయత్నాలు జరగుతున్నాయి అని తెలిసి ఏమీ పాలుపోని స్థితిలో ఉన్నాడు. ఏదేమయినా సంగతులన్నీ తెలుసుకోవాలంటే ద్వారకకు వెళ్ళాల్సిందే అనుకున్నాడు అర్జునుడు. అయితే తననెవరూ గుర్తించకుండా మారువేషంలో వెళ్ళాలనుకున్నాడు. అనుకున్నట్టుగానే త్రిదండయతి వేషం ధరించాడు. ద్వారకకు బయల్దేరాడు.

## సుభద్రార్జునుల పెళ్ళి

యతీశ్వరులన్నా, సన్యాసులన్నా బలరాముడు గౌరవించి, పూజిస్తాడు. ద్వారకకు చేరుకున్న యతివేషధారి అర్జునుని కూడా అతనలాగే గౌరవించి, పూజించాడు. ఇంటికి ఆహ్వానించాడతన్ని. కొన్నాళ్ళు తన ఇంట ఉండమని ప్రార్థించాడు. దానిని గొప్ప అవకాశంగా భావించాడు అర్జునుడు. ఉంటానన్నాడు. అతనికి సపర్యలు చేసేందుకు సుభద్రను నియోగించాడు బలరాముడు. సుభద్ర ప్రతిరోజూ అర్జునునికి పువ్వులూ, పూజాద్రవ్యాలూ వేళపట్టున అందిస్తూ వచ్చింది. అలా వారిద్దరూ ఏకాంతంగా కలుసుకోవడం ప్రారంభమయింది. సుభద్ర అందం అర్జునుని ఆకర్షించింది. అర్జునుని రూపలావణ్యాలు యతిలో కనిపించడంతో అతనంటే సుభద్రకూ ఇష్టం కలిగింది. యతి అర్జునుడయితే బాగుణ్ణనుకున్నదామె. తనపట్ల బలరామునికి ఎలాంటి అనుమానమూ రాకుండా జాగ్రతపడసాగాడు అర్జునుడు. కృష్ణునికి జరుగుతున్నదంతా తెలుసు. యతివేషంలో ఉన్న అర్జునుని ఇట్టే కనిపెట్టాడతను. దేనికయినా సమయం, సందర్భం రావాలనుకున్నాడు. వాటి కోసం నిరీక్షించసాగాడు.

ఒకనాడు తనకు పరిచర్యలు చేస్తున్న సుభద్రకు అసలు విషయం బయటపెట్టాడు అర్జునుడు. తన నిజరూపం చూపించాడామెకు. ప్రేమించాను, పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను, అందుకే ఈ వేషం అన్నాడు. నవ్వింది సుభద్ర. ఆశించింది జరగడంతో ఆనందంతో అతని గుండెల మీద వాలిపోయింది. కృష్ణుడు ఆశించినట్టుగా సమయ సందర్భాలు రెండూ కలసి వచ్చాయి. యాదవులు యాత్రకు బయల్దేరారు. యాత్రకు సుభద్ర కూడా బయల్దేరింది. ఆమెకు ప్రత్యేకించి రథాన్ని కేటాయించాడు కృష్ణుడు. ఆ రథం వెళ్ళి అర్జునుని ముందు నిలిచింది. రథాన్ని అధిరోహించి, సుభద్రను చేపట్టాడు అర్జునుడు. దేవకీ వసుదేవులు, శ్రీకృష్ణుడుసహా ఆత్మీయులంతా వారిని ఆశీర్వదించారు. కృష్ణుడు చెప్పిన మీదట సుభద్రార్జునులు ఇంద్రప్రస్థానికి బయల్దేరారు. వచ్చినవాడు యతి కాదని, అర్జునుడని, అతను సుభద్రను చేపట్టి ఇంద్రప్రస్థానికి తరలించుకునిపోతున్నాడని ఆగ్రహించారు యాదవవీరులు. అర్జునునితో యుద్ధానికి దిగారు. వారందరినీ అర్జునుడు ఓడించాడు. విషయం బలరామునికి తెలిసింది. ఆగ్రహోదగ్రు డయ్యాడతను. యుద్ధానికి రథాన్ని సిద్ధం చెయ్యమన్నాడు. కవచాన్ని ధరించాడు. కదనరంగానికి బయల్దేరబోయాడు. అతన్ని కృష్ణుడు వారించాడప్పుడు. ప్రేమజంటను విడదీయరాదన్నాడు. దేవకీ వసుదేవులు కూడా నచ్చజెప్పారతనికి. బలరాముని కోపాన్ని చల్లార్చారంతా. అతన్ని సుభద్రార్జునుల వివాహానికి సుముఖుణ్ణి చేశారు.

బలరాముని అంగీకారంతో సుభద్రార్జునుల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. అపారమయిన ధన కనక వస్తువాహనాలను అరణంగా ఇచ్చి, సుభద్రను అత్తవారింటికి పంపాడు బలరాముడు. ఈ వివాహంతో పాండవులకూ, యాదవులకూ మధ్యగల బాంధవ్యం మరింత గట్టిపడింది. అభిమన్యుడు, సుభద్రార్జునుల కుమారుడే! అతను మహాభారత సంగ్రామంలో సాటిలేని పరాక్రమాన్ని ప్రదర్శించి, చివరకు వీరస్వర్గాన్ని అలంకరించాడు.

## స్యమంతపంచకం

పూర్వం పరశురాముడు ఇరవై ఒక్కసార్లు దండెత్తి క్షత్రియులందరినీ చంపివేశాడు. ఆ క్షత్రియుల రక్తం అయిదు మడుగులు కట్టింది. ఆ అయిదు మడుగులకే స్యమంతపంచకం అని పేరు. ఆ రక్తంతోనే తన పితృదేవతలకు తర్పణం వదిలాడు పరశురాముడు. ఇది కురుక్షేత్రంలో ఉంది. మహాభారతసంగ్రామం ఇక్కడే జరిగింది. భారతయుద్ధం జరగడంతోనూ, మహర్షులంతా ఇక్కడే నెలవుండి, సత్త్రయాగం చేయడంతోనూ కురుక్షేత్రం పుణ్యస్థలి అయింది. కురుడు అనే రాజు యజ్ఞం చేసేందుకు ఈ ప్రదేశాన్ని దున్నాడు. ఈ కారణంగా ఈ ప్రాంతానికి 'కురుక్షేత్రం' అని పేరు వచ్చింది.

ఒకనాడు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడింది. గ్రహణసమయం అత్యంత పుణ్యప్రదం కావడంతో బలరామకృష్ణులు సహా యాదవ ప్రముఖులంతా కురుక్షేత్రానికి బయల్దేరారు. పావనక్షేత్రం కురుక్షేత్రానికి చేరుకుని యాదవులంతా స్నానాలు చేశారు. ఉపవాసం ఉన్నారు. దానాలు చేశారు. రేపల్లె నుంచి నందాదులు కూడా వచ్చారక్కడికి. హస్తినాపురం నుంచి గాంధారీ ధృతరాష్ట్రులు, భీష్ముడు, ద్రోణుడు కూడా చేరుకున్నారక్కడికి. ధర్మరాజుసహా పాండవులు, విరాటుడు, ద్రుపదుడు కూడా వచ్చారక్కడికి. అందరూ అలా ఓ చోట కలుసుకోవడం అద్భుత



మనిపించింది. ఆత్మీయమనిపించింది. భోజనాలు చేసి, చెట్లనీడన విశ్రమించారంతా. బలరామ కృష్ణులతో అనేక విషయాలు సంభాషించారు.

యశోద, నందగోపుడు, గోపికలు, గోపాలురు కృష్ణుణ్ణి తనివితీరా చూసుకున్నారు. పూజించారతన్ని. అప్పుడే గోపికలకు ఆత్మజ్ఞానం బోధించాడు కృష్ణుడు. అలా గోపికలు కృష్ణతత్వాన్ని తెలుసుకోగలిగారు. క్షణికమయిన మోహావేశాన్ని విడనాడారు. భగవత్స్వరూపులయిన బలరామ కృష్ణులను సందర్శించేందుకు మునులూ, మహర్షులూ కూడా వచ్చారక్కడికి. వ్యాసుడు, నారదుడు, విశ్వామిత్రుడు, చ్యవనుడు, శతానందుడు, వశిష్ఠుడు, భరద్వాజుడు, పులస్త్యుడు, అత్రి, మార్కండేయుడు, యాజ్ఞవల్క్యుడు, వామదేవుడు, గౌతముడు, జమదగ్ని, భృగువు, బృహస్పతి, అగస్త్యుడు, అంగిరసుడు ఆదిగా ఋషులంతా శిష్యసమేతంగా వచ్చి బలరామకృష్ణులను చూసి తరించారు. వచ్చిన ఋషులను సముచితరీతిన బలరామకృష్ణులు పూజించారు. మునుల

ఆదేశానుసారం వసుదేవుడు కురుక్షేత్రంలో అనేక యజ్ఞయాగాదులు చేశాడు. ఇదే సందర్భంగా వసుదేవునికి మునులు తత్త్వబోధ చేశారు. కృష్ణుడు కూడా తండ్రికి ఆత్మజ్ఞానాన్ని బోధించాడు. పరతత్త్వాన్ని ప్రబోధించాడు. ఫలితంగా వసుదేవుడు మోహబంధాలు తెంచుకున్నాడు. మోక్షపదం అందుకున్నాడు.

యాదవులు సహా అంతా ద్వారకకు తిరుగుప్రయాణమయ్యారు.

## తల్లిని ఓదార్చిన తనయులు

తనకి పుట్టిన ఆరుగురు బిడ్డల్నీ కంసుడు పొట్టనపెట్టుకున్న దుఃఖాన్ని దేవకి మరచిపోలేక పోయింది. వారు హతులయిన విధం తలచుకుంటూ ఏడవని రోజు లేదామెకు. ఒకనాడు దేవకి దుఃఖానికి అంతులేకుండాపోయింది. పిల్లలను తలచుకుంటూ ఆమె ఒక్కపెట్టున రోదించసాగింది. ఓదార్చలేకపోయారెవరూ. బలరామకృష్ణులు దగ్గరగా తీసుకున్నా దుఃఖాన్ని ఆపుకోలేకపోయిం దామె. బలరామకృష్ణులు గొప్ప మహిమ కలవారు. వారు తలచుకుంటే ఏదయినా సాధిస్తారని దేవకికి తెలుసు. అందుకే వారినిలా ప్రార్థించిందామె.

చనిపోయిన తన ఆరుగురుబిడ్డల్నీ ఒక్కసారి చూపించి పుణ్యం కట్టుకోమంది. మరణించిన గురుపుత్రుని తెచ్చి, గురువుకి సమర్పించిన వైనాన్ని బలరామకృష్ణులకు గుర్తు చేసిందామె. తల్లినయ్యా! ఈ ఒక్కకోరికా తీర్చండయ్యా అని అడిగింది. కాదనలేకపోయారు బలరామ కృష్ణులు. చనిపోయిన పిల్లల్ని తీసుకొచ్చి చూపిస్తామని వాగ్దానం చేశారు. బయల్దేరారక్కణ్ణుంచి. యోగమాయబలంతో పాతాళానికి చేరుకున్నారు. పాతాళలోకానికి బలరామకృష్ణులు వచ్చారన గానే వారిని సకల మర్యాదలతో ఆహ్వానించాడు బలిచక్రవర్తి. ఇద్దరినీ పూజించాడు. తర్వాత వచ్చినకార్యం తెలియజేయమన్నాడు. దేవకి దుఃఖం సంగతి చెప్పాడు కృష్ణుడు. ఆరుగురు పుత్రుల్నీ అమ్మ చూడాలంటోందన్నాడు. సహజం కదా అన్నాడు బలిచక్రవర్తి. దేవకి ఆరుగురు పుత్రుల్నీ తెచ్చి బలరామకృష్ణులకు సమర్పించాడు. వారిని వెంటబెట్టుకుని దేవకిని సమీపించారు బలరామకృష్ణులు. పిల్లల్ని చూసి దేవకీవసుదేవులు ఉప్పొంగిపోయారు. పిల్లల్ని పదేపదే కౌగిలించుకుని ముద్దాడింది దేవకి. వారికి కడుపారా పాలు పట్టింది. శ్రీకృష్ణుని స్పర్శతో భవబంధాలన్నీ తొలగిపోయాయి. ఆరుగురు పిల్లలూ దివ్యరూపాలు ధరించారు. పుణ్యలోకాలకు వెళ్ళిపోయారు.

## అర్జున గర్వభంగం

అర్జునుడు ద్వారకలో ఉన్నాడప్పుడు. కృష్ణునితో అస్త్రశస్త్రాల గురించి అనర్గళంగా మాట్లాడు తున్నాడు. అప్పుడు ఓ బ్రాహ్మణుడు, పుట్టగానే చనిపోయిన తన పిల్లాడి శవాన్ని తీసుకుని వచ్చి, రాజద్వారం ముందు పెట్టాడు. భోరుభోరున విలపించసాగాడు. విలపిస్తూ రాజదోషం కారణంగానే తన పిల్లాడు మృతి చెందాడంటూ ఆరోపించాడు. అతనికి ఇంతకు ముందు ఎనిమిదిమంది పిల్లలు పుట్టారు. ఆ ఎనిమిదిమందీ ఇంతే! పుట్టగానే మరణించారు. వారి శవాలను కూడా తీసుకుని వచ్చాడు బ్రాహ్మణుడు. వాటిని కూడా రాజద్వారం ముందు పడవేశాడు. మొత్తం తొమ్మిదిమంది పిల్లల శవాలు. ఆ శవాలను పురప్రజలకు చూపిస్తూ, దీనికి కారణం

అధర్మపాలనంటూ రాజుని దూషించసాగాడు. కృష్ణార్జునులిద్దరూ ఆ బ్రాహ్మణుని ఆరోపణలూ, దూషణలూ వింటూ నిలుచున్నారు. పట్టించుకోనట్టుగా నిల్చున్న కృష్ణుణ్ణి చూసి, తాను కలుగజేసుకున్నాడు అర్జునుడు. బ్రాహ్మణుణ్ణి సమీపించాడు. అతన్ని ఓదార్చసాగాడు. ఎంత ఓదార్చినా సమాధానపడకపోవడంతో ఆ బ్రాహ్మణునికి ఇలా వాగ్దానం చేశాడు అర్జునుడు.

మరణించిన నీ కుమారులందరినీ నీకు తెచ్చిస్తాను, అంతేకాదు, ఇక మీదట పుట్టబోయే నీ బిడ్డలందరినీ కాపాడే బాధ్యత కూడా నాదే!

ఆ మాటకి బ్రాహ్మణుడు ఊరడిల్లాడు. కృష్ణుడు ఆశ్చర్యపోయాడు. దేవేంద్రుని సయితం ఓడించానని అర్జునునికి బాగా గర్వంగా ఉన్నది. ఆ గర్వంతోనే మరణించిన బ్రాహ్మణ పుత్రులను తెచ్చి ఇస్తానన్నాడు అర్జునుడు. అది సాధ్యమా? మహావీరుణ్ణని విర్రవీగుతున్న అర్జునునికి గర్వభంగం జరగాలి. అప్పటిక్కాని అర్జునుడు సాధ్యాసాధ్యాలు తెలుసుకోలేడు అనుకున్నాడు కృష్ణుడు.

కొద్దికాలం గడిచింది.

బ్రాహ్మణుని భార్య మళ్ళీ ప్రసవించే సమయం వచ్చింది. నొప్పులు పడుతోందామె. బ్రాహ్మణుడు పరుగున వచ్చి కృష్ణార్జునులను కలిశాడు. అర్జునునితో ఇలా మొరపెట్టుకున్నాడు.

కిరీటీ! నా పిల్లాణ్ణి నువ్వే కాపాడాలి!

పదమన్నాడు అర్జునుడు. గాండీవాన్ని ధరించి బ్రాహ్మణుని ఇంటికి చేరుకున్నాడు. దివ్యాస్త్రాలను ప్రయోగించి, పురిటింటి చుట్టూ పంజరాన్ని ఏర్పరిచాడు. మృత్యువు ప్రవేశించేందుకు వీలులేకుండా చేశాడు. వచ్చే మృత్యువును ఎదిరించేందుకు బాణాన్ని ఎక్కుపెట్టి మరీ నిలుచున్నాడు అర్జునుడు.

బ్రాహ్మణుని భార్య ప్రసవించింది. అనుకున్నట్టుగానే పిల్లాడే పుట్టాడు. అయితే పుట్టిన వెంటనే ఆ బిడ్డ అదృశ్యమయిపోయాడు. ఎవరో వాణ్ణి మాయం చేశారు. ఏడుస్తూ అర్జునుని దగ్గరకు వచ్చాడు బ్రాహ్మణుడు. వేదనతో అర్జునుణ్ణి నానామాటలూ అన్నాడు. దూషించాడతన్ని. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయావని కించపరిచాడు. బ్రాహ్మణుని మాటలను తట్టుకోలేకపోయాడు అర్జునుడు. కోపం వచ్చిందతనికి. హుటాహుటిన యమపురికి చేరుకున్నాడు. పిల్లలందరినీ వెదికాడు. బ్రాహ్మణదంపతుల పోలికలు ఉన్న పిల్లాడు కనిపించలేదెక్కడా. ఇంద్ర, వరుణలోకాలకూ వెళ్ళాడు. అక్కడ కూడా పిల్లాడు కనిపించలేదు. దిక్పాలకుల పట్టణాలన్నీ వెదికాడు. ఫలితం కనిపించలేదు. వాగ్దానం చెల్లించలేకపోయినందుకు చింతించాడు అర్జునుడు. గాండీవంసహా అగ్నిప్రవేశం చేసేందుకు సిద్ధమయ్యాడు.

అగ్నిప్రవేశం చేస్తున్న అర్జునుణ్ణి వారించాడు కృష్ణుడు. బ్రాహ్మణ కుమారుడు ఎక్కడ ఉన్నదీ తాను చూపిస్తానన్నాడు. రథంపై కూర్చోబెట్టుకుని అర్జునునిసహా పడమటి దిక్కుకు బయల్దేరాడు కృష్ణుడు. ఇద్దరూ ఏడుదీవులు దాటారు. ఏడు సముద్రాలూ దాటారు. పర్వతాలు దాటి లోకాలోకం, చక్రవాళాన్నీ దాటారు. ఇంకా ముందుకు ప్రయాణించారు. ముందంతా అంధకారం. ఏదీ కనిపించడం లేదు. రథం ఆగిపోయింది. కృష్ణుడు అప్పుడు చక్రాయుధాన్ని ప్రయోగించాడు. అది చీకట్లను ఛేదించింది. వెలుగుల్ని విరజిమ్మింది. ఆ వెలుగుల్ని చూడలేకపోయాడు అర్జునుడు.

కళ్ళు మూసుకున్నాడు. కృష్ణుని రథం పరుగందుకుంది. ఓ దివ్య ప్రదేశానికి చేరుకుని ఆగింది. అక్కడ నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు. దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నాడు. అతన్ని దర్శించమన్నట్టుగా అర్జునుని కళ్ళ మీది చేతుల్ని తొలగించాడు కృష్ణుడు. మహాతేజస్సుతో మిరిమిట్లుగొల్పుతున్న నారాయణుని అర్జునుడుసహా కృష్ణుడు చూశాడు. చేతులు జోడించి అతనికి నమస్కరించాడు.

## మహోన్నతుడు మాధవుడే

''కృష్ణార్జునులారా! మీరిద్దరూ నా అంశతో జన్మించిన మహాపురుషులు. మిమ్మల్ని చూడా లనిపించింది. రప్పించానిక్కడకి. మీరు వెదుకుతున్న బ్రాహ్మణపుత్రుణ్ణేకాదు, అతని అన్నలు ఎనిమిదిమందినీ నేనే దాచానిక్కడ'' అన్నాడు నారాయణుడు.

ఒకరిని ఒకరు చూసుకున్నారు కృష్ణార్జునులు.

''తొమ్మండుగురు బ్రాహ్మణపుత్రులూ, ఇరిగో తీసుకోండి.'' పిల్లలను కృష్ణార్జునులకు సమ ర్పించాడు నారాయణుడు. పిల్లలను తీసుకుని ద్వారకకు బయల్దేరారు కృష్ణార్జునులు. చేరుకుని, పిల్లల్ని బ్రాహ్మణునికి అప్పగించారు. సంతోషించాడు బ్రాహ్మణుడు. కృష్ణార్జునులను అనేకరకా లుగా కీర్తించాడు.

కృష్ణుని ప్రభావాన్ని గుర్తించాడు అర్జునుడు. తాను నిమిత్తమాత్రుణ్ణని తెలుసుకున్నాడు. కృష్ణునికి త్రికరణశుద్ధిగా నమస్కరించాడు.

### వృకాసురుడు

పూర్వం వృకుడు అనే దానవుడు ఉండేవాడు. శకుని కుమారుడతను. ఒకసారి అతను దారి కాచి నారదుణ్ణి ఇలా అడిగాడు.

''బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో ఎవరిని సులభంగా వశం చేసుకోగలం?''

''శంకరుడిది భోళాగుణం. భక్తవశంకరుడు అంటారతన్ని. అతన్ని వశం చేసుకోవడం సులభం అని నా అభిప్రాయం'' అన్నాడు నారదుడు.

చాలన్నాడు వృకుడు. కేదారానికి వెళ్ళాడు. దీక్షగా కూర్చున్నాడక్కడ. తన దేహాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించి, ఆ ఖండాలను అగ్నిలో వేల్చుతూ ఆరురోజులపాటు శంకరుణ్ణి ఆరాధిం చాడు. శంకరుడు ప్రత్యక్షం కాలేదు. ఏడవరోజు తన శిరస్సును ఖండించి అగ్నిలో వేసేందుకు సిద్ధమయ్యాడు వృకుడు. అప్పుడు ప్రత్యక్షమయ్యాడు శంకరుడు.

''నీ భక్తికి మెచ్చాను వృకాసురా! కోరుకో, ఏ వరం కావాలో కోరుకో'' అన్నాడు శంకరుడు.

''నేను ఎవరితలపై అయితే చేయిపెడతానో, వారు మరుక్షణం మరణించాలి. ఆ వరాన్ని ప్రసాదించు'' అడిగాడు వృకాసురుడు. ఆలోచించాడు శంకరుడు. కోరరాని వరం కోరాడు. అయినా తప్పదనుకున్నాడు. అనుగ్రహించాడు.

''వరప్రభావాన్ని పరీక్షించాలి, ఏం చెయ్యను?'' అడిగాడు వృకుడు. ఏం చేస్తావు? అన్న ట్టుగా చూశాడు శంకరుడు.

''నీ తలమీదే చేయిపెడతాను, మరణిస్తావో లేదో చూస్తాను'' అన్నాడు వృకుడు. శంకరుణ్ణి దగ్గరకు రమ్మన్నాడు. పాముకి పాలుపోసినట్టయింది అనుకున్నాడు శంకరుడు. పరుగందుకున్నాడు అక్కణ్ణుంచి. రమ్మంటూ అతని వెంటపడ్డాడు వృకుడు. చాలా దూరం పరుగుదీశారిద్దరూ. శంకరుడికి ఏం చేయాలో పాలుపోలేదు. తనని తాను కాపాడుకునేందుకు వైకుంఠానికి చేరుకున్నాడు. శ్రీహరిని సమీపించి జరిగిందంతా వివరించాడతనికి.

''ధైర్యంగా ఉండు, వృకుడి సంగతి నేను చూసుకుంటాను'' అన్నాడు శ్రీహరి. శంకరుణ్ణి తన చాటుగా దాచాడు. అంతలో అక్కడకి వృకుడు చేరుకున్నాడు.

''ఏడీ, ఎక్కడ శంకరుడు?'' వెదకసాగాడు.

''తర్వాత తీరిగ్గా వెదుకుదువుగాని, ముందు ఈ సంగతి చెప్పు, శంకరుడు నీకేదోవరం ఇచ్చాట్ట కదా, నారదుడు చెప్పగా విన్నాను, నిజమేనా?'' అడిగాడు శ్రీహరి.

''నిజమే'' అన్నాడు వృకుడు.



''అన్నానని కాదుగాని, శంకరుని వరాలు ఏ మేరకు పని చేస్తాయో పరీక్షించి చూసుకున్నావా?'' అడిగాడు మళ్ళీ.

''అది పరీక్షించేందుకే శంకరుణ్ణి వెదుకుతున్నాను.''

''దానికి అతనెందుకు? నువ్వు లేవూ?'' అన్నాడు శ్రీహరి. వృకుణ్ణి మందమతిని చేశాడు ఆ క్షణంలో.

''అవునవును, నేనున్నానుగా'' అన్నాడు వృకుడు.

''నీ చేతిని నీ తలమీద నువ్వే పెట్టుకో! పరీక్షించుకో! నాకు తెలిసీ భోళాశంకరునివరం ఫలించదు. ఫలించనప్పుడు ఊరుకోవద్దు, పదిమందిలో పెట్టి అతగాడి పరువు తీసేయ్'' అన్నాడు శ్రీహరి.

''బాగా చెప్పావు'' అన్నాడు వృకుడు.

''ఫలించదు, ఫలించదు'' అంటూ చేతిని తనతల మీద పెట్టుకున్నాడు. పెట్టుకున్న మరుక్షణం తల పేలి మరణించాడు వృకుడు. అతడు మరణించడంతో వైకుంఠంలో జయజయధ్వానాలు వినవచ్చాయి. పూలవాన కురిసింది. చాటునుంచి వచ్చి శ్రీహరికి ఎదురుగా నిల్చున్నాడు శంకరుడు. చేతులు జోడించి నమస్కరించి, శ్రీహరిని అనేక విధాలుగా కీర్తించాడు. తర్వాత కైలాసానికి చేరుకున్నాడు.

త్రిమూర్తులలో శ్రీహరి గొప్పవాడని మరొక కథ కూడా ప్రచారంలో ఉన్నది. ఆ కథను పరీక్షిత్తుకు శుకుడు వినిపించాడు.

పూర్వం సరస్వతీ నదీతీరంలో మహర్షులంతా సత్త్రయాగం చేస్తున్నప్పుడు త్రిమూర్తులలో ఎవరు ఉన్నతుడు అన్నది చర్చనీయాంశం అయింది. వాదోపవాదాలు చాలా జరిగాయి. ఎవరూ ఏదీ తేల్చలేకపోయారు. చివరకు అంతా భృగుమహర్షిని ఆశ్రయించారు. త్రిమూర్తులలో ఎవరు గొప్ప అన్నది నువ్వే నిర్ణయించాలి. బాధ్యత నీదే అని అతన్ని త్రిలోకాలూ చుట్టిరమ్మన్నారు. వారి మాట మీద భృగుమహర్షి మొదటగా బ్రహ్మలోకానికి వెళ్ళాడు. బ్రహ్మని పరీక్షించదలచి, అతన్ని స్తోత్రం చెయ్యకుండా ఊరుకున్నాడు. తనని సందర్శించినప్పుడల్లా స్తోత్రం చేసే మహర్షి, ఈనాడు స్తోత్రం చెయ్యకపోవడంతో కోపం వచ్చింది బ్రహ్మకి. అయితే ఆ కోపాన్ని అతను ప్రదర్శించలేదు. దానికి కారణం, భృగువు అతని పుత్రుడు కావడమే! కుమారుడని కోపాన్ని అణచుకున్నాడు బ్రహ్మ. కైలాసానికి చేరుకున్నాడు భృగువు. అతన్ని చూస్తూనే శంకరుడు లేచి వచ్చి కౌగిలించుకోబోయాడు. వారించాడు భృగువు.

''నన్ను తాకే అర్హత నీకు లేదు'' అన్నాడు. కోపం వచ్చింది శంకరుడికి. త్రిశూలంతో భృగువుని చంపబోయాడు. వద్దంటూ అడ్డుపడింది పార్వతి. శంకరుని పాదాలుపట్టి బతిమలాడింది. శాంతించాడు శంకరుడు. భృగువు అక్కణ్ణుంచి సరాసరి వైకుంఠం చేరుకున్నాడు. భృగువు వైకుంఠానికి చేరుకున్న సమయంలో శ్రీహరి, ఎంచక్కా లక్ష్మీదేవి అంకపీఠంపై తలపెట్టుకుని పవళించి ఉన్నాడు. ఆ దృశ్యాన్ని చూసి కోపగించుకున్నాడు భృగువు.

''నిరంతర భోగాభిలాషివి, నీకెందుకు ఈ వైకుంఠం?'' అన్నాడు. కాలెత్తి శ్రీహరి వక్షస్థలం మీద గట్టిగా తన్నాడు. కళ్ళిప్పి భృగువును చూశాడప్పుడు శ్రీహరి. మహర్షీ అంటూ అతని పాదాన్ని పరిశీలించసాగాడు.

''ఏం చూస్తున్నావు?'' అడిగాడు భృగువు.

''నా దేహాన్ని మీ పాదం తాకడం వల్ల మీ పాదానికి గాయమయిందేమోనని నా బాధ.'' అన్నాడు శ్రీహరి.

''మీ పాదానికి నొప్పి కలిగినా నేను తట్టుకోలేను'' అన్నాడు మళ్ళీ. భృగువు పాదాన్ని ఒత్తసాగాడు.

''మీ పాదస్పర్శతో పావనమయిన నా వక్షస్థలంలో ఇక మీదట లక్ష్మీదేవి వసిస్తుంది'' అన్నాడు. వక్షస్థలాన్ని నిమురుకుని మురిసిపోయాడు శ్రీహరి. తర్వాత భృగువుకి అర్ఘ్యపాద్యాలు సమర్పించి పూజించాడతన్ని. చేసిన అవమానానికి ప్రతిగా పూజలా! ఆశ్చర్యపోయాడు భృగువు. శ్రీహరి ఆదరాభిమానాలకు పొంగిపోయాడు. వెనువెంటనే సరస్వతీ నదీతీరానికి చేరుకున్నాడు. జరిగిందంతా సాటి ఋషులకు తెలియజేశాడు.

''మీరే నిర్ణయించండి, ఎవరు ఉన్నతులో'' అన్నాడు. సత్వరజస్తమో గుణప్రధానులయిన త్రిమూర్తులలో నిస్సందేహంగా శ్రీహరే ఉన్నతుడు అని అన్నారంతా.

## బలరాముని మహిమ

బలరాముడు ఆదిశేషుని అవతారం. అతని మహిమలు కొన్ని భాగవతంలో చోటు చేసుకున్నాయి. వ్యాసుడు వాటిని హృద్యంగా చిత్రించాడు.

ద్వివిదుడు అని ఒక వానరుడు ఉండేవాడు. అతను సుగ్రీవుని మంత్రి మైందుని సోదరుడు. నరకాసురునికి స్నేహితుడు. శ్రీకృష్ణుడు నరకాసురుణ్ణి సంహరించడంతో స్నేహితుణ్ణి కోల్పోయినందుకు ద్వివిదుడు, యాదవుల మీద పగబూనాడు. పగబూని యాదవులు నివసించే ప్రాంతాల్లో నిప్పు రాజేసి, వారిళ్ళూ, భవంతులూ  దగ్ధం అవుతోంటే ఆనందించేవాడు. మహాబలాఢ్యుడు కావడంతో సముద్రంలోకి ప్రవేశించేవాడు ద్వివిదుడు. ప్రవేశించి సాగర జలాన్ని ఎగజిమ్మి యాదవులను ముంచెత్తేవాడు. యాదవులతోపాటు సాధుపుంగవులనూ, మునులనూ కూడా కష్టపెట్టేవాడతను. వారి యజ్ఞయాగాదులను ధ్వంసం చేసేవాడు. వారి ఆశ్రమాలను అపవిత్రం చేసేవాడు. స్త్రీలను చెరబట్టి అవమానించేవాడు. అనర్తదేశానికి పెద్ద ప్రమాదంగా పరిణమించాడతను.

ఒకసారి రైవతపర్వతం మీద విహరిస్తున్న బలరాముణ్ణి చూశాడు ద్వివిదుడు. ఆత్మీయులతో అనురాగాన్ని పంచుకుంటున్నాడతను. అదే అదననుకున్నాడు ద్వివిదుడు. బలరాముని చుట్టూ ఉన్న స్త్రీలను చూసి అతను కోతిచేష్టలు అనేకం చేశాడు.  అవమానించాడు వారిని. అది చూసి భరించలేకపోయాడు బలరాముడు. కోపం వచ్చిందతనికి. ద్వివిదుడు మీద హలాయుధంతో దాడి చేశాడు. ఇద్దరికీ పెద్ద యుద్ధం జరిగింది. ద్వివిదుడు పెద్దపెద్ద కొండల్నీ, చెట్లనీ పెరికి బలరాముని మీదకు విసిరాడు. తప్పించుకుని ప్రతిఘటించాడు బలరాముడు. ఆఖరికి ద్వివిదుణ్ణి ముష్ఠిఘాతాలతో యమపురికి పంపించాడతను. ద్వివిదుని మరణం యాదవులకు చెప్పలేని ఆనందాన్ని కలిగించింది. వారంతా బలరాముణ్ణి అనేకవిధాల స్తుతించి కీర్తించారు.

ఒకనాటి హస్తినాపురమే నేటి ఢిల్లీ. యమునాతీరంలో గల ఈ పట్టణం ఒక ప్రక్కకు ఒరిగినట్టు ఉంటుంది. దీనికి కారణం బలరాముడే!

కుమార్తె లక్ష్మణకు స్వయంవరం ప్రకటించాడు దుర్యోధనుడు. అదే అదనుగా జాంబవతి కుమారుడు సాంబుడు హస్తినాపురానికి చేరుకున్నాడు. లక్ష్మణను ప్రేమిస్తున్నాడతను. ఆమెను అపహరించి వివాహం చేసుకోవాలనుకున్నాడు. ఆ ప్రయత్నమే చేశాడు. కౌరవులకు కోపం వచ్చింది. కుర్రవాడికి ఇంత తెగింపా అని సాంబుణ్ణి చుట్టుముట్టారంతా. బంధించాలనుకున్నారు. అయితే సాంబుడు వీరవిహారం చేశాడు. యుద్ధంలో కౌరవవీరులకు ముచ్చెమటలు పట్టించాడు. విజయం తనదే అనుకున్న సమయంలో విరథుడు అయ్యాడు సాంబుడు. దాంతో బంధించ బడ్డాడు. ఈవార్తను యాదవులకు చేరవేశాడు నారదుడు. మన సాంబుణ్ణి కౌరవులు బంధి స్తారా? అంటూ యాదవులు కౌరవులతో యుద్ధానికి సన్నద్ధులయ్యారు. వారిని వారించాడప్పుడు బలరాముడు. సంధికోసం హస్తినాపురానికి బయల్దేరాడు. హస్తినాపురం వెలుపలే విడిది చేశాడు. బంధువుల మధ్య యుద్ధాలు మంచిది కాదని, సాంబుణ్ణి విడచిపెట్టమని ఉద్ధవుని ద్వారా రాయ బారం పంపాడు బలరాముడు. కౌరవులకు ఉద్ధవుని మాటలు రుచించలేదు. యుద్ధమే కావాల న్నట్టుగా మాట్లాడారు. పైగా యాదవుల్ని అనరాని మాటలు అన్నారు. కించపరిచారు వారిని. ఉద్ధవుడు చెప్పింది విని, బలరాముడు కోపాన్ని అణచుకోలేకపోయాడు. హస్తినాపురాన్ని సర్వనాశనం చేస్తానని నాగలితో బయల్దేరాడు. హస్తినాపురాన్ని పెకలించి, నీటిపాలు చేద్దామను కున్నాడు. కొంత భాగాన్ని పెకలించాడు. నీట ముంచి అనుకున్నది సాధించాడు. ఇంకొంత భాగాన్ని పెకలించే ప్రయత్నంలో ఉండగా కౌరవులు పరుగు పరుగున వచ్చారు. భీష్మ ద్రోణా దులను వెంటబెట్టుకుని మరీ వచ్చారు. వచ్చి, కాపాడమని వేడుకున్నారతన్ని. స్తుతించారు. శాంతించాడు బలరాముడు. తన ప్రయత్నాన్ని విరమించాడు. సంతోషించారు కౌరవులు. కాను కగా లక్ష్మణను సాంబునికి ఇచ్చి వివాహం జరిపించారు.

## యాదవకులంలో ముసలం

కొద్దిరోజులు గడిచాయి. కురుపాండవుల మధ్య మాటా మాటా పెరిగింది. కలహం చెల రేగింది. సంధిప్రయత్నాలు విఫలమయ్యాయి. ఉభయపక్షాలూ యుద్ధానికి సిద్ధమయ్యాయి. కురుపాండవులు ఒకరినొకరు ఢీకొనబోతున్నారని తెలిసి, చాలా బాధపడ్డాడు బలరాముడు. తమ్ముడు కృష్ణుడు పాండవులపక్షం వహించాడని తెలుసు. తాను ఎవరిపక్షం వహించాలి? ప్రియ శిష్యుడు దుర్యోధనునిపక్షం వహించాలా? వహించి, పాండవులతో చేతులు కలిపిన కృష్ణునితో కయ్యానికి కాలుదువ్వాలా? జరగని పని అది. ఈ పరిస్థితుల్లో ద్వారకలో ఉండడమే ప్రమాద కరం. ఉండకూడదనుకున్నాడు బలరాముడు. తీర్థయాత్రలకు బయల్దేరాడు. ముందుగా ప్రభా సానికి చేరుకున్నాడు. అక్కణ్ణుంచి సరస్వతీనదీతీరానికి ప్రయాణమయ్యాడు. ఆ తీరంలోని క్షేత్రాలు దర్శించాడు. గంగా యమునలకు చేరుకున్నాడు. ఆ నదీతీరాల పుణ్యాతీర్థాలన్నీ సేవించి, నైమి శారణ్యానికి బయల్దేరాడు.

నైమిశారణ్యంలో మునులంతా సత్త్రయాగం చేస్తున్నారు. బలరాముడు రాక వారికి ఆనం దాన్ని కలిగించింది. స్వాగతించారతన్ని. ఉచితాసనాన్ని కల్పించి, పూజించారు. మునులందరూ

లేచి నిల్చుని నమస్కరిస్తోంటే, లేచి నిల్చోలేనిదీ, బలరామునికి నమస్కరించనిదీ రోమహర్ష ణుడు ఒక్కడే! వ్యాసుని శిష్యుడతను. అతని ప్రవర్తన బలరామునికి తీవ్రకోపాన్ని కలిగించింది. ఆ కోపంతో అతను రోమహర్షణుణ్ణి వధించాడు. రోమహర్షణుని మరణం మునులను భయ భ్రాంతుల్ని చేసింది. హాహాకారాలు చేశారంతా.

''బలరామా! ధర్మరక్షకుడవి, నువ్వే ఇలా అధర్మానికి పూనుకుంటే ఎలా?'' ప్రార్థించారు మునులు. హితవు చెప్పి, బలరాముని కోపాన్ని చల్లార్చారు. సత్త్రయాగం ముగిసే వరకు పురాణ ప్రవచనం కోసం రోమహర్షణుని బతికించమని వేడుకున్నారు. అప్పుడు బలరాముడు ఇలా అను గ్రహించాడు.

''రోమహర్షణుని కుమారుడు సూతుడు, దీర్ఘాయుష్మంతుడై, గొప్ప పౌరాణికుడై మీకు సకల పురాణాలూ వినిపిస్తాడు.''

బలరాముని అనుగ్రహానుసారం సూతుడు, నైమిశారణ్యంలోని మునులకు సమస్త పురా ణాలూ చెప్పి, ముల్లోకాల్లోనూ కీర్తిని ఆర్జించాడు. సూతుని దగ్గర పురాణాలు నేర్చుకుని తయ్యా రుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు మొదలయినవారు వాటిని లోకప్రసిద్ధం చేశారు.

ఇల్వలుడి కొడుకు పల్వలుడు. మహామాయావి. వికృతరూపుడు. వాడు మునుల యజ్ఞ యాగాదులను ధ్వంసం చేయసాగాడు. బలరాముడు దగ్గర మొర పెట్టుకున్నారు మునులు. పల్వలుని పీడ వదిలించమని ప్రార్థించారు. అంతటి మాయావినీ తన హలాయుధంతో సునా యసంగా వధించాడు బలరాముడు. అతని పరాక్రమాన్ని మెచ్చి దేవతలు పుష్పవృష్టి కురిపిం చారు. మహాభిషేకం చేశారు మునులు. వైజయంతి అనే ఓ దివ్యమాలికను అతనికి కానుకగా ఇచ్చారు. తర్వాత బలరాముడు, కౌశికి, సరయు, ప్రయాగ మొదలయిన తీర్థాలను సందర్శిం చాడు. పులహాశ్రమానికి వెళ్ళి అక్కడ గోమతిగండకి, విపాస, శోణనదుల్లో స్నానం చేసి, పితృ పూజ, దేవపూజ చేశాడు. గంగా సాగరసంగమాన్ని తిలకించాడు. మహేంద్రగిరికి చేరుకుని, అక్కడ పరశురాముణ్ణి సేవించాడు. దక్షిణాదికి చేరుకున్నాడు. రామేశ్వరం సందర్శించాడు. బ్రాహ్మణులకు పదివేల గోవులు దానం చేశాడక్కడ. మలయపర్వతానికి ప్రయాణమయ్యాడు. అక్కడ అగస్త్యుణ్ణి పూజించాడు. మహిష్మతీపురం వద్ద నర్మదను సేవించి, తిరిగి ప్రభాస తీర్థానికి చేరుకున్నాడు. ఆనాటికి భారతయుద్ధం జరిగిపోయింది. ఇరుపక్షాల వీరులూ అనేకులు మరణించారు. బంధుమిత్రులు మరణాన్ని తట్టుకోలేక విలపించాడు బలరాముడు. దుర్యోధ నుడూ, భీముడూ గదాయుద్ధం చేస్తున్నారని తెలిసిందతనికి. కురుక్షేత్రానికి చేరుకున్నాడు బల రాముడు.

## యాదవకులంలో ముసలం

సమస్తప్రాణికోటీ కాలాధీనమై సంచరిస్తోంది. కాలాన్ని అతిక్రమించి ఎవరూ, ఏదీ మనలేదు. కాలమహిమ అంటే అదే! కాలాన్ని విధి అని కూడా వ్యవహరిస్తారు. విధి బలీయమైనది. దాని నిర్ణయానికి ఆ దేవదేవుడు కూడా లోబడి ఉండాల్సిందే! నాటి రాజులలో యాదవులు బాగా బలవంతులు. గొప్పగొప్ప వీరులెందరో వారిలో ఉన్నారు. సాక్షాత్తు భగవంతుడు శ్రీకృష్ణుడే

పుట్టిన కులం యాదవకులం. ఆ కులాన్ని కన్నెత్తి చూసేందుకు కూడా భయమే అందరికీ. ఆ కారణంగా యాదవులు నశించే అవకాశమే లేకపోయింది. అయితే వారు నశించాలి. నశించాలంటే నాటకం ఆడకతప్పదు. ఆ నాటకాన్ని శ్రీకృష్ణుడే ఆడించి రక్తి కట్టించాడు. భూభారాన్ని తగ్గించేందుకూ, దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసేందుకూ శ్రీకృష్ణుడే నడుము బిగించాడు. మహా భారత యుద్ధానికి పరోక్షంగా తానే కారకుడై కురుపాండవ యోధుల్ని బలిపెట్టాడు. మిగిలింది యదు వీరులు. బలగర్వితులై విర్రవీగుతున్నారు. వారికి వినాశం కలిగించాలి. వినాశకాలే విపరీత బుద్ధిః అన్నారు. ముందు ఆ విపరీతబుద్ధిని యాదవకుమారుల్లో కలిగించాడు.

జాంబవతి కుమారుడు సాంబుడు. అతనికి ఆడవేషం వేసింది మిత్రబృందం. గర్భవతిగా ఉన్నట్టుగా కడుపులో గుడ్డలూ అవీ కుక్కారతనికి. కుక్కి, ఆటాడేందుకు మహర్షులకోసం వెదక సాగారు. అదే సమయానికి అటుగా విశ్వామిత్రుడు, అసితుడు, కణ్వుడు, దుర్వాసుడు, భృగువు, అంగిరసుడు, కాశ్యపుడు, వామదేవుడు, అత్రి, వశిష్ఠుడు, నారదుడు మొదలయిన మహర్షులంతా రాసాగారు. వారు అంతకు ముందు శ్రీకృష్ణుని సేవించారు. అతని ఆదేశానుసారమే ద్వారక నుంచి పిండారకక్షేత్రానికి బయల్దేరారు. వస్తున్న మహర్షులకు ఎదురేగారు సాంబుని మిత్రబృందం. ఆడవేషంలో ఉన్న సాంబుని మహర్షుల ముందుకు తోసి అడిగారిలా.

''మహర్షులారా! ఈమె గర్భవతి. రేపు ఈమెకు పుట్టేది ఆడా? మగా?''

మహర్షులంతా ఒకరిని ఒకరు చూసుకున్నారు.

''అడగడానికి ఈమె సిగ్గుపడుతోంది. అందుకనే మేము అడుగుతున్నాం. మీరు దైవజ్ఞులు. మీకు తెలియనిది ఉండదు. చెప్పండి, ఎవరు పుడతారు? ఆడా? మగా?'' రెట్టించింది మిత్ర బృందం.

స్త్రీ వేషంలో ఉన్నది సాంబుడు అని గ్రహించారు మహర్షులు. పురుషునికి స్త్రీ వేషం వేసి, గర్భవతి అయినట్టుగా గుడ్డలూ అవీ పెట్టి, పుట్టబోయేది ఆడా? మగా? అని అడగడం కేవలం తమను పరిహసించడమే! అనుమానం లేదనుకున్నారు మహర్షులు. కోపాన్ని తెచ్చుకున్నారు. ఇలా అన్నారు.

''ఓరీ మూర్ఖ యాదవులారా! ఈ స్త్రీకి పుట్టేది మగా కాదు, ఆడా కాదు, ముసలం పుడుతుంది. అది మీ కులనాశనానికి కారణం అవుతుంది. మీకిదే తగిన శిక్ష.''

''తప్పు క్షమించండి అయ్యోర్లు'' అని కాళ్ళా వేళ్ళా పడ్డది మిత్ర బృందం. వినిపించుకోలేదు మహర్షులు. అక్కణ్ణుంచి నిష్క్రమించారు. వారు కనుమరుగవగానే సాంబుడు పెద్దగా కేకపెట్టాడు. అతను ముసలాన్ని ప్రసవించాడు. ఇనుప రోకలి ఒకటి అతని కడుపులో నుంచి కిందపడింది. దొర్లుకుంటూ కొంతదూరం ప్రయాణించి ఆగింది. దాన్ని చూసి మిత్రబృందం భయపడింది. ఆందోళన చెందింది. దాన్ని మోసుకుని ద్వారకాపురికి పరుగుదీశారు. ఉగ్రసేనునికి చూపించి, జరిగిందంతా చెప్పారు. బ్రాహ్మణశాపం ఫలించకతప్పదనుకున్నారంతా. దుఃఖించారు. శ్రీకృష్ణుని సూచనప్రకారం ముసలాన్ని ముక్కముక్కలు చేశారు. పొడి చేశారు. ఆ పొడిని సముద్రజలంలో కలిపారు. కలిపినంత మాత్రాన విప్రశాపం కరిగిపోతుందా? పోదు. అది మరోరూపాన్ని సంతరించుకున్నది. ఆ రూపంలో మొత్తం యాదవ కులాన్ని నాశనం చేసింది.



## అవతార పరిసమాప్తి

శ్రీహరి శ్రీకృష్ణుడుగా ఈ భూలోకంలో ఎందుకు జన్మించాడో ఆ పని పూర్తయింది. ఇక ఆయన వైకుంఠానికి చేరుకోవాలి. ఆ మాట చెప్పేందుకు బ్రహ్మ, సనకాదిమునులు, ఇంద్రాదిదేవతలు, దిక్పాలకులు, ప్రజాపతులు మొదలయిన ప్రముఖులంతా ద్వారకకు చేరుకున్నారు. కృష్ణుని సందర్శించి, అతన్ని అనేక విధాల స్తుతించి, పూజించారు. తర్వాత వైకుంఠానికి విచ్చేయాల్సిందిగా ప్రార్థించారు.

''త్వరలోనే మీ అభీష్టం నెరవేరుతుంది. విప్రశాపం కారణంగా యాదవకులం నశించిపోనున్నది. ఆ కార్యం కూడా నేనే చక్కదిద్ది, వైకుంఠానికి చేరుకుంటాను'' అన్నాడు కృష్ణుడు.

''నీ రాకకోసం ఎదురు చూస్తూ ఉంటాం'' అన్నారు సనకాదిమునులూ, దేవతలూ. అక్కణ్ణుంచి నిష్క్రమించారు.

యాదవ వినాశనాన్నీ, శ్రీకృష్ణనిర్యాణాన్నీ సూచిస్తూ ద్వారకలో అనేక దుర్నిమిత్తాలు తోచాయి. మహోత్పాతాలు చెలరేగాయి. వాటిని చూసి ప్రజలంతా భయాందోళనలు చెందారు. దుఃఖించారు. కృష్ణుని ఆశ్రయించి వేడుకున్నారు.

''ఏమిటి కృష్ణా, ఏమిటిదంతా? బాధగా ఉంది. భయం వేస్తోంది. నువ్వే కాపాడాలి'' అన్నారు. చేతులెత్తి నమస్కరించారు. ఆలోచించాడు కృష్ణుడు. చెప్పాడిలా.

''ఇక మనం ద్వారకలో ఉండడం శ్రేయస్కరం కాదు. అందరం పుణ్యప్రదమయిన ప్రభాస తీర్థానికి బయల్దేరుదాం. అక్కడ దేవ పితృతర్పణాలు ఆచరిద్దాం, అది మనకు శ్రేయోదాయక మవుతుంది'' అన్నాడు కృష్ణుడు. అలాగే అన్నారు యాదవులు. ద్వారకానగరాన్ని విడచిపెట్టా రంతా. కుటుంబసమేతంగా బంధుమిత్రాదులతో అందరూ ప్రభాసతీర్థానికి బయల్దేరారు. రథా లు, గుర్రాలు ఎక్కి ప్రయాణించసాగారు. కృష్ణుడు కూడా ప్రయాణ సన్నాహాల్లో ఉన్నాడు. అంతఃపురంలో ఒంటరిగా ఉన్నాడతను. అప్పుడు అతన్ని మంత్రి ఉద్ధవుడు కలుసుకున్నాడు. పరమభాగవతోత్తముడు ఉద్ధవుడు. అతనికి అంతా తెలుసు. కృష్ణుడు అవతారం చాలిస్తున్న సంగతి గ్రహించాడతను. కృష్ణునితో అన్నాడిలా.

''వాసుదేవా! నువ్వు వైకుంఠానికి వెళ్ళిపోతున్నావు. నాకు ఆ సంగతి తెలుసు. నువ్వు లేని ఈ లోకంలో నేనూ ఉండను, ఉండలేను. నన్నుకూడా నీతోపాటు తీసుకునిపో.''

సమాధానంగా ముందు సన్నగా నవ్వాడు కృష్ణుడు. తర్వాత ఇలా అన్నాడు.

''ఏ కారణార్థం నేను ఈ భూలోకంలో అవతరించానో, ఆ పని అయిపోయింది. నేను ఇక వైకుంఠానికి చేరుకోక తప్పదు. ఇక శాపదగ్ధమయిన ఈ యాదవకులం త్వరలోనే పరస్పరం కల హించుకుని, ఒకరిని ఒకరు వధించుకుని నశించిపోతుంది. నేటికి ఏడవనాడు, ఈ ద్వారకకూడా సముద్రంలో మునిగిపోతుంది.''

''వాసుదేవా'' గుండెను గుప్పెట్లో పెట్టుకున్నాడు ఉద్ధవుడు.

''నేను అవతారం చాలించగానే ఈ భూలోకంలో కలిప్రవేశిస్తుంది. అధర్మం కాలూనుతుంది. నువ్వు ఉండలేవిక్కడ. సర్వం త్యజించి తపోవనాలకు వెళ్ళిపో! తపస్సు ఆచరించి, త్వరలోనే నన్ను చేరుకో.'' అభయం ఇచ్చాడు కృష్ణుడు. కన్నీరుపెట్టుకున్న ఉద్ధవునికి బ్రహ్మజ్ఞానం ఉపదే శించాడు. పరతత్త్వం, కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం, ఆశ్రమ ధర్మాలు సర్వం బోధిం చాడు. మహర్షులకు కూడా అంతుచిక్కని ఆత్మజ్ఞానం, బ్రహ్మతత్త్వం ఉద్ధవుడు గ్రహించి ధన్యు డయ్యాడు. సమస్తమోహాలూ నశించాయతనికి. ముక్తసంగుడయ్యాడు. కృష్ణుని ఆదేశానుసారం అతను బదరికావనానికి వెళ్ళిపోయాడు.

బలరామకృష్ణులుసహా యాదవులంతా సరస్వతీ నదీ తీరాన ఉన్న ప్రభాసతీర్థానికి చేరు కున్నారు. దేవబ్రాహ్మణ పితృపూజలు చేశారక్కడ. గోదాన, భూదాన, హిరణ్యాది దానాలు చేశారు. విందుభోజనాలు ముగించారు. కాలక్షేపం కోసం ద్యూతప్రియులయ్యారు. తర్వాత సురాపానానికి కూడా ఉత్సాహం చూపించారు. కృష్ణునికి కావాల్సింది అదే!

''తాగండి, ఎవరికి ఎంత ఇష్టమో, అంతా తాగండి! ఆనందించండి'' అన్నాడు కృష్ణుడు. బలరాముడు వారించబోయాడు.

''అన్నగారూ, పిల్లలు ఆనందపడుతున్నారు, వారించకండి'' అన్నాడు కృష్ణుడు. ఎప్పుడ యితే బలరామకృష్ణుల అనుమతి లభించిందో ఇకప్పుడు అడ్డూ అదుపూ లేకపోయింది యాద వులకు. తప్పతాగారంతా. అందరికీ మతులుపోయాయి. తన భార్య, తమ్ముని భార్య అన్న

తేడాలు మరచిపోయారు. అన్నభార్య, మామభార్య అన్న మర్యాదలు అతిక్రమించారు. కోరిక తీర్చుకునేందుకు కనిపించిన స్త్రీ వెంటపడ్డారు. వద్దు వద్దని స్త్రీలెంత వేడుకున్నా వినలేదెవ్వరూ.

## మోక్షదాయకం శ్రీమద్భాగవతం

కృష్ణమాయలో ఆడాలేదు, మగాలేదు అంతా ఒకరితో ఒకరు పోట్లాడుకున్నారు. నీ అంతు చూస్తానంటే, నీ అంతు చూస్తానంటూ మీది మీదికొచ్చారు. ఆయుధాలు ధరించి యుద్ధానికి దిగారు. పెద్దయుద్ధం జరిగిందప్పుడు. వందలు వేలాదిగా యాదవవీరులు చనిపోయారు. ప్రద్యుమ్నుడు, సాత్యకి, సాంబుడు, అనిరుద్ధుడు, గదుడు మొదలయినవారంతా నువ్వా నేనా అన్నట్టుగా పోరాడారు. ఆ యుద్ధంలో సైన్యం మొత్తం చనిపోయింది. ఆయుధాలన్నీ ధ్వంసమయిపోయాయి. మిగిలినవారు ఒకరినొకరు చంపుకునేందుకు నిరాయుధులై, సముద్రపు ఒడ్డున మొలిచిన తుంగ నారను చూశారు. దానిని పెరికారు. కొట్టుకోసాగారు దానితో.

గతంలో సాంబుడికి పుట్టిన ముసలాన్ని పొడి చేసి సముద్రంలో కలిపారు కదా, ఆ పొడి, సముద్రపు అలలకు ఒడ్డుకు కొట్టుకు వచ్చి, తుంగగా మొలిచిందిప్పుడు. నిలువెత్తున పెరిగిందది. దాని మొనలు వాడిగా సూదుల్లా ఉన్నాయి. దానితో కొట్టుకుని యాదవులంతా మరణించారు. మునుల శాపఫలం, ముసలమే యాదవకుల నాశనానికి కారణమయింది. యదువీరులు తుంగతో బలరాముణ్ణీ, కృష్ణుణ్ణి కూడా కొట్టారు. ఆగ్రహాన్ని కలిగించారు వారికి. వారూ అదే తుంగతో యదువీరుల్ని కొట్టి చంపారు. అలా యాదవకులం సమస్తం నశించిపోయింది. నెత్తురోడుతూ నిల్చున్న కృష్ణుణ్ణి చూశాడు బలరాముడు. అనుమతి కావాలన్నట్టుగా చేతులు జోడించి, నమస్కరించాడతనికి. కళ్ళతోనే అనుమతిని ప్రసాదించాడు కృష్ణుడు. బలరాముడు ఆ సముద్రతీరంలోనే యోగం పట్టాడు. తన భౌతికదేహాన్ని త్యజించాడు. ఎప్పు డయితే బలరాముని భౌతికదేహం చలనం లేకుండా పడిపోయిందో ఇక అప్పుడు తాను కూడా అవతారాన్ని చాలించాలనుకున్నాడు కృష్ణుడు. మెల్లగా నడచి వచ్చి, ఓ రావిచెట్టు కింద కుడితొడపై ఎడమకాలు పెట్టుకుని పవళించాడు.

రోకలిని పొడిచేసి సముద్రంలో కలిపినప్పుడు, ఆఖర్లో చిన్న ముక్క మిగిలిపోయింది. పొడి చేసేందుకు అందలేదది. దానిని సముద్రంలోనికి విసిరేశారు యాదవులు. నీళ్ళలో వచ్చిపడిన ఆ ముసలం ముక్కను ఓ చేప ఆహారం అనుకుని మింగింది. ఆ చేప బోయవాని వలలో చిక్కింది. బోయ కోసినప్పుడు ఆ చేప కడుపులో గల ఇనుప ముక్కను చూసి, సూదిగా ఉండడంతో బాణానికి పనికి వస్తుందని దాచాడు దాన్ని. తర్వాత బాణానికి ములికిని చేశాడు. ఇప్పుడు ఆ బాణాన్ని పట్టుకుని, వేటకు వచ్చాడు ఆ బోయ. రావిచెట్టుకింది అరణారుణకాంతులతో, పద్మచిహ్నాలతో ఉన్న కృష్ణుని పాదాన్ని ఏదో మృగం ముఖం అని తలచాడు. బాణాన్ని గురి చూసి వదిలాడు. వచ్చి, కృష్ణుని పాదానికి గుచ్చుకుందది. పరుగున వచ్చి చూశాడు బోయ. చూస్తే అక్కడ ఉన్నది మృగం కాదు, సాక్షాత్తు శ్రీకృష్ణుడు! చేసిన అపరాధానికి చేతులు జోడించి, నమస్కరించాడు. కన్నీరు పెట్టుకుని క్షమించమన్నాడు.

''ఇందులో నీ తప్పు ఎంత మాత్రం లేదు. నేను ఏది కావాలనుకున్నానో అదే జరిగింది.



నీవు నిమిత్తమాత్రుడవు'' అన్నాడు కృష్ణుడు. బోయని ఆశీర్వదించి, అతనికి స్వర్గప్రాప్తి అనుగ్రహించాడు. ఓ బోయ బాణంతో కృష్ణుడు ఆఖరికి అవతారాన్ని చాలించాడు. ఈ బోయ గతజన్మలో వాలి అని, కాదు, వాలిపుత్రుడు అంగదుడు అని కొందరు అంటారు. రామావతారంలో శ్రీరాముడు వాలిని చెట్టుచాటుగా కొట్టి చంపాడు. దాని ఫలితమే కృష్ణావతారంలో అనుభవించాడంటారు. బాణం దెబ్బకి చనిపోయిన కృష్ణుని దేహం కొంతకాలానికి కొయ్యగా మారిపోయిందని, అదే ఈనాటి పుణ్యక్షేత్రం పూరీలోని జగన్నాథుని విగ్రహమని మరి కొందరు అంటారు. కొన్ని గ్రంథాలు ఈ మాటల్ని సమర్థిస్తున్నాయి కూడా. ఇవన్నీ అలా ఉంచితే...

ప్రభాసతీర్థానికి కృష్ణుణ్ణి రథం మీద తీసుకుని వచ్చిన సారథి దారుకుడు, కృష్ణుని కోసం వెదుకుతూ వచ్చాడు. గాయాలపాలయి రావిచెట్టు కింద ఉన్న కృష్ణుణ్ణి చూశాడు. కన్నీరు మున్నీ

రుగా విలపించాడు. అతన్ని ఓదార్చాడు కృష్ణుడు. తన నిర్యాణవార్త ద్వారకలో అందరికీ చెప్పమన్నాడు. స్త్రీ బాల వృద్ధులందరినీ అర్జునుణ్ణి ఆశ్రయించి, ఇంద్రప్రస్థంలో జీవించమన్నాడు. ఇది తన మాటగా చెప్పమన్నాడు కృష్ణుడు. సరేనన్నాడు దారుకుడు. అతను చూస్తూండగానే కృష్ణునిలోని దివ్యతేజస్సు ఆకాశానికి ఎగసిపోయింది. ఆయన దివ్యరథమూ, గుర్రాలూ, గరుడ ధ్వజం, శంఖచక్రాది ఆయుధాలూ... అన్నీ కృష్ణతేజస్సును అనుసరించి వెళ్ళిపోయాయి. కృష్ణావతారం ముగిసింది. శ్రీకృష్ణుడు నూట ఇరవై సంవత్సరాలు ఈ భూమ్మీద జీవించినట్టుగా భాగవతం పేర్కొంటోంది.

పరుగుపరుగున ద్వారకకు చేరుకున్నాడు దారకుడు. వసుదేవుడు, దేవకి, ఉగ్రసేనుడు మొదలయిన వారికి శ్రీకృష్ణుని నిర్యాణవార్త తెలియజేసి గొల్లుమన్నాడు. విన్న వారంతా మూర్ఛిల్లారు. కొంతసేపటికి తేరుకున్నారు. అంతా ప్రభాసతీర్థానికి ప్రయాణమయ్యారు. బలరామకృష్ణుల కోసం ఎక్కడ పడితే అక్కడ వెదికారు. ఎక్కడా ఆ ఇద్దరూ కనిపించకపోయేసరికి, దేవకీ వసుదేవులు, రోహిణితదితరులు భోరున విలపిస్తూ ప్రాణాలు త్యజించారు. రుక్మిణి మొదలయిన శ్రీకృష్ణుని భార్యలు, బలరాముని భార్యలు కొందరు, అంతఃపురకాంతలు మరికొందరు బలరామకృష్ణులు లేని జీవితాల్ని ఊహించలేక, చితులు పేర్చుకుని, అగ్నిలో దూకి మరణించారు. ఈ వివరాలన్నీ తెలుసుకుని అర్జునుడు కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చాడు. కృష్ణుడు అతనికి సారథి, సచివుడు, అన్నిటినీ మించి ఇష్టదైవం. ఆ దైవం దూరమయిందంటే తట్టుకోలేకపోయాడు అర్జునుడు. శోకవ్యాకులచిత్తుడయినాడు. అయితే గతంలో తనకు కృష్ణుడు బోధించిన భగవద్గీతను గుర్తు తెచ్చుకుని స్వస్థత చెందాడతను. ద్వారకకు చేరుకుని, మరణించిన యదు వీరులందరికీ అగ్నిసంస్కారాలు చేశాడు. కృష్ణుడు చెప్పినట్టుగానే ద్వారక సముద్రంలో మునిగిపోయింది. చనిపోగా మిగిలిన స్త్రీ బాల వృద్ధులను వెంటబెట్టుకుని అర్జునుడు ఇంద్రప్రస్థపురానికి బయల్దేరాడు.

అర్జునుని బలమూ, బలగమూ, తేజస్సూ, ఓజస్సూ అంతా కృష్ణుడే! ఆ దేవదేవుని సహాయ సహకారాలవల్లే అర్జునుడు తిరుగులేని యోధుడుగా ఖ్యాతి చెందాడు.ఆఖరికి ఆ శివుణ్ణి కూడా గెలవగలిగాడు. ఎప్పుడయితే శ్రీకృష్ణుడు అవతారం చాలించాడో ఇక అప్పటి నుంచీ అర్జునుడు శక్తిహీనుడైపోయాడు. దుర్బలుడయిపోయాడు. ఇది చెప్పడానికే వ్యాసుడు భారతంలో ఓ సన్నివేశాన్ని కల్పించాడు. అర్జునుడు యాదవ స్త్రీలను తీసుకుని ఇంద్రప్రస్థపురానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో కొందరు బోయలు అతన్ని అడ్డుకున్నారు. దాడి చేశారతని మీద. దాడి చేసి, యాదవ స్త్రీలనూ, వారి నగలనూ అపహరించారు. బోయలతో అర్జునుడు పోరాడలేకపోయాడప్పుడు. అశక్తుడయిపోయాడు. దీనికి కారణం అర్జునునికి తోడుగా కృష్ణుడు లేకపోవడమేనని భారతంలో ఉన్నది. ఎలాగయితేనేం అర్జునుడు ఇంద్రప్రస్థపురానికి చేరుకున్నాడు. ధర్మరాజాదులకు యాదవకుల నాశనాన్నీ, బలరామకృష్ణుల నిర్యాణాన్నీ తెలియజేశాడు. విన్న వెంటనే వారంతా దుఃఖించారు. ఒకరిని ఒకరు ఓదార్చుకుని సాంత్వన చెందారు. యాదవరాజ్యాన్ని కృతవర్మ పుత్రుడికీ, సాత్యకి కొడుక్కీ, వజ్రునికీ సమానంగా పంపకాలు చేశారు. దగ్గరుండి అర్జునుడు అలా పంపకాలు చేశాడు. అనిరుద్ధునికీ, ఉషకీ పుట్టినవాడు వజ్రుడు. అతని భాగానికి ఇంద్రప్రస్థపురం వచ్చింది. దానికి వజ్రుణ్ణి రాజుని చేశాడు అర్జునుడు.

కలియుగం ప్రవేశిస్తున్నదని తెలుసుకుని, పాండవులు పరీక్షిత్తునకు పట్టంగట్టి మహాప్రస్థానానికి బయల్దేరారు.

## పరీక్షిత్తు నిర్యాణం

ప్రాయోపవిష్టుడయి ఉన్న పరీక్షిన్మహారాజుకు శుకయోగీంద్రుడు కృష్ణావతార కథ ఆసాంతం చెప్పాడు. ఇకపై భూమిని పాలించే చంద్రవంశరాజుల గురించి కూడా చెప్పాడతనికి. తర్వాత కలియుగంలో ప్రజలు ఎలాంటి పాపాత్ములై సంచరిస్తారో తెలియజేశాడు. కలియుగధర్మాన్ని కూడా చెప్పాడు. పరీక్షిత్తుకు బ్రహ్మోపదేశం చేశాడు ఆఖరికి. దాంతో పరీక్షిత్తు ముక్తసంగుడయ్యాడు. మనసుని భగవంతునిపై లగ్నం చేసి సమాధిలో ఉండిపోయాడు. భాగవతాన్ని ఏడురోజుల్లో పరీక్షిత్తునకు వివరించాడు శుకుడు. వివరించి అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. అటు శుకుడు నిష్క్రమించగానే ఇటు మునిశాపానుసారంగా పరీక్షిత్తును చంపేందుకు తక్షకుడు బయల్దేరాడు. త్రోవలో అతనికి కశ్యపుడు ఎదురయ్యాడు. కశ్యపుడు విషాహారమంత్రప్రయోగంలో దిట్ట. పరీక్షిత్తును రక్షించేందుకే అతను వస్తున్నాడు. ఇద్దరికీ ఆ విషయమ్మై వాగ్వాదం జరిగింది. తాను కాటు వేస్తే మరణం తథ్యం అన్నాడు తక్షకుడు. బతికి బట్టకట్టలేరన్నాడు. తాను బతికిస్తానన్నాడు కశ్యపుడు. బట్టకట్టిస్తానని కూడా చెప్పాడు. ఎవరెంత గొప్పవారో పరీక్షించుకునేందుకు ఇద్దరూ సిద్ధపడ్డారు. పువ్వులూ పళ్ళతో పచ్చగా ఉన్న ఓ చెట్టుని కాటేశాడు తక్షకుడు. వెంటనే మాడి మసి అయిపోయిందది. దానిని మంత్రమహిమతో మళ్ళీ పచ్చగా పుట్టించాడు కశ్యపుడు. చూసి ఆశ్చర్యపోయాడు తక్షకుడు. కశ్యపుని గొప్పతనాన్ని ఒప్పుకోకతప్పదనుకున్నాడు. అంతేకాదు, పరీక్షిత్తును తాను చంపలేననుకున్నాడు. కశ్యపుని ఇలా బ్రతిమలాడుకున్నాడతను.

''నీకు కావాల్సినంత ధనం ఇస్తాను, నువ్వు ఇటు నుంచి ఇటే వెళ్ళిపో.''

ఆలోచించి, సరేనన్నాడు కశ్యపుడు. తక్షకుడు ఇచ్చిన ధనాన్ని తీసుకుని అతను అటు నుంచి అటే వెళ్ళిపోయాడు. కొందరు బ్రాహ్మణులను వెంటబెట్టుకుని తక్షకుడు, పరీక్షిత్తును సమీపించాడు. బ్రాహ్మణులు కొన్ని నిమ్మపళ్ళు పరీక్షిత్తునకు బహూకరించారు. మంచివాసన వేస్తున్నాయంటూ ఓ పండును తీసుకుని వాసన చూశాడు పరీక్షిత్తు. ఆ పండులో అంతకు ముందే ప్రవేశించి ఉన్న తక్షకుడు, అదే అవకాశంగా పరీక్షిత్తును కాటు వేశాడు. పరీక్షిత్తు మరణించాడు. వెంటనే అతని శరీరం విషాగ్నిలో దగ్ధమయిపోయింది. అది చూసి ముల్లోకాలలోని వారూ హాహాకారాలు చేశారు.

తన తండ్రిని చంపిన తక్షకుడుసహా లోకంలోని అన్ని సర్పాలనూ అగ్నికి ఆహుతి చేస్తానని ప్రతిన పూనాడు జనమేజయుడు. సర్పయాగం ప్రారంభించాడు. ముల్లోకాల్లోని సర్పాలన్నీ కుప్పకుప్పలుగా వచ్చి యజ్ఞకుండంలోపడి, భస్మమయిపోసాగాయి. ఎక్కడెక్కడనుంచో వచ్చి పాములు ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయిగాని, తక్షకుడు రాలేదింకా. ప్రాణభయంతో అతను ఇంద్రుని శరణుజొచ్చాడు.

అతని సింహాసనాన్ని చుట్టుకుని ఉన్నాడు. ఋత్విజులు ఇది గ్రహించారు. రాజాజ్ఞానుసారం ఇంద్రుడుసహా తక్షకుడు వచ్చి యజ్ఞకుండంలో పడిపోయేట్టుగా మంత్రోచ్చారణ చేయసాగారు. ఇంద్రుని సింహాసనం కదిలింది. శరవేగంతో ఆకాశవీథులు దాటుకుని కిందికి రాసాగింది. తక్ష

కుడు సహా ఇంద్రుడు యజ్ఞకుండంలో పడబోయేవారే! ఆ విపత్తును గ్రహించిన దేవగురువు బృహస్పతి, జనమేజయుణ్ణి వారించాడు. యజ్ఞం నిలుపుచేయాల్సిందిగా హితవు పలికాడు.

''జనమేజయా! నీ సర్పయాగంతో లోకంలోని సర్పాలన్నీ నశించాయి. తక్షకుడు మరణించే అవకాశం లేదు. అతను అమృతం తాగాడు కనుక మరణించడు. అలాంటి తక్షకుని కారణంగా ఇంద్రునికే ప్రమాదాన్ని తెచ్చిపెట్టావు. తప్పు. నా మాట విను. యాగాన్ని విరమించు.'' చెప్పాడు బృహస్పతి. అతని మాటలకు జనమేజయుడు శాంతించాడు. సర్పయాగాన్ని విరమించాడు.

శుకుడు పరీక్షిన్మహారాజుకి చెప్పిన భాగవతాన్ని నైమిశారణ్యంలో సత్రయాగ నిమగ్నులయి ఉన్న శౌనకాది మునులకు సూతుడు వినిపించి, ముగించాడు.పద్దెనిమిదివేల శ్లోకాలతో, పన్నెండు స్కంధాలుగా వెలసిన ఈ భాగవతాన్ని ఎక్కడ పఠిస్తారో అక్కడ ఆ స్థలం పుణ్యతీర్థంతో సమానం. దీనిని విన్నవారంతా మోక్షపదం అందుకుంటారు. శ్రీమహావిష్ణువునకు అత్యంత ప్రీతికరమూ, భక్తిజ్ఞాన ప్రతిపాదకమూ అయిన భాగవతంకన్నా మోక్షదాయకమయినది మరొకటి లేదు.

## (సమాప్తం)

# మీరు చదివారా?




## పంచతంత్రం

**–జగన్నాథశర్మ**

**సైజు:** 1/4 క్రౌన్, **పేజీలు:** 196, **వెల:** రూ. 160/–

విష్ణుశర్మ చెప్పిన పంచతంత్రం కథలు తరతరాలుగా వస్తున్నాయి. పురాణాలు, ఇతిహాసాల తర్వాత ఇంతగా ప్రాచుర్యం పొందిన కథలు మరొకటి లేవు. ఈ కథలు పిల్లలకు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. కథలలో పాత్రలు జంతువులు కావడం, జంతువులు మనుషుల్లా మాట్లాడుకోవడం, ప్రవర్తించడం పిల్లలను బాగా ఆకట్టుకుంటాయి. పైగా ప్రతి కథకూ నీతి ఉన్న కారణంగా ఈ కథల్ని పిల్లలు తప్పనిసరిగా చదవాలి. చదివితే మంచి–చెడు ఇట్టే వారికి తెలిసివస్తాయి. పిల్లలకోసం, పెద్దల్లో ఉన్న పిల్లల కోసం సంపూర్ణంగా రూపొందించిన ఈ పంచతంత్రం నేటి తరానికి అపూర్వ కానుక.




## కథా సరిత్సాగరం

**–జగన్నాథశర్మ**

**సైజు:** 1/4 క్రౌన్, **పేజీలు:** 164, **వెల:** రూ. 140/–

కాశ్మీర ప్రభువు అనంతదేవుని భార్య సూర్యమతి కోసం సోమదేవుడు 'కథాసరిత్సాగరం' సృష్టించాడు. ఇందులో ప్రేమకథలున్నాయి. హాస్య చమత్కారాలు ఉన్నాయి. అద్భుత కృత్యాలు, భయానక దృశ్యాలు, సాహస కార్యాలు, సముద్ర ప్రయాణాలు, గగన విహారాలు, యంత్రమయ పట్టణాలు... ఎన్నెన్నో వున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచ కథా సాహిత్యం అంతా ఇందులో నిక్షిప్తమై వుంది. ఈ కథలను తెలుగులో సరళ వ్యావహారికంలో రచయిత అందించారు.




## నెమలీక

**–జగన్నాథశర్మ**

**సైజు:** 1/4 క్రౌన్, **పేజీలు:** 84, **వెల:** రూ. 90/–

చందమామ కథలంటే చెవికోసుకునే పాఠకుల కోసం ప్రత్యేకంగా రాసిన కథలివి. మాయలు, మంత్రాలు, తంత్రాలు, యంత్రాలు అన్నీ పాత్రలే ఈ కథల్లో. రాకుమారులు, రాకుమార్తెలు, రెక్కల గుర్రాలు, గండభేరుండాలు చాలా ఉన్నాయి ఇందులో. ఈ కథలు చదివితే మీకు హాయిగా నిద్రపడుతుంది. కమ్మని కలలు కంటారు.




## సాయిబాబా

**వారం వారం సాయిపారాయణం**

**-శివసతీపురంశర్మ**

**సైజు:** రాయల్ డెమ్మీ (బౌండ్) **పేజీలు:** 208, **వెల:** రూ. 250/-

సాయిలీలా విభూతుల్ని అక్షర సమార్చన చేసిన ఈ గ్రంథంలో సాయి అవతారాన్నీ, సద్గురు జీవిత విశేషాల్నీ గుచ్చెత్తిన నైపుణ్యం ఉంది. నవ్యవీక్లీలో ముప్పయి మూడు వారాలపాటు పాఠకుల్ని రంజింపచేసిన ఈ ధారావాహిక, పాఠకుల్ని గుక్క తిప్పుకోనివ్వ కుండా చదివిస్తుంది. సాయితత్వాన్ని సరికొత్త కోణంలో సందర్శింప జేసే మంచి పుస్తకాల్లో ఇది ఒకటి. సాయిభక్తులు తప్పకుండా చదవాలి. వారం వారం సాయి పారాయణం మనల్ని మనం తెలుసు కునేందుకు, మనిషిగా బతికేందుకు ఉపకరిస్తుంది. 'శివసతీపురం శర్మ' పేరిట దీనిని రాసింది జగన్నాథశర్మగారే!




## జగన్నాథ కథచక్రాల్

**నూరు నవ్యవీక్లీ మొదటిపేజీకథలు**

**-జగన్నాథశర్మ**

**సైజు:** రాయల్ డెమ్మీ **పేజీలు:** 208, **వెల:** రూ. 160/-

ఎంతో ప్రతిభావంతుడైన ఎడిటర్ జగన్నాథశర్మ 'నవ్యవీక్లీ' ఎడిట్ పేజీలో వారం వారం రాస్తున్న కథలు పాఠకుల్ని కదిలిస్తున్నాయి. కరిగిస్తున్నాయి. అలాంటి వాటిలో అనేకులు మెచ్చిన అత్యుత్తమమైన *100* కథల్ని ఎంపిక చేసి, ఏర్చికూర్చిన ఈ సంకలనం విభిన్న పార్శ్వాల జీవిత గుచ్ఛం. ఇందులోని ప్రతీకోణం మిమ్మల్ని పలకరిస్తుంది. మీ హృదయాల్ని కథచక్రాల్లా పరుగులు తీయిస్తుంది.




## నవ్యనీరాజనం

**50 కథలు, కథకుల అంతరంగాలు**

**సంపాదకుడు: జగన్నాథశర్మ**

**సైజు:** రాయల్ డెమ్మీ **పేజీలు:** 680, **వెల:** రూ. 600/-

అత్యుత్తమ కథల్ని రాసి, తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రచయితల నేపథ్యం తెలుసుకోవాలనుకున్న పాఠకుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకం ఇది. రెండు వందల వారాలపాటు నవ్య వీక్లీలో వారం వారం నీరాజనాలు అందుకున్న రచయితల కథల్లోంచి ఏర్చి కూర్చిన 50 కథలతోపాటు ఆ 50 మంది రచయితల ఇంటర్వ్యూలు అక్షరీకరించిన ఈ అద్భుత సంకలనం మీకోసం.


ప్రతులకు: **అమరావతి పబ్లికేషన్స్, గుంటూరు**

**సెల్: 92915 30714**

ఆబాలగోపాలానికీ సరళవ్యావహారికంలో

# మహాభారతం

త్వరలో...



రచన

## జగన్నాథశర్మ

# భాగవతం

భగవంతునకూ, భగవద్భక్తులకూ గల సంబంధ బాంధవ్యాలను తెలియజేసేదే భాగవతం. భవబంధవిమోచనం భాగవతం. సులభ భక్తిమార్గం భాగవతం. ఆధ్యాత్మికం, ఆధిభౌతికం తత్వాల స్వరూప స్వభావాల కూడలి భాగవతం. నిరాకారమయిన భక్తికి సాకారమయిన కథాకథనం భాగవతం. మహాభారత రచన చేసి, మనశ్శాంతి కరువై సరస్వతీ నదీతీరాన కూర్చున్న వ్యాసునికి నారదుడు బోధించిన గాయత్రీ బీజాక్షర ముద్రితం భాగవతం. ఈ భాగవతాన్ని సరళవ్యావహారికంలో అందించారు ప్రముఖ రచయిత జగన్నాథశర్మ. నవ్యవీక్లీలో సంవత్సరానికి పైగా వెలువడి, విశేషంగా పాఠకుల ఆదరణపొందిన గొప్ప రచన ఇది. దీనిని చదివితే మనసుకు శాంతి, ప్రశాంతి లభిస్తాయి. అనుకున్నది సాధిస్తారు.



పురాణ ఇతిహాసాలను సరళవ్యావహారికంలో అందిస్తున్న అయలసోమయాజుల నీలకంఠేశ్వర (ఎ.ఎస్.) జగన్నాథశర్మ 13ఏప్రిల్ 1956లో పార్వతీపురంలో జన్మించారు. కథారచయితగా, సినిమా, టీవీ రచయితగా ప్రసిద్ధులు. 'అరణి' వీరి కలంపేరు. ప్రస్తుతం నవ్యవీక్లీకి సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు.

అమరావతి పబ్లికేషన్స్
గుంటూరు

వెల : రూ. 250/-